శ్రీ అన్నమాచార్యులు యక్షగాన సంప్రదాయం

గోపాలకృష్ణ అబ్బూరి

Subhash Nunna

జననం: 25. 5. 1424

వైశాఖ శుద్ధ చతుర్దశి. క్రోధి..

నిర్యాణం: 5.3.1503 ఫాల్గుణ బహుళ ద్వాదశి.

దుందుభి.

శ్రీ అన్నమాచార్యులు యక్షగాన సంప్రదాయం

అభినందనలతో

శుభాకాంక్షలతో

డా॥ గోపాలకృష్ణ అబ్బూరి

అబ్బూరి ట్రస్ట్
హైదరాబాదు

Sri Annamacharyulu - Yakshagana Sampradayam
by ***Gopala Krishna Abburi***

First Edition : 2002

© Author

Published by :

Abburi Trust
HIG, B4, F4, Bagh Lingampally, Hyderabad - 500 044.

Front Cover Design :

G.K. Abburi

Back Cover Photo :

Smt. Paruchuri Radhika

Price :

Rs. 200/-

Copies available at :

Abburi Trust, Hyderabad

Visalandhra Book House

Prajasakthi Book House

Navodaya Book House
Kachiguda, Hyderabad - 500 001.

Typesetting :

Sri Ushodaya Graphics, Hyderabad.

Printed at :

Kala Jyothi Process Ltd.
RTC 'X' Roads, Hyderabad - 500 020.

అంకితం

విశ్వమందు గతివి నీవు
బతుకులోన రుచివి నీవు
రాగమందు స్వరము నీవు - శ్రీ వేంకటేశ
నీవు లేని జగములెక్కడో

సాటిలేని మేటికవిని
కానుకగా ప్రసాదించి
ఆదరించినావు మమ్ము - శ్రీ వేంకటేశ
నిన్ను మించు దాతలెవ్వరో

రాశిలోన వాసిలోన
పేరుగన్న గీతాలను
పాడినట్టి అన్నమయ్య - శ్రీ వేంకటేశ
నీ ఘనత మాకు తెలిపెగా

నీనేర్పిన విద్యకొలది
రాసినట్టి గ్రంథమిదిగో
అంకితమ్ము నీపేరన - శ్రీ వేంకటేశ
అక్షయముగ దయను చూపుమా





శ్రీ వేంకటేశ్వరాలయంలోని తాళ్ళపాకవారి సంకీర్తన భాండాగారము.

విషయ సూచిక

ముందుమాట vii

తొలిపలుకు xiv

కృతజ్ఞతలు xviii

1. రాజకీయ నేపథ్యం 1
   విజయనగర సామ్రాజ్యం పాలకులూ – ప్రజలూ

2. సాంఘిక నేపథ్యం 19
   నందవరీకులు

3. జననవత్సర నిర్ణయం 63
   చరిత్రలో కొన్ని ఘట్టాలు

4. పూర్వ రంగం – 1 105
   సంగీత లక్షణ గ్రంథాలు – నరహరితీర్థులు

5. పూర్వ రంగం – 2 130
   సంకీర్తన సంప్రదాయం – కృష్ణమాచార్యులు

6. అన్నమయ పదనిర్మాణవైఖరి – 1 155
   పదస్వరూప విశ్లేషణ

7. అన్నమయ పదనిర్మాణ వైఖరి – 2 185
   ఛందో విశ్లేషణ

8. యక్షగాన సంప్రదాయం – 1 241
   యక్షగానసరణి

9. యక్షగాన సంప్రదాయం – 2 256
   అన్నమయ యక్షగాన రచన

10. యక్షగాన సంప్రదాయం – 3 290
    అన్నమయ ప్రభావం

మలిపలుకు 344

తోడుపడిన గ్రంథాలు 351

ముందుమాట

శ్రీ అబ్బూరి గోపాలకృష్ణ రచించిన ఈ గ్రంథం 'శ్రీ అన్నమాచార్యులు – యక్షగాన సంప్రదాయం' అన్నమయ్య సాహిత్యానుశీలనలో చాలా ముఖ్యమైన దృక్పథంలో మార్పును తెచ్చిపెట్టగలది. ఇంతవరకు అన్నమయ్య సాహిత్యం గురించి కొనసాగిన అనేకానేక పరిశోధనలు చూడని దిక్కు వైపు వెలుగులు ప్రసరింపజేయటం వల్ల ఇది విశిష్టమూ విలక్షణమూ అయిన స్థానాన్ని సంపాదించుకొంటున్నది.

పదకవితా పితామహుని–సంకీర్తన సార్వభౌముని – మనం ఇంతవరకు కేవలం సాహిత్యదృష్టితోనే అధ్యయనం చేయటం జరిగింది. అయినా సాహిత్య చరిత్రకు మార్గం వేసినప్పుడు కూడా నన్నయాదుల మార్గంతోపాటు – పాల్కురికి నాటి నుంచీ సాహిత్య ప్రవాహం మార్గదేశి పద్ధతులలో సమాంతరంగా ప్రవహించినదనీ – అవి రెండూ పరస్పర విరోధాలుగా కాక పరస్పర పరిపూరకాలుగా – కొన్ని సందర్భాలలో ఓతప్రోతంగా కొనసాగినవని మనం నిశ్చయించుకోవటంలో ఆలస్యాన్నే చూపుతున్నాము.

పదహేనవ శతాబ్దంలో ఒకవైపు శ్రీనాథుడు – రెండవ వైపు బమ్మెర పోతన్న – మరొక వైపు తాళ్లపాక అన్నమయ్య వ్యాపించి – తెలుగు సరస్వతిని త్రిపథగా నిర్వహించారు. ఈ వైవిధ్యాన్ని సరిగ్గా అంచనా వేయగలిగితే – తెలుగు సాహిత్య గతిలో రీతిలో మధ్యమణిత్రయంగా ఈ ముప్పురూ ఏ ఏ భూమికలు నిర్వహించిందీ మనం అర్థం చేసుకోవచ్చు.

శ్రుతి, స్మృతి, ఇతిహాస పురాణాలలోనే కాక ఆగమాలలో, దర్శనాలలో మంత్ర శాస్త్రాదులలో పారంగతుడైన అన్నమయ్య దేశిమార్గం ప్రధానంగా ఎంచుకోవటం భక్తి ఉద్యమ ప్రాధాన్యమే కాని మరొకటి కాదు. పోతన్న రచనలోనూ పద్య రచనలో అంతర్గతమైన గీతీ మాధుర్యమూ, వచనములలోని

చూర్ణికా లక్షణము – ఉదాహరణకు శ్రీనృసింహావతార గద్య- ఈ హేతువు వల్లనే సంక్రమించాయి.

ఈ గ్రంథంలో శ్రీ గోపాలకృష్ణ చేసిన పరిశీలనలు – చాలా సందర్భాలలో అపూర్వాలు – విలక్షణాలు. పరంపరాయాతంగా వస్తూ ఉన్న భావనలను తిరుగతోడి వాటి ఔగాములను నిర్ణయించేవి.

'సాధారణంగా చాలామంది జానపద సాహిత్యం సామూహిక సృష్టి అనీ, ఆశువుగా మాత్రమే ఆవిర్భవిస్తుందనీ భావించడం జరుగుతోంది. గాని నిజానికి మాత్రం అవి పూర్తి నిజాలు కావని పరిశీలనవల్ల తెలుసుకోవచ్చు. కేవలం ఆశుసాహిత్యంగా చిన్నచిన్న రచనలేవో వచ్చినా, రాతలేనిదే అని నిలువ లేవు. కోలాటం వంటి నృత్యాలతో ఉన్న సంపర్కం వల్ల వాటి లయ సాహిత్యం జ్ఞాపకం ఉండి పోవటానికి వీలైతున్నది. మార్గ సాహిత్య విధానంలో కావ్య రచనకు కవి ఎంత కృషి చేస్తాడో, జానపద గేయనిర్మాత కూడా అంత కృషి చేయడం జరుగుతుంది. రాసింది జానపద రచన కాదనే అసంగత భావం ఒకటి ఇటీవల ప్రబలింది. జానపద కృతులను సరిగా అధ్యయనం చేయక పోవడమే ఇందుకు కారణం. (పు. 156–157) దేశి సాహిత్యపరిశీలకులలో రెండు సంప్రదాయాల సామీప్యాన్ని గురించి ఇంత స్పష్టంగా చెప్పిన తొలి వ్యక్తి శ్రీ గోపాలకృష్ణ అని నాకు తోస్తున్నది.

దేశ చరిత్రలో ఆర్యద్రావిడ భేదాలను నిరాధారంగా సృష్టించి ఈ నాటికీ కొనసాగుతున్న వైరుధ్యాలకు కారకులైన పాశ్చాత్యులు, సాహిత్యంలోనూ సంస్కృతిలోనూ శిష్టశిష్టేతర విభాగాలను కల్పించి పరస్పర విరుద్ధాలుగా చూపించి ఒక విభాజక రేఖను స్థిరంగా నెలకొల్పారు. లిటిల్ అండ్ గ్రేట్ ట్రెడిషన్ అని నామకరణం చేసి అన్ని సంస్కృతి విభాగాలకూ దీన్ని వ్యాపింపజేశారు. మౌఖిక సంప్రదాయంలో ఇతిహాస పురాణాలను నిర్మించిన పాల్కురికి సోమనాథుణ్ణిగానీ, పల్నాటి వీరచరిత్ర నిర్మాత శ్రీనాథుణ్ణిగానీ ఎవరూ అపండితులని అనే వీలులేదు కదా. అనంతమైన దేశి సాహిత్య సృష్టికర్తలు

విఖ్యాత విద్వాంసులు కొన్ని సందర్భాలలో రెండు మార్గాలలోనూ రచన చేసిన వారూను అందువల్ల దేశి సాహిత్య ప్రక్రియలలో నుండి ఉదాహరణములాంటి ప్రక్రియలు మార్గపద్ధతిలోకి సాగిపోవటం, మార్గ పద్ధతిలోని కావ్యేతిహాసాలు దేశి మార్గంలోకి ప్రసరించటం జరిగింది. ప్రబంధాలలోని పుష్పాపచయరగడ, పుష్పులావికల వర్ణన, ఏలలు, ధవళాలు - ఎన్నో ఈ రాకపోకలను నిరూపించేవిగా పేర్కొనవచ్చును.

మన సంస్కృతిలోని ప్రధానాంశము - ఒకే సందేశము, విలువల వ్యవస్థ భిన్నభిన్న సాహిత్య కళాప్రక్రియల ద్వారా సమాజంలోని అన్ని వర్గాలకు అందజేయటమే దాని లక్ష్యం.

నందవరీకులను గురించి చేసిన పరిశోధన సామాజిక శాస్త్ర దృష్ట్యా చాలా విలువైంది. ఈ విశ్లేషణలో మధ్య యుగాలలో భక్తి ఉద్యమం సమాజంలోని అనేక స్తరాలలోని జనులను ఎట్లా ఏక సూత్రంలో బంధించిందో తెలియవస్తుంది. 'పల్లెపట్టులలో ఒక సంస్కృతి, నాగరక సమాజాలలో సంస్కృతీకరణం పొందిన మరొక సంస్కృతి మనకు దృశ్యమానమైనా అవన్నీ ఒకే మతానికున్న వివిధ ముఖాలన్న సంగతిని గ్రహిస్తే ఆశ్చర్య చకితులం కాక తప్పదు' (పు-55).

అనూచానంగా వస్తున్న రూఢివాదాలను వదలి ఈ విధంగా అంతస్సత్వం ఎరిగి సాగిపోవటం వల్ల శ్రీ అబ్బూరి గోపాలకృష్ణ తన పరిశోధనలో కొత్త కొత్త ఆలోచనలకు ద్వారాలు తెరిచారు. అపూర్వ రహోగర్భాలను వెలికి తీశారు.

ఈ సందర్భంలో శ్రీ గోపాలకృష్ణ సంగీత సాహిత్యాల నడుమ ఉండదగిన పరస్పర పరిపూరకత్వాన్ని నొక్కి చెప్పారు. 'సంగీతమూ, సాహిత్యమూ కలగలసిన భారతీయ జీవనంలో రెండింటినీ సమానంగా మేళవించడంలోనే ఔచిత్యం ఉంటుంది' (పు 171) ముఖ్యంగా భావతాదాత్మ్యం ప్రధానమైన

సంకీర్తనాదులలో ఈ సంగమం లక్ష్యానికి దగ్గరగా చేరుస్తుంది సాధకుణ్ణి. కేవల సాహిత్యమో, కేవల సంగీతమో ప్రాథమ్యం వహించినప్పుడు దానిలో పాండిత్య ప్రకర్ష, సాంకేతికత పెరిగి తాదాత్మ్య బిందువునకు దూరంగా ఉండిపోవలసి వస్తుంది.

సింహగిరి వచనములు రచించిన కృష్ణమాచార్యుల గురించి వ్రాసిన సందర్భంలోనూ, అన్నమయ్యను గురించిన వ్రాసిన సందర్భంలోనూ వచనాల ప్రసక్తి వస్తుంది. ఈ వచనాలు చూర్ణికల వంటివి. కొన్ని ఒడుపులతో, విరుపులతో పాడుకోవటానికి అనుకూలమైనవి. శ్రీ వైష్ణవ సంప్రదాయంలో ద్రావిడ గ్రంథాల కాలక్షేప ప్రవచనాలలో వచనం చదివే సందర్భంలో ఈ ధోరణి కొంచెం మిగిలివున్నదని తోస్తున్నది.

పన్నెండవ శతాబ్దం నాటికే తెలుగుదేశంలో – సింహాచలం, శ్రీకూర్మం, సర్పవరం – సంకీర్తన సంప్రదాయు నెలకొని ఉన్నదని శాసనాలు పేర్కొంటున్నవి. ఈ శాసనాల్లో 'వీణకొలుపు', 'వీణా వాద్యసేవ'లు ప్రసక్తమైనట్లు రచయిత పేర్కొన్నారు. ఇది దివ్యనామగానంతో ప్రారంభమై కన్నడంలో దాస సంప్రదాయంలో దేవర నామగానంతో విస్తరించింది. ఈ దివ్యనామగానమే తరువాత అన్నమాచార్యుల కాలంలో సంకీర్తన భండారమైంది – తరువాతి కాలంలో తిరునామములన్న ప్రత్యేక ప్రక్రియగా రూపొంది సంప్రదాయాన్ని – తాత్త్విక సంస్కృతినీ పరిరక్షిస్తూ వచ్చింది.

ఈ గ్రంథంలో మౌలికంగా కృషి జరిగింది అన్నమాచార్యుల సంకీర్తన లోని సంగీతచ్ఛందస్సుల గురించిన భాగంలో. ఈ చర్చంతా వేలకొలది అన్నమయ్య కీర్తలను తరచి తరచి చేసిందే. 'తెలుగు పాటకు ఛందోరీత్యా సువ్యవస్థిత రూపమిచ్చాడు కనుకనే ఆయన పదకవితా పితామహుడన్న బిరుదాన్ని పొందగలిగాడు' అని తేల్చారు ఈ రచయిత (పు. 238).

అన్నమయ్య సంకీర్తనల మూలాలను అన్వేషించేప్పుడు – మలి

పలుకులో చర్చించిన ఆయన వేషమును గురించి చర్చించేప్పుడు, ఆళ్వారుల దివ్యప్రబంధాల అధ్యయనోత్సవాలను విధిగా నెలకొల్పుకొన్న శ్రీవైష్ణవ దేవాలయాల పద్ధతులను పరిశీలించవలసి ఉంటుంది. దివ్యప్రబంధాల అధ్యయనం – ఆళ్వారాచార్యుల ప్రతిష్ఠ ఉంటేనే వైష్ణవమ్మైన దేవాలయమ్మైనా శిష్టులకూ, ప్రపన్నులకూ ఉపాదేయమవుతుంది. లేనిచోట వారు తీర్థప్రసాదాలను స్వీకరింపరు.

దాక్షిణాత్య దివ్యదేశాలలో 'అరియర్'ల నృత్యగాన సంప్రదాయం ఉంది. ఈ నాటికీ మనం శ్రీరంగంలో ఉత్సవాల సందర్భంలో దీన్ని గమనించ వచ్చును. ఒక ప్రత్యేకమ్మైన కుళ్లాయి పెట్టుకొని – ఈ అరియర్‌లు – ఆళ్వారు దివ్య ప్రబంధాన్ని హస్తకరణాలతో అభినయిస్తూ గానం చేస్తారు. ఈ 'అరియర్'ల కుళ్లాయి అన్నమయ్య ధరించిన కుళ్లాయితో పోలి ఉంటుందని నాకు స్ఫురణ కలుగుతున్నది.

ఈ రచయిత శ్రీమహాలక్ష్మికి ప్రాధాన్యం ఉండటం వలన తెన్‌గలై కాక వడగలై సంప్రదాయాన్ని అన్నమయ్య వంశస్థులు స్వీకరించారని పేర్కొన్నారు. ఇది అనేక కారణాలలో ఒకానొక కారణం కావచ్చు. వడగలైవారు తెన్‌గలై వారికన్నా శ్రౌతస్మార్తకర్మానుష్ఠానాదులకు ప్రాధాన్యం ఇస్తారు. స్మార్త పద్ధతినించి వచ్చిన నందవరీకులను వడగలై మార్గం. ఆ విధంగా సన్నిహితమ్మైంది మరొక అంశం – ఆ నాటికే విజయనగర ప్రాంతంలో అహోబల పీఠం ప్రాభవం ఎక్కువగా వ్యాపించి ఉన్నది. ఆ పీఠాధిపతియ్యైన శ్రీ శఠగోపయతిని – సాక్షాత్ నృసింహమూర్తిగా భావించటం కూడా ఉన్నది. వేదాంత దేశికులకు విజయ నగర స్థాపకులైన విద్యారణ్యులతో అనుబంధమూ ఉన్నది. ఇలాంటి అనేక కారణాలు వడగలై సంప్రదాయంలోకి ఆనాడు నందవరీకులు చేరేందుకు కారణములై ఉండవచ్చును.

శ్రీ వేదాంత దేశికుల 'సంకల్ప సూర్యోదయం' ధోరణిలో అన్నమయ్య రచించిన పదం – నెరవాది సాహసులు నిత్యశూరులు, దురిత విదూరులు ధ్రువాదులు – అన్న సంకీర్తన గమనింపదగింది (పు. 285). 'అలిగోరికల్'

(Allegorical) గా సాత్త్విక తామస ధోరణుల నడిమి యుద్ధమును వర్ణించే సందర్భం ఇది. నిత్యశూరులు–నిత్యసూరులు కూడా. శ్రీ వైకుంఠంలోని జీవులు నిత్య సూరులు, ముక్తులు అని రెండు విధాలు. భగవంతునితో పాటు నిత్యముగా ఆతని కైంకర్యంలో నిమగ్నులైన జీవులు – అనంత గరుడ విష్వక్సేనాదులు నిత్యసూరులు. సంసారంలో ఉండి బద్ధులై – భక్తి ప్రపత్తుల మార్గంలో ఆచార్యానుగ్రహం చేత మోక్షమును పొందినవారు ముక్తులు. ధ్రువాదులు ఇట్టి వారు. తాలవ్యదంత్య 'శ–స'ల ఉచ్చారణ భేదంతో ఇక్కడ అన్నమయ్య సుకుమారమైన శ్లేషను సాధించాడు.

ఈ సిద్ధాంత గ్రంథంలో శ్రీ అబ్బూరి గోపాలకృష్ణ ప్రతిపాదించిన ముఖ్యాంశం యక్షగానాల ప్రాథమ్యం అన్నమయ్య రచనలలోనే ఉన్నదని. యక్షులు చేసేగానం కాకుండా యక్షదేవతల ప్రీతి కోసం చేసే గానం యక్షగానమని ఈ గ్రంథం నిరూపిస్తున్నది. మొదట ఇది గేయ ప్రక్రియ. తరువాత ఇది రూపక ప్రక్రియగా మారింది. మౌర్యయుగం ముందరనించీ యక్షదేవతా పూజ ప్రహతంగా ఉన్నట్లు నిరూపించి – ఇదేదో సంస్కృతీకరణం పొందిన దేశిభావం అనే అంశాన్ని – భ్రాంతి పూర్వకమైందనీ తెలియజేశారు.

నాటక ప్రక్రియలో అన్నమయ్యకు ఉన్న పరిచయం, సంకీర్తనలలోని నాటకీయత, పాత్ర చిత్రణలు, సన్నివేశ కల్పన ఇవన్నీ చూపి – బహుళంగా ఆయన రచనలలో కనిపించే రామాయణ కథా గేయాలు, గరుడాచల కథా సందర్భాలూ, వేంకటేశ్వర విలాసగాథలూ ఆధారంగా ఆయన ఈ మూడు యక్షగానాలైనా రచించి ఉంటాడనీ, రాగిరేకులలో చెక్కే సందర్భంలో గేయాలు మాత్రం మిగిలి ఉంటాయనీ భావించారు శ్రీ గోపాలకృష్ణగారు.

ఇప్పుడు కనిపించే సాక్ష్యాల బాహుళ్యం వల్ల శ్రీ అబ్బూరి గోపాల కృష్ణ ఊహ సమంజసంగానే కనిపిస్తున్నది. ఇంకా అన్నమయ్య 32వేల సంకీర్తనలకర్త అని కాక 32 వేళల పాడటానికి అనుగుణంగా సంకీర్తనలు రచించారని కొత్త అన్వయం చేయటం నిశ్చయంగా ఆలోచించవలసిన అంశం.

సాధారణంగా ఆధునిక కాలంలో సంప్రదాయ సంస్కృతి కింద తొందర పడి వ్యాఖ్యాలు చేసే ధోరణి ఒకటి ఉన్నది. వేమన్న విగ్రహారాధనాదులకు వ్యతిరేకమని ఒక ప్రచారం. యోగి, అవధూత, అంతర్ముఖుడూ అయిన వ్యక్తికి ప్రతీకారాధనాదుల అవసరం ఉండదు. ఆ స్థితిలో ఉన్న వ్యక్తి చెప్పిన మాటలు అందరికోసం చెప్పినవి కావు. కాకపోతే పరమార్థం వైపు ప్రాముఖ్యం ఇచ్చేందుకు వాటి అప్రాధాన్యం చెప్పటమే ఉద్దేశ్యం.

అట్లానే ప్రపన్నుల విషయంలో, సంపూర్ణ శరణాగతి చేసిన వారి విషయంలో విధి విహితములైన ఆచారాలకు, జపతపాదులకు ప్రాధాన్యం ఉండదు. ఆ స్థితిలో అన్న మాటలు ఒక మనోభూమికకు చెందినవి. వాటిని నిత్యజీవనంలోని అంశాలుగా వ్యాఖ్యానించుకోవటం తొందరపాటే. అందుకే సర్వేశ్వరుని విడిచిన జపతపాల మీద పూజలు, కర్మకాండల మీద అన్నమయ్య కు నమ్మకం లేదు' (పు. 278) అని గోపాలకృష్ణ వ్యాఖ్యానించారు. 'భావములోన బాహ్యములోన' అన్న కీర్తన ప్రస్తుతం ఉదాహరించిన 'అతిశయమగు శ్రీహరి సంకీర్తన సతతంబును మాసంధ్య' కూడా ఈ ధోరణిలోనే అన్వయమవుతున్నాయి.

శ్రీ గోపాలకృష్ణ పేరెన్నికగన్న చిత్రకారులు. రూపకకర్త, ప్రయోక్త. సాహిత్య నిర్మాతల కోవలోనుంచి వచ్చినవారు. వారి తండ్రిగారు శ్రీ అబ్బూరి రామకృష్ణరావు ఒక అరుదైన వ్యక్తిత్వంగలవారు. నాయందు ఎంతో వాత్సల్యం గలవారు. వారి దగ్గరే మొదటిసారి శ్రీ గోపాలకృష్ణను చూచాను. నిరంతరమైన జిజ్ఞాస, నిర్భీకత, అరుదైన అంతర్వీక్షణం ఈ రచనకు ఇంత గౌరవం కలిగిస్తున్నాయి.

ఇంత ఉత్తమమైన సిద్ధాంత గ్రంథం వెలువరిస్తున్నందుకు శ్రీ అబ్బూరి గోపాల కృష్ణను అభినందిస్తూ - నాకు ఈ ముందు మాటలు వ్రాసే గౌరవం కలిగించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

వరంగల్

13.8.2002 **కోవెల సుప్రసన్నాచార్యులు**

తొలిపలుకు

మొట్టమొదటగా తెలుగు యక్షగాన రూపకప్రక్రియ గురించి, రచనా ప్రయోగ విధానాల దృష్ట్యా చరిత్రను రాయాలనే సంకల్పంతో ఆకరాలను సేకరించుకొని, మొదటగా 'యక్షులూ – యక్షగానమూ' అన్న శీర్షికన ఒక వ్యాసాన్ని 'భారతి'లో జనవరి 1976లో ప్రకటించాను. ఆ వ్యాసాన్ని చదివిన పెద్దల అభినందనలు కూడా లభించడంతో యక్షగాన రూపక పరిణామ క్రమాన్ని గురించి రాయతలపెట్టాను. అందుకోసమని మనకు తెలిసి వచ్చిన, అందివచ్చిన ముద్రిత యక్షగానాల నుంచి యక్షగాన స్వరూపస్వభావాలను నిర్వచించడానికి పూనుకొని, ముందుగా యక్షగానాలలో తప్పకుండా కనిపించే గేయాల పరిణామాన్ని చారిత్రకంగా పరిశీలించాలనుకొని చివరకు అన్నమయను పట్టుకొన్నాను. ఆయన నన్ను అంతకన్నా గట్టిగా పట్టుకొని వదలలేదు. అప్పటి నుంచి అన్నమయ సాహిత్యాన్ని సంపాదించి అధ్యయనం చేయడం ప్రారంభించాను. సేకరించిన వివిధ విషయాలను పరిశీలించగా యక్షగాన రూపక సంప్రదాయానికి అన్నమయ దాదాపు ఆద్యుడన్న సత్యం దృగ్గోచరమైంది. ఆ విషయ వివరణమే ఈ సిద్ధాంత వ్యాస రచన.

అన్నమయ రచనల అధ్యయనంలో మరెన్నో విషయాలను గూడా తెలుసుకోవడం తటస్థించింది. అయితే ప్రస్తుత సిద్ధాంత వ్యాసంలోని విషయానికి అవి సంబంధించినవి కానందున ఆ విషయాలను గురించి ఇక్కడ ప్రస్తావించడం లేదు. గాని, అన్నమయ మహోన్నత వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకొనేందుకు అవి ఉపకరించి, పరోక్షంగా ప్రస్తుత గ్రంథరచనలో సక్రమమయిన విషయ వివేచనకు తోడ్పడినై.

మన దేశంలో మహాకవులైనవారి విషయంలోనే కాక మహా చక్రవర్తుల విషయంలో కూడా, వాళ్ల చిత్తవృత్తి, జీవిత విశేషాలు, జననమరణ కాలాలూ,

సమకాలీన వ్యవస్థ మీద వారి అభిప్రాయాలూ వేటిని గురించీ ఖచ్చితంగా చెప్పుకోలేని పరిస్థితి మనది. అన్నమయ్యా ఆయన సంతతి ఈ విషయంలో నిజమైన చారిత్రక దృష్టితోనే వ్యవహరించారని చెప్పవలసి ఉంది. నిజానికి వాళ్లు రాసిన ప్రతి వాక్యాన్నీ ప్రమాణంగా తీసుకోగలిగినంత నిజాయితీ వారిది. అసలు అన్నమయ్య కవిత్వమే ఆత్మాశ్రయ కవిత్వం కావడం వలన ఆయన వ్యక్తిగత విషయాలెన్నో ఆయన రచనలలో ఆవిష్కృతం కావడం వలన ఆయన రచనలను శాస్త్రీయదృష్టితో పరిశీలిస్తే, తెలిసే విషయాలు అనల్పమైనవి.

చాలాకాలం నుంచీ అన్నమయ జననవత్సరాన్ని గురించిన వివాదం అలాగే ఉండిపోయింది. డాక్టర్ వేటూరి ఆనందమూర్తిగారూ, ఆచార్య ముట్నూరి సంగమేశం గారూ ఈ విషయంలో శాస్త్రీయదృక్పథంతో రాసినా ఎవరూ పట్టించుకోలేదు. వారి వాదనలకు తగిన గుర్తింపూ రాలేదు. ఈ విషయంలో చారిత్రిక విషయాలనూ, తాళ్లపాక వారి రచనలలో కనిపించే ఆధారాలతోనూ అన్నమాచార్య జననవత్సరం క్రీ.శ. 1424 గా నిర్ణయించాను. అందులోని కొన్ని విశేషాలను స్వీకరించి వ్యాసరూపంగా భారతి, డిసెంబరు 1983 పత్రికలో ప్రకటించాను. ఇంతవరకూ ఆ వాదాన్ని పరాస్తం చేసే వాదనేదీ రానందువల్ల అది ఆమోదయోగ్యమని తేలింది.

ఇంతవరకూ పరిశోధకులందరూ దాదాపు యేకమొత్తంగా తాళ్లపాక వారి సాహిత్యాన్ని గురించే రాశారు. కేవలం అన్నమయ రచనలను మాత్రమే స్వీకరించి పరిశోధించి రాసిన మొట్టమొదటి పరిశోధన గ్రంథ మిదేనని విజ్ఞులు గుర్తించగలరు. ఇందుకు కారణం తాళ్లపాక పదకవులలో అన్నమయ శైలిని గుర్తించగలగడం. ఈ కృషిలో భాగంగా 'శ్రీ తాళ్లపాక పెదతిరుమలా చార్యుల కేశవనామ సంకీర్తన'లన్న వ్యాసాన్ని 1983, జూన్ నెల భారతిలో ప్రకటించాను.

పురావస్తు శాస్త్ర సంబంధమైన, శాసనసంబంధమైన ఆకరాలను కొంతలో కొంత ఈ వ్యాసంలో వాడుకున్నాను. అసలు అన్నమయ రచనల

నుంచి లభించే ఆధారాలతో పురావస్తు శాస్త్ర పరిశోధనలు ప్రారంభం కావలసి ఉంది. ఆ విషయంలో కోవిదులైనవారు ఆ పనిని చేబట్టగలరని నా ఆకాంక్ష.

నాకు పితృపాదులే కాక, గురువుగా, మార్గదర్శిగా నా జీవితాన్ని తీర్చిన కీ॥ శే॥ అబ్బూరి రామకృష్ణరావు గారిని సంస్మరించుకోగలగడం నాకొక వరమే. అన్ని రకాల పుస్తకాలనూ నాచేత చదివించి అన్నివిధాలా అన్న అయిన అబ్బూరి వరదరాజేశ్వరరావుకు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి మాటలు చాలవు.

నా విద్యార్థి దశ నుంచీ నన్ను ఓ కంట కనిపెడుతూ తీరిక సమయాలను నాతో గడిపి, చరిత్ర పరిశోధనలో, కళారంగంలో ఎన్నో విషయాలను గురించి నాలో సవిమర్శక విజ్ఞానాన్ని పెంపొందించిన కీ. శే. డాక్టర్ పుట్టపర్తి శ్రీనివాసా చార్యుల వారిని స్మరించి నమస్కరించడం నా కర్తవ్యం.

నేను తిరుపతి వెళ్లినప్పుడు వాత్సల్యంతో నా పనిని దాదాపు తన పనిగా భావించి తాళ్లపాక వారి రాగిరేకులనూ శాసనాలనూ పరిశీలించడానికి అనుమతి సంపాదించిపెట్టిన సౌజన్యమూర్తులూ ఆనాటి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్, తరువాత వైస్ ఛాన్సలర్ అయిన కీర్తిశేషులు ఆచార్య జి. ఎన్. రెడ్డి గారి ఋణం తీర్చుకోలేనిది. వారికి సదా కృతజ్ఞుడను.

ఈ పరిశోధన సందర్భంగా తిరుపతిలో రెండుమూడు రోజులు రోజుకు కొన్నిగంటల చొప్పున తన అమూల్యమైన కాలాన్ని వినియోగించి ఓపికగా నా విషయ సేకరణకూ, నిర్ణయాలకూ సంబంధించిన వివరాలను తెలుసుకొని తమ ఆశీర్వాదాలను ఇచ్చిన ఆచార్య ముట్నూరి సంగమేశం గారికి నా నమస్కారాలు.

నేను రాసిన ప్రతి అధ్యాయాన్ని విమర్శనాత్మకంగా చదివి నాకు లభించని గ్రంథాలను ఇచ్చి నన్ను ప్రోత్సహించిన సుప్రసిద్ధ సాహిత్య

పరిశోధకులూ, నాటి తెలుగు శాఖ ఆచార్యులూ అయిన మాన్యశ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తిగారు నాకు గురుతుల్యులైనారు. వారికి నా హృదయపూర్వక వినయాంజలులు.

ఈ పరిశోధనా గ్రంథ రచన 1984 మార్చి 15 నాటికి పూర్తి అయినా సమర్పించడానికి 1985 ఫిబ్రవరి 21 నాటికి అనుమతి లభించింది. 1986 ఆగస్టు 28న పిహెచ్.డి డిగ్రీని ప్రకటించారు. నాటి ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు ప్రొఫెసర్ శ్రీమతి నాయని కృష్ణకుమారి, కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కోవెల సుప్రసన్నాచార్యులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి. నాగయ్య గారలు ఈ సిద్ధాంత గ్రంథానికి పరీక్షకులు. వారికి నా హృదయ పూర్వక నమస్కారాలు.

సోదరి చింతపల్లి సుజాతామూర్తి (హైదరాబాదు) ఆర్థిక సహాయంతో ఇన్నాళ్లకు ఈ గ్రంథం తెలుగుపాఠక లోకం ముందుకు వస్తున్నది. ఆమెకు నా కృతజ్ఞతలు.

ఈ గ్రంథానికి చక్కని ముందుమాట రాసిన ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యుల వారికి వినయాంజలులు.

అన్నమయ రచనలను గురించి చర్చించిన పెద్దల వాదాలను అక్కడక్కడ ఖండించడం విమర్శనాత్మకంగానే చేశాను తప్ప వారి పట్ల అగౌరవం ప్రకటించడానికి కాదని మనవి.

ఆంధ్ర విశ్వకళాపరిషత్ నాటక శాఖ నుంచి సిద్ధాంత వ్యాసం సమర్పితం కావడం ఇదే ప్రథమం.

గోపాలకృష్ణ అబ్బూరి.

కృతజ్ఞతలు

మొదటగా నన్ను ప్రోత్సహిస్తూ వచ్చిన ఆంధ్రా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ మద్ది గోపాలకృష్ణరెడ్డి గారికీ ప్రొఫెసర్ కె. తిమ్మారెడ్డి గారికీ (ఆంథ్రపాలజీ శాఖ) ప్రొఫెసర్. సి. సోమసుందర రావుగారికీ (చరిత్ర శాఖ) ప్రొఫెసర్ కోలవెన్ను మలయవాసిని గారికీ (తెలుగుశాఖ).

తిరుపతి దేవాలయమూ ఆ పరిసరాలనంతటా తిప్పి విశేషాలు వివరిస్తూ గంటలసేపు గడపడమేగాక ముద్రితమై అలభ్యాలుగా ఉన్న సంకీర్తనలను అంద చేసిన శ్రీ గోపీకృష్ణ (సారకాయల కృష్ణారెడ్డి) గారికీ నందవరీకుల గురించీ, పద్మశాలీలు తొగటల గురించిన సమాచార సేకరణలో అపురూప గ్రంథాలను అందజేసిన డాక్టర్ ఘట్టమరాజా అశ్వర్ధ నారాయణ (బెంగుళూరు) గారికీ

నా హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు.

ప్రూఫులు దిద్దడంలో సహాయపడిన మిత్రుడు శ్రీ సమ్మెట నాగమల్లేశ్వర రావుగారికీ, ఛాయాచిత్రాలు సంపాదించడంలో తోడ్పడిన వారు శ్రీ పి. జోగినాయుడు, పురావస్తుశాఖ, శ్రీ ఎమ్. అప్పారావు, శ్రీ ఎస్. డి. హరిప్రసాద్ గార్లకీ

నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

రచయిత

1. రాజకీయ నేపథ్యం

విజయనగర సామ్రాజ్యం

పాలకులూ-ప్రజలూ

క్రీ.శ. 1294లో మొట్టమొదటిసారిగా దక్షిణ పీఠభూమి మహమ్మదీయ దండయాత్రను చవిచూసింది. ఢిల్లీలో సుల్తాన్ జలాలుద్దీన్ ఖిల్జీ అప్పటికే సింహాసనంమీద సుస్థిరుడై ఉన్నాడు. సుల్తాను మేనల్లుడు అలావుద్దీన్ ఖిల్జీ మాల్వా మీద దండయాత్రకు పొందిన అనుమతితో సుల్తానుకు తెలియకుండా దేవగిరి మీద దండయాత్ర జరిపి అపారమైన ధనరాసులతో తిరిగివచ్చి, మాయోపాయంతో సుల్తానును చంపి తానే సింహాసనాన్ని అధిష్ఠించాడు. రాజభాండారాలలో, ప్రాచీన దేవాలయాలలో పోగులు పడివున్న ధనరాసుల గురించి తెలిసి వచ్చింది కనుక దక్షిణాపథాన మనుగడ సాగిస్తున్న రాజ్యాల మీద అతని కన్ను పడింది. క్రీ.శ. 1310లో కాకతీయ సామ్రాజ్యం అతని కైవసమైంది. వెయ్యి ఒంటెల మీద ధనరాసులు ఢిల్లీకి చేరాయని మహమ్మదీయ చరిత్రకారుల కథనం. తరువాత పాండ్యరాజ్యం ఒరిగి పోగా మూడువందల పన్నెండు ఏనుగుల మీద ధనరాసులూ, పన్నెండువేల గుర్రాలూ, 96,000 మణుగుల బంగారమూ పెట్టెలకొద్దీ రత్నరాసులూ ఢిల్లీ చేరాయి.

హిందువులకు యుద్ధాలు కొత్తకాదు. ఆనాటిదాకా హిందూరాజులు పరస్పరం కలహించుకొంటూ ఒకరి రాజ్యాన్ని మరొకరు ధ్వంసం చేస్తూ జీవించినవారే. అయితే ఆ యుద్ధాల వల్ల ప్రజాజీవితం ఎప్పుడూ పూర్తిగా చితికిపోలేదు. అలావుద్దీన్ ఖిల్జీ మనస్తత్వమే వేరు. అతనికి దక్షిణాదిన రాజ్యాలేలడం అభిమతంగా కనిపించదు. పరమ నిరంకుశుడూ పరమ క్రూరుడూ అతను. 'జలాలుద్దీన్ ఖిల్జీని చంపిన తరువాత అతని బంధువర్గాన్నంతటినీ స్త్రీ, బాల వివక్ష లేకుండా చంపించాడు. ఢిల్లీ నగరంలో

ఉన్న మంగోలు ప్రజలను కంటగించుకొని వారిలో ముప్ఫయివేలమందిని నిర్దాక్షిణ్యంగా చంపించాడు. హిందువులను పూర్తిగా అణగదొక్కి వారి ఆస్తిపాస్తుల్ని హరించమని తన మంత్రులకు ఆజ్ఞ ఇచ్చాడు. సాగులో ఉన్న భూముల్లో పండిన పంటలో సగం తాను స్వీకరించి, రైతులు కేవలం బతికి ఉండటానికి అవసరమైనంత మాత్రమే వారికి వదలాలని శాసించాడు. గూఢచారుల ద్వారా, ఘోరమైన శిక్షల ద్వారా అతను తన పరిపాలనను కొనసాగించాడు.[1] ఈ క్రూరత్వం దక్షిణదేశ ప్రజల్ని భీతావహుల్ని చేసింది. కనీవినీ యెరుగని దారుణాలు వారి కళ్లు తెరిపించాయి. గ్రామగ్రామానా దారుణ గాథలు వ్యాపించాయి. ప్రజలలో మొదటిసారిగా ఒక కొత్త ఆలోచన మొలకెత్తింది. రాబర్ట్ సూయెల్ మాటలలో –

"The deadliest curse that could be pronounced on a man was, as is evidenced by the inscriptions, that his punishment hereafter should be like that awarded by the high gods to a man who had killed a Brahman. And yet now there came down on the Hindus those masses of marauding foreigners, sacking the cities, slaugtering the people, destroying the ancient fanes and killing even the sacred Brahmans, in the name and for the glory of God. The thing was monstrous - unheard of. The result was that the whole of Southern India was convulsed by this catastrophe; the one hope in men's minds was that some Hindu power would arise to defend the country from any such disaster in future; and when, a few years later, certain princes took the lead, they were enthusiastically supported by almost all parties. This paved the way for the establishment on solid ground of the empire of Vijayanagar".[2]

అది మాధ్యమిక యుగం. పాశ్చాత్య దేశాలతో పరిచయం కలిగిన దాకా మనకు జాతీయవాదం గురించి తెలియనే తెలియదు. మతాభిమానం నాటికి కొద్దో గొప్పో దురభిమానంగానే వ్యక్తమౌతూ వచ్చిందే తప్ప దేశ ప్రజలను

ఒక తాటిమీద నడిపించలేకపోయింది. దేశంలో గ్రామ వ్యవస్థ బలీయంగా నిలిచి ఉంది. ఒక హిందూరాజు మరొక రాజుతో యుద్ధం చేస్తే గ్రామవ్యవస్థా స్వరూపంలో మార్పులు రాలేదు. ఒకే భాష మాట్లాడుతూ, ఒకే మతాన్ని అనుసరించేవారు ఉభయపక్షాలా చేరి యుద్ధంలో పాల్గొనేవారు. ప్రజలకి ఆనాటికి తెలిసింది రాజభక్తే. దేశభక్తి కాదు. మొదటిసారిగా తమ నమ్మకాలకు, ప్రశాంత జీవనానికి భంగం వాటిల్లడంతో తమను తాము గుర్తించుకొనే ప్రయత్నం చేశారు. ఫలితం విజయనగర సామ్రాజ్య స్థాపన.

విజయనగర సామ్రాజ్యమనే పేరు ఈనాటి చరిత్రకారులు తగిలించిన పేరు. నిజానికి అది కర్ణాటక రాజ్యం. రాజధాని పేరు విజయనగరం. అందువల్లే శ్రీనాథ కవిసార్వభౌముడు 'తల్లీ కన్నడరాజ్యలక్ష్మి' అని సంబోధించాడు. దేశాన్ని తల్లితో పోల్చిన మొదటి, ఆఖరి మాధ్యమిక యుగ తెలుగుకవి శ్రీనాథుడు. 18వ శతాబ్దపు ఉత్తరార్థంలో జీవించిన 'వెంకటాచలవిహారశతక' కర్త శ్రీ వేంకటేశ్వరుణ్ణి 'జీర్ణకర్ణాట లక్ష్మి రక్షింలేవె' అని అడగడం కూడా రాజ్యం పేరు కర్ణాట రాజ్యంగానే నిర్ధారిస్తున్నది. స్థాపించినవారి కులగోత్రాలూ, మాతృభాషా గురించి ప్రశ్నించడం అర్థరహితం. డాక్టర్ వసుంధరాఫిలియోజా ఈ విషయంలో -

> ''ఇలాంటి సన్నివేశంలో సంగమ వంశం వారు కానీ, వారి తరువాత వచ్చిన కర్ణాటకరాజులు కానీ, కన్నడిగులా కాక తెలుగు వారా అన్నదొక అనావశ్యక ప్రశ్న. 'డివైడ్ అండ్ రూల్' అన్న ఆశయంతో బ్రిటిష్ వారు విత్తిన విషబీజాలలో ఇదొకటి. అందువల్ల కర్ణాటక రాజులు కన్నడిగులా, తెలుగువారా అన్న అనావశ్యకమైన ప్రశ్నను విడిచిపెట్టి, హిందూరాజ్యం ఎంతటిస్థితిలో వున్నది, దానిని కర్ణాటక పాలకులు రెండు శతాబ్దాలకు పైగా ఎలాగ రక్షించుకొంటూ వచ్చారన్నది ముఖ్యం''. [3]

అని అన్నమాటలు ఆమోదయోగ్యాలు. నిజానికి రాజులను గురించీ

వాళ్లు తమ సామ్రాజ్యాన్ని ఎలా కాపాడుకొన్నారన్న ప్రశ్నకు సమాధానాలు చెప్పే చరిత్రలు చాలానే ఉన్నాయి. అందువల్ల నాటి రాజ్యవ్యవస్థా, దాని స్థితిగతుల్ని గురించి కొన్ని విషయాలను గమనించవలసి ఉంది. ప్రస్తుత గ్రంథ కథానాయకుడైన అన్నమయ చుట్టూరా కనిపించిన విషయాలను తెలుసు కోవలసి ఉంది.

నిజానికి విజయనగర స్థాపనతో దేశచరిత్రలో కొత్త అధ్యాయం మొదలౌతోంది. అధునిక యుగంలోకి అడుగుపెట్టడానికి ఆనాటి ప్రజలు సమాయత్తులౌతున్నారు. కొత్తగా ఎదుర్కొంటున్న ప్రమాదం వాళ్లని కొంతలో కొంత ఏకోన్ముఖుల్ని చేస్తే, దేశంలో ఏర్పడ్డ భద్రతాస్థితి వాళ్లని కొత్తరకంగా ఆలోచించేటట్టు చేసింది. హోయసల, కాకతీయ రాజ్యాలలో నగిషీలు ఎక్కువైన శిల్పాలతో, దిక్చక్రరేఖకు సమానాంతరంగా ప్రవహించే రేఖలతో నిర్మితమైన దేవాలయాలు, విజయనగర యుగంలో నిలువుగా పెరగడం ప్రారంభించాయి. విశాలమైన ప్రాకారాలూ, ఎత్తైన గోపురాలూ, నింగిని కూడా ఆక్రమించాలన్న తపనతో ఉద్యమించే అశ్వాలూ, సింహాల ప్రతిమలతో ఉన్న స్థంభాలూ విజయనగరశైలిని తీర్చిదిద్దాయి. హంపీలోని విరూపాక్షాలయం, లేపాక్షిలోని వీరభద్రాలయం బృహత్‌శిలలతో గండరించిన స్థంభాలతో దూలాలతో మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. ఆ నిర్మాణాల వెనుక ఎంతటి సాంకేతిక, వాస్తుజ్ఞానం ఉన్నదో ఆలోచించే అవసరం నిజానికి ఈనాటికీ ఎవరికీ పట్టలేదు. ఈజిప్ట్ పిరమిడ్ల లాగా అవి బానిసలు నిర్మించినవి కావు. శిల్పకళాకుశలులైన మనుషుల నిర్మాణాలవి. ఆయా దేవాలయాలలోని శాసనాలను చూస్తే కాలక్రమాన ఎలాగ అవి ఈనాడు మనకు కనబడుతున్న రూపాలలోకి ఎదిగాయో తెలుస్తుంది.

విజయనగర చక్రవర్తులు నిరంకుశులేకాని వారి నిరంకుశత్వం హద్దు మీరినప్పుడు సింహాసనాలను కోల్పోయేవారు. ప్రజలలో అసంతృప్తి కలిగినప్పుడు రాజ్యాంగయంత్రం వాళ్లని మంచిచేసుకోవలసి వచ్చేది.

భూస్వామిక, పెట్టుబడిదారీ వ్యవస్థల లక్షణాలను కలగలుపుకొన్న రాజ్యమది. శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు తమ 'ఆంధ్రుల సాంఘికచరిత్ర'లో -

> 'సాధారణకాలమందు 10 లక్షల సైన్యము కలిగి అవసరమైనప్పుడు 20 లక్షల సైనికుల వరకు కూర్చ గలిగిన సామ్రాజ్యములో కమ్మరివారికి పని తక్కువగా నుండునా ? వారు వివిధాయుధములను చేయుటలో నారితేరినవారు' [4]

అన్నారు. ఇది సరైన అవగాహనతో కూడిన ఆలోచన. నిజానికి ఆశ్వికదళానికీ, గజదళాలకూ కావలసిన కవచాలూ, అలంకరణలూ ఇవన్నీ తయారుచేయడానికి వేలమంది లోహకార్మికులూ, వారి కొౕక వ్యవస్థా, గనుల నుంచి ముడిపదార్థాలను వెలికితీసి కరిగించి లోహాన్ని తయారు చేయడానికి కావలసిన మందీమార్బలమూ, వివిధ దశలలో పని సాగడానికి కావలసిన పెట్టుబడీ - ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని చూస్తే ఇది ఎంతటి పరిశ్రమో అర్థం కాగలదు. ఈనాటి లాగా భారీ యంత్రసామగ్రి లేనందువల్లా, అంతా మనుష్య బలంతో సాగవలసి ఉండటంవల్లా, దేశంలో కార్మికవర్గం ప్రబలంగా ఉండి ఉండాలి. కులవ్యవస్థ పట్టుదప్పక నిలిచి ఉన్నప్పటికీ వేలమంది కార్మికులను బలవంతంగా పని చేయించడం అసంభవం. ఇంక ఇలాంటి పరిశ్రమలకు కావలసిన ఉపపరిశ్రమలూ, వ్యాపార యంత్రాంగమూ గురించి చెప్పవలసిన అవసరం లేదు గదా !

పన్నులు భరించరానివైనప్పుడు ప్రజలు సమష్టిగా సహాయనిరాకర ణోద్యమం ప్రారంభించేవారు కూడా. ఇటువంటి ప్రతి సంఘటనా చరిత్ర కెక్కే విధంగా శాసనస్థం కావాలనుకోవడం అత్యాశే. అయితే విజయనగర రాజధాని వంటిచోట్ల లభించిన శాసనాలూ ఇంకా అప్రకటితంగానే ఉండి పోవడం విషాదకరమే గాని ప్రకటితమైన శాసనాలను పరిశీలిస్తే కొన్నైనా ఆనాటి స్థితిగతులను తెలియచేసేవి లభిస్తున్నాయి. ఆనాటి వొక శాసనాన్ని పరిశీలించే

ముందు కుడి, యెడమ కులాల వారి గురించి కొంత తెలుసుకోవాలి –

"... దక్షిణ హిందూ దేశము వారు కుడిచేతి కులము వారని, ఎడమచేతి కులము వారని రెండు తెరగులు. కుడిచేతి కులములు ఎడమచేతి కులములు అను విభేదము ఈనాటిది కాదు ! ఇప్పటికి రమారమి వేయి సంవత్సరముల క్రిందటి నుండి వచ్చుచున్నట్లు శాసనముల వల్ల తెలియుచున్నది. కుడిచేతి, ఎడమచేతి కులములను విభేదము హిందూ సంఘము వారిలో ఒక్క దక్షిణదేశము నందే కాని ఉత్తర హిందూదేశము నందు కానరాదు ... కుడిచేతి, ఎడమచేతి జాతులకు వళంగై, ఇడంగై జాతులని తమిళములో వ్యవహారము ... ఈ కుడి ఎడమ చేతి విభేదము ముఖ్యముగా వ్యావసాయిక జాతుల వారికిని, శిల్పులకును, అనగా విశ్వబ్రాహ్మణులకును కలిగినదిగా కన్పట్టును. పెండ్లిండ్లు మొదలైన శుభ కార్యావసరములలోను అశుభకార్యముల సమయమునను తమకు పరంపరగా రాని, రివాజులేని కుల మర్యాదలను, సాంఘిక గౌరవ బిరుదములను, వాహనాదికములను ఈ యుభయ కులములలో ఏ కులము వారు వాడుక చేసినను, రెండవ కులము వారు అడ్డుపెట్టుచుండిరి. ఈ సందర్భముననే కుడి యెడమ కులములకు తరుచుగా కలహములు సంభవించు చుండెడివి'.[5]

పై వాక్యాలు కీ.శే. మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు రాసినవి. ఒక విధంగా ఆధునిక దృష్టితో చూస్తే వ్యావసాయిక, పారిశ్రామికవర్గాలుగా ఈ కుడి, ఎడమ చేతి వర్గాలు కానవస్తాయి. మాధ్యమిక యుగ వాతావరణంలో ఈ విభేదాలు అంత తేలికైనవి కావు. ఆయా వర్గాల మధ్య సయోధ్య సులభంగా కుదిరే వ్యవహారం కాదు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని చూడవలసిన శాసన

విశేషాలివీ – క్రీ. శ. 1429 ఏప్రిల్ 24 నాటి ఆర్కాటు శాసనం దక్షిణ ఆర్కాటు ప్రాంత ప్రజలు పన్నులు వసూలు చేసే రాజోద్యోగుల వల్ల పడిన బాధల ఫలితంగా వళంగై, ఇడంగై జాతులు, రాజోద్యోగులకు ఎవరైనా సహాయ పడితే బుద్ధిచెప్పాలనీ, సుంకం వసూలు చేసే రాజోద్యోగులకు ఎవ్వరూ ఆతిథ్యం ఇవ్వరాదనీ, ఈ రెండు జాతులకూ చెందిన వ్యక్తి ఎవరైనా ఈ కట్టడిని ఉల్లంఘిస్తే ఆ వ్యక్తిని కత్తితో పొడిచి చంపాలనీ ఒడంబడిక చేసుకున్నట్లు ప్రకటించింది.[6] ఈ శాసనం ద్వారా తెలిసిన వివరాలను పరిశీలిస్తే ఈ సహాయ నిరాకరణోద్యమం అహింసాత్మకం కాదని తెలియ గలదు. వెలుగులోకి రావలసిన ఇటువంటి శాసనాలెన్నున్నాయో ! పై శాసనకాలం నాటికి రెండవ దేవరాయలు పరిపాలిస్తున్నాడు. ఈ వ్యవహారం ఏ విధంగా పరిష్కారమైందో తెలిసే ఆధారలు లేవు.

క్రీ.శ. 1428లో చిదంబరం దేవాలయంలో స్థానికులు ఒక శాసనం చెక్కించారు. ఒక రాజోద్యోగి అన్యాయమైన పన్నులను వసూలు చేస్తూ దేవాలయాధికారులు కోరిన విధంగా ప్రజలను దోచుకొంటున్నందువల్ల వారు ఈ బాధలను పడలేక ఇళ్లు విడిచి వెళ్లిపోగా దేవాలయంలోని పూజలు ఆగిపోయాయి. వాళ్ల విజ్ఞప్తి మేరకు రెండవ దేవరాయలు విచారణ జరిపించి న్యాయం చేకూర్చాడు.[7] క్రీ. శ. 1446 సెప్టెంబరు 30 నాటి ఒక శాసనం వల్ల – దక్షిణ ఆర్కాటులో లభించినది – రాజ్యాధిపతులు మారినప్పుడల్లా రాజోద్యోగులు కానుక లిమ్మని ప్రజలను వేధించడం వల్ల రైతులు గ్రామాలను విడిచిపెట్టి ఇతర ప్రాంతాలకు వలసపోయారనీ, అందువల్ల దేశంలో క్షామం సంభవించినదనీ తెలుస్తున్నది. పారిపోయిన ప్రజలు పారిపోగా, మరణించిన వారు మరణించగా మిగిలిన ప్రజల విజ్ఞప్తి మేరకు మల్లికార్జున రాయలు ఈ దౌర్జన్యాలను అరికట్టినట్లుగా కూడా ఈ శాసనం తెలియ జేస్తున్నది.[8]

తిరువైగావూరు దేవాలయంలో లభించిన మరొక శాసనం ప్రకారం ప్రజలు పన్నులను రాజుకు కాక దేవాలయానికి చెల్లించేవారనీ, దేవాలయాధి

కారులు పన్నుల వసూలు కార్యక్రమాన్ని ఇతరులకు అప్పగించడంవల్ల, పన్నులను ఒక వ్యక్తికి గాక పలువురికి చెల్లించవలసి రావడంతో ప్రజలు నలిగిపోయారనీ, ఆ కారణం వల్ల మొత్తం మండల మంతా నాశనమైందనీ తెలుస్తున్నది. చివరకు ఈ సమస్యను పరిష్కరించినట్లు కూడా ఆ శాసనమే చెప్పిన విషయం.[9]

వ్యవసాయదారులూ, నేతపనివారూ, కమ్మరులూ మొదలైన వస్తూత్పాదక వర్గాలు పన్నుల విషయంలో ఎక్కువగా పీడితులైనారు. సామ్రాజ్యానికి కావలసిన ఆర్థిక బలం ఈ వర్గాల నుంచే వచ్చేది. అందువల్ల వారికి కలిగిన ఇబ్బందులను తొలగించడానికి పాలకవర్గం పూనుకొనేది. అయితే రాజోద్యోగ వర్గం అక్కడక్కడ అవినీతికి పాల్పడడం వల్ల ఈ సమస్యలు తలెత్తేవి. పాశ్చాత్య దేశాలలోని భూస్వామిక యుగంలోలాగా కార్మికులను అణచివెయ్యడానికి సైన్యాన్ని వినియోగించడం ఇక్కడ కానరాదు. ఎందువల్లనో మన చరిత్రకారులు ఈ విషయాన్ని గమనించ లేకపోయారు.

ఈ శాసనాలన్నిటా వ్యక్తమౌతున్నది ప్రజావాణి మాత్రమే. ఇవి ఆనాటి నిరంకుశపాలనను మాత్రమే ఎత్తిచూపుతున్నాయని అనుకోవడం పొరబాటు. రాజోద్యోగుల అవినీతివల్ల సమస్యలుత్పన్నమైనపుడు పాలకులు ప్రజల విజ్ఞప్తి మేరకు కలగచేసుకుని సమస్యలను పరిష్కరించడం కూడా ఈ శాసనాల ద్వారా తెలుస్తున్న విషయం. నేటి ప్రజాస్వామిక విలువలతో నాటి పరిస్థితిని మదింపు వెయ్యడం న్యాయం కాదు. ఆనాటికి ఉన్న పరిస్థితులలో ఈ శాసనాలు విప్లవాత్మకమైన ఆలోచనాధోరణినే వ్యక్తం చేస్తున్నాయి. ఇటువంటి శాసనాలు ఇంకా ఉన్నాయి గాని, నాటి పరిస్థితులను గుర్తించడానికి ఇవి చాలు. దేశాన్ని పాలించే ప్రభువు నిరంకుశత్వానికి కొన్ని పరిమితులున్నాయనీ, ప్రజల విజ్ఞప్తులను ప్రభువులు మన్నించేవారనీ వీటివల్ల స్పష్టమౌతున్నది. ఈ రెండు శాసనాలలో పేర్కొన్న సంఘటనల కాలానికి అన్నమయ నాలుగైదేళ్ళ

శిశువు. ప్రశాంతత నిండిన కాలంలో తీర్థయాత్రలూ, క్షేత్రదర్శనాలూ చెయ్యడం కష్టమైనపని కాదు. యాత్రికులు ఈ విషయాలను తమ తమ ప్రాంతాలలో కథలుగా చెప్పుకొనే ఉంటారు. నూతన భావాలకు బీజావాపనం చేసే ఉంటారు. అయితే అన్నిచోట్లా ఇటువంటి దౌర్జన్యాలు జరిగి ఉండకపోవచ్చు.

ఆనాటి ప్రజల రాజకీయ చైతన్యం ఎంత ఉండేదో, హిందూ సమాజం లోని అసంగత వ్యవహారాలపైన కూడా అంతే నూతన దృక్పథం ఉండి ఉండాలి. క్రీ. శ. 1382లో నాయనార్ గాంగేయరాయర్ అనే వ్యక్తి, బహుశా రాజోద్యోగి కావచ్చు, దూరప్రాంతాల అగ్రహారీకుల సమావేశం ఏర్పాటు చేశాడు. బ్రాహ్మణుల వివాహాలలో వధువుకు ఇవ్వవలసిన నగలు ఎనిమిది 'కళంజా'ల బంగారం, ఎనిమిది 'కళంజా'ల వెండికి పరిమితం చేస్తూ ఆ సమావేశం తీర్మానించింది. ఎవరైనా దీనిని ఉల్లంఘించినట్లయితే వెలివెయ్యడమే శిక్ష అని కూడా పేర్కొన్నారు.[10] క్రీ.శ. 1425లో అన్ని తెగల బ్రాహ్మణులూ గోపీనాథదేవర సమక్షంలో సమావేశమై వివాహాలు కన్యాదానం పద్ధతిమీదనే జరగాలనీ, కన్యాశుల్కాన్ని స్వీకరించరాదనీ, స్వీకరించినవారిని వెలివెయ్యాలనీ, తరువాత రాజదండనకు గురికావలసి ఉంటుందనీ పవిత్రధర్మంగా అంగీకరించారు.[11] అయితే ఇటువంటి హిందూ సమాజ సంస్కరణ యత్నాలు బ్రాహ్మణులకే పరిమితమై లేవు. క్రీ.శ. 1553లో కొండపల్లి నుంచి రాజమహేంద్రవరం వరకూ ఉన్న ప్రాంతాల ప్రజలు కొన్ని మర్యాదల విషయమై కట్టడి చేసుకున్నారు. దాని ప్రకారం మొదటి వివాహానికి ఓలి మర్యాద ఇరవైవొక్క చిన్నాల బంగారం ఉండాలనీ, వరుడి పక్షం పన్నెండున్నర చిన్నాల వెండినీ, వధువుపక్షం ఇరవై చిన్నాల బంగారాన్ని ఇచ్చుకోవాలనీ నిర్ణయించారు.[12] కన్యాశుల్కాన్నే ఓలి అని బ్రాహ్మణేతర నిమ్నవర్గాలలో వ్యవహరిస్తారని శ్రీ టి.వి. మహాలింగం గారు చెప్పినమాట. హిందూ సమాజంలో కొత్త ఆలోచనలు మొలకెత్తుతున్నాయన్నమాట!

సామ్రాజ్యమంతటా దేవాలయాలు మహావైభవంతో ఉన్నట్టు కూడా

శాసనాల ద్వారా తెలిసే విషయమే. ఈ దేవాలయాలను కనిపెట్టుకుని నిర్వహించే ప్రజల సంఖ్యా తక్కువ కాదు. నిత్యపూజలకూ, ఉత్సవాలకూ కావలసిన సరంజామాను ఉత్పత్తి చెయ్యడం, నిర్వహించడం మొదలైన రంగాలలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలూ పాలుపంచుకుంటూండేవారు. పాలకుల తరువాత అధిక సంఖ్యలో ప్రజలకు జీవనోపాధిని చూపించినవి దేవాలయాలే. చేతిపనుల వారికి చేతినిండా పనికల్పించినవీ దేవాలయాలు. ఉదాహరణకు తిరుపతి శ్రీ వేంకటేశ్వరుడికి ప్రసాదాలను లోహపాత్రలలో వండగూడదని నియమం. అందువల్ల నిత్యం జరిగే సేవలకు ప్రసాదాల తయారీకి కావలసిన మృణ్మయపాత్రలను సరఫరా చెయ్యడానికి కుంభకారుల కృషికి పెద్దయెత్తు ఏర్పాట్లే జరిగి ఉండాలి. అలాగే పునుగు, కుంకుమపువ్వు మొదలైన పదార్థాలను దిగుమతి చేసుకోవడంలో వ్యాపారులవసరమైనారు. వందలసంఖ్యలో గ్రామాలను దేవాలయానికి దానం చేసినపుడు, ఆయా గ్రామాల ఆదాయం తగ్గకుండా చూడటానికి కాలువలు చెరువులు తవ్వించడం, మరమ్మతులు చేయించడం వంటి కార్యక్రమాలను దేవాలయాధి కారులే నిర్వహించేవారు. ప్రకటితమైన తిరుపతి దేవస్థాన శాసనాలు ఈ విషయాలను గురించిన వివరాలను దాదాపు సమగ్రంగానే ఇస్తున్నాయి. శిలా శిల్పులకూ, దారుశిల్పులకూ, లోహశిల్పులకూ ఈ దేవాలయాలు పని కల్పించి జీవనోపాధిని చూపెట్టేవి.

ఇంక సంఘంలోని వివిధ వర్గాల విషయంలో కొందరు రచయితల రచనలలో పొరపాటు అభిప్రాయాలు వ్యక్తమౌతూండటం వల్ల వర్గాల గురించి కొంత చెప్పుకోవలసి ఉంది. ఆర్థికదృష్టితోటే ఈ వర్గాలను గుర్తించవలసి ఉంది. రాజ్యంలో ఉన్నతవర్గాలకు చెందినవాళ్లల్లో రాజబంధువులు, మహామండ లేశ్వరులు, దుర్గాధ్యక్షులూ, శిరఃప్రధానులూ, దండనాథులూ మొదలైన వాళ్లుండేవాళ్లు. ఈ వర్గం వివిధ వర్ణాల వారితో నిండి ఉండేది. ఇక మధ్య తరగతి వర్గంలో కవులూ, పండితులూ – వీళ్లల్లో బ్రాహ్మణులదే పెద్ద సంఖ్య-

పురోహితులూ, వ్యాపారులూ, గ్రామాధికారులూ, చిన్న భూస్వాములూ, అవసరాల వారూ, కళావంతులూ, శిల్పులూ ఉండేవారు. ఈ వర్గంలో కూడా అన్ని వర్ణాల వారూ ఉండేవారు. ఇంక దిగువ తరగతిలో సైనికులూ, వ్యవసాయ కూలీలూ, గ్రామ ప్రాంతాలలోని చేతివృత్తుల వాళ్లూ ఉండేవారు. వ్యవసాయ కూలీలుగానే కాక అవసర సమయాలలో సైనికులుగా కూడా హరిజను లుండేవారు.

విజయనగర సామ్రాజ్యంలో జనాభా గురించి విపులంగా చర్చించి శ్రీ టి.వి. మహాలింగంగారు సామ్రాజ్యంలోని జనాభా కోటీ నలభై లక్షలకు అటూ ఇటూ ఉండవచ్చని అభిప్రాయపడ్డారు.[13] అంత విశాల సామ్రాజ్యంలో తక్కువ జనాభా ఉండటం వల్ల కేవలం వర్షాల మీద ఆధారపడిన భూములలో పండే పంట సైతం చాలినంతగా ఉందని భావించవలసి ఉంటుంది. వర్షాభావం తటస్థించినప్పుడు క్షామాలూ ఉండేవి. కాలక్రమాన 'సముద్రాల' పేరుతో విశాలమైన సరస్సులను పాలకులు నిర్మించారు. ఆహారోత్పత్తుల విషయంలో అవసరానికి మించిన ఉత్పత్తులుండటం వలన ఆహారపదార్థాలు చవకగానే లభించి ఉండాలి. అదీగాక నగరాలలో తప్పించి గ్రామప్రాంతాలలో నాణాల పద్ధతి బదులు వినిమయ విధానం అమలులో ఉండటం వల్ల ప్రజలకు పెద్ద ఇబ్బందులు ఉండేవి కావని భావించవచ్చు. అయితే దారిద్ర్యం అసలు లేనే లేదని భావించడం పొరబాటే కాగలదు.

కులవ్యవస్థ బలంగా ఉండినా ఆనాటి ప్రజలు దానివల్ల ఇబ్బందులు పడలేదనుకోవాలి. ఎవరి కులగౌరవాలను వాళ్లు కాపాడుకొంటూ ఉండేవారు. ఆ గౌరవాల విషయంలోనే తగువు పడేవారు గాని నేటిలాగా కులమన్నది ఆర్థికభద్రతకు భంగకరం కాలేదు. వంశపారంపర్యా వచ్చిన వృత్తుల వల్ల నాటి ప్రజలు ప్రశాంతంగానే తమ తమ నమ్మకాల మేరకు జీవితాల్ని గడిపేవారు. ఈనాడు ఆర్థిక వనరులు దాదాపు కేంద్రీకృతమైపోయి ఉద్యోగాలకు పోటీ పడవలసి రావడంతో కులానికి ఏనాడూ లేని కొత్త విలువలు ఏర్పడి సమాజం

లోని సామరస్యానికి భంగం కలగడం చూస్తున్నాం. కాని ఆనాడు ఆ పరిస్థితి లేదు. ఎటువచ్చీ హిందూసమాజంలో ఎక్కువగా పీడనకు గురైనవారు హరిజనులే. విజయనగర సామ్రాజ్యావతరణకు ముందే బసవేశ్వరుడూ, రామానుజాచార్యులూ కులవ్యవస్థను ఖండించినా ఆ వ్యవస్థ కొద్దిమార్పులతో అలాగే సాగివచ్చింది. కొత్తగా వచ్చిన మహమ్మదీయ దండయాత్రల ఉపద్రవం కూడా కులవ్యవస్థను కదిలించలేకపోయింది. బహుశా సామూహిక భద్రత కోసం కులవ్యవస్థను ప్రజలు ఆదరించారేమో! అయినా అన్నమయ, వేమన వంటి వారు కులవ్యవస్థను ఖండించారు.

ఇన్ని విధాలుగా నాటి ప్రజల ఆలోచనలలో మార్పు కనిపిస్తూండగా, ఇంకొక పక్క వర్తకుల కార్యకలాపాల వల్ల రాజధాని విజయనగరం 'కాస్మాపాలిటన్' వాతావరణాన్ని సంతరించుకొంది. అరబ్బులు, పోర్చుగీసులు ఇటాలియన్లతో సామ్రాజ్యానికి పరిచయం కలిగింది. ప్రపంచంలోని సుదూర ప్రాంతాల గురించి కనీసం కొందరికైనా తెలిసివచ్చింది. ఉత్తర భారతం అల్లకల్లోలంగా ఉన్న తరుణంలోనూ కాశీప్రయాగాది క్షేత్రాలకు దక్షిణాది నుంచి వెళ్లే యాత్రికులకు కొదవలేదు. లోహపరిశ్రమ, వస్త్రపరిశ్రమలు మంచి అభివృద్ధిలో ఉన్నాయి. ఎగుమతులు కూడా తక్కువేమీ కాదు. అయినా విజయనగర సామ్రాజ్యం పారిశ్రామిక యుగంలోకి అడుగుపెట్టగలిగిన కాలం ఆసన్నమైనా దక్షిణదేశం ఎందువల్ల చొరవతీసుకోలేకపోయింది అన్నది ప్రశ్న. ఉదాహరణకు దేశంలో అద్దకం పరిశ్రమ చాలా ప్రాచీనమైందే. అద్దకం కోసం లలితమైన రేఖలతో చెక్క దిమ్మల మీద అందమైన చిత్రాలను చెక్కి వినియోగించడం సామ్రాజ్యమంతటా తెలిసిన విద్య అయినా, అక్షరాలను చెక్కి గ్రంథాలను ముద్రించవచ్చుననే భావన ఎవరికీ తట్టకపోవడం ఎందు వల్లననే ప్రశ్న ఎదురుకాక తప్పదు. ఈ ప్రశ్నలకు ఒకే ఒక్క సమాధానం అటువంటి ఆలోచనలు రేగి ప్రయోగ పూర్వకంగా రుజువు చేసుకోగలిగిన కాలవ్యవధి ఆనాటి ప్రజలకు లేదని చెప్పుకోవలసి ఉంటుంది. సంపద

పెరగగానే నాటి దృష్టి విలాసజీవితం మీదకు పరుగులెత్తింది. ఆ విలాస జీవనం ఇతర కార్యకలాపాలకు తగినచోటు నివ్వలేదు. ఈ స్థితిలోంచి బయటపడడానికి పదహారో శతాబ్దాంతానికి అవకాశం చిక్కి ఉండాలి గాని నాటికి సామ్రాజ్యం పునాదులు కదిలిపోసాగినై. కేంద్రపాలన బలహీనపడగానే 'తావులేలే రాజులకు' స్వతంత్రం ప్రకటించడమొక్కటే తెలిసిన విద్య. ఉత్తర భారతంలో ఆనాటికి కాగితం బాగా వాడుకలోకి వచ్చింది. శ్రీనాథుడే కాగితాన్ని పేర్కొని ఉన్నాడు గదా. అయితే ఆనాటి గ్రంథాలేవీ కాగితాల మీద రచించినవి దక్షిణ భారతభాషలకు చెందినవి ఆట్టే కనిపించవు. క్రీ.శ. 1700 నాటికి దక్షిణ దేశం కూడా అల్లకల్లోలమై పోయింది. నిజానికి పదిహేనో శతాబ్దిలోనే ఒక విధమైన స్వేచ్ఛా వ్యాపారమూ, అంతర్జాతీయ సంబంధాలూ అభివృద్ధి చెందినా విజయనగర సామ్రాజ్యం వాటిని వినియోగించుకుని నూతన యుగావిష్కరణ కు సమాయత్తం కాలేకపోయిందన్నమాట. ఇది ఒక విధమైన చారిత్రక దురదృష్టం.

విజయనగర సామ్రాజ్యస్థాపన జరిగిన తొలి దినాలలో పాలకులలో కనిపించిన నైతిక దృష్టి క్రమంగా అంతరించింది. భోగలాలసతో అధికారాన్ని కాపాడుకోవడానికీ, చేజిక్కించుకొనడానికి వాళ్లు హత్యలకు కూడా వెను దియ్య లేదు. పదిహేనో శతాబ్దం ఉత్తరార్థంలో ఒక పక్కన గజపతుల దండ యాత్రలూ, మరొక పక్కన బహమనీ దండయాత్రలతో దేశం అల్లకల్లోలమై పోతుండగా సాళువ నరసింహరాయలు పరిస్థితులను చక్కదిద్దవలసి వచ్చింది. ఆయన సింహాసనం అధిష్ఠించిన స్వల్పకాలంలోనూ సామ్రాజ్యానికి బలమైన పునాదులను కల్పించాడు. ఆయన పరిపాలనాదక్షత వల్ల సామ్రాజ్యానికి 'కింగ్‌డమ్ ఆఫ్ నర్సింగ' అన్న పేరు పాశ్చాత్యులలో వాడుక కొచ్చింది.

ఇటువంటి పరిస్థితులలో, ఇటువంటి కాలంలో సమాజాన్ని ఐక్యపరిచి ముందుకు తీసుకు వెళ్లవలసిన భారం అన్నమయ తనమీద వేసుకున్నాడు. అయితే ఆ విషయాలను కూలంకషంగా చర్చించాలంటే ప్రస్తుత గ్రంథ

ప్రణాళికను మీరి పోతుంది. అందువల్ల ఈ రాజకీయ నేపథ్యంలో ఆయన ఎలా ప్రతిస్పందించాడో రేఖామాత్రంగా పరిశీలించవలసి ఉంది.

సంఘంలోని ఆర్థిక వ్యత్యాసాలను స్పష్టంగా చూడగలిగినవాడుగా అన్నమయ మాత్రమే తెలుగు సాహితీలోకంలో కనిపిస్తున్నాడు. ఈ పాట చూడండి –

'రూకలై మాడలై రువ్వలై తిరిగీని
దాకొని వున్నచోటఁ దానుండ దదివో

వొకరి రాజుఁజేసు నొకరి బంటుగఁజేసు
వొకరి కన్నెకల వేరొకరికి నమ్మించు
వొకచోట నున్న ధాన్యమొకచోట వేయించు
ప్రకటించి కనకమే భ్రమయించీ జగము'[14]

ఎవరైనా సరే తన వ్యక్తిత్వాన్ని చంపుకొని జీవించడం అమానుషమే. అన్నమయ స్వేచ్ఛాప్రియుడు.

'చీచీ వివేకమా చిత్తపు వికారమా
యేచి హరిఁ గొలువక హీనుఁడాయ జీవుఁడు

బతికేనంటాఁబోయి పయిఁడిపుచ్చుక తన
పతి యవసరమునఁ బ్రాణమిచ్చీని.
బతుకందులోన నేది? పసిఁడి యెక్కడనుండు?
గతిహరిఁగొలువక కట్టువడె జీవుఁడు

దొడ్డవాఁడ నయ్యేనని దొరలఁ గొలిచి వారి –
కడ్డము నిడుపు మొక్కు నతిదీనుఁడై
దొడ్డతనమేది ? యందు దొరయాడ నున్నవాఁడు
వొడ్డి హరిఁ గొలువక వోడుపడె జీవుఁడు !'[15]

అన్నమయ నిజానికి సహజవాది. ప్రకృతిలో ఆయనకి సంపూర్ణమైన

భగవత్స్వరూపమే కనిపించేది. ఆయన ఆధ్యాత్మికంగా ఉన్నతోన్నతుడు. భగవంతుణ్ణి తల్లిగా తండ్రిగా మాత్రమే ఇతర భక్తకవులు భావించగా అన్నమయ మాత్రం –

'వేరొక్కరులేరు విశ్వమంతా నీ మహిమే
యేరీతి నీవే కలవు ఇతరము లేదు

తల్లివై రక్షింతువు తండ్రివై పోషింతువు
యిల్లాలవై మోహమిత్తువు నాకు
వొళ్లయి పెరుగుదువు వొగిఁ బురాకృతమౌదు
యిల్లు ముంగిలై వుండుదు వింతా నీ మహిమే'[16]

అసలు అన్నమయతో పోల్చదగిన కవులు ప్రపంచంలోనే చాలా అరుదుగా ఉంటారు. ఆయనకున్నంత జీవన వైశాల్యం మరొకరికి లేదు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను చూసి అవగాహన చేసుకొని తన దృక్పథాన్ని మలచుకొనేవాడు. ఆయన నిత్యపరిణామశీలుడు.

'తతిగాని యీపాటు దైవమా విచారించవే
కతలాయఁ జెప్ప నేఁడు కలికాలమహిమా

దేవాలయాలు నానాదేశములెల్లాఁ జొచ్చి
దేవఁగా నెట్లుండిరో దేవతలు
తావులేలే రాజులకు దయ గొంత పుట్టదాయ
కావరమే ఘనమాయఁ గలికాలమహిమా

నిరపరాధులఁ జంపి నెత్తురు వారించఁగాను
తెరలెకెట్లుండిరో దిక్పాలులు
విరసవర్తను లుండే విపరీతకాలమున
గరువాలుఁ గపటాలె కలికాలమహిమా' [17]

సాంఘికంగా ఆయన భావాలు ఆనాటి పరిస్థితులలో విప్లవాత్మకమైనవే.

అందమైన మాటలను పేర్చి సుందర వ్యూహసౌధాలను నిర్మించే పనికి ఆయన పూనుకోలేదు. ప్రతి విషయాన్నీ తాత్వికంగా పరిశీలించడం, స్పష్టంగా వ్యక్తీకరించడం ఆయన శైలి.

'పాయని కర్మంబులె కడు బలవంతములని నప్పుడె
కాయమునకు జీవునకునుఁ గర్తృత్వము లేదు

ఆతుమ సకల వ్యాపకమని తలపోసిన పిమ్మట
జాతీయు కులాభిమానముఁ జర్చింపనెరాదు
భూతవికారము లన్నియుఁ బురుషోత్తముఁ డనినప్పుడు
పాతకముల పుణ్యంబుల పని తనకే లేదు

పదిలంబుగ సర్వాత్మకభావము దలఁచినపిమ్మట
ముదమున నెవ్వరిఁజూచినఁ మొక్కక పోరాదు
కదిసిన యిప్పటి సుఖములె కడు దుఃఖములని తెలిసిన
చెదరక సంసారమునకుఁ జేసాఁపనెరాదు' [18]

మతపరమైన కర్మకాండల మీద కూడా అన్నమయ తన అభిప్రాయాన్ని నిర్ద్వంద్వంగానే ప్రకటించాడు –

'హరియే సకలక్రియలై తృప్తి యిచ్చుఁగాక
యెరవుల వారిచేఁత లెందాఁకా వచ్చీని

నరులకు నరులే పరలోకక్రియలు
సిరి మోహాచారాలఁ జేతురుగాక
తరుపాషాణపశుతతుల కెవ్వరుసేసీ –
రరయఁగ భ్రమగాక అని పస్తులున్నవా' [19]

ఇంత తీవ్రంగా ఇంతచక్కగా తన భావాలను ప్రకటించిన మహా పురుషుడు యక్షగానరూపకానికి రూపురేఖలు దిద్ది అది వొక వాఙ్మయశాఖగా ప్రవర్తిల్లేటట్టు చేశాడు. ప్రబంధకవిత్వయుగంలో ఖండకావ్యాలనదగిన

సంకీర్తనలను రచించాడు. మనసావాచాకర్మణా తను నమ్మినదాన్ని ఆచరించి చూపాడు. ఆయన దృష్టిలో శ్రీ వేంకటేశ్వరుడు స్వాతంత్ర్యానికి సంకేతం. తన యుగంలోని ప్రజల కన్నీళ్లనూ, ఆనందాలనూ తన రచనలలో ప్రతిఫలింప జేసి తెలుగు సాహితీ లోకంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాడు. క్రమంగా తెలుగుదేశం తిరిగి ఆయనను గుర్తుచేసుకుంటున్నది. అర్థశతాబ్దం నుంచీ ప్రారంభించినా ఆయన రచనలన్నీ ఇంకా ముద్రణకు నోచుకోలేదు. ఇంకా ఆయనను కేవలం భక్తకవిగా మాత్రమే పరిగణించడం జరుగుతోంది. ఇది ఆయనపట్ల అపచారమే. కాలక్రమాన ఆయనను సరిగా అర్థం చేసుకోగలగ డానికి తెలుగు ప్రజలు ప్రయత్నించగలరని ఆశ. ఆయన మనుమడే - చినతిరుమలాచార్యులన్నట్టు -

> 'చక్కరై చవిచూపీ జాలై తావి చల్లీ -
> నక్కజపు మాఁతువజ్రాలై మెఱసీని
> నిక్కుటద్దములై మానిలువు నీడలు చూపి -
> నక్కర తాళ్లపాకాన్నమయ పదములు'[20]

ఆయన జీవితమే ఒక సందేశం.

అధోజ్ఞాపికలు

1. ది హిస్టారికల్ ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ సదరన్ ఇండియా, రాబర్ట్ సూయెల్, పు. 171.
2. అదే. పు. 177
3. అళిదుళిదె హంపి - డాక్టర్ వసుంధరా ఫిలియోజా, పు. 3, కన్నడ గ్రంథం. ఈ ఉదాహృత వాక్యాల కనువాదం ప్రకృత రచయిత చేసినది.
4. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - కీ. శే. సురవరం ప్రతాపరెడ్డి, పు. 246
5. తెలుగు విజ్ఞాన సర్వస్వము - సంపుటం 3, పు. 16
6. ఏన్యువల్ రిపోర్ట్ ఆఫ్ ది ఎపిగ్రాఫికల్ డిపార్ట్‌మెంట్, 92-1918
7. ఎ టోపోగ్రాఫికల్ లిస్ట్ ఆఫ్ ది ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ది మద్రాస్ ప్రెసిడెన్సీ, వాల్యూం 1, సౌత్ ఆర్కాట్ 168
8. ఎపిగ్రాఫికల్ ఏన్యువల్ రిపోర్ట్స్ 1921, గవర్నమెంట్ ఆఫ్ ది మద్రాస్, పు. 58.
9. అదే, 1915, 106-109

10. ఏన్యువల్ రిపోర్ట్ ఆఫ్ ది ఎపిగ్రాఫికల్ డిపార్ట్మెంట్ 526 - 1962 - 63.
11. ఎ టోపోగ్రాఫికల్ లిస్ట్ ఆఫ్ ది ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ది మద్రాస్ ప్రెసిడెన్సీ, వాల్యూం 1, పు. 103, శాసనం 602.
12. ఏన్యువల్ రిపోర్ట్ ఆఫ్ ది ఎపిగ్రాఫికల్ డిపార్ట్మెంట్, 337-1892
13. ఎడ్మినిస్ట్రేషన్ అండ్ సోషల్ లైఫ్ అండర్ విజయనగర్, పార్ట్ 2, సోషల్ లైఫ్, పు. 7, - టి.వి. మహాలింగం.
14. అధ్యాత్మిక సంకీర్తనలు, సంపుటం 1, పునర్ముద్రణ, సంకీర్తన 458
15. అధ్యాత్మిక సంకీర్తనలు, సంపుటం 2, పునర్ముద్రణ, సంకీర్తన 13
16. అధ్యాత్మిక సంకీర్తనలు, సంపుటం 2, సంకీర్తన 148
17. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము - శ్రీ వేటూరి వారి పీఠిక, పుటలు 47-48.
18. అధ్యాత్మిక సంకీర్తనలు, సంపుటం 1, పునర్ముద్రణ, సంకీర్తన 47
19. అధ్యాత్మిక సంకీర్తనలు, సంపుటం 2, పునర్ముద్రణ, సంకీర్తన 126
20. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము - శ్రీ వేటూరి వారి పీఠిక, పు. 50.

2. సాంఘిక నేపథ్యం

నందవరీకులు

అన్నమయ నందవరీక బ్రాహ్మణుడు. ఈ నందవరీకులు ఆంధ్రదేశానికి 13వ శతాబ్ది ప్రాంతంలో ఉత్తరదేశాన్నుంచి వలస వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ కాలనిర్ణయం ఖచ్చితమైనది కాదు గాని 15వ శతాబ్ది నాటికి ఆంధ్ర సాంస్కృతిక రంగ చరిత్రలో గణనీయమైన పాత్రను నిర్వహించడం చూస్తే కనీసం అంతకు ఒక శతాబ్దం ముందు వారిక్కడికి వచ్చి ఉంటారని భావించడం అసమంజసం కాబోదు.

అన్నమయ ఎనిమిదో ఏటనే ఇల్లు విడిచి తిరుపతి వెళ్లినట్లు చిన్నన్న కథనం. ఆ వయసులో లోకజ్ఞానం చెప్పుకోదగ్గంతగా ఉండకపోయినప్పటికీ ఆ వయసు బాలుడి మనఃఫలకం మీద పరిసరాల వాతావరణం గాఢముద్రనే వేయగలిగిన స్థితిలో ఉంటుంది. ఆ ముద్రల ప్రభావం అన్నమయ సాగించిన సృజనాత్మక వ్యాసంగం మీద ఎంతవరకుందో అంచనా కట్టడానికీ, అసలు అన్నమయ పుట్టి పెరిగిన వాతావరణంలో నందవరీకుల పాత్రను అంచనా వేయడానికీ నందవరీకుల చరిత్ర గురించి మానవశాస్త్ర (ఆంత్రోపాలజీ) దృష్టితో పరిశీలించవలసి ఉంటుంది.

తరుణవయస్కుడైన అన్నమయ తిరిగి తల్లి వెంట స్వగ్రామమైన తాళ్లపాకకు చేరుకునేటప్పటికి అతని చిన్నప్పటి నమ్మకాలు మారిపోయాయి. కొత్తగా వచ్చిన వైష్ణవం తన శాఖకు చెందిన బ్రాహ్మణులలో తనను పరాయి వాడిగా చేసి ఉండాలి. కొత్త వైష్ణవుడికి పంగనామా లెక్కువ గదా ! సహజంగానే అతని హృదయంలో తీవ్ర భావసంఘర్షణ తలెత్తి ఉండాలి. ఈ అంతఃస్సంఘర్షణమే చివరకు అన్నమయను శ్రీ వేంకటేశ్వర పాదపద్మారాధకుడిగానే మిగిల్చినా, శ్రీ వైష్ణవం పట్ల పట్టుదల కాలక్రమేణా సడలి విశ్వమానవతా

దృష్టిని ఆయన అలవర్చుకొనేలా చేసింది.

ఈ భావ సంఘర్షణ ఆయన సంకీర్తనలలో ప్రతిఫలించింది. ఆయన ప్రకటించిన కొన్ని భావాలు విశిష్టాద్వైత సిద్ధాంతంతో పొందుపొసగనివి. ఈ కారణం వల్లనే '.... ఎన్నో జన్మల నుండి వెంబడించిన అద్వైతవాసన ఈతనిలో పూర్తిగా మాసినట్లు కానరాదు...'[1] అంటూనే ఒక సంకీర్తన నుదాహరించి 'ఈ భావములు పరికించినపుడు ఈతడు మహాయోగియై, విష్ణుభక్తుడై పరమార్థమున ఏమతమునకు చెందని యోగివలె కాన్పించుచున్నాడు'[2] అంటారు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు.

అన్నమయలో క్రమంగా వచ్చిన భావపరిణితిని తెలుసుకోవడానికేకాక అన్నమయ సంతతిని గురించి కొన్ని విషయాలను అవగాహన చేసుకోవడానికి కూడా మానవశాస్త్రదృక్పథంతో పరిశీలనకు పూనుకోవలసి ఉంది. నందవరీకుల కులదేవత చౌడేశ్వరి. రాయలసీమలో శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయాలు చాలానే కానవస్తాయి. ఈమె శక్తిస్వరూపిణి. ఒకచేత ఖడ్గం, మరొకచేత రక్తపాత్ర ధరించిన ఈమె విగ్రహం చూడడానికి అతిలోకంగా ఉంటుంది. చెక్కతో, చెక్కసున్నంతో, బంగారురేకు అంచులతో పొదిగిన రంగు రంగు రాళ్లతో, అద్దపు ముక్కలతో అలంకృతమై బృహత్పరిమాణంలో చూపరులకు వెరపు కలిగించేలా ఉంటుంది. రాయలసీమ ప్రాంతాలలో ఏ మతానికి చెందినవారైనా ఈమెకు కైమోడ్పు లివ్వకమానరు. నిజానికి ఈమె గ్రామదేవత. జానపద దేవత. ప్రాగైతిహాసిక కాలంలో ప్రభవించి, ఐతిహాసిక యుగంలో జగన్మాతగా రూపం ధరించి జానపదులకు ఆపద్బాంధవురాలైంది. ఈమె అసలు గ్రామశక్తి అనడానికి తారుకాణగా ఆమె ఉండే గర్భగృహానికి ఈవలగా పోతురాజు బల్లెం ధరించి నిలిచి ఉండటం చూడవచ్చు. శక్తి గనుక కాలక్రమాన దుర్గతో అభేదం కలిగి దేవీ మహాత్మ్యంలోని కథలను స్వంతం చేసుకున్న మాతృదేవత ఈమె. పేరు కూడా క్రమంగా సంస్కృతీకరణం పొందినట్లు భావించకతప్పదు. చవుడేశ్వరీ నామం శబ్దసామ్యం వలన

చాముండేశ్వరీదేవిగా మారినట్లు భావించడం అసంగతం కాబోదు. కవిసార్వభౌముడు 'చమడేశ్వరీమహాశక్తి నగరు'ను పేర్కొనే ఉన్నాడు. ప్రాగైతిహాసిక కాలంనాటి యక్షిణి ఈమె. యక్షిణులే గ్రామదేవతలు.[3] మాధ్యమికయుగం నాటికి ఈమెకు గోపుర ప్రాకారసహిత దేవాలయాలు నిర్మితమైనాయి. ఈమె కథలతో నందవరీకుల చరిత్ర కలగలసిపోయి పరంపరగా వచ్చిన గాథలు ఒక తరహా జానపద పురాణంగా రూపొంది చివరకు పురాణశైలిలో, పద్యాలతో అద్భుతగాధలతో అర్వాచీనకాలంలో పవిత్రగ్రంథాలుగా రూపాంతరం చెందాయి. ఆర్వాచీన కాలం అంటే పదిహేడో శతాబ్దికి కొంచెం అటూ ఇటూ అని అర్థం.

చౌడేశ్వరీవిలాసమని నామాంతరం ఉన్న చాముండికావిలాసమనే రచన ఒకటి ఆదికవి 'నన్నయ్య' రచన గురించి క్రీ. శే. శ్రీ చాగంటి శేషయ్యగారు తెలియజేస్తున్నారు.[4] "దాదాపు నూటయిరువది పద్యములు గల చిన్న పుస్తకమును మూఁడాశ్వాసములుగా విభజించి" దానిని మహాప్రబంధమని గ్రంథకర్త వ్యవహరించాడు. "ఇందు నందవరీక బ్రాహ్మణులను గూర్చి ప్రథమాశ్వాసమునను, ద్వితీయ, తృతీయాశ్వాసముల యందు 'తొగట' కులమువారని చెప్పఁబడియెడి దేవాంగుల కథలును రచింపబడినవి" అని శ్రీ చాగంటివారిచ్చిన వివరాలు. ఇది నన్నయ రచన కాదని రుజావులు చూపించి వాదించడం శుద్ధ దండగ పని. మనకు ప్రసక్తమైంది నందవరీకుల వృత్తాంతమే కనుక ఈ గ్రంథాన్ని గురించి ఇక్కడ ప్రస్తావించవలసి వచ్చింది. కాని శ్రీ శేషయ్య గారు "తొగట కులమువారని చెప్పఁబడియెడి దేవాంగు" లనడం సరికాదు. తొగటలు, పద్మశాలియులు, దేవాంగులూ వేరు వేరు. వారి కథలూ వేరు. మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారంలో భద్రకవి లింగకవి రచన "దేవాంగ పురాణం" ఒకటుందని శ్రీ చాగంటి వారే ఇచ్చిన సమాచారం.[5]

మాచవరము పాపనామాత్యుడు 'నందవర చరిత్రము' అన్న రెండాశ్వాసాల పద్య కావ్యాన్ని శ్రీ చాగంటి శేషయ్యగారే తమ 'ఆంధ్రకవి తరంగిణి'లో సమీక్షించారు. నందరాజా కాశీ బ్రాహ్మణులకు నందవరాన్ని

అగ్రహారంగా ఇచ్చిన కథనూ, వారు నందవరీకులైన కథనూ ఈ పద్య కావ్యం వివరిస్తోంది. ''నందవర దానకాలము తెలియరాలేదు. కవి కాలము తెలియు వరకుఁ ప్రస్తుతము నీతఁడు క్రీ. శ. 1700–1750 నడుమ వాడని యనుకొందము''[6] అన్నారు శ్రీ చాగంటి వారు. నందవరదాన కాలం మనకు తెలిసే అవకాశం ఏ నాటికైనా లభిస్తుందని నేననుకోను. లభిస్తే సంతోషమే!

మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారాంలో ఉన్న 'చౌడేశ్వరీ మహాత్మ్యము' తాళపత్ర ప్రతి ఒకదాన్ని గురించి శ్రీ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారు తెలియజేశారు.[7] శ్రీ అన్నమాచార్యుల చరిత్ర సంబంధంగా నందవరీకుల వృత్తాంతమున్న ఈ గ్రంథాన్ని గురించి మొదటగా చెప్పింది వీరే. 'చౌడేశ్వరీ మహాత్మ్యము' లోని విషయాల నాధారం చేసుకొని నందవరీకుల చరిత్రను సంక్షిప్తంగా శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు అన్నమా చార్య శృంగారసంకీర్తనల సంపుటానికి రాసిన పీఠికలో తెలియజేశారు.[8] ఇది గౌని(ను) పల్లె రామప్పకవి రచన.

కోటి నారాయణకవి రచించిన ద్విపదకావ్యం నందవరీకుల చరిత్ర గురించి తెలియజేసేది ఒకటి ఉంది. ఇదే చరిత్రను మరొక ద్విపదకావ్యం అప్పరాజా నరసకవి రచితమైనది కూడా చెబుతోంది. ఇవికాక అత్తలూరి పాపనకవి రచనగా మరొక పద్యకావ్యం ఉంది.[9] శ్రీ చాగంటి శేషయ్యగారు అత్తలూరి పాపకవిని గురించి 'ఆంధ్రకవితరంగిణి' 14వ సంపుటంలో రాశారు గాని, అందులో అతడు నందవరీకుల చరిత్రను రాసినట్లు పేర్కొనలేదు. బహుశా వీరిరువురూ వేర్వేరు వ్యక్తులేమో!

'శ్రీ చాముండికా విలాసము' అన్న మరొక గ్రంథం శంకరయోగి రామకృష్ణకవి ప్రణీతమైనది. 1931లో జూలైలో భారతీముద్రణాలయము కర్నూలులో ముద్రితమైనది లభిస్తోంది. నందవరీకులకు కులనామ మిచ్చిన నందవరంలోని శ్రీ చౌడేశ్వరీదేవాలయ ధర్మకర్తా, వాహికర్తా అయిన శ్రీ అబ్బాయి వేంకటసుబ్బయ్య ఈ ముద్రిత ప్రతికి సంపాదకుడు. శంకరయోగి

రామకృష్ణకవి రచనలుగా 'చాముండికావిలాసము' 'శ్రీ చౌడేశ్వరులు' అన్న పేర్లతో మరికొన్ని ముద్రితగ్రంథాలున్నట్లూ, తనకు లభించిన తాళపత్రప్రతి సమగ్రంగా ఉన్నట్లూ సంపాదకుడు తన విన్నపములో తెలియజేశారు.

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి మిత్రులైన గుమ్మరాజా రామకవి గారు 1935లో 'శ్రీ చౌడేశ్వరీ మహాత్మ్యము' అనే మృదుమధురకావ్యమును రచించి ప్రకటించారు. దానికి శ్రీ రాళ్లపల్లి వారే 'ప్రస్తావన'ను సంతరించారు.[10] ఇవీ ఇప్పటికి తెలియవచ్చిన శ్రీ చౌడేశ్వరీ పురాణాల, నందవరీకుల చరిత్ర గ్రంథాల వివరాలు. ఇంకా కొన్ని ఉండవచ్చు. ఇన్ని గ్రంథాలు నందవరీకుల కులచరిత్రను గురించి ఉన్నాయంటే ఆశ్చర్యం కలగకమానదు.

ఏది ఏమైనా ఈ పురాణరూపం ధరించి దర్శన మిచ్చే 'కులపురాణాల' నుంచి కొంత సమాచారం సేకరించగల అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం పరిశీలనకు గ్రహించిన గ్రంథం శ్రీ అబ్బాయి వేంకటసుబ్బయ్య సంపాదకత్వాన వెలువడిన శంకరయోగి రామకృష్ణకవి రచన 'శ్రీ చాముండికా విలాసం'. ఈ గ్రంథం పద్యాలలో ఉన్నా శ్రేష్ఠమైన కవిత్వం కాదు. గ్రంథమంతా ప్రాచీన రచన కాకపోవచ్చునేమో ! అంటే ఇరవయ్యో శతాబ్దపు కైవాడం కొంత ఉండవచ్చు. కవి కాలనిర్ణయానికి ఆధారాలు లేవు. రచనలో ఛందో దోషాలూ అధికంగానే ఉన్నాయి. పరంపరగా వచ్చే గాథలను గ్రంథస్థం చేయడం వలన పరిశీలనార్హమౌతోంది. ఈ గ్రంథంలోని విషయాలను ఎంతవరకు ప్రమాణంగా తీసుకోవచ్చునన్నది ప్రశ్నగానే మిగలక తప్పదు గాని, కొన్ని కొన్ని చోట్ల చారిత్రకాధారాలతో సంవదించే విషయాలూ ఉన్నాయి. ఉదాహరణకు – ప్రసిద్ధులైన నందవరీకుల గురించి చెబుతూ –

తరువాత శ్రీ శేషగిరి వేంకటేశ్వర
 దివ్యపాదాంబుజేం దిందిరాయ
మానమానసుఁడభిమానశాలియు నగు
 తాళ్లపాకన్నయ్య ధర్మమూర్తి

యగుచు నందవరాగ్రహార స్థితానేక
  విద్వజ్జనానందవిహరణుఁడయి
యా వర నరసింహ దేవరాయలవారి
  సముఖంబునను బూజ్యతను వహించి
పేరు వాసికెల్ల వారలు మెచ్చఁగా
సర్వ మాన్యముగ నొసంగి దాని
నంతఁ గామరాజా నపుడు తిప్పనకవి
రాజా లెన్నుచుండ రంగుమీట''

చిన్నన్న రచన 'అన్నమాచార్య చరిత్రము'ను-శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు ప్రథమంగా 1949వ సంవత్సరంలో విపుల పీఠికాసహితంగా పరిష్కరించి ప్రకటించారు. ఆ గ్రంథం ముద్రితమైనదాకా అన్నమయ్య, సాళువ నరసింహుల మధ్య ఉన్న పరిచయాన్ని గురించి తెలియరాలేదు. అందువల్ల 1931లో అచ్చయిన 'శ్రీ చాముండికావిలాసం' లోని పై పద్యంలో వారిరువురి పరిచయం ప్రసక్తమైనందువల్ల ఆ పద్యాన్ని నమ్మదగిందిగానే భావించాలి. అదీకాక నందవరీకులను గురించిన వృత్తాంతాన్ని ఈ గ్రంథంలో ఉన్నట్లుగానే గౌను (ని) పల్లె రామప్పకవి రచన 'చౌడేశ్వరీ మహాత్మ్యము' లో కూడా ఉన్నందువల్ల రెండు గ్రంథాలకూ ఆధారం పరంపరగా వచ్చిన గాథలేనని నమ్మక తప్పదు కూడా. పద్మశాలి కులస్థులతో తాళ్లపాక వారికున్న గురుశిష్య సంబంధాలు శాసనపరంగా కూడా తెలుస్తున్నాయి. అలాగే శ్రీ వేంకటేశ్వరుడితో పద్మశాలీల కున్న అనుబంధాన్ని గురించి కూడా కొన్ని విశేషాలు తెలుస్తున్నాయి. అందువల్ల రేఖామాత్రంగా 'శ్రీ చాముండికావిలాసం' లో ఆయా విషయాలకు సంబంధించిన గాథలను ప్రస్తావించుకుని విశ్లేషించి చూడవలసి ఉంది.

నందరాజా కథ :

పాండవుల సంతతికి చెందిన ఉత్తుంగభుజాడనే రాజాకూ, రాణి

చతురమతికీ తనయుడు నందుడు. నందవరం ఉత్తుంగభుజాడి రాజధాని. ఒకప్పుడు నందుడు అహోబలక్షేత్రానికి వెళ్లి అక్కడి నృసింహస్వామిని పూజించి ఆ రాత్రి నిద్రిస్తున్న సమయాన నృసింహుడు ప్రత్యక్షమై దత్తయోగీంద్రుణ్ణి ధ్యానం చేస్తే నీ కోర్కెలు తీర్చగలడని చెబుతాడు. మూడు రోజులు ధ్యానించగా దత్తముని ప్రత్యక్షమై పాదుకాద్వయాన్ని ఇచ్చి 'వీటిని పూజించి ధరించు. నీ వెక్కడకు వెళ్లాలనుకుంటే అక్కడకు వెళ్లగలవు' అంటూ వరాన్నిచ్చి అంతర్హితుడౌతాడు.

ఒకరోజున మంత్ర జపం చేసి పాదుకలు ధరించి కాశీకి వెళ్లి గంగలో స్నానం చేసి శ్రీ విశాలాక్షీ మనోహరుణ్ణి సేవించుకొని తిరిగి వచ్చాడు. ఈ విధంగా గయ ప్రయాగ శేషాద్రి కంచి శ్రీరంగం రామేశ్వరం మొదలయిన క్షేత్రాలను దర్శించి వస్తూ ఉండేవాడు. ఒకరాత్రి రాణి శశిరేఖ భర్త పక్కమీద లేకపోవడం గమనించి అనుమానించి మరురాత్రి భర్త బయలుదేరుతుండగా ఆపి నిలదీసి అడుగుతుంది. చివరకు నందుడు నిజం చెప్పక తప్పలేదు. చివరకు శశిరేఖాసహితుడై కాశీకి వెళతాడు. అక్కడ విశ్వేశ్వరుడి దర్శనం చేసుకొని తిరిగి బయలుదేరే సమయానికి ఆమె ఋతుమతి కావడం వలన పాదుకల పవిత్రత చెడి విఘ్న మేర్పడుతుంది. ఈ ఇబ్బందికి చింతిస్తూండగా పెద్దిభట్టు మొదలైన ఏడువందల ఇండ్ల భూసురులు వారిని చూసి సంగతి తెలుసుకొని ఉపాయం చెబుతారు. అప్పుడు నందరాజు నందవరం రాజ్యంలోని గ్రామాలను ఆ బ్రాహ్మణులకు అగ్రహారంగా ఇస్తానని అన్నాడు. ఆ మాటను మరువవద్దనీ కొంతకాలం తరువాత తాము రాగలమని చెప్పి రాణిని పవిత్రను చేసి నందవరం తిరిగి చేరడానికి అవకాశం కల్పిస్తారు. కొంతకాలానికి కాశీపుర ప్రాంతంలో ఘోర క్షామం సంభవించినందువల్ల ఆ బ్రాహ్మణులు నందవరం వచ్చి కాశీలో రాజు ఇచ్చిన మాటను జ్ఞాపకం చేస్తారు. రాజు సాక్ష్య మడుగుతాడు. అప్పుడు బ్రాహ్మణులు తిరిగి కాశీకి వెళ్లి శ్రీ చౌడేశ్వరీదేవిని ప్రార్థించగా, ఆమె వెనుకకు చూడకుండా నందవరానికి వెళ్లండి

అని బయలుదేరుతుంది. ఆమెతో ''తొగపూవు లందు నయ్యగజాత కృపచేతం బ్రభవ మందిన మహాప్రబలులైన తొగటవీరులు'' స్తోత్రపాఠాలు చేస్తూ ముందు నడవగా ఆమె బయలుదేరి వచ్చి కాశీబ్రాహ్మణుల పక్షాన సాక్ష్యం పలుకు తుంది. కాశీ బ్రాహ్మణులు చౌడేశ్వరిని నందవరంలో నిలిపి పూజించుకొంటూ నందవర గ్రామాలను అగ్రహారాలుగా స్వీకరించడంవల్ల నందవరీకులుగా పేరు పొందుతారు. ఇదీ నందవరీకుల కథ. ఇందులో మరొక ఉపకథ ఆరువేల నియోగికి సంబంధించింది ఉన్నది.

దుగ్గనప్పయ్య వృత్తాంతం :

కాశీ నుండి ఏడువందల మంది బ్రాహ్మణులతో పాటు ఆర్వేలనియోగి దుగ్గనప్పయ్య తన కుటుంబంతో వెంటనంటి వచ్చినట్టు 'శ్రీ చాముండికా విలాసం' చెప్పిన కథ. ఈ కథ శ్రీ చౌడేశ్వరీ మహాత్మ్యంలోనూ ఉన్నది. నందరాజు కాశీ బ్రాహ్మణులకు నందవర గ్రామాలు అగ్రహారాలుగా బహూకరించినప్పుడు, దుగ్గనప్పయ్య తన భాగం తనకు రావాలనీ తన కూతుళ్లను వారి కుటుంబాలలోనివారికి ఇస్తాననీ అనగా కాశీ బ్రాహ్మణులు అగ్రహారంలో నీ కివ్వవలసిన భాగం నీకిస్తామనీ కూతుళ్లను స్వీకరించడం వల్ల కులసంకరం జరుగుతుంది కాబట్టి అంగీకరించమనీ అనగా దుగ్గనప్పయ్య తన కుటుంబంతోసహా అగ్నిప్రవేశం చేశాడు. అగ్ని మధ్యం నుండి దుగ్గనప్పయ్య 'ముప్పదేండ్లకు పెళ్లి, మూడవజాము కూడు, దారిద్ర్యం' కాశీ బ్రాహ్మణులకు కలగాలని శాపమిచ్చాడు. అందుకు కాశీ బ్రాహ్మణులు కలత చెంది శ్రీ చౌడేశ్వరిని ప్రార్థించగా ఆ జగజ్జనని 'ఇది మీ పూర్వజన్మ కర్మఫలం. ఇందుకు బాధపడవలసిన అవసరం లేదు. దుగ్గనప్పయ్య వైదికాగ్ని ప్రవేశం చేశాడు గనక దేవత్వం పొందాడు. బ్రాహ్మణ శాపం అంగీకరించక తప్పదు. దుగ్గనప్పయ్య ఇచ్చినది శాపరూపమైన వరమే. అతడు నిందింప దగినవాడు కాదు. 'దాన పరాక్రమంబులు కలిగి సంస్కృత కావ్యనాటకా లంకార కవిత్వ రచనా సామర్థ్యంబున వెలసి సకల రాజాస్థాన గురుత్వంబునం

జెలంగి లేఖక గణిక ధర్మంబునన్ గల సారంబు గ్రహించి నందవరీకులను నామంబున వెలయుదురు .... భార్గవ రామ ద్రోణ కృపాశ్వత్థామాదులు వేద శాస్త్రంబులందు, ధనుర్వేదంబు నందునుభయ విధంబుల సామర్థ్యులై ఉండి రనుమాట తెలియదె !' అని చెప్పి భవిష్యత్తులో అగ్రహారాలూ క్షేత్రవృత్తులూ దుర్మార్గుల వల్ల భంగమౌతాయి. అప్పుడు చిక్కణ ఒడెయరు అనే ఉత్తముడు కాలభైరవాంశతో నందవరీక వంశంలో జన్మించి, తరు తటాకాది సప్తసంతానా లకు కారకుడై ధర్మమార్గం అనుసరించి నందవరీక వంశానికి బ్రాహ్మ హత్యా దోషాన్ని తొలగిస్తాడు అంటూ వర మిచ్చింది. ఇంక నందవరీకుల చరిత్రలో శ్రీ చౌడేశ్వరీ మహిమలతో ముడిపడిన తొగట వీరులుగా వ్యవహృతులైన పద్మశాలియుల కథను చూడాలి.

తొగటవీరులు - జన్మవృత్తాంతం :

ఇక్ష్వాకు కులంలో పుట్టిన పుష్పాండజాడనే ముని సంతానం కోసం హిమవత్పర్వత ప్రాంతాన పరాశక్తిని తలచి తపస్సు చేశాడు. శ్రీ పరాశక్తి ప్రత్యక్షమై కావలసినది కోరుకొమ్మనగా తనకు మానసపుత్రులనేకులు కావాలన్నాడు. అప్పుడు శక్తి అక్షత లిచ్చి సరోవరంలో చల్లమన్నది. ఆ అక్షతలను పుష్పాండజాడు ఆ సరోవరంలోని తొగలపై జల్లగా వాటి నుంచి వజ్రకాయులూ, బాహుబలాఢ్యులూ, బాణచాపధారులూ అయిన తొగట వీరులు ఉద్భవించి వచ్చి శ్రీ పరాశక్తికి నమస్కరించి మొక్కి వరుస తండ్రి అయిన పుష్పాండజాడి దగ్గరకు రాగా ఆయన వారిని జగదంబకు సహాయంగా యుద్ధానికి వెళ్లమన్నాడు. మున్నూట ఇరువది వీరులు అంబ వెంట మహిషాసురుడి మీదకు యుద్ధానికి వెళ్లారు.

తొగటలు దేవికి అర్చకులైన విధము :

ఒకరోజున శ్రీ చాముండేశ్వరి నందవరీక బ్రాహ్మణులందరికీ కలలో కనబడి ఇది కలియుగం గనుక నాకు మధుమాంసాలు నైవేద్యంగా కావాలి. కృతయుగంలో మహిషాసురాది రాక్షస సంహారంలో పుష్పాండజాడనే తొగట

ముని సంతతివారు నాకు సహాయులై ఉండి కార్యం నిర్వర్తించారు. కనుక కలియుగంలో మీ పూజలు అంగీకరిస్తానని మాట ఇచ్చాను. ఆ కారణాన ఇక మీరు నన్ను పూజించడానికి తొగటలను నియమించవలసిందని చెప్పి అంతర్థిత్తురాలైంది. అప్పుడు నందవరీకులు ఆ విధంగా చేయనిశ్చయించి తమ వెంట ప్రతినిత్యం శ్రీ చాముండేశ్వరి కోవెలకు వచ్చి దేవికి సేవలు చేస్తూ ఉండే ఓబుళేశుడనే తొగటవీరుడు ఈ పనికి తగినవాడని నిశ్చయించి నియమించారు. నందవరీకులను ఎప్పుడూ గురువులుగా సంభావిస్తూ వారికి విధేయులై ఉండమని తొగటవీరులకు దేవి ఆదేశమిచ్చింది.

తొగటవీరులకు బిరుదులు లభించిన విధం :

పానుగల్లులో హరిభక్తుడైన ఏరువరాజు రాజ్యం చేస్తుండగా గజపతి చికురదేవరాయలు వచ్చి పానుగల్లును ముట్టడించారు. శత్రువులను ఎదుర్కొనడానికి తన బలం చాలక మంత్రి సలహా మీద ఏరువరాయలు తొగటలను సహాయం చేయమని కోరగా వారు ఏరువరాయల కున్న బిరుదులను ఇస్తే సహాయం చెయ్యగలమని షరతు విధించారు. రాజా అంగీకరించాడు. తొగటలు వెళ్లి శ్రీ చౌడేశ్వరీ దేవిని సెలవడుగగా ఆమె మొహం తిప్పుకొంది. తొగటవీరులు గండకత్తెరలతో తమ తలలుత్తరించుకొని దేవికి సమర్పించారు. దేవి వారి భక్తికి మెచ్చి బ్రతికించి జయం కలుగుతుందని పలికి యుద్ధానికి అనుమతి నివ్వగా వారు వెళ్లి యుద్ధం చేసి శత్రువులను తరిమి మాట నిలబెట్టుకోగా ఏరువరాయలు తన బిరుదులనూ, ఛత్రచామర అందోళికాది రాజసన్మాన సూచకాలైన బహుమానాల నిచ్చి సత్కరించాడు.

'ఓరుగంటి ప్రతాపరుద్రుడి పురాన' దేవికి జ్యోత్యుత్సవం జరుపడానికై వెళ్లగా, అక్కడ దేగలనాగడు మొదలైన దేవాంగులు తొగటల బిరుదులకు అభ్యంతరం తెలిపారు. తగవు పెరిగి రాజా దగ్గరకు వెళ్లగా, రాజా పెద్ద గుండం చేయించి అందులో ఉక్కుతో నిర్మించిన గుర్రాన్నుంచి, అది ఎర్రగా కాలిన తరువాత దానిని అధిరోహించినవారికి బిరుదులు చెల్లగలవని చెప్పగా అది

విని జాంఢ్రవారు రంగం నుంచి నిష్క్రమించారు. అమ్మవారిని తలచి తొగట వీరులు గుర్రమెక్కి తమ బిరుదులను కాపాడుకొన్నారు.

ఇవీ మనం గమనించవలసిన కథలు.

'శ్రీ చాముండికావిలాస' మిచ్చిన ఈ గాథలను విశ్లేషించి చూస్తే చాలా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తాయి. నేటికీ జానపదులలో దేవి చౌడమ్మగానే వ్యవహృతమౌతోంది. చౌడమ్మ పేరు చాముండేశ్వరిగా మారి ఉండవచ్చని ముందే చెప్పడం జరిగింది. ఈ గ్రామదేవతల పేర్ల విషయంలో ఈ విధమైన సంస్కృతీకరణం నేటికీ సాగుతూనే ఉందని విశాఖ పట్టణంలో కనిపించే పైడమ్మ-పైడిమాంబ, పోలమ్మ-పోలమాంబ, నూకాలమ్మ-నూకాంబిక అన్న పేర్లు ధృవపరుస్తున్నాయి. ప్రాచీన కాలంలో పోలమ్మ-ప్రోలమాంబ, వేమాలమ్మ – వేమాంబిక మొదలయిన పేర్లు కూడా ఈ విధంగా ఏర్పడినవే. మాండలిక వృత్తిపదకోశం (వ్యవసాయం)లో చౌడమ్మ: ఒక గ్రామదేవత; పిండిముద్దలో జోతులు వెలిగించి నెత్తిన బెట్టుకొని ఆడుతూ పాడుతూ ఈ దేవతను కొలుపులు చేస్తారు[12] అని వివరిస్తున్నది. 'శ్రీ చాముండికావిలాసం' లో ఈ జోతుల కొలుపునే జ్యోత్యుత్సవం అని వ్యవహరించడం జరిగింది. గ్రామదేవతలకు జ్యోతులతో కాగడాలతో కొలుపులు సాగించడం సామాన్యమే. సింహాచలం దగ్గర గుర్రాలమ్మ కొలుపులోనూ, వాల్తేరులోని కనకమ్మ పండగలోనూ కాగడాలతో కొలుపు చేస్తారు. ఒంగోలు ప్రాంతంలో అంకమ్మకు జరిగే పాఁజా కొలుపు (పాఁజా – పావుంజా – పంజా-కాగడా) లిటువంటివే. చౌడమ్మ గ్రామదేవత అనడంలో సందేహం లేదు. కాలక్రమాన దుర్గాశక్తి కథలను ఈమెకు వప్పగించి ఈమెను చాముండేశ్వరిగా తీర్చిదిద్దడం సంస్కృతీకరణంలోని భాగమే.

మాధ్యమిక యుగంలో గ్రామశక్తుల ప్రభావం జానపదుల పరిధిని దాటి నాగరిక ప్రపంచాన్ని కూడా ప్రభావితం చెయ్యడం గమనార్హం. కాకతీయ సామ్రాజ్యాధిపతులకు వంశనామ మిచ్చిన కాకతమ్మ గ్రామదేవతే. ఈమె పేరుకు

వ్యుత్పత్తి చెప్పుకోవడం నేటికీ పండితులకు ఇబ్బంది కలిగించే విషయమే. 'కాకతమ్మకు సైదోడు యేకవీర'ను యెల్లమ్మగా జానపదులు వ్యవహరిస్తున్నారు. ఈ శక్తులకు కునులపండుగగా జరిగిన ఉత్సవాలను వీనుల విందుగా వర్ణించింది క్రీడాభిరామం. ఓరుగంటి గాథలు పొరుగింటికి కూడా వ్యాపించడం ఆశ్చర్యకరమైన విషయం. కన్నడంలో చెన్నకవి క్రీ.శ. 1700 రాసిన 'గుండు బ్రహ్మయ్య చరిత్ర' అని త్రిపదకావ్యంలో కాకతీయ గణపతి చక్రవర్తి, ఎల్లమ్మ భక్తులైన 'చౌడికెయవరు' అని వ్యవహృతులయే జానపద గాయకులు పాడే 'బాలరామన సాంగత్యం'లో కాకతి ప్రతాప రుద్రుడూ దర్శనమిస్తాడు. 'బాలరామన సాంగత్య' పదంలో ప్రతాప రుద్రుడు ఎల్లమ్మ భక్తుడైన విధం వర్ణితమైంది.[13] రెడ్డిరాజులు మూలగూరమ్మ భక్తులు. కొండవీటి దుర్గంలో వెలసిన వేమాలమ్మ[14] రెడ్డిరాజులకే కాక శివయోగి వేమనకు కూడా పేరు నిచ్చిన దేవత. కృష్ణదేవరాయలకు సంతానం కలగాలని కోరుతూ ఒక రాజోద్యోగి వేయించిన శాసనం హిందూపురం దగ్గర ఉన్న చోళసముద్రం గ్రామంలోని చౌడేశ్వరీ ఆలయంలో కానవస్తుంది. ఈ గ్రామదేవతల పేర్లు సంస్కృతీకరణం పొందటం బహుశా మాధ్యమిక యుగాలలోనే జరిగి ఉండాలి.

ఒకప్పుడు బనగానపల్లి సంస్థానంలో ఉండి నేటి కర్నూలు జిల్లాలోని గ్రామమైన నందవరం నందవరీకులకు పేరు నిచ్చిన గ్రామంగా భావించడం జరుగుతున్నది గాని, శ్రీ చౌడేశ్వరి కథ ప్రకారం వీరు కాశీబ్రాహ్మణులైనట్టుండడం వలన ఉత్తరభారతం నుంచి దక్షిణానికి వలస వచ్చినవారై ఉండాలి. అన్నమయ తన 'శృంగారమంజరి'లో తనను తాను 'నందాపురీవంశ నాయకోత్తముడి'గా చెప్పుకోవడం చూస్తే వీరి అసలు గ్రామం నందాపురమా అన్న సందేహం కలగక మానదు. నేటి ఒరిస్సాలో భాగమైన జయపుర సంస్థానానికి పూర్వకాలపు రాజధాని నందాపురం. ఆ నందాపురానికి సమీపాననే కాశీపురం ఉన్నది.[15] నందవరీకుల తొలి నివాసం ఆ ప్రాంతమా అన్న భావం కలగడానికి వీలున్నది.

వొగినొడ్డె భాషలాడి వొడ్డెవాఁడనైతిని
తెగి తెలుఁగాడనేర్చి తెలుఁగువాఁడనైతి[16]

అన్న అన్నమయ మాటలు ఈ విషయాన్నే సూచిస్తున్నాయా కాక గజపతుల స్నేహం వల్ల అబ్బిన ఒడ్డె భాషను గురించిన ప్రస్తావనా అన్నది సందేహాస్పదమే. అయినా అన్నమయ పుట్టి పెరిగింది పొత్తపి రాజ్యంలో గదా!

'... కేసరి వంశం రాజుల పాలన ఆరంభమైననాటికి ఒడిశాలో బ్రాహ్మణ ధర్మం పాలించే బ్రాహ్మలు కరువయి, యయాతి కేసరి క్రీ.శ. 474-527 కన్యాకుబ్జం నించి వేదశాస్త్రాలు నేర్చిన పదివేల మంది బ్రాహ్మల్ని తీసుకు వచ్చి ఒడిశాలో స్థిరవసతి కల్పించాడు. అప్పటికి బౌద్ధపక్షపాతులుగా ఉండిన ఓఢ్ర బ్రాహ్మల్ని శూద్ర బ్రాహ్మలుగా నిర్ణయించారు.... వీరిని హళువా బ్రాహ్మలనీ అంటారు' అని కీ.శే. పురిపండా అప్పలస్వామిగారు రాశారు.[17] బ్రాహ్మణశాఖ లన్నిటిలోనూ ఏ రాష్ట్రంవారైనా శాఖల మధ్య సహపంక్తి భోజనాలూ, వివాహాది సంబంధాలూ కూడా లేకుండా ఉండటం విదితమైన సత్యమే. దానికి కారణంగా ఇలాంటి అభ్యంతరాలను చూపడం కూడా పరిపాటే. నందవరీకులు ఇలాంటి ఇబ్బందినే ఎదుర్కొన్నారన్నది కేవలం ఊహలోనే మిగిలిపోతుంది.

నందవరీకులలో వాడుకలో ఉన్న ఇంటిపేర్లు యాభైవొక్కటి దాకా లభిస్తున్నాయి.[18] ఈ ఇంటిపేర్లు గలవారిలో నందవరీక నియోగులుగా వ్యవహృతులైనవారు 18 ఇంటిపేర్లు కలవారు కాగా, ఒక్క తాళ్లపాక ఇంటి పేరు గలవారు మాత్రం నందవరీక వైదికులుగా వ్యవహృతులైనారు.[19] కేవలం నందవరీకులుగా వ్యవహృతులైనవారు 32 ఇంటిపేర్లవారున్నారు. శ్రీమాన్ రాళ్లపల్లివారు అన్నమయను నందవరీక నియోగిగా పేర్కొన్నారు. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తాళ్లపాక వారిని నందవరీక వైదికులుగానే గుర్తించారు.[20] బహుశా వేటూరి వారు రేవణూరి వెంకటాచార్యుడి మాటను బట్టి ఆ మాటను

అని ఉంటారు'. 'శకుంతలాపరిణయ'మనే మూడాశ్వాసాల శృంగార ప్రబంధకర్త రేవణూరి వేంకటాచార్యుడు అన్నమయకు దౌహిత్రుడు. తనను గురించి చెప్పుకొంటూ –

శ్రీవత్సాన్వయు రేవణూరి కులజాన్ శ్రీపాదరేణుప్రభా
సావర్ణ్యస్ఫుటకావ్యకల్పక కవిన్ సంకీర్తనాచార్య పు
త్రీ వంశోత్తము నందవైదిక బుధాధిప్రోక్తవృత్తి స్వయం
భావున్ దిర్మలకొండయార్యసుతు శుంభద్వేంకటాభిఖ్యునిన్[21]

అంటూ 'నందవైదికుని'గా చెప్పుకొన్నాడు. అంటే అన్నమయ కూడా 'నందవైదికుడి' గానే ఆనాడు ప్రసిద్ధిలో ఉన్నాడా అన్నది ప్రశ్న. ఇందుకు జవాబు లేదు. అయినా శ్రీ వైష్ణవం స్వీకరించిన తరువాత ఇంకా నియోగి వైదీకి తేడాలెలాగ కొనసాగాయో అర్థం కాదు. అయితే అన్నమయ నాటికి నందవరీకులకు తాము వైదికులమో నియోగులమో తేల్చుకోవలసిన అవసరం లేకపోయి ఉండవచ్చునేమో !

శ్రీ చాగంటి శేషయ్యగారు 'ఈ కవి గృహనామము కర్నూలు మండల మందటి కోయిలకంట్ల తాలూకా రేవణూరు అను గ్రామమును బట్టి వచ్చి ఉండును. ఈతడా గ్రామ నివాసినయ్యై ఉండవచ్చును. కృత్యాది పద్యములలో 'పెద్దిభట్ట కులవార్ధి నిశాకర' అని చెప్పుకొని యున్నాడు. దీనిని బట్టి మొదట నీతని ఇంటిపేరు పెద్దిభట్టవార్తై ఉండునా యని సంశయము కలుగుచున్నది, కాని నందవరీకులలో మొదట నా ప్రాంతమునకు వచ్చినవారి పేరులనుదా హరించి తామా వంశములలోని వారమని చెప్పుకొను నాచారమున్నట్లు గన్పట్టెడిని. అది సత్యమైన గావచ్చును. కాదేని మొదట పెద్దిభట్టవార్తై పిదప రేవణూరు నివాసముగా నేర్పరచుకొనుటచే రేవణూరి వారైనఁ గావచ్చును''. శ్రీ చాగంటి వారి ఊహ సహేతుకంగానే సాగింది. సాధారణంగా బ్రాహ్మణులలో ఇంటిపేరుతోపాటు గోత్రం, సూత్రం, వేదశాఖ చెప్పుకొనడం సాంప్రదాయం. నందవరీకులకు మాత్రం 'గోత్రములకు మూలపురుషుల'ను కూడా చెప్పు

కొనడం పరిపాటి. నందరాజా కాశీయాత్ర సందర్భంలో సమస్యను పరిష్కరించిన ఏనూరు విప్రులలో పెద్దిభట్టు వొకాయన ఉన్నాడు. శ్రీ చాముండికా విలాసంలోని –

సువిచారపరాయణుఁడగు
నవధానము పెద్దిభట్టు నధికుండు గదా
భువి శ్రీవత్సగోత్రో
ద్భవులకుఁ దగ నూరుయిండ్లవారికి వెలసెన్

అన్న పద్యం పై సమస్యను నిస్సందేహంగా పరిష్కరిస్తున్నది. రేవణూరి వేంకటాచార్యుడు శ్రీవత్సగోత్రోద్భవుడే. కాని శ్రీవత్సగోత్రులయిన రేవణూరి వారు ఈనాడు నియోగులుగా ఉన్నారు![22]

అన్నమయ అశ్వలాయన సూత్రుడూ భారద్వాజగోత్రుడూ, ఋగ్వేదీ. నందవరీకుల పద్ధతి ననుసరించి వీరి 'గోత్ర మూలపురుషుడు' శ్రీధరభట్టు అని శ్రీ చాముండికావిలాసం వలన తెలుస్తున్నది గాని ఈ మూల పురుషుడి స్మరణ తాళ్లపాక వారి శాసనాలలో యెందులోనూ కనిపించదు. వైష్ణవాన్ని స్వీకరించిన తరువాత వీళ్లు మూలపురుషుణ్ణి పేర్కొనే ఆచారాన్ని వదిలి ఉంటారు.

దుగ్గనప్పయ్య వృత్తాంతాన్ని చెప్పి శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు "ఆది మొదలు ఈ వైదిక బ్రాహ్మణ కుటుంబములన్నియు నందవరీకులు అను నియోగిబ్రాహ్మణులుగా ఆంధ్రదేశమున వ్యవహరించబడుచున్నారు. నిజమునకు వీరు శుద్ధ వైదికశాఖకు చెందినవారు. నందరాజుచే కొనిరాబడిన వైదికులు గావున 'నందవైదికులు' అని నందవరమున నెలకొన్నవారు గావున 'నందవరీకులు' అని ఈ రెండు పేర్లను నేటికి తడబాటులో నున్నవి" అన్నారు.[23] ఏది ఏమైనా తడబాటు మాత్రం నిజంగానే ఉంది. శ్రీ చాగంటి వారు '... కొందరు లౌక్యవృత్తిఁగైకొని నియోగులైరి. వైదికవృత్తి యందుండి

వైదికులైరి. అల్లసాని పెద్దన, రాయని భాస్కరుడు, గుంటుపల్లి భాస్కరుడు మొదలగువారు నందవరీక నియోగులు. తాళ్లపాక కవులు నందవరీక వైదికులు' అంటారు.[24] ఈ తేడాలు లౌక్యవృత్తినీ వైదికవృత్తినీ స్వీకరించి నందువల్ల ఏర్పడినవి కావు. నిజానికి దుగ్గనప్పయ్య ఆరువేల నియోగే అయినా, నందవరీకులను ఆగ్రహంతో శపించినా, ఆ తరువాత దేవి అనుగ్రహించినా అసలు గ్రంథంలో వైదికులు నియోగులుగా మారిన ప్రస్తావనే లేదు. ఉన్న అయోమయాన్ని వివరించడానికే ఈ కథను వాడుకొన్నారన డానికి కూడా అవకాశం లేదు. దుగ్గనప్పయ్య శాపం వలన నందవరీకులకు పేదరికమూ, ముష్ఫయ్యోయేట పెళ్లీ, మూడవజాము భోజనమూ మాత్రమే ప్రాప్తించాయి, శాఖ మారలేదు.

దీనికి కారణాల కోసం పెద్దగా అన్వేషించవలసిన అవసరం లేదని నేననుకొంటున్నాను. నందవరీకులు ఆంధ్రదేశానికి ఉత్తర ప్రాంతం నుంచి వలస వచ్చినవారు. తెలుగు భాషను మాతృభాషగా స్వీకరించినా, స్థానికమైన ఏదో ఒక బ్రాహ్మణ శాఖలో చేరితేనేకాని గుర్తింపు దొరకడం కష్టం.

సాధారణంగా ఆంధ్రదేశీయులైన బ్రాహ్మణులు దాక్షిణాత్య పంచ ద్రావిడులుగా వ్యవహృతులౌతున్నారు. వైదిక సాంప్రదాయానుసారం వీరు ఋగ్వేదులుగా, యజుర్వేదులుగా విభాగితులైన ఉన్నారు. కాలక్రమేణా వీరిలో వేదవిహిత ధర్మాల ననుసరించేవారు వైదికులుగా, రాజ్యాంగ విధులలో పాల్గొంటూ రాజకీయ పదవులను చేబట్టినవారిని నియోగులుగా భావించడం వలన ఆంధ్రదేశంలోని బ్రాహ్మణశాఖలన్నీ నియోగి, వైదీకి అన్న రెండు ప్రధాన తెగలుగా విడిపోయారు. పదమూడవ శతాబ్దపు ఆఖరి పాదంలోనూ, పధ్నాలుగో శతాబ్దపు తొలి పాదంలోనూ బ్రాహ్మణులు తమకు తాముగా నియోగులుగా, వైదికులుగా చెప్పుకొనే ధోరణి ప్రబలింది.[25] వీళ్లు వొకరి నొకరిని తక్కువగా చూడటం వలన ఈ రెండు ప్రధానశాఖల మధ్య వివాహాది సంబంధాలు అంతరించిపోయి వేర్పాటు ప్రబలమైపోయింది.

'ఈ నియోగి, వైదిక భేదము క్రీస్తుశకము పదమూడవ శతాబ్దము నుండి ఆరంభమై క్రమముగా దృఢపడినది. ఆరంభములో ఈ రెండు శాఖల వారికిని అంతగా విభేదము పాటింపబడలేదు. కాని రాను రాను, వైదికులు వైదికధర్మపరాయణులును, నియోగులు రాజకార్యప్రవృత్తులును అయిన కొలది ఈ శాఖలకు ఎడ మెక్కువ య్యైనది[28] అంటారు. కీ. శే. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు. ఆంధ్రదేశంలోని బ్రాహ్మణశాఖలన్నీ ఈ రెండు వర్గాలలో ఏదో ఒక వర్గంలో చేరవలసిన స్థితి ఏర్పడింది.

వైదికధర్మం, అందులోనూ బ్రాహ్మణ వ్యవస్థ అందరాని, ఆచరణ సాధ్యం కాని ఆదర్శాలను కాలక్రమేణా రూపొందించుకొని, చివరకు కాల ప్రవాహంలో ఎదురీదవలసి వచ్చి, ఓడిపోయి సనాతనాచారాలకు కొత్త వ్యాఖ్యానాలు చెప్పుకోవడంలో విభేదాలు తలెత్తడం సహజమే. పాతకాలపు విలువలు మారిపోయినప్పుడల్లా కొత్త బ్రాహ్మణశాఖలు పుట్టుకొచ్చినట్లు కనిపిస్తున్నది. ఈ సనాతనాచారాల శైథిల్యాన్ని గమనించి బాధపడడమూ మన పురాణాలలో కావ్యాలలో కనిపిస్తూనే ఉన్నది. మాధ్యమిక యుగాలలో విమతస్థుల దండయాత్రలలో హిందూ వ్యవస్థలోని బలహీనతలు తమ పాత్రను నిర్వహించి హిందువులలో కొంతలో కొంత ఆత్మవిచారానికి దోహదం చేశాయి. ఆ ఆత్మవిచార ఫలితంగా, అనామకులుగానే మిగిలిపోయిన సంస్కర్తల కృషి ఫలితంగా ప్రజల ఆచారవ్యవహారాలలో మార్పులు వచ్చి కొత్త తరహా కులకట్టుబాట్లు అమలులోకి వచ్చాయి. కులాలమధ్య, శాఖల మధ్య పాత సంబంధాలు తెగిపోయి కొత్త సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ మార్పులను గుర్తించలేని వారికి ఇదంతా అరాజకంగా కనిపించడంలో వింత లేదు. భవిష్యత్తును గురించే చెప్పినట్లు చెప్పినా, వరాహపురాణం తన కాలపు విశేషాలనే తెలిపిందనుకుంటే - ఆ పురాణంలోని ఈ వచనం నాటి సంక్షోభాన్నీ, భావ సంఘర్షణల ఫలితాన్నీ రేఖామాత్రంగానైనా సూచిస్తోందనుకోవచ్చు.

'... తమోబహుళంబగు కలియుగంబున భూసురులు
దోసంబున కోసరింపక వేదమార్గ పరిత్యాగంబును నగమ్యాగమనాను
రాగంబును గన్యావిక్రయ వ్యవహారంబును నసత్య వ్యాపారంబును
మొదలైన దురాచారంబుల మెలంగుదు రాకారణంబున
దరిద్రులై శూద్రాదుల సేవింపుదురు. బాహుజాలు
ధనలాభ లోభంబున బ్రాహ్మణాది హింసకు రోయక
పాయక దురితంబులు చేయుదురు'.[27]

బ్రాహ్మణుల పతనాన్ని పై వచనం కొంతలో కొంత సక్రమంగానే చూపింది. అయితే అందుకు కారణాలేమిటని ఆలోచించే అవకాశం ఆ పురాణంలో లభించలేదు. సంఘంలో కేవలం అత్యున్నత ధనికవర్గంలో మాత్రమే ఆచారంగా ఏర్పడిన సతీసహగమనాన్ని కవిసార్వభౌముడు కాశీ ఖండంలో ప్రచారం చేయడం గమనార్హం.[28] అంతరించపోతూన్న ఒక ఆచారాన్ని శ్రీనాథుడు నిలబెట్టాలని ప్రయత్నిస్తూన్న కాలంలోనే వైష్ణవం ముఖ్యంగా తెంగళై తెగవారు వితంతువులకు శిరోముండనాన్ని సైతం నిషేధించడం బట్టి ఆనాటి సంఘర్షణలను అర్థం చేసుకోవచ్చు. రజస్వలానంతర వివాహాలను ఆచరించడమూ, వితంతువులకు శిరోముండనం చెయ్య నిరాకరించడమూ చేసినందువల్ల దిమిలి ద్రావిడులు తదితర ద్రావిడులకన్నా కులం తక్కువ వారైనారు.[29] సంఘ సంస్కర్తలకు ఏ కాలంలోనైనా ఇటువంటి ఇబ్బందులు తప్పవు.

ఉత్తర దేశాన్నుంచి వలస వచ్చిన నందవరీకులు నాటి బ్రాహ్మణ సంఘం లోని ఆటుపోట్లకు గురి అయ్యా రనడంలో సందేహం ఉండనవసరం లేదు. ఇక్కడి వ్యవస్థలో తమ స్థానాన్ని నిర్ధరించుకోవడంలో కొంత ఇబ్బంది పడి ఉండాలి. అందువల్ల కొన్ని ప్రాంతాలలో కొందరు వైదికులుగా కొందరు నియోగులుగా వ్యవహృతులై ఉంటారు.

ఆంధ్రదేశంలోని బ్రాహ్మణ శాఖల్లో కొన్ని నిస్సందేహంగా ఆంధ్రేతర ప్రాంతాల నుంచి వచ్చినట్లు వాళ్ల ఇంటి పేర్లే సూచిస్తున్నాయి. విజాపురం వగైరా. అదీకాక కరణకమ్మలు అనగా వ్యాపారులు మహారాష్ట్ర నుంచి వచ్చిన వారనీ, ద్రావిడులు తమిళ దేశీయులనీ, మాధ్వులు కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చినవారనీ సాంప్రదాయం చెబుతోంది. నేటి ఆంధ్రప్రదేశంలో ఉన్న బ్రాహ్మణ శాఖలు 50 దాకా ఉన్నాయి.[30] భారతదేశంలో ఉన్న మొత్తం శాఖలు 1800 దాకా ఉన్నట్లు ఒక అంచనా.[31] వీళ్లలో సారస్వత, కన్యాకుబ్జ, గౌడ, ఉత్కల, మైథిలులు పంచగౌడులుగా ప్రసిద్ధులు. వీళ్లు మాంసభుక్కులు. నందవరీకులు కూడా ఔత్తరాహులే కావడం మూలాన ఆంధ్రదేశానికి వచ్చి ఇక్కడి బ్రాహ్మణా చారాలను స్వీకరించవలసి రావడం వలన ఇబ్బందులు సహజంగానే కలిగి ఉండాలి. ఈ ఇబ్బందుల్ని అధిగమించడానికి శ్రీ చాముండికావిలాసం, శ్రీ చౌడేశ్వరీ చరిత్ర మొదలైన పౌరాణిక రూపం ధరించిన కుల చరిత్రలు రంగ ప్రవేశం చేసి ఉండాలి. నన్నయ పేరు సైతం రంగంలోకి దిగక తప్పలేదు. నిజానికి బ్రాహ్మణులలో మరేకులానికీ అద్భుతావహమైన కులచరిత్ర లేకపోవడం గమనార్హమైన విషయం. శ్రీ చౌడేశ్వరీదేవి అర్చకత్వాన్ని తాము వదులుకొని తొగటలకు వప్పగించడంలోని విశేషం కూడా గమనార్హమే. జీవ హింస గల పూజలను చేయడానికి స్థానిక బ్రాహ్మణ్యం అంగీకరించదు గనుక ఈ ఏర్పాటూ, ఈ కథా !

శైవులు, వైష్ణవులు, మాధ్వులు కానివారిని, వేదవిహిత కర్మాచరణ ననుసరించేవారిని స్మార్తులంటారు. అంటే స్మృతుల ననుసరించేవారు స్మార్తులు. నందవరీకులందరూ స్మార్తులే అయి ఉండాలి. స్మార్తులను పచ్చి తామసులుగా పరిగణించడానికి వీలులేదు. చినతిరుమలాచార్యులు తాత గారిని గురించి రాసిన కీర్తనలో –

పచ్చితామసుల మమ్ముం బరమ సాత్వికులఁగా
యిచ్చటనే సేసినాడు యెంత చిత్రము

ఇచ్చగించి మాకులాన నెన్నఁడులేని వైష్ణవ
మచ్చముగాఁ గృపసేసె నన్నమాచార్యుఁడు[32]

అని వర్ణించాడు. కేవలం స్మార్తులైతే 'పచ్చితామసులు' గా చెప్పుకోవడం విడ్డూరమైన విషయం కాదా ! కుటుంబంలో పరంపరగా విన్న విశేషాలు మనసులో మొదలుతూండగా చినతిరుమలయ్య నోట ఈమాట పలికిందనుకోవాలి. నందవరీకులు దేవీ భక్తులని సంప్రదాయం సాక్ష్య మిస్తూండగా, తాళ్లపాక వారి కుటుంబంలో శక్తి సంబంధాలయిన పేర్లేవీ కనబడకపోవడం విచిత్రం. శివ, విష్ణు భేదభావం స్మార్తులలో ఉండకపోవడం తెలిసిన సత్యమే. అన్నమయ్య వంశ పరంపరలో వివరంగా తెలిసిన మొదటి పేరు నారాయణుడు, అతని కొడుకు నారాయణసూరి, అతడి కొడుకే అన్నమయ్య. అన్నమయ్య దాకా ఉన్న పేర్లన్నీ విష్ణు సంబంధమైనవే. అంటే అన్నమయ్య శ్రీ విశిష్టాద్వైతం స్వీకరించక ముందే తాళ్లపాకవారి కుటుంబంలో విష్ణుభక్తి ప్రబలంగా ఉందన్నమాట. మరి పచ్చితామసులమని చినతిరుమలా చార్యుడు ఎందుకనుకోవలసి వచ్చింది ? అన్నది ప్రశ్న. ఇక్కడ మరొక విషయాన్ని గమనించవలసి ఉంది. అన్నమయ తండ్రి పుత్ర సంతానం కోసమై శ్రీ వేంకటేశ్వరునికి మొక్కుకొన్నట్లు చిన్నన్న కథనం.

స్మార్తులలో శివుడైనా, విష్ణువైనా ఏదో ఒక ప్రసిద్ధ దైవరూపాన్ని ఇష్ట దైవంగానో, ఇలవేల్పుగానో నెలకొల్పుకోవడం సాధారణమైన విషయమే. అయితే అన్నమయ తండ్రి నారాయణసూరికి తిరుపతి శ్రీ వేంకటేశుడు ఇష్టదైవమైనాడేగాని నారాయణసూరికి తండ్రైన నారాయణుడి కాలంనాటికి తాళ్లపాక వారికి దేవీభక్తి కూడా ఉంది. శక్తిరూపమైన చింతలమ్మ ఊటకూరులో వెలసిన దేవి, చదువు సరిగారాక కష్టపడుతున్న నారాయణుణ్ణి, తాళ్లపాక లోని కేశవస్వామిని విద్యాభీష్టసిధ్యర్థం సేవించమన్నది. అంటే నాటికే శాక్తేయం మీద తాళ్లపాక వారి కుటుంబానికి పట్టు సడలిందన్నమాట ! 'జనన పరంపరా శతసహస్రముల వెనుకకు మేము దుర్విషయానురక్తిఁ గుక్షింభరులమై...'[33]

ఉండగా శ్రీ వేంకటేశ్వరుడు వారిని తన పాలివారిగా చేసుకొన్నాడని అన్నమాచార్య చరిత్రలోనే చిన్నన్న చెప్పుకొన్నాడు. నారాయణసూరి దంపతులకు కలలో తిరుమలేశుడు 'బిరుదు గజ్జియల ముప్పిడి కఠారంబు'[34] ఇచ్చాడని చిన్నన్న ఇచ్చిన భోగట్టా. నిజానికి చిన్నన్న చెప్పినట్టు అంతకుముందే ఊటకూరులోని శక్తి చింతలమ్మ '... మూడవతరంబునను, వదలని కీర్తి మీ వంశంబునందు పరమభాగవతుడు ప్రభవించు, శౌరి వరమున...' అని అన్నమయ తాతగారికి చెప్పే ఉంది. అంటే పరాశక్తి తాళ్లపాక వారికి శ్రీ వేంకటేశ్వర మార్గం చూపిందని సమన్వయించుకోవాలి. అన్నమయ ప్రసిద్ధుడైన తరువాత పుట్టిన కథలే ఇవి కావచ్చు. లేదా చెదురుమదురుగా ఉన్న కుటుంబగాథా శకలాలు అన్నమయ కీర్తిసూత్రానికి బద్ధమై కదంబంగా మారి ఉండవచ్చు కూడా.

శ్రీ వేంకటేశ్వరుడి 'బిరుదుగజ్జియల ముప్పిడికఠారి'కి నందక మనే పేరుంది. తాళ్లపాక వారు నందవరీకులు. నామసామ్యంలో అన్నమయ 'హరి నందకాంశజుండై'నాడు. తాళ్లపాక కుగ్రామంలో పశువులకు మేతకోసం ఎనిమిదేళ్ల చిరుతప్రాయంలో గడ్డి కోసుకోవలసినంత పేదరికంలో ఉన్నవాడు, అసాధారణమైన, అనితరసాధ్యమైన సృజనాత్మక ప్రతిభతో తన తరువాతి వాగ్గేయకారులకు మేలివాకిళ్లను తెరిచి నూతన భావపథాలలో విహరించి, రాజాధిరాజులతో సమానుడై ప్రవర్థిల్లుతూ, శ్రీ వేంకటేశ్వరుడి ఆస్థానంలో శాశ్వతపదవిని పొందినవాడు, కవిత్వాత్మకమైన అద్భుతగాథలకు కారణం కావడంలో ఆశ్చర్యపడవలసినదేమీ లేదు.

కాశీ బ్రాహ్మణులు నందరాజు ఇచ్చిన మాట ప్రకారం నందవరానికి వచ్చి అగ్రహారాన్ని స్వీకరించి నందవరీకులైనా రని గాథ. నందవరీకలున్నంత కాలం నందరాజు పేరు నిలిచే ఉంటుందిగాని చరిత్రలో నందరాజు ఉనికి తెలియ రావడం లేదు.

1865లో డి. యఫ్. కార్మెకిల్ దొరవారు రచించిన విశాఖపట్టణం డిస్ట్రిక్ట్ మాన్యూయల్‌ను 1886వ సంవత్సరంలో విజాపురపు వేంకట కోదండ రావు పంతులుగారు 'విశాఖపట్టణము జిల్లా వృత్తాంత సంగ్రహము' పేరుతో అనువదించారు. ఆ గ్రంథం దక్షిణాదికి బ్రాహ్మణులు వచ్చిన వైనం తెలుపుతూ

> 'పూర్వులు చెప్పెడి నొక వృత్తాంతము వలన సుదక్షణు డను నొక రాజా వలన – కృష్ణాసంగమ ప్రాంత మందున్న శ్రీకాకుళ మను స్థలమునకు బ్రాహ్మణులు రప్పింపబడ్డట్టు కనబడుచున్నది – మరొక వృత్తాంతము వలన నందుని తండ్రి యయిన యుత్తుంగభుజా డనే రాజాతో నర్మద దక్షిణ ప్రాంతమునకు బ్రాహ్మణులు వచ్చినట్టు కనబడు చున్నది – అనగా నందుని వలన రప్పింపబడ్డట్టు కనబడు చున్నది'.[35]

ఈ జిల్లా వృత్తాంతములోని 'ఉత్తుంగభుజాడూ, అతని పుత్రుడు నందరాజూ, 'శ్రీ చాముండికావిలాసం'లోనూ దర్శన మిస్తారు. ఇది పౌరాణిక కథ కావచ్చుగాని, 'శ్రీ చాముండికా విలాసం' ఈ కథను కేవలం నందవరీక బ్రాహ్మణులకు సంబంధించిన కథగా చెప్పడం గమనార్హమైన విషయం.

మౌర్యచంద్రగుప్తుణ్ణి చేరదీసి తన ఆగ్రహానికి చాణక్యుడు బలిచేసిన మహాపద్మనందుడూ, అతని కొడుకులు నవనందులూ తప్పించి చరిత్రలో నందరాజా స్మరణ కనబడదు. కీ.శే. మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు –

> 'ఆంధ్రదేశ చరిత్రలో చారిత్రక వ్యక్తి అగునా కాదా యని అనుమానింపదగినవారిలో ఇతడొకడు. ఇతనిని గురించి పరంపరాగతముగ వచ్చు కథలు కట్టుకథలేగాని ఇతని శాసనము లేవియు దొరకలేదు. గాథల ననుసరించి ఈతడు చంద్రవంశక్షత్రియుడు. అభిమన్యు, పరీక్షితుల

సంతతిలోని ఉత్తుంగభుజాని కుమారుడు. కందనోలు
సీమలోని నందవర మితని రాజధాని'[36]

అని చెప్పి శ్రీ చాముండికావిలాసంలోని కథనే సంక్షిప్తంగా వివరించారు. ఆయన అందించిన అదనపు సమాచారం ఇదీ –

'నందన చక్రవర్తి నంద్యాల పుర నిర్మాత యనియు
ఆ ప్రభువే ఇప్పుడు మహానంది అని ప్రసిద్ధమైనచోట
మహానందీశ్వరుని ప్రతిష్టించెననియు లోకప్రతీతి'.

నిజానికి నందరాజా కథంతా లోకప్రతీతి మీద ఆధారపడిందే గాని – నిప్పు లేకుండా పొగరాదన్నట్టు – ఏ మాత్రమైనా చారిత్ర కాధారలేశం లేకుండా ఇంత కథ పుట్టుకొస్తుందా అన్నది ఆలోచనీయాంశమే.

శకలప్రాయంగా పరంపరాగతంగా అందివచ్చిన కథలకు అలంకారాలు తగిలించి ముస్తాబు చెయ్యడం మన దేశంలో కొత్త కాదు. ఒక్కొక్కప్పుడు అసలు కథ మరుగుపడిపోయేటంతగా అలంకరణ భారం పెరిగిపోవడం కూడా ఉన్నదే. 'సిద్ధేశ్వరచరిత్ర' 'రాయవాచకం' వంటి రచనలు ఉన్నంతలో కొంత మేలు. చారిత్రకాంశాలు పూర్తిగా మరుగుపడకపోయినా పల్నాటి వీరచరిత్రకు ముస్తాబు కొంచెం ఎక్కువే అయింది. అందువల్లే దొరికిన శాసనాధారాలతో చరిత్రను సరిచేసి నిర్ధరించలేకపోవడం జరుగుతోంది. కాటమరాజా కథ పూర్తిగా చరిత్రరూపం విడిచి జానపద పురాణమై కూర్చుంది. నందరాజా కథ మరింతగా అసలు రూపం పోగొట్టుకొన్న చరిత్ర అని గుర్తిస్తే ప్రమాద ముండదేమో ! నందరాజా తండ్రి ఉత్తుంగభుజాడు కావడమూ పరీక్షన్మహారాజా సంతతివాడు కావడమూ బహుశా తెలియని వివరాలను ఊహలతో నింపే ప్రయత్నం కావచ్చునేమో ! కొండాపురంలో జరిగిన పురావస్తు తవ్వకాలలో లభించిన నాణెం ద్వారా తెలిసిన సుమహాగ్రామకరాజా గురించి మరే ఆధారాలూ లభించడంలేదు.[37] పేరూ ఊరూ తెలియక చరిత్రగర్భంలో

మాటుమణిగిపోయిన అజ్ఞాతవ్యక్తులెందరో ఉండే ఉండాలి. వారిలో నందరాజా వొకడు కావచ్చు ననడంలో ఇబ్బందులుండవు.

ఇంతకీ నందరాజా పుట్టిన వేళావిశేష మేమిటోగాని నేటిదాకా అతని పేరు బ్రాహ్మణుల కథలతో ముడిపడిపోయి కొనసాగి వస్తున్నట్లు కనిపిస్తున్నది. వావిలాల వాసుదేవశాస్త్రిగారు గత శతాబ్దపు చివరి పాదంలో '... మనవారిలో – అందులో బ్రాహ్మణులలో – బహుతరముగాఁ గానిపింప నట్టి ఐకమత్యమును సర్వవిధంబుల స్వీకరించి, దాని వల్ల మేలు వడయఁ గోరవలయు న'న్న ముఖ్యోద్దేశముతో 'నందకరాజ్యము' అన్న నాటకాన్ని రాశారు.[38] ఈ నాటకంలోని నందకరాజా, నియ్యోగి, వైదికుల మధ్య కలహాలూ, రాజా దేశబహిష్కారం చెయ్యగా మంత్రులు ఊరు విడిచి కాశీకి వెళ్లడం చూస్తే లీలగా తారుమారుగా నందరాజా, నందవరీకుల కథలూ· జ్ఞాపకం రాకమానవు. ఏమైతేనేం చరిత్రావశేషాలు లేకుండా కేవలం కథా వశేషుడిగా నందరాజా మిగిలిపోవలసి రావడం అతడి నుదుటిరాత అని సరిపెట్టుకోవాలి.

'శ్రీ చాముండికావిలాసం' ప్రకారం తొగటలకూ నందవరీకులకూ సన్నిహిత సంబంధాలే ఉన్నాయి. అన్నమయ తరువాత గూడా ఈ సంబంధాలు కొనసాగడం చూస్తే విచిత్ర మనిపించవచ్చు గాని అసలు రహస్యాన్ని పూర్తిగా భేదించడం కష్టమే. నిజానికి నందవరీకులకన్నా తొగట వీరులకే దేవితో సాన్నిహిత్య మెక్కువ. పరాశక్తి సైన్యంలోనే వీరులుగదా వాళ్లు.

తొగ అంటే కుములం అని అర్థం. కుమల మంటే పద్మం కూడా. అందువల్ల వారు పద్మశాలీయులైనారు. దేవి ఇచ్చిన అక్షతలను పుష్పాండజాడు కుమలాల మీద జల్లగా తొగటవీరులు జన్మించారు. అసలు పుష్పాండజాడన్నపేరే పద్మాలతో సంబంధాన్ని కలుపుతోంది గదా ! పద్మాలతో సంబంధం ఉన్నా, వృత్తి రీత్యా నేతపనివారైనా, తొగటలూ, పద్మశాలీలూ వేరువేరు కులాలుగా ఉండడమూ, రెండు కులాల వారికీ నందవరీకులు గురువులు కావడమూ

గమనార్హమైన విశేషం. బహుశా ప్రాంతీయ సామాజిక పరిణామ ఫలితం కావచ్చును. తరువాత తరువాత దేవికి మధుమాంస సహితమైన నైవేద్యం పెట్టే బాధ్యతను నందవరీకుల నుంచి స్వీకరించి వారికి మేలు చేసినట్టున్నారు పద్మశాలీలు ! ఆ మేలును మరిచి పోయేవారు కారు నందవరీకులు.

'వాడల వాడల వెంట - వాడెనో
నీడ నుండి చీరెలమ్మే - నేతబేహారి

పంచభూతము లనెడి - పలువన్నెనూలు
చంచలపు గంజితోడ - చరిసేసి
కొంచెపు కండెలనూలి - గుణముల నేసి
మంచి మంచి చీరలమ్మే - మారుబేహారి

మటు మాయములఁదన - మగువ పసిఁడి నీరు
చిటిపాటి యలుకలఁ - జిలికించఁగా
కుటిలంపు జేఁతల - కుచ్చులుగాఁగట్టి
పటవాళి* చీరలమ్మే - బలు బేహారి

మచ్చిక జీవుల పెద్ద - మైలసంతలలోన
వెచ్చపు కర్మధనము - విలువచేసి
పచ్చడాలుగాఁగుట్టి - బలు వేంకటపతి
యిచ్చకొలదులనమ్మే - యింటి బేహారి'[39]

(* పటవాళి - పటోలా చీరలు - గుజరాత్‌లోని పటన్ నుంచి వచ్చిన చీరలు. పోచంపల్లి శైలి చీరలు)

పద్మశాలీలకూ, తాళ్లపాక వారికి ఉన్న అనుబంధం ఎంతటిదో ఈ అన్నమయ కీర్తన చూపిస్తోంది. పరాశక్తి తొగటలతో నందవరీకులను గురువులుగా సంభావించి గౌరవించమన్నది నిజమే అయినా-అర్చనాది సేవలను తాము స్వీకరించి పద్మశాలీలు కూడా నందవరీకులకు మేలే చేశారు గదా మరి!

నందవరీక నామం నందకఖడ్గ నామంతో అభేదం సాధించినట్లే పద్మశాలీ నామం పద్మావతిని పద్మశాలీల ఇంటి ఆడపడుచునుగా చేసింది. అసలు పద్మావతీదేవి పేరు అలర్‌మేల్‌మంగై = పువ్వుమీద పడతి కదా, తెలుగులో అలమేల్మంగ అయింది. పద్మావతీదేవి పద్మసంభవ. పద్మశాలీలూ అంతేమరి. పురాణకవిత్వం కొత్త పుంతలు తొక్కింది !

> '... పద్మసాలీలును జాండ్రవారును లక్ష్మీదేవి పుట్టింటివా రెవరని వివాదపడి తీర్చుఁడని చిన్నన్నను వేడినపుడు ఆయన అలమేలు మంగను ప్రార్థించగా నామె తన పుట్టింటి వారు పద్మసాలె వారె యని పలుక వారందుకై చిన్నన్నకు నిరువదివేల వరహాలు పాదకానుక సమర్పించి దానితో 'చంద్రగిరి తూర్పున ఆళ్లగట్టు అనే బలపపు గని రాయి క్రయశుద్ధిచేసి యీ గట్టు రాయరు దేవాలయం కట్టించి' మరియు 'దేవర్లవారి తిరుమాళిఘ కైంకర్య ధర్మవెచ్చానకు సంవత్సరం 1కి మొగ్గం 1కి అపరంజి రూక లెఖ్ఖనున్ను పెండ్లి 1కి రూక లెఖ్ఖనున్ను సమర్పించి నడిపిస్తూ రాగలవార్లము. దేవరవార్ల తిరువెంగ్గళనాథసామి మర్యాద మీరు మాకు గురువులు గన్కు శిష్య పారంపర్యంత్తరంగాను పుత్ర పారంపర్యం తరంగ్గాను ఆచంద్రార్కస్థాయిగాను నడపగల వారము' అని ధర్మశాసనము శక 1463 శుభకృతు కార్తిక శు 15న వ్రాయించి ఇచ్చిరి. ఈ శాసనములోని శకవర్షము 1463 శుభకృత్సంవత్సరముతో సరిపడుటలేదు'[40]

సంవత్సర సంఖ్యను చెక్కడంలోనూ, చదవడంలోనూ పొరబాటు పడటానికి అవకాశం ఉంది. ఏ ఒక్క అంకె కొద్దిగా రూపం మారినా ఇబ్బందే. అయితే సంవత్సరనామం కూడా ఉంది గనుక శుభకృత్సంవతర్సమునే ప్రమాణంగా తీసుకొని శక వత్సరం 1464 (క్రీ. శ. 1542) గా నిర్ణయించడం సమంజసం. అయితే ఇక్కడ గమనార్హమైన విషయం – నందవరీకులైన

తాళ్లపాక వారికీ పద్మశాలీలకూ గల అనుబంధం గురించిన గాథను ఈ శాసనం మరింత గట్టి పరుస్తున్నది. ఈ శాసనంలోని వ్యవహారం మీద శ్రీ గోపీకృష్ణ గారి వ్యాఖ్యానాన్ని కూడా చూడవలసి ఉంది.[41]

'... పద్మసాలీలకూ – జాండ్రవారికీ తగాదా వచ్చింది.

మేము శ్రీవారి దేవేరి పద్మావతమ్మవంశము వారమని పద్మసాలీ లన్నారు. మీరు కాదు మేము ఆమె వంశము వారమని జాండ్రవా రన్నారు... ఎవర రేయే వంశస్థులో ఎవరి కెరుక ? తాళ్లపాక చిన్నన్న కెరుక ఏమో యని ఆయనను అడిగారు. ఆయన నాకూ తెలియదు అమ్మవారినే అడుగుతాను. మీరంతా ఒక శుభదినం అలమేలు మంగాపురం – శ్రీనివాస మంగా పురానికి – రండి అన్నాడు.

అలాగే అంతా అలమేలుమంగాపురంలో అమ్మవారి ముందు ఆశీను లయినారు. తాళ్లపాక చిన్నన్న, తిరుమల తాతాచార్యుల వారిని కూడా పిలుచు కొచ్చాడు – తోడుగా ఉంటాడని. చంద్రగిరి రాజయిన పురుషోత్తమరాయల వారు కూడా వచ్చారు. ఇది అచ్యుతదేవరాయల పాలనా కాలం అంటే క్రీ. శ. 1542. ఈ పురుషోత్తమరాయలెవరో చరిత్రలోకానీ, విజయనగర చక్రవర్తుల వంశావళిలో కానీ కనబడడు. అయినా అచ్యుతదేవరాయల వారికి, వేలు విడిచిన బంధువుగా ఉంటాడని ఊహించవచ్చు. ఎటూ చేసే పనిలేక, తిని ఊరక కూర్చోలేక, తమాషా చూద్దామని, మంగాపురం దాకనే కదా ! అని, చిన్నన్నమాట త్రోసిపుచ్చలేక వచ్చి ఉంటాడు.

ఆశీనులయిన అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది అలమేలు మంగమ్మ. తాను పద్మసాలీల ఇంటి ఆడపడుచునని ఢంకా

మీద దెబ్బకొట్టినట్లు ఖచ్చితంగా చెప్పివేసింది. అందుకేనేమో నారాయణవరంలో ఉన్నవారంతా పద్మసాలీలు. తిరుచానూరు సమీపముననున్న యోగి మల్లవరంలో కూడా అందరూ పద్మసాలీ లున్నట్టుంది... జాండ్రవారికి ఇకనేంచేయాలో తోచలేదు. పురుషోత్తమరాయలు వీరికి బిరుదులు, గండ పెండేరం, సింహతలాటం, వింజామరలు ఇచ్చి భటులచేత కైవారం చేయించారట. పద్మసాలీలు తమ కులం ఉద్ధరించిన శ్రీ తాళ్లపాక చిన్నన్నకు 20వేల వరహాలు చెల్లించారు. పదివేల వరహాలు వారు స్వంతంగా తెచ్చారు. 10వేల వరహాలు దేవరవారి భండారా న్నుంచి తెప్పించి పురుషోత్తమరాయల ముందే చిన్నన్నకు పాదకానుకగా సమర్పించినారు – ఒక ఆలయం కట్టించమని'

ఇక్కడ గమనార్హమైన విషయం ఏమిటంటే శ్రీ చాముండికా విలాసం లోనూ, తొగటలకూ జాండ్రవారికీ వివాదం రావడం, ఆ వివాదానికి కారణం వేరు, అక్కడ కూడా కారణాలు వేరయినా పానుగల్లు రాజా యేరువరాయలు తొగటలకు బిరుదులూ, ఇతర బహుమానాలివ్వడం, మళ్లీ 'ఓరుగంటి ప్రతాప రుద్రుడి పురాన' తొగటలకూ దేవాంగులకూ వివాదం, రాజా వారికి బిరుదు లివ్వడం – అన్నీ ఉన్నాయి. పురుషోత్తమ రాయలు బిరుదులూ, గండపెండేరం సింహతలాటం, వింజామరలూ ఇవ్వటం పాతకథనే జ్ఞాపకం చేస్తున్నది. ఓరు గంటి కథను పూర్తిగా కాదనడానికి వీలు లేకుండా అక్కడ 'చమడేశ్వరీ మహాశక్తి నగరు' ఉందని క్రీడాభిరామం సాక్ష్యం పలుకుతోంది గదా।

చిన్నన్న కోరిక మీద సాక్ష్యమిచ్చిన శ్రీ పద్మావతీదేవి పైతగాదాలో సాక్ష్యం చెప్పిన ప్రదేశం ఏదై ఉంటుందో నిర్ణయించడం కష్టమే. అయితే శ్రీ గోపీకృష్ణ గారి నిర్ణయానుసారం చినతిరుమలాచార్యులు జీర్ణోద్ధారం చేసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరాలయంలోనే దేవి తీర్పిచ్చి ఉండాలి.

తిరుచానూరులో పద్మావతీదేవి ఉనికినిగురించి తెలియజెప్పే శాసనాలు పదిహేడో శతాబ్ది మధ్యభాగానికి ముందుగా ఉన్నవి కానరావడం లేదు అని కీ. శే. శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారిచ్చిన సమాచారం. కాని తిరుచానూరు మైదానప్రాంతంలో ఉండి తరుచూ దండయాత్రలకూ గురి అవుతూ ఉండి, నిర్మాణంలో మార్పుచేర్పులకు లోనైందన్న విషయాన్ని మనం విస్మరించ కూడదు.[42] తిరుచానూరులోని పద్మావతీదేవి అమ్మవారు గ్రామ దేవతగా మరొకపేరుతో ఉండి ఉండాలి. ఆమె అలమేల్మంగగా శ్రీ పద్మావతీ దేవిగా పేరు పొందడం తరువాతి కాలంలో జరిగి ఉండవచ్చునేమో ! శాసనాలు లేకపోవడం వలన పూర్వకాంలో పద్మావతీదేవీ దేవస్థానపు ఉనికినే మనం శంకించడం భావ్యం కాదేమో ! అలర్-మేల్-మంగై అన్న తమిళరూపం నుంచి అలమేల్మంగ పేరు వచ్చిందనుకొన్నా మరే వైష్ణవక్షేత్రంలోని దేవతకూ ఆ పేరు లేకపోవడం గమనార్హం.

'శ్రీ చాముండికావిలాసం' బాగా అర్వాచీనమైనదిగా కనబడుతున్నది గనుక చిన్నన్న కథనే పేర్లు మార్చి అస్తవ్యస్తంగా చెప్పిందనుకొన్నా, వైష్ణవాన్ని పరిహరించి శాక్తేయాన్నే నిలిపిందనుకొన్నా కూడా, అన్నమాచార్యుడి, పైన పేర్కొన్న సంకీర్తన కథను వెనక్కే తీసుకు వెళుతోంది. అదీకాక చిన్నన్న శాసనం కథ కూడా శ్రీ పద్మావతీదేవి యెవరింటి ఆడపడుచన్న విషయం మీద పద్మసాలీలకూ, జాండ్రవారికీ కలిగిన వివాదంతోటే ప్రారంభం అవుతోంది. **నందవరీకులు శ్రీ చౌడేశ్వరీ దేవి పూజారులు. ఆ అధికారాన్ని నందవరీకులు తొగటల కిచ్చారు.** నందవరీకులందరూ, **తొగటలందరూ వైష్ణవులు కాలేదని అనడానికి అర్వాచీనమైన 'శ్రీ చాముండికా విలాసమే' గట్టి సాక్ష్యం** పలుకు **తోంది గదా !**

శ్రీ వేంకటేశ్వరుడికీ పద్మశాలీయులకూ అనుబంధం తాళ్ళపాక వారి వల్లనే ఏర్పడి ఉండవచ్చుని పైన పేర్కొన్న శాసనాధారంగా భావించవచ్చు. అయితే ఆ అనుబంధం యొక్క అసలు రూపం ఏదో తెలుసుకోవడానికి

నేటి కాలపు ఆచార వ్యవహారాలను గమనించి తెలుసుకోవడానికి వీలుంది.

1983 జూన్ 17వ తేదీ శుక్రవారం నాటి 'ఈనాడు' దినపత్రిక 'కన్నె గులాబీకి దేవుడితో పెళ్లి' అనే ఆసక్తికరమైన చిన్న వార్తావ్యాసాన్ని ప్రకటించింది. దానిని పరిశీలిస్తే అన్నమయకు సంబంధించిన మరికొన్ని విశేషాలను పరోక్షంగా తెలుసుకోవడానికి అవకాశం లభిస్తోంది. ఆ వార్తా వ్యాసంలోని కొన్ని భాగాలను పరిశీలనా సౌలభ్యం కోసం ఉదాహరించడం జరుగుతోంది.[43]

> 'అనంతపురం జిల్లాలోని వెంకటేశ్వరుని ఆలయంలో కొన్ని దశాబ్దాలుగా పద్మశాలి అమ్మాయితో వేంకటేశ్వరుని విగ్రహానికి వివాహం జరుపుతున్నారు. ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో 'అరవా' ఇంటిపేరు గల ఒక పద్మశాలి అమ్మాయిని కులపెద్దలు ఎన్నిక చేసి దేవుడితో వివాహం జరుపుతారు... పద్మావతి పద్మశాలియుల కులంలో 'అరవా' ఇంటి ఆడపడుచని అందువలన ఆ ఇంటి ఆడపడుచునే ఈ పెళ్లికి ఎన్నిక చేస్తారు... శ్రీ మహాలక్ష్మి పద్మశాలికుల మూలపురుషుడైన భృగుమహర్షి కూతురని పురాణాలు చెబుతాయి ... ఈ ఏడు కూడా ఈ కల్యాణ మహోత్సవం ఇక్కడి ప్రాచీన దేవాలయమైన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి దేవాలయంలో జరిగింది... పెళ్లికి ముందు రోజు వరుడైన దేవుని వైపు వారు బ్రాహ్మణులు, వైశ్యులు మేళ తాళాలతో పద్మశాలీయుల దేవాలయం మార్కండేయ దేవాలయానికి చేరుకొని, అక్కడ పద్మశాలీయ కులపెద్దలు, బ్రాహ్మణ పెద్దల సమక్షంలో పెళ్లి నిశ్చయించుకొని నిశ్చితార్థ తాంబూలం పంచుతారు. పెళ్లికి పంచాంగం ఆధారంగా మంచి ముహూర్తం నిర్ణయిస్తారు. ముహూర్తం రోజు నిర్ణయించిన పద్మశాలీ అమ్మాయిని పెళ్లికూతురుగా అలంకరించి, ముత్తయిదువలు ఆమెను కలశాలతో వరుడి గృహమైన స్వామి

దేవాలయానికి తీసుకు వస్తారు. అక్కడ అప్పటికే స్వామి వరుడుగా అలంకరించుకుని ఉంటాడు. బ్రాహ్మణులు వధూవరులను దీవిస్తూ మంత్రాలు చదువుతారు. వధూవరుల మెడలో పూలదండలు మారుస్తారు. వివాహ ఆచారాలన్నీ మొత్తం పద్మశాలి అమ్మాయితో జరిపించినా ఆఖరికి జరిగే మంగళసూత్రధారణ మాత్రం పద్మావతీ విగ్రహానికి జరుగుతుంది. సూత్రధారణ జరిగిన వెంటనే అక్షింతలు జల్లుతారు... ఆ తరువాత జరిగే ఉయ్యాలసేవ, ఊరేగింపు మాత్రం విగ్రహాలకు చేస్తారు. ఈ పెళ్లిలో వరుడి తరఫున బ్రాహ్మణులు, వైశ్యులు పాల్గొంటే, వధువు తరఫున పద్మశాలీయులు పాల్గొంటారు ... ప్రతి సంవత్సరం ఒక్కొక్క కొత్త పద్మశాలి అమ్మయితో స్వామి విగ్రహానికి వివాహం జరుగుతుంది .... దేవునితో పెళ్లి జరపడం వల్ల ఆ అమ్మాయికి యోగ్యుడైన భర్త లభిస్తాడని వారి విశ్వాసం. దేవునితో పెళ్లయిన తరువాత మామూలుగా పెళ్లయ్యే వరకూ ఆ అమ్మాయి తల్లిదండ్రులతోనే గడుపుతుంది... ఒకప్పుడు పద్మశాలీయ కులంలో వేరొక తెగవారు పద్మావతి తమ తెగకు చెందిందని, కాబట్టి తమ తెగ అమ్మాయితోనే వేంకటేశ్వరునికి వివాహం చెయ్యాలని 'అరవా' తెగతో అడ్డుపడగా అప్పట్లో కొంకణ ప్రభుత్వం ఆనాటి నుంచి అరవా తెగ అమ్మాయికే వివాహ వేడుకలు....'

జరిపించాలని ఆజ్ఞ ఇచ్చినట్లు ఆ వార్తావ్యాసం చెప్పిన కబురు. ఈ 'కొంకణ ప్రభుత్వం' అంటే ఏమిటో అర్థం చేసుకోవడం కష్టమే. ఈ కథల్లో కనిపించే అనేక తారుమారుల్లో ఇదొకటి. ఈ వార్తా వ్యాసకర్త గమనించని ఒక విశేషం వివాహ కార్యక్రమాన్ని నడిపే బ్రాహ్మణులు నందవరీకులే నన్న సంగతి. ఇది నేడు జరుగుతూన్న ఉత్సవాన్ని గురించిన వార్తావ్యాసం కనక

అక్కడి పెద్దలు చెప్పిన విషయాలే ప్రమాణ వాక్యాలుగా ఉటంకితమైనాయి. ఆయా స్వల్పభేదాలను వదిలితే గమనార్హమైన విషయాలు ఇవీ –

1. పద్మావతి పద్మశాలీయుల ఇంటి ఆడపడుచన్న విషయంలో వివాదం. అందులో పద్మశాలీయులు విజయం పొందడం;

2. బ్రాహ్మణులూ, వైశ్యులూ వరుడి తరుపు బంధువులు,

3. వివాదంలో 'కొంకణ ప్రభుత్వం' తీర్పివ్వడం –

వీటిలోని మొదటి అంశం మూడవ అంశం చిన్న తేడాలున్నా చిన్నన్న శాసనంలోని విషయాలతో సంవదిస్తున్నాయి. అదనంగా లభించిన విశేషం – బ్రాహ్మణులు – నందవరీకులు వైశ్యులూ వరుడి తరపు బంధువులు కావడం. మొట్టమొదటగా శ్రీ వేంకటేశ్వరుడి కల్యాణోత్సవాన్ని ప్రారంభించింది తాళ్లపాక తిరుమలయ్యంగారు (పెదతిరుమలయ్య) అని శ్రీ టి.కె.టి. వీర రాఘవాచార్యుల వారు అభిప్రాయపడ్డారు.[44] పెదతిరుమలయ్య శాసనాన్ని బట్టి ఈ నిర్ణయానికి వచ్చినట్టున్నారు. కాని రేవణూరి వేంకటాచార్యుడు శకుంతలాపరిణయ కృత్యాదిలో అన్నమయను గురించి పేర్కొనడంలో–

'మఱియు నమ్మహాదేవుండు మదీయ మాతామహ
వంశ శిఖారత్నంబగు నన్నమాచార్యునకు జామాతురుం
డనిపించుకొని, భవదీయ సంకీర్తనంబు లాలించిన కర్ణంబు
లనితర సంకీర్తనంబు లాలించవని ప్రతిజ్ఞ గావించె....'[45]

వేంకటాచార్యులదే అయిన శ్రీపాదరేణు మహాత్మ్యంలో –

శ్రీలలరంగ మంగమను శ్రీహరి కెన్నఁడు దారవోయిచోఁ
దాళులపాక యన్నమయ దాఁగడిగెంబదములు ధరిత్రి
మాతాళులపాక చిన్నన పదంబులు పాడిననాఁడె సర్పరాట్
శైలవిభుండు తత్పదరజంబును మాకు నొసంగఁజెల్లదే[46]

అనడం వలన ఈ కల్యాణోత్సవాన్ని అన్నమయే ప్రారంభించాడని తీర్మానానికి రావలసి ఉంది. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు 'తాళ్లపాక వారిది భారద్వాజ

గోత్రము. స్వామిదీ భారద్వాజ గోత్రమేనట. మరి ఈ మామ-అల్లుని తనము గోత్రములతోగాక ఆగమశాస్త్ర సంపన్నమైనది గాబోలు' అన్నారు.[47] కావచ్చు. అన్నమయ సంకీర్తనల్లో వివాహ వేడుకలను గురించిన చాలా సంకీర్తనలు కానవస్తున్నాయి. తండ్రి ప్రారంభించిన ఉత్సవాన్ని భవిష్యత్తులో కూడా కట్టు దిట్టంగా కొనసాగేందుకు పెదతిరుమలయ్య ఏర్పాట్లు చేసి శాసనం వేయించి ఉండాలి. పూర్వోదాహృతమయిన వార్తా వ్యాసంలో బ్రాహ్మణులు వరుడి తరఫు బంధువులైనారు. మరి అన్నమయ నెలకొల్పిన ఆచారం ప్రకారం వాళ్లు కన్యాదాతలు గదా ! అన్నది ప్రశ్న. కాలక్రమాన ఆచారవ్యవహారాలు తారుమారై ఉండవచ్చునన్న భావం సమాధానమై నిలుస్తుంది.

ఇందాక పేర్కొన్న వార్తా వ్యాసంలో మార్కండేయాలయం పద్మశాలీయుల ఆలయంగా ప్రస్తావితమైంది. భాగవతం ప్రకారం భృగువుకు కొడుకైన ధాతకు యాయతి అనే భార్య వలన మృంకడుడు జన్మించాడు. మృంకడుడికి మార్కండేయుడు జన్మించాడు.

> '... మహాత్ముండగు భృగువు ఖ్యాతి యను పత్నియందు ధాతయు, విధాతయు నను పుత్రద్వయంబును, భగవత్పరాయణయగు శ్రీ యను కన్యకం బుట్టించె ఆ ధాతృ విధాతృలు మేరువను వాని కూఁతులైన యాయతి, నియతులను భార్యల వలన మృకండప్రాణులను కొడుకులం బుట్టించిరి. అందు మృకుండునకు మార్కండేయుండును, ప్రాణునకు వేదశిరుండను మునియుం బుట్టిరి'[48]

'భగవత్పరాయణ యగు శ్రీ యను కన్యక'కు మార్కండేయుడు మనుమడి వరుసలోవాడు. ఆ విధంగా వారిద్దరికీ బంధుత్వం ఉంది. మార్కండేయుడు శివభక్తుడుగా పురాణప్రసిద్ధుడు. లక్ష్మి క్షీరసాగరోద్భవ. శ్రీ కి లక్ష్మికి ఇక్కడ అభేదం కనిపిస్తోంది. గమనించవలసిన మరొక విశేషం 'శ్రీమహాలక్ష్మి పద్మశాలి కుల మూలపురుషుడైన భృగుమహర్షి కూతురని

పురాణాలు చెపుతాయి' అన్న వాక్యం. భార్గవి అంటే లక్ష్మి, పార్వతీ అని రెండర్థాలూ ఉన్నాయి. అయితే ఏ పురాణం భృగుమహర్షిని పద్మశాలీయుల వంశానికి మూలపురుషుడని పేర్కొంటున్నదో తెలియదు.

అలాగే భృగు నందనుడు అంటే పరశురాముడనీ, జమదగ్ని మహర్షికి భృగువన్న పేరున్నట్లూ నిఘంటువులు పేర్కొంటున్నాయి. రేణుకాదేవి ఎల్లమ్మగా గ్రామశక్తిగా, మహాశక్తిగా ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలలో ప్రసిద్ధురాలు. మరపుతెరల మాటుమణిగిపోయిన చరిత్రను ఈ విశేషాలు సూచిస్తున్నాయా అన్న సంగతిని కొంత పరిశీలించి చూడవలసి ఉంది.

శ్రీ చాముండికా విలాసంలో ఈ పద్యం ఉంది -

కొల్లాపురంబులోఁ గోరి శ్రీలక్ష్మినై
  భ్రమరాద్రి నందును భామ నగుచు
మణి చిత్రకూటాద్రి మణిదేవినై మాహురిని
  యేకవీరాఖ్యఁగని మెలగుచుఁ
బీఠికాపురుహూత పేరొప్పుదాననై
  కాశ్మీరభారతీకాంత నగుచు
శ్రీహరిక్షేత్ర ప్రసిద్ధకామేశ్వరినై
  యలంపురి జోగులాంబనగుచు
మఱియు నెందెందు జూడు నిమ్మహిని సకల
రూపములఁ దాల్చి యీ విశ్వరూపధారి
నగుచు నష్టాదశాఖ్యపీఠాంతరములఁ
జేరియుండుదు వేడుక మీర వినుఁడు[49]

తిక్కిరిబిక్కిరిగా ఉన్న ఈ పద్యంలోని కొన్ని విశేషాలు 'మార్కండేయ పురాణం'లోని 'అష్టాదశపీఠశక్తి దేవతాస్తోత్రం'గా ప్రసిద్ధి చెందిన సంస్కృత స్తోత్రంలో ఉన్నాయి. సౌలభ్యం కోసం పూర్తిగా ఉదాహరించడం జరుగుతోంది-

'లంకాయాం శాంకరీదేవీ కామాక్షీ కంచికాపురే ।
పర్ద్యన్యే సింహలాదేవీ చాముండీ క్రౌంచద్వీపకే ॥
అహిక్షేత్రే కామరూపీ పైఠణౌ పీఠికాపురీ ।
వడ్యాణే గిరిజాదేవీ మాణిక్యా చిత్రకూటకే ॥
మాహుర్యామ్ ఏకవీరాచ ప్రయాగే మాధవీతథా ।
జాలంధరే విష్ణుదేవీ కాశ్యాం మంగళగౌరికా ॥
కురుక్షేత్రే మహామాయా ఉజ్జయిన్యాంతు కాళికా ।
సంనత్యాం చందలాదేవీ కరవీరేతు లక్ష్మికా ॥
అలంపుర్యాం జోగుళాంబా శ్రీశైలే భ్రమరాంబికా ।
ఇత్యష్టాదశపీఠేషు శక్తియశ్చ మునిశ్రుతేః' [50]

శక్తిపీఠాలలో ఉన్న శక్తులన్నీ నిజానికి ఏకశక్తిరూపాలే. శైవ వైష్ణవ భేదాలేవీ ఈ శక్తులకు లేవు. దాదాపు ఈ శక్తులన్నీటికీ ఒకచేత ఖడ్గం, మరొకచేత రక్తపాత్ర ఉంటాయి.

> ''మాహుర' మను పేరుగల గ్రామమున వెలసిన దగుటచే ఏకవీరకు మాహురమ్మనియు నామాంతరము... కామవల్లీ మహాలక్ష్మికే కామేశ్వరి యని నామాంతరము... మొత్తమున వారి కెల్లరకును 'అక్క'లని పేరు. నేనీ యక్కల కథ నముద్రిత ములుగా నున్న యాదిలక్ష్మి విలాసము, కామేశ్వరీచరిత్రము నను గ్రంథముల మూలమునఁ గనుగొనఁగల్గితిని''[51]

అని శ్రీ వేటూరి వారిచ్చిన సమాచారం. వారు కామేశ్వరి కథాసారాన్ని తమ పీఠికలో ఇచ్చారు. శ్రీ వేంకటేశ్వరుడు విష్ణువైనా పేరు ఈశ్వర నామాంతం తో ఉన్నట్లే ఆదిలక్ష్మి అయిన కామేశ్వరి పేరు కూడా ఈశ్వరి నామాంతంతో ఉండటం కేవలం యాదృచ్ఛికమా ? శ్రీ చాముండేశ్వరీ భక్తులైన తొగట వీరులూ, పద్మశాలీలూ శ్రీ పద్మావతీదేవి బంధువులు కావడం తర్కబద్ధంగానే కనిపిస్తున్నది.

పరిమళమో, కదంబమొ, ప్రభల్ విడనించిన నిగ్గొ నిర్మలా
భరణమొ నిత్యవైభవమొ భాగ్యమొ శ్రీ యలమేలు మంగ భూ
ధరునకు నాదిలక్ష్మి యని తత్త్వమహత్వ రహస్యవేత్తలం
బరమున నుండి నీవనిశఁ బ్రస్తుతి సేతురు వేంకటేశ్వరా[52]

అన్నాడు అన్నమయ్య. అలమేలుమంగను ఆదిలక్ష్మి అని తత్త్వమహత్వ రహస్యవేత్తలే చెబుతున్నారు. ఆదిలక్ష్మీవిలాస మన్న పురాణమే ఉంది గదా! ''మొత్తమున వారికెల్ల 'అక్కల'ని పేరు'' అని గదా శ్రీ వేటూరివారన్నది. 'అక్క' లంటే యక్షులే (యక్షిణులు).[53] అంటే జానపద దేవతా సంప్రదాయం సంస్కృత సంప్రదాయంతో వియ్యమందుతున్నదన్నమాట.

నిజానికి చౌడమ్మ, పద్మావతి యక్షదేవతలై ఉండాలి. అంటే జానపద దేవతలన్నమాట. తొగటవీరుల దేవత చౌడమ్మ తామసత్వాన్ని వదులుకొన్న తరువాత పద్మశాలియై పద్మశాలీలకు ఆడపడుచై ఆవిర్భవించి ఉండాలి. కాలక్రమాన వైదిక సంప్రదాయానికీ జానపదధర్మానికీ ఇచ్చి పుచ్చుకోవడాలు ప్రారంభమైన తరువాత ఈ యక్షిణులు సంస్కృతనామాలు ధరించి ఉంటారు.[54] శ్రీ వేంకటేశ్వరుడి కీర్తి సామ్రాజ్య విస్తరణ కాలంలో పద్మావతి ఆయన దేవేరి అయి ఉంటుంది. కల్యాణోత్సవాలు ఈ విషయాన్నే సూచిస్తున్నాయి. అన్నమయ కాలానికి ముందుగా దేశంలో మరే దేవాలయంలోనూ కల్యాణోత్సవాలను గురించిన కబురు మనకు ఏ శాసనంలోనూ కనిపించదు. దేవుని కల్యాణోత్సవాలు శ్రీ వేంకటేశ్వరుని కల్యాణంతోనే ప్రారంభం అవుతున్నాయి. అదీకాక 'కల్యాణవేంకటేశ్వరు'డి లాగా మరే దేవుడూ 'కల్యాణ' మన్న విశేషణాన్నో, బిరుదునో ధరించి కనబడకపోవడం ఈ విషయంలో బలవత్తరమైన సాక్ష్యం.

ఈ దేవతల జానపద పురాణాల సంస్కృతీకరణంలో మరిన్ని అంశాలు కాలక్రమేణా చేరి విషయావిష్కరణకు ప్రతిబంధకాలను కలిగిస్తున్నాయి. అయినా తెలుగు కావ్యాలూ, జానపదగేయాలూ గతకాలపు చరిత్ర జాడలను

కొంత అస్పష్టంగా ఉన్నా మనకింకా ప్రదర్శిస్తూనే ఉన్నాయి. క్రీడాభిరామంలో కామవల్లీ మహాలక్ష్మి కైటభారి వలపులను పాడింది జక్కుల పురంధ్రి. ఏకవీరా మహాదేవి ఎదుట నిల్చి పరశురాముడి కథలను పాడినవాడు బవనీలచక్రవర్తి. ఈ శక్తులు యక్షిణులై తెలుగు నేర్చి అక్కలైనా వాళ్లు మాణిభద్రకులోద్వహు లైన దేవతలే. ఎల్లమ్మ రేణుకాదేవి కావడమేకాక 'పద్మలోచన భృగుసంయమి వంశ పరిపాటి కఠినవాభరణ'యై అధోహ్రీంకార మధ్యాత్మయై జగజ్జననిగా' నిలిచే ఉంది. ఎక్కడెక్కడి కథలో కదిలివచ్చి ఆమెకు కొలుపు చేస్తున్నాయి.

నిజానికి నేడు భారతదేశంలో అత్యధిక సంఖ్యాకులు అనుసరించే మతానికి హిందూమతమనే పేరు ఆధునికకాలంలో రూఢి అయింది గాని ఆ పేరుకు తగ్గ నిర్వచనం ఎవరూ సంతృప్తికరంగా ఇవ్వలేకపోయారు. కాని 'హిందూ మతం'లోని ప్రముఖ లక్షణం ఎన్ని విరుద్ధాంశాలున్నా వివిధ మతశాఖల ఆచారవ్యవహారాలనూ, దైవరూపాలలోని వివిధ రూపాలనూ సమన్వయ పరచి ఒక కలగూరగంప వంటి సంస్కృతిని సృష్టించుకోగలిగి ఉండడం. ఇందువల్లనే హిందూమత మన్నదానికి నిర్వచనం ఇవ్వడం కష్ట మౌతున్నది. ప్రపంచంలోని ఇతర మతాలలోని సిద్ధాంతాలు కొంతవరకు కరడు గట్టిపోయి ఆధునిక యుగంలో అసంగతంగా కనిపిస్తున్నప్పుడు హిందూ మతం అన్నిటినీ ఆహరించుకొంటూ సరిహద్దులులేని మతంగా రూపొందటం జరుగుతోంది. చిన్నచిన్న సెలయేరులు కలిసి చివరకు మహాప్రవాహంగా మారినట్లు వివిధ ప్రాంతాలలో వివిధ తెగల నమ్మకాలను తనలో లీనం చేసుకొంటూ హైందవం ప్రవహిస్తున్నది. అందువల్ల పల్లెపట్టులలో ఒక సంస్కృతి, నాగరక సమాజాలలో సంస్కృతీకరణం పొందిన మరొక సంస్కృతి మనకు దృశ్యమానమైనా అవన్నీ ఒకే మతానికున్న వివిధ ముఖాలన్న సంగతిని గ్రహిస్తే ఆశ్చర్యచకితులం కాకతప్పదు.

అందువల్ల చౌడమ్మ చాముండేశ్వరి అయినా, పైడమ్మ పైడిమాంబిక అయినా ఒకవంక మధుమాంస సహితమైన నైవేద్యాలను స్వీకరిస్తున్నా,

మరోపక్క శ్రీరాజరాజేశ్వరిగా, పరంజ్యోతిగా, ఆదిశక్తిగా, ముగరమ్మల మూల పుటమ్మగా మాత్రం నిలిచే ఉంది. ఒకవైపున జానపద గాయకులూ, మరోపక్క పురాణపండితులూ ఆ అనిర్వచనీయమైన శక్తికి రూపనిర్ణయం చెయ్యడంలో నిజానికి వైరుధ్యం లేదు. ఈ అనేకత్వంలో ఏకత్వ సాధన చెయ్యడం తెలిసి చేశారా, తెలియక చేశారా అన్నది అప్రస్తుత ప్రశ్న – ఎందువల్లనంటే వివిధ భాషలతో విభిన్నదృక్పథాలతో రకరకాల ఆచారాలతో నిండి ఉన్న మనదేశంలో ఆ మహత్కార్యం మనకొక ఐకమత్య సూత్రంగా పరిణమించింది గనుక. సరైన దారి చూపిస్తున్నది గనుక.

అందువల్ల శ్రీచాముండేశ్వరీ భక్తులు శ్రీ పద్మావతీదేవి భక్తులు కావడంలో బాహ్యాచారాలు మారడమే తప్ప తాత్త్విక చింతన విధానం మార లేదు.

> 'తమోగుణప్రధానయుం బరాపరాభిదానయు సంహార కారిణియు నగు రుద్రశక్తికి నవకోటిభేదంబులు గలవు. రజోగుణ ప్రధానయు లోకస్థితికారిణియు నగు విష్ణుశక్తికిం బదునెనిమిది కోట్లు భేదంబులు గలవు. సత్వగుణ ప్రధానయుఁ బరాభి ధానయు సృష్టికారిణియు నగు బ్రహ్మశక్తికి లెక్కింపరాని భేదంబులు గలవు. వీరికి నిందరికిని నిన్నిరూపంబులం బతియై రుద్రుండు రమింపు చుండు. వీరి నారాధించు మాంత్రికులు రుద్రునికి నమ్మిన భక్తులు. బ్రాహ్మియు, వైష్ణవియు, రౌద్రియు ననంబరఁగిన యీ త్రికల నవసిద్ధాంతగామినియై జ్ఞానక్రియా శక్తి నామంబులను వహించు. లోకోపకారంబుగాఁ బరమ పురుషుండు మూఁడు మూర్తులు దాల్చినయట్ల యేక స్వరూప యగు నిమ్మహాశక్తియు మూర్తిత్రయంబు వహించె. నింతియె కాని భేదంబు లేదు'[55]

అన్న వరాహపురాణంలోని వచనం విషయాన్ని విశదం చేస్తున్నది.

దేశంలోని వివిధ శక్తిరూపాలు ఒకే శక్తికి రూపాంతరాలని ఖండితంగా చెబుతోంది వరాహపురాణం. చెదురుగా ప్రాగైతిహాసిక కాలం నుంచి వివిధ ప్రాంతాలలో పూజలందుకొంటున్న దేవతలను ఏకశక్తి రూపాంతరాలుగా మార్చడంలో భిన్న ప్రాంతాలలో జీవించే జనసమూహాలకు ఒకే ఆదర్శాన్ని నిర్దేశిస్తున్నదన్నమాట. దేశభక్తి, జాతీయవాదం అన్నవి గత శతాబ్దం మధ్య నుంచే పాశ్చాత్య ప్రభావం వలన సంక్రమించాయి గాని, మతపరమైన, దేవతా రూపాల మధ్య అభేదభావం ప్రజలకు ఏకైక మూలసూత్రంగా ఉండటం ప్రాచీన కాలం నుంచి మనకున్న సంప్రదాయం. కాకపోతే పాలకులలో ఉన్న అహంకార భావం రాజకీయంగా జాతిసమైక్యకతకు అడ్డుగా నిలిచింది.

విరూపాక్షదేవుడి పేరు మీద పాలించిన విజయనగర చక్రవర్తులకూ, జగన్నాథదాసులుగా పాలన సాగించిన గజపతులకూ ఎడతెగని యుద్ధాలు జరగడం ఈ కారణం వల్లనే. అయితే ఒకే భాష మాట్లాడుతూ, ఒకే దేవతను ఆరాధించే ప్రజలు సైతం ఇరుపక్షాలలోనూ ఉండి యుద్ధాలలో పాల్గొన్నారు. ఈ విధానం మతపరమైన సమైక్యతా సాధనకు కృషి చేస్తున్న వారి ప్రయత్నాలను భంగపరచిందన్న సంగతిని విస్మరించలేము. ఇటువంటి అస్తవ్యస్త పరిస్థితులలో నందవరీకులూ, పద్మశాలీయులూ తమ మనుగడను సాగించవలసి వచ్చింది.

నందవరీకులకూ పద్మశాలీయులకూ మధ్య నెలకొన్న సహకార పూర్వక సంబంధాలను గురించి ఆధునిక పరిశోధకులెవరూ గుర్తించలేదు. ఇటువంటి సంబంధాలు ఇతర కులాల మధ్య కూడా ఉన్నాయా అన్న సంగతి భావి పరిశోధనలలో తేలవలసి ఉంటుంది. కులవ్యవస్థలో పాత వర్గీకరణలు పోయి కొత్త వర్గీకరణలు నెలకొన్న కాలంలో నందవరీకులూ పద్మశాలీలూ ఏర్పరచుకొన్న సహకార పూర్వక సంబంధాలలో ఆర్థికపరిస్థితులు కూడా తోడై ఉంటాయి. అసలు ఈ వ్యవహారాన్నంతా మాధ్యమిక యుగపు రాజకీయ దృష్టితో చూస్తే ఏ ప్రస్తావనలోనూ కానరాని రహస్య మొకటి మనకు ప్రత్యక్షం

కాగలదు. మొదటి దేవరాయల కాలం నాటికే నందవరీకులకు ఆంధ్రబ్రాహ్మణ వర్గంలో గుర్తింపు లభించి, ఆ తరువాత కొద్దికాలానికే వారికి అధికార పదవులూ, కరణీకాలూ వగైరా లభించి ఉంటే వారు చాలా కీలక స్థానాలలో ఉన్నారని అనుకోవలసి ఉంటుంది. నందవరీకులను గురువులుగా సంభావించే, అమిత పరాక్రమవంతులైన తొగటవీరులు విజయనగర సామ్రాజ్య సైన్యంలో ప్రముఖ పాత్రనే నిర్వహించి ఉంటారు. అదీకాక సామ్రాజ్యానికి సువ్యవస్థితమైన ఆర్థికరంగ నిర్మాణం అవసరం గనుక, అందులో వస్త్రోత్పత్తులు ప్రముఖ పాత్రను వహించే ఉండాలి. ఇతరమైన పన్నులూ వగైరాలు చెల్లించగా చిన్నన్నకు మగ్గం ఒకటికి ఒక అపరంజి రూకను ప్రతి సంవత్సరం చెల్లించగల ఆర్థికస్థోమత పద్మసాలీల కుందన్నమాట.

జాండ్రవారుగా వ్యవహృతులైన దేవాంగులకూ పద్మశాలీలకూ ఆర్థిక రంగంలోని (వస్త్రపరిశ్రమలో) పోటీ మతపరంగా శ్రీ చాముండికావిలాసాది పురాణాలలో ప్రతిఫలించింది. దేవాంగులు వీరశైవులు. వీరు ద్రావిడదేశం నుంచి వలస వచ్చినవారై ఉండాలి. ఉత్తరాపథం నుంచి నందవరీకులతోపాటు వలస వచ్చిన పద్మశాలీయులు శాక్తేయులు. ఈ రెండు వర్గాల వారూ నేత పనివారే. అందువల్ల వారి మధ్య పోటీ అనివార్య మయింది. ఇందాక మనం చర్చించిన కథలలో ఎంత పట్టుదలతో ఉభయపక్షాల వారు ఈ పోటీని కొనసాగించారో వ్యక్తమౌతోంది.

పూర్వం వస్తూత్పాదన కులాలవారీగా పంచుకొని ఉండడంవలన, ఈనాటి పోటీల వంటివి ఆనాడు లేవు. దేశంలో అదే వృత్తిగా ఉన్న కొత్త శాఖలు ప్రవేశించినప్పుడు మాత్రమే పోటీ ఏర్పడేది. ఉదాహరణకు వడ్రంగికి, నేతపనివారికీ పోటీ అన్నది అసంభవం. కాకపోతే ఏ కులం ఏకులానికన్నా ఉన్నతమైనది అన్న విషయంలో వైషమ్యాలు తలెత్తడానికి అవకాశం ఉండేది. ఊహకందని కాలంలో రూపొందిన చాతుర్వర్ణ్యవ్యవస్థ ఈ విషయంలో ఆదర్శ ప్రాయమైనిలిచి వైషమ్యాలకు దారి తీసింది. కాని మాధ్యమిక యుగం నాటికే

నాలుగు వర్ణాల విభజన అస్పష్టమై అర్థరహితమై పోయింది. విజయనగర యుగంలో కులవ్యవస్థ జటిలమైపోయి ఏ విధమైన వర్గీకరణకూ లొంగనందు వల్ల అయోమయం ఏర్పడింది. అందువల్లనే కులచరిత్రలు పెద్ద ఎత్తున పుట్టుకు వచ్చాయి.

ఈ సాంఘిక నేపథ్యంలో నందవరీకులూ పద్మశాలీయులూ కలిసి మెలిసి తమ జీవయాత్రలను కొనసాగించారు. నందవరీక వంశంలో తొలిగా ప్రఖ్యాతుడైన వ్యక్తి అన్నమయ్య. నందవరీకులు శాక్తేయులు. బహుశా అందు వల్లనే శ్రీలక్ష్మికి ముఖ్యస్థాన మిచ్చిన వడగళై శాఖ వైష్ణవాన్నే ఆయన స్వీకరించాడు. నందవరీకుల కెంత లాభించిందోగాని ఆయన జననం మాత్రం తెలుగు సాహిత్యంలో వెలుగు పంటలను పండించింది.

శక్తియైన మాతృదేవత ఆరాధన సంప్రదాయంగా ఉన్న వంశంలో పుట్టి, శ్రీరామానుజాచార్యుల విశిష్టాద్వైత మతాన్ని స్వీకరించి, మొదట్లో వీరవైష్ణవాభి మానం కనపరచినా, శంకరాచార్యుల అద్వైతాన్ని ఖండించినా, చిట్టచివరకు అన్నమయ విశ్వమానవతావాదిగా రూపొందడానికి ఈ సామాజిక నేపథ్యమే కారణం.

శక్తిదేవతల ప్రీత్యర్థం జరిగే పరుషలలో, సంబరాలలో జానపద నృత్య గీతాది కళారూపాలతో ఆయనకు చిన్ననాటనుంచీ, నందవరీకుడిగా ప్రత్యక్ష పరిచయం ఉంది. ఎనిమిదవయేటనే ఇల్లు విడిచినా ఆయనకు ఈ కళారూపాల మీద మక్కువ తగ్గలేదు. తనకున్న కవితాశక్తితో, అసంఖ్యాకంగా కావ్యాలు రాయగలిగిన శక్తితో ఏ ప్రబంధాలో రాయకుండా, పదకవితా మార్గాన్ని చేబట్టి కొత్తదారులు తొక్కి తన తరువాతి తరాలలో పెల్లుబికిన పదకవిత, యక్షగాన ప్రక్రియలకు రూపుదిద్దిన పదకవితామార్గ సార్వభౌముడు. ఆయనను గురించి ఎక్కువగా తెలుసుకోవాలన్న ఆకాంక్ష మనలను ఆయన కులాన్ని గురించి చర్చించడానికి దారితీసింది గాని, చివరికి ఆయన జగన్మోహన కవితాగానంలో విశ్వమానవవాదిగానే దర్శన మిస్తున్నాడు.

"ఆతుమ సకల వ్యాపకమని తలపోసిన పిమ్మట
జాతియుఁ గులాభిమానముఁ జర్చింపనెరాదు !
....
పదిలంబుగ సర్వాత్మకభావము దలఁచిన పిమ్మట
ముదమున నెవ్వరిఁజూచినఁ మొక్కకపోరాదు !"[56]

అధోజ్ఞాపికలు

1. తాళ్లపాక సాహిత్యము - అధ్యాత్మ సంకీర్తనలు, 2వ సంపుటం 1981, పీఠిక పు. 35
2. అదే, పు. 37
3. యక్షులూ - యక్షగానమూ, భారతి, జనవరి, 1976
4. ఆంధ్రకవితరంగిణి, మొదటి సంపుటం, పుll లు 25-28
5. అదే, తొమ్మిదవ సంపుటం, పు. 157
6. అదే, పదమూడవ సంపుటం, పు. 176
7. తాళ్లపాకవారి పదసాహిత్యము, సంపుటి 16, చినతిరుమలాచార్యుల అధ్యాత్మిక శృంగారసంకీర్తనలు, పీఠిక. పుట. 15
8. తాళ్లపాక వారి పదసాహిత్యము, శృంగార సంకీర్తనలు, 12వ సంపుటం, ద్వితీయ ముద్రణ, పీఠిక, పు. 3
9. ఈ గ్రంథాల ఉనికి గురించి మిత్రులు శ్రీ ఘట్టమరాజు అశ్వర్థ నారాయణగారు నాకు తెలియజేశారు.
10. రాళ్లపల్లి పీఠికలు, పు. 131
11. శ్రీ చాముండికావిలాసము, చతుర్థాశ్వాసము, ప. 12
12. మాండలిక వృత్తిపదకోశం, వ్యవసాయం
13. త్రిపది, రగళె మత్తు జనపద సాహిత్య, సామాన్యనిగె సాహిత్యచరిత్రె, కాళెగౌడ నాగవార కన్నడ గ్రంథం, పుll లు 9, 181-182.
14. Antiqarian Remains in the Presidency of Madras, 1882, Vol. I, P. 70
15. విశాఖపట్టణము - జిల్లా వృత్తాంత సంగ్రహము, పుll లు 512, 523
16. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము. ఈ సంకీర్తన శ్రీ వేటూరి వారి పీఠికలో ఉదాహృతం, పు. 49; అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనల రేకు సంఖ్య 266
17. ఒడియా సాహిత్యచరిత్ర, డాll పురిపండా అప్పలస్వామి, పు. 13
18. విప్రుల ఇండ్లపేర్లు, శాఖలు-గోత్రములు. చతుర్థముద్రణము, 1983 సంకలనకర్త

విద్వాన్ శ్రీ ముసునూరి వేంకటశాస్త్రి. ఇందులోని వివరాలు సమగ్రం కావు.

19. అదే, పు. 58
20. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము. శ్రీ వేటూరి వారి పీఠిక, పు. 21 అన్నమయ్య పాటలు - శ్రీ రాళ్లపల్లి వారి పీఠిక, పు. 2
21. ఆంధ్రకవితరంగిణి, ఎనిమిదవ సంపుటం, పు. 174
22. శ్రీ చాముండికావిలాసం, పు. 165
23. అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు, 12వ సంపుటం, పునర్ముద్రణ, పీఠిక. పు. 5
24. ఆంధ్ర కవితరంగిణి, 13వ సంపుటం, పు. 174
25. A Note on the Telugu Brahmans - Prof. D. L. Prasada Rao (Un-published paper)
26. తెలుగు విజ్ఞాన సర్వస్వం, 3వ సంపుటం, పు. 14
27. శ్రీ వరాహపురాణం, 9. 123
28. కాశీఖండం
29. A note on Telugu Brahmins.
30. 'విప్రుల ఇండ్లపేర్లు, శాఖలు - గోత్రములు' గ్రంథం ఆధారంగా కట్టిన లెక్క ఇది.
31. Hindu World Vol. I. p.168
32. అధ్యాత్మ సంకీర్తనలు - చినతిరుమలాచార్య కృతములు, తాళ్లపాక వారి పదసాహిత్యము, 16వ సంపుటి, సంకీర్తన
33. శ్రీ తాళ్లపాక అన్నమాచార్య చరిత్రము, చిన్నన్న ద్విపద అవతరణిక
34. అదే, పు. 9
35. విశాఖపట్టణము - జిల్లా వృత్తాంత సంగ్రహము, పు. 91
36. తెలుగు విజ్ఞాన సర్వస్వము, 3వ సంపుటం, పు. 860 – నందరాజా కథ 'సిద్ధేశ్వర చరిత్ర - ప్రతాపచరిత్ర'లో కూడా ఉంది.
37. అదే, పు. 91
38. తెలుగు నాటక వికాసము
39. తాళ్లపాక సాహిత్యము అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం - 1, సంకీర్తన 275
40. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యోత్సవ సంచిక, 1949. శ్రీ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి గారి వ్యాసం
41. శ్రీనివాస మంగాపురం మరియు మన ఆలయముల చరిత్ర - శ్రీ గోపీకృష్ణ, పు॥లు 145–147

42. తెలుగు విజ్ఞాన సర్వస్వం, 3వ సంపుటం, పు. 778
43. 'ఈనాడు' దినపత్రిక, విశాఖ ముద్రణ, 1983 జూన్ 17వ తేదీ
44. History of Tirupati - T.K.T. Veera Raghavacharya, Vol. II, p. 530
45. శ్రీ అన్నమాచార్య చరిత్రము, పీఠిక పు. 117
46. అదే, పు. 116
47. అదే, పు. 116, అధోజ్ఞాపిక
48. ఆంధ్ర మహాభాగవతము, చతుర్థస్కంధము, వచనం 26
49. శ్రీ చాముండికావిలాసము, మూడవ ఋూశ్వాసము, ప. 66
50. బృహత్‌స్తోత్ర రత్నాకర, కన్నడలిపి
51. క్రీడాభిరామము - వేటూరి వారి పీఠిక, పు॥లు 103-104
52. తాళ్లపాక కవుల కృతులు - వివిధ సాహితీప్రక్రియలు - శ్రీ వేటూరి ఆనందమూర్తి గారి గ్రంథంలో ఉదాహృతం, పు. 330
53. యక్షులూ - యక్షగానం, భారతి, జనవరి, 1976
54. అదే
55. వరాహపురాణం
56. అధ్యాత్మ సంకీర్తనలు, మొదటి సంపుటం, 1980, సంకీర్తన 47.

3. జననవత్సర నిర్ణయం

చరిత్రలో కొన్ని ఘట్టాలు

మొట్టమొదటగా అన్నమయ సంకీర్తనలున్న రాగిరేకులను తిరుపతి ఆలయంలోని తాళ్లపాక వారి సంకీర్తన భాండాగారాన్నుంచి వెలికితీసి ప్రచురణకు సిద్ధం చేసి, ముందుగా తిరుపతి శాసనాలను గురించిన రిపోర్ట్‌లో అన్నమయ్యను గురించీ ఆయన పుత్రపౌత్రులను గురించీ లోకానికీ తెలియజేసిన ఘనత కీర్తిశేషులు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి దక్కింది. వారి రిపోర్ట్‌లో అన్నమయ సంకీర్తనలున్న రాగిరేకు మీది అవతారికను బట్టి క్రీ.శ. 1424 నాటికి అన్నమయకు 16 ఏళ్ల వయసుందనీ, ఆనాటి నుంచే సంకీర్తనల రచనకు ఆయన ఉపక్రమించాడనీ నిర్ణయించుకొని రాశారు[1] అయితే వారు ఈ విషయంలో వివరణలేమీ ఇవ్వలేదు.

అన్నమయ జననకాలాన్ని గురించి తరువాతి కాలంలో వివరంగా చర్చించిన వారు కీర్తిశేషులు శ్రీ చాగంటి శేషయ్యగారు. వారి 'ఆంధ్రకవితరంగిణి' లో శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారి నిర్ణయాన్నే బలపరుస్తూ విపులంగా రాశారు. ఆ తరువాత శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారూ, శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు గారూ కూడా వారి నిర్ణయాన్నే బలపరుస్తూ రాశారు. వీరందరూ అన్నమయ జనన వత్సరం క్రీ. శ. 1408గా నిర్ణయించుకొని వారికి తోచిన ఉపపత్తులతో తమ తమ వాదనలను కొనసాగించారు. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు మొదట 1945లో ప్రకటించిన శ్రీ వేంకటేశ్వర వచనముల పీఠికలో అన్నమయ జన్మవత్సరం 1408గా పేర్కొని తరువాత 1949లో తాము పరిష్కరించి ప్రకటించిన అన్నమాచార్య చరిత్ర పీఠికలో అన్నమయ జన్మవత్సరం 1424గా పేర్కొన్నారు. ఇందుకాయన ఆధారాలను చూపి చర్చ చేయలేదు గాని అవతారికలోని వాక్య విన్యాసాన్ని సూటిగా అర్థం చేసుకొని అభిప్రాయాన్ని మార్చుకొని ఉంటారని అనుకోవచ్చు. వీరిని అనుసరించి క్రీ.

శ. 1424 అన్నమయ జన్మవత్సరంగా భావించినవారిలో డా॥ వేటూరి ఆనందమూర్తి, డా॥ ముట్నూరి సంగమేశం గారలు విపులంగా చర్చించి నిర్ణయించారు.

అన్నమయ అధ్యాత్మ, శృంగార సంకీర్తనల తొలి రేకుల మీద ఉన్న వాక్యాలు ఇవీ –

'శుభమస్తు ॥శ్రీమతే రామానుజాయ నమః॥ స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శక వరుషంబులు 1346 అగు నేటి క్రోధి సంవత్సర మందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన పదారుయేండ్లకు తిరువెంగళ నాథుండు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహన శక వరుషంబులు 1424 అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ 12 నిరుధానకు తిరువేంగళనాథుని మీదను అంకితముగాను తాళపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగార సంకీర్తనలు॥[2]

అధ్యాత్మ సంకీర్తనల తొలి రేకు మీద కూడా ఇవే వాక్యాలు చివరన 'విన్నపము చేసిన అధ్యాత్మ సంకీర్తనలు''। అన్న చిన్నమార్పుతో ఉన్నాయి.

పై అవతారికలోని 'శాలివాహనశక వరుషంబులు అగు నేటి క్రోధి సంవత్సరం' అన్నది అన్నమయ జననవత్సరమా, కాక అన్నమయకు శ్రీ వేంకటేశుడు ప్రత్యక్షమైన సంవత్సరమా అన్న సందేహాన్ని కలిగించి పరిశోధకు లలో అభిప్రాయ భేదాలను కలిగించింది. పై అవతారిక 15వ శతాబ్దం నాటి వ్యావహారిక భాషలో ఉందన్న సంగతి విదితమే. వ్యావహారిక భాషాశైలిరీత్యా సూటిగా అర్థం చేసుకుంటే క్రోధి సంవత్సరంలో అన్నమాచార్యులు అవతరించా రనీ, పదహారు యేండ్లకు స్వామి ప్రత్యక్షమైనారనీ అప్పటి నుంచీ విన్నపం చేసిన సంకీర్తనలివి అనీ నిర్ణయానికి రావాలి. కాని పండితులైనవారు మరో రకంగా అర్థం చేసుకొని వ్యాఖ్యానించడం వల్ల అభిప్రాయభేదాలు ఏర్పడ్డాయి.

శ్రీ చాగంటి శేషయ్యగారు రేకుమీది అవతారికను గురించి రాస్తూ

'ఈ వ్రాత అన్నమాచార్యుల జీవితకాలములో వ్రాసినది కాదు. అన్నమాచార్యుల జనన మరణ కాలములను దెలుపుట ఈ లేఖకుని ఉద్దేశము కాదు'[3] అన్నారు. వారే మరొకచోట 'అన్నమయ చనిపోయిన దినమును గూర్చి భేదము లేదు'[4] అని కూడా అన్నారు. కాని అన్నమయ చనిపోయిన కాలం కూడా పై అవతారిక ఆధారంగానే కదా చెప్పగలిగేది ! మరి అది 'జననమరణ కాలములు తెలుపుటకు' కాదనటం ఆశ్చర్యం. అయితే కేవలం రచనాకాలాన్ని మాత్రమే సూచించదలుచుకొంటే పై అవతారికను చెక్కినవారు ఆఖరితేదిని వివరంగా ఇచ్చినట్లే ప్రారంభదినాన్ని కూడా వివరంగా ఇవ్వకుండా ఎందువల్ల అశ్రద్ధ చూప వలసి వచ్చింది ? ఇందుకు శ్రీ శేషయ్యగారు వివరణ లేమీ ఇవ్వలేదు. క్రోధి సంవత్సరంలోనే అన్నమయకు స్వామి సాక్షాత్కారం కలిగి అప్పుడే సంకీర్తనల రచనను ప్రారంభించారని శ్రీ శేషయ్యగారి వాదన. అయితే వారికే 'క్రోధి సంవత్సరముననేనాఁడు స్వామి ప్రత్యక్షమయ్యెనో చెప్పలేదు'[5] అనే విషయం కూడా తోచింది. అంటే క్రోధి సంవత్సర ప్రస్తావన మరి జననకాలాన్నీ సూచించక, స్వామి ప్రత్యక్షమైన కాలాన్నీ సూచించక మరి దేనిని సూచిస్తున్నట్లో వారు ఆలోచించినట్లు కనబడదు. అయితే వారు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారి నిర్ణయాన్నే ఉపపత్తులతో బలపరుస్తూ కూడా 'శ్రీ సుబ్రమ్మణ్యశాస్త్రిగారి యూహ దూరాన్వయ దోషమునకు గురియైనది. ప్రభాకర శాస్త్రిగారి నిర్వచనమునందది లేదు'[6] అని కూడా అన్నారు. నిజమే, అయినా వీరు ఇలా తప్పుదారిన పడటానికి కారణం శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు అన్నమాచార్య చరిత్ర పీఠికలో 'వైశాఖమాసమున విశాఖ నక్షత్రము ప్రాయికముగా పూర్ణిమాతిథికి వచ్చును. కనుక వైశాఖపూర్ణిమ జన్మతిథిగా కూడ నిర్ణయింపవచ్చును'.[7] అని రాసిన వాక్యమే. అయితే పూర్ణిమాతిథి ప్రసక్తి ఒక్క శ్రీ వేటూరి వారి వాక్యంలో తప్ప అన్నమాచార్య సంబంధాలయిన ఆకరాలలో ఎక్కడా లేదు. కాని శ్రీ శేషయ్యగారు తమ ప్రయత్నాన్నంతా పూర్ణిమా, విశాఖ నక్షత్రాలు కలిసి తటస్థించిన కాలం కోసం వినియోగించడం వలన విఫలురైనారు. వైశాఖ విశాఖ ప్రస్తావనకు ఆధారం చిన్నన్న అన్నమాచార్య చరిత్రలో –

'చక్కని గ్రహము లుచ్చమున మూఁడలర
అనుపమ లగ్నంబునందు వైశాఖ
మున విశాఖను జగంబున నుల్లసిల్ల
జనియించె నన్నమాచార్యుండు'[8]

అని రాసి ఉండడమే. అదీకాక చిన్నన్న 'తాళ్లపాక్కం తిరువేంకట నాథర్' క్రీ. శ. 1546 జూలై 17వ తారీఖున వేయించిన శాసనంలో 'తాళ్లపాక్కం అన్నమయ్యంగార్' జన్మ నక్షత్రం 'వైశాఖంలోని వైకాసి' స్వామికి 'పరుప్పవియల్ -పడి'సి సమర్పించాలని దేవాలయ స్థానపతులతో ఒప్పందం చేసుకున్నాడు.[9] పై రెండు ఆధారాల వల్ల అన్నమయ జన్మనక్షత్రం వైశాఖ విశాఖగా తేలింది.

పై ద్విపదపంక్తుల నుదహరించి చర్చలు సాగించిన శ్రీ శేషయ్యగారు చిన్నన్న శాసనాన్ని చూసినట్టు లేదు. అయితే వారు చూసిన 'అన్నమాచార్య చరిత్ర'కు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పీఠికలో 'ధర్మకైంకర్యములు' అన్న ఉపశీర్షిక కింద[10] ఈ శాసనపు వివరాలను ఇచ్చిన విషయాన్ని ఎందువలననో గమనించలేదు. అయితే పై ద్విపద పంక్తులనుదహరించిన వెంటనే ఆయన 'ఈ వాక్యములలో నన్నమయ జన్మతిథిని సరిగా నిర్ణయించుట కాధారములు లేవు'[11] అన్నారు. తేదీని నిర్ణయించడానికి ఆ వివరాలు చాలవా ?

శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు కూడా మరో ఆలోచన లేకుండా '1408 విరోధి వైశాఖశుద్ధ పూర్ణిమ విశాఖ నక్షత్ర మనుట సబబు'[12] అంటూ పైవారి పొరబాటు బాటనే పయనించారు. వారు చూపిన ఉపపత్తులు తర్కానికి నిలిచేవి కావు. వారి ఉద్దేశంలో 'జన్మప్రభృతి పదహారేండ్ల వరకు గడచిన కాలము సారహీనమైనదనియు, పదహారవయేట తిరువెంగళనాథుడు ప్రత్యక్షమైన తర్వాత అతనిపై దినమునకు ఒక్క కీర్తనమునకు తక్కువ గాకుండ స్వామిని కొనియాడిన కాలమే సారభూతమైనదనియు, ఆ పని నిర్యాణ దినము వరకు సాగినందున నిర్యాణదినము మాత్రము దుందుభి-ఫాల్గుణ

బహుళ 12 లెక్కకు వచ్చినదనియు తెలుపుటే ఈ వాక్యపరమార్థము' అంటూ చెప్పిన వీరు, 'విర్తకుడగు అన్నమయ్య ఈ విధముగ లెక్కించెననుట సమంజసము'[13] అంటూ హాస్యస్ఫోరకమైన వ్యాఖ్యానం చేశారు. సత్యశోధనకై సాగిన పెద్దల చర్చలన్నింటినీ వీరు 'ఇంతకూ అన్నమయదృష్టిలోనే అసారభూతమైన పదహారేండ్ల వయసునకై చేసిన ఈ కోలాహలమూ అసారమే'[14] అంటూ కొట్టేసినా వీరు కొత్తగా సాగించిన పరిశోధనమూ లేకపోవడం విచారకరం. వీరే మరొకచోట 'స్వామి నందకాంశభవుడై మేటి మేధావియై ఐదేండ్లకే ఉపనయనము చేయించుకొన్నవాడు ఎనిమిదేండ్లకు సంకీర్తనములల్లలేడా ?'[15] అని ప్రశ్నించినపుడు అన్నమయ బాల్యం అసార భూతమన్న విషయం మరచి పోవడమూ, స్వామి నందకాంశభవుడైన వ్యక్తికి అసారభూతమైన కాలమెలా ఉండగలదన్న సందేహమూ కూడా కలగకపోవడం విచిత్రం. ఇంతకూ శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారి వాక్యంలో 'ప్రాయికంగా' అన్నపదాన్ని వదలి 'పూర్ణిమా తిథిని' పట్టుకొని నేలవిడిచి సాము చేసిన వారైనారు పరిశోధకులు !

శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నిర్ణయాన్నే ఆమోదించి కొంత చర్చ చేసిన వారు శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు గారు. శ్రీ ముట్నూరి సంగమేశంగారి గ్రంథానికి ఉపోద్ఘాతం రాస్తూ '1346 క్రోధి' అన్నది అన్నమయ్య జననమా ? వేంకటేశ్వరుని సాక్షాత్కారమా ? అన్నది కొంత యోచించి తేల్చవలసిన విషయం. రాగిరేకుల మీది వ్రాత ప్రధాన ఉద్దేశ్యం అన్నమాచార్యుల జనన మరణాలను గురించి తెలపడం కంటే సంకీర్తన రచనా ప్రారంభ పరిసమాప్తాలను తెలపడమే అని తోస్తుంది'[16] అంటూ దానికి బలంగా పెదతిరుమలాచార్యుల సంకీర్తనల తొలి రాగిరేకులోని అవతారికనుదహరించారు. ఆ అవతారికలో 'పెద తిరుమలాచార్యుల సంకీర్తన రచనా ప్రారంభమునే తెలుపడం జరిగింది' అంటారు. పెదతిరుమలాచార్యుల సంకీర్తనల తొలిరేకుల అవతారిక ఇలా ఉంది–

'శ్రీ వేంకటేశాయ నమః । శాలివాహనశక వర్షంబులు 1424 అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ 12 మొదలు గాను తాళ్లపాక అన్నమాచార్యులుంగారు తమ కొమారుండు తిరుమలాచార్యులను దినమొక సంకీర్తన శ్రీ వేంకటేశ్వరునకు అంకితం చేసి చెప్పుమనంగాను విన్నపము చేసిన సంకీర్తనలు।'[17]

ఈ అవతారికలోని తేదీ అన్నమయ నిర్యాణదినాన్ని సూచిస్తోందన్న సంగతి విదితమే. ఈ తేదీ అన్నమయ రేకుల్లోని అవతారికలలో కూడా ప్రసక్తమైంది. మరణశయ్యపై నుండి తండ్రి చెప్పగా, తండ్రి మాటను ఆజ్ఞగా శిరసావహించి, ఆ విషయాన్ని భక్తి గౌరవపురస్సరంగా స్మరించడం పెద తిరుమలాచార్యుల ఆశయంగా మనం గుర్తించాలి. ఈ సందర్భంగా తాళ్లపాక వారి ఇతర కృతుల తొలిరేకుల మీది అవతారికలను కూడా పరిశీలించాలి.

పెదతిరుమలాచార్యుల సుదర్శన రగడ రేకు మీది అవతారిక –

'శ్రీమతే రామానుజాయ నమః ॥ తాళ్లపాక అన్నమాచార్యుల కొమారుండు తిరుమలయ్యంగారు చెప్పిన సుదరిశన రగళ ।'[18]

చినతిరుమలాచార్యుల సంకీర్తన లక్షణం రేకుమీది అవతారిక –

'శ్రీమతే రామానుజాయనమః ॥ తాళ్లపాక అన్నమాచార్యుల కుమారుండు పెదతిరుమలాచార్యులు । వారి కుమారుండు చినతిరుమలాచార్యులు ఆనతిచ్చిన సంకీర్తన లక్షణమైన పదచ్ఛందము॥'[19]

చినతిరుమలాచార్యులదే అష్టభాషాదండకము రేకుమీది అవతారిక –

'శ్రీమతే రామానుజాయనమః॥ తాళ్లపాక అన్నమాచార్యుల కుమారుండు పెదతిరుమలాచార్యులు । వారి కుమారుండు చినతిరుమలాచార్యులు ఆనతిచ్చిన అష్టభాషా దండకము ॥'[20]

ఈ పై అవతారికలను పరిశీలించినట్లయితే ఒక్క పెద్దతిరుమలా

చార్యుల సంకీర్తనలకు తప్ప ఆయన ఇతరకృతులకు గానీ ఆయన కొడుకు చిన తిరుమలాచార్యుల కృతులకు గానీ ఏ విధమైన తేదీలూ ఇవ్వడం జరగలేదు, ఎందువల్ల అన్న ప్రశ్న సహజంగానే ఉత్పన్నమౌతుంది. సంకీర్తనల విషయంలో తండ్రి ఆజ్ఞను గౌరవపూర్వకంగా స్మరించడమే తప్ప కేవలం రచనాప్రారంభాన్ని సూచించడం అవతారిక లక్ష్యం కాదని విదితమౌతోంది. అంతేకాక తండ్రి ఆజ్ఞను పాటించిన పెదతిరుమలాచార్యులు ఆ విషయాన్ని ఒక సంకీర్తనలో చెప్పుకోవడం చూస్తే దానికాయన ఎంత ప్రాముఖ్యాన్నిచ్చిందీ వ్యక్తం కాగలదు. ఆ సంకీర్తనలో ఆయన 'మా గురుఁడాడేవాక్యము నీ యాధీనము' 'నీ దాసుని ఆనతి యమోఘము' 'పరగ మాజనకుని ప్రతిజ్ఞయు నీపంపు', నిరతి శ్రీ వేంకటేశ నీపంతము సతము'[21] అంటూ మళ్లీ స్మరించుకున్నాడు.

ఈ పై ఆధారాల వల్ల శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు గారి వాదనకు ఇబ్బంది కలుగుతోంది. అందువల్ల రేకులమీది తేదీలు రచనా ప్రారంభాన్ని సూచించేవి కావనీ, జన్మకాలాన్ని సూచించేవేననీ రుజువవుతున్నది. అయితే జన్మవత్సరాన్ని తెలిపినవారు తేదీని కూడా ఎందుకు తెలియజేయలేదు అన్న ప్రశ్నకు సమాధానం చెప్పుకోవలసి ఉంది. సంకీర్తన భాండారాన్ని వెలయించడమే కాక శిలాఖండాల మీద సరిగమాది స్వరవిన్యాసాలతో సాహిత్యాన్నేకాక సంగీతాన్ని కూడా శాశ్వతంగా ప్రతిష్ఠించాలని అన్నమయ సంతతి చేసిన ప్రయత్నం సామాన్యమైనది కాదు. అలాగే రాగిరేకుల మీదికెక్కించి ప్రతులు తయారు చేసి అహోబలము శ్రీరంగం క్షేత్రాలకు పంపి భద్రం చేయించి, తమ సాహిత్యం పదికాలాలపాటు నిలిచి ఉండాలనే కాంక్షతో ప్రయత్నం చేసిన వారు, అన్నమయ జాతకచక్రాన్ని కూడా భద్రపరచే ఉంటారు. మనకు తెలిసినంతలోనే మనకు లభ్యంకానివి చాలానే ఉన్నాయి. అన్నమయ జన్మ తిథి అనాటికి ప్రసిద్ధమే కనక రేకుమీద అవతారికను చెక్కించేటప్పుడు వారు పెద్దగా పట్టించుకోలేదని భావించవలసి ఉంటుంది.

1408 ని అన్నమయ జన్మవత్సరంగా నిరూపించదలుచుకొన్నవారిలో సైతం తేదీ విషయంలో ఏకవాక్యత లేకపోవడం గమనార్హం. శ్రీ చాగంటి వారి లెక్కలో 'విరోధి సంవత్సర వైశాఖ శుక్లపూర్ణిమా 29 ఏప్రియల్ 1408 సోమవార' మాతని జననకాలం కాగా, శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి లెక్కలో 'సర్వధారి సంవత్సరమున నిజ వైశాఖమాసమున శుక్లచతుర్దశి బుధవారమున' 9 మే 1408 జన్మించాడు.[22]

ఇప్పటిదాకా అన్నమయ జననవత్సరం క్రీ. శ. 1408గా ప్రతిపాదించిన వారి వాదనలను పరిశీలించి ఆ వాదనలు సహేతుకం కావని గమనించిన పరిశోధకులూ, విపులంగా చర్చించినవారు ఇద్దరున్నారు. డా॥ వేటూరి ఆనందమూర్తిగారూ, ఆచార్య ముట్నూరి సంగమేశం గారూ శాస్త్రీయంగా తమ ఉపపత్తులను చూపుతూ చర్చించారు. వారి నిర్ణయాలను కూడా పరిశీలనలోకి తీసుకోవలసి ఉంది.

మొట్టమొదటగా 1424 సంవత్సరాన్ని అన్నమయ జననవత్సరంగా సూచించినవారు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. అయితే వారు విపులంగా చర్చించలేదు. కాని వారు అన్నమాచార్య చరిత్రకు రాసిన విపులమైన పీఠికలో ఎన్నో విషయాలను తెలియజేస్తూ, అనేక సంకీర్తనలను ఉదాహరిస్తూ అత్యంత ప్రామాణికబుద్ధితో అన్నమయ చారిత్రకరూపాన్ని మన కళ్లకు కట్టే విధంగా రచించారు. ఆ తరువాత వారి సూచనను సమర్థిస్తూ వారి కుమారులు డాక్టర్ ఆనందమూర్తిగారు శ్రీ చాగంటి శేషయ్యగారి వాదనను ఖండిస్తూ తమ 'తాళ్లపాక కవుల కృతులు-వివిధ సాహితీప్రక్రియలు' అన్న గ్రంథంలో విపులంగా చర్చించారు. వారి వాదనలో ప్రధానంగా అన్నమయ మనుమడైన చిన తిరుమలాచార్యులకు బ్రహ్మోపదేశం చేశారన్న సమాచారాన్ని పురస్కరించుకొని చినతిరుమలా చార్యుల వయసునూ, పెదతిరుమలాచార్యుల వయసునూ అంచనాకట్టి అన్నమయ జన్మవత్సరాన్ని 1424గా నిర్ధారించారు. ఈ సందర్భంగా అన్నమయ వివాహమూ, సంతానం కలగడమూ వంటి వివరాలకు

Subhash Nunna

ఉజ్జాయింపుగా కాలనిర్ణయం చేశారు.[23] పెదతిరుమలాచార్యుల శాసనాలూ, చినతిరుమలాచార్యుల శాసనాలనూ కూడా పరిగణనలోకి తీసుకొని తమ వాదాన్ని సహేతుకంగా సాగించారు. వారి గ్రంథం ముద్రితమై లభిస్తున్నది గనుక వారి వాదనలను ఇక్కడ మళ్లీ ప్రదర్శించక, గుర్తించవలసిన మరికొన్ని విషయాలను మాత్రం ప్రస్తావిస్తున్నాను.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్య చరిత్ర పీఠికలో క్రీ. శ. 1503 దాఁక జీవించిన యన్నమాచార్యుఁడీ పెదతిరుమలయ్య పెదకుమారుఁడగు చినతిరుమలయ్యగారికి బ్రహ్మోపదేశముఁ జేసినాడు. 1500 ప్రాంతముల చినతిరుమలయ్య ఉపనయనము జరిగిదనుకొన్నచో 1493 ప్రాంతముల జన్మించిన తిరుమలయ్య తండ్రి అప్పటి కిర్వదేండ్లవాఁడే అనుకొన్నను 1473 ప్రాంతముల జన్మించినవాఁడగును'[24] అని రాశారు. శ్రీ గౌరిపెద్ది రామసుబ్బ శర్మగారికి 'ఇదెట్లు పొసగును?' అన్న సందేహం కలిగి ఆ పుటలోనే అధో జ్ఞాపికలో వెల్లడించారు. 1473లో పెదతిరుమలాచార్యులు జన్మించారనీ, చినతిరుమలాచార్యుల ఉపనయనం 1500 ప్రాంతాన జరిగిందనీ, చినతిరుమలాచార్యులు జన్మించేనాటికి పెదతిరుమలాచార్యుల వయస్సు 20 సంవత్సరాలుండవచ్చునీ శ్రీ ప్రభాకరశాస్త్రిగారు భావించినట్లు నిదానించి చదివితే అర్థం కాకపోదు. అన్నమయ జననవత్సరాన్ని అంచనా కట్టడానికి కాక పెద తిరుమలాచార్యుల జననకాలాన్ని ఉజ్జాయింపుగా లెక్కకట్టడానికి శ్రీ వేటూరి వారు ఈ చర్చను చేశారు. అయితే శ్రీ చాగంటి వారు ఈ లెక్కను అన్నమాచార్య జననవత్సరాన్ని నిర్ణయించడంకోసమై పొడిగించి చర్చించారు. శ్రీ చాగంటి వారు –

> 'చినతిరుమలాచార్యులు తన పితామహుడైన అన్నయాచార్యులను సంబోధించుచు వ్రాసిన కీర్తన ఒకటి ఉన్నది. అది అన్నమాచార్యుల జీవితకాలములో రచించినట్లు కన్పట్టుచున్నది. చినతిరుమలయ్య జననము శ్రీ శాస్త్రులుగా రనినట్లు

> 1495 ప్రాంతమైనచో అన్నమాచార్యుల జీవిత కాలములో నా కీర్తన వ్రాయుట అసంభవము'[25]

అంటారు. 1493లో చినతిరుమలాచార్యులు జన్మిస్తే ఆనాటికి అన్నమయ వయసు 69 సంవత్సరాలుండాలి. అన్నమయ నిర్యాణ సమయానికి చినతిరుమలాచార్యుల వయసు 10 సంవత్సరాలుంటుంది. కుశాగ్రబుద్ధి కలవారు పదోయేట సంకీర్తన రాయడంలో వింత ఉండదు గాని బ్రహ్మోపదేశానికి ఆ వయసు చాలు. శ్రీ వేటూరి వారు ప్రస్తావించిన విషయం బ్రహ్మోపదేశమే. శ్రీ చాగంటివారు మరొకచోట చినతిరుమలయ్య జననము 1585 ప్రాంతమని శ్రీ ప్రభాకరశాస్త్రుల వారు వ్రాసి ఉన్నారు'[26] అంటారు. ఆ మాటను శ్రీ వేటూరి వారు అనలేదు. ఆ తరువాత 'తిరుమల దేవస్థానము రిపోర్టులోఁ పెదతిరుమలయ్య నాల్గవ సంతానమైన చిన్నన్న అష్టమహిషీ కళ్యాణాది గ్రంథకర్త క్రీ. శ. 1493-1561 కాలమువాఁడని వ్రాసి ఉన్నారు'[27] అనడం నిరాధారం. దేవస్థానపు శాసనాల రిపోర్టులో ఆ విషయం లేనేలేదు. 'దానిని బట్టి లెక్కించి చూచినచోఁ పెదతిరుమలయ్యకుఁ ప్రథమసంతానమైన చినతిరుమలయ్య క్రీ.శ. 1585 ప్రాంతమున జన్మించి ఉన్నట్లు తేలుచున్నది. అప్పటికి పెద తిరుమలయ్యకు ముప్పదియేండ్లున్నవన్నచో ఆతని జననము 1550 ప్రాంతమగును. దీనినిబట్టి కూడ నన్నమాచార్యుల జననము క్రీ.శ. 1506 అనుటయే ఉచితము' అన్నారు. ఈ పేరాలోని సంవత్సర సంఖ్యలన్నీ అచ్చుతప్పులై ఉండాలి. వాటిని వరుసగా 1485, 1450, 1408గా సవరించుకొని చూస్తే 1485లో చిన తిరుమలాచార్యుల జననమనీ, అప్పటికి ముప్ఫయి ఏళ్ల వయసున్న పెద తిరుమలాచార్యులు 1455లో జన్మించాడనీ, ఆ ప్రకారంగా చూస్తే అన్నమయ జననం 1408 అవుతుందనీ శ్రీ చాగంటి వారి అభిప్రాయమై ఉండాలి. అయితే అన్నమయ జననం 1408లో అయితే అన్నమయ 40వ ఏట పెదతిరుమలాచార్యులు జన్మించి ఉండాలి. 1424లో అన్నమయ జన్మించి ఉంటే పెదతిరుమలాచార్యుల జననం నాటికి అన్నమయ్య

కు 31 సంవత్సరాలుండాలి. అన్నమయ నిర్యాణం నాటికి చిన తిరుమలా చార్యుల వయసు 18 సంవత్సరాలుండి ఉండాలి.

శ్రీ చాగంటి వారు 'సామాన్యముగా నా కాలమునఁ పెండ్లి వయసు ముప్పది వత్సరములు' అంటూ అన్నమయ విషయంలో 'ముప్పది ఐదు వత్సరము లనుకొందము' అంటూ కన్సెషన్ ఇచ్చారు. ఈ విషయావిష్కరణకి ఆధారమేమిటో వారు చెప్పలేదు. దాదాపు ఈ శతాబ్దపు ప్రారంభం దాకా ఉన్న సంప్రదాయం వెళ్లినాటికి పెళ్లికొడుకు వయసు ఇరవై సంవత్సరాలకు కొద్దిగా అటూ ఇటూగా ఉన్నది. ఉదాహరణకు గురజాడకు వివాహం నాటికి 23 సంవత్సరాల వయసు. బసవరాజు అప్పారావు గారికి 22వ ఏట వివాహ మైంది. మహారాజా ఆనందగజపతికి 20వ ఏట వివాహమైంది. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారికి 14వ ఏట వివాహమైంది. రావిచెట్టు రంగారావుగారికి 13వ యేట వివాహమైంది. ఇలా వివరాలిస్తూ పోతే గ్రంథం పెరుగుతుందనే భావంతో మానుతున్నాను. పెద తిరుమలా చార్యులు జన్మించేనాటికి అన్నమయ వయసు 30 సంవత్సరాల ప్రాంతాన ఉంటుందని భావించడమే సహేతుకం. ఈ విషయంలో శ్రీ చాగంటి వారి వాదనకు వారే ఇచ్చిన వివరాలు బలం చేకూర్చడం లేదు.

ఇక చిన తిరుమలాచార్యుల విషయం. రాగిరేకుల మీద లభించిన సంకీర్తనలను పరిశీలిస్తే విషయం విదితమౌతుంది. ఆయనవి మొత్తం నాలుగు సంకీర్తనలు అన్నమయను ప్రస్తావించినవి ఉన్నాయి. నాలుగూ అన్నమయ పట్ల మనుమడికి ఉన్న ప్రగాఢ గౌరవాన్నీ చనువునీ తెలియజేసేవే. రెండు మాత్రం విషయచర్చకి అవసరమైనవాటిని ఉదాహరిస్తున్నాను. వీటిలో మొదటిది అన్నమయను ఉద్దేశించి చెప్పినది –

'తాళ్లపాకాన్నమాచార్య దైవమవు నీవు మాకు
వేళమె శ్రీహరిఁ గనే వెరవాన తిచ్చితివి.

గురుఁడవు నీవె సుమ్మీ కుమతినైన నాకు
సరవి బ్రహ్మోపదేశము సేసితి
పరమబంధుఁడవైనా పరికింప నీవే సుమ్మీ
వరుస నేఁజెడకుండ వహించుకొంటివి ॥

తల్లివైన నీవెసుమ్మీ తగిన విషయాలలో
పల్లదానఁ బడకుండా బ్రతికించితి
అల్లుకొని తోడునీడవైనా నీవె సుమ్మీ
చిల్లర మాయలలోనఁ జెడకుండా జేసితి ॥

దాతవు నీవె సుమ్మీ తగు శ్రీ వేంకటనాథు
నా తలఁపులో నిలిపి నమ్మఁజేసితి
యేతలఁజూచినా నాకు నేడుగడయు నీవే
ఆతల నీతల నన్ను నాదుకొని కాచితి ॥'[28]

చిన తిరుమలాచార్యులు అన్నమయను తనకు బ్రహ్మోపదేశం చేసిన గురువుగా మాత్రమే కాక తనను తల్లిలా కాపాడుకొంటూ వచ్చినవైనాన్ని ఈ పాటలో మనకు తెలియజేస్తున్నాడు. ఇక రెండో సంకీర్తన శ్రీ వేంకటేశ్వరుని ఉద్దేశించి చెప్పినది –

నీవు గలిగినఁజాలు నిక్కము అన్నీఁ గలవు
ఆవల మాయా చార్యుఁడానతిచ్చేనయ్యా

యెన్నడుఁ గలఁగ నట్టి హితుడ నీవె
పన్నినట్టె ఉండె నిచ్చపంటా నీవె
నన్నుఁగాచే శ్రీ వేంకటనాథుడవని తాళ్లపా
కన్నమయ్యగారె నాకు నానతిచ్చిరయ్యా[29]

ఈ రెండు సంకీర్తనలూ అన్నమాచార్యులతో చిన తిరుమలాచార్యుల కున్న గట్టి పరిచయాన్ని సూచిస్తున్నాయి. ఈ సంకీర్తనలు అన్నమయ జీవిత

కాలంలోనే రాసినట్లు శ్రీ చాగంటివారు భావించారు కాని అలా అనుకోవడానికి తగిన కారణాలు లేవు. కాకపోతే అన్నమయ దగ్గర చిన తిరుమలయ్య బ్రహ్మోప దేశం పొందడమే కాక ఇతర విషయాలను కూడా కొంత అధ్యయనం చేసి ఉండాలి. పైన ఉదాహరించిన రెండో సంకీర్తనలో 'మాయాచార్యుఁడానతిచ్చె నయ్యా' 'మా గురుడిట్టె ఆనతిచ్చెనయ్యా' 'దేశికుడె ఆనతిచ్చెనయ్యా' 'తాళ్లపాకన్నమయ్యగారె నాకు నానతిచ్చిరయ్యా' అంటూ నొక్కి చెప్పడం వల్ల తాత గారి దగ్గర మనవడికున్న చేరిక అర్థమౌతోంది. అన్నమయ నిర్యాణ సమయానికి చిన తిరుమలయ్యకు పది సంవత్సరాల ప్రాయముంటే ఇంతగా నొక్కి చెప్పడానికి ఆ సాన్నిహిత్యం సరిపోదు. అందువల్ల శ్రీ ప్రభాకర శాస్త్రి గారిచ్చిన అంచనాలను సవరించవలసి ఉంటుంది. పెద తిరుమలాచార్యుల శాసనాలు క్రీ.శ. 1517 నుంచి 1553 దాకా కనిపిస్తున్నాయి.[30] శ్రీ వేటూరి ఆనందమూర్తిగారు భావించినట్లు పెద తిరుమలయ్య జననవత్సరం 1458 అయినట్లయితే ఆయన 95 ఏళ్ల వయసు దాకా జీవించినట్లవుతుంది. లోకా చారం ప్రకారం పెద తిరుమలయ్యకు 20వ ఏట వివాహమైతే 1483 ప్రాంతాల చిన తిరుమలాచార్యులు జన్మించడానికి అవకాశం ఉంది. అంటే అన్నమయ నిర్యాణ సమయానికి చిన తిరుమలయ్య వయసు ఇరవై సంవత్సరాలుండి ఉండాలి. చిన తిరుమలాచార్యులు మరొక సంకీర్తనలో -

'శిరసు కూఁకటుల రాఘవా, చిన్నారి పొన్నారి రాఘవా
గరిమ నావయసున తాటకిఁ జంపిన కౌసల్యనందన రాఘవా'[31]

అని చెప్పుకోవడాన్ని బట్టి చిన్న వయసులోనే ఆయన సంకీర్తన రచనను ప్రారంభించినట్లు తెలుస్తోంది. శ్రీ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారు ఈ సంకీర్తన విషయమై చర్చించి 'చిన తిరుమలయ్యయు పదునైదు వత్సరములు గడిచి పదునాఱవ సంవత్సరము వచ్చిన పిదపనే కీర్తనలు రచించినాడని మనము విశ్వసింపవచ్చును'[32] అంటూ సహేతుకంగా నిర్ణయించారు. అంటే అన్నమయ జీవితకాలంలోనే చిన తిరుమలయ్య తాత

గారి పర్యవేక్షణలోనే సంకీర్తన రచనను ప్రారంభించి ఉండాలి. ఒక సంకీర్తనలో-

కదిసియే జన్మానఁగానని సంకీర్తన
మదన నుపదేశించె నన్నమాచార్యుఁడు[33]

అని స్పష్టంగా చెప్పనే చెప్పాడు కూడా ! అందువల్లనే ఆయనకు తాతగారంటే అంత అభిమానం. ఆ అభిమానంతోనే అన్నమయ సంస్కృత రచన సంకీర్తన లక్షణ గ్రంథాన్ని తెలుగు చేశాడు.

ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని చూస్తే డాక్టర్ ఆనందమూర్తి గారు పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్యల శాసనాల కాలాన్ని పరిగణన లోకి తీసుకొని చర్చించి నిర్ణయించిన కాలక్రమణిక సహేతుకమని చెప్పక తప్పదు.

ఇప్పటిదాకా అన్నమయ జనన వత్సర విషయంలో వినూత్నమైన మార్గంలో చర్చించి శాస్త్రీయమైన పద్ధతిలో 1424ను అన్నమయ జనన వత్సరంగా ప్రతిపాదించినవారు డాక్టర్ ముట్నూరి సంగమేశంగారు.

డాక్టర్ సంగమేశంగారు తమ ఆలోచనలను ద్వివిధంగా కొనసాగించారు. ఒకటి జ్యోతిషశాస్త్ర పద్ధతిని అన్నమయ జీవితాన్ని పరిశీలించి 1408, 1424 లలో తేదీలు నిర్ణయించి ఏది అన్నమయ జీవితసరళికి అనుకూలమైనదో నిరూపించడం. రెండోది కేవలం లౌకిక విషయాలను బట్టి అంటే చారిత్రక సంఘటనలను కూడా గ్రహించి కాలనిర్ణయం చేయడం. వారి మాటల్లోనే 'అవతారికలోని వాక్యములతోపాటు అన్నమయ జీవితములో జరిగిన సంఘటనలు కూడా గ్రహించి, పై రెండిటిలో ఏది జన్మతిథిగా గ్రహించినచో అప్పటి కతని కేర్పడు వయస్సు ఆయా సంఘటనల కనుగుణంగా నుండునో అది చూచుట యుక్తము'[34] అన్న శాస్త్రీయదృష్టిని పరిశీలించటం విజ్ఞుల విధి. వారి నిర్ణయం ప్రకారం -

'శా. శ. 1330 సర్వధారి సం॥ వైశాఖ శుద్ధ చతుర్దశీ బుధవారము – తేది 22.5.1408 నాడు సూర్యోదయవేళకు విశాఖా నక్షత్రము వర్తించుచున్నది. అది అంతకు తొలినాడు, అనగా 21.5.1408 మంగళవారమునాడు రాత్రి 7–47 గంటల వరకున్నది'

'శా. శ. 1346 క్రోధి సం॥ వైశాఖ శుద్ధ చతుర్దశీ శుక్రవారము 25.5.1424 నాటి రాత్రి 9.22 గంటల వరకు విశాఖ నక్షత్ర మున్నది. అది అంతకు తొలినాడు అనగా 24.5.1424 గురువారమునాడు రాత్రి 7.40 గంటలకు ప్రారంభించినది'.[35]

పై తేదీలలో ఉన్న గ్రహసంపదను సమీక్షించి శ్రీ సంగమేశం గారు రెండవది 'మరింత మేలుగా నున్నది' అన్నారు. జ్యోతిశ్శాస్త్ర విషయాలతో సాధికారంగా చర్చించారు. అలాగే నిర్యాణకాలాన్ని బట్టి కూడా జ్యోతిషశాస్త్ర రీత్యా చూసి 1424 నాటి తేదీనే సరియైనదిగా నిర్ణయించారు.

ఇందులో 1408కి నిర్ణయించిన తేదీ శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారూ, శ్రీ చాగంటి వారూ ఇచ్చిన తేదీలలో దేనితోనూ సంవదించకపోవడం గమనించ వచ్చు. డాక్టర్ సంగమేశం గారు ప్రస్తావించిన ఇతర విషయాలను పరామర్శించే ముందు గమనించవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి.

ఇంతకు పూర్వం ఇచ్చిన శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి, శ్రీ చాగంటి శేషయ్య గారి నిర్ణయాల ప్రకారం అన్నమయ జననం సోమవారం నాడు గాని, బుధవారం నాడు గాని సంభవించి ఉండాలి. డాక్టర్ సంగమేశం గారి నిర్ణయానుసారం 1408 లో వైశాఖమాసంలో విశాఖా నక్షత్రం మంగళ, బుధవారాలలో ఉన్నది. ఒక్క 1424 సంవత్సరంలోనే వైశాఖా మాసం విశాఖా నక్షత్రం గురు, శుక్రవారాలలో ఉన్నది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పరిశీలిస్తే పరోక్షాధారాలు కొన్ని మనకు లభిస్తున్నాయి.

అన్నమయ గురువారం రాత్రి జన్మించారనేందుకు పెద తిరుమలయ్య శాసన మొకటి ముఖ్యమైన పరోక్షాధారం. స్వామి పుష్కరిణి మెట్లమీద శ్రీ వరాహస్వామి ఆలయాభిముఖంగా ఒక శిలాఫలకముంది. ఆ శిలా ఫలకం మీద ఒకవైపున శ్రీ వేంకటేశ్వరుని ఉభయ పార్శ్వాలా అన్నమయ తిరుమలయ్యలు నిలిచి గానం చేస్తూన్న భంగిమలలో కానవస్తారు. ఈ శిలాఫలకానికి రెండోవైపున శ్రీ లక్ష్మీదేవి విగ్రహం చెక్కి ఉన్నది. పెదతిరుమలా చార్యుని శాసనంలో ప్రతి గురువారం నాడు స్వామి పుష్కరిణి వద్ద దీపం వెలిగించడానికి చేసిన ఏర్పాట్ల వివరాలున్నాయి.[36] ఈ దీపం ఉంచవలసిన స్థానం ఈ శిల్ప ఫలకం దగ్గరేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. గురువారానికి మరొక పేరు లక్ష్మీవారం. అందువల్లనేకాక కోనేరు దేవీసమానురాలు కావడం వలన ఈ ఏర్పాటు జరిగి ఉండాలి. అయితే గురువారం అన్నమయ జన్మించిన వారం కావడం వల్ల ప్రతి గురువారమూ తన తండ్రి జ్ఞాపకార్థం ఈ దీపాన్ని వెలిగించే ఏర్పాటును పెదతిరుమలయ్య చేసి ఉంటాడని మనం నమ్మవచ్చు. వైశాఖమాసం విశాఖానక్షత్రం గురువారంనాడు రావడం వలన క్రీ.శ. 1424 ను అన్నమయ జననవత్సరంగా అంగీకరించక తప్పదు.

ఇందుకు బలంగా మరొక గమనించవలసిన అంశం కూడా ఉన్నది. అన్నమయ్య పరమపదించినది ఫాల్గుణ బహుళ ద్వాదశి రోజున. ఈ విషయం లో పరిశోధకులలో అభిప్రాయ భేదాలు లేవు. ఎగువ తిరుపతిలో ఈనాటికీ నిలిచి ఉన్న తాళ్లపాకవారి ఇంటి దగ్గర ద్వాదశీ మండపం ఉన్నది. ఇక్కడ స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని వేంచేపు చేయించి స్వామికి భోజన నివేదనం చేయించే ఆచారం ఉండేది. అందుకు సాక్ష్యంగా పెదతిరుమలయ్య సంకీర్తన-

'దినము ద్వాదశి నేఁడు తీర్థదివసము నీకు
జనకుఁడ అన్నమాచార్యుఁడ విచ్చేయవే
... ...
వైకుంఠాన నుండి యాళువారలలోపల నుండి

లోకపు నిత్యముక్తులలోన నుండి
శ్రీకాంత తోడనున్న శ్రీ వేంకటేశుఁగూడి
ఈ కడ నారగించ నింటికి విచ్చేయవే
సంకీర్తనముతోడ సనకాదు లెల్లఁబాడ
పొంకపు శ్రీ వేంకట్రాది భూమి నుండి
లంకె శ్రీ వేంకటగిరి లక్ష్మివిభుఁడు నీవు -
నంకెల మాయింటి విందు లారగించవే'[37]

ఈ సంకీర్తనలో ద్వాదశి నాడు శ్రీ వేంకటేశ్వరునితో గూడి తన ఇంట విందు లారగించరమ్మని పెద తిరుమలయ్య ఆహ్వానిస్తున్నాడు. ద్వాదశీ మండపం అన్నమయ్య నిర్యాణాన్ని సూచిస్తే గురువారం నాడు స్వామి పుష్కరిణి దగ్గర వెలిగించే దీపం అన్నమయ జననాన్ని సూచిస్తోందన్న సంగతి నిర్ద్వంద్వంగా రుజువౌతున్నది. అందువల్ల క్రీ.శ. 1424లో వైశాఖమాసం విశాఖా నక్షత్రం గురువారం నాడు అన్నమయ జన్మించారని నిరూపిత మౌతోంది.

మరొక పరోక్షాధారం కూడా ఉన్నది. అన్నమాచార్య చరిత్రను రచించిన చిన్నన్న అష్టమహిషీకల్యాణము, ఉషాపరిణయము, పరమయోగి విలాసము అన్న మరో మూడు ద్విపద కృతులను రచించాడు. ఆళ్వారులను గురించీ శ్రీరామానుజాచార్యులను గురించీ పరంపరగా వస్తున్న జీవితగాథలను మనకు అందించాడు. ఆళ్వారులను గురించి ఇచ్చిన వివరాలలో వారి జనన కాలాన్ని మాస నక్షత్రాలతో పేర్కొన్నాడు.

చిన్నన్న ఇచ్చిన ఆళ్వారుల జన్మ నక్షత్ర వివరాలలో ఒక్క నమ్మాళ్వార్ విషయంలో తప్ప, మిగిలిన వారందరికీ వారంగానీ, లగ్నం గానీ సూచించడం జరగలేదు. క్రీ.శ. 15వ శతాబ్దాంతం దాకా ఆళ్వారుల జననకాలం గురించి ఏకాభిప్రాయం లేదని శ్రీ టి.కె.టి. వీరరాఘవాచార్యులు గారు తమ గ్రంథంలో

విపులంగా చర్చించి నిరూపించారు.[38] శ్రీ నమ్మాళ్వారులకు శఠకోపముని అని కూడా వ్యవహారం ఉంది. ఆయన జననాన్ని గురించి చెబుతూ చిన్నన్న-

'కలియుగంబిలమీదఁ గలిగిన మీఁదఁ
దెలియఁ దొంబదిరెండు దినములు చనఁగ
సవరనివేళ వైశాఖ విశాఖఁ
గవివాసరమునఁ గర్కటక లన్నమునఁ
గనియెఁ బుత్రుని... .... '[39]

అని అన్నాడు. ఆయన పూర్వులకే లభించని 'కవివాసరమూ' 'కర్కట లగ్నమూ' చిన్నన్నకు ఎక్కడ నుంచి లభించాయి ? వైశాఖ విశాఖం శఠకోపముని జన్మనక్షత్రంగా సంప్రదాయ మున్నది నిజమే. కాని వారమూ లగ్నమూ కూడా చిన్నన్న ఇచ్చాడు. అంటే చిన్నన్న తన తాతగారి జన్మకాల విశేషాలను సగౌరవంగా శఠకోపమునికి సమర్పించి ఉండాలి. అహోబిలంలో అన్నమయ 'సకల వేదాంత పఠనం' చేసింది అహోబిలమఠాచార్యులైన ఆదివణ్ శఠకోపయతీంద్రుల వద్ద. ఆయనంటే తాళ్లపాక వారికి భక్తిప్రపత్తు లెక్కువ. ముఖ్యంగా అన్నమయ -

'చూడుఁడిందరికి సులభుఁడు హరి
తోడు నీడ యగు దొరముని యితఁడు
... ...
కరుణానిధి రంగపతికిఁ గాంచీ
వరునకు వేంకటగిరిపతికి
నిరతి నహోబలనృకేసరికిఁ ద
త్పరుఁడగు శఠగోపమ్ముని యితఁడు'[40]

అని కీర్తించాడు కూడా. నామసామ్యం వల్లా గురుశిష్య సంబంధం వల్లా తన తాతగారి జననకాల విశేషాలను చిన్నన్న శఠకోపమునిగా పేరు పొందిన

నమ్మాళ్వార్ జననకాల విశేషాలుగా చెప్పడం వింతగా కనిపించవచ్చు గాని, ఇంతకన్నా తృప్తికరమైన సమాధానం లభించనందువల్ల నమ్మక తప్పదు.

కవివాసరమంటే శుక్రవారమనే నిఘంటువులన్నీ సాక్ష్యమిస్తున్నాయి. బుద్ధికి బృహస్పతి ప్రసిద్ధి వహించినా కవి అన్న బిరుదు మాత్రం లేదు. అయితే అన్నమయ జన్మించినది గురువారమని ఇతర ఆధారాలతో నిరూపిత మౌతుండగా శుక్రవారమని ఎలాగ సమన్వయించుకోవడమని సందేహం కలగక తప్పదు. స్వామి పుష్కరిణి దగ్గర దీపం పెట్టడానికి ఏర్పాట్లు చేస్తూ శాసనం వేయించింది పెదతిరుమాలాచార్యులు. పరమయోగి విలాసకర్త చిన్నన్న పెద తిరుమలాచార్యుల నాలుగో కుమారుడు. నిస్సందేహంగా పై శాసనానికీ పరమయోగి విలాస రచనాకాలానికీ చెప్పకోదగిన వ్యవధి ఉండి ఉండాలి. పంచాంగం గుణించుకోవడంలో వారం విషయంలో పొరపాటు పడి ఉండ వచ్చు, లేదా పరమయోగి విలాస పరిష్కర్తలకు సరియైన పాఠం లభించి ఉండకపోవచ్చు. పండిత వి. విజయరాఘవాచార్యుల పరిష్కరణలతో 1938 లో తిరుమల తిరుపతి దేవస్థానం వారు మొదటిసారిగా ప్రచురించారు. పీఠిక లేని ఈ ప్రచురణకు మూలప్రతి ఎక్కడి నుంచి లభ్యమైందో తెలియరావడం లేదు. అందువలన ఈ విషయంలో సందేహపడటానికి అవకాశం ఉన్నా క్రీ. శ. 1424 మే 25వ తారీకు శుక్రవారం నాటి రాత్రి 9-22 గంటల దాకా విశాఖా నక్షత్ర ముంది గనుక, చిన్నన్న ఇచ్చిన వివరాలతో తేడా రాదు. పెద తిరుమలయ్య శాసనాన్ని అనుసరించి చూస్తే గురువారమే అన్నమయ జన్మించిన వారం అయి ఉండాలి. అదే సరైనదని భావించడం అసంగతం కాబోదు. అన్నమయ జననవత్సరాన్ని క్రీ. శ. 1408గా స్వీకరించి, చూస్తే పై వివరాలు వారమూ, తిథీ కుదరవు.

డాక్టర్ ముట్నూరి వారు క్రీ. శ. 1484లో పురుషోత్తమ గజపతి దండెత్తి వచ్చి ఉదయగిరిని ఆక్రమించి నరసింహరాయలతో సంధి చేసుకొని వెనక్కు

వెళ్ళడం పేర్కొని 'ఈ సంధి వెనుక చాలా రాజకీయములున్నవి' అంటూ నాటి రాజకీయ పరిస్థితులకు కూడా సరైన ప్రాముఖ్యాన్నిచ్చారు. ఆసమయం లోనే అన్నమయకు గజపతుల సంపర్క మబ్బినట్లూ శ్రీ జగన్నాథ క్షేత్రానికి వెళ్లి ఉండవచ్చునీ రెండు సంకీర్తనల ఆధారంగా భావించారు. అన్నమయ జగన్నాథ ప్రయాణం గురించి మొట్టమొదటగా గమనించి చెప్పింది వీరే. ఆనాటికి అన్నమయకు 1424 ప్రకారం 60 సంవత్సరముల కటునిటుగా ఉండవచ్చుని చెపుతూ 'లోకములో దేనికైననూ అపవాద స్వరూపులు కొంద రుండకపోరు. కాని అన్నిటికిని ఒకే వ్యక్తి అపవాదముగా చూపట్టుట దుర్లభము'[41] అంటూ 1408 వాదాన్ని తిరస్కరించారు. అన్నమయ ఉత్తర దేశయాత్రను చర్చించేముందు ఇతర చారిత్రక సంఘటనల ఆధారంగా కూడా అన్నమయ జన్మవత్సరాన్ని నిర్ణయించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించ వలసి ఉంది.

ఈ విషయంలో తాళ్లపాక చిన్నన్న విరచితమైన 'తాళ్లపాక అన్నమాచార్య చరిత్రము'లోని ముఖ్య జీవితఘట్టాలను దృష్టిలో పెట్టుకొని కాలనిర్ణయం చెయ్యాలి. ఈ దృష్ట్యా చిన్నన్న చెప్పిన విషయాలను స్మరణకు తెచ్చుకోవడం అవసరం. చిన్నన్న తన కుటుంబంలో తెలిసిన విషయాలే కాక మరికొంత కుటుంబసభ్యులు కాని పెద్దల ద్వారా కూడా సేకరించిన సమాచారంతోపాటు సంకీర్తనలలో ఉన్న విషయాలను కూడా సమన్వయించుకొని రచించినట్లు కనబడుతున్నది. దీనినిబట్టి చూస్తే మనకు తెలిసినంతలో బహుశా ఈయనే మన మొట్టమొదటి చరిత్ర పరిశోధకుడు. పరంపరగా వచ్చిన గాథలను కూడా ఈయనే సేకరించిపెట్టాడు. అందువల్లనే –

'ఆ వరకృత్యంబులన్నింటి లెక్క
గావింప నాకు శక్యమె నాఁటి వార
లెఱుఁగుదు; రవి పెద్ద లెఱిఁగింప వినుచు
నెఱిఁగిన కృతకృత్యులిపుడును గలరు

ఐన నందొక కొన్ని యనఘ మానసుల
వీనుల విందుగా వినుతింతు నేను'[42]

అంటూ సవినయంగా చెప్పుకొన్నాడు. అయినా ఆయన అన్నమయ జీవించిన కాలానికి చాలా సన్నిహితుడు కావడం వలన చాలా వివరాలనే ఆయన మనకు ఇచ్చాడు.

ఐదవయేటనే ఉపనయనం జరిగి ఎనిమిదోయేటనే ఇంటి నుంచి పారిపోయి తిరుపతి చేరుకున్నాడు అన్నమయ్య. అక్కడే వైష్ణవయతి వొకాయన పంచ సంస్కారాలు చేసి శ్రీవైష్ణవ మిచ్చాడు. చిన్నన్న గ్రంథంలో ఇక్కడ కొంత గ్రంథపాతం ఉన్నట్లు పరిష్కర్త సూచించారు. బహుశా అన్నమయ శాస్త్రాధయనం గురించి కొంత సమాచారమూ, అన్నమయను వెదుకుకుంటూ తల్లి రావడమూ మొదలైన వివరాలుండి ఉంటాయి. తల్లి పిలిచినపుడు అన్నమయ ఇంటికి రానన్నాడేమో, శ్రీ వేంకటేశ్వరుడు కలలో ప్రత్యక్షమై ఇంటికి వెళ్లమన్నట్టున్నాడు –

'జనని వాక్యము ద్రోయఁజనదు కుమార
పోయి రమ్మనిన నప్పుడు మేలుకాంచ
యా యచ్యుతునిఁ గొనియాడి మ్రొక్కుచును
జననియు దాను నిచ్చలుఁదొంటి పురికిఁ
జనుదెంచి నిజ నివాసముఁ బ్రవేశించె'.[43]

అంటే రాగిరేకుల మీద అవతారికనుబట్టి అన్నమయకు స్వామి పదహారోయేట ప్రత్యక్షమైనట్లుండడం వలన తిరుపతిలోనే ఈ సాక్షాత్కారం జరిగి ఉండాలి. అప్పటికి అన్నమయ వయసు పదహారేండ్లన్నమాట. ఆ తరువాత 'నెల జవ్వనము మేన నిగురొత్తు కొడుకు' వివాహ ప్రయత్నాలు చేశారు, తల్లిదండ్రులు. తిరుమలమ్మ, అక్కలమ్మలను ఒకసారే వివాహ మాడినట్లు చిన్నన్న రచన. ఆ తరువాత బహుశా అహోబిలంలో శఠకోపముని

దగ్గర 'సకల వేదాంతపఠనంబు' చేశాడు. ఆ గురువు దగ్గర శుశ్రూష తరువాత 'వాల్మీకి రామాయణ మెల్ల రాగంబుతో ననురాగంబుతోడ' గానం చెయ్యడమూ విన్నవారెల్లా మెచ్చుకోవడమూ క్రమంగా కీర్తి వ్యాపించి 'ఆ చేర్వటంగుటూ రను పురంబేలు రాచమూకలలోఁ బరాక్రమశాలి... సాళువ నరసింహ జనపాలుడు' స్వయంగా వచ్చి విని తన ఊరికి ఆహ్వానించడమూ జరిగాయి. టంగుటూరు కేశవమూర్తి కోవెల దగ్గర 'సకల సంపదలతో సవరించి యున్న పెద్ద నగరిలో' నివాసం ఏర్పాటయింది. అక్కడ సాళువ నరసింహుడు అన్నమయను హితునిగా, బంధువుగా, గురువుగా గౌరవిస్తూ, రాజకీయంగా బలం పెంచుకొంటూ యుద్ధాలు గెలుస్తూ తన కొత్త రాజధాని పెనుగొండకు పిలిపించుకొని తన నగరుకు దగ్గరే ఉన్న పెద్ద నగరులో అన్నమయకు వసతి కల్పించి ప్రతిదినమూ సంకీర్తనలు వింటూ అనేకంగా కానుకలు సమర్పిస్తూ వచ్చాడు. అప్పటికే అన్నమయకు శిష్యబలగం కూడా బాగానే ఉంది. ఒకనాడు సభలో 'ఏమొకో చిగురు టధరమున ఎడనెడ కస్తురి నిండెను' అన్న సంకీర్తనను విని తనమీద కూడా శృంగార సంకీర్తనను పాడమనడంతో సాళువ నరసింహుడికీ అన్నమయకూ తాత్కాలికంగా స్నేహం చెడింది. క్లుప్తంగా ఇదీ చిన్నన్న మనకు అందించిన అన్నమయ చరిత్ర.

ఇక మనం చూడవలసింది అన్నమయ జీవితంలోనేకాక నాటి దేశ చరిత్రలో కూడా అసాధారణ పాత్రను నిర్వహించిన నరసింహరాయల వృత్తాంతం. ఆనాడు విజయనగర సామ్రాజ్యపు మనుగడ సాళువ వంశీయుల మీద ఆధారపడి సాగింది. సాళువ వంశానికి నాయకుడుగా నిలిచి నరసింహుడు సాగించిన జీవితయాత్రలో అన్నమయకు సంబంధించినంత వరకు ఘట్టాలను తీసుకొని పరిశీలించడం అనివార్యమౌతోంది.

సాళువ నరసింహరాయలు క్రీ. శ. 1428లో జన్మించి ఉండవచ్చుని డాక్టర్ పి. శ్రీరామశర్మ గారు అభిప్రాయపడ్డారు.[44] ఇది ఖచ్చితమైన నిర్ణయం కాకపోవచ్చుగాని కొంచెం అటూ ఇటూగా సత్యానికి దగ్గరగా ఉందని మనం

భావించవచ్చు. నరసింహుడి మొదటి శాసనం క్రీ.శ. 1453 వాటిది లభిస్తున్నది.[45] అంటే అంతకు ముందు సంవత్సరం 1452 నాటికి నరసింహుడు తండ్రి రాజ్యానికి వారసుడై సింహాసన మెక్కి ఉండాలి. అప్పటికి అతని వయసు 24 సంవత్సరాల ప్రాంతాన ఉండి ఉంటుంది. మనకు చిన్నన్న ఇచ్చిన సమాచారం ప్రకారం నరసింహుని మొదటి రాజధాని టంగుటూరు. తండ్రి జీవించి ఉండగా టంగుటూరులో చిన్న సామంతునిగా ఉండి ఉండాలి. నేటి ప్రకాశం జిల్లాలోని టంగుటూరుని శ్రీ వేటూరి ఆనందమూర్తిగారు 'తాళ్లపాక వారు తిరిగిన ప్రదేశములు' అనే శీర్షికతో[46] ప్రకటించిన పటంలో చూపారు. ఇది సరికాదనుకుంటాను. కడప జిల్లాలో రెండు టంగుటూరు లున్నాయి.[47] ఒకటి ప్రొద్దుటూరు తాలూకాలోనూ, రెండోది రాజంపేట తాలూకాలోనూ ఉన్నాయి. చిన్నన్న 'అచేర్వ టంగుటూరనుపురం' బన్నాడు కాబట్టి పొత్తపినాటిలోని అంటే నేటి రాజంపేట తాలూకాలోని టంగుటూరే అయి ఉండాలి. ఈ టంగుటూరు తాళ్లపాకకు సమీపాన ఉంది. ఇక్కడ కాకతీయ ప్రభువు ప్రతాపరుద్రుడి క్రీ.శ. 1315 నాటి శాసనమూ, మొదటి దేవరాయల నాటి శాసనమూ లభిస్తున్నాయి.[48] రాజంపేట తాలూకా నందలూరు గ్రామాన లభించిన రెండవ దేవరాయల కాలంనాటి – అంటే క్రీ.శ. 1433 – శాసనం[49] కూడా తాళ్లపాకకు చేరువగా ఉన్న ఈ టంగుటూరునే పేర్కొంటున్నది. పొత్తపినాటికి ఇది ప్రాచీనమైన ప్రధాన కేంద్రంగా కనిపిస్తోంది. ఇక్కడే ఆదికేశవస్వామి ఆలయం కూడా ఉంది. నరసింహుడి తొలి రాజధాని ఇదే ననడంలో సందేహముండదు. ఈ ఆలయం దగ్గరే 'సకల సంపదలతో సవరించి యున్న పెద్ద నగరి'లో అన్నమయకు నివాసం యేర్పాటయినట్లు చిన్నన్న కథనం. ఇది పొత్తపినాటిలోది కనక యువకుడైన నరసింహుడు తన తండ్రి జీవితకాలంలోనే టంగుటూరు నాయంకరానికి అధిపతిగా ఉండి ఉంటాడు. చిన్నన్న మాటల్లో అప్పటికి నరసింహుడు 'రాచమూకలలో పరాక్రమశాలి' మాత్రమే. ఆనాటికి శఠ కోపముని దగ్గర 'సకల వేదాంత పఠనంబు' పూర్తిచేసి వాల్మీకి రామాయణ

మెల్ల 'రాగంబుతో ననురాగంబుతోడ' గానం చెయ్యడం వలన నరసింహుడి భక్తిగౌరవాలను అందుకున్నాడు. అన్నమయ 'ప్రవిమల ద్విపద ప్రబంధ రూపమున నవముగా రామాయణము' రచించి ఉన్నట్టు చిన్నన్న చెప్పడాన్ని బట్టి ఆ ద్విపద రామాయణము ఈ కాలాన రచించినదై ఉండాలి. అన్నమయ రామాయణ సంకీర్తనలు కూడా కొన్ని లభిస్తున్నాయి. రామాయణం ద్విపద చదువుతూ మధ్య మధ్య సంకీర్తనలు పాడుతూండేవాడని ఊహించవచ్చు. సాళువ నరసింహరాయలూ, ఇమ్మడి నరసింహరాయల శాసనాల చివర 'శ్రీరామ చంద్ర' నామస్మరణ కనిపిస్తోంది.[50] సంగమవంశీయుల కాలంలో 'శ్రీ విరూపాక్ష' నామస్మరణ ఉండేది. ఇందువల్ల సాళువ నరసింహుడూ, అతని సంతతీ రామచంద్రభక్తులైనట్లు భావిస్తే రామాయణ గానంవల్ల అన్నమయకూ నరసింహునికీ స్నేహమూ, గురుశిష్యసంబంధమూ ఏర్పడి ఉండవచ్చునడంలో విప్రతిపత్తి ఏమీ ఉండదు.

క్రీ.శ. 1448 ప్రాంతంలో నరసింహుడు టంగుటూరులో ఉన్నాడనీ క్రీ.శ. 1452 ప్రాంతంలో తండ్రి రాజ్యమైన చంద్రగిరికి ప్రభువైనాడనీ అనుకుంటే అన్నమయ 1408లో జన్మించి ఉంటే టంగుటూరుకు చేరే సమయానికి అన్నమయకు నలభై సంవత్సరాల వయసుండాలి. నలభయ్యో ఏటి దాకా అన్నమయ గుర్తింపు లేకుండా ఉన్నాడన్న విషయం అసమంజసంగా తోచక తప్పదు. 1424ను జన్మవత్సరంగా స్వీకరిస్తే ఇరవైనాలుగు సంవత్సరాల వయసుంటుంది.

పెనుగొండలో అన్నమయను తనమీద శృంగారసంకీర్తనను పాడమని కోరినపుడు అన్నమయ తిరస్కరించడంతో కోపోద్రిక్తుడైన నరసింహరాయలు పలికిన మాటల్లో 'తన బాల్యసఖ్యంబు దలఁచి సంపదల దన యంతవానిఁగా దనరఁజేసితిని' అన్నాడు. లోకవ్యవహారంలో ఒక వృద్ధుడితో ఒక యువకుడి చిరకాలసఖ్యాన్ని 'బాల్యసఖ్యంబు'గా చెప్పుకోవడం జరగదు. అదీకాక అన్నమయ శ్రీ వేంకటేశ్వరకృపతో సంకెళ్లను విడిపించుకొన్నపుడు పశ్చాత్తాప

పడుతూ నరసింహుడు 'నను నీవు పిన్నటనాఁట నుండియు బనుపడ బంటుగాఁ బనిగొంటి గనుక' క్షమించమని అన్నాడు. ఇక్కడ కూడా వారి బాల్యసఖ్యం ప్రస్తావనకు రావడం వలన వారిరువురూ ఇంచుమించు సమ వయస్కులని భావించక తప్పదు. డా॥ శ్రీరామశర్మగారు భావించినట్లు నరసింహుని జన్మవత్సరం క్రీ. శ. 1428గా తీసుకుంటే, అన్నమయ జన్మ వత్సరం క్రీ.శ. 1424గా తీసుకుంటే ఇరువురి వయసులో తేడా నాలుగేళ్లుం టుంది, అప్పుడే 'బాల్యసఖ్యంబు' అన్నమాట సార్థకమౌతుంది. నరసింహుని తో అన్నమయ టంగుటూరు వెళ్లేనాటికి అన్నమయకు 24-25 సంవత్సరాల వయసుండి ఉండాలి.

తరువాత పెనుగొండను రాజధానిగా చేసుకొన్న నరసింహుడు -

'బలియుడై పరిపంథిబలముల నడఁచి
నలిరేగి సింహాసనంబు చేకొనుచు
తన రాజధానియై తనరారు పసిడి -
పెనుగొండ గతినుండు పెనుగొండనుండి'[51]

కబురు పంపి అన్నమయను అక్కడికి పిలిపించుకొన్నాడు. ఇందులో 'బలియుడై పరిపంథిబలముల నడఁచి' అనడం ద్వారా నరసింహరాయల యుద్ధయాత్రలను చిన్నన్న సూచిస్తున్నాడు. అంతేకాక టంగుటూరును విడిచిపెట్టిన తరువాత పెనుగొండకు పిలిపించుకొనేవరకు కొంతకాలం గడిచి నట్లుగా కూడా సూచన ఉంది. ఈ దృష్టితో నరసింహుని చరిత్రను కొంత పరిశీలించాలి.

క్రీ.శ. 1459 నాటి రెండు శాసనాల వల్ల విజయనగర చక్రవర్తి మల్లికార్జునరాయలు తిమ్మదండనాథుని వెంటబెట్టుకొని సాళువ నరసింహ రాయలతో చర్చలకు పెనుగొండకు వచ్చినట్లు తెలుస్తోంది.[52] ఆనాటి రాజకీయ పరిస్థితులను గమనిస్తే ఈ రాకలోని అంతర్యం బోధపడుతుంది. కపిలేశ్వర

గజపతి కొడుకు హంవీరుడు ఓరుగల్లుపై దండెత్తి ఓరుగల్లును ఆక్రమించాడు.[53] ఓఢ్ర సైన్యాల విజయాలను గమనించి సామ్రాజ్య రక్షణకు అవసరమైన సైనిక సన్నాహాలను చేసేందుకు సాళువ నరసింహరాయలతో చర్చలకు మల్లికార్జునరాయలు వచ్చినట్లు భావించవచ్చు. కాని ఈ సన్నాహాలన్నీ విఫలమైనట్లు కనిపిస్తోంది. క్రీ.శ. 1460లో ఉదయగిరి దుర్గం ఓఢ్ర సైన్యాల ధాటికి నిలవలేక లొంగి పోయింది. 1464 నాటికి చంద్రగిరి, కాంచీపురం, పడైవీడు, నలుదిలంపట్టి – సాపిడి, తిరువారూరు, తిరుచునాపల్లి ఒరియా పాలన కిందకు వెళ్లిపోయాయి.[54] దాదాపు నాలుగు సంవత్సరాల పాటు అదృష్టం చేతులు మారుతూ వచ్చింది. నరసింహరాయలు మళ్లీ 1466 నాటికి గాని గజపతు లాక్రమించిన ప్రాంతాలను పూర్తిగా స్వాధీనపరుచుకోలేకపోయాడు. 1467 నాటికి చంద్రగిరి కూడా నరసింహునికి స్వాధీనమైంది. ఈ విజయ పరంపరతో నరసింహుని ప్రతిష్ట బాగా పెరిగింది. 'బలియుడై పరిపంథి బలముల నడఁచి' అని చిన్నన్న అనడంలో ఈ విషయమే వ్యక్తమౌతున్నది. క్రీ. శ. 1467లో మల్లికార్జున రాయలు మరణించాడు.[55] ఆ మరుసటి సంవత్సరం 1468లో కపిలేశ్వర గజపతి మరణించాడు.[56] మల్లికార్జునరాయల తర్వాత సింహాసనానికి వచ్చిన ఇమ్మడి విరూపాక్షరాయలు అలసుడూ, విషయలోలుడూ అని న్యూనిజ్ కథనం.[57] అప్పటికే చెంగల్పట్టు, ఉత్తర ఆర్కాటు, దక్షిణ ఆర్కాటు, చిత్తూరు, శ్రీశైలం, తూర్పు మైసూరు మొదలైన ప్రాంతాలలో సాళువ వంశీయులే విజయనగర సామంతులుగా పరిపాలిస్తున్నారు. వారి నాయకుడు నరసింహరాయలు. విజయనగర సామ్రాజ్యానికి ఆయువుపట్టు లాంటి భాగమంతా అతని అదుపు ఆజ్ఞలలో ఉండి మకుటం లేని చక్రవర్తిగా ఉన్న నరసింహరాయలు ఈ సమయంలోనే అన్నమయను పెనుగొండకు పిలిపించుకొని ఉండాలి.

పెనుగొండలో నరసింహుడు ఎంతకాలం ఉన్నాడో చెప్పడానికి స్పష్టమైన ఆధారాలు లేవు. 1458లో పెనుగొండకు చేరినప్పటి నుంచీ

1478లో విరూపాక్షరాయల హత్య జరిగి రాజకీయ అనిశ్చిత పరిస్థితి ఏర్పడిన దాకా పెనుగొండ అతని కార్యక్షేత్రమై ఉండవచ్చు. అంటే ఇరవై సంవత్సరాల పాటు అక్కడ నుంచి పరిపాలించి ఉండాలి. అయితే తరుచూ యుద్ధాలలో పాల్గొనడం వల్ల నరసింహుడు ఇరవై సంవత్సరాలలో ఎంతోకాలం కుదురుగా పెనుగొండలోనే ఉండడానికి అవకాశం లభించి ఉండదు. కాని అన్నమయ పెనుగొండ చేరిన తరువాత –

'అనుదినంబును వేంకట్రాదీశుమీఁది
వినుతులు వేడుక వినుచుండి యుండె
నరనాథుడు ... .'[58]

అని చిన్నన్న అన్నాడు కనక ఏ కొద్ది సంవత్సరాలో అక్కడ ఉన్నా తనతోపాటు అన్నమయ్యను కూడా వెంట తీసుకొని వెళుతూ సంకీర్తనలు వింటూ ఉండి ఉండాలి. అన్నమయ కూడా 'ప్రతి వత్సరంబు తప్పక వృషభాద్రి పతికిఁ గావించునా బ్రహ్మోత్సవములు సేవించుకొనుచు'[59] ఉండి ఉంటాడు. వివిధ క్షేత్రాలలో ఉన్న దేవతామూర్తులను కీర్తించినందువల్ల, విజయ నగరంలో ఉన్న దేవతామూర్తులను కీర్తించడంవల్లా పర్యటనలు కూడా తరుచూ చేస్తూండేవాడని విదితమౌతోంది. ఇరవై సంవత్సరాలు నరసింహుడు పెనుగొండకు ప్రభువుగా ఉన్న కాలంలో అన్నమయకు కూడా పెనుగొండ కేంద్రస్థానంగా ఉండి ఉండవచ్చు. అన్నమయ జన్మవత్సరాన్ని 1408గా తీసుకుంటే ఆయన తన ఏభయ్యో ఏట నుంచి డెబ్భయ్యేళ్ల వయసుదాకా అక్కడ ఉండి ఉండాలి. 1424ను తీసుకుంటే ముప్ఫైనాలుగేళ్ల వయసు నుంచి యాభై నాలుగేళ్ల వయసుదాకా ఉంటుంది.

తండ్రి కపిలేంద్రుడు జీవించి ఉండగానే పురుషోత్తముడు గజపతి రాజ్యానికి క్రీ.శ. 1466లో పట్టాభిషిక్తుడైనాడు.[60] కాని ఆరు సంవత్సరాల లోనే సోదరుడైన హంవీరుడు బహ్మనీసుల్తాన్ సహాయంతో పురుషోత్తముణ్ణి రాజ్యభ్రష్టుణ్ణి చేశాడు. క్రీ.శ. 1472 నుంచి 1476 దాకా నాలుగు సంవత్సరాల

పాటు పురుషోత్తమ గజపతి శాసనాలు కానరావడం లేదు. తన సహాయానికి ప్రతిఫలంగా బహ్మనీసుల్తాను గజపతి సామ్రాజ్యంలోని దక్షిణ ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు. సాళువ నరసింహుడు 1472 ప్రాంతాలలో నేటి నిజామాబాదు జిల్లాలోని బాలకొండ దుర్గాన్ని దండువెళ్లి ముట్టడించాడు.[61] బహ్మనీ సైన్యాలకు సహాయంగా హంవీరుడి సైన్యాలు వచ్చి చేరాయి. చివరకు నరసింహుడు బహమనీ గజపతుల సైన్యాలను ఓడించి బాలకొండ దుర్గాన్ని పట్టుకొన్నాడు. నరసింహరాయల దండయాత్రకు కారణం రాజ్యభ్రష్టుడైన పురుషోత్తమ గజపతి నరసింహరాయలను సహాయం కోరడమే కారణమై ఉండాలని శ్రీ రామశర్మగారు భావించడం సమంజసమే.[62]

సరిగా అదేకాలానికి క్రీ. శ. 1472–75ల మధ్య దక్కనులో భీకరమైన క్షామం సంభవించింది. రెండు సంవత్సరాల పాటు వర్షాలు లేవు. బావులు ఎండి పోయాయి. రైతులు ఇతర ప్రాంతాలకు వలసపోయారు. అనేకమంది మరణించారు. నగరాలు నిర్జనమైనాయి. తిరిగి వర్షాలు కురిసేనాటికి వ్యవసాయానికి రైతులే లేకుండాపోయారు.[63] బహ్మనీ సుల్తాన్ మహమ్మద్ షా క్షామపరిస్థితుల వలన ఓఢ్ర రాజ్యవ్యవహారాల్లో జోక్యం చేసుకోలేక పోయాడు. ఈ బలహీనతను వినియోగించుకొని పురుషోత్తముడు హంవీరుణ్ణి ఓడించి తన సింహాసనాన్ని తిరిగి సంపాదించుకొన్నాడు. నరసింహుడు బాలకొండ దుర్గాన్ని పట్టుకోవడం కూడా పురుషోత్తమ గజపతికి అనుకూల మైంది. అందువల్ల పురుషోత్తమ గజపతి నరసింహరాయల మధ్య సయోధ్య కుదిరి ఉండవచ్చుని భావించడానికి అవకాశం ఉంది.[64] ఈ విషయాల నన్నిటినీ దృష్టిలో పెట్టుకుని అన్నమయ సంకీర్తనలను పరిశీలించి శ్రీ ముట్నూరి వారు ప్రస్తావించిన అన్నమయ ఉత్తరదేశయాత్రల కాలనిర్ణయం చేయవచ్చు.

క్రీ. శ. 1472–75 మధ్య సంభవించిన క్షామాన్ని గురించి ప్రస్తావన ఉన్న అన్నమయ సంకీర్తన ఒకటి కనిపిస్తోంది –

'కడు నజ్ఞానపు కరవు కాలమిదె

వెడల దొబ్బి మా వెరపు దీర్చవె

పాపపు వసురము బందెలు మేయగ
పోపుల పుణ్యము పాలివోయె
శ్రీపతి నీకే చేయి చాచెదము
యేపున మమ్మిక నీడేర్చవే

యిలఁ గలియుగమను యెండలు గాయఁగ
చెలగి ధర్మమను చెరువింకె
సొలసి యీ కృపాంబుధి చేరితి మిదె
తెలిసి నా దాహము తీర్చవె

వడిగొని మనసిజవాయువు విసరగ
పొడవగు నెఱుకలు పుటమెగసె
బడి శ్రీవేంకటపతి నీ శరణము
విడువక చొచ్చితి వెసగావగదే'[65]

ఈ సంకీర్తనలో ఆనాటి కరవు పరిస్థితులు కళ్లకు కట్టేటట్లుగా ప్రత్యక్ష మౌతున్నాయి.'బందెలు' పదాన్ని 'బందులు'గా గ్రహిస్తే ఆ పదానికి రాబందు లని బ్రౌణ్యం అర్థం చెపుతోంది. నెఱుకలు అంటే నెరియలు – అంటే నేల బీటలు వారడం. నాటి పరిస్థితిని చక్కగా వర్ణించటమేకాక ఈ సంకీర్తనలో ఆధ్యాత్మిక వాసనలను గుబాళింపచేయడం అన్నమయ ప్రతిభకు నిదర్శనం.

ఈ సంకీర్తనకు చేసిన కాలనిర్ణయం – క్రీ. శ. 1472-75 – కాదన రానిది. మరొక సంకీర్తనలో –

'చింతల చిగురులె చిప్పులట
ఇంతటిలో నిఁక నేలాగే

చక్కని మన్మథ సంవత్సరంబున
చుక్కల రాజే సూరియుఁడై

యెక్కువ రాత్రుల యెండగాయునట
యెక్కడిదిఁక బ్రతుకేలాగే

... ...

కుంకుమ గుబ్బల కుంభరాశికిని
వంకల చంద్రుడు వచ్చెనట
వేంకటరమణుడు వెలఁది గూడెనట
ఇంక నీ తమక మేలాగే'[66]

ఈ సంకీర్తన మొదటి చరణంలో ప్రస్తావనకు వచ్చిన మన్మథనామ సంవత్సరం క్రీ.శ. 1475లో వచ్చింది. కుంభరాశికి చంద్రుడు రావడం మొదలైన విషయాలు చూస్తే ఇది శృంగారసంకీర్తనమే అయినా జ్యోతిష విషయాలేవో ఈ సంకీర్తనలో దాగి ఉన్నట్లు అనుమానం కలుగుతోంది.

క్రీ.శ. 1476-77 మధ్యలో నరసింహరాయలు అంతకుముందే మచిలీపట్టణాన్ని వశపరచుకొని రాజమండ్రిని పట్టుకునే ఉద్దేశంతో గోదావరి ఒడ్డున దండు విడిశాడు. అదే సమయానికి పురుషోత్తమ గజపతి కూడా అక్కడకు చేరుకున్నాడు. వారిరువురూ సంప్రదింపుల్లో ఉండగానే బహ్మనీ సైన్యం సుల్తాన్ మహమ్మద్‌షా నాయకత్వంలో హుటాహుటీని అక్కడకు చేరుకోవడంతో నరసింహరాయలు యుద్ధం చెయ్యకుండానే వెనుదిరిగాడు. పురుషోత్తమ గజపతి కూడా తన దేశం వైపు తరలిపోయాడు. కానీ బహ్మనీ సైన్యం పురుషోత్తముడిని వెంటాడి చివరకు ఓడించి కప్పం పుచ్చుకొని మళ్ళీ బహ్మనీ రాజ్యప్రాంతాల్లో కలుగచేసుకొననే మాటను తీసుకుని వెనుదిరిగింది.[67] ఈ వృత్తాంతాన్ని పరిశీలిస్తే నరసింహరాయలూ పురుషోత్తమ గజపతీ పరస్పరావగాహనతోటే గోదావరి ఒడ్డున కలుసుకున్నట్లు భావించవలసి వస్తోంది. ఇద్దరూ కలసి కృష్ణానదీ ప్రాంతాల్లో బహ్మనీ పాలనను తుదముట్టించాలని ప్రణాళిక వేసుకొన్నట్లు కనిపిస్తున్నది. అయితే ఏ కారణాలవల్ల ఈ

ప్రయత్నం విఫల మైందీ తెలుసుకోవడానికి ఆధారాలు లేవు గాని, ఆక్రమించిన రాజ్య భాగాల పంపకంలో ఒప్పందం కుదిరి ఉండకపోవచ్చని ఊహించడానికి అవకాశం ఉంది. నాటికి నరసింహరాయలు బలవంతుడైన మహా మండలేశ్వరుడే గాని విజయనగర వజ్రసింహాసనారూఢుడు కాడు. మరి పురుషోత్తమ గజపతి ఓఢ్ర రాజ్యాధిపతి. ఈ అంతస్తులలోని తేడా మానసికంగా కూడా తేడాలను సృష్టించి ఉండవచ్చు. నరసింహ, పురుషోత్తమ గజపతులు గోదావరీ తీరాన బహ్మనీ సైన్యాలను ఆనాడు ఎదుర్కొని ఓడించి ఉంటే దక్షిణ భారత చరిత్ర మరో మలుపు తిరిగి ఉండేది అనడంలో సందేహ ముండనవసరం లేదు. కాని అలా జరగలేదు.

డాక్టర్ సంగమేశం గారు 1484లో పురుషోత్తమ గజపతి దండెత్తి వచ్చి ఉదయగిరిని పట్టుకొని నరసింహరాయలతో సంధి చేసుకొని వెనుకకు మరలినట్లూ, నరసింహరాయల దృష్టి విజయనగర సింహాసనం మీద ఉండడం వల్ల గజపతులతో వైరం వెన్నుపోటు వంటిది కనుక కొంత భూభాగాన్నిచ్చి సంధి చేసుకొన్నట్లూ, భావించారు.[68] కాని ఇది సరికాదేమో. డాక్టర్ ఆర్. సుబ్రహ్మణ్యంగారు క్రీ. శ. 1489 నాటి పోతవరం తామ్రశాసనం గుండ్లకమ్మ నదిని గజపతి రాజ్యానికి దక్షిణ సరిహద్దుగా పేర్కొని ఉండటంవల్లనూ, ఉదయగిరి దుర్గం గుండ్లకమ్మకు బాగా దూరంగా దక్షిణాన ఉండడంవల్లనూ, ఆనాటికి ఉదయగిరి గజపతి రాజ్యంలో భాగం కాదనీ, నరసింహరాయలు క్రీ.శ. 1490-91 ప్రాంతాల మరణించడం వల్ల ఆకాలంలో ఉదయగిరిపై దండయాత్ర జరిగి ఉంటుందనీ సహేతుకంగా నిర్ణయించారు.[69] శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు కూడా పురుషోత్తమ గజపతి నరసింహరాయలను జీవగ్రాహంగా పట్టుకొనలేదనే భావించారు.[70] అందువల్ల శ్రీ సంగమేశం గారు భావించినట్లు 1484లో ఉదయగిరి గజపతులకు స్వాధీనమైనదనేందుకు ఆధారం లేదు. అయితే వారు అన్నమయ జగన్నాథ క్షేత్రం వెళ్లిరావడానికి గల అవకాశాన్ని గురించి చర్చించారు కనుక ఆ అవకాశం మరొక సమయంలో

లభించి ఉండడానికి ఆస్కారం ఉంది. గజపతితో స్నేహం పటిష్టం చేసుకోవడానికి మార్గంగా నరసింహుడు అన్నమయను యాత్ర మిషతో జగన్నాథ క్షేత్రానికి పంపి ఉండవచ్చు. ఆ తరువాతనే 1476-77 ప్రాంతాలలో గోదావరి తీరాన పురుషోత్తమ నరసింహుల సమావేశం తటస్థించింది అనుకోవడంలో ఇబ్బంది ఉండదు. అన్నమయ సంకీర్తనలలో –

> 'త్వమే వ శరణం త్వమేవ శరణం
> కమలోదర శ్రీజగన్నాథా
> బలభద్రానుజ పరమపురుష దుగ్ధ
> జలధివిహార కుంజవరద
> సులభసుభద్రా సుముఖ సురేశ్వర
> కలిదోషహరణ జగన్నాథా'[71]
>
> 'అరుదరుదు నీ మహిమ అతి మానుషము చూడ
> పురుషోత్తమను దివ్యపుర జగన్నాథా!'[72]

అన్న సంకీర్తనలను శ్రీ సంగమేశం గారు ఉదాహరించి –

> ''అన్నమాచార్యుడచ్చటి భక్తులతో కలిసి, వారికిని తనకును సమానముగనే ప్రీతిపాత్రమైన గీతగోవిందము ననుకరించుచూ, జయదేవుని తరంగశైలిలోనే విశిష్టాద్వైతినని మడికట్టుకొని నట్లుండక, రాధామాధవ లీలావిలాసము లెత్తుకొని, అచటి వారికి తెలియునట్లు సంస్కృత భాషలో సంకీర్తనలు రచించి వినిపించినట్లున్నది. 'రాధామాధవ రతిచరితమిదం' (3-664) అనియు, 'అహో సురతవిహారోయం' (12-78) అనియు వ్రాసిన కీర్తన లీతీరున వెలసిన వనిపించును''[73].

అన్నారు. గజపతుల రాజ్యంలో ఓఢ్ర, వంగ, తెలుగుభాషా ప్రాంతాలున్నా రాజాదరణ పొందిన భాష సంస్కృతమే. పైగా వారు సంస్కృతాన్ని ఆదరించడంలో దేశభాషలను నిర్లక్ష్యం చేశారు కూడా.[74]

'ఈ యాత్రలో అన్నమయ దారిలోగల సింహాచలము, శ్రీకూర్మము వంటి క్షేత్రములు కూడ సందర్శించి, అచ్చటి వేల్పులను కూడ కీర్తించెనో లేక ఆ కీర్తనలు నేడు మృగ్యమైనవో తెలియదు'[75] అన్నారు. కాని సింహాచల ప్రస్తావన ఉన్న సంకీర్తనలు రెండు కనిపిస్తున్నాయి. నవనారసింహులను కీర్తించే సంకీర్తనలో అహోబిలనారసింహ, జ్వాలానారసింహ, యోగానంద నారసింహ కానుగుమాని నారసింహ, మట్టెమళ్ల నారసింహ, భార్గోటి నారసింహ, ప్రహ్లాద నారసింహ, లక్ష్మీనారసింహ రూపాలను పేర్కొని చివర 'వదన భయానకపు వరాహ నారసింహ' అంటూ పేర్కొన్నారు. నాకు తెలిసినంతలో వరాహనార సింహమూర్తి ఒక్క సింహాచలంలో తప్ప మరెక్కడా కానరావడం లేదు. పై సంకీర్తన[76] లో పేర్కొన్న అహోబిలం, కానుగుమాను, మట్టెమళ్ల, భార్గవం మొదలైనవన్నీ క్షేత్రనామాలు. మరొక సంకీర్తన గమనార్హమైనది ఉంది. ఈ సంకీర్తనలో ఉత్తరదేశ క్షేత్రాలను పేర్కొనడంవల్ల అన్నమయ ఈ క్షేత్రాలనూ దర్శించి ఉండవచ్చునేమో. ఈ సంకీర్తనలోని సింహాద్రి సింహాచలమే.

'అన్నిచోట్లఁ బరమాత్మ నీవు
యిన్నిరూపుల భ్రమయింతువుగా

పాల జలధి నుండి, బదరీవనాన నుండి
ఆలయమై గయలోఁ బ్రయాగ నుండి
భూలోకనిధిపై పురుషోత్తమాన నుండి
వేలసంఖ్యల రూపై విచ్చేతుగా

ఉత్తర మధురలో నయోధ్యలోపల నుండి
సత్తైన నందవ్రజాన నుండి
చిత్తగించి పంచవటి సింహాద్రిలోననుండి
వత్తుగా లోకములు పావనము సేయఁగను

కైవల్యమున నుండి కమలజ లోకాన
మోవఁగ శ్రీరంగమున నుండి

ఈ వల నావల నుండి ఈ వేంకటాద్రిపై
నీవే నీవే వచ్చి నెలకొంటిగా'[77]

పురుషోత్తమపురాన్ని చూసిన అన్నమయకు పై క్షేత్రాలేకాక దారిలోని సింహాచలం దర్శించడం కష్టం కాదు. ఇంకా అచ్చుకావలసిన సంకీర్తనలూ, అచ్చయి కూడా సాహితీలోకానికి లభించని సంపుటులూ, అహోబిలంలో లభించి పరిష్కరణకూ, ముద్రణకూ ఇంకా నోచుకోని పెద్ద రాగిరేకుల మీది కీర్తనలూ, అన్నీ వెదికితే శ్రీకూర్మం, సింహాచలం వంటి క్షేత్రాల మీది సంకీర్తనలు లభ్యం కావచ్చునేమో. ఓఢ్ర రాజ్య పర్యటనవల్ల ఆయనకు కొంత ఓఢ్రభాష కూడా పట్టుబడి ఉంటుంది. అందువల్లనే కావచ్చు ఆయన –

'ఒగినొడ్డె భాషలాడి వొడ్డెవాఁడనైతిని
తెగి తెలుఁగాడనేర్చి తెలుఁగువాఁడనైతి
అగడై శ్రీవేంకటేశ అన్నియు విడిచి నేను
తగు నీదాసుఁడనై దాసరి నేనైతి'[78]

అని చెప్పుకున్నాడు. ఈ సంకీర్తనలో ఓఢ్రభాష నేర్చినట్లు చెప్పడంలో బాధ పడుతూ చెప్పినట్లు కాక యధాలాపంగా చెప్పినట్లు కనిపిస్తూండడం వలన తనకు తానుగానే ఆ భాషను నేర్చుకుని ఉండాలి.

చిన తిరుమలాచార్యుని కుమారుడైన తిరువేంగళప్ప రచించిన అమరు కానికి వ్యాఖ్య అయిన గురుబాలప్రబోధిక కృత్యవతరణికలోనూ, కావ్యప్రకాశిక కు 'సుధానిధి'[79] పేరుతో రచించిన వ్యాఖ్య గ్రంథంలో కూడా అన్నమయను ప్రస్తావించిన సందర్భంలో –

'ఆశీదాసేతు నీహారగిరి విఖ్యాతనామవాన్
తాళపాకన్నమాచార్యః వేంకటేశ వరాంచితః'

అంటూ స్మరించాడు. దేశంలో విస్తృతంగా పర్యటించి సంస్కృతం లోనూ

సంకీర్తనలను పాడిన అన్నమయను 'ఆశీదాసేతు నీహారగిరి విఖ్యాత నామవాన్' అంటూ ప్రస్తుతించడంలో అతిశయోక్తి లేదని భావిస్తున్నాను.

ఇంతకుముందు అనుకొన్నట్లు ఈ యాత్ర క్రీ. శ. 1476 ప్రాంతాలలో జరిగినట్లయితే 1424 జన్మవత్సరమైతే అన్నమయకు 52 సంవత్సరాల వయసుండి ఉండాలి. ఆ రోజులలో దృఢమైన ఆరోగ్యమూ తగినంత మందీ మార్బలమూ ఉంటేనేకాని దూరప్రయాణాలు చేయడం సులభం కాదు. ఇందుకు నిదర్శనంగా ఏనుగుల వీరాస్వామి గారి కాశీయాత్రను తీసుకోవచ్చును. సాళువ నరసింహరాయల సహాయసహకారాలుంటేనే కాని ఈ దీర్ఘప్రయాణం సాగి ఉండదు. అన్నమయ సామాన్య వ్యక్తి కాడు. సాళువ నరసింహునికి పూజనీయుడైన వ్యక్తి. అటువంటి వ్యక్తి విషయంలో నరసింహ రాయలు అన్ని జాగ్రత్తలూ తీసుకునే ఉండాలి. నరస్తుతి విముఖుడైన అన్నమయ రాజాధిరాజులతో సఖ్యం చేసినప్పుడు కూడా ఆత్మగౌరవానికి భంగం లేకుండానే సఖ్యం చేశాడు. అన్నమయ నరసింహుల మధ్య వివాదం తలెత్తినా వారి స్నేహానికి భంగం కలగలేదు. ఈ విషయం –

'అది మొదలారాజా నఱ లేని కూర్మి
సభయుడై యన్నమాచార్యు శేషాద్రి –
విభునిగా నాత్మ భావింపుచునుండె'[80]

అని చిన్నన్న చెప్పడం వలన రుజువౌవుతున్నది. అందువలన రాచ కార్యమూ, పుణ్యక్షేత్ర దర్శనమూ కలిసివచ్చేటట్లు అన్నమయకు ప్రయాణ సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో నరసింహుడు గురుభావంతోనే సహాయ పడి ఉంటాడు.

'సహజ వైష్ణవభక్తి సలిపెడువాని –
సహవాసమైన దోసము లేదటంచు ...'[81]

అనుకొనేవాడే కనక అన్నమయ గజపతితో స్నేహం చెయ్యడంలో వెనకాడి ఉండడు. అదీకాక తరువాతి కాలంలో –

'కోపుల రాజులనెల్ల కొలచి కొన్నాళ్లు మేను
చూపుడుఁ బూట వెట్టితి'[82]

అని ఆయనే చెప్పుకొన్నాడు కూడా. సాళువ నరసింహరాయలే కాక మల్లికార్జున రాయలూ, పురుషోత్తమగజపతీ మరికొందరు మహామండలేశ్వరులూ కూడా ఈ 'కోపుల రాజుల'లో ఉండి ఉంటారు.

సాళువ నరసింహరాయలతో పరిచయ మేర్పడినప్పటినుంచీ అన్నమయ సామ్రాజ్య రాజధాని విజయనగరానికి రాకపోకలు సాగిస్తున్నట్లు అతని కీర్తనలే సాక్ష్యం పలుకుతున్నాయి. క్రీ. శ. 1467లో మల్లికార్జున రాయలు మరణించాడు. సంగమవంశంలో తొలిగా వైష్ణవం స్వీకరించిన చక్రవర్తి ఇతనే. అతని తరువాత విరూపాక్షరాయలు సింహాసనాన్ని అధిష్ఠించాడు. విషయలోలుడైన విరూపాక్షరాయలను అతని పెద్దకొడుకు రాజశేఖరరాయలు చంపించి తన తమ్ముడైన రెండవ విరూపాక్షరాయలకు పట్టం కట్టాడు. ఈ రెండవ విరూపాక్షరాయలు అన్నగారిని చంపి తన కృతజ్ఞతను ప్రకటించుకొన్న ఘనుడు ! ఈ సంఘటనలు 1485-86లో జరిగాయి. ఆనాడు అన్నమయ విజయనగరంలో ఉండినందువల్ల ఆ సంఘటనల వల్ల ఉద్విగ్నుడై తన బాధనూ, కోపాన్నీ తీవ్రంగానే ప్రకటించాడు –

'వెఱతు వెఱతు నిందు వేడుక పడనిట్టి
కుఱుచబుద్ధుల నెట్టు కూడుదునయ్యా

దేహమిచ్చినవానిఁ దివిరి చంపెడువాడు
ద్రోహిగాక నేఁడు దొరయటా
ఆహికముగా నిట్టి అధమవృత్తికి నే
సాహసమున నెట్టు చాలుదునయ్యా

తోడబుట్టినవాని తొడరి చంపెడువాఁడు
చూడ దుష్టుఁడుగాక సుకృతియట

పాడైన యిటువంటి పాపబుద్ధులు సేసి
నీడ నిలువనెట్టు నేరుతునయ్యా'[83]

అంటూ తీవ్రంగా చలించిపోయి 'యింటి వేలుపు వేంకటేశ్వరుఁదన వెంట వెంట దిప్పెడువాడు విభుడటా, దంటనై యాతని దాసానుదాసునై వొంటినుండెద నేమి నొల్లనోయయ్యా' అంటూ రాజకీయరంగంలోని అవినీతిని అసహ్యించుకొన్నాడు.

అప్పటిదాకా శ్రీమన్మహామండలేశ్వర మేదినీ మీసరగండ కఠారి సాళువ బిరుదాంచితుడైన నరసింహుడు క్రీ. శ. 1485లో జూలై 29, సెప్టెంబరు 9 మధ్య శ్రీ మద్రాజాధిరాజ రాజపరమేశ్వర ప్రౌఢప్రతాపసాళువ నరసింగరాయలుగా విజయనగర వజ్రసింహాసనాన్ని అధిష్ఠించాడు. నరసింహరాయలు అస్తవ్యస్తమైపోయిన సామ్రాజ్యానికి మళ్లీ నూతనోత్తేజాన్నీ, బలాన్నీ ఇచ్చాడు. అప్పటికి అన్నమయకు అరవై సంవత్సరాల వయసుండి ఉండాలి.

సాళువ నరసింహరాయలు విజయనగర సామ్రాజ్య చరిత్రలో అపురూపమయిన వ్యక్తిత్వం కలవాడుగా దర్శనమిస్తాడు. మహాబలవంతుడై ఉండి కూడా, తనకు తానుగా సింహాసనానికై ఎట్టి ప్రయత్నమూ చెయ్యక అసమర్థులైన రాజులు పాలించినప్పుడు కూడా విధేయుడుగానే ఉంటూ, చివరకు పితృ, భ్రాతృ హంతకుల పాలనకు నిరసనగా చెలరేగిన ప్రజల తిరుగుబాటు వల్ల సింహాసనాసీనుడైనాడు. పాలించినది కేవలం ఆరు సంవత్సరాలే అయినా సుస్థిరమైన పాలనా యంత్రాంగాన్ని దేశానికిచ్చి పోయాడు.

ఆనాటి రాజకీయాల ఆటుపోట్లలో దేశం తలమునకలౌతుండగా, అన్నమయ నరసింహునికి బాసటగా నిలిచి ప్రజలకు ఆధ్యాత్మిక విముక్తిని కలిగించేందుకు పాటుబడ్డాడు. నిలువనీరుగా మలినమైపోతున్న హిందూ సంఘంలో నూతన భావప్రవాహాలను ప్రవహింపజేసి ఆరోగ్యకరమైన జీవన దృక్పథాన్ని ప్రజలు అలవరచుకొనేలా చేశాడు.

ఇలా ఇద్దరు మహావ్యక్తులు కలిసి నాటి ప్రజల భౌతిక ఆధ్యాత్మిక పునర్వికాసానికై చేసిన బృహత్ప్రయత్నం వంటిది దేశచరిత్రలో మరొకటి కానరాదు.

ఇన్ని ఆధారాలను చూపి చర్చించిన తరువాత ఇంకా అన్నమయ జనన వత్సరం క్రీ. శ. 1424 అన్న విషయాన్ని సందేహించవలసిన అవసరం ఉండదు. అసలు వివాదాలన్నిటికీ కారణమైన రాగిరేకుల మీది అవతారికను చదవవలసిన పద్ధతి ఒకటి ఉంది. సాధారణంగా పల్లెపట్టులలో, లేఖలను, దస్తావేజులను, ఇతర వచన రచనలను ఒక విధమైన అత్యల్ప రాగచ్ఛాయతో, లయతో, విరుపులతో చదివే పద్ధతిలో ఈ అవతారికను చదవవలసి ఉంది. ఈ పద్ధతిలో కొన్ని అక్షరాలను దీర్ఘీకరించీ, విరామాలను పాటిస్తూ చదవడమన్నది ముఖ్యాంశం. లేఖనంలో ఈ పద్ధతిని ప్రదర్శించడం సులభం కాకపోవచ్చును గానీ అసాధ్యం మాత్రం కాదు. పై అవతారికను చదవవలసిన పద్ధతిలో రాసి చూపడం జరుగుతోంది –

శుభమస్తూ – స్వస్తిశ్రీ,
జయాభ్యుదయ శాలివాహనశకవరుషంబులు
1346 అగు నేటి క్రోధిసంవత్సర మందూ
తాళ్లపాక అన్నమాచార్యులూ అవతరించినా –
పదారుయేండ్లకు తిరువెంగళనాథుండు ప్రత్యక్షమైతేనూ,
అది మొదలుగాను
శాలివాహనశకవరుషంబులు 1424 అగు నేటి
దుందుభిసంవత్సర ఫాల్గుణ ద్వాదశీ నిరుధానకూ
తిరువేంగళనాథునిమీదను,
అంకితము గానూ,
తాళపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన,
శృంగార సంకీర్తనలూ

ఈ విధంగా చదివినప్పుడు 'పదారుయేండ్లు' అన్నది అన్నమయ్యకు స్వామి ప్రత్యక్షమైన వయస్సు అనీ, ఆయన జన్మించింది క్రోధి సంవత్సరంలోననీ వ్యక్తం కాకతప్పదు. ఈ చర్చలో చూపిన ఇతరాధారాలతో ఈ నిర్ణయం చక్కగా సంవదిస్తున్నది కనుక అంగీకార యోగ్యమౌతున్నది. తెలుగుదేశపు సాంస్కృతిక చరిత్రలో అన్నమయ నిర్వహించిన ప్రముఖపాత్రను సరిగా అంచనా కట్టడానికి ఈ కాలనిర్ణయం అవసరమైంది.

అధోజ్ఞాపికలు

1. తిరుమల తిరుపతి ఎపిగ్రాఫికల్ రిపోర్ట్, పు. 180
2. తిరుమల తిరుపతి ఎపిగ్రాఫికల్ రిపోర్ట్,. చిత్రం 57
3. ఆంధ్రకవితరంగిణి, ఎనిమిదవ సంపుటం, పు. 141
4. అదే, పు. 140
5. అదే, పు. 143
6. అదే, పు. 141
7. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము - శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారి పీఠిక, పు. 3
8. అదే, చిన్నన్న రచన - అన్నమాచార్య చరిత్రము, పు. 9
9. తిరుమల తిరుపతి దేవస్థానమ్ ఎపిగ్రాఫికల్ సిరీస్, ఇన్స్క్రిప్షన్స్, వాల్యూమ్. 5. నెం. 71.
10. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము - శ్రీ వేటూరి వారి పీఠిక, పు. 93
11. ఆంధ్రకవితరంగిణి, ఎనిమిదవ సంపుటం, పు. 144
12. శృంగార సంకీర్తనలు, సంపుటం. 12, పునర్ముద్రణ, ద్వితీయ ముద్రణ పీఠిక, శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ, పు. 8
13. అదే, పు. 8
14. అదే
15. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము, తృతీయ ముద్రణ, 1978, శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి వివేకదీపిక, పు. 19
16. అన్నమాచార్య సాహితీకౌముది, ఉపోద్ఘాతం, పు. 7
17. తిరుమల తిరుపతి ఎపిగ్రాఫికల్ రిపోర్ట్, చిత్రం 57
18. అదే, చిత్రం 58
19. అదే, చిత్రం 59
20. అదే, చిత్రం 59
21. అధ్యాత్మ సంకీర్తనలు - పెదతిరుమలాచార్య విరచితములు. సంపుటం 21, శ్రీ పి.టి.

జగన్నాథరావు గారి మున్నుడి.
22. ఈ తేదీని శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నిర్ణయంగా శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు గారు ఉట్టంకించారు. ఆకరాన్ని చూపలేదు. శ్రీ ముట్నూరి సంగమేశంగారి అన్నమాచార్య సాహితీకౌముది ఉపోద్ఘాతం, పు. 7
23. తాళ్లపాక కవుల కృతులు – వివిధ సాహితీప్రక్రియలు – డాక్టర్ వేటూరి ఆనందమూర్తి, పు. లు 60–70
24. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము – శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పీఠిక, పు. 84
25. ఆంధ్రకవితరంగిణి – ఎనిమిదవ సంపుటం, పు. 145
26. అదే, పు. 144
27. అదే, పు. లు 144–145
28. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 16, చినతిరుమలాచార్య విరచితములు, సంకీర్తన 39
29. అదే, సంకీర్తన 46
30. తిరుమల తిరుపతి ఎపిగ్రాఫికల్ రిపోర్ట్, పు. 291 – ఇంకా సౌత్ ఇండియన్ ఇన్స్క్రిప్షన్స్, వాల్యూం 4, 710
31. అధ్యాత్మ సంకీర్తనలు – సంపుటం 16, చినతిరుమాలాచర్య విరచితములు, అధ్యాత్మ సంకీర్తన 1
32. అదే, పీఠిక పు॥లు 11–13
33. అదే, సంకీర్తన
34. అన్నమాచార్యుని జన్మతిథి – జాతకము – సప్తగిరి మాసపత్రిక జూలై 1978, పు. 5, ఈ పెద్ద వ్యాసం మూడుభాగాలుగా వరుసగా జూలై, ఆగస్టు, సెప్టెంబరు సంచికలలో ముద్రితమైంది.
35. అదే, సప్తగిరి, ఆగస్టు 1978, పు. 33
36. తిరుమల తిరుపతి దేవస్థానమ్ ఎపిగ్రాఫికల్ సిరీస్ ఇన్స్క్రిప్షన్స్ వాల్యూమ్ 4, నెం. 129, శాసనం
37. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 2, పునర్ముద్రణ, సంకీర్తన 151
38. హిస్టరీ ఆఫ్ తిరుపతి, వాల్యూమ్ 2, పు॥లు 660–3
39. పరమయోగి విలాసం – చిన్నన్న, పు. 124
40. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 1, పునర్ముద్రణ, సంకీర్తన 117
41. అన్నమాచార్యుని జన్మతిథి – జాతకము, సప్తగిరి, ఆగస్టు 1978, పు. 8
42. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము, పు॥లు 42, 43
43. అదే, పు. 29
44. సాళువా డైనాస్టీ ఆఫ్ విజయనగర్ – డాక్టర్ పి. శ్రీరామశర్మ, పు. 71

45. ఏన్యువల్ రిపోర్ట్ ఆఫ్ ఎపిగ్రాఫీ, మద్రాస్. 575/1926
46. తాళ్లపాక కవుల పదకవితలు - భాషా ప్రయోగవిశేషాలు - డాక్టర్ వేటూరి ఆనందమూర్తి, పుటలు 296-97, మధ్య.
47. కడపజిల్లా ఊర్లపేర్లు, డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి, పు. 301
48. ఎ టోపోగ్రాఫికల్ లిస్ట్ ఆఫ్ ది ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ది మెడ్రాస్ ప్రెసిడెన్సీ, వాల్యూమ్ 1, పు. 655, సంఖ్యలు 878-79
49. సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్స్, వాల్యూమ్ 16, శాసనసంఖ్య 31
50. తిరుమల తిరుపతి దేవస్థానమ్ ఎపిగ్రాఫికల్ సిరీస్ వాల్యూమ్ 2, శాసన సంఖ్య 30; ఎపిగ్రాఫియా ఇండికా, వాల్యూమ్ 7, పు. 74 'ఎ కాపర్ ప్లేట్ గ్రాంట్ ఆఫ్ ఇమ్మడి నరసింహ' - జె. రామయ్య పంతులుగారి వ్యాసం. ఈ శాసనాన్ని నా దృష్టికి తెచ్చిన డాక్టర్ సి. సోమసుందరరావు గారికి నా కృతజ్ఞతలు.
51. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము, పు. 32
52. హిస్టారికల్ ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ సదరన్ ఇండియా - రాబర్ట్ సూయెల్, ఎడిటెడ్ బై ఎస్.కె. అయ్యంగార్, పు. 223
53. ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ విజయనగర హిస్టరీ, వాల్యూమ్ 1, పు. 118 - ప్రొఫెసర్ కె. ఎ. నీలకంఠశాస్త్రి, డాక్టర్ ఎన్. వెంకటరమణయ్య
54. అదే, పు. 120
55. సాళువా డైనాస్టీ ఆఫ్ విజయనగర్, పు. 149
56. ది సూర్యవంశీ గజపతీస్ ఆఫ్ ఒరిస్సా - డాక్టర్ ఆర్. సుబ్రహ్మణ్యాం. పు. 67
57. ది విజయనగర ఎంపైర్, డామింగో పేయస్, ఫెర్నో న్యూనిజ్, పు. 85
58. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము, పు. 34
59. అదే, పు. 42
60. ది సూర్యవంశీ గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పు. లు 66, 67
61. ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ విజయనగర హిస్టరీ, వాల్యూమ్ 1, పు. 185
62. సాళువా డైనాస్టీ ఆఫ్ విజయనగర్, పు. 161
63. ఫెరిష్తా వర్ణన - ది సూర్యవంశీ గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పు. 76
64. ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ విజయనగర హిస్టరీ, వాల్యూమ్ 1, పుటలు 135-36, అధోజ్ఞాపికలు
65. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 8, సంకీర్తన 19, అలభ్యమైన 8వ సంపుటంలోని ఈ సంకీర్తన పూర్తి పాఠాన్ని పరిశోధకులూ తిరుమల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులూ అయిన శ్రీ గోపీకృష్ణగారు నా కోర్కెపై నాకందించారు. వారికి కృతజ్ఞతలు.
66. శృంగార సంకీర్తనలు, సంపుటి 12, పునర్ముద్రణ, సంకీర్తన 170
67. సాళువా డైనాస్టీ ఆఫ్ విజయనగర్, పు. 167
68. సప్తగిరి, మాసపత్రిక, జూలై, 1978, పు. 35
69. ది సూర్యవంశీ గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పు. 88
70. ఆంధ్రదేశ భూగోళ సర్వస్వము, ప్రథమ సంపుటము, పు. 211

71. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 1, పునర్ముద్రణ, సంకీర్తన 323
72. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 2, పునర్ముద్రణ, సంకీర్తన 429
73. సప్తగిరి, మాసపత్రిక, ఆగస్టు, 1978, పు. 8
74. ది సూర్యవంశీ గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పు. 5
75. సప్తగిరి, మాసపత్రిక, ఆగస్టు 1978, పు. 8
76. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం. 1, పునర్ముద్రణ, సంకీర్తన. 453
77. అదే, సంకీర్తన 278
78. తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము, ఈ సంకీర్తన శ్రీ వేటూరి వారి పీఠికలో ఉదాహృతం. పు. 49
79. తిరువేంగళప్ప రచన కావ్యప్రకాశ వ్యాఖ్యను శ్రీ వేటూరి ఆనందమూర్తి గారు తమ 'తాళ్లపాక కవుల కృతులు – వివిధ సాహితీప్రక్రియలు' గ్రంథంలో అనుబంధంగా ప్రకటించారు.
80. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము, పు. 41
81. అదే, పు. 41
82. అదే – శ్రీ వేటూరి ఆనందమూర్తిగారి పీఠికలో ఉదాహృతం. పు. 55
83. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 1, పునర్ముద్రణ, సంకీర్తన 235.

4. పూర్వరంగం - 1

సంగీత లక్షణ గ్రంథాలు - నరహరి తీర్థులు

అన్నమయ పదరచనను చేపట్టేనాటికి ఆయన రచనకు ప్రేరకాలుగా ఏయే రచనలు ఉండేవో తెలుసుకోవడానికి ఆధారాలు చాలా స్వల్పంగా లభిస్తున్నాయి. అందువల్ల కొంతలో కొంత ఊహలమీద ఆధారపడక తప్పడం లేదు. అన్నమయ బాల్యాన్ని గురించి చెబుతూ చిన్నన్న -

'నెడపక తొట్టెలో నిడి యెంతపాటు -
పడి యెంతవడి జోఁలబాడెనేనియును
వేంకటపతి పేరు వివరించి పాట
పొంకించుకుండినఁ బోరూర డిలడు'[1]

అని చెప్పడం వలన అప్పటికే శ్రీ వేంకటపతి మీద పాటలున్నట్లు స్పష్టమౌతున్నది. బహుశా అవి జానపదగేయాలై ఉండాలి. అన్నమయ్యే ఒక సంకీర్తనలో -

'పామరులఁ దనమీఁది పాటలెల్లాఁ బాడుమంటా
భూమికెల్లా నోర నూరిపోసినవాడు'[2]

అంటూ శ్రీ వేంకటేశ్వరుణ్ణి వినుతించాడు. అంటే దేశమంతటా శ్రీనివాసుడి మీది గీతాలు పామరుల నోట వినబడుతున్నా యన్నమాట. జానపదగేయాలు లేకుండా ప్రపంచం సాగదు కదా. అన్నమయ సంకీర్తనలను పరిశీలిస్తే జానపద గేయాల నుంచి ఆయన ఎంత స్ఫూర్తిని పొందాడో తెలుస్తుంది. ఆ విషయాన్ని తరువాత పరిశీలించడం జరుగుతుంది.

'ఆడుచుఁ బతకమాకన్నల జోల
పాడఁగ నాఁడెల్లఁ బసిబిడ్డనైతి -

నా కృష్ణమాచార్యు నధ్యాత్మ వినుతి
రాకఁ గొన్నాళ్లు విరక్తుండనైతి
జగతి నీ శృంగారసంకీర్తనముల
కగపడి మంచి ప్రాయపువాఁడనయితి
నని వేంకటేశ్వరుఁడన్నమాచార్యుఁ
గనుఁగొని వాక్రుచ్చి గారవించుటయు...'[3]

అని చిన్నన్న చెప్పిన గాథలో తెలుగు సంకీర్తనం పొందిన పరిణామ దశలను శ్రీ వేంకటేశుడే చారిత్రక కాలానుసారం వివరించాడు. పతక మూకన్న లన్నచోట పాతకమూరలన్నలని ఉండాలి. వారు రచించి పాడిన జోల తెలుగు వాగ్గేయకార సాహిత్యంలో బహుశా మొట్టమొదటి రచన అయి ఉండవచ్చు. నాటికి తిరుపతి వెంకన్న బాలుడన్నమాట ! అన్నమయ సంకీర్తనలతో మంచి ప్రాయపువాడైనాడని మాత్రమే కాక శృంగార సంకీర్తనల రచనకు అన్నమయ శ్రీకారం చుట్టినట్లు కూడా వ్యక్తమౌతున్నది. హరిదాస సాహిత్యంలో శృంగారం లేనేలేదు. నిజానికి శృంగారానికీ వారు నమ్మిన తత్త్వానికీ చుక్కెదురు. కృష్ణమాచార్యుల రచనలలోనూ అంతే. పదిహేడవ శతాబ్దంలో శ్రీ వైష్ణవ సంప్రదాయానికి చెందిన తిరుమలార్యుడు[4] కన్నడ కీర్తనకారుల పరంపరలో అవతరించినదాకా కన్నడ వాగ్గేయకార సాహిత్యంలో శృంగారానికి చోటు లేకపోయింది. బహుశా దక్షిణాదిలో శృంగార పదరచనకు అన్నమయ ఆదికవి. శ్రీ వేంకటేశ్వరుడి కల్యాణోత్సవాల ప్రారంభకుడు అన్నమయ్యే నన్న సంగతి పూర్వోక్తమే.[5] అందువల్లే శృంగార సంకీర్తనల రచనలకు ప్రేరణ లభించి ఉంటుంది.

తెలుగు దేశంలోని గేయ, సంగీత విషయాలు అన్నమయకు తెలుసు. అంతేకాక భారతదేశంలోనే తనకాలం నాటికి ప్రసిద్ధి పొందిన సంగీతశాస్త్ర గ్రంథాలను గురించీ, దేశీయ సంప్రదాయాలను గురించీ ఆయన క్షుణ్ణంగానే తెలుసుకుని ఉన్నాడనటానికి –

'రమణీయ సంగీతరత్నాకర ప్రబం
ధాధ్యాయమున నుక్తమయ్యె పదము
సముచిత సంగీత చంద్రికా దేశైళ
యందు మిక్కిలి దేటమయ్యె పదము
అతులతత్సంవాదమైనట్టి సంగీత
చూడామణికిఁ బల్కుచోటు పదము
ధన్య సంగీతసుధాకర గ్రంథంబు
నందు మిక్కిలి చెలువొందు పదము

తానె ఇన్నిటికిని మూలమైన భరత
మందుఁ బంచదశాధ్యాయ మందు విమల
వృత్త చూర్ణ నిబంధక వివిధ నామ
భవ్య లక్షణములకు నాస్పదము పదము'[6]

అన్న సంకీర్తన లక్షణంలోని మాటలే సాక్షి. ఇందులో ప్రసక్తమైన గ్రంథాలూ, ఆయా గ్రంథకర్తలు జీవించిన కాలమూ పట్టిక వేసుకు చూడడం అవసరమౌతున్నది.

1. సంగీతరత్నాకరము - శార్ఙ్గదేవుడు - క్రీ. శ. 1230 ప్రాంతం
2. సంగీతచంద్రిక - సంగీత చంద్రము పేరుతో విప్రదాసు రచన క్రీ. శ. 1625కు ముందటి రచన లభిస్తోంది. అది ఇది కాకపోవచ్చునేమో!
3. సంగీతచూడామణి - జగదేకమల్లుడు - అభిలషితార్థ చింతామణి కర్త సోమేశ్వరుని పుత్రుడు. పరిపాలనాకాలం 1134 - 43
4. సంగీతసుధాకరము - హరిపాలుడు - సౌరాష్ట్రరాజా. క్రీ. శ. 1175 ప్రాంతము.

ఈ వివరాలను మహామహోపాధ్యాయ పి.వి. కాణే గారి గ్రంథం నుంచీ శ్రీ మానవల్లి రామకృష్ణకవి గారి 'భరతకోశము' అన్న గ్రంథం నుంచీ డాక్టర్

పి. ఎస్. ఆర్. అప్పారావుగారు సేకరించిన పట్టిక నుంచి స్వీకరించడం జరిగింది.[7] ఈ పట్టికలోని గ్రంథాలలో ఒక్క సంగీతచంద్రికకు వివరాలు లభించ డం లేదు. విప్రదాసుడి రచనాకాలం క్రీ. శ. 1625కు ముందే అంటే ఎంత ముందో చెప్పడం కష్టం. సంకీర్తన లక్షణాన్ని తెలుగు చేసిన చినతిరుమలయ్య జీవితకాలం క్రీ. శ. 1488–1562. ఆనాటికి ఆ గ్రంథం ఉన్నదా అన్నది సందేహంగానే మిగిలిపోక తప్పదు.

తమ ఆంధ్రవాగ్గేయకార చరిత్రలో డాక్టర్ బాలాంత్రపు రజనీకాంతరావు గారు పై గ్రంథాలకు ఇచ్చిన తేదీలు పై పట్టికలోని తేదీలతో పూర్తిగా సంవదించ డం లేదు. ఆయన ఇచ్చిన వివరాలు ఇవీ[8] –

1. సంగీతరత్నాకరము – శార్ఙ్గదేవుడు – క్రీ. శ. 1210–1242.
2. సంగీతచంద్రిక – వారాణసీవాస్తవ్యుడైన మాధవభట్టను వాని రచన. ఇతని కాలం 1614కు ముందు అని డాక్టర్ వి.పి. రాఘవన్ అన్నారని రజని గారిచ్చిన వివరం.
3. సంగీతచూడామణి – ఉత్కలదేశ రాజయిన ప్రతాపునిది. అతని కాలం క్రీ. శ. 1497–1541 'అని పరిశోధకుల ఊహ' అన్నారు రజనిగారు.
4. సంగీతసుధాకరము – హరిపాలదేవుని రచన – క్రీ. శ. 1309– 1312.

ఈ రెండు పట్టికలలోనూ శార్ఙ్గదేవుడి సంగీతరత్నాకరం గురించి అభిప్రాయ భేదం లేదు. అది నిస్సందేహంగా అన్నమయకు ముందుకాలం నాటి రచనే. రెండవదైన సంగీతచంద్రిక విషయంలో కాలనిర్ణయం సందేహం గానే మిగిలిపోక తప్పదని ముందరే అనుకోవడం జరిగింది. అదీకాక ఒకే పేరుతో ఇద్దరు రచయితలు రెండు గ్రంథాలను రచించి ఉండవచ్చని భావించ డానికి ఆస్కారమున్నది. వీటిలో దేనిని అన్నమయ చూశాడో నిర్ణయించడం దుష్కరం. మూడవ గ్రంథమైన సంగీత చూడామణిలో కూడా రచయితల విషయంలో అభిప్రాయభేదం కనబడుతోంది. ఉత్కళదేశపు రాజయిన

ప్రతాపుడి రచన అయితే 'అన్నమాచార్యుల గ్రంథంలో పేర్కొనబడటానికి వీలుండదు' అని రజనీకాంతరావుగారే అన్నారు. 'కనుక, దీని కర్తయైన ప్రతాపుడు 1400కు ముందరివాడైన మరే లక్షణకర్తో అని చెప్పుకోవాలి' అని కూడా రజనీకాంతరావుగారన్నారు. సంకీర్తన లక్షణంలో పేర్కొన్న గ్రంథాలకు కర్తలెవరో చెప్పడం జరగలేదు. అందువల్ల క్రీ. శ. 1400 కన్నా ముందరివాడైన ప్రతాపుడొకడున్నట్లూ అతని గ్రంథం మనకు లభించలేదనీ అనుకోవడం కన్నా, జగదేకమల్లుడి రచన సంగీత చూడామణినే అన్నమయ్య పేర్కొన్నాడని భావించడం న్యాయం. నాలుగవ గ్రంథమైన సంగీత సుధాకర కర్త హరిపాలుడి కాలం విషయంలో చరమావధి క్రీ. శ. 1312 కనుక ఆ గ్రంథాన్ని అన్నమయ చూశాడనటానికి ఎలాంటి ఇబ్బందీ ఉండవలసిన అవసరం లేదు.

'తానె ఇన్నిటికిని మూలమైన భరతమందుఁ బంచదశాధ్యాయమందు విమలవృత్త, చూర్ణ, నిబంధక వివిధనామ భవ్య లక్షణముల నాస్పద' మైనది పదం అన్న అన్నమయ వాక్యం సరైనదే. రాతప్రతుల్లో పధ్నాలుగు, పదిహేను అధ్యాయాలలోని విషయాలన్నీ నాట్య శాస్త్రం 'పంచదశాధ్యాయం'లో ఉన్నట్టు పేర్కొనడం తప్పుకాదు. అన్నమయ చూసిన ప్రతిలో ఆ విషయాలన్నీ 'పంచదశాధ్యాయం'లోనే ఉన్నవని నమ్మడానికి వీలుంది. నాట్యశాస్త్రంలోని అధ్యాయాల విషయంలో జరిగిన తారుమారును డాక్టర్ పి. ఎస్. ఆర్. అప్పారావు గారు తమ పీఠికలో సూచించారు.[10]

అయితే పై రచనలలో కానవచ్చే లక్షణాలను అన్నమయ్య ఎంతవరకు అనుసరించాడన్నది ప్రశ్న. ఇక్కడ ఒక ముఖ్యవిషయాన్ని గమనించవలసి ఉంది. సంగీతశాస్త్ర విషయాలను వివరించే లక్షణ గ్రంథాలన్నిటా ఉన్న ముఖ్య లక్షణం, లక్షణానికి లక్ష్యం చూపకపోవడం. ఇందువల్ల ఏర్పడిన అయోమయం అంతా ఇంతా కాదు. చాలామంది ఆధునిక విద్యావేత్తలు ఈ లక్షణ గ్రంథాలను గురించి రాసినప్పుడు చిలకపలుకుల్లాగా అవే వాక్యాలను ఉదాహరించడం

తప్పు వ్యాఖ్యానించడానికి గానీ, ఈనాడు ప్రచారంలో ఉన్న సంప్రదాయాను సారం లక్ష్యాలనిస్తూ వివరించడంగానీ చెయ్యలేదు. అలాంటి ప్రయత్నాలను చేసినవారికి సైతం ఇబ్బందులు తప్పలేదు. ఉదాహరణకు శ్రీ రజనీకాంత రావుగారు –

> '... ఓవీ, లోలీ, డోల్లరీ, దంతీ అనే దేశభాషా ప్రబంధాలను శార్ఙ్గదేవుడూ, గోవింద దీక్షితుడు మొదలయిన వారు చెప్పారు. దేశభాషలలో ప్రసిద్ధి గల గేయాలని చెప్పారేగాని, అవి పాడబడే సందర్భాలను ఇతర లక్షణాలను స్పష్టంగా నిర్దేశించలేదు. ఓవీ, డోల్లరీ ఊయెల పాటలనిగాని, జోలలనిగాని, లోలీ లాలిపాట లనిగాని ఊహిస్తే ఆ ఊహ సరికావచ్చునా ? పరిశోధన ఇంకా జరగవలసిన విషయమిది. సరియైన దృష్టాంతాలు, సమగ్రమైన లక్షణమూ దొరికితే సరిపోల్చవచ్చు'.[11]

అన్నారు. 'సరియైన దృష్టాంతాలూ, సమగ్రమైన లక్షణమూ' ఈ విషయంలో నిజానికి గగనకుసుమాలే. తెలుగు కన్నడ సంస్కృత ఛంద శ్శాస్త్రాలలో కనిపించే పద్ధతులను సంగీత శాస్త్రవేత్తలు ఎందువల్ల గమనించి అనుసరించలేదో దురూహం. నిజానికి ఆయా సంగీతశాస్త్ర గ్రంథాలను రచించిన వారికి తమ సమకాలీన కాలంలో ప్రవర్తిల్లిన వాగ్గేయకారుల రచనల పట్ల తూష్ణీభావ ముండటమే ఇందుకు కారణమా అని అనిపించక తప్పదు. 1973లో కన్నడ అధ్యయన సంస్థ ఆధ్వర్యాన జరిగిన సదస్సులో ప్రొఫెసర్ రా. సత్యనారాయణగారి 'హరిదాసర రచనెగళల్లి సంగీతమౌల్య' అన్న సమీక్షా వ్యాసంలోని కొన్ని వాక్యాలను, మనం గమనించితీరవలసినవి ఇక్కడ ఉట్టంకిస్తున్నాను –

> 'జగదేకమల్లుడు, పార్శ్వదేవుడు, హరిపాలదేవుడు, శార్ఙ్గ దేవుడు, సింహభూపాలుడు గ్రంథ రచన చేసిన కాలంలో – 12 నుంచి 14వ శతాబ్ది మధ్యకాలంలో – కర్ణాటకంలో వచనం,

మంత్రగోప్యం, కాలజ్ఞానం మొదలైన గేయప్రక్రియలు మంచి ప్రచారంలో ఉన్నాయి. ఆ ప్రక్రియలకు మాతృస్థానంలో ఉన్న వీరశైవధర్మం అటు రాజాశ్రయమూ ఇటు బహుళ జనాదరణా ఆకాలంలోనే పొంది ఉన్న సంగతి నిర్వివాదం. ఇతర శాస్త్రకారులు అన్యమతావలంబులైనందున అసహిష్ణుత వలనా, అశ్రద్ధ వలనా ఈ గేయప్రక్రియలను వివరించదలుచుకోలేదని వాదం కోసం ఒప్పుకొందాం. కాని శివభక్తాగ్రణి జానపదసాహిత్య ప్రక్రియలను వివరించి అత్యంత విషయపూర్ణమైన గ్రంథాన్ని రచించిన శార్ఙ్గదేవుడు ఎందువల్ల ఈ ప్రక్రియలను గురించి చెప్పడం మానుకొన్నాడు ?... పధ్నాలుగో శతాబ్దం నుంచి పదహారో శతాబ్దం దాకా కృతికి మాతృప్రాయమైన దేవరనామ, దాసర పదాలు కన్నడ నాడులో ఉదయించాయి... ఈ కాలంలోనే రచితమైన కుంభకర్ణుడి రచన 'సంగీతరాజం', మోక్షదేవుడి రచన 'సంగీతరసకళికా', సుధాకలశుడి రచన 'సంగీతోపనిషత్ సారోద్ధారం' మొదలైన గ్రంథాల్లో ఈ కన్నడ గీతప్రక్రియల పేర్లే కనబడవెందుచేత ? మరీ సమీపకాలంలో ఉండినా దూర ప్రాంతాలవారు కావడం వలన ఇలా జరిగిందనుకొన్నా, నిజానికి వీధి వీధినా, ప్రజల మనస్సులలో ప్రజల నోట నానుతున్న దేవర నామం, ఉగాభోగం, సూళాది, భ్రమర గీతాలు మొదలైన గేయ ప్రక్రియలూ అలా ఉండగా అభినవ భరతాచార్యుడనిపించుకొన్న వ్యాసరాయలవారే దేవరనామాలు రచించగా, విజయనగరంలో అదేకాలంలో విజయనగర ఆస్థానంలోనే ఉన్న లక్ష్మీనారాయణుడు రచించిన 'సంగీత సూర్యోదయం'లో వాటి ప్రస్తావనే లేకపోవడం ఎలా జరిగింది? ... ఇంకా ఆశ్చర్యకరమైన సంగతి ఏమిటంటే – కన్నడ దేశపు

> వాడై తంజావూరికి వెళ్లి గ్రంథరచన చేసిన గోవింద దీక్షితుడు తన సంగీతసుధలో గాని, అతని కొడుకైన వేంకటమఖి తన 'చతుర్దండిప్రకాశికా'లో గాని దేవరనామ, సూళాది మొదలైన ప్రక్రియలను వివరించనేలేదు. పోనీ తన ప్రభువైన విజయ రాఘవనాయకుడి ఆస్థానంలోనూ, ఇంకా ఆ చుట్టుపక్కలనే ఉన్న ఇతర రాజాస్థానాలలోనూ వేయిపదాలు రచించి పాడిన క్షేత్రయ్యను గాని, ఘనం శీనయ్యనుగాని, వందలకొలదీ పదాలను రచించిన కన్నడనాడులోని హరిదాసులను గాని, ఇతర వాగ్గేయకారులు రచించిన శృంగారపదాలరీతిని గాని ఎందుకు వివరించలేదు ? అసలు పేర్కొనకపోవటానికి కారణ మేమిటి?'[12]

ఇవీ ప్రొఫెసర్ సత్యనారాయణగారు లేవనెత్తిన ప్రశ్నలు. ఇవే కాదు, ఇంకా మౌలికమైన విషయాలకు సంబంధించి కూడా వారు చాలా విజ్ఞతతో కూడిన సందేహాలను వ్యక్తపరిచారు గాని ప్రస్తుతానికి అన్నమయ గేయ నిర్మాణ వైఖరిని గురించి చర్చించే సందర్భంగా ఉపకరించే ఈ వాక్యాలను ఉట్టంకించడం జరిగింది. పై ప్రశ్నలకు వారిచ్చిన సమాధాన మిదీ – ''ఇందుకు ముఖ్య కారణం మన సంగీత లాక్షణికుల 'సంప్రదాయశరణత'.'' తమ కాలపు సామగ్రిని వివరిస్తామని ప్రతిజ్ఞ చేసినా, వారు వివరించింది కేవలం రాగాలూ, తాళాలూ మాత్రం. ప్రబంధాలను వారు తమ పూర్వాచార్యుల గ్రంథాల నుంచి పరిగ్రహించారు'[13] అని అంటూ 'వారు మనకేకాక తమకూ అన్యాయం చేసుకున్నార'ని తీర్పిచ్చారు కూడా.

తెలుగులో ఛందోలక్షణ గ్రంథాలు చాలానే ఉన్నాయి. ఆయా రచయిత లలో లక్షణం విషయమై అభిప్రాయభేదాలూ ఉంటూ వచ్చాయి. ఉదాహరణకు చంద్రగణాలు పదహారని, భీమన, విన్నకోట పెద్దనలు చెప్పగా అనంతుడు వాటిలో మొదటి రెండింటినీ వదిలి చంద్రగణాలు పధ్నాలుగే అని చెప్పడం

జరిగింది. అలాగే యతుల విషయంలో ప్రాసల విషయంలో లక్షణ గ్రంథాలన్నీ ఒక్క తీరున చెప్పడంలేదన్న సంగతి తెలిసిందే. అయినా ఆయా అభిప్రాయ భేదాలు పరస్పర విరుద్ధాలు కాకపోగా చారిత్రకంగా కావ్యభాషలో వచ్చిన పరిణామాలను సూచిస్తున్నాయి. అదీకాక లక్షణకర్తలు తమ గ్రంథాల్లో ప్రసిద్ధ కవుల రచనలను ఉదాహరణలుగా ఇవ్వడం వలన వారు చెప్పిన లక్షణానికి ఒక స్థిరత్వం సమకూరింది. అసలు గ్రంథాలు లుప్తమైనా ప్రసిద్ధ కవుల పద్యాలు కొన్నైనా లక్షణగ్రంథాల పుణ్యమా అని మనకు లభిస్తున్నాయి. సంగీతశాస్త్ర గ్రంథాలలో ఈ పద్ధతిని లక్షణకర్తలు ఎందువల్ల అనుసరించలేదో అన్న ప్రశ్న అనివార్యమౌతుంది. నిత్యనూతనమై పరిణామశీలతను కలిగి ఉన్న వాగ్గేయ కార సాహిత్యాన్ని సంగీతలక్షణకారులు పట్టించుకోకపోవడానికి కారణం ఆ విషయంలో వారి అశక్తతేననీ అనుకోవడంలో తప్పుండదు. ప్రాచీనమైన సంస్కృత లక్షణాన్ని సమకాలీన గేయరీతులకు అన్వయించేందుకు అసమర్థులై కొత్తలక్షణాన్ని రూపొందించుకోగలిగిన ప్రతిభ లేనివారు కావడం వలన సంగీత లక్షణకర్తలు ఈ విషయంలో విఫలురైనారు. ఈ విషయంలో ఇంతకన్నా తృప్తికరమైన తీర్మానానికి రావడం కష్టం.[14] మనకు లభిస్తూన్న సంగీతశాస్త్ర లక్షణ గ్రంథాల్లో చెప్పిన లక్షణాలను అన్నమయ్య ఎంతవరకు అనుసరించాడని ఇంతకు ముందు వేసుకొన్న ప్రశ్నకు జవాబును అంత సులభంగా చెప్పడం కుదరదు. అన్నమయ్య తననాటికి అస్తవ్యస్తంగా ఉన్న గేయరచనకు ఒక సువ్యవస్థిత రూపం ఇవ్వడం కోసమై సంకీర్తన లక్షణాన్ని రచించి ఉంటాడు. అందువల్ల అప్పటికి ఉన్న సంగీత లక్షణగ్రంథాల నుంచి కొన్ని సాంకేతికపదాలను స్వీకరించి, జానపదగేయాల నుంచీ తెలుగు పద్య ఛందస్సుల నుంచీ ప్రేరణను పొంది తనకు తానుగా ఒక నూతన సంప్ర దాయానికి ఆద్యుడైనాడు. ఆయన ప్రాచీన గ్రంథాల నుంచి స్వీకరించింది స్వల్పమే. అందువల్లనే ఆయన పదకవితామార్గసార్వభౌముడుగా, పదకవితా పితామహుడుగా ప్రస్తుతుడైనాడు. నిజానికి పదరచనలో ఆయన చేసిన

వివిధ ప్రయోగాలను విశ్లేషించి చూడాలంటే ఒక వ్యక్తివల్ల గాని, ఒక గ్రంథంలో గాని సాధ్యమయే పనికాదు. ఇంతవరకూ సక్రమమైన మార్గంలో ఈ విశ్లేషణ ప్రారంభం కానందున ఆ మహాప్రయత్నానికి నాందిగా కొన్ని సంకీర్తనలను విశ్లేషించి చూసి అన్నమయ తలపెట్టిన మహత్తర సృజనాత్మక కృషికి విలువ కట్టడం అనివార్యమయిన కర్తవ్యం. అయితే ఈ పనికి పూనుకునేముందు గమనించవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి.

చినతిరుమలాచార్యుడు 'సంకీర్తన లక్షణమను పదచ్ఛందము'లో –

''ధరలోఁ దాళపాక యన్నయగురూత్తంసుండు సంకీర్తనా
పరిశుద్ధిన్ మును జేయఁబూని తగ నుత్పాదించెఁ దల్లక్షణం
బరుదైమించి సంస్కృతంబునఁ గవీంద్రానంద సంధాయియై
పరిపూర్ణాఖిలశాస్త్రసమ్మతముగా భావజ్ఞులౌనౌనసన్

అలరుఁ దాళపాక యన్నయార్య సుతుండు
తిరుమలార్యు డఖిలదేశికుండు
తత్సుతాగ్రజుండ ధరలోనఁ జిన తిమ్మ
యాహ్వయుండ దండ్రి యనుమతమున

పరమామ్నాయసమానమై వెలయు మత్పైతామహ గ్రంథమున్
వర చాటూక్తి మదీయ పుణ్యాజనక వ్యాఖ్యాతమున్ వేడ్క దా
చరణాంభోరుహముల్ మదిం దలఁచి సచ్ఛాస్త్రజ్ఞ లింపొందఁగా
వరుసం జెప్పెదఁ బద్యరూపమునఁ దద్వాక్యానుసారంబునన్''[15]

అన్నాడు. ఈ మాటల వల్ల మనం గ్రహించగల విషయాలు – అన్నమయ 'సంకీర్తనాపరిశుద్ధిన్' జేయ పూనుకొని అందుకు లక్షణాలను సంస్కృతంలో నిర్వచించాడు. ఆ లక్షణాలకు పెదతిరుమలయ్య వ్యాఖ్యానం రచించాడు. ఆ వ్యాఖ్యానాన్ని, పితృపాదుల 'చరణాంభోరుహముల' నూ మనస్సులో ఉంచుకొని 'తద్వాక్యానుసారంగా' పద్యరూపంలో వరుసగా చెబుతానని

చినతిరుమలయ్య ప్రతిజ్ఞ. అయితే రేకులమీద చెక్కిన వారి పొరబాటున కాబోలు పద్యాల వరుసక్రమం తప్పింది. 'సంకీర్తన లక్షణమను పదచ్ఛందము' నాలుగు రాగిరేకుల మీద చెక్కి ఉంది. మొత్తం 71 పద్యాలు న్నాయి. పద్యాలకు మధ్య ఉన్న వచనాలన్నీ చెప్పబోయే విషయాలకు దాదాపు శీర్షిక రూపంలో ఒక పంక్తిని మించని వచనాలే. అన్నమయ చెప్పిన లక్షణం సంస్కృతంలో ఉన్నదని చిన్నన్న ఇచ్చిన సమాచారమే. పెదతిరుమలయ్య చేసిన వ్యాఖ్యానం ఏ భాషలో ఉందో తెలియరాలేదు. 'వరుసం జెప్పెదఁ బద్య రూపమునఁ దద్వ్యాఖ్యానుసారంబునన్' అని చినతిరుమలయ్య ప్రతిజ్ఞ. డెబ్బయివొక్క పద్యాలలో ఇది సాధ్యమేనా అన్న సందేహం మనకు కలిగినా, చిన తిరుమలయ్య మాత్రం కేవలం నలభైయెనిమిది పద్యాలనే లక్షణం చెప్పడానికి వినియోగించాడన్న సంగతిని గుర్తించవలసి ఉంది. 71 పద్యాల లోనూ 23 పద్యాలు అన్నమయను కీర్తించడానికీ ఇతర విషయాలకూ వినియోగించాడు. పరిశీలించి చూస్తే కొన్ని పద్యాలు రాగిరేకుల మీద చెక్కడం లో జారిపోయి ఉండవచ్చని అనుమానం కలగకతప్పదు. పెదతిరుమలయ్య వ్యాఖ్యానానుసారం అన్నమయ సంస్కృత రచనను అర్థం చేసుకొని చినతిరు మలయ్య సూత్రప్రాయమయిన అన్నమయ వాక్యాలనే అనువదించి మన కందించాడని భావించకతప్పని పరిస్థితి కలుగుతోంది. ఇందుకు తారుకాణగా-

'.. కీర్తన లక్ష్యములు పదకవితాపితామహుడేర్పరచెన్' - సం.ల., 13

'.. అట్టి యన్నమయాచార్యుడానతిచ్చిన పదలక్ష్య లక్షణములు' 14

'.. ఈ తెలుంగు లన్నియుఁ బదకవితామార్గ సార్వభౌముడుదెలిపెన్' 24

'.. అన్నయాచార్యుఁడు పదిలముగా భరతశాస్త్రపద్ధతిఁ బలికెన్' 25

'.. అని యన్నయాచార్యుడనియె' 33

'.. అని హరికీర్తనాచార్యుఁడనియె' 66

అంటూ చినతిరుమలయ్య పదేపదే చెప్పడం గమనించవచ్చు. ఎక్కడా కూడా

తన తండ్రి ఏమన్నాడో చినతిరుమలయ్య చెప్పకపోవడం వలన పెద తిరుమలయ్య వ్యాఖ్యానాన్ని చినతిరుమలయ్య తన పద్యాలలో ప్రదర్శించ లేదని అనుకోవలసి వస్తున్నది.

అన్నమయ సంస్కృతంలో సూత్రప్రాయంగా చెప్పిన విషయాలనే చిన తిరుమలయ్య తెనిగించాడు. వేలాది సంకీర్తనలను తానే రచించి ఉన్నాడు కనకా, అవే లక్ష్యాలు కనకా అన్నమయ ప్రతి చిన్న విషయాన్నీ వివరించే శ్రమను తీసుకొని ఉండకపోవచ్చుగానీ, కనీసం తాను నిర్వచించిన లక్షణాల కనుగుణంగా తానే రచించిన లక్ష్యాలను పేర్కొనే ఉండి ఉండాలి. సంకీర్తన లక్షణంలో –

అట్టి యన్నయార్యుఁడానతిచ్చిన పద
లక్ష్య లక్షణముల లాగు దెలిసి
పలుకనేర్చెనేని బాలుండుఁ బ్రోడయౌఁ
దత్ప్రబంధమమృతధారఁ బోలి –సం. ల., 14

అని ఉండడంవలన తొలుత తాళపత్రాల మీద ఉన్న గ్రంథంలో 'అన్నయార్యుఁ డానతిచ్చిన పదలక్ష్య లక్షణములు' కలిసి ఉండి ఉండాలి. ఆ గ్రంథాన్ని చినతిరుమలయ్య అనువదించి రాగిరేకుల మీది కెక్కించేటప్పుడు లక్ష్యాలను తామ్రపత్ర సంఖ్యావిస్తరభీతి చేత వదిలి ఉండవచ్చు. కేవలం రాగి రేకుల మీది పద్యాలే లభించి, అసలు గ్రంథానికి తాళపత్రప్రతులేవీ లభించక పోవడం మన దురదృష్టమే.

సంకీర్తనలక్షణంలో వాడిన సాంకేతిక పదాలు ప్రాచీనమైన సంస్కృత పదాలే. కాని వాటికి సరియైన అర్థాలను నిర్దేశించడం, సంప్రదాయం తెలిసి రానందువలన కొంత కష్టమౌతున్నది. ఈనాటికీ సంకీర్తన లక్షణంలోని లక్షణాలను సంతృప్తికరంగా వివరించినవారు లేరు. శ్రీ వేటూరి ఆనందమూర్తి గారు[16] ఈ విషయంలో కొంత ప్రయత్నించారు గాని ఆ కృషిని గురించి కీర్తిశేషులు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు –

> ''సంకీర్తన లక్షణము' నా దృష్టిలో అంతకు ముందు చాలా కాలంగా అనువర్తించి వచ్చిన శాస్త్రప్రమేయము. అందులోని ప్రబంధాల ధాతువులను అన్నమాచార్యుల కృతుల కన్వయించేది ఎక్కువ ప్రయోజనం కాజాలదు. 15వ శతాబ్ది కించుమించుగా వెలసిన కర్ణాట వాగ్గేయకారుల రచనలూ ఇట్టివే. నేటికంటూ ఆ వివేచన నిష్ఫలమైపోయింది.''[17] అన్నారు.

అన్నమయ వాడిన సాంకేతికపదాలు ఇతర ప్రాచీన గ్రంథాలలో ఉన్నంత మాత్రాన 'సంకీర్తన లక్షణము నా దృష్టిలో అంతకుముందు చాలా కాలంగా అనువర్తించి వచ్చిన శాస్త్రప్రమేయము' అని రాళ్లపల్లివారనడం సరికాదు.

అదీగాక '15వ శతాబ్ది కించుమించుగా వెలసిన కర్ణాట వాగ్గేయకారుల రచనలూ ఇట్టివే' అన్న శర్మగారి వాక్యానికి అతివ్యాప్తి దోషం కలిగింది. అసలు కర్ణాటక వాగ్గేయకారుల రచనలన్నీ సరైనవిధంగా మనకు లభించలేదు. మనకు సమీపకాలంవాడైన పురందరదాసుల రచనలలోనే ప్రక్షిప్తాలున్నట్టు విజ్ఞుల అభిప్రాయం.[18] అంతేకాక కర్ణాటక వాగ్గేయకారులు జీవించిన కాలాలను ఉజ్జాయింపుగానే నిర్ణయించడం జరిగింది. కన్నడ వాగ్గేయకారులలో ఉద్భవించిన హరిదాసవాఙ్మయకారుల పరంపరలో ప్రప్రథముడుగా పరిగణితుడైన నరహరితీర్థుల రచనలు[19] కేవలం మూడు మాత్రమే లభించాయి. కాని అంతకుముందు వర్థిల్లిన అల్లమ ప్రభువూ, అక్కమహాదేవి మొదలైన శివశరణుల రచనలు నరహరితీర్థుల రచనాసరణికి అంతగా భిన్నమైనవి కావు. మరి అన్నమయ తలపెట్టిన 'సంకీర్తనా పరిశుద్ధి' ఎలాంటిది అన్న ప్రశ్నకు సమాధానం చెప్పుకోవలసిన అవసరం మనమీద ఉన్నది కదా ! నరహరి తీర్థుల తరువాత వెలసిన కర్ణాట వాగ్గేయకారులు శ్రీపాదరాయలూ, పురందర దాసులూ అన్నమయకు సమకాలీనులే. వారి రచనలకూ, అన్నమయ రచనలకూ ఉన్న తేడాలను పరిశీలించడానికి తెలుగు కర్ణాట భాషల్లో పండితులై, సంగీత విద్వాంసులైన శ్రీ రాళ్లపల్లివా రెందుచేతనో పూను కొనలేదు.

ముందుగా కర్ణాట వాగ్గేయకారుల రచనలకూ అన్నమయ రచనలకూ ఉన్న తేడాలను గుర్తించవలసి ఉంది. 12వ శతాబ్దంలో బసవేశ్వరుని సమకాలీనుడై శూన్యసింహాసనాధ్యక్షుడిగా ప్రసిద్ధి చెందిన అల్లమ ప్రభువు రచన 'ప్రాణలింగి' అన్న గేయం ఉదాహరణగా స్వీకరించి పరిశీలించడం అవశ్యం. ఇందులో పల్లవి కాక ఐదు నాలుగు పాదాల చరణాలు ఉన్నాయి. పల్లవి నాలుగుపాదాలతో చరణమంతగా విస్తరించుకొని ఉంది. రాగం మధుమాధవి. అందులోంచి కొంత భాగం –

పల్లవి : నుడియ గడణద బెళగు మరుత పరిమళదంతె
భావవిల్లద బయలు పరవుతానె
అరుహు కురహిన మరహు తెరహిల్ల దాఘనవు
నింద నిజపద దింద ప్రభెయాయితు ।

చరణం : ధరగె నిద్రెయు ఇల్ల, ఉదకక్కె కనసిల్ల
అగ్ని కళవళకె ఒళగాగ దెంతో
సుళివ పవనను తాను తామసక్కాళగాగ
బయలింగె భ్రమయుంటె గోహేశ్వర ।[20]

పన్నెండవ శతాబ్దంలో శివశరణులలో ప్రసిద్ధి పొందిన భక్తురాలూ, కవయిత్రీ అయిన అక్కమహాదేవి రచన 'నీనంటిగ' అన్న గేయం – రామశ్రీ రాగంలో రచితమైనది –

పల్లవి : నంబిదె గురువే నంబిదె, నంబిదె స్వామి
నంబిదె, అంబికారమణ, నీనంబిగ ।

చరణం : హోళెయ ఒరవ నోడంబిగ
సెళహు బహుళకాణంబిగ

సులుహినోళగె బిద్దెనంబిగ - ఎన్న
సెళెదు కొళ్లో నీనంబిగె ।[21]

కన్నడ విద్వాంసులందరూ హరిదాసపరంపరలో మొట్టమొదటివాడని గణుతించే నరహరితీర్థులు 13-14 శతాబ్దుల వాడని అభిప్రాయాన్ని ప్రకటించారు. ఆయనవి మూడే రచనలు లభ్యమైనాయి. ఆయన గీతం -

పల్లవి : హరియె ఇదు - సరియే

అనుపల్లవి: చరణసేవక నల్లి - కరుణబారద్యాకె

చరణం : పతితనెందు శ్రీపతి రక్షిసిదరె
వితతవాహుదె నిన్న పతితపావన కీర్తి ।
శక్తనీనాగిద్దు భక్తనుపేడిసె
భక్తవత్సలనామ వ్యర్థవాగదె ।[22]

ఇక్కడ కొన్ని గమనార్హమైన విషయాలను చర్చించి చూడవలసి ఉంది. మొదట పేర్కొన్న అల్లమప్రభువు, అక్కమహాదేవి పన్నెండవ శతాబ్దికి చెందిన వారనడంలో అభిప్రాయభేదాలు లేవు - ఇతర చారిత్రకాధారాలతో ఆ విషయం నిరూపితమైంది గనుక. కాని నరహరితీర్థుల విషయంలో కన్నడ విద్వాంసులు నిర్ణయించినకాలం అంత ఖచ్చితమైన నిర్ణయంగా కనిపించదు. అయినా కర్ణాటక విద్వాంసుల అభిప్రాయన్నే వాదం కోసం అంగీకరించి పరిశీలిస్తే తేలే విషయాలు ఇవీ -

అల్లమ ప్రభువు, అక్కమహాదేవి రచనలలో యతి తెలుగు భాషలో లాగా అక్షరానికి అక్షరం రావడంగా ఉండే యతి కనిపించదు. అల్లమ ప్రభువు రచనలలో కన్నడ భాషకు సామాన్యమని విద్వాంసులు పేర్కొనే ప్రాస సహితం కనిపించదు. అక్కమహాదేవి రచనలలో ప్రాస పట్టుదప్పక నిలిచింది. బహుశా ఆమె సంప్రదాయాన్ని మన్నించి ఉండవచ్చు. ఆ తరువాత కన్నడ విద్వాంసుల కాలనిర్ణయం ప్రకారం నూరు, నూటయాభై సంవత్సరాల తరువాతివాడైన

నరహరితీర్థుల రచనలలో యతి, ప్రాసయతి, ప్రాస కనిపిస్తున్నాయి. కన్నడ భాషలో యతి అంటే కేవలం విరామమే. అక్షరానికి అక్షరం రావడం కాదు. డాక్టర్ డి. ఎస్. కర్కి గారు తమ 'కన్నడ ఛందోవికాస' గ్రంథంలో యతి విషయమ్మై రాసిన విశేషాలివీ –

''కన్నడంలోని యతి సహజమ్మైన యతి. అంటే చెవికి దాని అస్తిత్వం ప్రత్యేకంగా గ్రహింపుకు రాదు. కన్నడ లయలో నాద ప్రవాహం గణం నుంచి గణానికి సమాధానమ్మై సమాన మౌతుంది. సమరసంగా సాగుతున్నప్పుడు 'ఇక్కడిక్కడ యతి' అని వేర్పరచి చూపించడానికి అవకాశం లేదు. ఈ దృష్టితో చూస్తే లయ అన్న పేరు (యతికి) కన్నడ లయకే విశేషంగా ఒప్పుతుంది, ఎందువల్లనంటే లయ అంటేనే స్వర సామరస్యం గనుక. సహజయతిలో కన్నడపు ఛందోగతి సమరసమ్మై సాగుతుంది. ఈ సహజయతి ప్రతి చరణంలోనూ గణగణానికీ చివరన స్వాభావికమ్మై మృదువుగా వస్తుంది. చూడండి –

సోగెము । గిలకండు । సార్క్కవం । దదొళను
రాగర ! సదలహ । రియోళు
బాగిలి । నొళవొక్కు । బందెను । బుదువతి
వేగదో । ళిదిరుగొ । ళువుదు

పై పద్యంలో చూపించిన ఈ । గుర్తు గణవిభజననూ, యతినీ ఒక చోటే చూపిస్తోంది. ఇంక సంస్కృత యతి (ఉసిర్దాణ – ఊపిరిని తీసుకొనే స్థానం) ని పోల్చి చూడాలి.

జటానేయం వేణీ । కృతక చ కలాపో న గరళం
గళే కస్తూరీయం । శిరసి శశిరేఖా న కుసుమం
ఇయం భూతిర్నాంగే । పతి విరహజన్మా ధవళిమా
పురారాతిభ్రాంత్యా । కుసుమశరకిం మాం వ్యథయసి

ఈ పద్యంలో ఈ । గుర్తు వేసి చూపించినచోట యతి ఖచ్చితంగా ఊపిరి పీల్చుకునేందుకై వస్తున్నది. అంతేకాక స్పష్టంగా గమనింపుకి వస్తుంది. ఏ సంస్కృత వృత్తంలోనైనా యతికి నిర్దేశముంటే ఉండవచ్చు. వృత్తంలో యతి ముఖ్యం గనుక. ఏ కన్నడ 'మట్టు' లక్షణంలోనూ యతిమాట నిర్దిష్టమై రాదు. ఎందువల్ల నంటే యతికోసం ప్రత్యేకమైన మాటకు అక్కడ ఆస్పదమే లేదు గనుక.'[23]

పైన ఉదాహరించిన డాక్టర్ కర్కి గారి మాటల్లో కన్నడ, సంస్కృత భాషలలోని యతి గురించి స్పష్టంగానే ఉన్నా తెలుగు భాషలోని పద్యానికి అలవాటు పడిన మనకి అస్పష్టంగా ఉండవచ్చు. ఈ సందర్భంగా 'తెలుగు ఛందోవికాసం'లో శ్రీ సంపత్కుమారాచార్యులు గారు రాసిన వాక్యాలను కూడా గమనిస్తే కన్నడ యతి స్వరూపం మరికొంత స్పష్టమౌతుంది.

''కన్నడ మందు యతి నియమము లేదని స్థూలముగా చెప్ప వచ్చును... కర్ణాటక విషయ జాతులను గూర్చి చెప్పునప్పుడు నాగవర్మ యతి విషయ మెత్తలేదు. అచ్చుగన్నడమందు యతి లయయే కాని వేరు కాదు. ఈ విధమైన యతి – సహజయతి – ప్రతి చరణ మందు గణగణమునకు చివర నుండును... ఈ విధముగా కన్నడ మందున్నదని చెప్పబడుచున్న యతికి ఛందశ్శాస్త్రరీత్యా 'యతిత్వము' లేదు. కావున కన్నడమున యతి లేదని చెప్పవలసి వచ్చుచున్నది.''[24]

కన్నడ యతికీ తెలుగు యతికీ ఉన్న తేడా చాలా పెద్దదే. అందువల్ల తెలుగుభాషలో 15వ శతాబ్దిదాకా వెలువడిన అసంఖ్యాకమైన తెలుగు కావ్యాల లోని పద్యాలలో, నిత్యం వాడుకలో నేటిదాకా ఉన్న సామెతలలో, జానపద గేయాలలో కనిపించే యతి – సరూపాక్షర యతి – తెలుగుభాషకు మాత్రమే చెందిన ముఖ్య లక్షణం. తెలుగు పద్యాలలో యతి మాత్రమేకాక, ప్రాసయతిని

కూడా వినియోగించవచ్చని ఉన్న లాక్షణికుల అనుమతిని ఇక్కడ గమనించి తీరాలి. ఈ దృష్ట్యా శ్రీ నరహరితీర్థుల రచనను పూర్తిగా పరిశీలించి చూడాలి.

హరియె ఇదు । సరియే ।పల్లవి।
చరణసేవకనల్లి। కరుణె బారద్యాకె ।అనుపల్లవి।

పతితనెందు శ్రీ – పతి రక్షిసదిరె
వితతవాహుదె నిన్న–పతితపావనకీర్తి ॥

శక్త నీనాగిద్దు – భక్తనుపేక్షిసె
భక్తవత్సలనామ – వ్యర్థవాగదె ॥

దిగిలిల్లదె ఒద్ద – భృగువ పాలిసిదె
నగధర ఎన్నబిడువ – బగె ఏనిదు ॥

హేయ అజామిళన – కాయలిల్లె । స్వ
కీయనె, నాపర – కీయనె నినగె ॥

ఉంటుహిరణ్యకన – కంటక బిడిసిద్దు
నంటనె నినగె – భంటనానల్లవె ॥

కెట్టఅహల్యెయ – దిట్టపాలిసిదె
కొట్టళు అవళెన – చిట్టిద్దు నానేస ॥

దొరె నిన్నమనసిగె – సరిబందంతె మాడు
మొరె హొక్కెనునా – నరహరి పూర్ణనె ॥[25]

ఈ పాటలోని యతీ, ప్రాసయతీ సులభంగానే కంటి కానుతున్నాయి, చెవికి వినబడుతున్నాయి. అన్నమయకు సమకాలీనులైన శ్రీపాదరాయల, పురందరదాసుల రచనలలో ఈ యతీ, ప్రాసయతీ కానరావు. మరి నరహరి తీర్థుల రచనల్లో ఇవి ఏ విధంగా ప్రవేశించాయి? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పుకోవలసి ఉంది. ముందుగా నరహరితీర్థులను గురించి తెలిసిన విషయాలను పరిశీలించవలసి ఉంది. ఆచార్య కె. సుందరం గారు తమ గ్రంథం 'ది

సింహాచలమ్ టెంపుల్'లో ఇచ్చిన వివరాలను ప్రస్తుత సమస్యా పరిష్కారానికి కావలసిన వాటిని ఇస్తున్నాను -

> ''ప్రసిద్ధ మాధ్వయతి శ్రీ నరహరితీర్థులు కళింగ ప్రాంతంలో పదమూడో శతాబ్దంలో వర్ధిల్లి, మాధ్యమికయుగ కళింగంలోని వైష్ణవ క్షేత్రాలయిన శ్రీకూర్మం, సింహాచలక్షేత్రాల అభివృద్ధికి ఎంతో కృషి సలిపినవారు. శ్రీ మధ్వాచార్యుల రచనలకు వ్యాఖ్యానాలను రచించారు. రాజనీతిజ్ఞుడైనందువల్ల కళింగ గాంగరాజులకు మంత్రిగా ఉన్నారు. ఆయన జీవిత విశేషాలను తెలుసుకోవడానికి శ్రీకూర్మం, సింహాచల క్షేత్రాలలోని ముప్పయిసంవత్సరాల కాలవ్యవధిలో - క్రీ.శ. 1264 నుంచి క్రీ.శ. 1294 వరకు ఉన్న శాసనాలు ఎంతో తోడ్పడుతున్నాయి.
>
> శ్రీకూర్మంలోని శాసనాలు నరహరితీర్థులు కళింగ చక్రవర్తులకు మంత్రుల వంశంలో జన్మించినట్లు సాక్ష్యమిస్తున్నాయి. క్రీ.శ. 1271 నాటి శాసనంలో ఆయనను 'ముదుసలి సచివుడ'న్న బిరుదనామంతో పేర్కొనడం జరిగింది. అదే శాసనం రెండవ భానుదేవుడి అభివృద్ధి నిమిత్తం నరహరితీర్థులు బ్రాహ్మణులకు ఒక గ్రామాన్ని దానం చేసినట్టు తెలియజేస్తోంది. మరొక శాసనం క్రీ. శ. 1281 నాటిది ఆయన ధర్మమార్గంలో రాజనీతిజ్ఞుడుగా తన తండ్రినే అనుసరించినట్లు చెప్పడం జరిగింది. పై ఆధారాలను బట్టి మొదటి భానుదేవుడి కాలం నుంచీ (క్రీ. శ. 1264-78) రెండవ నరసింహుడికాలం దాకా (క్రీ. శ. 1278-1305) వారణాసి కటకం రాజధానిగా పాలించిన గాంగ రాజులకు మంత్రిగా ఉన్నాడని చెప్పవచ్చు. బహుశా ఈ హోదాలోనే, క్రీ. శ. 1281 నాటి శాసనంలో పేర్కొన్న శబర దండయాత్రల నుంచి ఈయన దేశాన్ని కాపాడి ఉండాలి.''[26]

ఆచార్య సుందరంగారి నిర్ణయం ప్రకారం క్రీ. శ. 1264 నుంచి క్రీ. 1305 దాకా ఆయన కళింగ రాజ్యంలో ముఖ్యపాత్రనే నిర్వహించాడ సాంప్రదాయికంగా వచ్చిన గాథలు సూచిస్తున్నట్టు ఆయన శ్రీ మధ్వాచా లకు ప్రత్యక్ష శిష్యుడనేందుకు ఆధారముంది. శ్రీకూర్మం దేవాలయంల క్రీ. శ. 1293 నాటి శాసనంలో 'శ్రీమదానందతీర్థ పూజ్యపాదాచార్య శిష్య శ్రీ నరహరితీర్థ శ్రీపాదులు'గా ప్రస్తావితుడు కావడం వలన, శ్రీ మధ్వాచా లకే ఆనందతీర్థులన్న నామాంతరం[27] ఉండడం వలన, ఆయన మధ్వాచార్య ప్రత్యక్ష శిష్యుడనడానికి ఏ ఇబ్బందీ ఉండనవసరం లేదు. అదీగాక మధ చార్యుల జీవనకాలం సంప్రదాయానుసారం 1197-1280 కావడం వ నరహరితీర్థులు మధ్వాచార్యులకు సమకాలీనుడై ఉండడంలో విప్రతిపత్తి ఏ లేదు.[28]

శాసనాలలో శ్రీ నరహరితీర్థుల సంకీర్తనల రచన ప్రస్తావితం కాకపోయి కన్నడ సంప్రదాయానుసారం ఆయన సంకీర్తనలను రచించారనడం సందేహం ఉండనవసరం లేదు. అయితే సంకీర్తన రచనను తన తరువా కాలపు హరిదాస కూటమి వాగ్గేయకారుల లాగా ప్రధానంగా తీసుకొని ఉం పోవచ్చు. ఆయన సంకీర్తన రచన ఆయన సాగించిన మతప్రచార కార్యక్ర లలో ఒక భాగమై ఉండాలి. ఆయన సంకీర్తన ప్రక్రియను చేబట్టేనాటికి ఒడి సాహిత్యం ఇంకా రూపుదిద్దుకోలేదు. ఆంధ్రదేశంలో మాధ్వ మతానికి అంత ఆదరణ లభించి ఉండదు. కేవలం ఆయన అధికార స్థానాన్ని ఆక్రమిం ఉండడం వల్లా, ఆయన మేధాశక్తివల్లా శ్రీకూర్మ, సింహాచల క్షేత్రాల మాధ్వమతానుయాయులు ఏర్పడి నరహరిమఠాల స్థాపనకు అవకాశా లభించాయి.

ఇక్కడ గమనార్హమైన విషయం ఒకటి ఉంది. మాధ్వ సాంప్రదాయా సారం ఏర్పడిన హరిదాసకూటమికి శ్రీనరహరితీర్థులు ఆద్యులుగా కన్న సాహిత్యవేత్తలు చెప్పినమాట.[29] నరహరితీర్థుల రచన కన్నడభాషలో సాగిం

శ్రీకూర్మం శాసనంలో[30] సంస్కృతభాషలో ఉన్న శాసనంలో ఆయనను 'ముదుసలి సచివు'డిగా పేర్కొన్నారు. సంస్కృతంలో లిఖితమైన శాసనంలో 'ముదుసలి సచివ' అని ఉండడం కొంత చిత్రంగా కనిపించవచ్చుగానీ, నిజానికి అది ఆయన నిర్వహించిన పదవి నామం అయి ఉంటుందని ఊహించడానికి అవకాశాలు ఉన్నాయి. శాసనాలలో 'ముదుసెలి'గా ఉదాహరణలున్నాయి-

1. 'శ్్రీ విష్ణువర్థన మహారాజుల ప్రవర్థమాన విజయరాజ్య సంవ3ణ్డగు నేంటి కన్య సంక్రాంతి నిమిత్తమున స్థాన పతులు నారుద్రదేవర ముదిసెలి నుప్పునాకుణ్ణు...' [31]
2. 'వెలనాణ్టి రాజేంద్ర చోడయ ముదిసెలి నారాయణ పెగ్గడ'[32]
3. 'ఱొంవిచెఱ్ఱుల ప్రోలినాయకు కొడుక్కు మల్లినాయకు ముదిసెలి బేతన బోయుణ్ణు'[33]
4. 'శ్రీ మన్మహామణ్డలేశ్వర కులోత్తుంగచోడ గోంక్కరాజుల ముదిసెడ్లు దారపనాయకుండునుం జామెన పెగ్గడయు...'[34]

ఈ ఉదాహరణలలో రెండవ ఉదాహరణలోని శాసనంలో సంస్కృత భాగంలో 'శ్రీశరాజేంద్ర చోడ క్షితిప భుజ సహాయోమంత్రి నారాయణా' అని పేర్కొనడం వలన ఎల్లవేళలా రాజు పక్కన ఉంటూ సలహా చెప్పేవారికి ఈ పదం వాడినట్లు తెలుస్తున్నది. ఇదొక పదవి అయి ఉండవచ్చు.

శ్రీకూర్మం, సింహాచలక్షేత్రాలలోని శాసనాలను చూస్తే శ్రీ నరహరి తీర్థులు కేవలం మంత్రిగానే కాక మాధ్వశాఖకు చెందిన మతాచార్యుడిగా, మహా భక్తుడిగా కనిపిస్తాడు. ఒక శాసనంలో ఆయన్ని 'మునీశ్వరో నరహరిః' అని పేర్కొనడం జరిగింది.[35] ఆయనలోని కవిత్వాత్మకమైన భక్తికి దర్పణంగా ఒక శాసనం 'శ్రీకూర్మనాథుని శ్రీజయంతి మహోత్సవమున దేవకీదేవి సుఖ ప్రవవార్థమైకొని శ్రీవైష్ణవ భోజన నిమిత్తము గాను' శ్రీ భాండారానికాయన

కొంత ధనాన్ని సమర్పించడాన్ని ప్రకటిస్తోంది.[36] మరొక గమనార్హమైన విషయం- శ్రీకూర్మం, సింహాచలక్షేత్రాలలోని ఇతర శాసనాలలో లాగే - ఈయన శాసనాలకూ తిరుపతి శ్రీవైష్ణవ రక్షణ నుంచడం! నిజానికి మాధ్వులను శ్రీవైష్ణవు లనడం వ్యవహారంలో లేదు. శ్రీవైష్ణవు లంటే విశిష్టాద్వైతులే. అయితే ఆనాటికి ఆ క్షేత్రాలలో శ్రీవైష్ణవుల ప్రాబల్యం ఉండేదని అనుకోవలసి వస్తున్నది. అంతేకాక వారి మధ్య సామరస్యం నెలకొని ఉండేదని ఊహించడంలో తప్పులేదు. హరిదాస పరంపరలో పురందరదాసులకు సమకాలీనుడై ప్రసిద్ధి చెందిన కనకదాసులు 1509–1603 మాధ్వమత శాఖకు చెందినవాడైనా శ్రీరామానుజాచార్యులనూ, ఆయన సిద్ధాంతాలనూ మెచ్చుకొంటూ 'రామానుజ మతోద్ధారక – తామసగుణపాశ వజ్రదండ' అన్న ప్రసిద్ధ కీర్తనను రచించినవాడు.[37] నిజానికీ రెండు మతశాఖల మధ్యా ఘర్షణలు జరిగినట్లు చరిత్రలో దాఖలాలు లేవు.

శ్రీ మధ్వాచార్యుల తరువాత శ్రీ పద్మనాభతీర్థులూ, ఆయన తరువాత శ్రీ నరహరితీర్థులూ ఉడిపిలో మఠాధిపతులైనట్లు సాంప్రదాయం. శ్రీ హెచ్. కృష్ణశాస్త్రిగారి నిర్ణయం ప్రకారం శ్రీ నరహరితీర్థులు క్రీ. శ. 1324లో మఠాధిపత్యం వహించారు.[38] ఆ తరువాత ఏడేళ్లకు ఆయన పరమపదించారు. అంటే క్రీ. శ. 1331లో నిర్యాణం పొందారన్నమాట.

అయితే ఆయన కీర్తన రచనను ఎప్పుడు ప్రారంభించారో తెలియజేసే సాధనాలేవీ చరిత్రలో కానరావు. ఆచార్య కె. సుందరం గారు మాధ్వ విజయ కావ్యం ఆధారంగానూ, శాసనాల ఆధారంగానూ శ్రీ నరహరితీర్థులు అసలు కళింగదేశానికి చెందినవారేనని అభిప్రాయపడ్డారు.[39] పూర్వోదాహృత కీర్తనలో యతీ, ప్రాసయతీ కనిపిస్తూండడం వల్ల ఆయన మాతృభాష తెలుగే అయి ఉండవచ్చు. ప్రాచీన కళింగం ఒడియా, తెలుగు భాషా ప్రాంతాలు కలిసి ఏర్పడిన దేశ విభాగమే. ఒడియా సాహిత్యచరిత్ర పదిహేనో శతాబ్దంలో సారళా దాసుతో ప్రారంభం అయింది. అతడు వాడిన ఛందస్సును దాండీవృత్త

మంటారు. దాండీవృత్తానికి రెండేసి పాదాలుండి, గణనియమం కానీ, మాత్రానియమం కానీ, ఆఖరికి అక్షరనియమం కానీ ఉండవని కీ.శే.పురిపండా అప్పలస్వామి గారు చెప్పారు.[40] ప్రతి రెండు పాదాలకీ అంత్యప్రాస మాత్రం ఉంటుంది. ఇది పదిహేనో శతాబ్దంలో మొట్టమొదటగా ఒడియా భాషలో ఆవిర్భవించిన కవితకు సారళాదాసు అవలంబించిన ఛందస్సు. ఈ విషయాలను ఆధారం చేసుకొని, నరహరితీర్థులు తన కీర్తనకు ఒడియా సాహిత్య రూపాల నుంచి ప్రేరణను పొంది ఉండటానికి అవకాశం లేదని చెప్పాలి.

మాధ్వ మతానుయాయి కావడం వలన కన్నడభాషతో ఏర్పడిన పరిచయం వల్ల, కన్నడ వీరశైవకవుల రచన నరహరితీర్థులకు ప్రేరణ ఇచ్చి ఉండాలి. ఆయన తెలుగువాడైనందువలన యతిప్రాసలకు ఆయన రచనలలో స్థానం లభించి ఉండాలి.

ఏది ఏమైనా శ్రీకూర్మం, సింహాచల క్షేత్రాలలో హరిదాసకూటమికి సంస్థాపకుడై కీర్తనలను కూడా రచించిన శ్రీ నరహరితీర్థుల ప్రభావం తెలుగు భాషలో అటువంటి సంకీర్తనలు వెలవడటానికి ఎందువలన తగిన వాతావరణాన్ని కలిగించలేకపోయింది అన్న ప్రశ్న ప్రశ్నగానే మిగలక తప్పదు.

పల్లవీ, చరణాలూ స్పష్టరూపం పొందిన గేయం నరహరితీర్థుల చేతుల్లో గారడీవాడి మామిడి మొక్కలాగా హఠాత్తుగా ఆవిర్భవించి ఉండవచ్చు ననడం సమంజసం కాదు గాని ఆయన తరువాత శతాబ్దంపైగా హరిదాస పరంపరలో శ్రీపాదరాయలు అవతరించినదాకా గేయ రచనాకలాపం కానరానందున గేయ పరిణామచరిత్ర అస్పష్టంగా ఉండిపోతున్నది.

తెలుగుదేశంలో అన్నమయ ఆవిర్భవించి సంకీర్తన లక్షణాలను నిర్వచించి, సంకీర్తనలను రచించి తెలుగు గేయానికి సుస్థిరమైన రూపాన్ని చ్చాడు. అప్రయత్నంలో కృష్ణమాచార్యులను పేర్కొన్నాడు. జయదేవుడు ఆయనకు సుపరిచితుడే. నరహరితీర్థుల పేరు ఆయనకు అపరిచితంగానే ఉండిపోయి ఉంటుంది. తెలుగులో కృష్ణమాచార్యులు పరమభాగవతుడిగా

మాత్రమే కాక సంకీర్తన రచన కాద్యుడిగా తాళ్లపాక వారి మన్ననలను పొంది ఉన్నాడు. అన్నమయ గేయరచనా మహాయజ్ఞానికి జయదేవుడూ, కృష్ణమాచార్యులూ ఉత్తేజాన్నిచ్చారు. నరహరితీర్థులు మాత్రం తెలుగు, కన్నడ సంకీర్తనా రంగాలలో ఒంటరిగానే మిగిలిపోయాడు. అయితే నలుగురూ నడిచిన దారిని వదిలి అన్నమయ మాత్రం తనదైన దారిని ఏర్పరచుకొన్నాడు.

అధోజ్ఞాపికలు

1. శ్రీ అన్నమాచార్యుల జీవితచరిత్రము, ద్విపద, పు. 10
2. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం. 2, పునర్ముద్రణ, సంకీర్తన 121
3. శ్రీ అన్నమాచార్యుల జీవితచరిత్రము, పు॥లు 41, 42
4. కీర్తనకారరు – హెచ్. ఎస్. వెంకటేశమూర్తి, పు. 59, కన్నడ గ్రంథం
5. శ్రీ అన్నమాచార్యుల జీవితచరిత్రము – శ్రీ వేటూరి వారి పీఠిక, పు. 117 హిస్టరీ ఆఫ్ తిరుపతి, వాల్యూమ్ 2, శ్రీ టి.కె.టి. వీరరాఘవాచార్యులు, పు. 530
6. సంకీర్తన లక్షణం, ప. 18
7. నాట్యశాస్త్రము – డాక్టర్ పోణంగి శ్రీరామఅప్పారావు, అనుబంధము 2, పు. 887
8. ఆంధ్రవాగ్గేయకార చరిత్రము – శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు, పు.
9. ఆంధ్రవాగ్గేయకార చరిత్రము, పు. 138
10. నాట్యశాస్త్రము, పాఠభేదములు, పు. 7
11. ఆంధ్రవాగ్గేయకార చరిత్రము, పు. 72
12. హరిదాస సాహిత్యసమీక్షె – సంపాదక డా॥ జి. వరదరాజరావ్/కన్నడ గ్రంథం/ప్రా. రా. సత్యనారాయణగారి వ్యాసం 'హరిదాసర రచనెగళల్లి సంగీతమౌల్య' పుటలు 36, 37 – ఆ వ్యాసంలోని కొంత భాగానికి ప్రకృత రచయిత చేసిన అనువాద మిది.
13. అదే, పు. 38
14. తన సంగీతసంప్రదాయ ప్రదర్శనిలో శ్రీ సుబ్బరామదృక్షితుల వారు శార్ఙ్గదేవుడి సంగీత రత్నాకరం గురించి 'ఈ రత్నాకరమున జెప్పఁబడిన కొన్ని భాగములు ఈ కాలమున గల లక్ష్యలక్షణములకు సమన్వయము గాక నున్నవి యని రామయామాత్యులునూ, వెంకటమఖియును జెప్పియున్నారు. వాడుకయందును అటులనే యున్నవి అని సంప్రదాయజ్ఞులు నుడువుచున్నారు', సంపుటం. 1, పు. 1
15. సంకీర్తన లక్షణం, పద్యాలు 15, 16, 17
16. తాళ్లపాక కవుల కృతులు – వివిధ సాహితీ ప్రక్రియలు – డాక్టర్ వేటూరి ఆనందమూర్తి, పు. 434 నుంచి 458 దాకా ఉన్న 'తెలుగు సంకీర్తన లక్షణము లక్ష్యలక్షణ సమన్వయము'.

17. అదే, ఆశీస్సులు, పు. 8
18. హరిదాస సాహిత్య సమీక్షె - డాక్టర్ జి. వరదరాజారావు గారి వ్యాసం 'హరిదాస సాహిత్య సంపాదనెయ సమస్యెగళు' పు।।లు 4, 5
19. కీర్తనకారరు, పు. 5
20. శివదాస గీతాంజలి, సంపాదక ఎల్. బసవరాజా, 1963
21. అదే, పు. 131
22. కీర్తన కారరు, పు।।లు 5, 6. ప్రకృత రచయిత నరహరితీర్థుల మిగిలిన రెండు కీర్తనల కోసం మైసూరు విశ్వవిద్యాలయం వారి కన్నడ అధ్యయన సంస్థకు ఉత్తరం రాసినా ప్రయోజనం లేకపోయింది. వారు తమ ప్రచురణ 'శ్రీపాద రాజరకృతిగళు' అన్న గ్రంథ పీఠికను చూడమని తెలియజేశారు. ఆ పీఠికలో పరిశోధకుల వివిధాభిప్రాయాలనూ ఇచ్చి చివరగా సరైన పాఠాలను ఎంచుకోవడం జటిలసమస్య అయిందని తెలియజేశారు. కీర్తనలు దొరకలేదు.
23. కన్నడ ఛందోవికాస - డాక్టర్ డి. ఎస్. కర్కి - కన్నడ గ్రంథం - పు।।లు 58, 59 శ్రీ కర్కి గారి కన్నడ రచనకు తెలుగు అనువాదం ప్రకృత రచయితది.
24. తెలుగు ఛందోవికాసము - శ్రీ కోవెల సంపత్కుమారాచార్య
25. కీర్తనకారరు, పు।।లు 5, 6
26. ది సింహాచలమ్ టెంపుల్ - ఆచార్య కె. సుందరం, పు. 149
27. హిందూ వరల్డ్ - బెంజిమిన్ వాకర్, వాల్యూమ్ 2, పు. 1
28. అదే.
29. కీర్తనకారరు, పు. 5
30. సౌత్ ఇండియన్ ఇన్స్క్రిప్షన్స్, వాల్యూం 4, శాసన సంఖ్య 1233
31. అదే, శాసనసంఖ్య 1013
32. అదే, శాసనసంఖ్య 1228
33. అదే, వాల్యూం 6, శాసనసంఖ్య 636
34. అదే, వాల్యూం 4, శాసన సంఖ్య 996
35. అదే, వాల్యూం 5, శాసన సంఖ్య 1233
36. అదే, వాల్యూం 5, శాసన సంఖ్య 1252
37. సంగీత పారిభాషిక శబ్దకోశ - సంపుట 1, డాక్టర్ సంపత్కుమారాచార్య, పు. 145, కన్నడ గ్రంథం.
38. ఎపిగ్రాఫియా ఇండికా, వాల్యూం 6, పు. 264
39. ది సింహాచలమ్ టెంపుల్ - ఆచార్య కె. సుందరం, పు. 151
40. ఒడియా సాహిత్యచరిత్ర - పురిపండా అప్పలస్వామి, పు. 17.

5. పూర్వరంగం - 2

సంకీర్తన సంప్రదాయం - కృష్ణమాచార్యులు

మనకు తెలిసినంతలో తెలుగులో కృష్ణమాచార్యులే ప్రప్రథమ సంకీర్తన కర్త. ఆయన చేబట్టిన రచనాప్రక్రియకు వచన సంకీర్తనలన్నపేరు రూఢి అయింది. రాగయుక్తంగా వాటిని పాడే సాంప్రదాయం కొన్ని దశాబ్దాల క్రితం వరకూ సింహాచలం పరిసర ప్రాంతాలలో ఉండేదని పెద్దలు చెప్పగా విన్నమాట. రాగయుక్తంగా పాడితే వాటి స్వరూపం ఎలాగ ఉండేదో, ఆ వచనాలు రాగానికి ఎలా ఒదిగేవో, ఏయేరాగాలు ఈ రచనల కొదిగేవో ఈనాడు మన ఊహకు అందని విషయాలు. శ్రీ వైష్ణవకుటుంబాలలో ఈయనను కాంత కృష్ణమాచార్యులని వ్యవహరించే సంప్రదాయం[1] ఉందిగాని గ్రంథస్థంగా మాత్రం ఆపేరు లేదు.

శ్రీ కృష్ణమాచార్యులను ఎక్కువగా స్మరించిన ప్రాచీన తెలుగు కవులు తాళ్లపాక వారు మాత్రమే కానవస్తున్నారు.

ధరగృష్ణాచార్యాదిక
పరికల్పిత పదము తాళబంధచ్ఛందో
విరహితమై చూర్ణాఖ్యం
బరగు ననిర్యుక్త నామభాసిత మగుచున్ - సం.ల పద్యం

అని అన్నమయ అన్నట్లు చినతిరుమాలాచార్యుని సంకీర్తన లక్షణం అనువాదం ద్వారా తెలుస్తోంది. ఇంక చిన్నన్న తన పరమయోగివిలాసంలో-

వేదంబుఁ దెనుఁగు గావించి సంసార
ఖేదంబు మాన్పిన కృష్ణమాచార్యు
ఘనతర పంచమాగమ సార్వభౌము
ననఘు శ్రీ తాళ్లపాకన్నమాచార్యుఁ[2]

లకు అంజలించి కృతి ప్రారంభం చెయ్యడంలో కృష్ణమాచార్యులనూ అన్నమాచార్యులనూ చారిత్రక కాలక్రమానుసారంగానే పేర్కొన్నాడు. మళ్లీ తన తాతగారి చరిత్ర 'శ్రీ అన్నమాచార్య చరిత్ర'లో –

ఆ కృష్ణమాచార్యు నధ్యాత్మ వినుతి –
రాక (గొన్నాళ్లు విరక్తుండనైతి
... ...
అని వేంకటేశ్వరుఁ డన్నమాచార్యుఁ
గనుఁగొని వాక్రుచ్చి గారవించుటయు[3]

అంటూ మళ్లీ పేర్కొన్నాడు. అంటే తాళ్లపాక కవులకు కృష్ణమాచార్యు లంటే ఉన్న అభిమానమూ, ఆయన రచనలతో ఉన్న గట్టి పరిచయమూ వ్యక్త మౌతున్నాయి. అంతేకాక సంకీర్తన రచయితల పరంపరలో కృష్ణమా చార్యులకున్న స్థానాన్ని గురించి నొక్కి చెప్పినట్లయింది.

'క్రీ. శ. 1700 శతాబ్ది యుత్తరార్థమున మహమ్మదీయుల మూలమునఁ దిరుపతి ప్రాంతముల విప్లవము జరుగుచుండఁగా రచిత మయినది' అని కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు నిర్ణయించిన[4] వేంకటాచలవిహార శతకము లోని పద్యంలో –

'కృష్ణమాచార్యు సంకీర్తనంబులఁ జొక్కి
సింహాద్రి యప్పయ చేతఁగాదు'[5]

అనడం వలన ఆనాటిదాకా కూడా కృష్ణమాచార్యుల సంకీర్తనలకు తిరుపతి ప్రాంతంలో కూడా ఉన్న ప్రాచుర్యాన్ని గుర్తించడానికి వీలౌతోంది.

శ్రీకృష్ణమాచార్యులు రచించిన 'సింహగిరి వచనముల'ను డాక్టర్ ఎమ్. కులశేఖరరావు గారు మొదటిసారిగా 1968లో ప్రచురించారు.[6] వారి ఉపోద్ఘాతంలో కృష్ణమాచార్యులు జీవించిన కాలాన్ని గురించి చర్చిస్తూ –

"ప్రతాపరుద్రుని దర్శించి, యాతనిచే మన్ననలను పొందిన కృష్ణమాచార్యులు క్రీ. శ. 13వ శతాబ్ది పూర్వభాగము ముగియు వరకు జీవించియుండును. ఈతడు ప్రతాపరుద్రుని దర్శించిన వృత్తాంతము సిద్ధేశ్వర చరిత్ర యుందును గలదు. ఈ వృత్తాంతము ప్రతాప చరిత్రలో సంవదించుచున్నది కూడ. కృష్ణమాచార్యులు క్రీ. శ. 1290 సంవత్సరమున జన్మించి యుండెనని 'కృష్ణమాచార్యులు - ఆంధ్రప్రదేశము' అను వ్యాసమున శ్రీ నిడదవోలు వేంకటరావు గారు వ్రాసి యున్నారు. ఈ కాలము ప్రతాపరుద్రునికి సమానమేయైనను, నాటికి కృష్ణమాచార్యులు పిన్నవయస్కుడగును. అతడు అగ్రహారాదిక ములను, అధికారమును వహించుట సమంజసముగా కాన్పించదు. అందుచేత 1265-70 ప్రాంత సంవత్సరములం దీతడు జన్మించి యుండె ననుట సముచితముగా నుండును.'[7]

అని తీర్మానించారు. డా॥ కులశేఖరరావుగారి నిర్ణయం కేవలం సిద్ధేశ్వర చరిత్ర - ప్రతాపచరిత్రలోని ప్రస్తావన మీద ఆధారపడి సాగింది. వారు సంపాదించి ప్రచురించిన తంజావూరి ప్రతిలో వికృతినామ సంవత్సరం కృష్ణమాచార్యుల జనన వత్సరంగా ప్రస్తావితమై ఉంది.[8] కాని తిథి వారం లేని కేవల సంవత్సర నామంతో కాలనిర్ణయం చెయ్యడం ప్రామాదికం కాగలదు. శ్రీ వేటూరి ఆనందమూర్తి గారు తమ సేకరణలోని తాళపత్ర గ్రంథంలో ఉన్న వివరాలను బట్టి కృష్ణమాచార్యుల జనన వత్సరం క్రీ. శ. 1268 కావచ్చునేమోనని అన్నారు.[9]

అసలు శ్రీ కృష్ణమాచార్యులకూ కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడికీ మధ్య ఉన్న పరిచయాన్ని గురించి 'సిద్ధేశ్వరచరిత్ర' మాత్రమే పేర్కొంటున్నది. అందువల్ల 'సిద్ధేశ్వరచరిత్ర' కాలాన్ని నిర్ణయించవలసి ఉంటుంది. కాసె సర్వప్ప ప్రణీతమైన 'శ్రీ సిద్ధేశ్వర చరిత్రము' సంపాదించిన ఆచార్య ఖండవల్లి లక్ష్మీ

రంజనం గారు ఆంగ్లంలో రాసిన సుదీర్ఘమైన ఉపోద్ఘాతంలో ఈ గ్రంథం క్రీ.శ. 1600 ప్రాంతంలో రచితమై ఉంటుందనే అభిప్రాయాన్ని ప్రకటించారు.[10] మరొక నూరు సంవత్సరాల తరువాత రచితమై ఉండవచ్చని భావించడానికి ఆటంకమైన వివరాలేవీ ఈ గ్రంథంలో లేవు. శ్రీ లక్ష్మీరంజనం గారు ఇందుకు అభ్యంతరంగా కృష్ణదేవరాయల పేరు పేర్కొనకపోవడాన్ని చూపుతున్నారు[11] గాని అది బలమైన అభ్యంతరం కాజాలదు.

సిద్ధేశ్వరచరిత్రలో 'విజయనగరంబు నుండి నరసింహరాయలు అమూల్యాభరణ చీని చీనాంబరములు'[12] కానుకగా తీసుకొని రావడం చరిత్రతో సంవదించే విషయం కాదు. ద్విపదభాగంలో కూడా 'గజబృందముల పేరు గల దొరలతోడ విజయంబునకు దండువెడలి నృసింహవిజయరాయల గెల్చి....' 'విజయనగరముపై వెస దండువెడలె...'[13] మొదలైన ప్రస్తావనలను చూస్తే సాళువ నరసింహరాయలో, తుళువ నరసింహరాయలో ప్రస్తావితులు కావడమే కాకుండా గజపతులు కూడా ప్రస్తావితులైనట్లు స్పష్టమే. అదీగాక విజయనగరరాజా తన సోదరి శ్రీరంగదేవిని భువనైకమల్లుడికిచ్చి వివాహం చెయ్యడం వంటి గాథలు[14] కాంచీరాజా కూతురును పురుషోత్తమ గజపతి వివాహ మాడటం వంటి గాథలను[15] పోలి ఉండి 'సిద్ధేశ్వర చరిత్ర'లోని విషయాలను అనుమానాస్పదం చేస్తున్నై. అందువలన 'సిద్ధేశ్వర చరిత్ర' ఆధారంగా కృష్ణమాచార్యుల కాలనిర్ణయం చెయ్యడం పొరబాటు కాగలదు. అంతేకాకుండా, కృష్ణమాచార్యుల కథ నివ్వడంలో అటు అన్నమాచార్యుల తామ్రపత్రాల విషయమూ ఇటు కంచెర్ల గోపన్న సర్కారు ధనాన్ని కైంకర్యం చేసిన విషయాన్నీ కలగాపులగం చెయ్యడం చూస్తే 'సిద్ధేశ్వర చరిత్ర' పరంపరగా వచ్చిన పుక్కిటి పురాణాలను గ్రంథస్థం చేసిన రచనగా తోచక తప్పదు. ఇటువంటి రచనల నుంచి చిన్నచిన్న వివరాలను స్వీకరించవచ్చునేమోగాని కాల నిర్ణయానికి ఆధారాలను సేకరించడం సమంజసం కాజాలదు.

అందువలన కృష్ణమాచార్యుల రచనలను పరిశీలించి కాలనిర్ణయానికి

ఉపకరించే విశేషాలను గమనించి, పరోక్షంగా లభించే ఇతర సాక్ష్యాలను గమనించీ కాలనిర్ణయం చెయ్యడం సహేతుకం కాగలదు.

శ్రీ కృష్ణమాచార్యుల రచనలను పరిశీలించేముందు ప్రఖ్యాత చరిత్ర కారులూ కీర్తిశేషులూ శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి అభిప్రాయాలను గమనించవలసి ఉంది.

> 'తెలుగుదేశములో పండ్రెండవ శతాబ్దినాటికే ప్రసిద్ధములైన విష్ణ్వాలయములు వెలసినవి. వీనిలో తెలుగుదేశము ఉత్తరపు కొసను శ్రీకాకుళము జిల్లాలోని శ్రీకూర్మము, విశాఖ పట్టణము జిల్లాలోని సింహాచలము, గోదావరిజిల్లాలోని సర్పవరము, గుంటూరు జిల్లాలోని బాపట్ల మొదలైనవి ప్రముఖములైనవి. ఈ క్షేత్రములలోని దేవాలయములు పండ్రెండు పదమూడు శతాబ్దములలో మహావైభవమును అనుభవించినవి'.[16]

శ్రీ సోమశేఖరశర్మగా రిచ్చిన ఈ వైష్ణవక్షేత్రాల పట్టికలోని సింహాచల మొకటి మాత్రమే తరువాతికాలంలో కూడా ప్రసిద్ధ వైష్ణవక్షేత్రంగా కొనసాగింది. ఈ క్షేత్రంలో వెలసిన వరాహనరసింహస్వామి కృష్ణమాచార్యుల సంకీర్తనల కృతిపతి. నేడు మనకు అందుబాటులో ఉన్న 'సింహగిరి వచనములు' ప్రతి తంజావూరు గ్రంథాలయంలోని తాళపత్ర గ్రంథం ఆధారంగా డా॥ కులశేఖర రావు గారు ప్రకటించిన పరిష్కృత ప్రతి.[17] ప్రస్తుత చర్చకు ఆ ప్రతినే ఆధారంగా స్వీకరించడం జరుగుతోంది. శ్రీ కృష్ణమాచార్యుల వచనాలలో పేర్కొన్న క్షేత్ర నామాలను గమనించవలసి ఉంది.

1. '... దేవా, ఈ లోకంబున, శేషాచలంబున వేంకట నామధేయుండ వైతివి. ధనాపేక్షాపరుండవై విహరించితివి. జనభోగంబునకు పురుషోత్త ముండవై జగన్నాథుండవై మహాభోగంబు లారగించితివి... ఉభయ కావేరి మధ్యంబున విభీషణవరదుండవై, శ్రీరంగశాయివైతివి...'[18]

2. 'దేవా నేను భూప్రదక్షిణము సేసి... శ్రీ యహోబిలమును, శ్రీరంగంబును, వేంకటాచలంబును కాశీ క్షేత్రంబును, ద్వారకంబును, నయోధ్యయును శ్రీ పురుషోత్తమును జూచి...'[19]

3. 'దేవా, శ్రీపర్వతంబునకుఁ బోయి శైవులగుదురు తిరుపతులఁ జూచి వైష్ణవులగుదురు...'[20]

ఈ వచనాలలో శేషాచలంలోని వేంకటేశ్వరుడూ (తిరుపతి) పురుషోత్తమ జగన్నాథుడు (నేటి పూరీ) ఉభయకావేరీ మధ్యంలోని శ్రీరంగశాయి (శ్రీరంగం), శ్రీ అహోబిలమూ ఇవీ గుర్తించదగిన క్షేత్రాలు. ఇవికాక ఒక సుదీర్ఘమైన వచనం లో (వచనం 32) 'నూటయెనుబది తిరుపతులు' రెండుసార్లు ప్రస్తావితమై నాయి. నూటయెనిమిది తిరుపతులంటే నూట యెనిమిది వైష్ణవక్షేత్రాలన్న మాట. వీటిలో పురుషోత్తమం (తిరువణ్పురు షోత్తమమ్), శ్రీరంగం (తిరువ రంగమ్), కంచి (కాంచీపురం) తిరుపతి (తిరువేంగడమ్), అహోబిలం (సింగవేన్డుకణ్ణమ్) అన్న అయిదుక్షేత్రాలకు మాత్రమే ఎక్కువగా తెలుగు సారస్వతంలో ప్రస్తావనలకు చోటు దొరికింది. శ్రీ సోమశేఖరశర్మ గారు –

> 'సంగము వంశములోని కడపటి పాలకులలో మొదటి విరూపాక్ష మహారాయలే వైష్ణవ మవలంబించిన మొదటి కర్ణాటాధీశ్వరుడు. సంగమ వంశజాలను త్రోసిరాజని విజయనగర సింహాసన మెక్కిన సాళువ నరసింగరాయులు పరమ వైష్ణవుడు. ఇతనికి శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామి ఇష్టదైవము... సాళువ వంశజాల కాలము నుండి, అనగా క్రీస్తు శకము పదునైదు, పదునారు శతాబ్దములలో చిత్తూరు జిల్లాలోని తిరుపతి వైష్ణవమునకు ప్రధాన కేంద్రమయినది'[21]

అని తిరుపతిని గురించి చెప్పారు. సాళువ వంశజాల కాలంలో తిరుపతి

వైష్ణవానికి ప్రధాన కేంద్రం కావడం నిజమేగాని, మొదటి బుక్క రాయల క్రీ. శ. 1355–1377 శాసన మొకటి తిరుపతిలో లభిస్తున్నది.[22] అంటే నాటికే శ్రీవైష్ణవులు కానివారిని గూడా శ్రీ వేంకటేశ్వరుడు తిరుపతి వైపు ఆకర్షిస్తున్నాడన్నమాట. 'సింహగిరి నరహరి వచనాల'లో యెక్కడా తిరుపతిని ప్రధాన క్షేత్రంగా పేర్కొనక, ఇతర క్షేత్రాలతోపాటే ప్రస్తావించడం చూస్తే శ్రీ కృష్ణమాచార్యుల రచనలు శ్రీవైష్ణవమత కేంద్రంగా తిరుపతి రూపొందకమునుపే – అంటే పదమూడో శతాబ్దానికే – రచితమై ఉండాలన్న భావం కలగక తప్పదు. ఈ ఊహకు బలంగా శాసనస్థంగా కొన్ని పరోక్షా ధారాలు లభిస్తున్నాయి గనుక వాటిని పరిశీలించవలసి ఉంది.

'సింహగిరి వచనాలను' వచన సంకీర్తనలని వ్యవహరించడం పరిపాటి. మొట్టమొదటగా తన వచన సంకీర్తనలను శ్రీ కృష్ణమాచార్యులే సింహాచల నరసింహుని ముందు గానం చేసి ఉండవచ్చు ననడంలో విప్రతిపత్తి ఏమీ ఉండదు. నాటినుంచీ అదొక సంప్రదాయంగా నెలకొని ఉండవచ్చు ననడానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. ఈ సందర్భంగా శ్రీకూర్మం, సింహాచల క్షేత్రాల లోని శాసనాలలో ఉన్న నామసంకీర్తనం, నామ సంకీర్తనపు కొలుపు, సంకీర్తన నిబంధం మొదలైన ప్రస్తావనలను చూడాలి.

వీటిలో కాలక్రమాన మొట్టమొదటి శాసనం శ్రీకూర్మంలో లభిస్తున్నది. ఇది క్రీ. శ. 1341 నాటి శాసనం. ఈ శాసనంలో 'కొమ్మిదేవి తమకూంతురు సీతాదేవికి పుణ్యముగాను శ్రీకూర్మనాథుని సన్నిథిని... యందు నామసంకీర్త నము చేయను...' దేవభాండారానికి కొంత ధనం సమర్పించినట్లు తెలుస్తున్నది. ఆ తరువాతికాలపు శాసనం సింహాచల క్షేత్రంలో లభిస్తున్నది – ఇది క్రీ. శ. 1359 నాటిది – మాధ్వ మతానుయాయులైన 'శ్రీ నరసింహ భారతి శ్రీపాదాలు శ్రీ నరసింహనాథుని సన్నిధిని నిత్యమున్ను ఉభయ ధూపాల యందున్ను నామ సంకీర్తనము సేయను పెట్టిన కొలుపులు ... ఈ ప్రసాదము భుజించి ఉభయ ధూపాలను సంకీర్తనము చేయంగలారు'

అని చెబుతున్నది.[23] సానులు నిర్వర్తించవలసిన సంకీర్తన సేవను గురించి మరొక శాసనం కూడా క్రీ. శ. 1374 నాటిది ఇక్కడే లభిస్తున్నది. కొప్పుల వంశానికి చెందిన రాజా 'మంగిపూండి మునుడినాయుండు... శ్రీ నరసింహ్వా నాథునికి నిత్యమున్ను కొలువను కొలుపులు... తిరుమజన అవసర మందు అజపరెడి తెవాసవి కొడుకు అనంతదాసికి సంకీర్తన నిబంధం' ఏర్పాటు చేశాడు.[24] ఈ శాసనం క్రీ. శ. 1388 నాటిది. మరొక క్రీ. శ. 1390 నాటి శాసనంలో 'చండమహాదేవి తముండు శ్రీ గోవిందజియ్యన శ్రీ నరసింహ్వా నాథునికి... తిరుమజ్యనం చెల్లంగ మొదలుగను చందన అగిదాంకను, ఒడ్య సంప్రదాయాన ఒజ్య శ్రీరామవైష్ణవుని కొడుకు గరుడదాసు సంకీర్తనలునం జేయను కుంచప్రసాదము'ను పేర్కొంటున్నది.[25] ఇక్కడ గమనించవలసిన విషయం సంకీర్తనల్లో ఒడ్య సంప్రదాయం అంటూ ఒకటుందన్నమాట. అంటే తెలుగు సంప్రదాయం కూడా ఒకటి ఉన్నట్టు పరోక్షంగా సూచితమౌతున్నది. ఒడియా సంప్రదాయమెలా ఉండేదో తెలుసుకోవడానికి ఆధారాలు లభించ డంలేదు గాని తెలుగు సంప్రదాయ మేమిటో ఊహించడానికి వీలుంది.

అంతకన్నా ముందుగా ఈ సంకీర్తనల స్వరూప స్వభావాలేమిటో అందుబాటులో ఉన్న ఆధారాలతో నిర్ధరించుకోవలసి ఉంది. పూర్వోక్తమైన క్రీ. శ. 1341 నాటి కొమ్మిదేవి శాసనంలోని సంస్కృతభాగంలో 'దివ్యనామాని గానార్థం' అని పేర్కొనడం జరిగింది.[26] అంటే నామసంకీర్తనమన్నా, దివ్యనామ గానమన్నా ఒకటే నన్నమాట. అంటే స్వామి వారి దివ్యనామాలను ఒక పద్ధతి ప్రకారం రాగయుక్తంగా గానం చెయ్యడమన్నమాట. పదమూడు పధ్నాలుగు శతాబ్దాలలో ఈ సంప్రదాయం ఉత్తరాంధ్రంలోనే ప్రారంభమైన దనడంలో శాసనాలే గట్టి సాక్ష్యం పలుకుతున్నాయి. ఆ కాలానికి చెందిన సంకీర్తనల ప్రస్తావనలున్న శాసనాలేవీ ఇతర ప్రాంతాలలో కానరావటం లేదు. అదీగాక ఈ సంప్రదాయం వైష్ణవ క్షేత్రాలలోనే ప్రారంభం కావడం గూడా గమనార్హం. శ్రీకూర్మంలో ఒక్క శాసనంలోనే సంకీర్తన ప్రస్తావన కానవస్తుండగా, సింహా

చలంలో సంకీర్తన ప్రస్తావనలున్న శాసనాలు అధికసంఖ్యలో ఉండడమేకాక, వీణకొలుపు, వీణావాద్యసేవ మొదలైన సంగీతసేవలు[27] కూడా ప్రసక్తం కావడం వలన భక్తిసంగీత సంప్రదాయం సింహాచలం నుంచే ప్రారంభం అయిందని అనుకోకతప్పదు. ఈ మహోద్యమానికి శ్రీకృష్ణమాచార్యుల కృషి మూలమై ఉండి ఉంటుంది.

నేటి కన్నడ వ్యవహారంలో శ్రీ పురందరదాసాది హరిదాస వాగ్గేయకారుల రచనలకు దేవర నామాలన్న పేరు సామాన్యంగా వాడుకలో ఉంది. ఈ పేరు నామసంకీర్తనకే మరొక పేరైన దివ్యనామగానం నుంచే వచ్చి ఉండాలి. సింహాచల, శ్రీకూర్మక్షేత్రాలతో నరహరితీర్థులకున్న సంబంధాన్ని గుర్తుంచు కొని చూస్తే కర్ణాటకంలో వ్యాపించిన సంప్రదాయం ఇక్కడినుంచే ప్రారంభం అయి ఉండవచ్చని తోచకతప్పదు. శైవంలోగానీ, వీరశైవంలోగానీ ఇటువంటి వ్యవహారం లేకపోవడమూ, ఈ సంప్రదాయం కేవలం శ్రీవైష్ణవ మాధ్వమతాను యాయులకే పరిమితమై ఉండడమూ ఈ ఊహకు బలాన్నిస్తోంది. ఈ నామ సంకీర్తనలు, లేదా దివ్యనామసంకీర్తనలూ ఏ విధంగా ఉండేవన్న ప్రశ్న ఎదురు కావడం సహజం. ఇందుకు సంస్కృతంలోనే చాలా ఉదాహరణలు లభిస్తాయి. ఈ రకమైన రచనలను సంస్కృతంలో స్తోత్రాలుగా వ్యవహరిం చడం ఉంది. శ్రీ శంకరాచార్య కృతంగా ప్రసిద్ధిలో ఉన్న అచ్యుతాష్టకాన్ని చూడవచ్చు -

'అచ్యుతం కేశవం రామనారాయణమ్ కృష్ణ దామోదరం హరిం ।
శ్రీధరం మాధవం గోపికావల్లభం జానకీనాయకం రామచంద్రంభజే॥
అచ్యుతం కేశవం సత్యభామాధవం శ్రీధరం రాధికా రాధితమ్ ।
ఇందిరామందిరం చేతనాసుందరం దేవకీనందనం నందజం సంధదే॥[28]

ఛందోబద్ధమై రాగతాళయుక్తంగా పాడుకొనే వీలున్న రచన మిది. ఇటువంటి రచనలు సంస్కృతభాషలో అసంఖ్యాకంగా ఉన్నాయి. మధురాష్టకం, రావణకృత శివతాండవస్తోత్రం మొదలైనవి ప్రసిద్ధమైనవే. ఇవన్నీ

గానానుకూలమ్మైన రచనలే. ఇలాంటి రచనలను గానం చెయ్యడాన్నే నామ సంకీర్తనమని పూర్వోక్తశాసనాలలో పేర్కొన్నారని చెప్పడానికి ఆధారాలు లేవు గాని అదే పద్ధతిలో తెలుగు రచనలను గానం చేసి ఉండవచ్చునని భావించడం అసమంజసం కాబోదు. దాదాపు తొలి వాగ్గేయకారులందరూ ఈ జాతి రచనలను చేశారు. కావ్యకర్తలూ తమ కావ్యాలలో ఇటువంటి రచనలను చెయ్యడం లేకపోలేదు. తెలుగు కన్నడభాషలలో రచనలు చేసిన పాల్కురికి సోమనాథుడి రచన –

> 'అధిగత ప్రమథగణాపరాతవతార శరణు బసవ
> విధినిషేధ పుణ్యపాప విసరదూర శరణు బసవ
> వినుత కలియుగప్రసన్న వీరభద్ర శరణు బసవ
> అనవరతకటాక్ష చిరదయాసముద్ర శరణు బసవ'[29]

గానయోగ్యమైనదే. పోతనామాత్యుడి భాగవతంలో గానయోగ్యమైన, నామసంకీర్తనమున్న పద్యాలెన్నో ఉన్నాయి. ఇవి కేవలం నామసంకీర్తనలే. ఉదాహరణకు –

> 'శ్రీకృష్ణా ! యదుభూషణా ! నరసఖా ! శృంగారరత్నాకరా !
> లోకద్రోహినరేంద్రవంశదహనా ! లోకేశ్వరా ! దేవతా
> నీకబ్రాహ్మణ గోగణార్తిహరణా ! నిర్వాణసంధాయకా !
> నీకున్ మ్రొక్కెదఁ ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ!'[30]

శార్దూలవృత్తంలో రచితమ్మైనా, చక్కని గానయోగ్యమైన రచన మిది. భగవంతుడి వివిధ నామాలను కూర్చి గానయోగ్యంగా రచించడం సంకీర్తనల రచనకు శ్రీకారం చుట్టి ఉంటుంది. శ్రీ కృష్ణమాచార్యుల రచనలలో ఇటు వంటివి కానవస్తున్నాయి. ఇవి నామసంకీర్తనలన్న సార్థకమ్మైన పేరును పొంది ఉన్నాయి. బహుశా ఈ రచనలే సింహాచలాది క్షేత్రాలలో నామ సంకీర్తనలకు వినియోగితమ్మై ఉంటాయి. ప్రస్తుతం ముద్రితమ్మై లభిస్తూన్న ప్రతిలో[31] ఇటువంటివి ఎనిమిది రచనలు లభిస్తున్నాయి.[32]

'దేవా ! శ్రీమన్నారాయణా, పరబ్రహ్మస్వరూపా,
అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా, వేదవేదాంతవేద్యా,
పురాణపురుషోత్తమా, పురందరవంద్యా, కపటనాటక
సూత్రధారీ, మాయావినోదా, అగణితమహిమావతారా...'[33]

ఈ విధంగా సాగే రచనలన్నీ నామసంకీర్తనలే. ఇవి ఛందోబద్ధం కానీ, తాళబద్ధం కానీకావు. అందువల్లనే ఇవి 'తాళబంధచ్ఛందోవిరహితమ్మై' 'చూర్ణాఖ్యం బరుగు' నని సంకీర్తన లక్షణంలో చెప్పడం జరిగింది. తాళం లేకపోయినా రాగవరసలో వీణ, కిన్నర వంటి తంత్రీవాద్యాల సహకారగానంతో వీటిని పాడుకోవడం జరిగి ఉంటుంది. శ్రీకృష్ణమాచార్యుల అనంతరం ఈ పద్ధతి నామసంకీర్తనం సంప్రదాయమ్మై సంకీర్తన సేవకు దారితీసి ఉంటాయి.

పూర్వోక్తమ్మైన శాసనాలలో సింహాచల క్షేత్రంలో నామసంకీర్తనాన్ని గురించి పేర్కొన్న మొదటి శాసనం క్రీ. శ. 1359 నాటిది. అంతకుముందు, అంటే 91 సంవత్సరాలకు పూర్వం క్రీ. శ. 1268లో మొదటి నరసింహదేవుడి పాలనలో సింహాచల దేవాలయం పూర్తిగా పునర్నిర్మితమ్మైనట్లు ఆచార్య కె. సుందరం గారు తెలియజేస్తున్నారు.[34] అందువల్ల క్రీ. శ. 1300 నాటి నుంచీ ఉన్న శాసనాలు ధ్వంసమ్మై ఉండటానికి అవకాశం తక్కువ. శ్రీకూర్మం క్షేత్రంలో సంకీర్తన సేవను పేర్కొన్న తొలి శాసనమూ, ఏకైక శాసనమూ సింహాచలంలోని శాసనంకన్నా కేవలం 18 సంవత్సరాల పూర్వపుదన్నమాట. అంటే ఈ రెండూ శాసనాలకూ మధ్య అంతగా గణనీయమ్మైన వ్యవధి లేదని భావించవచ్చు. తంజావూరు ప్రతిలో వికృతి నామ సంవత్సరం క్రీ. శ. 1290 శ్రీ కృష్ణమాచార్యుల జనన వత్సరంగా కనిపిస్తూండగా[35] శ్రీ వేటూరి ఆనందమూర్తిగారి దగ్గర ఉన్న ప్రతిలో కృష్ణమాచార్యులకు స్వామి ప్రత్యక్షమ్మైన కాలం తారణనామ సంవత్సరం భాద్రపదమాసమని, అంటే క్రీ. శ. 1284 అని (ఆగస్టు, సెప్టెంబరు) ఉందని తెలుస్తున్నది.[36] ఇతరాధారాలు లభించేదాకా ఈ రెండు తేదీలనూ గట్టిగా నమ్మడం కష్టమే. కాని రెండు తేదీలూ 13వ శతాబ్దానికి

చెందినవనే సంగతిని మాత్రం గుర్తించవలసి ఉంటుంది. అంటే పై శాసనాల కాలంతో స్థూలంగా సంవదిస్తున్నా యన్నమాట. అయితే 'నామసంకీర్తన'ను పేర్కొన్న తొలి శాసనం క్రీ. శ. 1341 నాటిది గనుక, అప్పటికే గౌరవాదరాలు లభించి సంకీర్తన సేవకు ప్రాచుర్యం లభించి ఉండాలి. అంటే కృష్ణమాచార్యుల రచనలు క్రీ. శ. 1340 ప్రాంతాలకు బాగా ప్రసిద్ధమై ఉండాలి. కృష్ణమాచార్యుల జీవితకాలానికి క్రీ. శ. 1320 చరమసీమావధి అయి ఉంటుందని భావించడం అసంగతం కాబోదు. చరమదశలో ఆయన శ్రీరంగం తరలివెళ్లాడని ఉన్న ప్రతాప చరిత్ర కథనాన్ని నమ్మితే, క్రీ. శ. 1300 తరువాత ఆయనను గురించిన ప్రసక్తి సింహాచలంలో కానరాకపోవడానికి కారణంగా భావించవచ్చునేమో I తిరుపతిలో ఆయన ప్రసిద్ధి శ్రీరంగం నుంచి వ్యాపించి ఉండవచ్చునని భావించ వలసి ఉంటుంది.

శ్రీ అన్నమయకు ప్రతిభావంతులైన కొడుకులూ, మనుమళ్లూ ఉన్నట్టు, కృష్ణమాచార్యులకు లేరు. అన్నమయ వేయించిన శాసనం ఒక్కటి కూడా నేటికీ లభించకపోయినా, ఆయన సంతతి వేయించిన శాసనాలు ఆయనను గురించి చాలా సమాచారాన్ని రాబట్టడానికి ఉపకరిస్తున్నాయి. చరిత్రలో అటువంటి అదృష్టం కలిగినవాళ్ల సంఖ్య చాలా స్వల్పమే. అలాగే శ్రీ నరహరి తీర్థులకున్నట్టు కృష్ణమాచార్యులకు హరిదాసకూటమి వంటి సంస్థ కూడా లేనందువల్ల ఆయన పేరు ఏ శాసనంలోనూ ప్రస్తక్తం కాలేదనుకోవాలి. ఆయన సమకాలీనులైన పాతకమూరి భాగవతుల పేరు కూడా గ్రంథస్థంగా తప్ప శాసనస్థంగా కానరావడంలే దన్నది గమనార్హం.

కృష్ణమాచార్యుల రచనలలో కనిపించే గమనార్హమైన విషయం ద్రావిడ వైష్ణవ పదజాలం అతివేలంగా కనిపించడం. ఎంబెరుమానారు, తళియ, తిరుమాళిగ, తికువళి, అడియడు, తిరువడిగళ్లు మొదలయిన పదాలను చూస్తే ఆంధ్రదేశంలో వైష్ణవం ప్రచారం పొందుతున్న తొలినాటి రచనలుగా ఈ నరహరి వచనాలు గోచరిస్తాయి. అన్నమయ్య రచనలలో ఇన్ని తమిళ

వైష్ణవపదాలు కనిపించవు. 'కృష్ణమాచార్యులను' కేవలం తమిళాన్నే మతభాషగా అంగీకరించే తెంగలై శాఖకు చెందినవాడుగా భావించడానికి అవకాశం ఉంది.

క్రీ. శ. 1400 నాటికి వైష్ణవం అంధ్రభూమిలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. తమిళ సంప్రదాయం ప్రకారం నూటయెనిమిది తిరుపతుల ప్రస్తావన వొకతీరుగా ఉండగా, ఆనాటికే – అంటే క్రీ. శ. 1400 నాటికే స్థానిక సంప్రదాయానుసారం మరొక నూటయెనిమిది తిరుపతుల పట్టిక ఏర్పడినట్లు కానవస్తున్నది. శ్రీనాథకవిసార్వభౌముడు తన భీమఖండంలో –

శ్రీ సుదర్శన శంఖ చిహ్నాంకితముగాక
  యెపుడు మిన్నకయున్న యిల్లు లేదు
బహుళోర్ధ్వపుండ్ర సంపదలేక వృథయైన
  ఫాలరేఖలతోడి ప్రజయు లేదు
వైష్ణవోత్తమ భాగవత సాత్త్వికుల గోష్ఠి
  వెలియైన వాటికా వేదిలేదు
నలినేక్షణుఁడు భావనారాయణస్వామిఁ
  దప్పించి పరదైవతంబులేదు

పరమ గీర్వాణ యాగవైభవము నెలవు
నిఖిల కల్యాణగుణకేలి నిలయమనఁగ
దివ్యములు నూటయెనిమిది తిరుపతులకుఁ
బరమపదమైన శ్రీ సర్పవరము నందు

అని సర్పవరాన్ని అభివర్ణించాడు. భీమఖండ రచనాకాలం క్రీ. శ. 1430 సంవత్సరమని ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు సహేతుకంగా నిర్ణయించారు.[37] 'నూటయెనిమిది తిరుపతులకు పరమపదయైన శ్రీ సర్పవరం' ప్రస్తావన కృష్ణమాచార్యుల రచనలలో కానరాదు. శ్రీనాథుడు సర్ప వరాన్ని ఇంతగా అభినుతించాడంటే ఆయన కాలంనాటికి ఆ క్షేత్రం అత్యంత

ప్రముఖమైన వైష్ణవక్షేత్రంగా ప్రసిద్ధి చెంది ఉండాలి. అంటే కృష్ణమాచార్యుల కాలం నాటికి ఆ క్షేత్రానికి అంతగా ప్రసిద్ధి వచ్చి ఉండదు. శ్రీనాథుడు భీమ ఖండాన్ని రచించేనాటికి అన్నమయ వయసు ఆరు సంవత్సరాలు. ఆయనకు అండదండ లిచ్చిన సాళువ నరసింహ రాయలకు ఏ రెండుమూడు సంవత్స రాల వయసో ఉండి ఉండాలి. విజయనగర సామ్రాజ్య కాలంలో, ముఖ్యంగా సాళువ వంశ పాలనాకాలంలో సర్పవరం ప్రాచుర్యాన్ని కోల్పోవడం జరిగి ఉండాలి. అంటే సర్పవరం ప్రసిద్ధిని పొంది, కోల్పోయిన కాలంలో కృష్ణమా చార్యులు లేరని భావించవలసి వస్తుంది. అంటే దాదాపు నరహరితీర్థులకు సమకాలికుడై క్రీ. శ. 1320 దాకా జీవించి ఉండవచ్చునని భావించడం సహేతుకం కాగలదు.

కృష్ణమాచార్యుల రచనలను వస్తుపరంగా వింగడించి చూస్తే 1. నామ సంకీర్తనలు, 2. విన్నపాలు అని రెండు విధాలుగా వర్గీకరించవచ్చు. నామ సంకీర్తనలకు ఇంతకు ముందే ఉదాహరణలను చూపడం జరిగింది. విన్నపాలు కేవలం ప్రార్థనా రూపంగానూ, కథలరూపంగానూ, ఆత్మకథా రూపంగానూ ఉన్నాయి. ఈ విభజనను తంజావూరు ప్రతినిబట్టి చెయ్యడం జరిగింది. శ్రీ వేటూరి ఆనందమూర్తిగారు తమ వద్ద మరొక ప్రతి ఉన్నట్లు రాశారు.[38] అది కూడా ముద్రితమై లభిస్తే మరింత విపులంగా పరిశీలించి వర్గీకరించడానికి వీలౌతుంది.

ప్రార్థనా రూపంలో ఉన్న విన్నపాలకు 4, 5, 9, 10 సంఖ్యల వచనాలను చూడవచ్చును. కథలరూపంగా ఉన్న వచనాలకు 24, 25 వచనాలను ఉదాహరణలుగా తీసుకోవచ్చు. ఇక ఆత్మకథా రూపంలో ఉండి కృష్ణమా చార్యుల జీవిత విశేషాలను తెలుపుతున్న వచనాలను పరిశీలించవలసి ఉంది. ఈ వచనాలను వరుసగా - 52, 55, 20, 32, 34, 43, 53 ఈ వరుసలో చదివితే ఒక క్రమంలో ఉన్నట్లు గుర్తించక తప్పదు. ఈ రకమైన రచనలు మరి కొన్ని ఉండి ఉండాలి. అవి లభిస్తే రచన సంపూర్ణంగా ప్రత్యక్షం కాగలదు

కాని ప్రస్తుత పరిస్థితులలో అవి లభ్యం కాగలవా అన్నది ప్రశ్నగానే మిగలక తప్పదు. అసంపూర్ణంగానైనా లభించిన శకలాలు నిజానికి తెలుగులోనే కాక ప్రపంచ సాహిత్యరంగంలోనే మొట్టమొదటి ఆత్మకథా రచనలో భాగాలుగా కనిపిస్తున్నాయి. జీవితచరిత్రలు కొత్త కాకపోవచ్చు గాని ఆత్మకథ మాత్రం, కృష్ణమాచార్యుని రచనను తప్పించి, మనకు ఆధునిక కాలంలో పాశ్చాత్య ప్రపంచం నుంచి సంక్రమించిన ప్రక్రియ మాత్రమే. అందువల్ల ఈ రచనా శకలాలు తెలుగు సాహిత్య చరిత్రలోనే ప్రత్యేక స్థానాన్ని పొందతగినవి.

అయితే ఈ భావనకు ఆటంకంగా ఈ రచనలలో కొన్ని లక్షణాలను చూపి వాదించవచ్చు. ఉదాహరణకు –

> '... మీ స్వరూపులైన పాతకమూరి భాగవతుల నారాయణయ్య, యౌబళయ్య, యచ్యుతయ్య, యనంతయ్య, శ్రీ చెన్నయ్యం గారలు, శ్రీ కృష్ణమాచార్య్యులేకదశావతారంబైన మహామహుడు గాను, చాతుర్లక్ష గ్రంథ స్వరూపుండనంగాను, నతని సందర్శన సేవ దొరకునోయని యపేక్షించి...'[39]

మొదలైన వాక్యాలలో స్వోత్కర్ష కనిపిస్తున్నది కాబట్టి ఇవి ఆయన రచనలు కావేమో నన్న సందేహం కలగడానికి వీలుంది. తనను గురించి తాను ప్రథమ పురుషలో చెప్పుకొని ఉండవచ్చుగాని 'ఏకదశావతారంబైన' అన్న విశేషణాన్ని తనను గురించి తాను వినియోగించగలడా అన్నది ప్రశ్న. అంతేకాదు –

> '... ఆ సమయ మందున కృష్ణమాచార్యులు తనకు ప్రియకాంత యైన జగన్మోహనాంగి యను వారకాంత కుచభరంబుల మీఁద హస్తంబులు వహించి, తను వెరుఁగక నవరత్నఖచిత కంకణము ధరించి... నొకరూపున నరకేసరియై, యొకరూపున నాదివ రాహంబై, యొక రూపున కూర్మావతారుండై, యొకరూపం బున కృష్ణమాచార్యులుగానే జనియించి... కాంతావైభవంబు

> లకుఁ జొక్కుచు, నా మహోత్ముండు మదోన్మత్తుండై నవ్వుచు, నా సల్లాపంబులకు సంతోషచిత్తుండై తామసగుణంబుల వేం చేసిన సమయంబున, పాతకమూరి భాగవతులు పాడగని కృష్ణమాచార్యులం గూడి సంభాషణచేయదొడంగిరి...'[40]

అంటూ అవతారాలతో పోల్చుకుంటూ పరమవైష్ణవుడైనవాడు చెప్పుకొన గలడా ? తనను తాను మహోత్ముడని వర్ణించుకోగలడా అన్న ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పుకోవలసి ఉంది. 'ఆచార్య కటాక్షం బొకటి, అటుమీద మీ దాసుండగుటొకటి'[41] 'మిమ్ము నుతియించనేనెంతవాడను? అధమాధము డను, నరపశుఁడను, నీవు గాచి రక్షింపవే'[42] అని విన్నపం చేసుకొన్న వ్యక్తి తనను తాను భగవంతుడితో పోల్చుకొంటూ ఆత్మశ్లాఘనకు పాల్పడగలడా అన్నది కలగవలసిన సందేహం.

ఈ ఆత్మకథా రూపంలో ఉన్న వచనాలు నిజానికి పారాయణ గద్యలుగా కనిపిస్తున్నాయి. ఆ వచనాలలోనే ఉత్తమపురుషలో చెప్పుకొన్న విన్నపాలూ ఉన్నాయి. పూర్వోదాహృత వచన ప్రారంభంలోనే 'దేవా, మీకు మొఱపెట్టి విన్నపము చేయుచున్నాడఁను. సంసార మోహ బంధములఁ దగులు వడితిని...' అని చెప్పుకొనడం చూడవచ్చు. కృష్ణమాచార్యులు తన రచనలో ఉత్తమ, ప్రథమపురుషలలో తనను గురించి చెప్పుకొని ఉండవచ్చు. అందులో పెద్ద అభ్యంతరమేదీ ఉండనవసరం లేదు గాని ఆత్మశ్లాఘన మాత్రం ఇబ్బందిగా కనిపిస్తుంది. సాధారణంగా కావ్య రచయితలలో కృతిభర్తల మాటగానో, మరొకరి మాటగానో కవులు తమను తాము స్తుతి చేసుకోవడం మనకు తెలిసిన సంప్రదాయమే. తన రచన సంకల్పసూర్యోదయ నాటకంలో, వడగళై సంప్రదాయానికి ప్రారంభకులైన శ్రీ వేదాంత దేశికులు సూత్రధార వచనంగా తన ప్రశస్తిని తెలుపుకోవడమేకాక శ్రీ వేంకటేశ పూజార్థమై బ్రహ్మ నిర్మితమైన ఘంటావతారంగా తనను గురించి తాను చెప్పుకోవడం[43] ఇందుకు ప్రబలోదా హరణగా స్వీకరించవచ్చు. అందువల్ల ఆత్మశ్లాఘనను కృష్ణమాచార్యుల రచన

కాదనడానికి అభ్యంతరంగా చూపలేము.

అదీకాక కృష్ణమాచార్యుల రచనలకు ప్రత్యంతరాలు లభించడంలేదనే విషయాన్ని కూడా గుర్తించకతప్పదు. మనకు లభించిన ప్రతి (తంజావూరు) ఎవరో భక్తులు పారాయణ కోసం రాసుకొన్న ప్రతి అయి ఉండవచ్చు. తమ దృష్టిలో కృష్ణమాచార్యులు మహాభక్తుడైనందువల్లా, పారాయణ సమయంలో భక్తితో మరికొన్ని విశేషణాలను చేర్చి ఉండవచ్చునని భావించడంలో విప్రతిపత్తి ఏమీ ఉండదు. అందువల్లనే, 'ఒకరూపున నరకేసరియై, ఒక రూపున నాది వరాహంబై, యొకరూపున కూర్మావతారుండై..' 'ఆ మహాత్ముండు' మొదలైనవి[44] భక్తులు చేర్చినవి అయి ఉండవచ్చు. ఇవి ప్రక్షిప్తాలే అయినా, కుటిలబుద్ధితో చేసిన ప్రక్షిప్తాలు కాక, భక్తిపారవశ్యంతో చేసిన ప్రక్షిప్తాలుగా భావించడమే సహేతుకం కాగలదు. భక్తిసాహిత్యంలో ఇవి సామాన్యంగానే కానవస్తున్నాయి. శ్రీ అన్నమాచార్యుల రచన 'నారాయణతే నమో నమో - నారదసన్నుత నమోనమో' అన్న రచన పురందరదాసుల రచనగా కర్ణాటక ప్రాంతాలలో స్వల్పభేదంతో ప్రచారంలో ఉండగా, ప్రాసరహితంగా మరో మూడు చరణాలను చేర్చి బెంగళూరు శ్రీ రామకృష్ణాశ్రమం వారు ప్రచురించారు.[45] తెలుగు, కన్నడ వాగ్గేయకార రచనలలో ప్రాస లేకుండా రచనలుండవన్న సంగతి విజ్ఞులకు విదితమే. అందువల్ల పై రచనా శకలాలను కృష్ణమాచార్య కృతాలుగా భావించడానికి అభ్యంతరాలుండవలసిన అవసరం లేదు.

అదీగాక కృష్ణమాచార్యుల రచనలలో ప్రక్షిప్తాలుండడానికి అవకాశం లేకపోలేదు గాని వీటిని ప్రక్షిప్తాలని భావించడంకన్నా భక్తులు రాసుకొన్న ప్రతులలో కొంత కలగాపులగమై ఉండవచ్చునని భావించడం అసంగతం కాబోదు.

> ''తాళ్లపాక పెదతిరుమలాచార్యునిదిగా రాగిరేకుల్లో చెక్కబడిన 'దేవ నారాయణా ! పరబ్రహ్మ స్వరూపా ! అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా (అచ్చుప్రతి 151 వచనం) అనే వచనం

యథాతథంగా కొద్ది భేదంతో మకుటం మారి కృష్ణమాచార్యుల వచనంగా తంజావూరు తాళప్రతిలో (అచ్చుప్రతి 7వ వచనం) ఉన్నది. పోనీ దీన్ని చూచే తిరుమలయ్య మార్చి వ్రాసుకొన్నా డనుకొందాము'[46]

అని డా॥ వేటూరి ఆనందమూర్తిగారు అన్నారు. తిరుమలయ్య రచన రాగిరేకుల్లో ఉండి కాలనిర్ణయం విషయంలో ఎటువంటి సందేహాలకి తావు లేకుండా ఉంది గనుకా, తాళపత్రప్రతి క్రీ. శ. 24 మార్చి 1734 తేదీది గనుకా, తిరుమలయ్య రచననే ఎవరో భక్తులు కృష్ణమాచార్యుల రచనలలో తెలిసో, తెలియకో చేర్చి ఉంటారని భావించడమే సమంజసం కాగలదు. కృష్ణమాచార్యుల రచనలని తెలియవచ్చిన వాటిని సక్రమంగా పరిష్కరించి ప్రకటించవలసి ఉంది. ప్రస్తుతం ముద్రితమై లభిస్తున్న ప్రతి నిర్దుష్టం కాదని భావించవలసి వస్తున్నది. వ్యావహారిక భాషారూపాలను గ్రాంథికరూపాలుగా మార్చడం అవాంఛనీయమని చెప్పక తప్పదు.[47]

కృష్ణమాచార్యుల రచనలలో కనిపించే ప్రధాన లక్షణం తీవ్రమైన భక్త్యావేశం. రచన అంతటా ఈ ఆవేశం ప్రచండ ఝంఝామారుతంలాగా ప్రబలంగా కనిపిస్తుంది. ఈ ఆవేశమే ఆయన రచనలను కేవల వచనత్వం నుంచి కాపాడి ఈ వచనాలకు ఒక విలక్షణమైన రూపాన్ని ప్రసాదిస్తున్నది. నిజం చెప్పాలంటే ఈ రచనలలో కవిత్వంపాలు చాలా తక్కువ. గుండెను పట్టి కదిలించగల ప్రయోగాలేవీ ఈయన రచనలలో కనిపించవు. ఆయన ఆత్మకథ ప్రకారమే ఆయన జీవితం శృంగారంలో మునిగి తేలగా, ఆ శృంగారచ్ఛాయలేవీ ఆయన రచనలలో ప్రతిఫలించకపోవడం విడ్డూరమే. సంస్కృత సూక్తులను గుప్పిస్తూ రచించిన కొన్ని వచనాలు ఆయన సంస్కృతభాషా పాండిత్యాన్ని మాత్రమే కాక బహుళ గ్రంథ పరిచయాన్ని కూడా సూచిస్తున్నాయి.[48] ఈ వచనాలలో విశిష్టాద్వైతానికి స్ఫూర్తినిచ్చిన సంస్కృతసూక్తులు 'ఏకో విష్ణుర్మహద్భూతం' 'శ్వపచోపి మహీపాలః' 'సిద్ధం కేశవా పురుషలోకేశమ్' 'నారాయణ పరమ్

స్థిరమ్' తెలుగు వచనాల మధ్య నిలిచి మణిప్రవాళశైలిని తలపిస్తున్నాయి. నామ సంకీర్తనల రూపంలో కానవచ్చే వచనాలను తప్పిస్తే మిగిలినవన్నీ కేవలం పారాయణ గద్యలుగా కానవస్తున్నాయి. స్వల్పరాగచ్ఛాయతో పురాణాలలోని వచన పఠనశైలిలో చదువుకోవడానికి వీలున్నవి. ఈ విషయంలో పోతనా మాత్యుడి భాగవతంలోని వచనాలను చూడవచ్చును. పోతన దాదాపు అన్నమయకు సమకాలికుడు. అందువల్ల కృష్ణమాచార్యుల వచన ప్రభావం పోతన మీద ప్రసరించడానికి వీలు కనిపిస్తోంది. ఉదాహరణకు –

> 'దేవాకార్యరూపంబగు చేతనాచేతనాత్మక ప్రపంచంబునకుఁ గారణుడవైన నీచేత సమస్తభువనంబులును సృజియింపబడె. నీవు సర్వభూతాత్మక భావవిదుండవు. లోకనాథశిఖామణి భూతుండవు. విజ్ఞానవీర్యుండవు. అవిద్యంజేసి ఇట్టి సృష్టి రూపంబు వొందితి. గృహీత రజోగుణుండవు. నీయందుఁ బ్రపంచంబు లీనంబైయుండు. సుపక్వయోగంబు నొంది నిష్కాములై ధ్యానంబున నిన్నరయుచు నిర్జిత శ్వాసేంద్రి యాత్ములై భవత్ప్రసాదంబు వడసిన వారలకుం బరాభవంబు లెక్కడివి ? ...'[49]

ఇందుకు కారణం పద్యగద్యమయమైన భాగవతాన్ని చదువు తున్నప్పుడు – పద్యాన్ని కొంచెం రాగంతో చదువుతున్నప్పుడు వచనం రాగం లేకుండా చదివితే వినేవారికి శృతి కటువుగా వినిపించక తప్పదు. అందువల్ల వచనాన్ని కూడా రాగవరసలోనే చదవవలసి ఉంటుంది. దేవాలయాల్లో, పండుగల సందర్భంలో జరిగే పురాణ కాలక్షేపాల్లో ఈ పద్ధతిలో వచనాలను పఠించడం విదితమే. అందుకోసమై ఒక శైలి నేర్పరచుకోవలసి వస్తుంది. వచనాలకు ఇటువంటి శైలిని ఇచ్చినవాడు కృష్ణమాచార్యులు. నన్నయ భారతం లోని వచనాలు ఇటువంటి పఠనానికి ఒక పట్టాన లొంగవు. అందువల్ల వచనా లకు ఒకానొక పఠనశైలిని ఇచ్చినవాడుగా మనం కృష్ణమాచార్యులకు

నమస్కరించక తప్పదు. పారాయణ గద్యలను కూడా ఈ విధంగా చదవడం మనం గమనించవచ్చు.

క్రీ. శ. 1160 ప్రాంతాల జీవించిన బసవేశ్వరుడి వచనాలూ, అల్లమ ప్రభు వచనాలూ ఈ శైలికి కొంత భిన్నంగా కానవస్తున్నాయి. కృష్ణమాచార్యుల రచనలలో వాక్యాలు ఒక్కొక్కప్పుడు సుదీర్ఘంగా ఉండడాన్ని గమనించవచ్చు. ఉదాహరణకు 28వ వచనంలో మొదటా, చివరా ఉన్న రెండు చిన్న వాక్యాలనూ విడిచి చూస్తే ముద్రణలో తొమ్మిది పంక్తులున్న వచనం ఉన్నది. శివ శరణుల రచనలలో ఇంత దీర్ఘంగా ఉన్న వాక్యాలు కనిపించవు. అవి సంక్షిప్తంగా కొద్ది వాక్యాలతో వాక్యాంత విశ్రాంతితో దాదాపు నేటి కవిత్వంలోని వచన పద్యాల లాగా కనిపిస్తాయి. ఉదాహరణకు అల్లమప్రభు వచనాన్ని చూడవచ్చు -

"ఎత్తణ మామర ! ఎత్తణకోగిలి !
ఎత్తణిందెత్త సంబంధవయ్య !
బెట్టద నెల్లియకాయి, సముద్రదొళగణ ఉప్పు,
ఎత్తణిం దెత్త సంబంధవయ్య !
గోగేశ్వర లింగక్కెయు ఎనగెయూ
ఎత్తణిందెత్త సంబంధవయ్య ![50]

ఇందుకు తెలుగు అనువాదం -

ఎక్కడి మామిడిచెట్టు ! ఎక్కడి కోకిల !
ఎక్కడెక్కడి సంబంధమయ్యా !
గుట్టమీది ఉసిరికాయ, కడలిలోని లవణమూ !
ఎక్కడెక్కడి సంబంధమయ్యా !
గోగేశ్వరలింగమునకూ, నాకూ
ఎక్కడెక్కడి సంబంధమయ్యా ![51]

ఈ రచన కన్నడ వచనాల స్వరూపాన్ని చక్కగా చూపుతున్నది. కన్నడ

శివశరణుల రచనలలో క్లుప్తతా, భావతీవ్రతా సమానంగా కనిపిస్తున్నాయి.

శివశరణుల వచన రచనలు శ్రీ కృష్ణమాచార్యులకు స్ఫూర్తినిచ్చి ఉంటాయా అన్నది మనకు సహజంగా ఎదురయే ప్రశ్న. శైలిరీత్యా చూస్తే శివశరణుల వచనాలకూ, కృష్ణమాచార్యుల వచనాలకూ చాలా భేదముంది. చిత్తవృత్తిలోనేకాక సంవిధానంలోనే బాగా తేడా కనిపిస్తున్నందువల్ల శివశరణుల రచనల ప్రభావం శ్రీ కృష్ణమాచార్యుల మీద లేదనే చెప్పవలసి వస్తున్నది.

శ్రీ కృష్ణమాచార్యుల నామసంకీర్తనలు గాన యోగ్యమైనవని ఇదివరకే గమనించడం జరిగింది. ఇవి పూర్తి గేయ రచనలు కాకపోయినా రాగచ్ఛాయతో ఆలాపన చేయదగినవే. ''అప్పుడు కృష్ణమాచార్యులు దండెయుఁ జిఱు తాళంబులు సంధించుకొని... యాలాప వర్ణనలతో 'నమో నారాయణా' యని విష్ణునామ గుణకథలు వచన భావంబునఁ గీర్తించెను'' అని కృష్ణమా చార్యుల రచనలలోనే కానవస్తున్నది.[52] ఈ పద్ధతిలో శివశరణుల రచనలను గానం చేసే సంప్రదాయం ఉన్నదా అన్నది సందేహాస్పద మయిన విషయం. శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు వ్యక్తపరచిన అభిప్రాయాలతో ఏకీభవించక ప్రఖ్యాత కన్నడ సాహితీవేత్త శ్రీ డి.వి. గుండప్పగారు –

> ''మీ వ్యాసంలో ఒకదానిలో కన్నడ 'వచనాల'ను గురించి ప్రస్తావించారు. ఈ వచనాలను గేయ సాహిత్యంలో చేర్చడం నాకు సమ్మతం కాదు. వచన మన్నది కేవలం మననం కోసం తయారైనవి. అవి రసప్రధానమైన వాఙ్మయం కాదు. ఆలోచనా ప్రధానమైనది. అది నోటితో పలికేది కాదు. ఇతరుల చెవికి చేరగలిగిందీ కాదు. వేదాలలోని ఉపాంశువాక్యాలలాగా జపంలో ప్రయుక్తమయ్యే రహస్యమంత్రం లాగా – సాధకుడు తానే చింతనలో అనుసంధానం చేసుకొనేందుకుగాను పుట్టినవి వచనాలు. వాటిని పాడడమూ, పూవును ఊదుబత్తి అని వెలిగించడమూ ఒకటే.''[53]

అని అన్నారు. కాని వచనాలను గానం చేసే విధానం గేయగానం కన్నా భిన్నమై ఉంటుంది. గేయంలో పల్లవి పునరావృతం కావడం వల్ల ఒక నిర్దిష్ట రూపం ఏర్పడడం జరుగుతుంది. వచనంలో అక్షరాలూ, వాక్యాలూ అనియతం కావడంవలన వచన పఠనానికి నిర్దిష్ట రూపం ఉండదు. అయినా ఇదివరకే చెప్పినట్లు పురాణపఠన సందర్భంలో వచనాలను స్వల్ప రాగచ్ఛాయ తో చదవడమన్నది పురాణ కాలక్షేప శ్రోతలకు అనుభవైకవేద్యమే. అంటే వచనం పరిపూర్ణత్వం చెందని ప్రాథమిక గేయప్రక్రియగా కానవస్తుంది. యక్షగానాలలో సూత్రధారుడి ప్రస్తావనా వాక్యాలు ఈ విధంగానే పఠించడం గమనార్హం. అసలు వచనాన్ని కేవలం వచనంగా, ఏ విధమైన రాగచ్ఛాయా లేకుండా చదవడ మన్నది ఆధునిక యుగంలో ఏర్పడిన పద్ధతిగా కానవస్తున్నది. ఈ నాటికీ పల్లె ప్రాంతాలలో ఉత్తరాలనూ, దస్తావేజులనూ ఒక విధమైన లయతో రాగచ్ఛాయతో చదవడం తెలిసిన విషయమే. ఈ విధంగా చూసినప్పుడు కన్నడ వచనాలను ప్రాథమిక గేయస్వరూపాలుగా గుర్తించడం తప్పు కాబోదు. తెలుగులో కృష్ణమాచార్యుల వచన రచన మాత్రం, సంకీర్తన రూపంలోనే ఉన్నా కొత్తదారి తొక్కిన రచనా ప్రక్రియగా గుర్తించక తప్పదు.

అటు మాధ్వమతానికి చెందిన పదమూడవ శతాబ్దాంతందాకా జీవించిన శ్రీ నరహరితీర్థులూ, ఇటు పధ్నాలుగవ శతాబ్దపు మధ్య భాగం దాకా జీవించిన శ్రీ వైష్ణవానికి చెందిన కృష్ణమాచార్యులూ సింహగిరి నృసింహ స్వామినే ఆరాధ్య దైవంగా పూజించి కన్నడ, తెలుగు భాషలలో సంకీర్తన రచనకు ఆద్యులు కావడం గమనార్హమైన విషయం. దక్షిణాది వాగ్గేయకార సాహిత్యావిర్భావానికి సింహాచలం కేంద్రం కావడం కూడా గమనార్హం.

అయితే నిజానికి అన్నమయ్య శ్రీ నరహరితీర్థుల, శ్రీకృష్ణమాచార్యుల రచనల ప్రభావానికి పదనిర్మాణశైలిలో ప్రభావితుడు కాలేదు గాని వారి భక్తి ప్రపత్తులకు వారసుడైనాడు. అన్నమయ పండితకవి. అందువల్ల జానపద వరుసల నుంచి ఉద్భవించిన తెలుగు కావ్యఛందస్సులను మళ్లీ జానపద

పద్ధతుల్లోకి మార్చి తెలుగు పదకవిత్వాన్ని పరిపుష్టం చెయ్యడయేకాక యక్షగాన వాఙ్మయానికి నూతనోత్తేజాన్నిచ్చినవాడు అన్నమయ్య.

అధోజ్ఞాపికలు

1. నా మిత్రులు శ్రీ శ్రీమన్నల్లాన్ చక్రవర్తుల రామానుజాచార్యులుగారు తమ చిన్నతనంలో కృష్ణమాచార్యుల వచనాలను ఇంట్లో పాడుతుండేవారనీ, ఆయనను కాంత కృష్ణమాచార్యులని పేర్కొనేవారనీ ప్రసంగవశాన తెలియజేశారు. డాక్టర్ కిడాంబి నరసింహాచార్య గారు సేకరించి ప్రచురించిన 'తిరునామములు' అన్న గ్రంథంలో 24, 52 సంఖ్య గల కీర్తనలలో 'కాంత కృష్ణార్యులు', 'దేశికాంత కృష్ణులు' అనీ రెండు పేర్లు కనిపిస్తున్నాయి. నరహరి వచనాల కర్త కృష్ణమాచార్యులూ, 'కాంత కృష్ణార్యులూ' ఒకరేనా అన్నది సందేహమే.
2. పరమయోగివిలాసము – తాళ్లపాక తిరువేంగళనాథుడు, తి.తి.దే. ప్రచురణ, 1938, పు. 4.
3. శ్రీ అన్నమాచార్యుల జీవితచరిత్రము, తాళ్లపాక తిరువేంగళనాథుడు, ద్విపద భాగం, పు॥లు 41, 42
4. శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు – శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే సమకూర్చబడినవి. తొలిపలుకు, పు. 4
5. అదే – వేంకటాచలవిహారశతకము, పు. 52
6. సింహగిరి వచనములు – ప్రచురణ ఆంధ్ర రచయితల సంఘము, హైదరాబాదు, 1968
7. సింహగిరి వచనములు – డాక్టర్ ఎమ్. కులశేఖరరావు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ, 1980, పు. 13
8. అదే, వచనం 52
9. తాళ్లపాక కవుల పదకవితలు – భాషా ప్రయోగవిశేషాలు, డాక్టర్ వేటూరి ఆనందమూర్తి, పు. 18
10. శ్రీ సిద్ధేశ్వర చరిత్రము – కాసె సర్వప్ప ప్రణీతము, ఆంధ్ర రచయితల సంఘము, 1960, ఇంట్రడక్షన్, పు. 6
11. అదే. పు. 5
12. అదే, వచన భాగం. పు. 149
13. అదే, ద్విపద భాగం, పు. 81
14. అదే, ద్విపద భాగం, పు. 82
15. తెలుగు విజ్ఞాన సర్వస్వము, సంపుటం 3, పు. 275
16. అదే, పు. 563
17. సింహగిరి వచనములు, ఆం. ప్ర. సాహిత్య అకాడమి

18. అదే, వచనం 21
19. అదే వచనం 43
20. అదే, వచనం 45
21. తెలుగు విజ్ఞాన సర్వస్వము, సంపుటం 3, పు. 565
22. తిరుపతి శ్రీ వేంకటేశ్వర - శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆంగ్ల గ్రంథం, పు. 170
23. సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్స్, వాల్యూం 4, శాసన సంఖ్య 1047
24. సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్స్, వాల్యూం 4, శాసన సంఖ్య 1090
25. అదే, శాసన సంఖ్య 25
26. సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్స్, వాల్యూం 5, సంఖ్య 1227 - కృష్ణమాచార్యులు తన వచనాలను 'దివ్యనామ సంకీర్తనం' అని పేర్కొనడం గమనార్హం, వచనం 44
27. సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్స్, వాల్యూం 4, శాసన సంఖ్యలు 1134, 955, 1088. ఇవిగాక ఇంకా ఉన్నాయి.
28. బృహస్తోత్రరత్నాకర / కన్నడం / పు. 77
29. ఆంధ్ర కవితరంగిణి - 3వ సంపుటంలో ఉదాహృతం, పు. 111
30. భాగవతం
31. 'సింహగిరి వచనాలు' ముద్రిత ప్రతి తంజావూరు గ్రంథాలయంలోని రాతప్రతి ఆధారంగా పరిష్కృతమైనది. అసలు నామసంకీర్తనలు వేరే గ్రంథంగా ఉండి ఉండవచ్చు. ఎవరో భక్తుడు తనకు నచ్చిన భాగాలను ఎత్తి రాసుకొన్న ప్రతి తంజావూరు ప్రతి అయి ఉండాలి.
32. అదే
33. వచనం 7, సింహగిరి వచనములు
34. ది సింహాచలమ్ టెంపుల్ - డాక్టర్ కె. సుందరం, ఆంగ్ల గ్రంథం, పు. 72
35. సింహగిరి వచనములు, వచనం 52
36. తాళ్లపాక కవుల పదకవితలు - భాషా ప్రయోగవిశేషాలు, పుటలు 17, 18
37. శ్రీనాథుడు - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి, పు. 166
38. తాళ్లపాక కవుల పదకవితలు, పు. 17
39. సింహగిరి నరహరి వచనములు, వచనం 32, పు. 22
40. అదే, వచనం 32
41. అదే, వచనం 41
42. అదే, వచనం 42
43. సంకల్పం సూర్యోదయము - వేదాంతదేశికులు / సంస్కృతం / 1-14 శ్లోకం
44. సింహగిరి వచనములు, వచనం 32
45. జ్యోతి - బెంగుళూరు శ్రీరామకృష్ణాశ్రమం, పుll లు 66, 67
46. తొలి సంకీర్తనకవులు - ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమీ ప్రచురణ, పు. 34

47. తాళ్లపాక కవుల పదకవితలు, పు. 26 – డాక్టర్ వేటూరి ఆనందమూర్తి గారు చూపిన వ్యావహారికభాషా ప్రయోగాలేవీ డాక్టర్ ఎమ్. కులశేఖర రావుగారి పరిష్కరణలో కనపడవు.
48. సింహగిరి వచనములు, వచనాలు 14, 26, 17, 16, 31
49. భాగవతం – తృతీయస్కంధం, అధ్యాయం 15
50. అల్లమన వచన చంద్రిక – సంపాదక ఎల్. బసవరాజు, వచన 59, కన్నడ గ్రంథం
51. ఇది ప్రకృత రచయిత చేసిన అనువాదం
52. సింహగిరి వచనములు, 32వ వచనం, పు. 26
53. అనంతరాగం, శ్రీ రాళ్లపల్లి అభినందన గ్రంథంలో ముద్రితమైన 'రాళ్లపల్లి మత్తు డి.వి.జి. పత్ర ప్రసంగ' నుంచి ప్రకృత రచయిత చేసిన అనువాదం.

అన్నమాచార్యుల గురువు ఆదివరన్ శఠకోపముని
(అహోబిల దేవాలయ శిల్పం)

సంకీర్తన భాండాగారం మీద ఉన్న అన్నమాచార్య రూపశిల్పం

(తిరుపతి)

సంకీర్తన భాండాగారంలో లభించిన రాగిరేకు మీది అన్నమయ రూపశిల్పం



నరసింహుడు - చెంచులక్ష్మి
(అహోబిల శిల్పం)

అశోకవనంలో సీత
(వేంకటేశ్వరాలయ శిల్పం, తిరుపతి)

యక్షగానంలో నాయిక వేషం

యక్షగానంలో నాయకుడి వేషం



శ్రీ వేంకటేశ్వరునీ, రామానుజాచార్యులనూ ఆరాధిస్తున్న సాళువ నరసింహరాయలు, కుమార నరసింహరాయలు.
(తిరుపతిలోని సాళువ నరసింహరాయ మండపంలోని శిల్పం. ప్రస్తుతం ఈ మండపం లేదు).

అన్నమాచార్యుల గురువు ఆదివరన్ శఠకోపముని
(అహోబిల దేవాలయ శిల్పం)

సంకీర్తన భాండాగారం మీద ఉన్న అన్నమాచార్య రూపశిల్పం

(తిరుపతి)

సంకీర్తన భాండాగారంలో లభించిన రాగిరేకు మీది అన్నమయ రూపశిల్పం



నరసింహుడు - చెంచులక్ష్మి
(అహోబిల శిల్పం)

అశోకవనంలో సీత
(వేంకటేశ్వరాలయ శిల్పం, తిరుపతి)

యక్షగానంలో నాయిక వేషం

యక్షగానంలో నాయకుడి వేషం



శ్రీ వేంకటేశ్వరునీ, రామానుజాచార్యులనూ ఆరాధిస్తున్న సాళువ నరసింహరాయలు, కుమార నరసింహరాయలు.
(తిరుపతిలోని సాళువ నరసింహరాయ మండపంలోని శిల్పం. ప్రస్తుతం ఈ మండపం లేదు).



శుభమస్తు॥ శ్రీమతే రామానుజాయ నమః॥ స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు
౧౩౨౬ అగునేటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించినపదారుయేండ్ల
తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహనశకవరుషంబులు
అగునేటి దుందుభిసంవత్సర ఫాల్గుణ బహుళ నిరుధానకు తిరువేంగళనాథుని మీదను
గాను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగార సంకీర్తనలు॥ ॥ శ్రీవేంకటేశాయ నమః॥

అన్నమయ శృంగార సంకీర్తనల తొలిరేకు

చిన తిరుమలాచార్యులానతిచ్చిన "సంకీర్తన లక్షణమను పదచ్ఛందము"

తొలి రాగి రేకు

6. అన్నమయ పదనిర్మాణవైఖరి - 1

పదస్వరూప విశ్లేషణ

అన్నమయ్య వాగ్గేయకారుడు. అంతేకాక ఆయన కావ్యకర్త కూడా. వాగ్గేయకారుడై కావ్యరచనను కూడా చేసిన మరొక వ్యక్తి మనకు చరిత్రలో కానరాడు. అందువల్ల అన్నమయ సాహిత్యచరిత్రలో అత్యంత విశిష్టమైన స్థానాన్ని ఆక్రమించుకొన్నాడు.

అన్నమయ పాటలను రాయడమేకాక పాడేవాడని కూడా తిరుపతి లోని శిలా, లోహ ప్రతిమలు సాక్ష్యమిస్తున్నాయి. ఆయన పాట యెలా ఉండేదో చిన్నన్న వర్ణించే ఉన్నాడు.[1] మంచి పాటగాడు కానిదే శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో పాడటానికి అవకాశం లభించి ఉండేది కాదు. ఆ గాన మాధుర్యానికి పరవశుడై సాళువ నరసింహరాయలు తనమీద కూడా శృంగార సంకీర్తన పాడమనడం, అన్నమయ తిరస్కరించడం గ్రంథస్థమైన చారిత్రక విశేషమే.

అన్నమయ పుట్టి పెరిగింది పల్లె వాతావరణంలో. చిన్ననాట తోటి బాలురలో ఆడుతూ పాడుతూ నేర్చుకొన్న జానపదగేయాలు తరువాత తరువాత ఆయనకు స్ఫూర్తినిచ్చి ఉంటాయనడంలో సందేహం లేదు. తిరుపతికి బాల్యంలోనే వెళ్ళి అక్కడ వైష్ణవం స్వీకరించిన రోజులలో అక్కడి ఆలయంలో వినిపించిన ఆళ్వారుల తమిళ దివ్యప్రబంధాలను చూసి తాను కూడా పాటలు రాయడానికి పూనుకొని ఉండాలి. స్వరంమీదా, భాషమీదా అధికారం కలవాడు కావటం వలన సహజంగానే ఆయన వాగ్గేయకారుడిగా రూపొందాడు.

చిన్నన్న తన తాతగారి వేదాంత పఠనం ఆహోబిలంలో శఠకోపముని దగ్గర జరిగినట్లు చెప్పాడు గాని భాషా, వ్యాకరణమూ, ఛందశ్శాస్త్రమూ ఎక్కడ

ఎప్పుడు నేర్చుకొన్నాడో ప్రస్తావించలేదు. చిన్నన్న చెప్పిన ప్రకారమే ఆయన రచనలు - సంకీర్తనలు కాక - సాంప్రదాయక మార్గానికి చెందినవి ఇవి -

1. ద్విపదలో రామాయణం - తెలుగు
2. శృంగారమంజరి - తెలుగు
3. శ్రీ వేంకటాద్రి మాహాత్మ్యం - సంస్కృతం
4. పన్నెండు శతకాలు - బహుశా తెలుగులోనే రాసి ఉండవచ్చు.

ఇవికాక ఇంకా 'సకల భాషలలో ప్రతిలేని నానా ప్రబంధములు' కూడా రాశాడని చిన్నన్న ఇచ్చిన సమాచారమే. పై పట్టికలోని ద్విపదరామాయణమూ, శ్రీ వేంకటాద్రి మాహాత్మ్యమూ అలభ్యాలు. శతకాలలో ఒకటి మాత్రమే - శ్రీ వేంకటేశ్వర శతకం - లభ్యమౌతోంది. శ్రీ వేంకటేశ్వర శతకం చంపక, ఉత్పలమాలా వృత్తాలతో కూర్చిన రచన.

ఈ రెండు రచనలే మనకు - శృంగారమంజరీ, శ్రీ వేంకటేశ్వర శతకమూ - సాంప్రదాయక సాహిత్య మార్గంలో అన్నమయ రచించినవి లభ్యమౌతున్నాయి. మనకు దొరకని రచనల వివరాలు చూస్తే అన్నమయ సాహిత్య కృషి ఎంత విస్తృతంగా సాగిందో గమనించవచ్చు. కాని తరువాతి కాలపు ఏ కవీ అన్నమయను పూర్వకవిగా స్తుతించకపోవడం విడ్డూర మనిపించక తప్పదు. అయితే ఆయన రచన లన్నిటిలోనూ సంకీర్తనలు సంఖ్యా బాహుళ్యం వల్లనేకాక భావ వైశాల్యం దృష్ట్యా కూడా ప్రముఖమైనవి. అందువల్ల అన్నమయ సంకీర్తనా రచనా వైఖరిని గురించి తెలుసుకోవలసిన విషయాలు ఎన్నో ఉన్నాయి. ఆ ప్రయత్నంలో భాగంగా జానపదగేయ సరణిని అర్థం చేసుకోవలసి ఉంది.

సాధారణంగా చాలామంది జానపద సాహిత్యం సామూహిక సృష్టి అనీ, ఆశువుగా మాత్రమే అది ఆవిర్భవిస్తుందనీ భావించడం జరుగుతోంది గాని నిజానికి మాత్రం అవి పూర్తి నిజాలు కావని పరిశీలనవల్ల తెలుసుకోవచ్చు.

కేవలం ఆశుసాహిత్యంగా చిన్న చిన్న రచనలేవో వచ్చినా రాతలేనిదే అవి నిలవలేవు. కోలాటం వంటి నృత్యాలతో ఉన్న సంపర్కం వల్ల వాటి లయ, సాహిత్యం, జ్ఞాపకం ఉండిపోవడానికి వీలైతున్నది. మార్గసాహిత్య విధానంలో కావ్యరచనకు కవి ఎంత కృషి చేస్తాడో, జానపద గేయ నిర్మాత కూడా అంత కృషినీ చెయ్యడం జరుగుతుంది. రాసింది జానపదరచన కాదనే అసంగత భావం ఒకటి ఇటీవల ప్రబలింది.[2] జానపద కృతులను సరిగా అధ్యయనం చెయ్యకపోవడమే ఇందుకు కారణం.

సంస్కృతం నుంచి తెలుగు కవులు దిగుమతి చేసుకొన్న వృత్తాలను విడిచిపెడితే ఎన్నో రకాలయిన తెలుగు జానపదగేయ ఛందస్సులకు కొన్ని నియమా లేర్పరచుకొని కట్టుదిట్టం చేసుకొని తెలుగు కవులు వాడుక చేసినట్లు పరిశీలనలో విదితమయే సత్యం. సీసపద్యం, రగడ, అక్కర, ద్విపద, షట్పద మొదలైన కావ్యఛందస్సులకు తెలుగు జానపదగేయఛందస్సులే ఆధారం. ఈ జానపద ఛందస్సులు పండిత కవుల చేతిలో పడినప్పుడు చాలావరకు తమ గేయ లక్షణాన్ని కోల్పోయాయి. నిజానికి తెలుగు కవులు వాడుకొన్న సంస్కృత వృత్తాలకు సైతం తెలుగుకు నైసర్గిక యతిప్రాసల నతికించి వాటి నడకను మార్చటం జరిగింది. నిజానికి యతిప్రాసలు తెలుగుభాషకు నైసర్గిక మైనవి. వాటి వాడకంలో జానపదగేయాలలో కొంత స్వేచ్ఛ తీసుకొని అనవసర మనుకొన్నప్పుడు వాడటం మానివెయ్యడం వంటి లక్షణం కనబడుతుంది. కాని కావ్యఛందస్సులలో కొన్నిరకాల పద్యాలకు ప్రాసనూ దాదాపు అన్ని పద్యాలకూ యతినీ ఉల్లంఘించరాని నియమంగా లాక్షణికులు విధించడం వలన తెలుగు పద్యానికి లేనిపోని బరువు లెక్కువైనాయి. జానపద సాహిత్యం లో యతి సరూపాక్షరయతి మాత్రమేకాక విశ్రాంతి స్థానం కూడా. తెలుగులో ఇందుకు ఉదాహరణలు సామెతలలోనే కనబడతాయి. ఉదాహరణకు –

యతి :

1. దాసరి తప్పులు – దండంతో సరి

2. కోరి పిల్లనిస్తే – కులం తక్కువన్నట్లు

3. ఉడత కెందుకురా – ఊరిమీది పెత్తనం

ప్రాసయతి :

1. ఇదుగో పులి అంటే – అదుగో తోక అన్నట్లు

2. నోరు మంచిదైతే – ఊరు మంచిదౌతుంది

3. ఆడలేక మద్దెల – ఓడన్నట్లు

4. అత్తమీది కోపం – దుత్తమీద చూపినట్టు

కొన్ని సామెతలు సుదీర్ఘమై ఉండి, రెండు పంక్తులుగా విరుగుతాయి. ఇలాగ రెండు పంక్తులుగా విరిగిన సామెతల్లో యతి ఏ పంక్తికి ఆ పంక్తిలోనే చెల్లుతుంది.

1. సన్నికల్లు కడగరా – సైదల్లీ అంటే
   కడిగినట్టే నాకినా – ఖుదాతోడన్నట్లు

2. పేనుకు – పెత్తన మిస్తే
   తలంతా – తెగ కొరికినట్టు

3. తీరుతీరు గుడ్డలు గట్టుక – తిరుణాలకు పోతే
   ఊరి కొక గుడ్డ – ఊసిపోయినట్లు

సాధారణంగా జానపదగేయాలలో పాదాన్ని ఏ అక్షరంతో ఎత్తుకుంటే ఆ అక్షరంతోనే రెండవ పాదాన్ని కూడా ప్రారంభించడం వాడుకగా కనిపిస్తుంది.

కొమ్మనా పండున్నదీ ఉయ్యాలో
కోరితే మన్నొచ్చునా ఉయ్యాలో
కొమ్మబట్టి గుంజితే ఉయ్యాలో
కొంగునా పడదుకదా ఉయ్యాలో

పై పాటని నాలుగు పంక్తులకు బదులు రెండు పంక్తులుగా రాస్తే యతి ఏర్పడుతుంది. ఇక్కడ గమనించవలసిన విషయ మొకటుంది. పూర్వం తాటాకుల మీద రాసేటప్పుడు పద్యాలైనా, పాటలైనా సరే సుదీర్ఘమైన పంక్తులుగా జాగా ఉన్నంతమేరా రాసుకొంటూ పోయేవారు. జాగా అయిపోతే రెండోపంక్తి ప్రారంభం అయేది. పాదాంతాన ఈ । గుర్తునూ చరణాంతాన ఈ ॥ గుర్తునూ పెట్టడం తప్పించి, పాదాలను విభజించి రాయడం ఉండేది కాదు. శిలా తామ్రశాసనాలలో కూడా ఇదే మార్గాన్ని మన పూర్వులు అనుసరించారు. అన్నమయ్య రచనలు రాగిరేకుల మీద చెక్కినప్పుడు కూడా ఇదే పద్ధతిని అనుసరించారు. ముద్రణకళ వికసించిన తరువాతనే పద్యాలను పాదాలుగా విభజించి అచ్చు వెయ్యడం ప్రారంభమయింది. ఈనాడు జానపద గేయాలను సేకరిస్తున్నవారు తమకు తోచిన విధంగా పాద విభజన చేసి రాయడం వలన కొన్ని ముఖ్య లక్షణాలను గమనించలేకపోతున్నారు. సేకరణ కర్తలకు ఛందస్సు మీద దృష్టి లేకపోవడం ప్రధాన కారణం. ఇంకొక కారణం గేయాలను 'తకిట తక'లతో కొలుచుకుంటూ పోవడం. ఈ విషయం తరువాత చర్చించడం జరుగుతుంది. ప్రస్తుత విషయానికి ఉదాహరణ –

ఏకేకు ఒక బార
ఎల్లుండి సంత
నాయేకులైపోయె
నాకేటి చింత[4]

ఈ పాటకి లక్షణం చెప్పుకొంటే ఒకటో పాదం, మూడోపాదంలో ఐదు మాత్రల గణాలు రెండేసి ఉంటాయనీ, రెండూ, నాలుగూ పాదాలలో ఐదు మాత్రల గణ మొకటీ మూడు మాత్రల గణ మొకటీ ఉంటాయని చెప్పుకోవాలి. లేదా 'తకిట తక' ఆవృత్తులు పాదానికి రెండేసి ఉంటాయనీ, రెండవ పాదంలో చివరి మూడు మాత్రలనూ ఐదు మాత్రల కాలంలో పాడుకోవాలనీ చెప్పవలసి ఉంటుంది. నిజానికి ఈ రెండు పద్ధతులూ ఈ గేయాన్ని విశ్లేషించడానికి

పనికి రావు. పై పాటని ఈ విధంగా రాసి చూడాలి -

ఏకేకు ఒక బార – ఎల్లుండి సంత
నాయేకు లైపోయె – నాకేటి చింత

ఇప్పుడు యతిస్థానం గుర్తించడానికి వీలుగా ఉంది. అంతేకాదు, ఈ గేయం అంత్యప్రాసతో ఉన్న అందమైన మంజరీ ద్విపదగా ప్రత్యక్షమౌతున్నది. ఇది యాదృచ్ఛికం కాదు. ఈ విధంగా గుర్తించడంవల్ల ఈ జానపదగేయ రచయితకు న్యాయం చేసినవారమౌతాము. మరొక గేయం -

ఊరు ముందూ చేను విత్తబోకన్నా
ఊళ్లోన వియ్యంబు చేయబోకన్నా
ఊరు ముందూ చేను పిల్లల్లపాలు
ఊళ్లోన వియ్యంబు కోపాలపాలు[5]

ఈ పాటను ఈ రూపంలో చూస్తే ప్రాస అస్తవ్యస్తమైనట్టు కనిపిస్తుంది. లాక్షణికులు నిర్దేశించిన స్వరయతి నియమాలు ఇక్కడ కనిపించవు. ఈ పాటలోని తొలి రెండు పాదాల చివర ఉన్న దీర్ఘాలు పాటలో వచ్చినవని గుర్తించాలి. ఈ పాటను ఈ విధంగా రాసి చూడాలి -

ఊరుముందూ చేను విత్తబోకన్న – ఊళ్లోన వియ్యంబు చేయబోకన్న
ఊరుముందూ చేను పిల్లల్లపాలు – ఊళ్లోన వియ్యంబు కోపాలపాలు

ఇప్పుడు దీనిని జానపద తరువోజగా గుర్తించడం సులభం. శాసనాల లోనూ లక్షణ గ్రంథాలలోనూ ఉన్న తరువోజలో యథాతథంగా రెండు ద్విపద పాదాలను ఒకపాదంగా కూర్చి తయారుచేసినట్టు కనబడుతుంది. కాని పాదంలో మొదటి సగంలోనూ, రెండో సగంలోనూ కూడా యతులను పాటించడం లాక్షణికుల ఆదేశమైతే, జానపద ఛందస్సులో మొత్తం పాదంలో విరామమున్నచోటే యతిని పాటించడం నియమంగా కనబడుతున్నది.

ప్రాస తెలుగు కన్నడ భాషల్లో జానపద గేయాలలోనూ, కావ్యాలలోనూ బాగా వ్యాప్తిలో ఉన్న లక్షణం. జానపద గేయాలలోనూ ప్రాస కనిపిస్తుంది. ప్రాసయతిని కూడా జానపద గేయాలలో గమనించవచ్చు. ఉదాహరణకు -

అమ్మణ్ణి కన్నుల్లు - తమ్మిపువ్వుల్లు
తమ్మి పువ్వుల్లోన - కమ్మతేనెల్లు
చక్కన్ని నా తల్లి - గుక్కపట్టింది
చెక్కుటద్దాలలో - చెదరెనే సంజె
చల్లనీగాలి మా - చంటిపాపాయి
వొళ్లార్చి శ్రమదీర్చ - వోయి రవ్వంత
కిలకిలా నవ్వితే - కలువల్లు బూసె
కలువపువ్వాలేమొ - కలికి చూపుల్లు
వియ్యమందేనంట - వెయ్యారు లిచ్చి
మొయ్యగలవా చెప్పు - ముత్తవా తల్లి[6]

ఈ జానపదగేయంలో ప్రాసా, యతీ, ప్రాసయతీ అన్నీ చక్కగా రూపు గట్టుకొని కనిపిస్తున్నాయి. ఈ యతిప్రాసలతో చక్కని తూగుతో అందంగా సాగిపోతున్న ఈ గేయం ఛందోరీత్యా ద్విపద అవుతుందని చెబితే ఆశ్చర్యం కలగకతప్పదు. నిసర్గసుందరమ్మైన రచన ఇది.

యతిప్రాసలు గేయంలోని ఛందోవ్యవస్థను చెదిరిపోకుండా కాపాడ తాయి. అంటే లయను నిర్దేశిస్తాయి. గేయానికి లయ ప్రధానం. గేయం నుంచి ఉద్భవించిన పద్యజాతులకు కూడా లయ ప్రధానమే. పాటలోని లయను పట్టుకోవడానికి యతిప్రాసలు ఉపకరిస్తాయన్నమాట. తెలుగులో సహజంగా కనిపించే యతిప్రాసలను విడిచి పాట స్వరూపాన్ని నిర్ణయించే ఏ పద్ధతికీ సంపూర్ణత్వం సిద్ధించదు సరికదా తప్పుదోవను పెట్టే ప్రమాదముంది.

సాధారణంగా జానపద గేయాలను గాయకుడు పాడుతూండగా పరిశోధకుడు లిపిబద్ధం చెయ్యడంలో జరుగుతూన్న పొరబాట్లను సవరించి

చూసుకోవలసి ఉంది. దీనిని పండిత పరిష్కరణ మనిగాని లాక్షణిక రూపాల కు సన్నిహితంగా తీసుకురావడంగా గాని భావించడం తప్పు. జానపద గేయాల లోని ఛందోలక్షణాలను సరిగా గుర్తించడం ద్వారా జాతి యొక్క సహజ ప్రతిభను గుర్తించినవారమౌతామని మనవి. పై ఉదాహరణల ద్వారా ఈ మార్గంలో జరగవలసిన కృషి సూచితమైంది.

జానపద ఛందస్సులు ఎన్నో ఉన్నా లాక్షణికులు వాటిలో కొన్నిటినే స్వీకరించి నియమాలు ఏర్పరచి స్థిరం చెయ్యడం జరిగింది. వాటికి పేర్లు పెట్టడం జరిగింది. ఆ పరిధిలోకి రాని ఛందాలను సైతం మనం వర్గీకరించి ఏదో ఒక పద్ధతిలో పేరు పెట్టుకొని వ్యవహరించుకోవలసి ఉంది. నిజానికి జానపద ఛందస్సులకు పేర్లు పూర్వమే ఉండి ఉండాలి. సీస మన్నది లోహం కావచ్చు గాని ఆ లోహం పేరు పద్యానికి పెట్టారని అనలేము. ప్రగీతి, మేలనగీతి వంటి సంస్కృతనామాలకు మోజుపడే లక్షణవేత్తలు తేటగీతి వంటి పేరును ఎందుకెన్నుకున్నారు ? నిజానికివి రెండూ జానపద ఛందస్సుల పేర్లే అయి ఉండాలి. పేరు సంస్కృతంలో ఉన్నంత మాత్రాన ఆ ఛందస్సు జానపదం కాదని అనుకోవలసిన పనిలేదు. జానపద గేయాలలో సంస్కృత పదాలు ఎన్నో కనిపిస్తాయి. భాషల మధ్య పరస్పర సహకార సంపర్కాల వల్ల వచ్చిన లక్షణ మిది. విశాఖజిల్లా ఏజన్సీ ప్రాంతపు గిరిజనులు కొత్తగా తమ గ్రామాలకు వచ్చినవారికి మర్యాదలు చేసి పాట పాడతారు. ఆ పాటలను సగిడిపాట, సంగిడిపాట అని వాళ్లు వ్యవహరిస్తారు. రెండు జట్లుగా విడిపోయి బాలికలు సుదీర్ఘమైన ఈ పాటలను చెరో చరణంగా ఆలపిస్తారు. ఈ పాట ఏంపాట అని ప్రకృత రచయిత వారిని అడిగినప్పుడు వాళ్లు ఇది నేస్తంగట్టే పాట, జట్టుగట్టే పాట అని తెలుగులో జవాబిచ్చారు. కన్నడంలో సాంగత్యపద మన్న ఛందముంది. తెలుగులో కూడా ఈ ఛందానికి స్థాన మున్నట్టు మన్నారుదేవుడి 'హేమాబ్జనాయికా స్వయంవరం' యక్షగానంలో సాక్ష్యం లభిస్తున్నది.[7] కన్నడంలోని సాంగత్య పదం మన సీస పద్యానికి

దగ్గరగా ఉంటుంది. సగిడి, సంగిడి, సంగడి సాంగత్య పదాలకు స్నేహ మనే అర్థం. సగిడి పాటలూ, సాంగత్య పదాలూ ఒక పాదులోని మొలకలే అని భావించడంలో అసంగతమేమీ ఉండదు. అందువల్ల జానపద గేయాలలో ఉన్న మూలసూత్రాలను గుర్తించి తీరాలి.

గేయపు నడకను తకిట తకలతో కొలిచే సంప్రదాయ మొకటి ఉంది. కాని ఇందులో యతిప్రాసల స్థానాన్ని నిర్దేశించే పద్ధతి లేదు. యతి లేకుండా పాదాన్ని రెండుగా విభజించలేము. అదీకాక మూడావృత్తాలు, నాలుగు ఆవృత్తాలు అని చెప్పుకోవడంలో నిజానికి సౌలభ్యం లేదు. సరిగా పరిశీలిస్తే ఈ పద్ధతి ఏ విధంగానూ మాత్రాసంఖ్యా పద్ధతికి భిన్నం కాదు. ఉదాహరణకు పాదానికి 24 మాత్రలున్నాయని చెప్పినా, తకిట తకిట అని రెండు పాదాలకు ఎనిమిది ఆవృత్తములున్నాయని చెప్పినా ఆ గేయం నడకను గురించి చెప్పినట్లు కాదు. ఇది కేవలం యాంత్రిక పద్ధతి మాత్రమే. ఒక ఉదాహరణను చూడవలసి ఉంది –

శ్రీ వేటూరి ఆనందమూర్తి గారు కృష్ణమాచార్యుల రచనగా ఒక రచనను ఈ పద్ధతిలో విశ్లేషించి చూపారు[8] –

''మాత్రాచ్ఛందస్సు ననుసరించి రెండేసి పాదములకు

తకిట[1] తకిట తకిట[2] తకిట తకిట[3] తకిట తకిట[4] తకిట
తకిట[5] తకిట తకిట[6] తకిట తకిట[7] తకిట తకిట[8] తకిట

అని ఎనిమిది ఆవృత్తములున్నవి. ఇవి త్రిశ్రజాతి – ఆదితాళమున కొదుగు రచన''

అంటూ ఈ ఉదాహరణను ఇచ్చారు.

శ్రీకరంజ భూరుహాఖ్యఁ జెలఁగి వెలయు శ్రీనృసింహ
భీకరావతార ధీర పృథుల వక్షశ్రీనృసింహ

వేదరాశి తుదన వెలుగు విశ్వభర్త శ్రీనృసింహ
ఆదిదేవ నీచరిత్ర మద్భుతంబు శ్రీనృసింహ

శ్రీ ఆనందమూర్తి గారే దీనిని 'తురగ వల్గన జాతి రగడకు చెందినది' అని కూడా అన్నారు. తురగవల్గన రగడను పోలివుండి కొద్ది మార్పు లుంటే దానిని తురగవల్గన జాతి రగడగా పేర్కొనవచ్చు. ఇది ఆజాతి రగడకాదు సాక్షాత్తూ తురగవల్గన రగడ మాత్రమే !

తురగవల్గన రగడకు లక్షణాలు శ్రీ సంపత్కుమారాచార్యులు గారి మాటల్లో –

''హయ ప్రచార రగడకు రెట్టింపు 'తురగవల్గన రగడ'.
ఇందు పాదమున కెనిమిది త్రిమాత్రాగణములు
(లగము తప్ప) ఉండును. పంచమగణాద్య
క్షరము యతి చెల్లును. (ఆది) ప్రాసతో పాటు
అంత్యప్రాసయు నియతము''[9]

అన్నారు. మరి ఈ లక్షణాలన్నీ పైన ఉదాహృతమైన రచనకు పట్టి ఉన్నాయి కదా ! తకిట తకిటలతో కొలవడంకన్నా ఇది శ్రేష్ఠమైన పద్ధతి గదా !

ఇదే పద్ధతికి చెందిన జానపదగేయాన్ని గురించి ఆచార్య బిరుదురాజు రామరాజుగారు ఇలా అంటున్నారు –

''... మూడేసి మాత్రల చేరిక స్ఫురించినచో,
నద్దానిని 'తకిట' యను మూడక్షరములచే
సూచింతురు.

1 2 3 4 5 6 7 8
సువ్వి, రామ, చంద్ర, సువ్వి, సువ్వి, కీర్తి, సాంద్ర, సువ్వి,
9 10 11 12 13 14 15 16
సువ్వి, సీ, తమ్మ, మాకు, శుభము, లి, మ్మా *

అను కొట్నముల పాట మూడేసి మాత్రల యావృత్తములో నడుచు నట్టిది. అనగా తకిట, తకిట యని నడుచునన్నమాట. ... చరణము లందు చివరనున్న మూడావృత్తములందు సంగీతాక్షరములు (అనగా మాత్రలు) మూడేసి యున్నప్పటికిని (భాషాక్షరములు అనగా) సాహిత్యాక్షరములు మాత్రము రెండింటిలోనొక్కక్కటి యుండి మూడవదానిలో నేమియు లేకుండ బోయినవి. సాహిత్యాక్షరము లెట్లున్నను ఈ మూడు అవృత్తములను తొమ్మిది మాత్రల కాలము పాడితీరవలసిదే''.[10]

ఆచార్య రామరాజు గారు ఈ పాటలో మరికొంత భాగాన్ని తమ గ్రంథంలో[11] ఇచ్చారు. ఆ పాటలోని మిగిలిన పాదాలను వారు చూపినట్లుగా నింగడించలేము.

శ్రీ సంపత్‌కుమారాచార్యులు గారు ఇదే పాటను తమ తెలుగు ఛందో వికాసంలో[12] ఈ విధంగా ఇచ్చారు – దానిని వారు హయప్రచార రగడగా వర్గీకరించారు –

సువ్వి – సువ్వి – రామ – చంద్ర	3 + 3 + 3 + 3
సువ్వి – సువ్వి – కీర్తి – సాంద్ర	3 + 3 + 3 + 3
సువ్వి – సీ ఇ – తమ్మ – మాకు	3 + 2 1 + 3 + 3
శుభము – లిమ్మ – ఆ	3 + 3 + 2

ఇలాగ విభజించి చూపిన తర్వాత వారు ఇచ్చిన వివరణ ఇదీ –

''ఈ చివరి దానిలో మూడవ పాదమందు మూడు
మాత్రల గణమునకు బదులు 'సీ' అని రెండు
మాత్రలే ఉన్నవి కాని దాని ఉచ్చారణ త్రిమాత్రా
కాలమే. ఇట్టివానిని రగడభేదములుగా గ్రహింపవచ్చును.''

కాని వారు సూచించిన విధంగా ఈ గేయాన్ని హయప్రచార రగడగా భావిస్తే పైన ఉదాహృతమైన గేయఖండికలోని నాలుగోపాదంలో పన్నెండు

మాత్రల బదులు ఎనిమిది మాత్రలే ఉండి పాటలో నాలుగు మాత్రలు కలుపు కోవలసి ఉంది అని చెప్పుకోవలసి ఉంటుంది. మిగిలిన పాదాలలో ఎందు లోనూ రాగం కోసం నాలుగు మాత్రల కాలాన్ని కలుపుకోవలసిన అవసరం లేదు కదా. రాగ మన్నది పాటనంతనూ ఆహరించుకుని ఉన్నప్పుడు కేవలం చివరి పాదం దగ్గర మాత్రమే నాలుగు మాత్రలను కలుపుకోవలసి రావడం ఎందుచేత అవసరమౌతోంది ? ఛందాన్ని గుర్తించడంలో ఒక విధమైన అస్పష్టత ఏర్పడడంలేదా ? గాయకులు ఏ అక్షరాన్నన్నా దీర్ఘీకరించో హ్రాస్వపరిచో పాడుకోగలరు. గాయకుడు పాడుతూండగా పాటను లిపిబద్ధం చెయ్యడంలో జరిగే పొరబాట్లను సవరించి చూసుకోవలసిన అవసరం ఉంది.

అసలు ఈ గీతాన్ని, పాదాలలోని విరుపులకూ, అర్థానికీ తగు ప్రాధాన్యాన్నిచ్చి, ప్రాసకు అధికారాన్నిచ్చి పరిశీలిస్తే ఈ విధంగా రూపొందు తుంది.

సువ్వి, సువ్వి, రామ, చంద్ర
సువ్వి, సువ్వి, కీర్తి, సాంద్ర
సువ్వి, సీ *, తమ్మ, మాకు – శుభము లిమ్మా

మోద, మునను, పెండ్లి, పీట
మీద, శ్రీ *, రాము, సరస
నాది, లక్ష్మి, యైన సీ *, – తమ్మనునిచిరీ

వాట, మైన, కుంద, నంపు
మేటి, కుందె, నందు, నిల్పి
గాట, మైన, పసిడి రో * – కళ్లు పట్టుకా

ఇప్పుడిది భోగషట్పదరూపంలో ప్రత్యక్షమౌతున్నది. అయితే దీన్ని అర్థభోగషట్పదగా భావించవలసి ఉంటుంది. ఆరుపాదాల బదులు మూడేసి పాదాలు మాత్రమే ప్రాసతో సుఘటితమై కనిపిస్తున్నాయి. పెద్దదైన మూడవ

పాదంలో యతి చెల్లింపును సులభంగానే గుర్తించవచ్చు. కన్నడ భాషలో ఆరు పాదాల షట్పదలుండగా తెలుగులో మూడుపాదాల 'షట్పద' లుండడం విచిత్రంగా కనబడవచ్చుగానీ, నిజ మిది. భామినీ షట్పదికి అర్థ భాగంగా ఆధునిక పరిశోధకులు పేర్కొంటున్న 'గుమ్మడిపాట' కూడా మూడు పాదాల ఛందస్సుగానే దర్శన మిస్తోంది. గురజాడ 'ముత్యాల సరమ'దే కదా ! పైన చూపిన పాటలో నక్షత్రం గుర్తున్నచోట ఒక మాత్రను మాత్రమే అధికంగా పాటలో పాడుకోవాలి.

గేయ విశ్లేషణలలో గమనించవలసిన కొన్ని ముఖ్యాంశాలున్నాయి. గేయంలోని మాటల మధ్య విరామాన్ని మధ్య మధ్య పాటిస్తూ పాదం విరగ వలసిన చోట విరుగుతూ ఉంటేనే గానానుకూల మౌతుంది. పాదానికి ఇన్ని మాత్రలని అనుకొన్న తరువాత, పాదాంతాన కొన్ని మాత్రల కాలాన్ని అక్షర రహితంగా విడిచినంత మాత్రాన గేయం గానయోగ్యం కాదు. అంటే ఏ ఉత్పల మాలాఛందస్సునో, సీసపద్య ఛందస్సునో తీసుకొని చివరి గణాలను నింప కుండా ఉన్నంతమాత్రాన ఆ ఛందస్సులు గేయఛందస్సులై పోవు. సంగీతం కోసం జాగాలను పాట అంతటా సరిగా పంచుకుంటూ పోవాలి. దానికి నిజానికి ఛందస్సు అడ్డం రాదు.

సాధారణంగా గేయఛందస్సులను గురించి రాసిన పరిశోధకులెవరూ గుర్తించని విషయ మొకటుంది. సంకీర్తన లక్షణంలో –

మాత్ర యొకటి లఘువనఁదగు
మాత్రాద్వయమైన గురుసమాహ్వయమయ్యెన్
మాత్రాత్రయంబు ప్లుతంబగు
మాత్రార్థము ద్రుతము భరతమతముఁ జెలగున్

– సం. ల., 36 ప.

పద్యఛందస్సులలో ప్లుతమునకూ ద్రుతానికీ వినియోగం లేకుండా పోయింది. కాని గేయఛందస్సులలో వీటి వినియోగం అనివార్యం. పైన

పేర్కొన్న సువ్వి పాటలో శ్రీ *, సీ *, రో * అనే అక్షరాలు ప్లుతాలన్నమాట. వాటి విలువ వొక్కక్క దానికి మూడు లఘువులన్నమాట. అందువల్ల గేయ ఛందో విశ్లేషణలో వీటికి స్థాన మిచ్చితీరాలి. అయితే తెలుగు గేయాలలో మాత్రలో అర్థమైన ద్రుతానికి ఉదాహరణ కనిపించదు.

అసలు గీతానికీ, సంగీతంలోని రాగస్వరూపానికీ మధ్య అంతరం చాలా ఉంటుంది. సంగీత విద్యార్థులు మొదటగా నేర్చుకొనే పిళ్లారిగీతాలు శ్రీ పురందరదాస విరచితాలని సంప్రదాయం. చరణం తరువాత పల్లవి రావడం చూస్తే ఇవి ప్రాచీన రచనలుగానే కనిపిస్తున్నాయి. చరణం తరువాత పల్లవి రావడాన్ని గురించి ముందు ముందు చర్చించడం జరుగుతుంది. ఈ పిళ్లారి గీతాలలో 'కుందగౌర గౌరీవర' అన్న మలహరి రాగ కీర్తన ప్రసిద్ధమైనది. రూపక తాళానుగుణంగా సాగే ఈ గీతాన్ని విశ్లేషించి చూస్తే – ముఖ్యంగా గాయకులు పాడే తీరులో – గీతానికీ, మాత్రా సంఖ్యకూ, రాగానికీ మధ్య ఉండే పరస్పర సంబంధాలు దృగ్గోచరమౌతాయి. ముందు అసలు గేయపాఠాన్ని చూడాలి–

। చరణం । కుందగౌర / గౌరీవర / మందిరాయ / మానమకుట 6–6–6–6
। పల్లవి । మందార* / కుసుమాకర / మకరందం / వాసితువా 6–6–6–6
। చరణం । హేమకూట / సింహాసన / విరూపాక్ష / కరుణాకర 6–6–6–6
। పల్లవి । మందార* / కుసుమాకర / మకరందం / వాసితువా 6–6–6–6
। చరణం । చందమామ/మందాకిని/మందిరాయ/మానమకుట 6–6–6–6
। పల్లవి । మందార*/ కుసుమాకర / మకరందం / వాసితువా 6–6–6–6

ఈ గీతంలో ఒక్క పల్లవిలోని మొదటి గణం మందార * లో మాత్రమే ఒక మాత్ర తక్కువైంది. ఒక మాత్ర తక్కువ కావడం పూర్వోదాహృతమైన సువ్వి పాటలో కూడా గమనించడం జరిగింది కదా। ఈ పాటకు స్వరాలను వేసుకొన్నప్పుడు ఈ పద్ధతిలో సంగీత విద్యార్థులు రాసుకుంటారు స్వరాక్షరా లను వదిలి చూపడం జరుగుతోంది.

కుం-దగౌఉర / గౌఉ-రిఇవర / మం-దిరఅయ/మఅ-నమకుట
మం-దారా / కుసు-మఅకర / మక-రందం / వఅ-సితువా
హెవీ-మకుఉట / సిం-హఅసన / విరు-పఅఅక్ష / కరు-ణఅకర
చం-దమఅమ / మం-దఅకిని / మం-దిరఅయ / మఆ-నమకుట

పాడే విధానంలో వచ్చే మార్పులివి. పల్లవిలోని 'మందార', పాటలో 'మందారా' కావడం సహజమే. అంటే ఒకమాత్ర మాత్రమే ఎక్కువై ఆరుమాత్రల గణంగా సరిపోయింది. గీతానికి రాగానికీ ఎక్కడా వైరుధ్యం కనబడడం లేదు. ఈ పాటను పాడుతూండగా వింటూ ఉంటే ఈ విషయాన్ని మరింత స్పష్టంగా గుర్తించవచ్చు. అన్ని పాదాలలోనూ మాత్రలు సమానంగానే ఉన్నప్పటికీ అవి రాగానికి అడ్డం రావడం లేదు. ఎక్కడా అధికంగా మాత్రలు కలుపుకోవలసిన అవసరం కనబడటం లేదు. ఛందోరీత్యా కన్నడంలోని ఉత్సాహ రగళె జాతికి సంబంధించింది. మలహరి రాగం ప్రస్తుతపు వాడుక ప్రకారం కేవలం పిళ్లారి గీతాలలోనే కనిపిస్తున్నది. సంగీత పాండిత్య ప్రకర్ష ప్రకటించుకోవటానికి ఈ రాగం వీలివ్వదు. మలహరి రాగంకన్నా జానపదగేయాలలో కనిపించే రాగాలు క్లిష్టమైనవని భావించడం కుదరదు. ఈ కారణాలవల్ల రాగ పరిపూర్తి కోసం జానపదగేయాలలో పాదంలోని సాహిత్యంలో కొన్ని మాత్రలను కలుపుకొని పాడాలనడం సరికాదని చెప్పవలసి వస్తుంది. అందునా ముఖ్యంగా పాదాంతాన మరికొన్ని మాత్రలను చేర్చుకోవాలని అనడం కుదరదు. లఘువు, గురువు, ప్లుతం అన్నవాటిని పాటించి చూస్తే, గణాలలో వాటి స్థానాన్ని గుర్తిస్తే చాలు, ఏ గేయ ఛందస్సునైనా గుర్తించవచ్చు.

అయితే త్యాగరాజు కాలం నాటికి సంగీతస్వరూపమే మారిపోయింది. అప్పటికే తలెత్తి ఉన్న సంగీతపు సాముగరిడీలు తరువాతి కాలంలో అధికమై పోయి పల్లవిని గంటసేపు పాడగల వస్తాదుల యుగం ప్రారంభమైంది. ఛంద శ్శైథిల్యం ఈ కాలంలోనే ఎక్కువైంది. అన్నమయ నాటికి ఈ పరిస్థితిలేదు. నేటికీ జానపదగేయాలలో ఈ పరిస్థితి రాలేదు. ఈ విషయాన్ని గుర్తించక పోతే చిక్కులు తప్పవు.

పైన పేర్కొన్న పురందరదాసకృత పిళ్లారి గీతంలో కనిపించే నిరాడంబర మైన సంగీతం, త్యాగరాజు కాలం నాటికి పూర్తిగా సంక్లిష్టమైపోయి సాహిత్యాన్ని పూర్తిగా పలచన చేసేసి సంగీతసాహిత్యాల మధుర సమ్మేళనం పూర్తిగా ధ్వంసమై పోవడం జరిగింది. ఉదాహరణకు త్యాగరాజ రచితకృతి 'ఎంతని నేవర్ణింతును శబరీ భాగ్యమెంతని నేవర్ణింతును' సంగీతంలో ఎలా ఉంటుందో చూడవచ్చు.

ఇక్కడ కూడా స్వరాక్షరాలను వదిలి సాహిత్యరూపాన్నే చూపడం జరుగుతోంది.

'ఎం౦౦౦ – తానీ – నెఏఎ – ॥ ఎఎఎఎ – ఎఎఏ – వాఆ – ॥
ర్ణిం,, – తూనూ – శాబా – ॥ రీ,,, – భ అఅ అగ్య అ ॥
మెం౦౦౦ – తఅనీ – నెఎఎఎ – ॥ ఎఎఎఎ – ఎఎఏ – వా ఆ – ॥
... ... ,,[13]

ఇలాగ సాగిపోతుంది. ఇది పల్లవి మాత్రమే. సంగీతంలోని విరుపులతో గమకాలతో సాహిత్యానికి చిత్రవధ తప్పదు. అన్నమయ పదాలను ఈ విధంగా పాడడానికి వీలుండదని కొందరి బాధ. నిజానికి సంగీతానికి ఆలంబనగా సాహిత్యం ఉండనవసరం లేదు. పాశ్చాత్య సంగీతాన్నిందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు. కాని భారతీయ సంగీతంలో సంగీతం సాహిత్యం కలిసిమెలిసి ఉండవలసి ఉంటుంది. కాదంటే సరిగమపదనిస లనే ఆలాపించుకోవచ్చు గదా ! వాద్యాల మీద పలికించే సంగీతంలో సాహిత్యానికి అసలు చోటుండదు. అయినా శ్రోతలకు ఆనందం కలుగుతూనే ఉన్నది. అంటే అది శుద్ధనాద రచన మన్నమాట. అటువంటి సంగీతంలో శ్రోతకు సాహిత్యం అందకపోయినా ఇబ్బంది లేదు. నిజానికి గాయకుడు కూడా స్వరాక్షరాల సహాయంతో అలాగే పాడుకోవచ్చు. సాధారణంగా కచేరీలలో సంగీతజ్ఞులు ఆలాపనగా పాడుతూ ఉండడం విదితమైన సత్యమే.

కాని సంగీతమూ, సాహిత్యమూ కలగలిసిన భారతీయ రచనలలో రెండిటినీ సమానంగా మేళవించడంలోనే ఔచిత్యం ఉంటుంది. లేదా పాదాలు పూర్తి కాగానే స్వరాలు పాడుకునే పద్ధతైనా ఉండాలి. నేటి కర్ణాటక సంగీతంలో ఈ పద్ధతి లేకపోలేదు గాని ఈ అంశానికి అంత ప్రాముఖ్యత లేదు. అన్నమయ్య కాలంలో ఈ విపరీతపు పోకడలు లేనందువలన ఆయన రచనలో సాహిత్యపు విలువలకే ఎక్కువ స్థాన మున్నట్లు కనిపిస్తుందిగానీ, నిజానికి సంగీతానికి కూడా అంత ప్రాధాన్యాన్ని ఇచ్చే ఆయన రచనలను సాగించి ఉంటాడు. రాగాల పేర్లను పేర్కొనడమే అందుకు నిదర్శనం.

నృత్యాలలోనూ, యక్షగానాది రూపకాలలోనూ అన్నమయ నాటి సంగీతం ఇంకా నిలిచే ఉందని నా విశ్వాసం. నృత్యంలో సంగీతసాహిత్యాలు రెండూ గంగాయమునల లాగా జంటగా ప్రవహిస్తాయి. నృత్యాని కుద్దేశించిన గేయాలలో సంగీతానికి స్థానం లేదనడమెంత అసమంజసమో, అన్నమయ రచనలలో సంగీతానికి అంతగా అవకాశం లేదనడం అంతే అసంగతం. అందువల్ల అన్నమయ పాటలను పాడేటప్పుడు సంగీత సాహిత్యాలకు రెండిటికీ సమాన స్థానాలనివ్వాలి.

అన్నమయ రచనల గురించి సంగీతజ్ఞులూ, కానివారూ కూడా అభిప్రాయాలను వ్యక్తం చేసి ఉన్నారు. దాదాపు అందరూ కూడా అన్నమయ రచనలలోని ఛందస్సులను గుర్తించనివారే. రచనాస్వరూపాన్ని పూర్తిగా అవగాహన చేసుకోకుండా అన్నమయ రచనలకు సరైన సంగీతాన్ని సమకూర్చడం సాధ్యం కాదు. వేలసంఖ్యలో ఉన్న సంకీర్తనలన్నిటి ఛందస్సునూ గుర్తించి చూపడం ఒక వ్యక్తివల్ల అయ్యేపని కాదు. స్థాలీపులాకన్యాయంగా మాత్రమే విశ్లేషణను చేసి చూపడం జరుగుతోంది. ఈలోపుగా కొందరి అభిప్రాయాలను గమనించాలి. సంగీత సాహిత్య విషయాలలో కృషి చేసిన డాక్టర్ బాలంత్రపు రజనీకాంతరావు గారు –

"సాహిత్యపరులైన ఛందోగ్రంథకర్తలు లక్షణము చెప్పిన రగడలు, ద్విపదలు, షట్పదలు వంటి దేశిచ్ఛందో రీతులలోని మాత్రా గణముల లెక్కలతో కూర్పుతో అన్నమయ్య గేయముల ఛందో విశిష్టతను కొలవ యత్నించితే లాభము లేదు. తననాటికి ప్రచారములో నుండిన పామరజన వ్యహారములోని గేయ రీతులను, సాహిత్యపరుల ఛందోరీతులను మించిపోయి సాగినది, ఆయన గేయఫణితుల సృష్టి. పంక్తి యంతయు అక్షరములతో నిండిన రగడల కంటె – అన్నమయ గేయము లలోని గానానుకూలతయు శబ్దగుచ్ఛముల నడుమ రాగాను కూల విశ్రాంతులు తాళవములో ఉసిలో అందుకొను అందములూ అనేకము !"[14]

అన్నారు. నిజానికి రజనీకాంతరావు గారు కేవలం గాయకదృష్టితో చెప్పిన మాటలివి. లాక్షణికుల లెక్కలతో అన్నమయ్య గేయనిర్మాణాన్ని కొలువ లేవన్నమాటను అటుండనిస్తే, జానపదగేయాలలోని లెక్కలతో కొలవవచ్చుగదా ! సీసం రగడ షట్పది వంటి ఛందస్సులు జానపద సాహిత్యం లో కొల్లలుగా ఉన్నాయి. శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు –

'త్యాగరాజాదికృతులందు కానవచ్చు నాదవిస్తార సౌకర్యము ఈతని కీర్తన లందు కానరాదని సంగీత మర్మజ్ఞుల మాట. ఆయా కీర్తన లందు మాత్రలకు వలసినన్ని యక్షరములు కూరిపోసి నట్లుండుటచే, సంగీతజ్ఞుడు స్వతంత్రించి నాదవిస్తారము సంపాదించుకొనలేకపోవుచున్నాడు. కొన్ని పట్టుల కుదించియు కొన్ని పట్టుల విస్తరించియు పాడుకొను ధైర్యము మనకు కల్గినచో ఈ పాటలు కొంత సంగీతమునకు లొంగి పని చేయును. ఇంతమాత్రమున మనమన్నమయ్యకు చేసిన యపచారము లేదు. కాని సంగీతజ్ఞులకు కొంత అవకాశ మిచ్చిన

భాగ్యము మాత్రము మనకు దక్కును'[15]

అన్నారు. పైన ఉదాహరించిన రజనీకాంతరావు గారి భావాలకు శ్రీ గౌరిపెద్ది వారి భావాలు విరుద్ధంగా ఉన్నాయి. 'మాత్రలకు వలసినన్ని యక్షరములు కూరిపోసినట్లుండుట' అనడం తప్పు. లక్షణం ప్రకారం యతి దగ్గర విశ్రాంతిని కూడా పాటిస్తే పాడుకోవడానికి ఏ ఇబ్బందీ ఉండదు. ఇంక 'త్యాగరాజాది కృతులందు కానవచ్చు నాదవిస్తార సౌకర్యము' అన్నది ఇటీవలి కాలంలో సంగీతంలో వచ్చిన ఒక వికారం. '.... ఈ పాటలు కొంత సంగీతము నకు లొంగి పనిచేయు' ననడం కేవలం అన్యాయం. శ్రీ గౌరిపెద్ది వారు 'కొన్ని పట్టుల కుదించియు, కొన్ని పట్టుల విస్తరించియు' అనడంలో అర్థ మేమిటో బోధపడదు. పాదాలను కుదించడమూ, మాత్రలను తగ్గించడమా అన్నది వారు వివరించలేదు. ఏ విధంగా చేసినా అన్నమయ్యకు అపచారమే కాక విజ్ఞతకూ అపచారం కాగలదు. కేవలం సంగీతజ్ఞులైనా తమ రచనల ద్వారా సంగీతాన్ని గురించి చక్కగా విప్పిచెప్పిన విద్వాంసులు డాక్టర్ మంచాళ జగన్నాథరావు గారు –

> 'అన్నమయ్య వారి రచనల యందును అక్కడక్కడ నెరవులు, స్వరములు వేసుకొనుటకు చోట్లు దొరకకపోవు. త్యాగరాజ స్వామి వారి రచనలు నేడు మనకు దొరికినవి సుమారు 650 వరకు నున్నవి. వీటిలో మనకు ఈనాటి కళాకారులు వినిపించు చున్నవి సుమారు రెండువందలు మాత్రమే. అయ్యవారి రచన లలో గల దివ్యనామ సంకీర్తనలు, ఉత్సవ సంప్రదాయ కీర్తనలు, నౌకాచరిత్ర, ప్రహ్లాదభక్తి విజయము వంటి సంగీతరూపకముల యందలి కీర్తనలు మనకు అతి తక్కువగానే వినబడు చున్నవి. ఇందుకు కారణము ఈ రచనల యందు నెరవులు, స్వరములు మొదలగు సాముగరిడీలకు అంతగా తావులేకపోవుటయే. అట్లే భద్రగిరి రామదాసుల వారి రచనలు బొత్తిగా నేటి విద్వాంసులకు

పనికివచ్చుట లేదు...'[16]

అని అన్నారు. సాహిత్యంలో చిత్రకవిత్వం, గర్భకవిత్వం వంటివి వచ్చినా కవిత్వ రంగంలో అవి చెప్పుకోదగిన మన్ననలు పొందలేదు. కాని సంగీతంలో మాత్రం మంచాళ వారు పేర్కొన్న సాముగరిడీలు ఈనాటికీ చలామణీలో ఉన్నాయి. వాటిని విజ్ఞులే మెచ్చుకోవడం మరింత విచిత్రం. శ్రీ రాళ్ళపల్లి వారు –

'మొత్తముమీద తాళ్లపాక వారి రచనలు అర్థ భావ ప్రధానము లైనవి. త్యాగరాజదీక్షితాదుల వానివలె నాదరచనా ప్రధానములు కావు. కనుక గాయకులు ఆ దృష్టితో సాధించి పాడిరేని తప్పక సభ్యుల నాకర్షింపగలరని నా నమ్మిక'[17]

అన్నారు. అన్నమయ్య, ఆయన సంతతీ రచించిన సంకీర్తనలలో అద్భుతమైన కవిత్వం మనలను ఆశ్చర్యపరచినంతమాత్రాన అవి 'నాదరచనా ప్రధానములు కావు' అనుకోవడం సరికాదు. ఆ విషయాన్ని వదిలి శ్రీ రాళ్లపల్లి వారు వ్యక్తం చేసిన మరొక విషయాన్ని పరిశీలించవలసి ఉంది. ఆయన స్వర పరచిన పాటలకు ఉపోద్ఘాతం రాస్తూ –

'... ఈ పాటలను స్వరపఱుచుట యందు నా చేసిన పనియెల్ల నాకు తెలిసినంతలో ప్రాచీన పదకీర్తనల మెట్టులకే ఈ సంకీర్తన ముల సాహిత్యము నతికించుట. మరియు స్వతంత్రములుగా క్రొత్త వర్ణమెట్లు కల్పించు సాహసమునకు చేయి వేతమని చాపల్యము పుట్టినను, స్థిరమైన యతిప్రాసలు, దాని ననుసరించిన పదవాక్యభావముల విరుపులు–వీనిచే దృఢముగా నియమితమైన ఈ రచనలు ఆ స్వతంత్రమున కవకాశ మీయ లేదు'[18]

అన్నారు. ఇన్ని రకాల అభిప్రాయాలు అన్నమయ రచనలమీద వ్యక్తమైనా యంటే ఆశ్చర్యం కలగక మానదు. ఈ అభిప్రాయ భేదాలను పక్కకు పెట్టి

ఈ విషయంలో అన్నమయ్య అభిప్రాయా లేమిటో తెలుసుకోవలసి ఉంది. ముందుగా యతిప్రాసలను గురించి చూద్దాం -

పదము సంస్కృతమున బ్రాకృతమున దేశ
భాషనైనఁ బొసఁగ బలుకవలయుఁ
బ్రాసములును యతులుఁ బద్యభంగినె చెల్లు
ననిరి భరతదత్తిళాది మునులు — సం. ల., ప. 27

పాదములు నాలుగింటికి
నాదుల నడుముల సవర్ణమగునవి యతులా
పాద ద్వితీయ వర్ణము
పాదుగ నొక్కటియ చెల్లుఁ బ్రాసంబనగన్ — సం. ల., ప. 35

సంకీర్తనలక్షణంలోని ఈ రెండు పద్యాలలో యతిప్రాసలు పదాలలో ఉండి తీరాలన్న అన్నమయ అభిప్రాయాన్ని చినతిరుమలాచార్యులు అనువదించాడు. నిజానికి అన్నమయ చెప్పిన 'పద్యభంగి' తెలుగు పద్య భంగి మాత్రమే. నాట్యశాస్త్రంలో పధ్నాలుగో అధ్యాయంలో ఛందస్సు గురించి నిబద్ధపదము లక్షణంలో యతిప్రస్తావన ఉంది.[19] నిజమే కాని అది 'విరామం' అన్న అర్థంలోనే ప్రయుక్తమయింది. తెలుగులోలాగా సరూపాక్షర యతి కాదు. ప్రాసను గురించి భరతుడు ఎక్కడా చెప్పలేదు. దత్తిలుడు చెప్పి ఉంటాడను కోవడానికి వీలేలేదు. మరి 'అనిరి భరత దత్తిళాదిమునులు' అని అన్నమయ్య అబద్ధం చెప్పాడని అనుకోలేం గదా ! సంకీర్తన లక్షణగ్రంథం రేకుల మీది కెక్కేటప్పుడు పద్యాలు వరసచెడి కలగలిసిపోయాయని ఇదివరకే చెప్పడం జరిగింది. అన్నమయ సూత్రప్రాయంగా సంస్కృతంలో చెప్పిన విషయాలను అనువదిస్తూ భాష గురించీ పదం గురించీ ఒకే పద్యంలో చెప్పడంలో తడబడటం జరిగి ఉంటుంది. పైన ఉదాహరించిన రెండో పద్యం కేవలం తెలుగు సంప్రదాయాన్ని గురించే చెప్పింది. అందువల్ల ఈ పద్యాలలో చెప్పిన యతి ప్రాసలు తెలుగు పద్యం, జానపద గేయం ఆధారంగా అన్నమయ్య

ప్రసాదించిన లక్షణమని భావించక తప్పదు. యతిప్రాసలు ఛందస్సుకు స్థిర రూపాన్నివ్వడమే కాక పాట స్వరూపాన్ని కూడా నిర్దేశిస్తాయన్న సంగతిని గుర్తించాలి. ఈనాడు ప్రచారంలో ఉన్న కర్ణాటక సంగీత సాంప్రదాయాన్నను సరించేవాళ్లకు ఈ యతిప్రాసలు ఆటంకంగా పరిణమించాయి. అన్నమయ వాడిన కొన్ని రాగాల పేర్లు సైతం నేటి వారికపరిచితమే. అదీకాక తాళం ప్రసక్తి రేకుల్లో లేదు. నేటి సంగీతజ్ఞులకు పరిచితమైన రాగాలు సైతం రూపాన్ని మార్చుకుని పేరును మాత్రం మిగుల్చుకొన్నటువంటివి. అందువల్లనే రాళ్లపల్లి వారు 'క్రొత్తవర్ణమెట్లు కల్పించు సాహసమునకు చేయివేత మని చాపల్యము పుట్టినను, స్థిరమైన యతిప్రాసలు, దానిననుసరించిన పదవాక్య భావముల విరుపులు – వీనిచే దృఢముగా నియమితమైన ఈ రచనలు, ఆ స్వతంత్రమున కవకాశమీయ లేదు' అని సున్నితంగా విసుక్కున్నారు.

యతిప్రాసలన్న తరువాత ఛందస్సుండక తీరదు. ఛందస్సు విషయంలో కూడా అన్నమయ్యకు నిశ్చితాభిప్రాయాలే ఉన్నాయి. 'పదమార్గచ్ఛందో మూఢాత్ము'డి కవితనూ 'సంప్రదాయంబు నెరుగని జడుని కవిత'నూ నిరసించిన అన్నమయ్య –

అందములై షడ్వింశ
చ్ఛందోగణయుక్త వృత్తజాతుల పదముల్
కుందనమునకుం బరిమళ
మందిన క్రియ వృత్తపదము లలరుచునుండున్

– సం. ల., ప. 30

అని అన్నాడు. ఈ షడ్వింశచ్ఛందోరీతులు ఛందశ్శాస్త్రంతో పరిచయ మున్నవారందరికి విదితమే. ఈ ఇరవైయారు ఛందోభేదాలనూ ప్రస్తరిస్తే 13, 42, 17, 726 వృత్తాలు తయారవుతాయి.[20] ఏ భాషలోని ఏ ఛందస్సయినా ఈ పదమూడు కోట్ల నలభై రెండులక్షల పై చిలుకు వృత్తాలలో ఏదో ఒక వృత్తం కాకతప్పదు. వీటన్నింటికీ పేర్లు పెట్టడం కూడా దుస్సాధ్యమే. వేలకొద్దీ

ఉన్న అన్నమయ సంకీర్తనల్లో వీటిలోని ఏయే వృత్తాల ఛందస్సులనుపయో గించిందీ లెక్కకట్టడం సాధ్యంకాని విషయం. అయినా మనకు తెలిసిన పద్య ఛందస్సు లను కొన్నిటిని గుర్తించడానికి వీలున్నది. ఛందస్సును గుర్తించినా ఆ ఛందస్సు మనకు పరిచితంకాని ఛందస్సయితే పేరుపెట్టవలసి ఉంటుంది.

విశ్లేషణకు పూనుకొనేముందు అన్నమయ్య పదాలలో అనుసరించిన పద్ధతిని పరిశీలించవలసి ఉంది. ప్రతి పదానికీ పల్లవీ చరణాలూ అన్నవి నియతమ్మై కనిపిస్తాయి. సాధారణంగా పల్లవి రెండు పాదాలతో ఉన్నా, కొన్ని సంకీర్తనల్లో నాలుగు పాదాల వరకూ విస్తరించుకొని ఉండటాన్ని గమనించ వచ్చు. అయితే రెండు పాదాల పల్లవులే అధికసంఖ్యలో ఉపయుక్తమ్మైనాయి. చరణంలో సాధారణంగా నాలుగుపాదాలుంటాయి. అయితే ఇందుకు కూడా అపవాదులుగా నిలిచే సంకీర్తనలు లేకపోలేదు. రెండు పాదాల చరణాలు కూడా కనిపిస్తాయి. నాలుగుపాదాల చరణాలే అన్నమయ రచనలలో అధికంగా కానవస్తున్నాయి. పల్లవికీ చరణానికీ ఉండే సంబంధాన్ని నిర్ధారించు కోవడానికి కొన్ని ఉదాహరణలను చూడాలి -

1. 'అనుచు లోకములెల్లనదె జయవెట్టేరు
నినుఁగొల్చితిఁగావవే నీరజాక్షుఁడా ।పల్లవి।

అదివో కోనేటిలోన నిదివో సర్వతీర్థములు
అదివో పైఁడిమేడల హరినగరు
పొదలిపరుషలెల్లా పొదిగి సేవించేరు
యిదివో వరము లిచ్చె నిందిరానాథుడు[20] ।చరణం।

2. తెలియఁజెప్పితి మీకె తెరగెల్లా నీకు
తలఁపున బెట్టుకొని దయఁజూడు మికను ।పల్లవి।

నెలఁత వేగినంతాను నీతోడి కలలె కను
నలువంకా మరి సగినాలు చూచును

చెలుల నీవద్దకంపి చేరి సుద్దులడుగును
చెలియ భాగ్యము, నీచిత్తమికను[21] ।చరణం।

3. అది నేనెఱఁగనా అంతలో భ్రమతుఁగాక
మదనజనక నాకు మంచిబుద్ధి యియ్యవే ।పల్లవి।

యెంతలోకానుభవము అంతయు వృథానష్టి
కొంతయినా బ్రహ్మచింతకోటిలాభము
వింతైన జనులతోడి వినోదము నిష్ఫలము
చెంత సజ్జనసంగతి చేరిన యాదాయము[22] ।చరణం।

ఈ ఉదాహరణలలో పల్లవి మధ్యంతరంగా ప్రారంభమౌతున్నట్లు గుర్తించ వచ్చు. నేటి కర్ణాటక సంగీత సాంప్రదాయానుసారం పల్లవితో పాట నెత్తుబడి చేస్తే అర్థం చెడక తప్పదు. చరణం పాడి, తరువాతనే పల్లవిని పాడాలి. బహుశా పల్లవిలోని రెండోపాదం తారస్థాయిలో పాడాలేమో ! అలా కాకుండా పల్లవితో ప్రారంభిస్తే చరణంలో భావం ముగింపుకు రాదు. పై ఉదాహరణలలోని పదాన్ని ముందు చరణం, తరువాత పల్లవిగా రాసి చూస్తే అసలు పద్ధతి విశదం కాగలదు -

నెలఁత వేగినంతాను నీతోడి కలలె కను !
నలువంకా మరి సగినాలు చూచును !
చెలుల నీవద్దకంపి చేరి సుద్దు లడుగును !
చెలియ భాగ్యము, నీ చిత్తమికను

– తెలియఁజెప్పితి మీకె తెరగెల్లా నీకు
తలఁపున బెట్టుకొని దయఁజూడు మికను !

ఇప్పుడు అర్థం సుఘటిత మౌతోంది. ఇలాగకాక పల్లవితో ప్రారంభిస్తే, అదీ నేటి కర్ణాటక సంగీత పద్ధతిలో రెండుసార్లో, మూడుసార్లో పాడితే 'తెలియఁ జెప్పిన' విషయమేమిటో బోధపడక శ్రోతలు ఇబ్బంది పడవలసి వస్తుంది.

అన్నమయ్య పదాలకు స్వరకల్పన చేసిన కీ. శే. రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ గారూ, శ్రీ నేదునూరి కృష్ణమూర్తిగారూ, శ్రీ మంచాళ జగన్నాథరావు గారూ ఇంకా మరి ఒకరిద్దరూ మామూలు పద్ధతిలోనే అంటే పల్లవితో ఎత్తుబడి చేసే విధంగానే స్వరరచనను సాగించారు. అందుకు ఇబ్బందులులేని సంకీర్తనలనే వారెన్నుకొనడం జరిగింది.

అయితే రేకులలో పల్లవినే ముందు చెక్కి చరణాలను సంఖ్యలతో సూచిస్తూ చెక్కారు. ఇందుకు కారణం లేకపోలేదు. చరణం ముందు చెక్కి దానికి ఒకటి సంఖ్యను వేసిన తరువాత పల్లవిని చెక్కి పల్లవి అని సూచించి మళ్లీ రెండో చరణాన్ని చెక్కవలసిన ఇబ్బంది ఉంటుంది. చరణాలన్నీ చెక్కిన తరువాత ఆఖరుగా పల్లవిని చెక్కి ఉంటే ఈ సమస్య ఎదురయ్యేది కాదు. చెక్కినవారికా ఊహ తట్టనేలేదనుకోవాలి. శ్రీ అర్చకం ఉదయగిరి శ్రీనివాసా చార్యులు గారు –

> ''తంజావూరి సరస్వతీమహల్ లైబ్రరీలోని... వరుస నెం. 459, టి. నెం. 11657 గల 'పదములు కీర్తనలు' అను సంకలన గ్రంథమున 14 తాళ పత్రములలో తాళ్లపాక సంకీర్తనలు రాగతాళములతో గలవు. అవియు క్రమముగా ప్రకటింప బడును. ఇందుగల కీర్తనలన్నియు ఒక చరణమును ముందు పాడి తర్వాత పల్లవిని పాడి ఆ తర్వాత మిగిలిన చరణములను పాడునట్లు వ్రాసి యున్నవి. ఇది రేకులలోని అనుపూర్వికి భిన్నమైనది''.[23]

అని మంచి సమాచార మిచ్చారు. మొదట చరణం రాసి తరువాత పల్లవిని రాయడం, ఆ తరువాత వరుసగా చరణాలనే రాసుకుపోవడం జరిగి నప్పటికీ కొంతలో కొంత సరైన పద్ధతే. అయితే ప్రతి చరణం రాసిన తరువాత పల్లవిని రాయకపోతే పల్లవి చరణాలతో కలిసిపోయే ప్రమాదం ఏర్పడడానికి అవకాశం

ఉంది గాని, వాటిని వేరువేరుగా వింగడించడానికి ప్రాసను గుర్తించడం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చు.

ఇప్పుడు ఈ విషయంలో అన్నమయ అభిప్రాయ మేమిటో చూడాలి. సంకీర్తన లక్షణంలో –

పదముల యర్థముఁ బల్లవి
వదలక యన్నిటికి నేకవాక్యతఁ జేయన్
గుదిగ్రుచ్చినట్లు తగులై
పదము తుదిన్ మఱియు మఱియుఁ బల్లవి యలరున్

పదసమానమాన పాదయుగ్మము తుది
నలరి పల్లవాఖ్య నతిశయిల్లు
... ... – సం. ల., 39, 40 పు॥లు

అని అన్నమయ్య నిర్ద్వంద్వంగానే ప్రకటించాడు. అందువల్ల పల్లవిని చరణం తరువాతనే పాడుకోవాలి గనుక, అన్నమయ పదాలు అలాగే ఉన్నాయి గనుక చరణాన్ని మాత్రమే ముందుగా పరిగణనలోకి తీసుకోవాలి. పల్లవి దాదాపు అన్ని సంకీర్తనలలోనూ చరణంలో కనిపించే ఛందంతో దూరపు చుట్టరికంతోనే ఉంటుంది.

ఇక అన్నమయ పదాలలో కనిపించే సాధారణ లక్షణాలు ఇవీ –

1. చరణంలోని ప్రతిపాదమూ యతితో విభాగితమై రెండు ఖండాలుగా ఉంటుంది. అంటే రెండేసి భాగాలు కలిసి ఒక పాదమై, అలాంటివి నాలుగు పాదాలు కొన్నిచోట్ల రెండు పాదాలు కలిసి చరణం ఏర్పడుతుంది.
2. సాధారణంగా పాదంలోని మొదటి భాగంలో ఉన్నన్ని మాత్రలే పాదంలోని రెండోభాగంలో కూడా ఉంటాయి గాని, అవలంబించిన ఛందస్సువల్ల తేడాలు రావచ్చు.

3. అన్నమయ్య ఏ ఛందస్సును పదరచనకు వినియోగించినా, అందులో ఎన్ని పాదాలున్నా - అన్నిటినీ నాలుగుపాదాలు గానే సరిపుచ్చి నాలుగుపాదాలలోనూ యతులనూ ప్రాసలనూ చెల్లించడం చేశాడు. అందువల్ల ప్రాసలేని ఛందస్సులలో ప్రాస ఏర్పడడం, లేదా అసలు పద్య ఛందస్సులో ప్రాస ఒకచోట చెల్లవలసి ఉండగా పాట రూపంలోకి మారినప్పుడు మరొక చోట ప్రాస చెల్లడం జరుగుతుంది. రెండు పాదాలతో ఉండే ద్విపద, రగడ వంటి ఛందస్సులను స్వీకరించినప్పుడు ప్రాసతో బంధితమైన నాలుగు పాదాల ఛందస్సుగా అవతరించడం చూడవచ్చు.

4. సుప్రసిద్ధ పద్యఛందస్సులను స్వీకరించినప్పుడు అన్నమయ్య గణాలను గానానుకూలంగా మార్చి వాడుకున్నాడు. అటువంటి పరిస్థితిలో ఇంద్ర, చంద్ర, సూర్యగణాలన్న వర్గీకరణను వదిలి, జానపద మూలరూపాల్లో ఉండే పద్ధతినే అనుసరించడం చూడవచ్చు.

అన్నమయ రచనలలో కనిపించే గేయనిర్మాణ వైఖరిని సులభంగా అర్థం చేసుకొనేందుకై గేయాన్ని వివిధ భాగాలుగా విభజించుకొని ఆయా భాగాలకు పేర్లు పెట్టుకొని, పరిశీలించడానికి అనువుగా ఒక పద్ధతిని ఏర్పరచుకోవలసి ఉంది. అందుకోసమై దాదాపు 6,911 పదాలను నిర్మాణదృష్ట్యా పరిశీలించి రేఖా చిత్రరూపంగా, ఆయా భాగాల కిచ్చిన సాంకేతిక నామాలతో, చూపితే ఈ చిత్రం రూపొందింది.

చిత్రంలో చూపిన తొలి బేసిపాదం తొలి సగంలోని మాత్రలను గానీ, గణాలను గానీ లెక్కించి చూసుకొంటే తొలి బేసి పాదంలోని మలిసగంలో కూడా మాత్రాసంఖ్య గానీ, గణాలు గానీ అలాగే ఉంటాయని గమనించవచ్చు. తొలి సరిపాదంలోని తొలిసగంలోని మాత్రలు గానీ గణాలుగానీ తొలి బేసి

పాదంలోని తొలిసగంతో సమానంగా ఉంటాయి. అయితే తొలి సరిపాదంలోని మలిసగంలో సాధారణంగా ఎన్నుకొన్న ఛందస్సునుబట్టి మాత్రలు గానీ, గణాలు గానీ తక్కువ కావడమో, ఎక్కువ కావడమో లేదా సమానంగా ఉండడమో జరుగుతుంది.

తెలుగులోని జాతి, ఉపజాతి ఛందస్సులనే అన్నమయ అధికంగా తన రచనలలో వినియోగించాడు. ఇందుకు కారణాన్ని ఊహించడం సులభమే. జాత్యుపజాతి ఛందస్సులు నిజానికి జానపద గేయాల నుంచే లాక్షణికుల అభిమతానుసారం స్వీకృతమై పద్యరూపాలను పొందాయి. ఈ ఛందస్సుల మూలరూపాలైన జానపద గేయ రూపాలను గుర్తించి ఆయా ఛందస్సుల సహజ సుందర రూపాలను పునఃప్రతిష్ఠించడం అన్నమయ ప్రతిభకు నిదర్శనం. సంస్కృతఛందస్సుల నుంచి కూడా అన్నమయ కొంత స్వీకరించి ఉండవచ్చని అనుమానం కలగడం సహజమే అయినా, సంస్కృత వృత్తాల లోని గణాలను తన పద్ధతిలో మాత్రాగణాలుగా మార్చుకొన్నందువల్ల గుర్తించడం కష్టం.

ప్రస్తుతం ఇక్కడ ఇచ్చిన రేఖాచిత్రం ఆధారంగానే అన్నమయ పదాలను విశ్లేషించి చూసి, గుర్తించిన ఆయా ఛందస్సులను వివరణ పూర్వకంగా చూపుతున్నాను.

పద స్వరూపం



ఇటువంటి కొన్ని వృత్తాలు కలిస్తే ప్రబంధమవుతుంది. అదే సంకీర్తన, పదం, గీతం, కృతిగా, వ్యవహృతమవుతోంది.

అధోజ్ఞాపికలు

1. 'తేనెలపై తేట, తిన్నని చెఱకు
పానకముల నేరుపఱిచిన మేలు
చక్కెరలో తీపు చల్లఁదెమ్మెరలు
చిక్కని కపురంబు జీవరత్నములు
కలయమృతంబు మీఁగడమీఁది చవులు
చిలంకుచుఁ గవులెల్లఁ జేయెత్తి మ్రొక్క...'
అన్నమయ గానం చేసినట్టు చిన్నన్న వర్ణన. శ్రీ అన్నమాచార్యుల జీవితచరిత్రము, ద్విపద, పు. 33.
2. ఈ వాదనను శ్రీ వెల్చేరు నారాయణరావు గారు 'తెలుగులో కవితా విప్లవాల స్వరూపం' అన్న గ్రంథంలో మరొక రూపంలో ప్రతిపాదించారు. ఆయన 'ఆశుసాహిత్యమని' ఇచ్చిన ఉదాహరణలన్నీ నిజానికి నేడు పరిశోధకులు జానపద సాహిత్యంగా గుర్తించినవే. 'లిఖిత సాహిత్యంలో లాగ, ఆశుసాహిత్యంలో ఒక స్థిరమైన రచన అనేది ఉండదనీ, ఆశుకవి ఎన్నిసార్లు పాడితే అన్నీ అన్ని భిన్న రచనలనీ చాలామంది పరిశోధకులూ, పరిష్కర్తలూ గుర్తించినట్టు కనబడదు', పు. 27 - అని అంటారు వారు. వారికి జానపద సాహిత్యసేకరణలో గానీ, పరిశీలనలోగానీ, అనుభవం లేకపోవడం వల్ల కలిగిన భ్రమ యిది.
3. త్రివేణి - ఆంధ్రదేశ జానపదగేయములు - ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణ, 1960, పు. 193
4. జానపద సాహిత్యం, ఎల్లోరా, పు. 167
5. అదే, పు.
6. తెలుగు జానపద గేయసాహిత్యము - ఆచార్య బి. రామరాజు, పు. 474
7. యక్షగానములు - తంజావూరు, సంపుటం 1, పు. 122
8. తాళ్లపాక కవుల పదకవితలు - భాషాప్రయోగవిశేషాలు - డాక్టర్ వేటూరి ఆనందమూర్తి, పు. 31
9. ఛందఃపదకోశము - సంగ్రాహకుడు, శ్రీ కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు అకాడమీ ప్రచురణ, పు. 241
10. తెలుగు జానపద గేయసాహిత్యము - ఆచార్య బి. రామరాజు, పు. 813
11. అదే, పు. 479
12. తెలుగు ఛందోవికాసము - శ్రీ కోవెల సంపత్కుమారాచార్య, పు. 252

13. క్రొత్త సంగీతవిద్యాదర్పణము – శ్రీ ఏకా సుబ్బారావు, పు. 280
14. 'వాగ్గేయకారులలో అన్నమాచార్యుని స్థానము' – శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు, తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవ సంచిక, 1978 పు. 55
15. శృంగార సంకీర్తనలు – 12వ సంపుటం, పునర్ముద్రణ, శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారి పీఠిక, పు. 49
16. అన్నమాచార్యుల వారి అధ్యాత్మ శృంగార సంకీర్తనలు – స్వరసహితము, ప్రథమ సంపుటం, ప్రస్తావన శ్రీ మంచాళ జగన్నాథరావు గారు, పు. 38
17. తాళ్లపాక అన్నమయ్య పాటలు – స్వరపరచినవారు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ, శ్రీ నేదునూరి కృష్ణమూర్తి, 1976, ఉపోద్ఘాతము, పు. 17
18. అదే, పు. 16
19. నాట్యశాస్త్రము – శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు, పు. 396
20. అదే, పు. 406
20. (బి) అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 2, పునర్ముద్రణ, సంకీర్తన 111
21. శృంగార సంకీర్తనలు, సంపుటం 28, సంకీర్తన 530
22. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 2, పునర్ముద్రణ, సంకీర్తన 185
23. శృంగార సంకీర్తనలు, సంపుటం 15, పరిష్కర్త అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు, పీఠిక, పు. 5.

7. అన్నమయ పదనిర్మాణవైఖరి - 2

ఛందో విశ్లేషణ

అన్నమయ పదాలలోని ఛందో విశేషాలను చర్చించే ముందుగా ఒక ముఖ్యలక్షణాన్ని గుర్తించవలసి ఉంది. ఆయన రచనలకు జానపద గేయాలు ఉత్తేజాన్నిచ్చాయన్న సంగతి నిర్వివాదమైన విషయమే అయినా, తెలుగు కావ్యాలలో వికసిస్తూ వచ్చిన పద్య లక్షణాలు కూడా అంత గాఢంగానూ తమ ముద్రను వేశాయి. ఒక విధంగా అన్నమయ సంకీర్తనలలో అటు మార్గ సాహిత్యమూ ఇటు దేశీ సాహిత్యమూ కలిసి ప్రవహించడం కనిపిస్తుంది. గ్రాంథిక వ్యావహారిక భాషలు రెండూ కలగలిసిపోయిన పంచరంగుల కలనేత అని ఆయన రచనలతో ఏ మాత్రం పరిచయమున్న వారికైనా తెలిసే సత్యమే. పద్య సంప్రదాయం అన్నమయ సంకీర్తనలలో ఎంత బలీయంగా ఉన్నదో చూడండి -

'అడియాసలనె పక్వమైన సోయగపు
పెడ యలుకల మంచి వేఁడి వేఁడి రుచులు
ఎడసేసి తాలిమి నెడయించి పైపైనె
పొడమిన తమకంపు బోనము వెట్టినది

ఆ మంచి మధురంపు అధరామృతముల
వేమారుఁ దావులు చల్లు వెన్నెలబయటను
కోమలపుఁ దరితీపు కోరిక గుమ్మరించి
భామకు పూఁబానుపు పళ్లెము వెట్టినది

కన్నుల కాంక్ష లనెడి కళవళములు దీరె
సన్నపు నవ్వులనెడి చనవగ్గలించెను

అన్నువపు మరపు నీ కంత నింతఁ గలిగె, నేఁ
డిన్నియును దిరువేంకటేశుని మన్ననలు

వలపారగించవమ్మ వనిత – నీ
యలుక చిత్తమున కాఁకలిసేసినది'[1]

ఈ సంకీర్తనను జాగ్రత్తగా పరిశీలిస్తే తేలే విషయాలు ఇవీ – మొదటి రెండు చరణాలలోనూ, భావం నాలుగుపాదాల్లోనూ విస్తరించుకొని ఉంది. గానానుకూలంగా ఆ చరణాలలోని రెండోపాదం చివర విశ్రాంతి పాటిస్తే మిగిలిన రెండు పాదాలల్లోని అర్థం చెడుతుంది. ఇది నిరంతరాయంగా నాలుగు పాదాలా భావం నిండి ఉండే పద్యరచనా లక్షణమే. పై సంకీర్తనలోనే మూడవ చరణంలో ప్రతి రెండేసి పాదాలకూ భావం సమాప్తమై హాయిగా సాగడాన్ని గుర్తించవచ్చు. ఈ మూడో చరణంలోని పద్ధతినే అన్నమయ్య తన రచనలలో అధికంగా అనుసరించడం జరిగింది. మరొక ఉదాహరణ –

'నారీకటాక్ష పటు – నారాచ భయరహిత
శూరు లెఱుఁగుదురు నినుఁ – జూచేటి చూపు
ఘోర సంసార సం – కుల పరిచ్ఛేదులగు
ధీరు లెఱుఁగుదురు నీ – దివ్యవిగ్రహము

రాగభోగవిదూర – రంజితాత్ములు మహా
భాగు లెఱుఁగుదురు నినుఁ – బ్రణుతించు విధము
ఆగమోక్త ప్రకారాభిగమ్యులు మహా
యోగులెఱుఁగుదురు నీ – వుండేటి ఉనికి

పరమ భాగవత పద – పద్మసేవానిజా
భరణు లెఱుఁగుదురు నీ – పలికేటి పలుకు
పరఁగు నిత్యానంద – పరిపూర్ణమానస
స్థిరు లెఱుంగుదురు నిను – తిరువేంకటేశ

ఇతరులకు నిను - నెఱుఁగదరమా
సతత సత్యవ్రతులు - సంపూర్ణ మోహ విర
హితులెఱుంగుదురు నిను - నిందిరారమణా !'[2]

ఈ సంకీర్తనలో పల్లవిలో కూడా పద్యలక్షణ ప్రభావం కనిపిస్తోంది. బేసి పాదాలలోని దీర్ఘసమాసాలు పద్యం నడకని స్ఫురింపచెయ్యడమేకాక, పాదాంత విశ్రాంతిని కూడా పాటించకపోవడం అచ్చంగా పద్యలక్షణమే. అన్ని పాదాలకీ యతి దగ్గరా, పాదాంతానా విశ్రాంతిని పాటిస్తే అర్థం చెడుతుంది. పద్య రచయితలకుండే సమాసప్రీతి పదకవితామార్గ సార్వభౌముడిని కూడా లోబరుచుకుంది. సాధారణంగా పద్యాలలో - అందులోనూ వృత్తాలలో కనిపించే లక్షణం ఒకటుంది. భావం రెండు, రెండున్నర పాదాలకు మాత్రమే సరిపోయేదిగా ఉన్నప్పుడు, సుదీర్ఘమైన సమాసాలతో ప్రారంభించి భావాన్ని బరబరా లాక్కుపోయి అన్ని గణాలనూ నింపుకొంటూ పోయి నాలుగు పాదాలూ నిండగానే ఆగడం. పాటలకి ఈ లక్షణం అంతగా సరిపోదు. ఇలాంటి ధోరణికి ఉదాహరణగా ఈ సంకీర్తనను చూడవచ్చు -

'ఆదిదేవుని నభవుని సామ -
వేద నాద వినోదుని నెర -
వాది జితప్రియు నిర్మలతత్త్వ -
వాదుల జీవనమైనవాని

దేవదేవుఁడైన దివ్యుని సర్వ -
భావాతీత స్వభావుని
శ్రీవేంకటగిరిదేవుఁడైన పర -
దేవుని భూదేవతత్పరుని

కొలువుఁడీ భక్తిఁ గొండల కోనేటి
నిలయుని శ్రీనిధియైనవాని'[3]

ఇటువంటి సంకీర్తనలో యతి స్థానాన్ని గుర్తించడం కూడా కష్టం కావడమే కాక, పాదానికిన్ని మాత్రలనిగాని, గణాలనిగాని చెప్పుకోవడానికి కూడా వీలుకలగడం లేదు. సంకీర్తన లక్షణంలో -

'ఛందోగణముల నియతిం
బొందక తాళప్రమాణమునఁ గడుఁ జెలువై
కొందరిచేఁ దచ్చూర్ణం
బందముగా తాళగంధి యన బొగడొందున్'[4]

అని చెప్పిన తాళగంధి ఇదే కావచ్చు. కృష్ణమాచార్యుల రచన 'తాళ బంధచ్ఛందో విరహితమై' ఉంటుందని సంకీర్తన లక్షణం చెప్పే ఉన్నది కదా! అయితే అన్నమయ పదాలమీద పద్యరచన ప్రభావాన్ని చూపించేవిగా ఇటువంటి రచనలు మిగిలి ఉన్నాయి గాని, నిజానికి వేల సంకీర్తనలలో ఇటువంటి రచనలు చాలా తక్కువే ! తక్కువే అంటే ప్రతి వేయింటికీ ఏ రెండో మూడో ఇలాంటి రచనలు కనిపిస్తాయన్నమాట. గేయాలయినప్పటికీ కావ్యభాషలో, యతులూ ప్రాసలూ పాటిస్తూ వీటిని రచించిన అన్నమయ మీద పద్యరచనా సంప్రదాయం బలంగా కొంతకాలమైనా ప్రభుత్వం సాగించి ఉండాలి. అయితే ఇవి పాడడానికి ఇబ్బంది కలిగించే రచనలు కావు. ఇంత కన్నా బిగువుగా అల్లిన వృత్తపద్యాలనే, ఈ శతాబ్దం తొలిభాగాన వర్ధిల్లిన ప్రముఖ పౌరాణిక నాటక నటులు, వివిధ రాగాలలో పాడి దారి సుగమం చేశారు. అందువల్ల గాయకుడైన అన్నమయ ఏ విధంగా రచించినా గాన యోగ్యమయ్యే ఉంటుంది కదా !

పాటలనుంచే పద్యఛందస్సులు వచ్చాయన్న విషయం విజ్ఞులందరికీ తెలిసినదే. కాకపోతే లాక్షణికులు ఏ విధమైన పాటలను లక్షణబద్ధం చేసి పద్యాల ఛందస్సులుగా మార్చారో తెలుసుకోవడం ఇబ్బంది కలిగించవచ్చు. కాని అన్నమయ రచనలను పరిశీలిస్తే ఈ దిశలో మన కృషి వృధాకాదని తేలుతుంది. ఇంతకు పూర్వాధ్యాయంలో చూపిన పద్ధతిలో రచనలను

విశ్లేషించి చూస్తే వెలుగులోకి వచ్చిన విషయాలనిక్కడ ఇస్తున్నాను.

1. ద్విపద :

తెలుగులో గానయోగ్యమైనదీ, అతి ప్రాచీనమైనదీ అయిన ఈ ఛందస్సును మొదటిసారిగా పాల్కురికి సోమనాథుడు కావ్యరచనకు వినియోగించాడు. అన్నమయ ద్విపదలో రామాయణాన్ని రచించాడని తెలుస్తున్నదిగాని లభించడంలేదు. అయితే మంజరీద్విపదలో రచించిన శృంగారమంజరి మనకు లభించింది. పాటల్లో కూడా పట్టుబట్టి ప్రాసను వాడిన అన్నమయ మంజరీద్విపదను చేబట్టడం విచిత్రమే.

ఇప్పటివరకూ అన్నమయ పదాలను ఛందోరీత్యా పరిశీలించిన పరిశోధకులు పల్లవులను మాత్రమే విశ్లేషించి చూసి ఫలితాలను తకిట కిటతక పద్ధతిలో వివరించారు. అయితే ఈ పద్ధతిలో అసలు రూపాన్ని దర్శించడం కష్టం. ఇది ఎంత ప్రమాదకరమైన విధానమో చూడండి. ఒక పల్లవి –

'ఎండలోని నీడ ఈ మనసు
పండుగాయసేయఁ బనిలేదు మనసు'

ఇందులో మొదటిపాదాన్ని గణబద్ధంగా గాని, మాత్రాబద్ధంగా గాని విశ్లేషించి చూస్తే రెండోపాదాన్ని అందుకు అనుగుణంగా విశ్లేషించలేము. రెండోపాదం మాత్రం నిస్సందేహంగా ద్విపదగా సాక్షాత్కరిస్తుంది. అయితే అన్ని పాటలకూ పల్లవి ఇంత సులభంగా ఉంటుందని చెప్పడానికి వీలులేదు. అందువల్ల పల్లవిని వదలి చరణాలను మాత్రమే విశ్లేషించి చూడాలి. అలాగ చూసినప్పుడు ప్రత్యక్షమైన ద్విపదలను ఇక్కడ పరిశీలిద్దాం –

'వానచేతకముల వలెనాయ మనసు
గోనెబట్టిన బంక గుణమాయె మనసు
మానజిక్కిన కోల మతమాయె మనసు
తేనెలోపలి యీగ తెరగాయె మనసు

గడిరాజా బదుకాయ కడలేని మనసు
నడివీధి పెసరాయె నయమైన మనసు
గడకుఁ గట్టిన పాంతగతిఁదోచె మనసు
అడుసులోపలి కంబమైతోచె మనసు

తెరువు చూపిన జాడఁ దిరుగు నీమనసు
మరుగఁజేసిన చోట మరుగు నీమనసు
తిరువేంకటేశుపైఁ దిరమైన మనసు
సిరి గలిగినచోటఁ జేరు నీమనసు

ఎండలోని నీడ యీ మనసు
పండుఁగాయసేయఁ బనిలేదు మనసు'[5]

తెలుగులో ద్విపద రెండుపాదాల పద్యం. రెండు పాదాలకూ ప్రాసా యతీ నియతం. కాని అన్నమయ ప్రయోగంలో నాలుగు పాదాలు కలిసి ఒక చరణంగా రూపొందాయి. అంటే రెండు ద్విపదలకూ ఒకే ప్రాస చెల్లింది. అందువల్ల ఈ గేయఛందస్సు ద్విపద ఛందమే అయినా కూడా నూతన ప్రయోగంగా స్వీకరించవలసి ఉంటుంది. రెండు ద్విపదపాదాలు కలిసి ఏర్పడిన తరువోజగా భావించడానికి వీలులేదు.

చరణానికి నాలుగుపాదాలుగా ఉన్నా ఇది చౌపదకాదు; ఇందులోని ఇంద్రగణాలన్నీ చతుర్మాత్రాగణాలు కావు గనుక ! అలాగే అన్ని యింద్ర గణాలూ పంచమాత్రా గణాలు కావు కనుక ఇది కర్ణాట చతుష్పద కూడా కాదు. నాలుగేసి పాదాలకు ప్రాస చెల్లిన ద్విపదఛందమే ఈ గేయంలో ఉన్నది. అందువల్ల ఇది ద్విపద మాత్రమే. మరొక రచన –

'ధృతిదూలి జగమెల్లఁ దిరిగి వేసరితి
ఇతరాయముల కేగి యేగివేసరితి
గతిమాలి పరులపైఁ గనలివేసరితి
మతిమాలి కులవిద్య మాని వేసరితి

విసిగి యాచారంబు విడిచి వేసరితి
పసచెడి ప్రియములు పలికి వేసరితి
కొసరి ద్రవ్యంబుపైఁ గోరి వేసరితి
కసుగంది లోలోనె కాఁగి వేసరితి

కోవిదులగువారిఁ గొలిచి వేసరితి
దైవము లందరిఁ దగిలి వేసరితి
శ్రీ వేంకటేశుని సేవ మాని వట్టి
సేవలన్నియును నేఁజేసి వేసరితి

పాపినైన నాపాలగలిగి త్రోవ
చూపుమన్న నెందుఁజూపరు'[6]

ఈ గేయంలో పాఠాంతరాలు కనిపిస్తున్నాయి. గౌరిపెద్ది వారి పరిష్కరణలో[7] మొదటి చరణంలోని రెండోపాదంలో 'ఇతరాలయముల' అని కనిపిస్తున్నది. ఛందోరీత్యానేకాక అర్థం రీత్యా చూసినా కూడా 'ఇతరాలయ ముల' అన్న పాఠం సరికాదనిపిస్తున్నది. అలాగే రెండో చరణంలోని మూడో పాదంలో 'కొసరి ద్రవ్యంబుపై' అన్న పాఠానికి బదులు 'కొసరి ద్రవ్యముపై' అన్న పాఠం గౌరిపెద్ది వారి పరిష్కరణలో ఉంది. ఇది ఛందోరీత్యా కుదరదు. ఇక శ్రీ రాళ్లపల్లి వారిచ్చిన పాఠంలో[8] మొదటి చరణంలోని మొదటి పాదంలో 'ఇతరాయముల కేగి వేసరితి' అని ఉంది. ఇది ఛందోరీత్యా సరిపడదు. అసలు రేకులోని పాఠమేదో మరి !

ద్విపద నడక చక్కగా సాగింది ఈ రచనలో. అన్నమయ అంతర్వేదన కూడా చక్కగా ప్రతిఫలించిన గేయమిది. అయితే మూడోచరణంలోని మూడో పాదంలో ఒక అక్షరం ఎక్కువైంది. 'వట్టి' అన్న పదంలోని 'ట్టి'ని గాయక దృష్టితో తేల్చి పలికితే సరిపోతుంది. ఇలాగ కొన్ని అక్షరాలు ఎక్కువ కావడం జానపద ద్విపదలలో ఎక్కువగా చూడవచ్చు. ఇంతకుముందు ఇచ్చిన విశ్లేషణ

ప్రకారం చూస్తే చరణాలలోని అన్ని పాదాలలోనూ మాత్రలు 10–8గా విరగ వలసి ఉంటుంది. కాని రెండో చరణంలో తొలి బేసిపాదంలోనూ, తొలి సరిపాదంలోనూ వరుసగా 9–8 మాత్రలుగా, 8–8 మాత్రలుగా విరిగి ఉన్నాయి. అంటే రెండు పాదాలలోనూ మాత్రలు, కేవలం మాత్రాదృష్టితో చూస్తే తక్కువైనాయి. గణాల దృష్ట్యా చూస్తే ఛందస్సు ద్విపదగా ప్రత్యక్ష మౌతుంది. అందువల్ల ఈ రచనను ద్విపదగానే గుర్తించాలి. పంచమాత్రా గణాలు, చతుర్మాత్రాగణాలు కలబోసి రచించిన రచన మిది.

౨. కర్ణాటచతుష్పద :

కర్ణాట చతుష్పదకు ప్రతి పాదంలోనూ మూడు పంచమాత్రా గణాలు ఒక త్రిమాత్రాగణమూ ఉంటాయి. నాలుగు పాదాలున్న పద్యంలో జల, యగణాలు నిషిద్ధాలు. ఈ లక్షణాలున్న అన్నమయ రచన మిదీ –

'దొరతనము లన్నియును దొరసినందాఁక
నెరతనము లన్నియును నెరపినందాఁక
గరగరిక లన్నియును కలసినందాఁక
విరసంబు లన్నియును విసుగునందాఁక

యెడమాట లన్నియును యెనసినందాఁక
అడియాస కోరికలు అదుకునందాఁక
జడిగొన్న గుక్కిళ్లు చవిగొన్నదాఁక
వొడలోముటలు మోహముడుగునందాఁక

యీవెల్లఁ దమయాత్మ యిచ్చగించినదాఁక
శ్రీవేంకటేశు కృప చేరునందాఁక
లోపెలుతు లన్నియును లోఁగొన్నదాఁక
వేవేగ బంధములు వీడునందాఁక

కాక మరి యింతేల కలుగుఁ దమకే తమకు
చేకొన్న కోరికలు చేరునందాఁక'[9]

ఈ పాట ముద్రణంలో రెండో చరణం మూడోపాదంలో 'చవిగొన్న యందాఁక' అని ఉన్నది. అలాగే మూడోచరణం మూడోపాదంలో 'లోఁగొన్న యందాఁక' అని ఉన్నది. మొత్తం పాటనంతటినీ దృష్టిలో పెట్టుకుని చూస్తే ఇవి రెండూ సరియైన పాఠాలు కావేమో ననిపించకతప్పదు. అదీగాక 'చవి గొన్నదాఁక' 'లోఁగొన్నదాఁక' అని సవరిస్తే తాళం చెడదు కూడా. అయితే మూడో చరణం మొదటిపాదంలో 'యిచ్చగించిన' అని ఏడు మాత్రల గణం ఎదురౌతున్నది. పాడేటప్పుడు రెండు మాత్రలు – 'చిన' తేలిపోతాయి. ఏది ఏమయినా ఈ పాటకు మరొక ప్రతి లభిస్తేనే కాని తుదితీర్పు నివ్వడం కుదరదు.

నిజానికి కర్ణాట చతుష్పద నాలుగుపాదాలూ, ప్రాస ఉన్న ఛందమే కాని, ద్విపదకు పాదాల విషయంలో మినహా భిన్నమైనది కాదు. ద్విపదలో ఐదు మాత్రల గణాలను వాడవచ్చు కదా! అందువల్ల ఈ ఛందాన్ని ద్విపద నుంచి ఉద్భవించిన ఛందంగానే గుర్తించాలి. ఇటువంటి ఛందం కన్నడంలో ఒకటి కనిపిస్తున్నది.

'ఆశ్వయుజ శుద్ధమానవమి బలెందు
శాశ్వతది హరసిదెవు బాలకరు బందు
ఈ శనిమగత్యధిక సుఖవ కొడలెందు
లేసాగి హరసిదెవు బాలకరు బందు'[10]

ఇందులో లాగే అన్నమయ రచనలో అంత్యప్రాస కూడా ఉంది. అయితే శ్రీ డి. ఎస్. కర్కిగారు కన్నడంలోని 'ఛందోవతంస' అన్న ఛందమే ఈ విధంగా మార్పు చెందిందని భావించారు.[11] ఇందుకు మాధ్యమిక యుగంలోని కీర్తనల రచనను కారణంగా వారు గుర్తించారు. కాని తెలుగు ద్విపదే ఈ ఛందానికి మూలమని భావించడమే సహేతుకం. రెండు ద్విపద పాదాలను రెట్టిస్తే తరువోజ అవుతుందని తెలిసిన విషయమే. అయితే ద్విపద పాదాల సంఖ్యను నాలుగుకు పెంచి ప్రాస పాటిస్తే మరొక ఛందస్సు ఏర్పడదా! అలాగ ఏర్పడినదే

ఈ ఛందమని భావించవచ్చు. ద్విపదకూ కర్ణాట చతుష్పదకీ ఉన్న తేడా చాలా స్వల్పమయినది. అదీగాక శ్రీ డి. ఎస్. కర్కిగారు తమ కన్నడ ఛందోవికాస గ్రంథంలో 'ఛందోవతంస' ఛందస్సు నుంచి ఏర్పడిన ఒక రూపానికి ఉదాహరణగా ఒక పురందరదాసు కీర్తన నుదాహరించారు –

'కెందళిర నఖశశి బింబపద పద్మ
అందుగె యిట్టివన్యారి పేళమ్మ
అందుకాళింగన పెడెయొళు తుళిద
నందన కందము కుందకాణమ్మ'[12]

కన్నడ సంప్రదాయం ప్రకారం మూడు విష్ణుగణాలూ, ఒక బ్రహ్మ గణమూ చొప్పున సాగవలసిన రచనలో 'కెందళిర', 'బింబపద' అన్న రెండు రుద్రగణాలు – అంటే తెలుగు సంప్రదాయానుసారం భలము – పడినై. అయితే నడక మాత్రం తెలుగు ద్విపద మాదిరిగానే సాగింది. మొదటిపాదం తప్పించి మిగిలిన మూడు పాదాలూ అచ్చంగా ద్విపద ఛందంలోనే ఉన్నాయన్నమాట. చంద్రగణమైన భలం కాకపోయినా, ఇంద్రగణాలలో ఐదుమాత్రలున్న రగణం, నగం, తగణం, సలం ద్విపదలో వాడుకోవచ్చు గదా !

ఏది ఏమయినా అన్నమయ పై రచనను కర్ణాట చతుష్పదగా గుర్తించ డంలో ఇబ్బంది ఉండదు.

3. సీసపద్యం :

తెలుగు సీసపద్యంలో ఒక్కొక్క పాదాన్ని రెండు భాగాలుగా విభజించి చూడడం ఈనాడు సామాన్యమైనా నిజానికి ముద్రణ ప్రారంభమైన తరువాతనే ఈ సంప్రదాయం ఏర్పడింది. అన్నమయ తనదైన శైలిలో ఇలాగ ఒక పాదాన్ని రెండు పాదాలుగా విభజించడమేకాక, అలాగ ఏర్పడిన నాలుగు పాదాలకూ ప్రాస చెల్లించి రచన సాగించాడు. సీసపద్యం కూడా జానపద గేయాల నుంచి ఉద్భవించిన ఛందమే కదా ! అన్నమయ్య రచనమిదీ –

'బిరుసైన దొక కొండ పెనుబాముతో జుట్టి
బిరబిర నేత్రిప్పె పిన్నవాడు
గురుతైన దొక కొండ గొడుగుగా నొకచేత
పెరికి పట్టేవాడు పిన్నవాడు
బెడిదంపు శిశుపాలు పెనుమోతతో గూడ
పెడచేత నేవేసె పిన్నవాడు
పడవేసి చాణూరు బట్టి యురము దొక్కి
పిడికిటనే చంపె పిన్నవాడు
ఎక్కడ జూచిన నింతట దానై
పెక్కు రూపములైన పిన్నవాడు
ఇక్కడ తిరువేంకటేశుడై జగమెల్ల
పిక్కటిల్లినవాడు పిన్నవాడు

బొడ్డుతామెరలోన గడ్డివయసు పెద్ద
బిడ్డఁగన్నట్టివాఁడు పిన్నవాడు'[13]

తెలుగులో సర్వప్రాస సీసం వంటి భేదాలున్నాయి గాని అవేవీ ఈ సంకీర్తనకు అన్వయించవు. సంకీర్తనలోని మూడు చరణాలకూ మూడు ప్రాసాక్షరాలను వాడటం జరిగింది. అన్నమయ సంకీర్తన శైలిలో ఇది అనివార్యం. అసలు సీసానికి నాలుగుపాదాలుండాలి గాని మొత్తం సంకీర్తనను చూస్తే ఆరు సీసపద్యపాదాలున్నాయి. ఎత్తుగీతి ఇక్కడ ఉండటానికి వీలేలేదు.

4. జానపద సీసం :

తెలుగు లాక్షణికుల ఆదేశాలకు విరుద్ధంగా కనిపించే కొన్ని సంకీర్తనలు, సీసపద్యాలను పోలినవి అన్నమయ రచనలలో కనిపిస్తున్నాయి. ఈ తరహా ఛందస్సును, జానపద సీసఛందస్సుతో ఉన్న సారూప్యాన్ని బట్టి, జానపద సీసంగా పరిగణించి పరిశీలించడం అవశ్యకమౌతున్నది. ముందుగా అన్నమయ రచన –

'అలరఁ జంచలమైన ఆత్మలందుండనీ
యలవాటు సేసె నీవుయ్యాలా
పలుమారు నుచ్ఛ్వాస పవనమం దుండనీ
భావంబు దెలిపె నీవుయ్యాలా ।పల్లవి।

ఉదయాస్త శైలంబు లొనరఁ గంభములైన
వుడుమండలము మోచె నుయ్యాలా
అదన నాకాశ పదమడ్డ దూలంబైన
అఖిలంబు నిండెనీవుయ్యాలా
పదిలముగ వేదములు బంగారుచేరులై
పట్టవెరపై తోఁచె నుయ్యాలా
వదలకిటు ధర్మదేవత పీఠమై మిగుల
వర్ణింప నరుదాయ నుయ్యాలా

మేలుకట్టయి మీకు మేఘమండలమెల్ల
మెఱుఁగునకు మెఱుఁగాయ నుయ్యాలా
నీలశైలము వంటి నీమేనికాంతికిని
నిజమైన తొడవాయ నుయ్యాలా
పాలిండ్లు గదలఁగా బయ్యదలు రాఁపాడ
భామినులు వడినూఁచు నుయ్యాలా
వోలి బ్రహ్మాండములు వొరగునోయని భీతి
నొయ్య నొయ్యన వూఁచిరుయ్యాలా

కమలకును భూసతికి కదలు కదలుకు మిమ్ముఁ
గౌఁగలింపఁగఁజేసె నుయ్యాలా
అమరాంగనలకు నీహావభావవిలాస
మందంద చూపెనీవుయ్యాలా
కమలాసనాదులకుఁ గన్నులకు పండుగై

గణుతింప నరుదాయ నుయ్యాలా
కమనీయ మూర్తి వేకంటశైలపతి నీకు
కడువేడుకై వుండె నుయ్యాలా'[14]

ఈ గేయం పంచమాత్రా గణాలతోనూ పాదం చివర ఆరుమాత్రల గణంలోనూ నడిచిన రచన. పంచమాత్రాగణాలతో నడిచే సీసం శ్రవణా నందకరంగా సాగుతుంది. కవిసార్వభౌముడు శ్రీనాథుడి సీసపద్యాలన్నీ పంచ మాత్రాగణాలతో ఉంటాయని ఆచార్య శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి గారు ప్రసంగ వశాన తెలియజేశారు. శ్రీనాథుని సీసపద్యాల సొగసును గురించి విజ్ఞాలకు వేరుగా చెప్పనక్కరలేదు.

అయితే అన్నమయ పంచమాత్రాగణాలు వాడటం నిజమే కాని, ఆ గణాలలో కొన్నిరకాలను లాక్షణికులు ఆమోదించరు. తెలుగు సంప్రదాయాను సారం ఇంద్రగణాలలో రగణం, నగం, తగణం, సలం మాత్రమే పంచమాత్రా గణాలు. సీసపద్యంలో చంద్రగణాలు నిషిద్ధం. అయితే అన్నమయ నిరంకు శంగా చంద్రగణాలైన నలలము పై సంకీర్తనలో మూడుసార్లు – పదిలముగ, పదల కిటు, కమలకును, కదలుకద – వినియోగించాడు. అంతేకాక రెండు సూర్యగణాల బదులు ఆరుమాత్రల 'ఉయ్యాలా' అన్న పదాన్ని వాడాడు. ఈ సంకీర్తన రేకులోని పాఠం ప్రకారం 'ఉయ్యాలా' అని ఉండగా, పరిష్కర్త లైన శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు దానిని 'ఉయ్యాల'గా దిద్దారు.[15] ఇది తప్పు.

అయితే కొన్ని రకాల సీసపద్యాలు, సామాన్యలక్షణాల నుల్లంఘించే వాటిని – అంటే అయిదుమాత్రల నలల గణాలను మాత్రమే వాడుతూ సర్వ లఘుసీసపద్యాలను కొందరు కవులు రచించారు. సూర్యగణాలకు కేవలం నగణము మాత్రమే వినియోగించారు. ఇందుకుదాహరణగా ఈ పద్యాన్ని చూడవచ్చు – ఎత్తుగీతిని వదిలి చూపుతున్నాను.

'తరుణ శశిభరణ సువితరణ భయహరణ కర
యరుణ సరసిరుహనిభ చరణయుగళ
మదన మద మథన ఘన కదన తల విజయ గిరి
వదన జగదవనకరి వదన జనక
వనజభవ దమన పురదనుజకుల శమనముని
మనుజ సురవరద ప్రతిదిన విలసిత
బహుళతర విభవ రిపుదహన దవదహన పటు
విహగపతి గమన నుతమహిత చరిత
... ...'[16]

అయిదు మాత్రల చంద్రగణం నలలగణంతో పద్యాన్ని నింపడం కనిపిస్తుందే తప్ప నిజానికి పద్యమంతా రోకటిపాటగా పరిణమించింది. చదవడంలోగానీ, వినడంలోగానీ ఈ పద్యం సుఖాన్నివ్వదు. అన్నమయ తొక్కిన మార్గం ఇది కాదు. అన్నమయ్య నలలగణాన్ని అవసరమైనపుడే వినియోగించాడు. అన్నమయ అనుసరించిన మార్గమే సరైనది. ఈ సందర్భంగా కన్నడభాషలోని సీసపద్యాలను పరిశీలించవలసి ఉంది. కన్నడంలో సీసపద్యాల వాడకం తక్కువ. నాగవర్మ ఛందోంబుధిలోని లక్ష్యపద్యంగా డాక్టర్ డి. ఎస్. కర్కిగారు ఉదాహరించిన పద్యాన్ని పరిశీలించాలి –

'తింగళం తళెదిత్త రంగమంగళకర్త
తుంగ సూర్యభర్త తమసనాశ
మంగళం మనవాంత మధురతా కరుణాత్మ
భంగనిగ్రహపాత భీతిహరణ
సంగీత రసలోల సాహిత్యదానంద
పాంగువర్కగెపోలిపమల కిరణ
కంగుళం ముగియద కరంగుళం బిగువిడద
పింగదె సహాయమం పడిపశరణ'[17]

ఈ కన్నడసీసంలో నాలుగుపాదాలలోనూ పాదానికి రెండుసార్లు ప్రాస చెల్లించడం జరిగింది. ఆఖరిపాదంలో రెండు నలలగణాలూ, రెండు లఘులు కలిసిన గణమొకటీ – 'సహాయమం' – పడ్డాయి. పైన ఉదాహృతమైన అన్నమయ రచనలో కూడా నలలం దర్శనమిస్తోంది. కన్నడ రచనకూ అన్నమయ రచనకూ పోలికలున్నాయి. అయితే కన్నడ సీసంలో పాదానికి రెండుసార్లు ప్రాస చెల్లించినట్టు అన్నమయ రచనలో చెల్లించలేదు గాని, అసలు సీసపద్యఛందస్సులో రచించిన అన్నమయ రచనలో పాదానికి రెండుసార్లు ప్రాస చెల్లించిన విషయం పూర్వోక్తమే. అయితే అన్నమయ రచనలోని ఛందస్సుకు స్ఫూర్తి యెక్కడనుంచి వచ్చిందన్న ప్రశ్న మన కెదురౌతుంది. కన్నడ సీసపద్యంలో మిగిలిన లక్షణాల నన్నిటినీ అలా ఉంచగా కొట్టవచ్చినట్టు కనబడే మరోరెండు లక్షణాలను గమనించాలి. మొదటి లక్షణం కన్నడ సీసంలో ఎత్తుగీతి లేకపోవడం. రెండో లక్షణం తెలుగులో పాటించే యతిని దాదాపు పోలి ఉండిన యతీ, ప్రాసయతీ ఉండటం. అంటే యతి విషయంలో అచ్చంగా తెలుగు యతి నియమాలను పాటించడం జరగకపోయినా అటువంటి యతిని వాడటం జరిగింది. అంటే కన్నడ పద్యంలో కనిపిస్తూన్న యతి తెలుగు పద్యాలలో కనిపించే యతి వల్ల ప్రభావితమైనట్లు భావించక తప్పని పరిస్థితి ఎదురవుతున్నది. అంటే సీసపద్యం తెలుగునుంచే కన్నడానికి ప్రయాణించిందన్న తీర్మానానికి రాకతప్పదు. ఇందుకు అన్నమయ రచనలే దోహదం చేస్తున్నాయి. అన్నమయ సీసపద్య ఛందానికి మూలాన్ని తెలుగు జానపదగేయాలలో చూడవచ్చు. ఒక ఉదాహరణ –

'ఆరాజు మతిలోను – ఆనందమున పొంగి
　　అరిగింది అరిగె నట – దూరమ్మునా
మేరుదరిజేరి యో సారమది యెట్టిదో
　　దూరమ్ము పొడగాంచి – పరమేశుడూ

చారుతరమ్మైనట్టి చిగురాకులు పువ్వులు
దారుకావన కనకగిరి దాపునా
చేరి యాదరికింద నిలచి చిత్తామందు
కోరి పురుషోత్తముని కొలువదలచీ'[18]

ఈ జానపదసీసంలో అన్నీ పంచమాత్రాగణాలూ, పాదం చివర సూర్య గణాల స్థానే ఏడుమాత్రల గణమొకటీ ఉన్నాయి. పాదానికి రెండుసార్లు ప్రాసను పాటించడం జరిగింది. యతినో ప్రాసయతినో పాటించడం చూడవచ్చు. పాదాంతాన దీర్ఘాక్షరం అన్ని పాదాలలోనూ కనిపిస్తుంది. ఆ దీర్ఘాలను తొలగిస్తే పాదం చివర ఆరుమాత్రల గణం నిలుస్తుంది. ఆరుమాత్రల గణమంటే రెండు సూర్యగణాలకు సమానం కదా ! ఈ విధంగా చూసినపుడు కన్నడ సీస పద్యానికి తెలుగు జానపద సీసంతో గల పోలికలు యాదృచ్ఛికం కావని గుర్తించ వలసి ఉంటుంది.

ఇంక ఈ అన్నమయ గీతాన్ని గురించి పరిశోధకులన్న మాటలను కూడా పరిశీలించవలసి ఉంది. ఈ గేయ ఛందస్సు గురించి రాస్తూ డాక్టర్ వేటూరి ఆనందమూర్తిగారు ఈ పాటను ఉదాహరించి –

> ''పై యుదాహరణమున 'తక తకిట' 'తకతకిట' అను నా వృత్తము లేడేసి చొప్పున పాదమునకున్నవి. ఈ పదము నందలి పాదము లన్నియు సమావృత్త పాదములు''.[19]

శ్రీ వేటూరి ఆనందమూర్తిగారి గ్రంథానికి రాసిన 'మంగళాశంస'లో శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు, ఆనందమూర్తి గారి అభిప్రాయంతో ఏకీభవించలేదు. వారి మాటలివీ –

> ''అలరచంచలవ్మైన' అను పాటలోనివన్నీ సమావృత్త పాదాలనేది సరే. కాని పాదాని కేడావృత్తాలని లెక్కించడం మాత్రం చింత్యం. ఇది తాళజీవితమ్మైన లయను అక్షరదృష్టితో

చూచుటవల్ల కలిగింది. అప్పటికిన్నీ 'ఉయ్యాలా' అనే పాదాంత మగణం ఆరుమాత్రలు గలిగి, మొదటి నుండి క్రమంగా నడిచి వచ్చే ఐదుమాత్రల గణాలధాటితో పొందికలేక ముగ్గరించును. చతురశ్రమే జీవాతువుగా వెలసే కర్ణాటక పద్ధతిలోని నిబద్ధ ప్రబంధాలలో ఏడు గణములు మాత్రము గల పాదము లెందుకు ఉండవు. కనుక ఈ 'ఉయ్యాలా' అనే పదాన్ని 'ఉయ్యా... లా...' అని 'యా'కు మూడుమాత్రలును 'లా'కు ఐదు మాత్రలను ఇచ్చి పాడిగించి ఖండలయను చతురశ్రతను కాపాడు కోవలసి ఉన్నాము. పాడేటప్పుడు ఊపిరి విడిచి తీసుకొనే సౌకర్యమున కైనా, వాటి రాగరచన యందలి ఊపు చూపుటకైనా పాట పాదమున కడపటి గణము నిట్లు కురుచపరచి రచించుట ప్రబంధ సాహిత్యములో సామాన్యము''.[20]

శ్రీ వేటూరి ఆనందమూర్తిగారు 'తక తకిట'లతో పాటను కొలిచి అందులోని జానపద ఛందస్సును గుర్తించక వదిలిపెట్టారు. వారి విశ్లేషణ సరైనదేగాని తకతకిట పద్ధతి వారిని దారితప్పించింది. కాని రాళ్లపల్లి వారు కేవలం గాయక దృష్టితో చూసి అందులో నిక్షిప్తమై ఉన్న ఛందస్సును గుర్తించక పొరబడ్డారని చెప్పవలసి వస్తుంది. అన్నమయ గేయరచనలను మొదటిసారిగా విశ్లేషించడానికి పూనుకొన్నవారు ఆనందమూర్తిగారే నన్న సత్యాన్ని మనం విస్మరించగూడదు.

ఈ చర్చవల్ల తేలిన విషయం అన్నమయ కావ్యశైలిలో సీసపద్యాన్ని రచించి ఉండీ, జానపదశైలిలోనీ సీసపద్యనిర్మాణ రహస్యాలను తెలుసుకున్న వాడన్న సంగతి. జానపద సీస ఛందస్సును కూడా చూశాం గదా. ఆ జానపద సీస ఛందస్సును గుర్తించడానికి అన్నమయ రచన తోడ్పడింది. మరొక విధంగా చెప్పాలంటే జానపదసీసం లాక్షణికుల చేతిలోపడి, తన అసలు

రూపాన్ని కోల్పోయిన తరుణంలో, అన్నమయ తన రచన ద్వారా జానపద సీసంలోని అందాలను పునఃప్రతిష్ఠించాడన్నమాట. ఈ మాటను చెప్పుకొన్న తరువాత మరొక అన్నమయ రచనను చూడవలసి ఉంది. అది ఇదీ –

'పరమపదమందు బహుదివ్యవరణాలు
హరిగరిమలు పాలుపలరునాడు
గరుడఁడు ననంతుడు గదిసి సేనేశుడు
హరి నిత్యసేవకులై రిందునాడు

పాలజలధిలోన బవళించి హరివచ్చి
భూలోక మింతయు జూచి పొగడునాడు
పాలించి నేలయు మిన్ను బహుదివ్యదేశాలు
గాలించి కోనేటి దరి గైకొంటనాడు

నరసురోరగులెల్ల నలువంక గొలువంగ
పురవైన వేడుకల బొదలునాడు
విరజానదియు తాను వేంకటపతి వచ్చి
పరమపద మిదని పాలించెనాడు

ఇందిరకు నురముమీఁదిచ్చినవాడు
విందువలె హరి యిందు విచ్చేసెనాడు'[21]

ఈ సంకీర్తనం నడక సీసపద్యాన్ని స్ఫురింపచేస్తున్నది గాని అటు లాక్షణిక నిర్దేశితమైన సీసం గానీ, యిటు జానపదం గానీ కాదు. ఇందులోని గణాలు అనియతమైనవి. ఈ సంకీర్తనలోని మొదటి చరణంలోని రెండు పాదాలలో వరుసగా 33, 35 మాత్రలున్నాయి. ఆఖరి చరణంలోని రెండు పాదాలలో వరుసగా 36, 35 మాత్రలున్నాయి. పాదాని కుండవలసిన మాత్రల గరిష్టసంఖ్య 36గా తేలుతోంది. అయితే రెండో చరణంలోని రెండు పాదాలకూ వరుసగా 37, 42 మాత్రలు ఉన్నాయి. అంటే రెండో చరణం ఏ నియమానికీ

లొంగడంలేదన్నమాట. అయితే సర్వలఘుసీసం దృష్ట్యా చూస్తే పాదానికి 36 మాత్రల చొప్పున ఉండి ఉండాలి. అంటే రెండోచరణంలోని అధిక మాత్రలు రాగప్రస్తారాన్ని దృష్టిలో పెట్టుకుని చేర్చి ఉండాలి అని ఊహించడం లో పొరబాటు ఉండదేమో. గణబద్ధమైన సీసపద్యం మాత్రాఛందస్సుగా రూపొందడంలోని ఒకదశను ఈ సంకీర్తన ప్రదర్శిస్తున్నదని అనుకోవాలేమో !

5. సీసద్విపద :

అన్నమయ సీసపద్యాలను పరిశీలించడం జరిగింది. అలాగే ద్విపదను కూడా పరిశీలించేవున్నాము. ఛందస్సులో అన్నమయ చేసిన విచిత్ర ప్రయోగాన్ని మనం గమనించవలసింది ఉంది. ఈ రచనను చూడండి –

'ఒకమారు సంసార మెల్లబొమ్మని తలచు
ఒకమారు విధిసేత లూహించి పొగడు
ఒకమారు తనుజూచి వూరకే తలవూచు
నొకమారు హర్షమున నొంది మేమరచు

నినుజూచి ఒకమారు నిలువెల్ల బులకించు
తనుజూచి ఒకమారు తలపోసి నగును
కనుదెరచి నినుజూచి కడు సిగ్గువడి నిలిచి
యిన్నియును దలపోసి యింతలో మరచు

వదలైన మొలనూలు గదియించు నొకమారు
చెదరిన కురులెల్ల చెరగు నొకమారు
అదనెరిగి తిరువేంకటాధీశ పొందితివి
చదురుడవు నినుబాయజాల దొకమారు

తరుణి నీయలుక కెంతటి దింతి నీవేళఁ
గరుణించగదర వేంకటశైలనాథ'[22]

ఈ పాట చరణాలలోని బేసి పాదాలు సీసపద్యంలోని పాదంలోని

మొదటి సగంలోని నాలుగు పంచమాత్రాగణాలు. సరిపాదాలు అచ్చంగా ద్విపద పాదాలు. అయితే గమనించవలసిన విషయం ఐదుమాత్రల గణాలు ఇంద్రగణాలైనా, చంద్రగణాలైనాసరే లాక్షణికాదేశాన్ని ధిక్కరించి వాడటం జరిగింది. మూడుచోట్ల – /మ్మనితలను/, /చెరగునొక/, /చదురుడవు/, – నలలములను వాడటం జరిగింది. రెండుచోట్ల – /పొందితివి/, /హర్షమున/ – భలము వాడటం జరిగింది. నిజం చెప్పాలంటే చంద్ర, ఇంద్ర గణాల వ్యవస్థ ఏర్పాటులో ఏ విధమైన తార్కిక పద్ధతీ కనిపించదు. అందువల్ల అన్నమయ ఆ వర్గీకరణను తోసిపుచ్చి ఉంటాడు. జానపద సీసంలో గణాలను యథేచ్ఛగా వాడటం గమనించే ఉన్నాం. సరిపాదాలయిన ద్విపదపాదాలలో లాక్షణిక విధేయంగా ఉన్న పాదాలే ఎక్కువ.

ఇంత చెప్పుకొన్న తరువాత ఈ నూతన ప్రయోగానికి సీసద్విపద అన్న పేరు ఎలాగ సమంజసమౌతుంది ? నాలుగు ఇంద్రగణాలున్నంత మాత్రాన వాటిని సీసపద్యపాదంలోని తొలి సగంగా భావించడం ఎలా సమర్థ నీయం అన్న ప్రశ్నలు ఉత్పన్నం కావడం సహజమే. పై సంకీర్తనను చదువు తున్నప్పుడు సీసపద్యం నడక స్ఫురిస్తుంది. అయితే సీసపద్యాలలో ఆరు పంచమాత్రాగణాలూ రెండు సూర్యగణాలూ ఉండాలి కదా. ఇక్కడ ఒక సూర్య గణాన్ని తగ్గించి ఆ స్థానంలో పంచ మాత్రా గణాన్ని వెయ్యడం జరిగింది. అప్పుడు చరణంలోని రెండో పాదంలో మూడు పంచమాత్రా గణాలూ, ఒక సూర్యగణమూ వచ్చాయి. అంటే ద్విపదపాదంగా మారిందన్నమాట. నడక సీసపద్యం నడకకు దగ్గరగానే ఉంది. ఈ ఛందస్సును పోలి ఉన్న మరొక ఛందస్సేదీ మనకు కనిపించదు. అందువల్ల దీనికి సీసద్విపదగా నామకరణం చెయ్యడం జరిగింది. ఇది అన్నమయ్య వినూత్న సృష్టి.

ఛందస్సును గురించిన చర్చను పక్కకు పెట్టి చూస్తే, సంకీర్తనలోని భావం ఎంత ఉదాత్తంగా ఉందో విశదమౌతుంది. అంతేకాదు ఆ ఉదాత్త భావ ప్రకటనకు ఈ కొత్త ఛందస్సు ఎంత చక్కగా ఒదిగిందో కూడా గమనించక

తప్పదు. ఈ సంకీర్తన సీసపద్యానికీ ద్విపదకూ ఉన్న ప్రాచీనమైన బాంధవ్యాన్ని ధృవీకరిస్తున్నది.

౬. మధ్యాక్కర :

మధ్యాక్కరకు ప్రతి పాదంలోనూ రెండు ఇంద్రగణాలూ ఒక సూర్య గణమూ రెండింద్రగణాలూ ఒక సూర్యగణమూ చొప్పున ఉంటాయి. పాదాలు నాలుగుంటాయి. అన్నమయ రచనమిదీ. ముద్రణలో ఒక పంక్తిగా అచ్చయిన ఈ గీతపాదాల్ని రెండుగా రాసి చూపడం జరుగుతోంది –

'రంతులు సేసిటు రావు –
యెంతైనా జనవీవు.
చెంతలె కడుదలచేవు –
ఇంతలొ నెరవయ్యేవు.

పొలయుచు నూరకెపోవు –
గిలిగింపుచు దిరిగేవు.
చెలగుచు వడిమురిసేవు –
నిలరా యించుక నీవు.

బొంకుచు నూరకెపోవు –
తెంకికి నెవ్వతెదేవు.
వెంకటపతి నవ్వేవు –
పొంకమ్మైతివికబోవు.

కూరిమెరిగి కైకోవు – నీ
బీరములే నెరపేవు'[23]

లాక్షణికులు చెప్పిన ప్రకారం మధ్యాక్కరకు పాదానికి ఆరుగణాలు. ప్రాస నియతం. యుద్ధమల్లుడి బెజవాడ శాసనంలోనూ, నన్నయగారి భారతం లోనూ మధ్యాక్కరలో పంచమ గణాద్యక్షరం యతి చెల్లితే, తెలుగు లాక్షణికులు

పాదంలోని చతుర్థగణాద్యక్షరానికే యతి చెల్లుతుందని చెప్పారు. అయితే అన్నమయ మధ్యాక్కర ఛందస్సును లాక్షణికుల ఆదేశ ప్రకారం పాటించలేదు. అసలు మధ్యాక్కర ఛందస్సు ఇం + ఇం + సూ + ఇం + ఇం + సూ చొప్పున నాలుగుపాదాల ప్రాసతో ఉండాలి. జానపద గేయాలలో మధ్యాక్కర ఇలా ఉంది –

'అంతట రాములవారు – అంగన సీతను గూడి
సంతస ముందుచు వేగ – స్వపురమునకు చను దెంచ్రి
తమ్ములతోడను గలసి – నెమ్మది రాజ్యములేలె
ధర్మముతో ప్రజలెల్ల – తామరతంపరలైరి'

ఈ జానపదమధ్యాక్కరలో ప్రాస కేవలం రెండేసి పాదాలకు మాత్రమే వాడటం గమనార్హం. అంటే జానపద సాహిత్యంలో మధ్యాక్కర రెండు పాదాల ఛందమే నన్నమాట. అందువల్ల అన్నమయ మధ్యాక్కరను రెండుపాదాల ఛందంగానే రాయడం జరిగింది. అదీకాక ప్రాసయతిని వినియోగించడం కూడా జానపద మధ్యాక్కరలో ఉన్నది. అన్నమయ ఆలక్షణాన్నే గ్రహించాడు. అందువల్ల ప్రాసా, ప్రాసయతీ కలిసి చక్కగా అమరినై.

మధ్యాక్కర గురించి రాస్తూ శ్రీ ఆరుద్ర –

'మధ్యాక్కరలో ఇంద్రగణానికి అయిదుమాత్రలు,
సూర్యగణం చోట నాలుగు మాత్రాలూ ఉండాలి.
అలా ఉంటేనే తాళానికి సరిపోయి పాడటానికి వీలుగా
వుంటుంది. ఏ కారణం వల్లనైనా అయిదు మాత్రలకు
తక్కువైన ఇంద్రగణాన్ని వ్రాస్తే ఏదోవొక హ్రస్వాక్షరాన్ని
దీర్ఘం చేసుకొని తాళం సరిపెట్టుకోవాలి'[24]

అన్నారు. ఈ భావం సరికాదని అన్నమయ రచన చూపుతోంది. పైన ఉదాహరించిన జానపదగేయంలో చతుర్మాత్రాగణాలే ఉన్నాయి. అన్నమయ

రచనలోనూ చతుర్మాత్రాగణాలే ప్రయుక్తమైనాయి. జానపద ఛందస్సులను స్వీకరించి కావ్యాలలో వాడినప్పుడు, సహజంగా జానపద ఛందస్సులో ఉన్న గేయలక్షణం అంతరించి కృత్రిమశైలి నెలకొన్నది. నన్నయ గారి మధ్యాక్కరను ఇందుకుదాహరణగా చూడవచ్చు.

'అవసరజ్ఞుండయి వ్యాసుఁడేతెంచె నంత నత్తపసి
కపిలగడ్డంబును గపిల జడలును గపిలకన్నులును
దవినయన్నువ నల్లనైన దీర్ఘపుం దనువును జూచి
యువిద గన్నుంగన మొగిచి దెఱవకయుండె భయమున'[25]

కావ్యశైలిలో ఇటువంటి ఛందస్సులు అందాన్ని కోల్పోతాయి. అన్నమయ తప్పకుండా నన్నయ భారతాన్ని చదివే ఉంటాడు. ఛందో రహస్యాలనన్నీ ఆకళింపు చేసుకునే ఉంటాడనటానికి సందేహించవలసిన అవసరమూ లేదు. అన్నీ తెలిసినవాడు ఇంత చక్కని రచనను మధ్యాక్కర ఛందస్సులో ఇలాగ చేశాడంటే ఆయన దృక్పథమేమిటో తెలుస్తూనే ఉంది గదా ! ప్రబంధయుగంలో ప్రబంధరచనకు ఆయన పూనుకోకపోవడం తెలుగు సాహిత్యానికి మేలే చేసింది.

7. కందలయ :

తెలుగులోని జాతి పద్యాలలో కందపద్యానికున్నన్ని నియమాలు మరే పద్యానికీ లేవు. అందమైన ఇంత చిన్న పద్యానికి ఇన్ని నియమాలా అని జాలి వెయ్యక తప్పదు ! అలాగే కందపద్యానికున్న నడక ఇతర పద్యాల నడక కన్నా విలక్షణమైనది. కందపద్యం నడకకు వేగం విశిష్టలక్షణం. నిజానికి కందపద్యాన్ని కేవలం మాత్రాఛందస్సుగా కూడా రచించడానికి వీలుంది, దాని నడకకు భంగం కలగకుండానే. అదీగాక కందపద్యాలను వరుసగా చదువు కుంటూ పోతే రోకటిపోటుగా మారి విసుగు కలిగించే ప్రమాదం లేదు. అదే ఆటవెలది పద్యాలను విసుగుపుట్టకుండా వరుసగా చదవలేం. ఇందు

కుదాహరణగా సుమతీశతక పద్యాలనూ, వేమన పద్యాలనూ చదివి చూడవచ్చు. అన్నమయ రచనలలోని ఒక రచనను, తన గురువైన శఠకోప మునిని కీర్తిస్తూ రచించిన దానిని పరిశీలించవలసి ఉంది –

కైవల్యమునకుఁ – గనకపు తాపల
త్రోవై శృతులకుఁ – దుది పదమై
పావన మొక రూ – పంబై విరజకు
నావై భువిను – న్నాఁడిదె యితడూ

కాపాడఁగలో – కములకు సుజ్ఞాన
దీపంబై జగ – తికిఁ దొడవై
పాపాలడఁపఁగ – భవ పయోధులకు
తేపై జగములఁ – దిరిగీ నితఁడూ

కరుణానిధి రం – గపతికిఁ గాంచీ
వరునకు వేంకట – గిరి పతికీ
నిరతి నహోబిల – నృకేసరికిఁ త
త్పరుఁడగు శఠకో – పముని యితడూ

చూడుఁ డిందరికి – సులభుఁడు హరి
తోడు నీడ యగు – దొరముని యితడూ'[26]

అన్నమయ్య పద్యఛందస్సులను అవలంబించినప్పుడు, తన పద్ధతిలో నాలుగు పాదాలుగా మార్చుకొని యతిప్రాసలను అందు కనుగుణంగా అమర్చు కొనడం తెలిసిందే. కందపద్యాన్ని మాత్రాఛందస్సుగా పరిగణిస్తే చిన్న పాదాలకు పన్నెండు మాత్రలూ, పొడుగు పాదాలకు ఇరవై మాత్రలూ చొప్పున ఉంటాయి. అన్నమయ పై సంకీర్తనను కందం పద్ధతిలో రాసి చూడాలి –

కైవల్యమునకుఁ గనకపు
తాపలతో వై శృతులకు తుదిపదమై

పావన మొకరూపంబై
విరజకు నావై యున్నాడిదె యితడూ

కరుణానిధి రంగపతికిఁ
గాంచీవరునకు వేంకటగిరిపతికీ
నిరతి నహోబల నృకేస
రికి దత్పరుఁడగు శఠకోపముని యితడూ

చిన్న పాదాలకు సరిగా పన్నెండు మాత్రలుండటం గమనార్హం. పెద్ద పాదాలకు మాత్రం పదిహేడు నుంచి పందొమ్మిది మాత్రల దాకా ఉండటం వల్ల ఈ కందాలను మాత్రాఛందస్సులుగా గుర్తించడం కుదరదు. అయితే పెద్ద పాదాల చివరి అక్షరాలు దీర్ఘాక్షరాలు కావడం వలన కందం ధోరణిలో చదువుతున్నప్పుడు మనకు తెలియకుండానే పొడుగు పాదాలలోని మాత్రలు ఇరవైగా సర్దుకుంటాయి. ఈ గేయాన్ని చదువుతూంటే వింటున్నవారికి మాత్రలు తక్కువైన సంగతి స్ఫురించదు. మన శ్రవణేంద్రియాలను మోసగించే రచన మిది. ఇది అసలు కందంగానీ, మాత్రాకందంగానీ కాకపోవడంవల్ల ఈ ఛందస్సుకు కందలయ అని పేరుపెట్టడం జరిగింది.

8. మధురగతి రగడ ప్రభేదం :

తెలుగులోని మధురగతి రగడ, కన్నడంలోని మందానిలరగళె ఛందో రీత్యా నొకటే. మందానిలరగళెలో రెండు పాదాలూ, పాదానికి నాలుగు చతుర్మాత్రా గణాలూ ఉంటాయి. కన్నడ మందానిలరగళె కుదాహరణ –

'అనిరుపమగృహ బహిరుద్యానం
తానెసె దొప్పుగు మప్రతిమానం'[27]

తెలుగు మధురగతి రగడకు ఉదాహరణ –

'పదియార్వన్నియ బంగరు వలువును
మెదలెడి తళుకుల మేఖల చెలువును'[28]

ఈ రెండుభాషల్లోని ఛందస్సుకూ ప్రాస, అంత్యప్రాస నియతమే. పైన ఉదాహృత మయిన తెలుగు మధురగతి రగడలో రెండు చతుర్మాత్రా గణాల తరువాత వచ్చిన విరుపు చక్కని తూగును కలిగిస్తున్నది. అయితే పింగళి సూరన రచించిన మధురగతి రగడలన్నిటా ఈ తూగు కనిపించదు. ఉదాహరణకు -

'కెందమ్ముల నడఁకించు పదంబులు
నిందు వైభవము నేలు నఖంబులు'[29]

అంటే మధురగతి రగడకు ఒక విశిష్టమైన తూగు లేదని భావించవలసి వస్తోంది.

రెండు పాదాల ఛందస్సును అన్నమయ తన పద్ధతిలో నాలుగు పాదాల ఛందస్సుగా మార్చుకుని తన సంకీర్తనకు ఈ ఛందస్సును వినియోగించు కున్నాడు -

'వీధుల వీధుల - వెసఁదురగముపై
భేదిల బల్లెము - బిరబిరఁ దిప్పుచు
మోదము తోడుత - మోహన మూరితి
యేదెస చూచిన - నేగీవాడే

కన్నులు దిప్పుచు - కర్ణములు గదల
సన్నల రాగెకు - చౌకళింపుచును
అన్నిటఁదేజి - యాడఁగదేవుఁడు
తిన్నఁగ వాగేలు - దీప్పీవాఁడే

వలగొన దిరుగుచు - వాలము విసరుచు
నిలిచి గుఙ్ఞమటు - నేర్పులు చూపఁగ
బలు శ్రీవేంకట - పతి యహోబలపుఁ -
బొలమున సారెకుఁ - బొదలీవాడే

దేవశిఖామణి - దివిజాలు వొగడఁగ
వేవేలు గతుల - వెలసీవాఁడే'[30]

ఇందులోని రెండవ చరణంలో మూడవపాదంలో యతి దగ్గర పాదం కుంటినట్టు కనిపిస్తుంది. ఇందుకు కారణం పాదంలోని తొలి సగంలో ఒక మాత్ర తక్కువైంది. పాటలోని 'తేజి'ని 'తేజీ' అని సవరించుకుంటే సరిపోతుంది. రేకులలో ఉన్న లిపిలో దీర్ఘాలు సూచించడానికి ఏ గుర్తులనూ వాడలేదు. అందువల్ల ఈ తడబాటు.

మధురగతి రగడను నాలుగుపాదాల పద్యంగా మార్చడమేగాక నియతంగా ఉండవలసిన అంత్యప్రాసను విడిచినందువల్ల దీనిని అచ్చంగా మధుర గతి రగడగా గుర్తించలేం. అందువల్ల దీనిని మధురగతి రగడ ప్రభేదంగా మాత్రమే గుర్తించవలసి ఉంటుంది. అంత్యప్రాసలను వాడటంలో అన్నమయ అసమర్థుడు కాడు. ఇక్కడ ఇచ్ఛాపూర్వకంగానే ఆయన విడిచిపెట్టాడు.

9. తురగవల్గన రగడ ప్రభేదం :

లక్షణం ప్రకారం తురగవల్గన రగడలో పాదానికి ఎనిమిది త్రిమాత్రా గణాలుంటాయి. త్రిమాత్రా గణమ్మైనా లగం ఉండదు. అయిదో గణాద్యక్షరం యతి. ఆదిప్రాస అంత్యప్రాసా కూడా నియతం. ఈ జాతికి చెందిన అన్నమయ రచనలు రెండింటిని పరిశీలించవలసి ఉంది.

'పాలలోను దచ్చి వెన్న పలుదెరగులఁ దివియనేర్చు
రాలువేసి నీరుమీఁదదేల జేయనేర్చు నూ
గాలి పుంటి సంటిలోన గాఁపురంబు సేయనేర్చు
అలికట్టుఁ జీరలోన నాలిఁ బడయనేర్చునూ

ముద్దులాఁడి కొడుకుచేత ముజ్జగములు దిప్పనేర్చు
చద్ది కంటవేఁడి కంటఁ జక్కఁ జూడనేర్చునూ
గద్దెరాతి కొండ వింట గొసికయ్యె చెలంగనేర్చు
సుద్దులెల్ల మందు లనఁగ సొంపు మిగులనేర్చునూ

పాఁపరేని కొండమీఁదఁ బందివేఁట లాడనేర్చు

గోపసతుల మానమెల్ల కొల్లలాడనేర్చునూ
యేపుమీరినట్టి వేంకటేశుఁ డనెడివాఁడు పిన్న -
పాఁపడై యశోదయెదుట పరువులిడఁగనేర్చునూ

రెప్పవేసి లోకమెల్ల రేయుఁబగలుఁ జేయనేర్చు
చెప్పరాని చేఁతలెల్ల చెప్పి చూపనేర్చునే'[31]

ఈ గేయాన్ని అచ్చంగా తరుగవల్లనరగడగా గుర్తించడానికున్న ఒకే ఒక ఇబ్బంది సరిపాదాలలోని ఎనిమిదవ గణంలో ఒకే అక్షరం 'నూ' ఉన్నది. అంటే మూడుమాత్రల బదులు రెండు మాత్రలే ఉన్నవన్న మాట. ఈ అక్షరం ప్లుతమై ఉండాలి. అప్పుడు ఛందోరీత్యా పేచీ ఉండదు. లక్షణం ప్రకారం అంత్యప్రాస లేదు గాని అసలు అంత్యప్రాస లేకుండా పోలేదు. బేసి పాదాల కొక అంత్యప్రాసా సరిపాదాల కొక అంత్యప్రాసా చెల్లినై. ఈ పద్ధతి తెలుగులో కానరాదు గాని ఆంగ్లసాహిత్యంలో ఎక్కువగానే కానవస్తుంది. ఆంగ్ల మహాకవులైన షేక్స్పియర్, రాబర్ట్ బ్రౌనింగ్, విలియం వర్డ్స్వర్త్ల రచనలలో ఈ పద్ధతిని చూడవచ్చు. ఉదాహరణకు వర్డ్స్వర్త్ రచించిన సుప్రసిద్ధ కవిత 'లూసీగ్రే' నుంచి -

"Yet some maintain that to this day
She is a living child;
That you may see sweet Lucy Gray
Upon the lonesome wild"

ఈ పద్ధతి అన్నమయ మరికొన్ని రచనలలో కూడా కానవస్తున్నది. అన్నమయను విడిస్తే తెలుగుకు ఈ పద్ధతి కొత్తదే. అందువల్ల అంత్యప్రాసను కూడా తనదైన పద్ధతిలో అన్నమయ తురగవల్లనజాతి రచనలలో వినియోగించాడని గుర్తించాలి. అయితే అంత్యప్రాసను ఇచ్ఛాపూర్వకంగానే త్యజించిన రచనలూ అన్నమయ రచనలలో కానవస్తాయి. ఉదాహరణకు -

'వాలి తిరుగునట్టి దైత్య వరుల మోహవతుల నెల్ల
మూలమూల ద్రోసి ముసుగుపాలు సేసె నీతఁడూ

వేలసంఖ్యలైన సతుల వేడుకలరఁజేసి యొంటి
యాలి మగని రీతి గూడి యనుభవించె నీతఁడూ

కడుపులోని జగములెల్ల గదలకుండఁ బాపరేని
పడుక నొక్క మనసుతోడ బవ్వళించె నీతఁడూ
అడుగు కింద లోకమెల్ల నడచ దలచి గురుతుమీర
పాడవు పెరిగి మిన్ను జలము పాడిచి తెచ్చె నీతఁడూ

కోడెవయసునాడు మంచి గోపసతుల మనసులెల్ల
అడికెలకు నోపి కొల్లలాడి బ్రదికె నీతఁడూ
వేడుకలర వేంకటాద్రి వెలసి భూతకోటి దన్నుఁ
జూడు డనుచు మోక్షపదము చూర విడిచె నీతఁడూ

ఆదిదేవుడనగ మొదల నవతరించి జలధిసొచ్చి
వేదములను శాస్త్రములను వెదకితెచ్చె నీతఁడూ'[32]

ఈ రచనలోనూ సరిపాదాల చివర ఎనిమిదో గణంలో మూడుమాత్రల బదులు రెండుమాత్రలు మాత్రమే ఉన్నాయి. 'డూ' అన్న అక్షరాన్ని ప్లుత మనుకోక తప్పదు. ఈ విధంగా సరిపాదాలలో మాత్రలనో గణాలనో తగ్గించి రాయడం తెలుగులో ఒక సంప్రదాయంగా ఉంది. బహుశా అన్నమయతో ఇది ప్రారంభమై ఉండవచ్చు గాని, జానపద గేయాలలో కూడా కనిపిస్తున్నందు వల్ల జానపద సాహిత్యం నుంచి ఈ పద్ధతిని అన్నమయ స్వీకరించాడేమో!

తెలుగులోని ఈ తురగవల్గన రగడ కన్నడంలోని 'ఉత్సాహరగళె'కు సమానం. కన్నడంలో ఉత్సాహరగళెకు వివిధ రూపాలున్నాయి గాని, తెలుగు లో అంత వైవిధ్యం కనిపించదు. అదీగాక అన్నమయ వాడిన ఛందంవంటి ఛందం ఉన్న రచనలేవీ కన్నడంలో కనిపించవు. తెలుగులో తొలి చరణాలలో త్రిమాత్రాగణాలున్న ఎనిమిది గణాలుండగా, రెండోపాదంలో ఆరు త్రిమాత్రా గణాలుండి చివర ఒక గురువు ఉన్న రచన లెక్కువగా కనిపిస్తున్నాయి. అంటే

ఎనిమిదో గణాన్ని రెండోపాదంలో పూర్తిగా వదిలిపెట్టడం జరిగిందన్నమాట. ఈ సందర్భంగా కొన్ని రచనలను పరిశీలించవలసి ఉంది. ముందుగా జానపద గేయం 'వరదరాజా పెండ్లిపాట' నుంచి –

'వాణిదేవి మదిని దలతు వరదరాజా ప్రస్తుతింతు
చారుమతిని దలతు సప్తసాగరమ్ము నా'[33]

తురగవల్లనరగడలో లాగే ఇందులో పంచమ గణాద్యక్షరం యతి చెల్లింది. ఏడోగణంలో ఒక్క దీర్ఘాక్షరం మాత్రమే ఉంది. దాన్ని ప్లుతమనుకొన్నా కూడా ఇంకా మూడు మాత్రలు ఉండవలసి ఉంది. లేవు. జానపద తురగవల్లన రగడలు ఇలాగే ఉంటాయని అనుకోవలసి ఉంది. పదకవులు జానపద కవుల నుంచే స్ఫూర్తి పొంది ఇటువంటి రచనలను చేసి ఉండాలి. ముద్దుపళని రచించిన సప్తపదిలో నించి ఒక ఉదాహరణ –

'శ్రీనివాసగురుని దలచి – చిత్తమునను ముద్దుపళని
పూని చేయు ద్రవిడభాష – లోని భావమూ
చెలఁగి చెలియవాణి తనదు – జిహ్వాకొనను నిలిచి యిటుల
పలికె తిరుప్పావు సప్త – పది పదంబుగా'[34]

ఇది దాదాపు 'వరదరాజా పెండ్లిపాట' పద్ధతిలోనే ఉంది. ఏడోగణంలో ఏకాక్షరమే నిలిచింది. 18వ శతాబ్ది ప్రథమపాదాన జీవించిన తిర్మలకవి తన యక్షగానం 'చిత్రకూటమహాత్మ్యము'లో 'సమపద' మనేపేరుతో చేసిన రచన నుంచి ఉదాహరణ –

'కలను జూచినట్టి నీటు – కానిఁ దోడితెమ్మనేవు
కలికి, యతని యూరుపేరు – తెలియుటెలాగే
అందమైన కొలను నీటి – యందుఁ గానుపించునట్టి
చందమామ నొడిసిపట్టు – చందమెలాగే'[35]

ఈ 'సమపదానికి' పున్నాగవరాళిరాగం – ఆదితాళం సూచితమైనాయి.

అయితే తిర్మలకవి రచనలో మొత్తం ఐదు గేయరచనలు 'సమపదం' పేరుతో ఉన్నాయి. అవేవీ ఈ ఛందస్సుకు చెందవు. మరి సమపదమన్న దానికి అర్థం చెప్పుకోవడానికి వీలులేకుండా పోయింది. విష్ణుమాయావిలాసంలో కంకంటి పాపరాజు 'లఘుశేఖరము' అనే పేరుతో చేసిన రచన మిది –

'కుంచె విసరుకొంచు నవ్వు – కొంచు శౌరిగాంచు వేడ్క
ముంచుకొనఁగఁబోరు దిండి – మునివరుండు పాఱుదేర
వనజనయను మాయ మాత్ర – మునకు మీరలేల మరులు
కొనక యుండమేమెనేర్తు – మనుచుఁబ్రమథవరులు గొలువ'[36]

ఇది నిజానికి అచ్చమైన తురగవల్గనరగడే. లఘుశేఖర మన్నది తాళ ప్రభేదమనీ, నారదుడి సంగీత మకరందంలోనూ, పార్శ్వదేవుడి సంగీత సమయ సారంలోనూ పేర్కొన్నారని ఆచార్య యస్వీజోగారావు గారు ఇచ్చిన సమాచారం.[37] వారే 'ఇందలితురగవల్గనగతి గమనింపఁదగినది' అని అన్నారు. ఛందస్సును గురించిన చర్చలో దీనిని ఛందంగానే స్వీకరింపకతప్పదు. తురగవల్గన రగడగా దీన్ని పరిగణించకా తప్పదు.

ఈ చర్చకు ఫలితంగా పైన పేర్కొన్న అన్నమయ రచనలు తురగవల్గన రగడ ఛందస్సు ఆధారంగా తీర్చినవనీ, చివరి మూడు మాత్రల బదులు ప్లుతాన్ని వినియోగించడం ప్రయోగదృష్టితోనేననీ భావించకతప్పదు. అదీగాక అన్నమయ జానపదగేయాలలో ఉన్న తురగవల్గన రగడకు ప్రాధాన్యమిచ్చి అనుసరించి ఉండవచ్చు. కంకంటి పాపరాజు రచన కేవలం కావ్యశైలిలో రాసినది. అలాగే కృష్ణమాచార్యుల రచనగా డాక్టర్ వేటూరి ఆనందమూర్తి గారు ఉదాహరించిన రచన –

'శ్రీకరంజ భూరుహాఖ్యఁ జెలగి వెలయు శ్రీనృసింహ
భీకరావతార ధీర పృథులవక్ష శ్రీనృసింహ'[38]

అన్నది తురగవల్గన రగడే కాని శ్రీకృష్ణమాచార్యులు రచించి ఉంటారా అన్నది

సందేహాస్పదమే. ఇటువంటి రచనలను ఆయన చేసి ఉంటే సంకీర్తన లక్షణంలో పేర్కొనేవారు కదా ! ఏది ఏమైనా ఇంకా పరిశోధించవలసి ఉంది. తురగవల్లన రగడకు ఉండవలసిన అన్ని లక్షణాలూ అన్నమయ రచనలో లేనందువల్ల అన్నమయ రచనలను తురగవల్లనరగడ ప్రభేదంగా మాత్రమే పరిగణించటానికి వీలౌతుంది.

షట్పదలు :

అన్నమయ అభిమానించిన ఛందస్సులలో షట్పదశాఖ ఒకటి. ఈ షట్పదలలో క్రమపద్ధతిలో ఉండేవీ, ఉండనివీ ఉన్నాయి. కేవలం మాత్రా ఛందాలుగా లాక్షణికులు పేర్కొన్నవన్నీ ఒక క్రమపద్ధతిలో ఉన్నాయి. వాటిని క్రమ బద్ధంగా ప్రదర్శించవచ్చు. గణాలతో చెప్పిన షట్పదలకు ఒక స్థిరరూపం కనబడదు. అవి పైన పేర్కొన్న క్రమ పద్ధతిలోకి ఇమడవు. అదీగాక వాటి ఛందోవిధానం తర్కబద్ధంగా లేకపోవడం స్పష్టంగా కనిపిస్తుంది. అన్నమయ రచనలనూ, ఛందోవ్యవస్థనూ పరిశీలించే ముందుగా షట్పదల క్రమపద్ధతిని పరిశీలించవలసి ఉంది.

షట్పదలకు ఆరుపాదాలుంటాయని వేరుగా చెప్పనక్కరలేదు. రెండు పొట్టిపాదాల తరువాత ఒక పొడుగుపాదమూ, మళ్లీ రెండు పొట్టిపాదాల తరువాత మరొక పొడుగుపాదంగా ఈ ఛందస్సులుంటాయి. ఇది సామాన్య లక్షణం. మాత్రాసంఖ్యానుసారంగా చూస్తే వీటిలో క్రమపద్ధతి దృగ్గోచర మౌతుంది. ఈ క్రమపద్ధతిని ఏర్పరచుకోవడానికి ముందుగా మొదటి రెండు పొట్టిపాదాలను ఒక పాదంగా మార్చుకొని మూడవ పొడుగుపాదాన్ని యథాతథంగా ఉంచి చూడాలి. ఇది అన్నమయ రచనాపద్ధతి. మిగిలిన షట్పదిని అంతా అలాగే పునర్వ్యవస్థీకరించుకోవాలన్నమాట. ఉదాహరణకు శరషట్పద ఈ విధంగా ఉంటుంది లక్షణం ప్రకారం –

4 + 4

4 + 4

4 + 4 + 4 + 2

దీనిని ఈ విధంగా అమర్చుకోవాలి, అన్నమయ్య పద్ధతిలో -

4 + 4 + 4 + 4 = 8 - 8 మాత్రలు

4 + 4 + 4 + 2 = 8 - 6 మాత్రలు

ఇలాగే మిగిలిన పాదాలనూ ఏర్పరచుకొని చూడాలి. అప్పుడు కావ్యాలంకార చూడామణిలో ఇచ్చిన లక్ష్యపద్యం ఈ విధంగా రూపొందుతుంది -

'సురపతు లిరువురు - సురసతు లిద్దరు	8 - 8
సురపయుగముతో - సోముండును	8 - 6
బరువడి బెనఁగొన - నరుదుగ షట్పది	8 - 8
సరిబ్రాసలు దన - రారంగను'	8 - 6

ఈ విధంగా షట్పదలను మార్చి చూసినప్పుడు క్రమపద్ధతి ఏర్పడుతుంది. చూడండి - సగానికే మాత్రాసంఖ్యలు చూపడం జరుగుతోంది.

1.	తలషట్పద	6 - 6
		6 -5
2.	శరషట్పద	8 - 8
		8 - 6
3.	కుసుమషట్పద	10 - 10
		10 - 7
4.	భోగషట్పద	12 - 12
		12 - 8

5.	భామినీ షట్పద	14 – 14
		14 – 9
6.	పరివర్ధినీ షట్పద	16 – 16
		16 – 10
7.	ప్రౌఢషట్పద	18 – 18
		18 – 11
8.	వార్ధక షట్పద	20 – 20
		20 – 12

ఈ పై షట్పదల తొలిపాదాల మాత్రాసంఖ్య రెండేసి మాత్రలుగా పెరుగుతూ రావడం గమనార్హం. అలాగే మలిపాదాలలోని మలి సగంలోని మాత్రల సంఖ్య ఒక్కొక్క మాత్రగా పెరుగుతూ వచ్చాయి. ఈ క్రమ పద్ధతిని బట్టి చూస్తే ఈ ఎనిమిది షట్పది ఛందాలే గేయరచనకు అనుకూలమని తేలుతున్నది. అన్నమయ రచనలలోని షట్పదలను గుర్తించడానికి ఈ పద్ధతి సుగమమైన మార్గాన్ని చూపుతున్నది.

అయితే తెలుగులో మరికొన్ని షట్పదలున్నాయి. అవి ఈ పద్ధతిలోకి ఒదగవు. అసలు 'షట్పద' అన్న సామాన్య నామంతోటే ఒక షట్పద ఉన్నది. ఈ అసలు షట్పద, జలషట్పద, విషమ షట్పదలను పై పద్ధతిలో చూస్తే ఇలాగ ఉంటాయి –

జలషట్పద	7 + 7
	7 + 5
విషమ షట్పద	9 + 9
	9 + 11

ఈ విధంగా చూస్తే జలషట్పద తలషట్పదకు దగ్గరగా ఉంది. ఇంక విషమ షట్పదకు దగ్గరైన షట్పద ఛందమేదీ కనిపించదు. ఇవిగాక కేవలం

'షట్పద' పేరుతో ఉన్న షట్పదకు లక్షణాలను ఇంద్రగణాలతోనూ చంద్రగణాల తోనూ చెప్పడం వల్ల మాత్రాసంఖ్య అనియతమౌతోంది. అందువల్ల ఈ అసలు షట్పద పైనచూపిన క్రమపద్ధతిలోకి ఇమడలేదు. జానపద సాహిత్యంలో కనిపించే షట్పదరూపాలకు గణబద్ధంగా లక్షణాలను ఏర్పరచడంలో ఈ ఇబ్బందులు ఏర్పడి ఉంటాయి. అదీకాక లక్షణకారులు యతిని గురించి ఎక్కడా చెప్పలేదు. షట్పదలను గురించి శ్రీ కోవెల సంపత్కుమారాచార్యులు గారు చెప్పిన కొన్ని విషయాలను పరామర్శించవలసి ఉంది –

> 'షట్పదకు తెలుగు సాహిత్యములో దాదాపుగా ప్రయోగము లేదనియే చెప్పవచ్చును. జానపద వాఙ్మయములో కూడ అరుదుగానే కొన్ని షట్పద భేదములు కనిపించును. ఆధునిక సాహిత్యమందును షట్పదభేదముల ప్రయోగము మిక్కిలి అరుదే. కాని భీమన మొదలుకొని తెలుగు లాక్షణికులందరును షట్పదకు లక్ష్యలక్షణములను ప్రదర్శించినారు.
>
> షట్పద లక్షణమిది : పూర్వార్థమున మూడు, ఉత్తరార్థమున మూడు మొత్తమారుపాదములు గల పద్యము షట్పద. పూర్వార్థమున పాదమునకు రెండేసి ఇంద్రగణములుగా మొదటి రెండుపాదములుండును. మూడవపాదమున వరుసగా రెండింద్రగణములు + ఒక చంద్రగణముండును. ఉత్తరార్థ మిట్లే ఉండును. భీమన చెప్పిన ఈ షట్పద లక్షణము నకు, కన్నడమున నాగవర్మ తన 'ఛందోంబుధి' యందు చెప్పిన లక్షణమాధారము. కన్నడమున ఆరుపాదములకును ప్రాస చెల్లింపబడగా, భీమన లక్ష్యమందు 1,3,4,6 పాదము లందే ప్రాస చెల్లింపబడినది. దీనినిబట్టి 1,2 పాదములను, మరియు 4, 5 పాదములను ఒక్కొక్క పాదముగానే ప్రాస ప్రయోగ విషయమున భీమన భావించినాడని తోచును. కాని అట్లు

భావించినచో షట్పద ఆరుపాదములు గలది కాక నాల్గు పాదములు గలది యగును. అది సరికాదు. కావుననే, తరువాతి లాక్షణికులు ఆరుపాదములందును ప్రాస చెల్లించినారు''.[39]

అన్నమయ భీమన భావించిన రీతిలో షట్పదను నాలుగుపాదాల ఛందస్సుగానే రచించాడు. నాలుగు పాదాల రూపంలోనే ప్రాస చెల్లుతుంది. యతినియమం లాక్షణికులు లేదన్నారు గాని అన్నమయ యతిని పాటించాడు. ఏ విషయంలోనైనా పట్టుసడలించగల సంకీర్తనాచార్యుడు యతి ప్రాసల విషయంలో పట్టువదలనివాడు. అన్నమయ రచనను పరిశీలించే ముందుగా జానపద శరషట్పదను పరిశీలించవలసి ఉంది. అన్నిరకాల షట్పదులలోనూ అన్నమయ అభిమానించిన షట్పద శరషట్పద. ఈ ఛందంలో ఆయన పలుపోకడలు పోయాడు. ఆ పోకడలను గుర్తించేందుకు వీలుగా ముందుగా పరిశీలించవలసిన జానపద శరషట్పద ఇది –

'కూచొని చెరిగే – చేడె కురులపై
తుమ్మెదలాడెను – గోపాలా
గొప్పది రోకలి – గుప్పున దంచగ
గుబ్బలు కదిలెను – గోపాలా
చెమటకు తడిసీ – చెదరిన గంధం
గుమగుమలాడెను – గోపాలా
మొగమున దిద్దిన – కస్తురి తిలకం
ముక్కుకు జారెను – గోపాలా
చెరిగేతప్పుడు – చేతిలొ గాజులు
గలగలలాడెను – గోపాలా'

ఇది సుపరిచితమైన జానపదగేయమే. ఈ గేయం నడకలో శరషట్పదను స్పష్టంగా చూడవచ్చు. దీనిని ఈ విధంగా రాసి చూడాలి –

గొప్పది - రోకలి
గుప్పున - దంచగ
గుబ్బలు - కదిలెను - గోపాలా
చెమటకు - తడిసీ
చెదరిన - గంధం
గుమగుమ - లాడెను - గోపాలా

ఈ గేయంలో చతుర్మాత్రాగణాలు చక్కగా విడివిడిగా ఉండి, మూడో పాదంలోనూ, నాలుగోపాదంలోనూ చక్కగా యతి అమరింది. ఈ పాట రెండో చరణంలో ఇంత చక్కగా కుదరలేదు. అంటే యతి కుదరనప్పుడు విరామమే యతిగా నిలుస్తోంది. మరొక గమనార్హమైన లక్షణం - పూర్వోదాహృతమయిన సంపత్కుమాచార్యుల వారి మాటల్లో 'భీమన లక్ష్య మందు 1, 3, 4, 6 పాదము లందే' ప్రాస చెల్లడం. అయితే మొదటి సగానికొక ప్రాసా, రెండోసగానికొక ప్రాసా చెల్లించడం జరిగింది. నిజానికి తెలుగులో షట్పద రూపాలన్నీ సగం షట్పదలుగానే కనిపిస్తాయి. భామినీ షట్పద అయిన 'గుమ్మడేడే గోపిదేవి' అనే పాట సగం భామినీషట్పదే. ఇక అన్నమయ రచనలలో - శరషట్పదలలో - కొత్తగా పోయిన పోకడలను గమనించాలి. మాత్రల ప్రకారం వర్గీకరిస్తే ఈ పోకడలు లెక్కకు వచ్చాయి. ఇవి అన్నమయ రచనలలోని ప్రయోగశీలతను ప్రతిఫలిస్తున్నాయి. చూడండి -

శరషట్పద -

8 + 8
8 + 6
8 + 8
8 + 6

మొదటి ప్రభేదం - ఇందులో మొదటి సగం శరషట్పద. రెండో సగంలో ఒక మాత్ర ఎక్కువైంది.

8 + 8

8 + 6

8 + 8

8 + 7

రెండో ప్రభేదం – ఇందులో మొదటి సగం శరషట్పదే. రెండో సగంలో రెండు మాత్రలు ఎక్కువై మధురగతి రగడగా ఉంటున్నది.

8 + 8

8 + 6

8 + 8

8 + 8

మూడో ప్రభేదం – ఇది దాదాపు రెండో ప్రభేదం వంటిదేగాని మొదటి సగంలో ఒక మాత్ర తక్కువైంది. అయితే రెండోసగం, రెండో ప్రభేదంలో లాగే మధురగతి రగడగా రూపొందింది.

8 + 8

8 + 5

8 + 8

8 + 8

నాలుగో ప్రభేదం – ఇది మొదటి సగం విషయంలో మూడో ప్రభేదం వంటిదేగాని, రెండోసగంలో ఒక మాత్ర తక్కువైంది. అంటే శరషట్పదలో ఒక మాత్ర ఎక్కువైందన్నమాట.

8 + 8

8 + 5

8 + 8

8 + 7

ఐదో ప్రభేదం - ఇందులో మొదటి సగంలోనూ, రెండో సగంలోనూ కూడా ఒక మాత్ర చొప్పున తక్కువైనాయి.

8 + 8
8 + 5
8 + 8
8 + 5

అసలు శరషట్పదను వదిలితే, అయిదు శరషట్పద ప్రభేదాలను అన్నమయ వాడుకచేసినట్లు తెలుస్తోంది. వేలసంఖ్యలో ఉన్న సంకీర్తనలను స్థాలీపులాకన్యాయంగా పరిశీలిస్తే వెల్లడైన వివి. ఇంకా మరికొన్ని ఉండవచ్చు గాని స్థూలంగా అన్నమయ ఛందోప్రయోగరీతులను అధ్యయనం చెయ్యడానికి ఇవి చాలు. అన్నమయ వాడిన ఈ శరషట్పద ప్రభేదాలు మరిన్ని శాఖలుగా విస్తరించి అసంఖ్యాకమైన యక్షగాన గేయప్రక్రియలుగా తరువాతికాలంలో రూపొందాయి. ఇంక అన్నమయ రచనలను పరిశీలించవలసి ఉంది.

శరషట్పద :

అన్నమయ రచించిన పాట శరషట్పదలో సాగింది -

'కన్నులుఁ దెరవక - కమలబాంధవుఁడు
వెన్నెల రేడును - వెలయరిదే
అన్నువమలసీ - నరుణోదయమిదే
మిన్నక నీవిటు - మేల్కొనవే

తెల్లనికన్నులుఁ - దెరవక విరియఁగ
నొల్లక జలజము - లున్నవివే
కల్లనిదుర నినుఁ - గవియఁనియ్యక
మెల్లనాయనిటు - మేల్కొనవే

Subhash Nunna

తెరవగు రెప్పలఁ - దెల్లవారవలె
తెరవక చీఁకటి - దీరదిదే
తెరఁగు వేంకటా - ధిపనీవెఱుఁగుదు
మెఱుఁగులు చల్లుచు - మేల్కొనవే

భోగిశయనమును బుసకొట్టెడిని
యోగనిద్రపాయును మేల్కొనవే'[40]

ఈ పాట ముద్రణలో 'మేలుకొనవే' అని ఉంది కాని ఆ విధంగా చదివితే తూగు చెడుతుంది. పెదతిరుమలాచార్యుల రచన 'శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవము' అన్న ద్విపద రచనలో -

'సదమలానంద నిశ్చయముల కంద
విదురుని వింద గోవింద మేల్కనుము
వరరూపవతి జాంబవతితోడి రతుల
విరతిమై నోలాడు నిపుణ ! మేల్కనుము'[41]

'మేల్కనుము' అని ఉండడం వలనా, పై పాటలోని 'మేలుకొనవే'ను 'మేల్కొనవే' అని సవరించవలసి ఉంది. పాట పాటంతా పూర్వోక్తమయిన భీమన లక్ష్యంలో చెప్పినట్లు 1, 3, 4, 6 పాదాలలోనే ప్రాస చెల్లింది. శరషట్పద రూపంలో దీనిని ఇలాగ రాసి చూడాలి -

కన్నులుఁ దెరవక
కమలబాంధవుడు
వెన్నలరేడును - వెలయరిదే
అన్నువ మలసీ
నరుణోదయమిదె
మిన్నక నీవిటు - మేల్కొనవే

ఈ విధంగా చూసినపుడు మొత్తం పాట పాటంతా ఇలాగే చక్కగా

విరిగి ప్రాస, యతి చక్కగా సరిపోతాయి. నాలుగు పాదాలుగా రాసినపుడు యతి నాలుగుపాదాలలోనూ సరిగా పడింది. శరషట్పదగా రాసినపుడు మూడో పాదం, ఆరోపాదంలో యతి పడింది. నిర్దుష్టమైన ఛందంలో అందంగా సాగిన రచన మిది.

అన్నమయ రచించిన మరొక శరషట్పద పూర్వోదాహృతమైన జానపద గేయాన్ని జ్ఞాపకం చేస్తున్నది. అది యిదీ - సౌలభ్యం కోసం పూర్తిగా ఉదాహరిస్తున్నాను.

'వనితలు మనసులు - కుందెన చేసిటు
వలపులు తగనిం - చోలాలా
కనుచూపు లనెడు - రోకండ్లను
కన్నెలు దంచెద - రోలాలా

బంగరు చెఱఁగులు - పట్టుపుట్టములు
కొంగులు దూలఁగ - నోలాలా
అంగన లందరు - నతివేడుకతో
సంగడి దంచెద - రోలాలా

కురులు దూలఁగ మంచి - గుబ్బచనులపై
సరులు దూలాడఁగ - నోలాలా
అరవిరిబాగుల - నతివలు ముద్దులు
గురియుచు దంచెద - రోలాలా

సువ్వి సువ్వి సువ్వి సువ్వని
సుదతులు దంచెద రోలాలా'[42]

ఈ పాటలో కొన్నిచోట్ల తడబాట్లు కనిపిస్తున్నాయి. మొదటిచరణం రెండోపాదంలో ప్రాస తప్పింది. అదే చరణం మూడవపాదంలో రెండుమాత్రలు తగ్గినై. 'రోకండ్లను' అన్న పదంలో 'రో * కం * డ్లను' గా, అంటే రెండు

గురువులను ప్లుతాలుగా చదవవలసి ఉంటుందేమో ! మూడో చరణంలోని రెండో పాదంలో ఒక మాత్ర ఎక్కువైంది. ఈ పాటలోని 'ఓలాలా' అన్నది పైన ఉదహరించిన జానపద గేయంలో 'గోపాలా'గా మారింది. ఓలపాట అంటే జలక్రీడ సమయంలో పాడేపాట అని బ్రౌణ్యం వివరిస్తున్నది. పడవపాట అని కూడా బ్రౌణ్యం చెప్పినమాటే. ఈదులాడటానికే ఓలలాడటం అనే వాడుక తెలుగులో ఉంది. కంకంటి పాపరాజుకృతి విష్ణుమాయావిలాసంలో-

'వింటిని ఏల లొంటినీ బాలఁ
గంటి నీవేళ నోలాల
వెన్నెలతోడ పొన్నలనీడ
సన్నలగూడ నోలాల
వేడుకనైన వేడుక చానఁ
గూడకమాన నోలాల'[43]

అన్న గేయం త్రిస్తబకం అన్న పేరుతో ఉంది. పైన ఉదాహరించిన అన్నమయ కృతి దంపుళ్లపాట. పడవపాటలకీ, జలక్రీడల పాటలకీ ఊతపదమైన ఓలాలా చివరికి అన్నిరకాల పాటలలోనూ 'తందానతాన'లాగా చేరిందన్న మాట. అందువల్ల జానపదగేయంలో 'ఓలాలా' బదులు 'గోపాలా' అన్నది, ఓలాలా పదం అర్థం తెరమరుగైం తరువాత జానపదులు కల్పించుకొన్నది కావచ్చు. ఏది ఏమైనా రెండూ దంపుళ్లపాటలే నన్నది గమనార్హం. మరొక శరషట్పదను అన్నమయ మాండలికమైన యాసను వాడి చమత్కారంగా రచించాడు - మొదటి చరణాన్ని ఆరుపాదాలగానూ, మిగిలిన చరణాలను, నాలుగు పాదాలగానూ, సౌలభ్యం కోసం ఇస్తున్నాను -

'మూటల్ మాటల్
మూరల్ బారల్
బాటలు సదివే - బాపలు తా
వేటల్ వీపుల్

వేలుపు గుడుపుల్
తేటలు మరగిన - దేవుని తా
వాకుల్ చీకుల్ - వాదుల్ పోదుల్
సోకపు తొల్లిటి - సుద్దులు తా
పోకల్ లోకుల్ - పొగడగ మనిపెడి
కేకి గరులతల - కిష్ణుని తా
బగ్గుల్ నగ్గుల్ - బావుల్ సొరగా
దగ్గర వెరపగు - తపసుల తా
సిగ్గుల్ వాపెడి - శ్రీవేంకటపతి -
నగ్గపు సొమ్ముల - యాతని తా
శిన్నెక తేవే శెలువుని తా
వెన్నలు సవిగొను వెన్నునితా'[44]

ఇది చక్కని శరషట్పద రచన. 1, 3, 4, 6 పాదాలతోనే ప్రాస చెల్లింది. మూడోపాదంలోనూ, ఆరోపాదంలోనూ యతి చెల్లింది. మొదటిచరణంలో 'బాటలు' అంటే పాటలై ఉండాలి. అలాగే 'తా' అన్నది 'తే' అన్న అర్థంలో వాడిన ఏకాక్షరపదం.

ఇందులోని భాష మాండలికమైనా ఏమాండలికమో గుర్తించడం కష్టం. గిరిజనుల భాషను అనుకరించడానికి అన్నమయ ప్రయత్నించాడా అన్నది అనుమానం. మొత్తం మీద చమత్కారమైన రచన మిది. 15వ శతాబ్దిలో ఇటువంటి రచన చెయ్యడం పెద్ద తిరుగుబాటే. ప్రబంధ సాహిత్యం రూపొందు తున్న కాలంలో అన్నమయ నలుగురూ నడిచేతోవను అనుసరించలేదు.

శరషట్పద - మొదటి ప్రభేదం :

చివరి పాదాలలో ఒక మాత్రను పెంచి రాయడం వల్ల ఈ ప్రభేదం ఏర్పడింది.

'కన్నుల చూచీ
కడుఁ దలవంచీ
యెన్నిలేవు తన - యెమ్మెలివీ
సన్నల గిరిపీ
సారెకు నవ్వీ
నిన్నట నేటనె - నెరజాణాయ

చేతులు చాచీ - చేతలు చెప్పీ
యీతల దనునే - నెరగనిదా
రీతులె వెదకీ - రేసులె యణచీ
జాతుల తనకివి - సహజము లాయ

బుద్ధులు చెప్పీ - బొరుగులు మెట్టీ
గద్దులె తనకూ - గలిగినవే
వొద్దనె శ్రీ వేంక - టోత్తముడు నన్ను
ముద్దులకూడగ - మోహనమాయ'[45]

ఈ శరషట్పద ప్రభేదంలో మూడోచరణం మూడోపాదంలో ఒక మాత్ర ఎక్కువైంది. 'వొద్దనె శ్రీవేంక - టోత్తముడు' అని చదివితే ఛందస్సు సరిపోతుంది. అయితే 'శ్రీ' పాటలో సద్దుకుంటుందేమో!

ఈ రకమైన ఛందంలో అన్నమయ రచనలు మరికొన్ని కానవస్తున్నాయి. శరషట్పదనూ, ప్రభేదాలనూ ఆయన నాలుగు పాదాల ఛందంగానే తీసుకుని పొరబడిన సందర్భాలూ ఉన్నాయి. ఉదాహరణకు -

'కూరిమి మటములు
గోపురంబులును
తేరు పడగలే - తెరువెల్లా
కోరినపండ్లు, గు -

రేసేటి తరువులు
తోరములైనవె - దురుజొంపములు'[46]

విరగవలసినచోట విరగకుండా సాగిన పాదాలు శరషట్పద మొదటి ప్రభేద ఛందస్సు నడకను చెడగొడుతున్నవి.

శరషట్పద - రెండో ప్రభేదం :

ఈ రెండో ప్రభేదంలో చరణంలోని మొదటి రెండుపాదాలూ శరషట్పద కాగా తరువాతి రెండు పాదాలూ అంత్య ప్రాసలేని మధురగతి రగడగా కనిపిస్తుంది. ఛందస్సులో అన్నమయ పోయిన పోకడలలో ఒకటిగా ఈ గేయం కనిపిస్తుందే తప్ప, ఛందో నిర్వహణం అంత సమర్థవంతంగా సాగలేదనిపిస్తుంది. చూడండి -

'పాపము వాయదు
పైపై మనసున
కోపము దీరదు - కొంతైనా
దీపనబాధయుఁ
దీరదిన్నియును
యేపునఁ బెనఁగొనె - నింకనో తెరువు

యవ్వనమదమును
నెడయదు కోరికె
కొవ్వును నఱఁగదు - కొంతైనా
రవ్వగు మమకా
రముఁ బెడఁబాయదు
యెవ్విధియునులే - దింకనోతెరువు
వెఱపును విడువదు

వెడమాయలఁబడి
కొఱంతయు దీరదు – కొంతైనా
తెఱఁగొసగెడి శ్రీ
తిరువేంకటపతి
నెఱిఁగి నెఱఁగలే – మిఁకనోతెరువు

తొక్కనిచోట్లు దొక్కెడి మనసు
యెక్కడ గతిలేదింకనో తెరువు'[47]

ప్రాస 1, 3, 4, 6 పాదాలలో చెల్లడం చూడవచ్చు. ఇందులోని చరణం అంటే రెండో శరషట్పదలో రెండో సగంలోని తొలి పాదం విరగ చోట విరగలేదు. నాలుగుపాదాల ఛందంగా పొరబడటంవల్ల కాబో తడబాటు.

శరషట్పద – మూడో ప్రభేదం :

చక్కగా భావం, ఛందస్సు కలిసి మెలిసి సాగిన రచన మిది. ఇ ముద్ర ఉన్నచోట 'శ్రీ'కి దీర్ఘం లేకుండా 'శ్రీవేంకటేశుఁడు' అని చదువుక ఛందం సరిపోతుంది –

'చెప్పినమాటకు
చేసిన చేఁతకు
చప్పని వలపులె – సరిదాఁకె
ముప్పిరిఁ దనకే
మొక్కే నేనిదె
అప్పటినాతో – నానలువలెనా

యేచి వెనకటికి – నిప్పటి ఉనికికి
చూచినప్పుడే – సూటేయ
చేచేతులఁ దన – సేవలు నాకిదె

నాచోటికి నీ - నటనలు వలెనా

వేడుక పడుటకు - వేఁడుకొనుటకును
కూడినప్పుడే - గుఱుతాయ
యీడనె శ్రీవేంక - టేశుడు తానేలె
ఆడికగా నిఁక - ననుకొనవలెనా

తానదె నేనిదె - తతి వచ్చె
నానిన సెలవుల - నగవులు వలెనా'[48]

ఇందులోని చివరి చరణంలో రెండుమాత్రలు ఎక్కువైనై. అన్నమయ రచనలలో చాలావాటిలో ముద్రను ఇమడ్చవలసినచోట ఇటువంటి ఇబ్బందులు మామూలే.

శరషట్పద - నాలుగోప్రభేదం :

ఇది కూడా అందమైన రచనమే. ముద్ర ఒకటే ఇబ్బంది కలిగించింది. యువతికి పర్యాయపదాలను ఐదు మాత్ర లున్నవాటిని తొలి సగంలో వాడుకోవడం అన్నమయ గడుసుదనానికి నిదర్శనం. ఐదు మాత్రల పర్యాయపదాల వల్ల ఒక మాత్ర తగ్గడం అందంగా జరిగింది.

'కందువ నీతో
గక్కునఁ జెప్పిన
చందము దెలిపీ - జవరాలు
చిందిన నవ్వుల
సిగ్గులతోనే
విందులు చెప్పీ - విచ్చేయవయ్యా

మచ్చికనీపై - మలయచుఁ జల్లిన
మచ్చులు దెలిపీ - మదిరాక్షి

రచ్చల కెక్కిన - రాజసమిననే
విచ్చి వలపులు - విచ్చేయవయ్యా

తనువులు సోఁకఁగ - తలఁపులు గరఁగిన
అనువులు దెలిపీ - నలివేణి
యెనసితి శ్రీవేంక - టేశ యీసతిని
వెనుకొని పొత్తుకు - విచ్చేయవయ్యా
ఓవరిలోనిది - ఒక మనసు
భావము దెలిపీఁ - బదగదవయ్యా'[49]

చివరి చరణంలో మూడవపాదంలో 'శ్రీ' 'శ్రి'గా చదవవలసిన ఇబ్బంది ఇతర గేయాలలోనూ ఎదురైన ఇబ్బందే. ఇలాంటిదే మరో రచన 22వ సంపుటంలోని 388 సంకీర్తన.

శరషట్పద - అయిదో ప్రభేదం :

ఈ తరగతికి చెందిన రెండు రచనలను గుర్తించడం జరిగింది. ఒక రచనమిదీ -

'నేరము లెంచిన
నెపములు వేసిన
వూరక లోలో - నొల్లనిది
కూరిమి గొసరిన
గుట్టున నుండిన
సారె వలపులవి - చప్పనివి
పంతము లాడిన - పరాకు సేసిన
సంతతమగుతమి - చాలనిది
వంతులు వట్టిన - వళకు లాడినను
అంత చుట్టరిక - మాపాటిది

వొక్కట నవ్విన - వొడఁబరపించిన
యిక్కువ కాఁగిలి - యెరవులది
గక్కన శ్రీవేం - కటపతి గలసెను
తక్కులు తొలుతే - దాఁటినవి

చెలులిఁక నాయము చెప్పకురే మీరు
చలములు నడుమనె సాధించేటివి'[50]

ఈ శరషట్పదప్రభేదంలో పాటంతా చక్కగానే నడిచింది గాని, రెండో చరణం మూడోపాదంలో - 'మాపాటిది' అని ఆరుమాత్రలను వాడటం అన్నమయ్య పరాకు చిత్తగించడం వలననా అని అనుమానించవలసి వస్తున్నది. మిగిలిన పాటంతా ఒకవిధంగా వుండగా కేవలం ఈ పాదం మాత్రమే భిన్నంగా ఉంది. ఇదే ఛందంలో ఉన్న మరొక సంకీర్తనంలోనూ అన్నమయ తడబడినట్లు కనిపిస్తున్నది. ఆ చరణాన్ని మాత్రం ఉదాహరించడమౌతోంది -

'ననుపునటించక - నవ్వులు నవ్వక
కొనగొన ప్రియములు - గుటిలేవు
మనసులు గలయక - మాఁటలఁదనియక
చెనకెటి చెనకుల - సెలవేలేదు'[51]

ఇందులో 'సెలవేలేదు' అనడంతో ఏడుమాత్రలు వచ్చి చేరాయి. మొదటి పాటలో ఒకచోట ఒకమాత్ర ఎక్కువైతే, రెండోపాట ఒక చరణంలో రెండు మాత్రలు ఎక్కువైనాయి. ఏమరుపాటు వలన వచ్చిన ఇబ్బందే ఇది అనుకోక తప్పదు. మరొకపాట - 22వ సంపుటంలోని 310వ సంకీర్తనలో కూడా మూడోచరణంలోని చివరి రెండుపాదాలూ ఇలాగే దెబ్బతిన్నాయి. ఈ పాటలో మొదటి రెండు చరణాలలో చక్కగా సాగిన రచనతో పోలిస్తే, చివరి చరణంలోని చివరిపాదాల నడకలోనే లోపం ఉన్నట్టు స్పష్టమౌతున్నది. అందువల్ల ఈ రకం పొరబాట్లు రచయిత అజాగ్రత్తవల్ల వచ్చినవేనని చెప్పవలసి ఉంటుంది.

కుసుమషట్పద :

పాదానికి రెండేసి పంచమాత్రాగణాలతో మూడు పాదాలూ, మూడో పాదం చివర ఏడుమాత్రల గణ మొకటీ చొప్పున మొత్తం ఆరుపాదాల ఛందం కుసుమషట్పద. అన్నమయ పద్ధతిలో ఇలా ఉంటుంది.

10 - 10
10 - 7

మలిసగం కూడా ఇదే విధంగా ఉంటుందన్నమాట. అన్నమయ రచన మిదీ –

'జలజాక్షి మోమునకు
జక్కవ కుచంబులకు
నెలకొన్న కప్పురపు – నీరాజనం
అలివేణి తురుమునకు
హస్త కమలంబులకు
నిలువు మాణిక్యముల – నీరాజనం

చరణ కిసలయములకు – సకియ రంభోరులకు
నిరతమగు ముత్తేల – నీరాజనం
అరిది జఘనంబునకు – అతివ నిజనాభికిని
నిరతి నానావర్ణ – నీరాజనం

పగటు శ్రీవేంకటేశు – పట్టపురాణియై
నెగడు సతి కళలకును – నీరాజనం
జగతి నలమేల్మంగ – చక్కఁదనములకెల్ల
నిగుడు నిజశోభనపు – నీరాజనం

క్షీరాబ్ధికన్యకకు – శ్రీ మహాలక్ష్మికిని
నీరజాలయమునకు – నీరాజనం'[52]

ఇది చక్కని కుసుమషట్పద రచన. 1, 3, 4, 6 పాదాలలోనే ప్రాస. యథాప్రకారం ముద్రవున్నచోట మాత్రలు అస్తవ్యస్తమైనాయి. మూడో చరణం తొలిపాదంలో తొలిసగంలో పదకొండుమాత్రలూ, మలిసగంలో తొమ్మిది మాత్రలూ పడ్డాయి. పాదం మొత్తంగా చూస్తే మాత్రలు సరిపోవచ్చుగానీ, కుసుమషట్పదకు ఈపాదం రెండు పాదాలుగా విరగవలసింది సరిగా విరగదు. పరిష్కర్తలు 'నీరజాలయకును' అన్న పాఠాన్ని – పల్లవికి – సూచించారు. అయితే ఛందోరీత్యా చూస్తే అన్నమయ రాసింది 'నీరజాలయమునకు' అనే వ్యక్తమౌతుంది. అన్నమయ రచనల పరిష్కరణకు ఛందస్సు కూడా తోడ్పడ తుందన్నమాట. ఇలాగే ఛందాన్ని దృష్టిలో పెట్టుకోకుండా రేకులలో పాఠాన్ని సరిదిద్దడం జానపద సీసం గురించి చర్చించినప్పుడు గుర్తించడం జరిగింది.

కుసుమషట్పద - ప్రభేదం :

శరషట్పద ఛందంలోలాగే అన్నమయ కుసుమ షట్పద ఛందంలో కూడా ఒక మాత్రను ఎక్కువ చేసుకుంటూ ప్రయోగాలు చేశాడు. ఈ ప్రభేదంలో మాత్రల సంఖ్య ఈ విధంగా ఉంటుంది–

10 - 10
10 - 8

ఇంక రచనను చూద్దాం –

'అతివ జన్మము సఫల
మై పరమయోగివలె
నితర మోహాపేక్ష – లిన్నియును విడిచె
సతి కోరికలు మహా
శాంతమై యిదె చూడ
సతత విజ్ఞానవా – సన వోలె నుండె

తరుణి హృదయము కృ - తార్థతఁబొంది విభుమీఁది
పరవశానంద సం - పదకు నిరవాయ
సరసిజానన మనో - జయమంది యింతలో
సరిలేక మనసుని - శ్చలభావమాయ
శ్రీవేంకటేశ్వరునిఁ - జింతించి పరతత్వ
భావంబు నిజముగాఁ - బట్టెఁజెలియాత్మ
దేవోత్తమునికృపా - ధీనురాలై యిపుడు
లావణ్యవతికిను - ల్లంబు దిరమాయ
ఇదిగాక సౌభాగ్య - మిదిగాక తపము, మఱి
యిదిగాక వైభవం - బిఁక నొకటి కలదా'[53]

ఈ రచనలో భావం అందమైనది. అయితే ఛందానికి ఒదగలేదు. విరగ కూడని చోట్ల విరిగిన పాదాలు నడకను చెడగొడుతున్నాయి. కుసుమ షట్పదను నాలుగుపాదాల ఛందంగా అన్నమయ నిర్వహించినట్లున్నాడు.

భోగషట్పద ప్రభేదం :

అన్నమయ రచనలలో అచ్చంగా భోగషట్పద నాకంటి కానలేదు. కాని భోగషట్పదప్రభేదం మాత్రం రెండు రచనలలో ఉంది. సాళువ నరసింహరాయల కొలువులో పాడిన రచన మిది. ఇటువంటి పాటనే తనమీద పాడమని నరసింహరాయలు కోరినప్పుడు అన్నమయ నిరాకరించడంతో తాత్కాలికంగా వారి స్నేహం చెడింది.

భోగషట్పదకు ఆరుపాదాలు. పొట్టిపాదాలలో నాలుగేసి త్రిమాత్రా గణాలూ, పొడుగుపాదాలకు నాలుగు త్రిమాత్రాగణాల మీద మరి రెండు త్రిమాత్రాగణాలూ పైన ఒక గురువూ ఉంటాయి. ఈ చివరి గురువును అన్నమయ రెండు లఘువులుగా మార్చుకొన్నాడు. అన్నమయ రచనలలోని ఛందం అచ్చమయిన భోగషట్పద కాదు. దాని ప్రభేదం మాత్రమే. అచ్చమైన భోగషట్పదకు, అన్నమయ పద్ధతిలో మాత్రాక్రమం ఇలాగ ఉంటుంది.

12 - 12

12 - 8

12 - 12

12 - 8

దీనిలో అన్నమయ తొలిసగంలో ఎనిమిది మాత్రల బదులు తొమ్మిది మాత్రలూ, మలిసగంలో ఎనిమిదిమాత్రల బదులు పదిమాత్రలూ వినియోగించాడు. ఇంక రచన -

'కలికిచకోరాక్షికిఁ గడ
కన్నులు కెంపై తోఁచిన
చెలువంబిప్పుడిదేమో - చింతింపరె చెలులు
నలువునఁ బ్రాణేశ్వరుపై
నాఁటిన యాకొనచూపులు
నిలువునఁ బెరుకఁగ నంటిన - నెత్తురుకాదుగదా !

పడఁతికి చనుగవ మెఱుఁగులు - పైపై పయ్యెద వెలుపల
కడుమించిన విధమేమో - కనుగొనరే చెలులు
ఉడుగని వేడుకతోఁ - బ్రియుడొత్తిన నఖశశిరేఖలు
వెడలఁగ వేసవికాలపు - వెన్నెలకాదుగదా

ముద్దియ చెక్కుల కెలఁకుల - ముత్యపుజల్లుల నేర్పుల
వొద్దికలాగు లివేమో - ఊహింపరె చెలులు
గద్దరి తిరువేంకటపతి - కామిని వదనాంబుజమున
అద్దిన సురతపుఁజెమటల - అందము కాదుగదా

ఏమొకో చిగురు టధరమున - యెడనెడఁగస్తురినిండెను
భామిని విభునకు వ్రాసిన - పత్రికకాదుగదా !'[54]

యే విధమైన ఒడిదుడుకులూ లేకుండా హాయిగా అందాలను వెద

జల్లుతూ సాగిన అన్నమయ కవిత్వ వాహిని ఇది. ఆయన జీవించిన కాలంలోనే ఆయనకు మహాకవిగా పేరు తెచ్చిన రచన మిది. ఈ ఛందఃప్రభేదంలోనే అన్నమయ మరికొన్ని రచనలను చేశాడు. ఉదాహరణకు –

'కన్నుల నవ్వెడినవ్వులు – గబ్బితనంబుల మాటలు
నున్నని యొయ్యారంబులు – నొచ్చిన చూపులును
విన్నఁదనంబుల మఱపులు – వేడుకమీరిన యలపులు
సన్నపుఁజెమటలుఁ దలఁచిన – ఝల్లనె నామనసు'[55]

పేరు తెలియని ఛందం :

అన్నమయ పై రచనలను చూసిన తరువాత ఏదో ఒక ఛందం లేకుండా ఆయన పాట రాయడని అనిపించడం సహజం. నిజానికి ఏవిధమైన ఛందో వ్యవస్థలేని పాటలు అన్నమయ కృతులలో అత్యల్పం. మనకు తెలియని ఛందస్సుల ననేకం ఆయన వినియోగించాడు. కొత్తప్రయోగాలను చేశాడు. అటువంటి రచనలన్నిటినీ సోదాహరణంగా చర్చించడం ఒక గ్రంథంలో అయ్యే పని కాదు. ఒకరివల్ల అయ్యేపనీ కాదు. చివరగా ఒక్క ఉదాహరణను పరిశీలించాలి –

'పరమున/నిహమున/వెంట/వెంటనే – పాయని/బంధువు/డీతండు
ధరదను/దలచిన/మారు/కుమారై – తార/క్షించును యీతండు
విరివిగ/నింద్రియ/విషయ/భోగముల – విందులు/వెట్టును/యీతండు
వురుగతిఁ/జిత్రపు/రూపు/లదేహపు – టుడుగర/లిచ్చును/యీతండు'[56]

ఇందులో చతుర్మాత్రాగణాలు రెండు, తరువాత సూర్యగణం, తరువాత పంచమాత్రాగణం తరువాత చతుర్మాత్రాగణాలు రెండు చివర పంచమాత్రా గణం వరుసగా ఉన్నాయి. రకరకాల ఛందాలను ఆయన ప్రయోగించినవాడు కావటంవలన కొత్త ఛందాలను ఆయన సృష్టించుకొన్నాడా అని పై గీతాన్ని చూస్తే అనిపించకతప్పదు. ఇన్నివేల సంకీర్తనలను రచించిన అన్నమయ

రచనలు ఛందోవేత్తల దృష్టికి రాకపోవడం నిజంగా దురదృష్టమే. ఈ రంగంలో పెద్దయెత్తున పరిశోధన జరగవలసి ఉంది.

తెలుగుపాటకు ఛందోరీత్యా సువ్యవస్థిత రూపమిచ్చాడు కనుకనే ఆయన పదకవితాపితామహుడన్న సార్థకమైన బిరుదాన్ని పొందగలిగాడు. యక్షగాన రూపకానికి అందమైన గేయ ఛందస్సులను ప్రసాదించాడు.

అధోజ్ఞాపికలు

1. శృంగార సంకీర్తనలు - సంపటం 12, సంకీర్తన 25
2. అధ్యాత్మ సంకీర్తనలు - సంపుటం 1, పునర్ముద్రణ, సంకీర్తన 252
3. అదే, సంకీర్తన 44
4. సంకీర్తన లక్షణం, ప. 55
5. అధ్యాత్మ సంకీర్తనలు - సంపుటం 1, పునర్ముద్రణ, సంకీర్తన 337
6. అదే, సంకీర్తన 246
7. అదే, పు. 165
8. అన్నమాచార్యుల సంకీర్తనలు - కూర్పు శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి, 'అన్నమాచార్యుని కవిత', రాళ్లపల్లివారి రేడియో ప్రసంగం, పు॥లు 19, 20
9. అధ్యాత్మ సంకీర్తనలు - సంపుటం 1, సంకీర్తన 249
10. పద్యసార - మహానవమియుగపదగళు, కన్నడ గ్రంథం, పు॥లు 11, 12
11. కన్నడ ఛందోవికాస - డా॥ డి. ఎస్. కర్కి, కన్నడ గ్రంథం, పు. 146
12. అదే, పు. 146
13. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 11, 2వ భాగం, సంకీర్తన 36
14. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 1, పునర్ముద్రణ, సంకీర్తన 67
15. అదే, పుట 45, అథోజ్ఞాపిక
16. రాజశేఖర విలాసం - 1.17
17. కన్నడ ఛందోవికాస, పు. 206
18. స్త్రీల పౌరాణికపు పాటలు - సంకలనం కృష్ణశ్రీ, పు. 35
19. తాళ్లపాక కవుల పదకవితలు - డా॥ వేటూరి ఆనందమూర్తి, పు. 318
20. అదే, పు. 7
21. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 11, 2వ భాగం, సంకీర్తన 70
22. శృంగార సంకీర్తనలు, సంపుటం 12, సంకీర్తన 70
23. అదే, సంకీర్తన 310
24. సమగ్ర ఆంధ్రసాహిత్యం, మొదటి సంపుటం, చాళుక్యయుగం, ఆరుద్ర, పు. 82

25. ఆంధ్రమహాభారతం - ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రచురణ, ఆదిపర్వం, చతుర్థాశ్వాసము, ప. 254
26. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 11, 2వ భాగం, సంకీర్తన 51
27. కర్ణాటక కవిచరిత్రె, మొదటి భాగం, కన్నడ గ్రంథం, పు. 85
28. కళాపూర్ణోదయము, అష్టమాశ్వాసము, పు. 237
29. అదే
30. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 2, పునర్ముద్రణ, సంకీర్తన 93
31. శృంగార సంకీర్తనలు, సంపుటం 12, సంకీర్తన 233
32. శృంగార సంకీర్తనలు, సంపుటం 11, మూడవభాగం, సంకీర్తన 112
33. స్త్రీల పౌరాణికపు పాటలు, సంకలనం, కృష్ణశ్రీ, పు. 332
34. రాధికాసాంత్వనము - ముద్దుపళని, అనుబంధంలో ఈ సప్తపదులు చేర్చారు.
35. యక్షగానములు - తంజావూరు, సంపుటం 4, పు. 184
36. విష్ణుమాయావిలాసము - పరిష్కర్త డాక్టర్ నేలటూరి వేంకటరమణయ్య, పు. 23
37. ఆంధ్ర యక్షగానవాఙ్మయచరిత్ర - ఆచార్య యస్వీజోగారావు, పు. 240
38. తాళ్లపాక కవుల పదకవితలు - డా॥ వేటూరి ఆనందమూర్తి, పు. 31
39. ఛందఃపదకోశము - శ్రీ కోవెల సంపత్కుమారాచార్య, పు॥లు 220-21
40. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 1, సంకీర్తన 139
41. శ్రీ వేంకటేశ్వర వచనములు, పరిష్కర్త శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి, ఇందులోనే సుప్రభాత స్తవమును ప్రచురించారు. పు. 83
42. శృంగార సంకీర్తనలు - సంపుటం 12, పునర్ముద్రణ, సంకీర్తన 352
43. విష్ణుమాయావిలాసము - కంకంటి పాపరాజు, పు. 47
44. శృంగార సంకీర్తనలు - సంపుటం 12, పునర్ముద్రణ, సంకీర్తన 268
45. శృంగార సంకీర్తనలు - సంపుటం 22, సంకీర్తన 215
46. అధ్యాత్మ సంకీర్తనలు - సంపుటం 1, పునర్ముద్రణ, సంకీర్తన 119
47. అదే, సంకీర్తన 276
48. శృంగార సంకీర్తనలు - సంపుటం 22, సంకీర్తన 368
49. శృంగార సంకీర్తనలు - సంపుటం 22, సంకీర్తన 316
50. అదే, సంకీర్తన 394
51. అదే, సంకీర్తన 171
52. శృంగార సంకీర్తనలు - సంపుటం 26, సంకీర్తన 295
53. శృంగార సంకీర్తనలు - సంపుటం 12, పునర్ముద్రణ, సంకీర్తన 17
54. అదే, సంకీర్తన 82
55. అదే, సంకీర్తన 138
56. అధ్యాత్మ సంకీర్తనలు - సంపుటం 2, సంకీర్తన 392.

8. యక్షగాన సంప్రదాయం - 1

యక్షగాన సరణి

తెలుగు యక్షగానం విలక్షణమైన రూపకప్రక్రియ. మనదని చెప్పుకోదగిన, శతాబ్దాల చరిత్ర గలిగిన నాటకప్రక్రియ యక్షగానం. తెలుగు యక్షగానం గురించి చెప్పుకోదగినంత పరిశోధన జరిగినా, జరగవలసింది చాలా ఉంది. నేటికీ కొన ఊపిరితో దేశం మారుమూల గ్రామాలలో జీవించి ఉన్న కళాకారుల గురించి పరిశోధన జరగడం కాని, ఆయా బృందాల ప్రదర్శనలకు నూతనోత్తేజాన్ని కలిగించే ప్రయత్నాలు చేయడంగాని జరగలేదు. ఒకనాడు వైభవంగా వెలిగిన యక్షగానం మరపు తెరలమాటు మణిగిపోయి, ఆ మహత్తర కళారూపం గురించిన పొరబాటు అభిప్రాయాలు వ్యక్తమౌతుండడం వలన, ఆ యక్షగాన రూపక సంప్రదాయ చరిత్రను గురించి కొంత చెప్పుకోవలసి ఉంది.

యక్షగానానికి తమ పేరును ఇచ్చిన యక్షుల గురించి కొంత తెలుసు కోవలసి ఉంది. ఈ యక్షులు దేవయోనులు. రాక్షసులకు ఒక మెట్టు పై వారు. బౌద్ధ జాతక కథలలో క్షుద్రదేవతలుగా వీరు దర్శనమిస్తారు. వీరి చరిత్ర వేదకాలం నాటిది. వీళ్లు సాధారణంగా పామరజనుల పూజలందుకొంటూండే వారని చరిత్రకారుల అభిభాషణ.[1] కుబేరుడు యక్షుడు. ఉత్తరదిశకు పాలకుడు. భారత పురాణేతిహాసాలలో ప్రసిద్ధుడు.

యక్షుల ప్రతిమలు బార్‌హుత్, సాంచీ, అమరావతి స్తూప శిల్ప ఫలకాల మీద విశేషంగా కానవస్తాయి. సిరిసంపదలకోసమూ, సంతాన ప్రాప్తికీ, ఆపదల నివారణకూ సుఖమైన జీవనం కోసమూ జానపదులు యక్షుల్ని కొలిచేవారు. హిందూ దేవాయతనాలలో అధిష్ఠానదేవతతోపాటు పరివార దేవతలకు కూడా స్థానం లభించినట్టు బౌద్ధక్షేత్రాలలో తథాగతునితోపాటు ఈ యక్షులకు కూడా

స్థానం లభించింది. బుద్ధునికి పూర్వం నుంచే పూజలందుకొంటున్న యక్షులను సరసను చేర్చుకొని సామాన్యులకు చేరువకాగలిగింది బౌద్ధం.

బార్‌హుత్ శిల్పాలలోనూ, అమరావతి శిల్పాలలోనూ యక్షులపేర్లు కొన్ని కానవస్తున్నాయి. ఉదాహరణకు, 'కుపిరొయఖొ', 'విరూఢకొయఖొ', 'సుదసనయఖొ', 'చదాయఖి', 'సిరిమాదేవతా' మొదలైనవి కొన్నిపేర్లు. వీటిలో కుపిరొయఖొ అంటే కుబేరయక్షుడు. చదాయఖి అంటే చంద్రయక్షిణి. సుదసనయఖొ అంటే సుదర్శన యక్షుడు. సిరిమా దేవతా అంటే శ్రీలక్ష్మి. ఈ శ్రీలక్ష్మి యక్షిణే సాంచీస్తూపద్వారాల మీద కూడా కానవస్తుంది. నేటికీ పూజలందుకొంటున్న మాతృదేవత (Mother Goddess) ఈమె.

తొలియక్ష విగ్రహాలు మౌర్యయుగం నాటివి. అంతకుముందు బహుశా విగ్రహాలను కేవలం దారువుతోనే నిర్మించి ఉండటం వలన కాబోలు ఆనాటి విగ్రహాలేవీ కానరావడంలేదు. ఋగ్వేదంలోని ప్రస్తావనలను[2] దృష్టిలో పెట్టుకొని చూస్తే యక్షపూజ ప్రాగైతిహాసికకాలం నుంచీ ఉన్నదని భావించడం అసంగతం కాబోదు. మౌర్యులకాలంనాటి విగ్రహాలు స్పష్టంగా జానపద కళారీతిని వ్యక్తం చేస్తున్నాయని శ్రీ వాసుదేవ అగ్రవాలా గారు అభిప్రాయ పడుతున్నారు.[3] తొలికాలపు బుద్ధప్రతిమలూ, శివ, విష్ణు విగ్రహాలూ కూడా ఆనాటి యక్ష విగ్రహాల నమూనా మీదనే నిర్మితమైనట్లు కూడా గ్రహించవచ్చు.

పరిశోధకులు నిర్ణయించినట్లు యక్షశబ్దం నుంచే జక్కు శబ్దం వచ్చి ఉండాలి.[4] ఈ జక్కు శబ్దం ఒక్క తెలుగుదేశాననే కాదు ఉత్తరభారతంలో కూడా చాలా ప్రాంతాలలో కనిపిస్తుంది. భరత్‌పూర్ జిల్లాలోని 'నోహ' గ్రామంలో లభించిన యక్ష విగ్రహానికి 'జఖియా' అనే పేరు సంప్రదాయ సిద్ధంగా వస్తూన్నది. అలాగే సుప్రసిద్ధమైన బౌద్ధశిల్ప కేంద్రమయిన మధురకు సమీపాన 'బరోడ' అనే గ్రామంలో లభించిన యక్ష విగ్రహం కూడా 'జఖియా' అనే పేరుతోనే పూజ లందుకొంటున్నట్లు డాక్టర్ వోగెల్ పండితుడు పేర్కొన్నాడు.[5]

తెలుగు యక్షగానాల గురించి మొట్టమొదటగా పరిశోధన చేసిన పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి గారు -

> 'యక్షులు అను పదమునకు మన పండితులు జక్కులు అనునది తద్భవ రూపమని వ్యవహరించు నాచారమున్నది. కాని జక్కులు అనుమాట కేవలము దేశ్యము అని నా భావము. మనవారు దేశ్యశబ్దముల కనేకమునకు ఆర్యతాప్రాకట్యమునకు కాబోలు - సంస్కృతరూపములను కల్పించి వ్యత్యయము చేసి సంస్కృత భావత్వమును అనుగ్రహించి యున్నారు'[6]

అని అభిప్రాయపడ్డారు కాని అది సరికాదు. ఆ విషయం పైన పేర్కొన్న ఉదాహరణలతోనే తెలుస్తున్నది గదా !

యక్షగానానికి తెలుగు పేరు జక్కుల కథ. యక్షకథాగాన మన్నమాట. తొలిదశలో ఇది గేయప్రక్రియ మాత్రమే. రూపకప్రక్రియ కాదు. యక్షుల ప్రీత్యర్థం వాళ్ల కథలను చెప్పుకొనడం కోసం ఈ కథాగానపద్ధతి ఏర్పడింది. ఈనాటికీ పూజాగౌరవాలను పొందుతున్న యక్షదేవతాశ్రేణి సప్తమాతృకలు. ఈ సప్త మాతృకలకే తెలుగులో 'అక్కల'ని పేరు. ఈ 'అక్క' అనేపేరు పాలీభాషా పదం. 'యఖో' నుంచి దిగుమతై ఉండాలి. కన్నడసాహిత్యంలో కనిపించే 'ఎక్కలగాణ'లు[7] ఈ యక్షకథాగానం చేసే గాయకులే. 'ఎక్క' అన్నపదం కూడా పాలీభాషాపదానికి వడపోతే. తెలుగుదేశపు గ్రామదేవతలలో 'ఎక్కలమ్మ' కూడా ఉంది. 'ఎక్కిలిదేవి' అనేది ఈ పేరుకే మరొక రూపం.[8]

అక్కల పేరున తెలుగుదేశాన పేరు కెక్కిన దేవతలు సప్తమాతృకలేనని క్రీడాభిరామం సాక్ష్యం పలుకుతోంది. వీళ్లు 'మాణిభద్ర కులోద్వహులైన దేవతలు'[9] మాణిభద్రుడు యక్షుడు. యక్షరాజైన కుబేరుడి సేనాపతి[10] ఈ యక్షదేవతలే కాలక్రమాన గ్రామదేవతలుగా మారడం జరిగింది. ఈ గ్రామదేవత లందరికీ ఈనాటికీ జాతరలూ, కొలుపులూ జరుగుతూండడం చూస్తే వీళ్ల

ప్రభావాన్ని సులభంగానే ఊహించుకోవచ్చు. ప్రాచీనకాలపు యక్షులకు లాగానే ఈ గ్రామశక్తులకూ జానపదులే భక్తులు. సంతానదాతలుగా, సంతాన రక్షకులుగా యక్షులూ, గ్రామదేవతలూ ప్రసిద్ధులే.

ఏకవీర, కాకతి, కాట్రేడు, పోతురాజు, కంబుమయ్య, పుట్టలమ్మ, అంకమ్మ, ఎక్కిలిదేవి, ధర్మరాజు మొదలైన దేవతలు చాలా శతాబ్దుల కిందే గ్రంథాల కెక్కిన గ్రామశక్తులు. ఈ దేవతల చుట్టూ ఒక ప్రత్యేకమయిన సంస్కృతి అభివృద్ధి చెంది వ్యాపించి ఉంది. కాలక్రమాన వైదిక ధర్మానికీ, జానపద ధర్మానికీ ఇచ్చిపుచ్చుకోవడాలు జరిగినా కూడా, రెండూ వేర్వేరుగానే కనిపించే లక్షణాలు ఎక్కువగా ఉన్నాయి.

దేవతలను గీతనృత్యాలతో కొలవడం ప్రాచీన మానవులు ప్రపంచ మంతటా అనుసరించిన విధానమే. ప్రథమంలో దేవతాస్తుత్యర్థం గానం చేసిన గీతాలు అశువుగానే ఉండి ఉంటాయి. ఈ గీతాలు ఆయా దేవతల కథలను ప్రస్తుతిస్తూ సాగేవి. దాదాపు ఇదేవిధంగా మొలకెత్తిన ఆదిమగీతాలు ఆదిమ మానవుడి మనోలోకానికి అధినేతలయిన యక్షులను ప్రస్తుతించి ఉండాలి. అయితే ఆ ఆదిమగీతాలు మనకు లభ్యం కావు. ఆ గీతశకలాలే పరంపరగా వచ్చే గీతాలలో సంకేతాలరూపంలో కనబడవచ్చు. వాటిని గుర్తించడానికి మార్గమే లేదు. కనీసం బౌద్ధయుగంలోనైనా లిపిబద్ధం అయివుంటే కొంత మేలు జరిగేది. కాని తొలినాటి బౌద్ధం జానపదులను ఆకర్షించేందుకై యక్షులకు తన దేవతాశ్రేణి సరసన పెద్ద పీట వెయ్యడానికి సిద్ధమై ఉండవచ్చు గానీ, వాళ్ల గాథాలాపాల నన్నింటినీ స్వీకరించడానికి ఇష్టపడి ఉండదు. అలా చేసినట్లయితే బౌద్ధం రూపుమారిపోయి ఉండేది. అటు వైదిక ధర్మావలంబు లకు గానీ, ఇటు బౌద్ధదీక్షాపరులకు గానీ అంగీకార యోగ్యంకాని యక్ష సాహిత్యం శృతిపూర్వకంగా వస్తున్నప్పటికీ తగిన వాతావరణం లేని కారణాన గ్రంథస్థం కాలేదని భావించాలి. కాలక్రమేణా బౌద్ధం అడుగంటి, వైదిక ధర్మ పునరుజ్జీవనకాలంలో వైదికదేవతల సహపంక్తిని స్థానం లభించినప్పుడు,

యక్షులు వేషం మార్చి, పేర్లు మార్చి యెక్కలమ్మలుగా, యెల్లమ్మలుగా రంగ ప్రవేశం చేశారు. అయితే వాళ్ల భక్తపరివారం మాత్రం తొలినుంచీ జానపదులే.

ఎల్లమ్మ, అంకాళమ్మ, చౌడమ్మ, పోలేరమ్మ మొదలైన ఆదిమ మాతృ దేవతలు హైందవ ప్రభావంతో దుర్గాశక్తితో అభేదం పొందారు. నిజానికి ఆదేవతల కథలకూ దుర్గాశక్తి కథలకూ ఏ విధమైన పోలికలూ లేవు. ఏ దేవత కథలు ఆ దేవతలవిగానే మిగిలిపోయినా, బాహిరంగా దుర్గాదేవికి రూపాంత రాలుగా ఈ గ్రామదేవతలు మిగిలిపోయారు.

మన పరిశోధకులు చాలామంది 'యక్షగానం' అంటే యక్షులు చేసే గానం అనే అర్థం చెప్పుకొని దారితప్పారు.[11] యక్షగానం అంటే యక్షుల ప్రీత్యర్థం చేసే గానం అనే అర్థం చెప్పుకోవాలి. ఈ అర్థాన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే నేటికీ మన మధ్యనున్న వాఙ్మయాన్ని గుర్తించడం తేలికవుతుంది. యక్షగానం అనేపేరు ఈనాడు ఒక విధమయిన దేశిరూపకాలకు మాత్రమే చెల్లుతోంది. తొలి యక్షకథాగాన కలాపం నుంచి పుట్టిన రూపకాలకు మాత్రమే ఈపేరు నిలిచి ఉందన్నమాట. తొలి యక్షకథాగానకలాపాల తీరుతెన్నులను తెలుసుకోవడానికి మన జానపదవాఙ్మయంలోని కథాగేయాలు చాలావరకూ ఉపకరిస్తాయి.

అయితే యక్షగానాల నుంచి ఉద్భవించిన నాటకరూపాలు యక్షగానం పేరుతో నిలిచి ఉన్నాయి గానీ అసలు గీతాలు చాలాకాలం వరకూ గ్రంథస్థం కాలేదు. నాటకరూపంగా పరిణతి చెందిన తర్వాతనే నాగరికులు ఈ ప్రక్రియను ఆదరించారు. అందువల్లనే నాగరిక రచనలే మిగిలి జానపద రచనలు తెరచాటు అయినాయి. జానపదరూపంలో గేయం, సంభాషణ ఆశువుగానే ఉండి ఉంటా యనుకోవడంలో అసంగతమేమీ లేదు. ఈనాటికీ యక్షగానం, బయలాట మొదలైనపేర్లతో చలామణీలో ఉన్న రూపకప్రదర్శన లలో చాలా భాగం సంభాషణలూ వగైరా ఆశువుగానే ఉంటున్నాయి. ప్రతి

కళాప్రక్రియ చరిత్రలోనూ ప్రక్రియకు స్థిరత్వాన్ని ప్రసాదించే ప్రయత్నం జరిగే దశ ఒకటి ఉంటుంది. ఆ ప్రక్రియకు లక్షణాలను నియతం చెయ్యడం, వ్యవహర్తలు తమ ఇష్టానుసారంగా వస్తువును మార్చడాన్ని అరికట్టడం కోసం కొన్ని నిబంధనలను విధించుకోవడం జరుగుతుంది. ఇటువంటి ప్రయత్నాల ఫలితంగానే నాట్యశాస్త్రం, సంగీతశాస్త్రం వగైరా రూపుతీసుకొన్నాయి. ఆదశ దాటిన తరువాతి రచనలే స్థిరంగా నిలిచి ఉంటాయి.

నేటిదాకా అలా నిలిచి ఉన్న కథాగేయాల నుంచి తొలినాటి యక్షగాన స్వరూపాన్ని పునర్నిర్మించుకోవడం సాధ్యమవుతుంది. తెలుగులో గ్రామ దేవతలను గురించిన కథాగేయాలు చాలానే ఉన్నాయి. ఎల్లమ్మ, అంకమ్మ, చౌడమ్మ, పోలేరమ్మ ఇత్యాదిగా దేవతా కథాగానాలు సుపరిచితమే. ఈ విషయంలో డాక్టర్ తంగిరాల వెంకటసుబ్బారావుగారు విశేషమైన కృషి చేసి తమ పరిశోధనా ఫలితాలను ప్రకటించి ఉన్నందున, గ్రంథరూపంలో లభిస్తున్నందువల్లా[12] ఆ విషయాలను ఇక్కడ ప్రదర్శించక వదులుతున్నాను. నిజానికి శ్రీ వెంకటసుబ్బారావు గారు సేకరించి, చర్చించిన గేయకథలన్నీ యక్షగానాలన్నమాట. ఈ యక్షగానాలే కాలక్రమాన యక్షగానమనే పేరుతో రూపకాలుగా రూపొందాయి. అయితే ఆ జానపద కథాగేయాలు కేవలం పాడుకోవడానికి పుట్టినవి కావు. దేవత ప్రీత్యర్థం చేసే పూజాకర్మ కాండలోని ఒక భాగం మాత్రమే. ఈ గేయాలను గానం చేసేటప్పుడు నృత్యం ఏదో ఒక రూపంలో విధిగా ఉంటుంది. చౌడమ్మ జాతర విషయంలో డాక్టర్ తంగిరాల వేంకటసుబ్బారావుగారిచ్చిన వివరాలను సంక్షిప్తపరచి ఇస్తున్నాను –

> 'రాయలసీమలో నీ చౌడమ్మ ప్రధానాలయము నేటికిని కర్నూలు మండలమున నందవర గ్రామమున గలదు ... ఈ జాతరలో తొగటవీరులు చౌడమ్మ పాటలు పాడుచు, నెత్తిపై జ్యోతులను పెట్టుకొని, వీరావేశమున నృత్యము చేయుదురు ... జ్యోతిని తయారుచేయునప్పుడు ... కరణము రావలెను. ఊరి పాలి

మేర వరకు వెళ్లి ఈ కరణమును గడు భక్తితోఁ దప్పెట్లను మ్రోగించుచు నాహ్వానింతురు ... జ్యోతి నెత్తుకొనిన తొగట వీరుని చుట్టును తాళములు వాయించువారు గుండ్రముగాఁ బరివేష్టించి యుందురు. వీరు చౌడమ్మ పాటలు పాడుచు నడుగు వేయుదురు. ఈ పాటలలో కేవలము తాళములు మాత్రమే ఉపయోగింపఁబడును. ఇతర వాద్యము లేవియు ఉండవు ... జ్యోతిని నెత్తిపై కెత్తుకొను వ్యక్తి గొప్ప నృత్యము చేయఁగల సమర్థుడై ఉండవలెను. ఈ జ్యోతిర్నృత్యము చేయుటకు చాలాకాలము శిక్షణ పొందెదరు.''[13]

డాక్టర్ సుబ్బారావుగారిచ్చిన పై వివరాలు పరిశీలిస్తే, గేయం, నృత్యం, ఊరేగింపు అన్నవి ప్రధానాంశాలుగా కనిపిస్తాయి. ప్రాచీన గ్రీకు నాటకా విర్భావానికి కారణమైన 'డితిరాంబు' పాటలూ ఇలాంటివే. ఫ్రాంకోయిస్ షామో మాటలను చూడండి -

> "The Dionysiac ritual, like many others, included singing and dancing choruses as well as processions. The choruses in honour of the god sang a special kind of hymn, known as the dithyramb"[14]

గ్రీక్ దేవాయతనాలలో బలివేదిక చుట్టూ డితిరాంబ్ పాటలు పాడుతూ గీత, నృత్యాలు సాగేవి. ఈ పాటలన్నీ బృందగానరూపంలో ఉండేవి. ఈ బృందాలకు నాయకుడొకడుండేవాడు. క్రమంగా ఈ నాయకుడు బృందం నుంచి విడివడి నటుడిగా ఆవిర్భవించాడని పరిశోధకుల నిర్ణయం. మన దేశాన కూడా ఇదే పరిణామం జరిగిందని భావించడానికి ఆధారాలున్నాయి. నేటికీ కన్నడ యక్షగానాలలో 'మొదలనయవేష', 'ఇరడనయవేష', 'మూరనయవేష' అంటూ నటులను వ్యవహరించడం ఉంది. అంటే బృంద గానాన్నుంచి మొదటగా విడివడిన వ్యక్తి మొదటివేషగాడయితే, తరువాత విడివడినవాడు రెండవ వేషగాడనీ, ఆ తరువాత విడివడినవాడు మూడవ

నటుడనీ వ్యవహారం ఏర్పడి ఉండాలి. గ్రీకు నాటకంలో – అదీ విషాద రూపకంలో – తొలి నటుడి ఏర్పాటుకు థెస్పిస్ కారకుడని తెలుస్తున్నది గాని అతని రచనలేవీ లభించడం లేదు. తెలుగు యక్షగానం కూడా ఈ విధంగానే గేయప్రక్రియ నుంచి నాటకప్రక్రియకు పరిణమించి ఉండాలి.

నాటకానికి సంవాదం ప్రాణం. ఈ సంవాదం మొదట కేవలం గానం మధ్య వచ్చే వివరణలు లేదా కథాగానంలోని వస్తువు గురించి జ్ఞాపకం చెయ్యడానికుద్దేశించిన వాక్యాలై ఉండాలి. ఉదాహరణకు డాక్టర్ తంగిరాల వెంకటసుబ్బారావు గారు సేకరించిన చౌడమ్మ పాటలోని భాగం –

పునరావృత్తి :

'వినరయ్యా చౌడమ్మా మహిమలు వివరముతో మీ రెవరయినా
దూషణ చేసిన రాజేంద్రునకు దుర్గామమ్మడి గొనలేదా ?
మల్లయ్యమమ్మడి గొనలేదా ?
కరమరదున ధర కందనూలి – కరకంతుని పుత్రి జాతరకు
రమ్మని పిలిచిరి వీరులనెల్ల–నెమ్మది పున్నమనాటికిని విరివిగ
నాలుగు దెసలందుండిన – వీథులు గదలిరి వేడుకతో పచ్చని
నల్లని తెల్లని ఎర్రని – పసుపు వన్నెలా గొడుగులతో'[15]

ఇలాంటి పాటలను గురించి డాక్టర్ సుబ్బారావు గారు –

'ఇతివృత్తములను బట్టి పాటల శీర్షికలు లేకున్నను, నీ చౌడమ్మ పాటలలో ఒక విశేషమున్నది. వీని పునరావృత్తులలోనితివృత్త మంతయు గర్భితమై యుండును'[16]

సుదీర్ఘమైన కథాగేయాలలో ఈ పునరావృత్తులు అవసరం. అసలు గాయకుడు గాక పక్కన వంతదారులు ఈ చరణాలను – పునరావృత్తులను – పాడుతూ ఉంటారు. కాలక్రమాన గేయాలకు ఇది పల్లవిగా మారి ఉంటుందనుకుంటాను. ఇది తొలిదశ యక్షగానాల స్వరూపమని భావించ వచ్చు. కేవలం గానానుకూలంగా సాగే రచనలో చిన్న చిన్న పాదాలుండవచ్చు

గాని మాత్రల రీత్యా గాని, గణాలరీత్యా గాని లెక్క కుదరని పాదాలే ఉంటాయి. కాలక్రమాన వీటిలో ఛందోవ్యవస్థ ఏర్పడినా కొంతభాగం అనియతంగానే ఉండిపోక తప్పదు. ఛందం మీద కంటే భావం మీద, రాగం మీదా గాయకుడి దృష్టి లగ్నమై ఉండడం వల్ల ఇలా జరుగుతుంది. ఈనాడు మనకు లభిస్తూన్న కథాగేయాలలో చాలా భాగం ద్విపదలో, ద్విపదాభాసాలో మాత్రమే. అయితే తొలిదశ యక్షగానాలలో ద్విపదకు దగ్గరగా ఉన్న విరుపులతో గానయోగ్యమైన అనియతమైన ఛందం వంటిది ఒకటి ఉండి ఉండవచ్చు. ఈ ఛందంలోంచే ద్విపద పుట్టి ఉండవచ్చు. ఇందుకు ఆధారంగా జానపద రచనలను పరిశీలించ వలసి ఉంటుంది –

'ఓయన్న / నాయుడా / ఓనీల / వర్ణ
కపటనా / టకసూత్ర / ధారి ఓ / కార్య / వేది
కపటబు / ద్ధులు నీవు / ఏలగై / కొంటి / వయ్య
నాయుడా / బ్రహ్మ / నీవు /
పొమ్మన్న / వారికి / పోకటే / నిజము
రమ్మన్న / వారికి / రాకటే / నిజము'[17]

పై ద్విపదను అచ్చమయిన ద్విపదగా గుర్తించడానికి కొన్ని పాదాలు అడ్డం వస్తాయి. ఈ ఉదాహరణలో గణవిభజన నేటి పద్ధతిలోనే చూపడం జరిగింది గాని అత్యంత ప్రాచీన కాలంలో మరొక పద్ధతి ఉండేదేమో ! ఏది ఏమైనా పై రచన ప్రాచీన సంప్రదాయానికి దగ్గరగా ఉందని గుర్తించాలి. గమనించవలసిన మరొక ముఖ్యలక్షణం రెండు సూర్యగణాలు ఎక్కువైన చోట్ల కూడా పాటలోని అధికమాత్రలు చెవికి ఇబ్బంది కలిగించవు. పాడుతూ, పాడుతూ గాయకుడు 'నాయుడా బ్రహ్మ' అని వైవిధ్యం కోసం రాగం మార్చి చదివి, 'నీవు' అన్న సూర్యగణాన్ని తరువాత పాదం ప్రారంభంలో చేర్చి పాడితే అందంగానే ఉంటుంది గాని తూగు చెడదు. ఇక్కడ ఆసక్తికరమైన మరొక ఉదాహరణను చూపుతున్నాను. సుప్రసిద్ధ ఆధునిక తెలుగుకవి కీ. శే. దేవర

కొండ బాలగంగాధర్ తిలక్ రచన మిది –

'నామీద / నీచూపు / చీకట్లు / ముసురు – కొని
నీమీద / నారూపు / వెన్నెల / లుపర – చుకొని
నాకల / ల నీపె / న్నెరుల అ / లలొ – క్కపరి / పొంగి
నీకను / ల నాకాం / క్ష లాస / జ్యధను – వులై / వొంగి
... ...'[18]

తిలక్ చక్కని ఛందోబద్ధ పద్యాలను రాయగలిగినవాడు. వచన పద్యంగా ప్రారంభించిన పై పద్యంలో ఒక ఛందం కలిసివస్తున్నదనే భావన ఆయనకి రచనా కాలంలో ఉండి ఉండదు. ఇందాక ఉదాహరించిన జానపద ద్విపదలో లాగే మూడేసి మాత్రల గణాలు అదనంగా వచ్చి చేరాయి. ఒక జానపద కవీ, ఒక ఛందం తెలిసిన ఆధునిక కవీ ఒకే లక్షణాన్ని పాటించడం ఎలా జరిగింది ? అన్నది ప్రశ్న. ద్విపదకు ఒక విధమైన తూగూ, లయా, ఉండటం వల్ల అది అజ్ఞాతంగా ఇరువురి మనసుల్లో పనిచేసిందని చెప్పుకోవాలి. గణాల స్పృహ ఇద్దరికీ ఉండి ఉండకపోవచ్చు. ద్విపద లయ తెలుగుభాషకు నైసర్గిక మైనందువల్ల కూడా ఇలాగ జరిగి ఉండవచ్చు.

వీరశైవమత ప్రచారానికి కంకణం కట్టుకొన్న పాల్కురికి సోమనాథుడు జనసామాన్యంలో అత్యంత ప్రచారంలో ఉన్న ద్విపదను స్వీకరించి ఒక లక్షణం ఏర్పరచుకొని కావ్యరచనకు వినియోగించడంతో ద్విపద, చరిత్రలో ఒక మలుపు తిరిగింది. సోమనాథుడి తరువాత కవులు ద్విపదను చేబట్టినా, జానపద సాహిత్యంలో మాత్రం తన సహజ లక్షణాలతో ద్విపద సాగివస్తూనే ఉన్నది. యక్షగానానికి ద్విపదే అసలు ఛందస్సు అని భావించవలసి ఉంటుంది. యక్ష గానం రూపకంగా అవతరించిన తరువాత రకరకాల ఛందస్సులు యక్షగాన రూపకంలో ప్రవేశించిన తరువాత కూడా, యక్షగానరూపకంలో ద్విపద పట్టు దప్పక నిలిచే ఉంది. అంటే ద్విపదరూపంలో ఉన్న యక్షగానంలో వివిధ పాత్ర చిత్రణలు అవసరమైనప్పుడు ఇతర గేయఛందస్సులు వచ్చి చేరాయన్నమాట.

ఇక్కడ మరికొన్ని విషయాలను గమనించవలసి ఉంది. తొలిదశకు చెందిన యక్షగాన కథాగానాల వివరాలను క్రీడాభిరామం చక్కగా వర్ణించింది. నాటికి పల్నాటి వీరచరిత్ర కూడా యక్షగానాలలో స్థానం సంపాదించుకొంది.

'ద్రుతతాళంబున వీరగుంభిత కధుం
 ధుం ధుం కిటాత్కార సం
గతివాయింపుచు నాంతరాళిక యతి
 గ్రామాభిరామంబుగా
యతిగూడం ద్విపద ప్రబంధమున వీ
 రానీకముం బాడె నొ
క్కత ప్రత్యక్షరముం గుమారకులు ఫీ
 ట్కారంబునం దూలఁగన్'[19]

పల్నాటివీరుల కథను పాడినది ఒక వనిత. 'కామవల్లీ మహాలక్ష్మి కైటభారి వలపు పాడుచు' వచ్చినదీ ఒక వనితే. అయితే ఆమె జక్కుల కథలను పాడే జక్కులపురంధ్రి. ఈ రకమైన కథాగానాన్ని దృష్టిలో పెట్టుకునే కవిసార్వభౌముడు దక్షారామప్రశంస సందర్భాన 'కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు గాంధర్వమున యక్షగానసరణి' అని వర్ణించాడు. ఈ వర్ణనలన్నిటా యక్షగానం గాన ప్రక్రియగా కనిపిస్తుందే తప్ప రూపకప్రక్రియగా కనిపించదు. హరిభట్టు రాసిన నృసింహపురాణాన్ని అతని మరణానంతరం అతని పుత్రుడు రాఘవ పండితుడు ప్రోలుగంటి రంగనమంత్రికి అంకితమిచ్చే సందర్భాన చెన్నశౌరిని గురించి చెబుతూ –

'ఆమంత్రిపుంగవుం డష్టభాషాకవి
 వర్యుడై పొగడొందె వసుధయందు
ద్విపదగా నారసింహపురాణ మొనరించి
 భక్తి సహోబలభర్త కిచ్చె
బాలభారత మంధ్రభాషను వచనకా

వ్యంబు చేసెను గవీశ్వరులు మెచ్చ
సాభరిచరితంబు జక్కులకథ చెప్పి
లాలిత నవరసాలంకృతముగ

మఱియుఁ బెక్కు కృతుల్పటుమతి రచించె
ఖ్యాతి నరసింగరాయలచేతఁ గొనియె
నగ్రహారంబులును వివిధార్థములును
వెలసెఁ గొండమ బెండ్లియై విభవ మెసఁగ'

అని ప్రస్తుతించాడు. ఈ పద్యంలో చెన్నశౌరి రచనలు మూడింటిని పేర్కొనడం జరిగింది. ద్విపదగా నారసింహపురాణాన్నీ, వచనకావ్యంగా బాల భారతాన్ని జక్కులకథగా సాభరిచరితనూ చెన్నశౌరి రాసినట్లుగా చెప్పడంవలన, జక్కుల కథ అన్నదానిని ఒకానొక రచనాప్రక్రియగా మాత్రమే గుర్తించగలం. జక్కులకథ యక్షగానం కావచ్చుగాని యక్షగానరూపకం కాకపోవచ్చు. ఆ గ్రంథం లభించనందువల్ల తుదినిర్ణయానికి రాలేము గాని కవిసార్వభౌముడు చేసిన ప్రస్తావనలన్నీ గానప్రక్రియా విశేషాలు గానే కానవస్తున్నాయని ముందరే చెప్పుకొన్నాం కదా ! అందువల్ల సాభరిచరిత్రం కూడా గానయోగ్యమైన రచన మాత్రమే అని చెప్పుకోవచ్చు గాని, చెన్నశౌరి కాలం గురించి కొంత చెప్పుకో వలసి ఉంది. కీర్తిశేషులు శ్రీ చాగంటి శేషయ్య గారు ఈ విషయాన్ని విపులంగా చర్చించి, 'దీనినిబట్టి సాళువ నరసింహరాయలే చెన్నశౌరి కగ్రహారము నిచ్చిన యాతఁడని తెలుచున్నది' అని వెంటనే 'చెన్నశౌరి గ్రంథములు లభించక పోవుటచే నీతఁడేనరసింహరాయలచే నగ్రహారములను గొనియెనో తెలియుట లేదు'[20] అని చివరకు అయోమయంలో పడేశారు. చివరికి చెన్నశౌరి జననం క్రీ. శ. 1460 సంవత్సరంలో జరిగినట్లుగా భావించారు. అంటే అన్నమయకు 36 సంవత్సరాల వయసుండగా చెన్నశౌరి జన్మించి ఉండాలి. ఉజ్జాయింపుగా చెన్నశౌరి కావ్యరచన ప్రారంభించేసరికి 20 సంవత్సరాల ప్రాంతాల వయసుంటుందని ఊహిస్తే క్రీ. శ. 1480లో గాని ఆయన రచన ప్రారంభించి

ఉండడు. అప్పటికి అన్నమయ ఉచ్ఛదశలో ఉన్నాడు. అదీకాక సాళువ నరసింహరాయలు క్రీ. శ. 1490-91 ప్రాంతాల మరణించడంవల్ల ఆనాటికి చెన్నశౌరికి 31 సంవత్సరాల వయసుండి ఉండాలి. ఇదంతా ఆట్టే ఆధారాలు లేని ఊహాగానమే. ఏది ఏమైనా చెన్నశౌరి రచన నారసింహ పురాణాన్ని ద్విపద కావ్యంగానూ బాలభారతాన్ని వచన కావ్యం గానూ రాసినట్లు తెలియడం వలన సౌభరిచరిత గానయోగ్యమైన పాటగా రాసి ఉండాలి. అంతకన్నా ప్రస్తుతానికి ఏమీ నిర్ణయించలేం.

యక్షగానపదాన్ని పేర్కొన్న కవులలో చిత్రకవి పెద్దన ఒకడు. ఇతను లక్షణసార సంగ్రహమన్న లక్షణగ్రంథాన్ని రచించాడు. రచనాకాలం క్రీ. శ. 1550 సంవత్సరం కావచ్చునని శ్రీ చాగంటి వారి అంచనా.[21] యక్షగానాది కృతులలోని రగడభేదాలను పెద్దన వివరించాడు.[22] అప్పటికే అర్ధశతాబ్దంకన్నా ముందుగానే అన్నమయ సంస్కృతంలో సంకీర్తన లక్షణాన్ని రచించి ఉన్నాడు. చిత్రకవి పెద్దనకు సమకాలీనుడైన తాళ్లపాక చిన్నన్న సంకీర్తన లక్షణాన్ని అనువదించాడు. అందులో యక్షగానప్రస్తావన ఉన్నది. అంటే చెన్నశౌరి నుంచి చిత్రకవి పెద్దన దాకా అందరూ అన్నమయ కన్నా తరువాతివారే. అంటే అన్నమయ రచనల తరువాతనే యక్షగాన లక్షణాలను తెలుగులో గ్రంథస్థం చేశారన్నమాట. యక్షగానరూపక రచనకు అన్నమయ ఆద్యుడు. తరువాతి అధ్యాయంలో ఈ విషయం నిరూపితమౌతుంది.

అయితే ఆంధ్రదేశంలో అన్నమయ అవతరించేదాకా రూపకప్రక్రియ తెలుగులో లేదని భావించడం అసమంజసం కాగలదు. అలాగ నమ్మితే నన్నయకు ముందు తెలుగులో కవిత్వంలేదని భావించినంత పొరబాటు కాగలదు. నిజానికి నాటకప్రక్రియ పరిణతి చెందని స్థితిలో ఆదిమ మానవ సమాజాల కాలం నుంచీ వుంటూనే ఉన్నది. మానవజాతి బాల్యదశ నేటికీ మన పిల్లల ఆటపాటల్లో వ్యక్తమౌతూనే ఉన్నది. మొదట చేతులతో కాళ్లతో పాకడం, కొంతకాలానికి నిటారుగా లేచి నిలబడి నడవడం మొదలైనవన్నీ

మానవ పరిణామాన్ని సూచించేవే. అలాగే బాలికలు బొమ్మలపెళ్లిళ్లు చెయ్యడం, బాలకులు బెత్తం పట్టుకొని ఉపాధ్యాయుల్ని అనుకరించడం వగైరాలన్నీ ప్రాథమిక నాటకదశ లక్షణాలే. అందువల్ల నాటకం, కవిత్వం లేని దశ అంటూ ఏ మానవసమాజంలోనూ ఏ కాలంలోనూ ఉండదు. గాథా సప్తశతిలోనూ, అమరావతి, నాగార్జునకొండ శిల్పాలలోనూ కొన్నిరకాల నాటక రూపాలు ప్రతిఫలించే ఉన్నాయి. యక్షులు బౌద్ధ యుగంలోనూ, అంతకు ముందుగానూ పూజల నందుకొంటున్నా, యక్షగాన మన్న పదం గ్రంథస్థసాక్ష్యం బట్టి చూస్తే, మాధ్యమిక యుగం దాకా ప్రయుక్తం కాలేదు. ఆంధ్రదేశంలో సంస్కృత ప్రాకృత భాషల ప్రాభవం అంతరించి దేశభాష తలెత్తిన తరువాత రూపకప్రక్రియ కొత్తరూపాలను సంతరించుకోవడానికి ప్రయత్నించింది. ఈ ప్రక్రియల రూపాలు కొన్ని సోమనాథుడి పండితారాధ్య చరిత్రలో మనకు పరిచయమైన సంగతి విజ్ఞులకు విదితమే.

కాని నాటివరకు యక్షగాన మన్న కథాగానం సంగతి గాని, రూపకం సంగతి గానీ కనబడదు, వినబడదు. శ్రీనాథుడే మొదటగా యక్షగానాన్ని పేర్కొన్నవాడు. అది కథాగానప్రక్రియ. అందువల్ల జానపద కళాప్రక్రియను స్వీకరించి నాటక ప్రక్రియగా రూపొందించడం పదిహేనవ శతాబ్దంలోనే జరిగింది. అప్పుడే తెలుగువారి కొక విశిష్టమైన నాటకప్రక్రియ ఏర్పడింది. ఇతర భాషా ప్రాంతాలకు వ్యాపించింది.

అధోజ్ఞాపికలు

1. Studies in Indian Art - V. S. Agrawala, p. 87
2. అదే, పు. 87
3. అదే, పు. 121
4. ఆంధ్ర యక్షగానవాఙ్మయచరిత్ర – డాక్టర్ యస్వీజోగారావు, పు. 24
5. Catalogue of Mathura Museum - Dr. J. Ph. Vogel, p. 92
6. 'యక్షగానములు లేక జక్కుల పాటలు' శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారి వ్యాసం, ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక, 1921, పు॥లు 121–26
7. Yakshagana Bayalata (A brief introduction), p. 2

8. ఆంధ్రుల సాంఘికచరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి, పు. 318
9. క్రీడాభిరామము - వేటూరి ప్రభాకరశాస్త్రి గారి పరిష్కరణ, వచనం 139, పు. 47
10. Studies in Indian Art, p. 119
11. యక్షులూ - యక్షగానమూ - అబ్బూరి గోపాలకృష్ణ, భారతి, జనవరి 1976, పు॥లు 35, 36
12. తెలుగు వీరగాథాకవిత్వము - డాక్టర్ తంగిరాల వెంకటసుబ్బారావు
13. అదే, పు॥లు 71-73
14. The Civilization of Greece - Francois Chamoux, p. 236
15. తెలుగు వీరగాథాకవిత్వము, పు. 83
16. అదే, పు॥లు 85-86
17. అదే, గురజాల రాయబారము - ఆల్తూరుపాడు తాళప్రతి నుండి, పు. 145
18. అమృతం కురిసిన రాత్రి - కీ. శే. దేవరకొండ బాలగంగాధరతిలక్ కవితాఖండిక 'అద్వితీయం' నుండి. పు. 61
19. క్రీడాభిరామము, 116 ప.
20. ఆంధ్రకవితరంగిణి, సంపుటం 8, పు. 204
21. అదే, సంపుటం 9, పు. 104
22. లక్షణసారసంగ్రహం, 2-141

9. యక్షగాన సంప్రదాయం - 2

అన్నమయ యక్షగాన రచన

తెలుగు దేశపు ప్రాయోగిక కళల (Performing Arts) లో మణిదీపంగా వెలసిన యక్షగాన రూపకం పదకవిత పొందిన రూపాంతరమే. సంస్కృత నాటక సంప్రదాయం చాలా ప్రాచీనమైనదైనప్పటికీ, ఈ సువిశాల భారతావనిలో రాజాస్థానాలలో, పండిత సభలలో శ్రవ్య, పఠన కార్యక్రమ రూపంలో విశేషంగా పరిచితమైనప్పటికీ ప్రయోగరూపాన మాత్రం ప్రాంతీయ భాషలలోని రూపకప్రక్రియలమీద ఏ విధమైన ప్రభావాన్నీ ప్రసరించలేక పోయింది. భాస కాళిదాసాది మహాకవుల రచనలు సాధారణ కావ్యరూపంలో ప్రాంతీయ భాషలలోకి అనూదితమైనాయి. అసలు ఏనాడైనా సంస్కృత రూపకాలు ఏ ప్రాంతంలోనైనా జనాదరణ పొందాయా అన్నది సందేహాస్పదమైన విషయమే. దేశంలో వివిధ ప్రాంతాలలో భారీయెత్తున జరిగిన పురావస్తు తవ్వకాలలో భరతుడి నాట్యశాస్త్రానుగుణంగా నిర్మితమైన రంగశాలల అవశేషాలేవీ వెలుగులోకి రాకపోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. నాగార్జున కొండలో లభించిన దీర్ఘచతురస్రాకృతిలో ఉన్న రంగశాల యక్షగాన ప్రదర్శనకుద్దిష్టమైనదేనన్న విషయం పూర్వోక్తమే.

మాధ్యమిక యుగం ప్రవేశించేసరికి తొలి తెలుగు రూపకాలు మనకు క్రీ. శ. 1500 తరువాతనే దర్శనమిస్తున్నాయి. నిజానికి మనకు తెలిసిన రూపంలో యక్షగాన ప్రక్రియ క్రీ. శ. 15వ శతాబ్దిలో తెలుగులో రూపు దిద్దుకొన్నట్లు కనిపిస్తున్నది. తొలి తెలుగు వాగ్గేయకారుడైన అన్నమయ ఈ యక్షగాన రూపకప్రక్రియకు కావలసిన సాహిత్య సాధన సామగ్రిని సమకూర్చిపెట్టాడు. అంతేకాక యక్షగాన రూపకరచనను కూడా చేసి ఉండవచ్చునని భావించడానికి బలమైన కారణాలున్నాయి. ఈ విషయాన్ని పరిశీలించేముందు గమనించవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి.

అన్నమయ నాటికే యక్షగానాన్ని పేర్కొన్నవాడు కవిసార్వభౌముడైన శ్రీనాథుడు. భీమఖండంలో –

కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు
గాంధర్వమున యక్షగానసరణి[1]

అని వర్ణించాడు. సంస్కృత భీమఖండంలో ఈ పద్యపాదాలకు సరియైన భావంతో ఉన్న శ్లోకమిదీ –

కీర్తయం తిస్మమహాత్మ్యం గంధర్వాస్తి దివౌకసః
గాంధర్వ విద్యా నిపుణా గాంధర్వేణ గరీయసా[2]

ఈ సంస్కృతశ్లోకం యక్షగానమంటే ఒకానొక గేయవైఖరేగాని రూపక విశేషం కాదని స్పష్టపరుస్తున్నది. సంస్కృత భీమఖండానికి శ్రీనాథుని భీమ ఖండం అనువాదంకాదనీ, తెలుగులో శ్రీనాథుడు రచించిన భీమఖండానికే సంస్కృత భీమఖండం అనువాదమనీ, శ్రీనాథ కవిసార్వభౌముని సాహితీ రంగంలో విశేషంగా పరిశోధన చేసిన ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు విపులంగా చర్చించి నిరూపించారు. వారు –

> 'సమష్టిపై తెలుఁగు నుడికారముల బలవంతపు భాషాంతరీ కరణము, అర్థవిపరిణత శబ్దానుసరణము, వృత్త్యనుప్రాస ప్రతిద్వంద్వికల్పనము, సీసపద్యములు వరుస శ్లోకముల వంత పాటలగుట, సీసపద్యానుసారి శ్లోకకుళక రచనము, సీసపద్య సహజ సమాపక క్రియానుసరణము, సీసపద్య మకుటప్రాయ సంబోధనానుసరణము, సుదీర్ఘవచనానుసారి శ్లోక సంపుటీ కరణము, పూర్వకవితాచర్వణ పునరుద్ధరణమును స్వయము గను, సమ్మైక్యముగను, సంస్కృత భీమఖండము శ్రీనాథుని భీమఖండమునకు సంస్కృతీకరణ మనుటకు సమర్థమైన యంతస్సాక్ష్యమని స్పష్టము.[3]

అని తిరుగులేని తీర్పు నిచ్చారు. దీనివల్ల తేలిన విషయం యక్షగాన మన్న ప్రక్రియను మొట్టమొదటిసారిగా పేర్కొన్నవాడు శ్రీనాథుడే. అంతేగాక 'గాంధర్వమున యక్షగానసరణి' ఒకటి ఉన్నట్లు కవిసార్వభౌముడి మాటల వల్లనే వ్యక్తం అవుతున్నది. సంస్కృతంలో యక్షగాన పదానికి ప్రాచుర్యంలేదని పరోక్షంగా తెలుస్తున్న నిజం. అందువల్ల యక్షగానం దేశి సారస్వతప్రక్రియ మాత్రమేనని నిర్ధారించవచ్చు.

తెలుగు భీమఖండ రచనాకాలం క్రీ. శ. 1430 అని ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు హేతుబద్ధంగా నిర్ణయించారు.[4] అంటే నాటికి అన్నమయ కు ఆరుసంవత్సరాల వయసన్నమాట. ఆనాటికి యక్షగానాన్ని రూపకక్రియగా కాక గానవిశేషంగా – శ్రీనాథుడు పేర్కొనడాన్నిబట్టి – ప్రచారంలో ఉన్నదని విదితమౌతున్నది. శ్రీనాథుని తరువాత యక్షగానాన్ని పేర్కొన్న కవి అన్నమయ మాత్రమే. అన్నమయ యక్షగానాన్ని పేర్కొన్న గ్రంథం సంస్కృత 'సంకీర్తన లక్షణం'. తెలుగులోకి అనువదించాడు చిన్నయ్య. అందువల్ల సంస్కృత మూలంలో అన్నమయ యక్షగాన పదాన్ని వాడి ఉంటాడని విదితమౌతున్న సంగతి. సంకీర్తన లక్షణం బహుశా రాగిరేకుల మీద చెక్కినప్పుడు పద్యాలు వరుస చెడడమూ, కొన్ని పద్యాలు జారిపోవడమూ జరిగి ఉండాలి. నేడు మనకు అస్తవ్యస్తంగా లభిస్తున్న పద్యాలను క్రమపద్ధతిలో పెట్టుకుని చదివితే ఈ విధంగా ఉంటాయి –

> పరగున్ వృత్తము జాతియంతయుఁ జతుష్పాద ద్విపాదాకృతిన్
> వర సంకీర్తనముల్ తదాకృతులనే వర్తించు మానంబుతో
> దరువుల్ జక్కులరేకు లేలలును సిద్ధంబైన గొబ్బిళ్లు భా
> సుర వాక్యంబులుఁ జందమామ పదముల్ శోభిల్లు నందంబులై

> దరువు, వాక్యంబు, నర్ధచంద్రకపదంబు
> ఏలపాటయు, గొబ్బిళ్లు, నింపులైన
> చందమామ పదంబును, జగతిఁ బాద

యుగళముగ బహుజన సంప్రయుక్తిఁ బరగు

వుగమును, ధృవమును, భోగము
సగమె పలికి పల్లవంబు సంధించినఁ జె
న్నగు నర్థచంద్రపదమన
నగణిత తానప్రతానకాంచిత మగుచున్

మహిత తానాంచిత విలంబమానమునను
దాళవిరహితమ్మై పదార్థంబు చెంది
కేవల ద్వి చతుష్పాదాకృతిఁ జెలంగు
నదియ ధర వాక్యమని యన్నయార్యు డనియె

మఱియుఁ జందమామ పదంబెట్టిదనిన –

దుస్తర విప్రలంభమున దూతికతోడ మొఱంగి చంద్రవి
న్యస్తభర స్వభావమున నాయకుఁడేనియుఁ గాంతయేనియున్
విస్తరపాదవాదముల వేడుకఁ జందురుఁ బేరుకొన్నచో
బ్రస్తుతి కెక్కఁ దత్పదము భాసురమై ద్వి చతుష్పదాకృతిన్

నాయకాహ్వాన పూర్వమై నయము గలిగి
మ్లేచ్ఛపరిభాషఁ దగి రాగమిళితమైన
యేల పాట పదంబు నానిలఁ చెలంగు
మహిత నాయక సంబుద్ధి మధ్యమగుచు

యక్షగానపదంబులు నవ్విధమున
సముచితానేకవిధ తాళసంగతులను
నవరసాలంక్రియా సవర్ణంబు లగుచు
నలరు నని హరికీర్తనాచార్యు డనియె[5]

భరతుడినీ దత్తిలుడినీ పేర్కొన్న అన్నమయ్యకు రూపకప్రక్రియలు అపరిచితాలు కావు. పైగా 'యక్షగానపదంబులు నవ్విధమున' అని అనడం

వలన యక్షగానరూపకాలలో వినియోగించవలసిన గేయప్రక్రియలను గురించి కూడా ఆయన చెబుతున్నట్లు గుర్తించవలసి ఉంది. అదీగాక కేవలం వాగ్గేయ కారసాహిత్య రచనామార్గనిర్దేశనానికే ఆయన సంకీర్తన లక్షణాన్ని రచించాడని భావిస్తే –

పురుషోక్తి సంస్కృతంబును
దరుణీవాక్యమునఁ బ్రాకృతము నీచవధూ
పరిభాష నితర భాషలు
పరగిన క్రియ నుచితభాషపదములఁ జెల్లున్

పల్లవనారీమ్లేచ్ఛో
ద్యుల్లాసమనోజ్ఞ బంధురోక్తులు చవియై
చెల్లును గ్రామ్యములైను
హల్లీసకముఖ్య నాటకాదిక ఫణితిన్

జగతిఁ గల జెల్లుబళ్లై
నగినగి భాషించునట్టి నానుడి పలుకున్
తగదన రహిచెడుఁ బువ్వుల
సొగసుడుగం బిసికి కంపు చూచినభంగిన్[6]

అంటూ గట్టిగా చెప్పడం అసంగతం కాకతప్పదు. అంటే సంకీర్తన లక్షణం పదరచనకు లక్షణాలను నిర్దేశించడమేకాక యక్షగాన రచనకు కూడా లక్షణాలను నిర్దేశిస్తున్నదన్నమాట. అంటే శ్రీనాథుని కాలానికి యక్షగానం కేవలం గాన ప్రక్రియగా ఉండగా అన్నమయ చేతిలో రూపక లక్షణాలను సంతరించు కొన్నట్లు భావించవలసి ఉంది. అంటే జానపద కళాప్రక్రియ నాగరీకమైందన్న మాట. అన్నమయ మార్గపద్ధతిలో పద్యాలు రాయగల దిట్ట. అందివచ్చినంతలో మనకు దక్కిన వృత్తపద్యాల శతకం 'శ్రీవేంకటేశ్వర శతకం' ప్రౌఢ రచన. చంపకమాల ఉత్పలమాలా వృత్తాల ఛందస్సుమీద కవికున్న అధికారం ప్రతిపద్యంలోనూ కనిపిస్తుంది. రెండోరచన 'శృంగారమంజరి'

మంజరీద్విపదలో రచితమైన చక్కని లఘుకృతి. ఈ రచన గురించి మరింత విపులంగా ముందుముందు పరిశీలించడం జరుగుతుంది. ఇవికాక లభ్యమైనవి శృంగార, అధ్యాత్మసంకీర్తనలు ఆయనలోని సంగీతజ్ఞుడిని ఎత్తిచూపుతాయి. ఇలాగ అన్నివిధాలా యక్షగానవాఙ్మయ సృష్టికి కావలసిన అన్ని హంగులూ ఆయనకు ఉన్నాయి.

ఇక్కడ గమనించవలసిన మరొక విశేషముంది. అది అన్నమయకు నాట్యశాలలతో ఉన్న పరిచయం. నాట్యశాలలతోనూ, నాట్యవిధానాలతోనూ ఉన్న ఈ పరిచయం ఆయన సంకీర్తనలలోనే వ్యక్తమౌతున్నది. ఉదాహరణకు-

'వాలుకచూపులు వాడఁగ నాటక
సాలలోన నిను జవరాలు
చాలుగ మురియుచు సరుగనఁ జివుకన
కాలఁజిమ్మినను కలఁగితి వపుడు

జట్టిగొనెర నిన్ను జవరాలు
చిట్టింటుచేఁతల జెలఁగితివపుడు'[7]

'యేఁటికయ్యా నీవు మాతో యేలాటలాడేవు
నాఁటకపుదాననా నవ్వేదానఁగాకా'[8]

'గాఁటపు కమలజుఁ గాంచిన యీ
నాఁటకుఁడే మా నమ్మిన విభుఁడు'[9]

'పడఁతి నాట్యశ్రాంతిఁ బవళించి తొల్లి నీ -
తొడలపై నీవు తల దువ్వఁగాను
కడలేని యటువంటి కళలు దలచేకదా
విడువని వియోగమున వేఁగీనిపుడు

ఎంత మన్నించితో యీ యింతి నిదె నీవు
అంతకంతకుఁ బ్రేమ నలరీ నిపుడు'[10]

'అలరులు గురియఁగ నాడెనదే, అలకల గులుకుల నలమేల్మంగ' అన్న సంకీర్తన విశేషప్రచారం పొంది ఉన్నందువల్ల ఇక్కడ ఉదాహృతం కాలేదు. అన్నమయకు నాట్యశాస్త్రంతో పరిచయం ఉండడమేకాక ప్రత్యక్షంగా నాట్య ప్రయోగాలతోనూ పరిచయం ఉందని తెలియజేస్తున్నాయి పైన పేర్కొన్న గీతాలు. అదీగాక చంద్రగిరిలోని నాట్యశాలకు చెందిన తిమ్మనాయకుని కుమారుడు తిప్పనాయకుడు శ్రీ వేంకటేశ్వరునికి సమర్పించుకొన్న కానుక విషయమ్మై ఒక శాసనం శ్రీ వేంకటేశ్వరాలయంలోనే కానవస్తున్నది.[11] ఈ శాసనం క్రీ. శ. 1461 నాటిది. నాటికి అన్నమయకు 37 సంవత్సరాల వయసు. క్రీ. శ. 1458 లో పెనుగొండ సాళువ నరసింహునికి కార్యక్షేత్ర మయింది. అటుతరువాత కొద్దికాలంలోనే అన్నమయ నరసింహుని ఆహ్వానం అందుకొని పెనుగొండకు చేరుకున్నాడు. అప్పటినుంచీ రాజాగారి కొలువు లోనూ, స్వామివారి ఆలయంలోనూ నృత్యాది విశేషాలు ఆయన దృష్టిపథంలో నిలిచి యక్షగాన రూపక రచనకు ప్రేరణలు కలిగించి ఉండాలి.

ప్రకృత రచయిత అదృష్టం వలన ఇతర పరిశోధకు లెవరూ పరిశీలించక వదిలిన ముఖ్యలక్షణమొకదానిని ఆయన రచనలలో దర్శించడం జరిగింది. అన్నమయ సంకీర్తనలలోని 'నాటకీయత' అనన్యసామాన్యం. ముఖ్యంగా శృంగార సంకీర్తనలు నాటకీయ శైలిలో కథను చెబుతాయి. అంతేకాక ఇవి అభినయానుకూలంగా ఉండడం మరొక ముఖ్యలక్షణం. ఈ లక్షణాలు కర్ణాటకలో వెలసిన దాసపదసాహిత్యంలో కనిపించవు. తెలుగులో అన్నమయ కంటే తొలివాగ్గేయకారులు లేరు. అన్నమయ రచనలలో నాటకీయతకు ఉదాహరణగా ఒక శృంగార సంకీర్తనను పరిశీలించవచ్చు -

'నెపములేక నిన్ను నెలఁత మాటాడీనా ?
వుపమించుకొనలేక వుసురనేవు ।
నిపుణతఁ దలఁచుకొని నీవు మఱచితివేమో ।
కపటములేదాపె కల్లలాడదు

నీవు సేయనిపనులు నింద నీపై మోపీనా ?
భావించలేక యెగ్గులు పట్టనేఁటికి ।
చేవదేరఁ బరాకుసేసితివేమో నీవు ।
వేవేలకు నాపె కవివేకము లేదు

చవులు నీవు చూపక చనవులు మెరసీనా ?
యివల సెలవినవ్వు యేల దాఁచేవు ।
రవళి శ్రీవేంకటేశ రతి సిగ్గువడేవేమో ।
కవగూడ నాపె నిన్నేగతిఁ బాయదు

ఊరకే కోపగించకు వోహోనీవు ।
కారణము లేనివాదు కాంతకులేదు'[12]

ఈ గేయం ద్వారా ముగ్గురు పాత్రలు మనకు పరిచయమౌతున్నారు. సంబోధితుడైన శ్రీ వేంకటేశుడు నాయకుడు. ఆయన చిరాకుపడి కోపగించు కొంటున్నాడు. అయితే అంతా పైపై నటనే. ప్రణయకలహం కదా మరి ! లోలోన నవ్వుకొంటున్నాడు. ఆ నవ్వు నాయిక చెలికత్తెకు తెలియని విషయం కాదు. ఆ చెలికత్తె సామాన్యురాలు కాదు. నాయకుణ్ణి నిలవేసి అన్ని విషయాలూ ఖచ్చితంగా అడగగల ధైర్యవంతురాలు. చూపులతోనే సర్వాన్నీ అర్థం చేసుకోగల నిపుణురాలు. మొత్తం పాట అంతటా ఆమె జాణతనం ప్రదర్శితమైంది. నాయిక మౌనంగా పక్కనే ఉండి ఉంటుంది. మౌనంగా ఉన్నా కూడా ఆమె గుణస్వభావాలు చెలికత్తె మాటలలో స్పష్టంగా రూపుకట్టాయి. నాయకుడు ఒంటరివాడైపోయి ఓటమి పొందవలసిన స్థితిలో పడ్డాడు. పెద్ద చెప్పుకోదగిన సంఘటన లేకుండానే కేవలం చెలికత్తె పలికిన మాటల్లోనే ఒక సన్నివేశాన్ని మనకు ప్రదర్శించాడు అన్నమయ. ఇందులో మనకు తారసపడే ముగ్గురు వ్యక్తుల పాత్రచిత్రణ అద్భుతంగా సాగింది. ఇలాంటి గేయాలు అనేకం. ఉదాహరణలిస్తూపోతే కొన్ని సంపుటాలే నిండగలవు.

కేవలం పాత్రచిత్రణమేకాక సంఘటనను కూడా చిత్రించిన గేయాలూ చాలానే ఉన్నాయి. ఉదాహరణకు –

'పిలుచుకరమ్మని ప్రియము చెప్పుమని
నెలఁతల నంపితి నీకడకు
యెలమి నీకు వారెదురుగారయిరి।
వెలి నీవెందునుండి విచ్చేసితివో।

కానుక లిమ్మని కదిసి మొక్కుమని
పూని యంపితిని పాలఁతులను
నీ నెలవెఱఁగక నెమకిరొ తాము।
తోనె చీఁకటి పొద్దున వచ్చితివి

వరుస లడుగుమని వలపు దెలుపుమని
తరుణుల నంపితి తమకమున
పరగ శ్రీవేంకటాద్రిపతి ననుగూడితి।
తిరిగిరివారే, తిరమైతి నీవు।

నీవిట్లుండుట నేనెఱఁగా
ఆవల నీయింటికంపితి నేను।'[13]

ఇదొక చక్కని కథ. నాయిక నాయకుడికి కబురు పంపడానికి చేసిన సర్వప్రయత్నాలూ విఫలమైనా, చివరకు నాయకుడు కబురందుకోకుండానే వచ్చాడు. ఇందులోని రమణీయమైన నాటకీయత మన మనస్సులను ఆకట్టుకొంటుంది. ఇందులోని మార్మికవాదశైలి ఆధునిక వంగకవి రవీంద్రనాథ ఠాగూరు గేయాలను స్ఫురణకు తెస్తున్నది. ఇది శృంగార సంకీర్తనలలో చోటు చేసుకొన్నా, అధ్యాత్మ సంకీర్తనలలో కూడా చేరగలిగినదే. ఈ రెండు సంకీర్తనల ద్వారా అన్నమయకు చెప్పవలసిన విషయాన్ని నాటకీయంగా చెప్పగల శక్తి ఉన్నదని స్పష్టమౌతున్నది.

ముఖ్యంగా సన్నివేశకల్పనలో ఊహాశాలిత్వం ఎంత ఎక్కువగా ఉంటే అంతగా రాణించగలడు నాటక కర్త. సన్నివేశాన్ని ఊహించడంలో అన్నమయ కున్న నేర్పు సమకాలీనులైన యెందరు కవుల కున్నదో చెప్పడం కష్టం. ఉదాహరణకు ఈ గేయాన్ని చూడవచ్చు –

'వెరపు దెలుపు నీవేగిరమే నీ
వెఱిఁగియు నెఱఁగక యేమంటివో !

... ...

నెత్తురుఁ బెదవుల నీమొక మలరఁగ
బిత్తరి వీడెపుఁ బెదవులతో
మత్తకరి గమన మాటలాడఁగా
ఎత్తిన మదమున నేమంటివో !

ఆనన రౌద్రము నట్టహాసమును
పూనిన నినుగని బొమముడితో
లేనగవుల నదలించెడి సిరితో
హీనాధికముల నేమంటివో

పెదపెద యూర్పుల పేగుల జందెపు
టుదరముతో నీవుండుచును
చెదరిన పయ్యెద చెరఁగుజారు సతి
యెదురెదురను నీవేమంటివో !

చింపినెరుల నీశిరసు ముడుచుకొని
కంపముడిగి వేంకటపతిపై
లంపట మందుచు లక్ష్మిసతితో
ఇంపులు నెరపుచు నేమంటివో !'[14]

హిరణ్యకశిపుడిని వధించిన తరువాత నరసింహుడిని చూసి శ్రీలక్ష్మి

దేవి బొమముడితో, లేనగవులతో అదలించి మాటలాడగా, ఆయన ఏమని బదులిచ్చాడని అన్నమయ ప్రశ్న । శ్రీవేంకటాద్రి నరసింహుడి జవాబు ఎలా ఉన్నా ఈ ఘట్టాన్ని ఊహించడంలో అన్నమయ్య గడుసరి పోకడనే పోయాడని చెప్పకతప్పదు. దాదాపు సంకీర్తనలన్నీ ఏదో ఒక రూపంలో ఒకరు చెప్పే సంభాషణగానో విన్నపాలుగానో ఉంటాయి గనుక ఈ నాటకీయతాలక్షణం వచ్చిందని చెప్పడం కుదరదు. ఈ రకమైన లక్షణం అన్నమయ్య సమకాలీనులైన హరిదాస పరంపరలోని వాగ్గేయకారులలో గానీ, ఆయన తరువాతి వారైన త్యాగరాజాదుల రచనలలోగాని కనిపించదు. క్షేత్రయ పదరచనా సంవిధానంలో అన్నమయకు ఋణపడే ఉన్నా, సన్నివేశకల్పనలో, సంభాషణా చాతురిలో అన్నమయ సరసన నిలవలేడని చెప్పకతప్పదు. అందువల్ల అన్నమయ కృతులలోని నాటకీయత విలక్షణమైనది. అనితరసాధ్యమైనది.

ఈ నాటకీయతకోసమే అన్నమయ కేవలం పాత్రచిత్రణలతో తృప్తి పడక సంవాదగేయాలను కూడా రచించడం జరిగింది. సౌలభ్యం కోసమై సంకీర్తనలను సంభాషణలుగా వింగడించి చూపుతున్నాను. ఇందులోని నాయకుడు శ్రీవేంకటేశ్వరుడే. నాయిక అలమేల్మంగ కావచ్చు.

నాయకుడు	:	కానీ కానీలేవే కలికీ ।
నాయిక	:	నేపూని నీతోఁ బలికితే, పూచి నీవునగరా ।
నాయకుడు	:	మాఁట చెప్పే రావే మగువా ।
నాయిక	:	ఆ మాటలు నేనెఱుఁగుదు । మానరానీవు ।
నాయకుడు	:	యేఁటికే యీ బిగువులు ? యిట్టే ఉండీనా ।
నాయిక	:	నీచోటికిఁ గిందుపడితే, చూపి నీవు నగరా ।
నాయకుడు	:	పనిగద్దురావే పడఁతీ ।
నాయిక	:	ఆ పనులు నేనెరుగుదు । పదరానీవు ।
నాయకుడు	:	పెనఁగకువే నాతోఁ బెక్కుమారులూ ।
నాయిక	:	నా మనసు మెత్తనిదైతే మరి నీవు నగరా ।

నాయకుడు : కాఁగలించే రావే కాంతా !

నాయిక : తొల్లె కాఁగిటనే వున్నదానఁ గదరా నేను !

నాయిక : వీఁగితి శ్రీవేంకటేశ ! వికవికనగరా ![15]

ఈ తరహా గీతాలను ఒక్కరు పాడితే రక్తికట్టడం కష్టం. ఇద్దరు సంవాద రూపంగా పాడితే రససిద్ధి కలుగుతుంది. పై గేయం అభినయంలో మరింత సొగసును సంతరించుకొనడమన్నది సందేహంలేని మాట. ఈ గేయరచన అభినయం కోసమే అయి ఉండాలి. మరొక ఉదాహరణ - నాయికకూ ఆమె చెలికి జరిగిన సంవాదం -

చెలి : ఇట్టే విచ్చేసీ నతఁడేలే

నాయిక : యింత వొట్టి వూరుకున్నవారి నుడికించనేటికే ?

చెలి : కప్పుర మంపెఁగదె కాంతుడు ?

నాయిక : తారాని కప్పురము వేఁడి చల్లీఁగదవే నాకు !

చెలి : దప్పికి పన్నీరంపెఁ దమితో నీకు ?

నాయిక : నిప్పులను బొరలించి నీరు చల్లనేటికే !

చెలి : గందమంపెఁగదె నీకు ఘనుఁడు ?

నాయిక : తారాని గందమా ? అది పెద్ద గండము గాక !

చెలి : ముందరనె పువ్వులంపె ముడుచుకోవే !

నాయిక : విందుగాఁ గాఁకలు చల్లి విసరఁగనేఁటికే ?

చెలి : వుంగరమంపెఁగదవే వువిద ?

నాయిక : తారాకున్న వుంగరమా ? అది నాకు వుంకువగాక !

చెలి : కంగి కూడు శ్రీవేంకటఘనుఁడు కడపలోన !

నాయిక : నిండు నెండలోనఁ బెట్టి నీడకుఁ దియ్యనేలే !!![16]

ఈ సంవాదగీతంలో సన్నివేశం క్రమపరిణామం పొందడం గమనించ వచ్చు. చెలికత్తె నాయికతో చిన్న నాటకమాడి చివరకు ఆమెను అసలు వార్తతో ఆశ్చర్యచకితురాలిని చేస్తుంది. అభినయం లేకుండా కేవలం గానంతో రక్తికట్టే

గేయం కాదిది. ఈ సంవాదగీతాలు రెండూ అలమేల్మంగనూ, శ్రీవేంకటేశ్వరుణ్ణీ నాయికానాయకులుగా రచించిన యక్షగాన రూపకంలోని సంవాదగేయాలా అన్న అనుమానం కలగకమానదు. ఇలాంటి గేయాలు చాలా ఉన్నందువలన వాటిని ఒక క్రమపద్ధతిలో అమర్చుకొని యక్షగానంగా ప్రదర్శించుకోవచ్చు కూడా. బహుశా ఏ రూపకానికీ చెందకపోయినా సంవాదరూపంలో ఉన్న మరికొన్ని గేయాలున్నాయి. ఇలాంటి సంవాద గేయాలలో తెలుగువారి సాంఘిక జీవనంలో కనిపించే బావామరదళ్ల సరసాలు కూడా చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు ఇందులోని బావ శ్రీవేంకటేశుడే !

బావ : ఏలే యేలే మరదలా చాలు జాలు చాలును !

మరదలు : చాలు నీతోడి సరసంబు బావ !

బావ : గాఁటపు గుబ్బలు గదలఁగఁ గులికేవు
మాటలఁదేటల మరఁదలా !

మరదలు : చీటికి మాటికిఁ జెనకేవే వట్టి –
బూటకాలు మాని పోవే బావ !

బావ : అందిందె నన్ను నదలించి వేసేవు
మందమేలపు మరఁదలా ?

మరదలు : సందుకోఁ దిరిగేవు సటకారి వోబావ
పొందు గాదిఁకఁ బోవే బావ !

బావ : చొక్కపు గిలిగింత చూపుల నన్ను
మక్కువ సేసిన మరఁదలా !

మరదలు : గక్కున నను వేంకటపతి కూడితి
దక్కించుకొంటివి, తగులైతి బావ ![17]

బహుశా ఈ బావామరదళ్ల సంవాద గీతాలకు ప్రేరణ జానపద గేయాల నుంచి లభించి ఉండవచ్చుగాని, అన్నమయ ఈ సంవాదశైలిని అనేకరకాలుగా వినియోగించుకొన్నాడు. అన్నమయ శైలిలోని సంవాద గీతాలు తరువాతి

కాలపు యక్షగానాలలోని సంవాదగీతాలకు వరవడి పెట్టాయి. దాదాపు సంవాదగీతాలు లేని యక్షగానమే 17వ శతాబ్దాంతానికి లేకుండా పోయిందంటే అన్నమయ ప్రభావం యెంతటిదో గుర్తించవచ్చు.

యక్షగాన రూపకాలలో తరచు కనిపించే పాత్ర యెరుకత. సోదెచెప్పే యెరుకత లేకుండా కల్యాణ సంబంధమైన యక్షగానాలు కానరావు. ఈ విషయంలోనూ అన్నమాచార్యుడు ప్రథమాచార్యుడిగా కనబడుతున్నాడు. ఉదాహరణకు –

నాయకుడు : ఎంత దడవుపట్టునే ? యీడేరునటే ?
ఎరుకత : వోరి ! పంతమాడి చెప్పేను. ఆపని ఇట్టే అయ్యీరా !
నాయకుడు : యెఱుక చెప్పఁగదవే యింతిరో నీవు !
ఎరుకత : వోరి ! చిరుసేఁతొకటి దలఁచితి విట్టేరా !
నాయకుడు : గుటిగా నాతలఁ పొనగూడు నటవే ?
ఎరుకత : వోరి ! కొఱతలేదు కోరిన కోర్కులయ్యీరా !
నాయకుడు : మనసులోఁ గల యట్టె మరి యౌనటే ?
ఎరుకత : వోరి ! పనివడి అది నీకు పైపైనుందిరా !
నాయకుడు : ననుపున అది నేను నమ్ముదునటే ?
ఎరుకత : వోరి ! అనుమానించకు ! నీవు అన్నట్టే అయ్యీరా !
నాయకుడు : చేయి పట్టుక చెప్పవే సిగ్గులేఁటికి ?
ఎరుకత : వోరి ! ఆయములుసోఁకె నిఁక ననువాయెరా !
నాయకుడు : యీ యెడ నేకతమాయె నేలేమఱఁగు ?
ఎరుకత : వోరి ! పాయపు శ్రీవేంకటేశ ! పలికినట్టయ్యీరా ![18]

అత్యంత మనోహరమైన నాటకీయ సన్నివేశాన్ని ఈ గేయం ప్రదర్శిస్తున్నది. నాయిక ఎరుకత వేషంలో శ్రీవేంకటేశుని దగ్గరకు వెళ్లింది. కొంతసేపటికి నాయకుడు ఎరుకత ఎవరో గుర్తించాడు – జగన్నాటక సూత్రధారి గనుక. నాయిక బయటపడిపోయింది. ఇది నిస్సందేహంగా రూపకప్రాయమైన

యక్షగానంలోని భాగమే. అన్నమయ తప్పకుండా కొన్ని యక్షగానాలను విరచించి ఉంటాడని ఈ రచనలనుబట్టి భావించకతప్పదు. అలా భావించిన పక్షంలో యక్షగానాలలోని పదాలే లభించి ఇతర భాగం ఎందువల్ల లభించ లేదు? అన్న ప్రశ్నను విధిగా ఎదుర్కొనక తప్పదు. అయితే సూక్ష్మ పరిశీలనలో ఇందుకు ప్రత్యుత్తరం లేకపోలేదు. తాళపత్రాల నుంచి రాగిరేకులమీదకు సంకీర్తనల నెక్కించేటప్పుడు అన్నమయ యక్షగానాలలోని గీతాలను కూడా సంకీర్తనల రూపంలో మిగిలిన సంకీర్తనలతో కలిపి ఉంటాడు. అదీగాక అన్నమయ కూడా సంకీర్తనలను రెండు విధాలా ఉపయోగపడేటట్లు సంతరించి ఉండవచ్చు. ముఖ్యంగా ఈ తరహా గేయాలలో ఆఖరి చరణాలలో ముగింపును గమనిస్తే ఈ అంశం వ్యక్తమౌతుంది. అందువల్ల యక్షగానంలోని సన్నివేశాలను కలిపే ద్విపదలనూ ఇతర సంధివచనాలనూ విడిచి ఉంటారు.

లభిస్తూన్న సంవాదగీతాలను పరిశీలిస్తే అన్నమయ్య రామాయణ గాథనూ, గరుడాచల విలాసగాథనూ, శ్రీవేంకటేశ్వర విలాసగాథలను యక్షగాన రూపక ప్రక్రియలో రచించి ఉండవచ్చని భావించవలసి వస్తోంది. ముందుగా శ్రీ వేంకటేశ్వర విలాసగాథను సూచించే సంవాదగీతాలను పరిశీలించడం జరిగింది. ఇక రామాయణగాథకు సంబంధించిన గీతాలను పరిశీలించవలసి ఉంది. ఈ గీతాలు నిర్ద్వంద్వంగా అన్నమయను యక్షగాన రూపకకర్తగా నిరూపిస్తున్నాయి. ఉదాహరణకు –

'రామ నినుఁబాసి నీరామనేఁ జూడఁగ నా –
రామమున నినుఁబాడె రామరామ యనుచు
ఆమెలుఁత సీత యని యపుడు నేఁదెలిసి
నీ ముద్ర ఉంగరము నేనిచ్చితిని

ఇదె శిరసు మాణిక్యమిచ్చి పంపె నీకు నాకె
అదనెఱిఁగి తెచ్చితి నవధరించవయ్యా !

కమలాప్తకులుఁడ నీకమలాక్షి నీపాద -
కమలములు దలపోసి కమలారి దూరె
నెమకి యాలేమనే నీదేవి యని తెలిసి
అమరంగ నీసేమమటు విన్నవించితి

ఇదె శిరసు మాణిక్యమిచ్చి పంపె నీకు నాకె
అదనెఱిఁగి తెచ్చితి నవధరించవయ్యా!

దశరాథాత్మజ నీవు దశశిరునిఁ జంపి యా -
దశనున్న చెలిఁగావు దశదిశలుఁ బొగడ
రసికుఁడ శ్రీవేంకట రఘువీరుఁడ నీవు
శశిముఖిఁ జేకొంటివి చక్కనాయఁబనులు

ఇదె శిరసు మాణిక్యమిచ్చి పంపె నీకు నాకె
అదనెఱిఁగి తెచ్చితి నవధరించవయ్యా!'[19]

'సీత నీకుఁ జెప్పిపంపి శిరోమణి నీకిచ్చె -
నా తల నేమెఱఁగము అదే మాట
చేతి నీవుంగరమును శిరసున నెత్తుకొనె
యేతలఁపు లెట్లౌనో ఇదిగో మాట

అన్నియు నందేయున్నవి అదిగో మాట
యెన్నుకొనె దినములు ఇదిగో మాట!

తాడుపడ్డ మేనితోడ తలఁపు నీకొప్పగించి
యేడవుతానెఱఁగదు ఇదివో మాట
పాడిదప్పదించుకంతా పదిలమామె గుణము
ఆడనేమీఁ జోటులేదు అదిగోమాట

అన్నియు నందేయున్నవి అదిగో మాట
యెన్నుకొనె దినములు ఇదిగో మాట!

తెలివనీకు బాసిచ్చె దేవతలమాట విను
యెఱిఁగినదే ఇందరు ఇదిగో మాట
గుఱుతై శ్రీవేంకటాద్రిఁ గూడితి రిద్దరు మీరు
అఱిముఱి రామచంద్ర అదిగోమాట

అన్నియు నందేయున్నవి అదిగోమాట
యెన్నుకొనె దినములు ఇదిగో మాట!'[20]

ఇవి రామాయణగాథలోని ఆంజనేయ వాక్యాలన్న సంగతి విదితమే. సీతాదేవిని అశోకవనంలో చూశాడు. రావణుడు సీతాదేవితో మాట్లాడటమూ, ఆమె తిరస్కరించటమూ విన్నాడు. ఆ తరువాత తన దీర్ఘనీలకేశాలతో చెట్టుకొమ్మకు ఉరిపోసుకొనే ప్రయత్నమూ చూశాడు. అతను చూసినవన్నీ వివరించి చెప్పి ఆమె ఇచ్చిన చూడామణిని రఘురాముడికి ఇచ్చాడు. ఈ గేయాలలో మొదటిదానిలో శబ్దాలంకారాల సౌందర్యం రాసిపోసి ఉన్నది. రెండవ పాటలో ఆమె సౌశీల్యాన్ని వర్ణించాడు ఆంజనేయుడు. అయితే శ్రీరాముడికి అది సరిపోలేదు. ఆమె ఏమన్నదని ఆంజనేయుడిని అడిగాడు–

శ్రీరాముడు : అపుడేమనె ? నేమనుమనెను ?
ఆంజనేయుడు : తపమే విరహపుఁ దాపమనె !
శ్రీరాముడు : పవనజ ! ఏమనె ? పడఁతి మఱేమనె ?
అవనిజ నిను నేమనుమనెను ?
ఆంజనేయుడు : రవికులేంద్ర ! భారము ప్రాణంబనె,
ఇవల నెట్లు ధరియించేననె !
శ్రీరాముడు : యింకా నేమనె యింతి మఱేమనుమనె ?
కొంకక ఏమని కొసరుమనె ?
ఆంజనేయుడు : బొంకుల దేహము పోదిదివేగనె
చింకవేఁట యిటు చేసెననె !
శ్రీరాముడు : నను నేమనె ? ప్రాణము మన కొకటనె ?
తనకు నావలెనె తాపమనె ?

ఆంజనేయుడు : మనుకులేశ ! ప్రేమపు మనకూటమి
ఘన వేంకటగిరిఁ గంటినని!'[21]

ఈ సంవాదగీతం పూర్వోక్తగీతం తరువాతనే రూపకంలో ఉండి ఉండాలి. చివరి చరణాలలో మకుటం వచ్చినచోట మాత్రం కొద్ది దిద్దుబాట్లు పొంది ఉండాలి. ఈ గేయంలో శ్రీరాముని ఆతురత చక్కగా రూపుకట్టింది. ముఖ్యంగా చివరి చరణాలలో 'నను నేమనె ? ప్రాణము మనకొకటనె ? తనకు నావలె తాపమనె?' అనడంలో సీతాదేవి అన్నమాటలను ముందుగానే ఊహించుకోబోవడం, తానూహించిన మాటలకు ఆంజనేయుడి ద్వారా ఔననిపించుకోవాలనే తపన శ్రీరాముడి మానసికస్థితికి అద్దం పట్టినట్లయింది. సంభాషణల రచనలో అన్నమయ ప్రతిభ పూర్తిగా వ్యక్తమైంది. ఆంజనేయుడి ద్వారా సీతాదేవిని గురించి తెలుసుకొన్న రఘురాముడు యుద్ధసన్నద్ధుడై సువేలాద్రి దగ్గర సైన్యాన్ని మోహరించి నిలిచాడు. రాక్షస స్త్రీల వల్ల మానసిక హింసను అనుభవించి ఉన్న సీతాదేవి దగ్గరకు విభీషణుడి భార్య సరమ వచ్చింది. ఆమె సీతకు కావలిగా ఉన్న రాక్షసస్త్రీలలో ఒక్కతె. ఆమెకు సీతాదేవి మీద సానుభూతి ఉన్నది. సరమ చెప్పిన మాటలే ఈ గేయం -

'వానరుల దండుగూడి వారధులఁ గట్టె
అని లంక చుట్టిరా నదే విడిసె
కోనలఁ ద్రికూటమెక్కె గొడగు లన్నియుఁ జెక్కె
యే నెపాన రఘురాముఁడిక నేమి సేసునో

వినవమ్మ జానకి ! నీవిభుడింతసేసినాడు
యెనసి యీ రఘురాముఁ డికనేమి సేసునో !

కోరి ఇంద్రజిత్తుఁ జంపె కుంభకర్ణు నిర్జించె
ఘోర దానవుల నెల్ల కూలఁగుమ్మెను
మారణహోమము సేసె మతకమింతాఁ జెరిచె
యీ రసాన రఘురాముఁ డిఁకనేమి సేసునో !

వినవమ్మ జానకి ! నీవిభుడింతసేసినాడు
యెనసి యీ రఘురాముఁ డికనేమి సేసునో !

లావున రావణుఁజంపె లంకవిభీషణు కిచ్చె
చేవల నోసీత నిన్నుఁ జేకొనెను
భావించి శ్రీవేంకటాద్రిఁ బట్టము దాఁగట్టుకొనె
యీవల నావల నాతఁడిఁక నేమిసేసునో

వినవమ్మ జానకి ! నీవిభుడింతసేసినాడు
యెనసి యీ రఘురాముఁ డికనేమి సేసునో !'[22]

సువేలాద్రి మీద శ్రీరాముడు వానరసైన్యంతో దండు విడిసిన తరువాత సానుభూతితో సీతాదేవితో మాట్లాడింది రాక్షసస్త్రీ సరమ ఒక్కతె మాత్రమే. అందువల్ల ఈ గీతం సరమ వాక్యం. అయితే ఇంకా జరగబోయే కథను కూడా జరిగినట్టు చెప్పడమన్నది యక్షగానపదాన్ని సంకీర్తనగా మలచడంలో జరిగిన తారుమారు. లేదా అన్నమయ స్వకపోలకల్పన కావచ్చు.

ఈ గేయాలన్నిటా పల్లవులను ప్రధాన పాత్రలు పలికిన తరువాత సూత్రధారుడూ గాయకబృందమూ మధ్య మధ్య బృందగానంగా పాడుతూ ఉండడం యక్షగాన సంప్రదాయమే. అంతేకాక సామూహిక నృత్యం ఉన్నపుడు గాయకబృందమే సూత్రధారుడి నేతృత్వంలో పాటను పాడడం కూడా యక్షగాన సంప్రదాయమే. ముఖ్యంగా యుద్ధాది దృశ్యాలలో ఇది సర్వసాధారణం. భరతుడి నాట్యశాస్త్రం యుద్ధాన్నీ, మరణాన్నీ రంగ స్థలం మీద చూపడాన్ని నిషేధించినా, యక్షగాన రూపకాల్లో తద్విరుద్ధంగా యుద్ధాన్నీ, మరణాన్నీ చూపడం జరుగుతూనే ఉంది. యుద్ధదృశ్యాలలో అన్నమయ అసాధారణ ప్రతిభను కనబరిచాడు. సాళువ నరసింహుడి యుద్ధాలను కొన్నిటినైనా ఆయన చూసి ఉంటాడు. అందువల్ల అసహజత్వానికి చోటు లేకుండా ఆయన రామాయణ యుద్ధగీతాలు వీరావేశం కలిగించేటట్లుగా సాగాయి. ఈ గేయాన్ని చూడండి –

'రక్కసులమీఁద రాముఁ డలిగె నలు
దిక్కుల నడువుడు - తిఢిం ! తిఢిం !
యెక్కుడు సేనను యిటు మొరయింపుఁడు
ఢక్కానినదము - ఢమ ఢమ ! ఢమం !

జయము మనది వనచరులార
రయమున ధర్మదారలు - తుత్తుతూ !

కుటిల దానవులఁ గొట్టుఁడు, కోటలు
తటుకున దాఁటుడు - ధణం ! ధణం !
పటుగతి నార్చుచు పట్టుఁడు లగ్గలు
పెటులు చూఁడుఁడదె - పెటపెట ! పెటల్ !

జయము మనది వనచరులార
రయమున ధర్మదారలు - తుత్తుతూ !

గుట్టున నుండక కూలె రావణుఁడు
పట్టుఁడు సంకులు - భం భం ! భం !
యిట్టె శ్రీవేంకటేశుఁడు గెలిచెను
దిట్టలై యాడుఁడు - ధిం ధిం ! ధిం !

జయము మనది వనచరులార
రయమున ధర్మదారలు - తుత్తుతూ ![23]

ఈ గేయంలో యుద్ధనిర్వహణలో కావలసిన పరిజ్ఞానం చక్కగా వ్యక్తమైంది. ఇక శ్రీరాముడు యుద్ధసన్నద్ధుడై యుద్ధానికి వెళ్లి రావణునితో తలపడడం మరొక గేయం కళ్లకు కట్టేటట్లు వర్ణిస్తున్నది -

'కులగిరు లదరెను, కుంభిని వడఁకెను
ఇల రాముడు రథమెక్కినను
కలఁగె వారిధులు, కంపించె జగములు
బలు విలు నమ్ములు వట్టినను

వినుడిఁదె రఘుపతి విజయములు
పనుపడి రాక్షసబాధ లుడిగెను

పిడుగులు దొరిగెను, పెనుగాలి విసరె
తొడిబడ బాణము దొడిగినను
ముడివడె దిక్కులు, మొగ్గె దిగ్గజములు
యెడపక రావణు నేసినను

వినుడిఁదె రఘుపతి విజయములు
పనుపడి రాక్షసబాధ లుడిగెను

చుక్కలు డుల్లెను స్రుక్కె భూతములు
తొక్కి యసుర తల దుంచినను
గక్కన శ్రీవేంకటగిరి నిలువఁగ
అక్కజమగు శుభ మందరి కొదవె

వినుడిఁదె రఘుపతి విజయములు
పనుపడి రాక్షసబాధ లుడిగెను. [24]

లంకాధిపతి రావణుడి సైన్యం గురించి కూడా చక్కని గేయం లభిస్తున్నది. ఈ గేయం తాళ్లపాక పెదతిరుమలాచార్యుల సంకీర్తనలలో కలిసినా, ఇప్పటిదాకా మనం పరిశీలించిన గేయాల ఆధారంగా, అది అన్నమయ గేయంగా గుర్తించవచ్చు. రావణ సైన్యంలోని భయాన్నీ, అలజడినీ హాస్యస్ఫోరకంగా చిత్రించాడు అన్నమయ్య.

'దదదద దదదద దశరథతనయా
కదిపితిఁ గకకక కావవే
అదె వచ్చె బాణాలు హానాథ హానాథ
పదపద పదపద పారరో పవ్వుంజాలూ

అనుచు రావణు సేనలటు భ్రమయుచు వీఁగె
యినకులచంద్ర నేఁడిదివో నీమహిమ !

మమమమ్మ మమమమ్మ మన్నించుఁడు కపులార
సమరాన చచచచ్చ చావకుండా
మెమెమెమ్మె మెమెమెమ్మె మేము నీవారమె
మొమొమొమ్మొ మొమొమొమ్మొ మొక్కేము మీకు

అనుచు రావణు సేనలటు భ్రమయుచు వీఁగె
యినకులచంద్ర నేఁడిదివో నీమహిమ ।

తెతెతెత్తె తెతెతెత్తె తెరువేది లంకకు
తతతత్త తలమని దాఁగుదురూ
గతియైన శ్రీవేంకటగిరి రఘునాథ
సతమై మమ్మింక నేలు జయజయ నీకు

అనుచు రావణు సేనలటు భ్రమయుచు వీఁగె
యినకులచంద్ర నేఁడిదివో నీమహిమ ।[25]

రఘురాముడి పరాక్రమానికీ, వానరసైన్యాల ధాటికీ నిలవలేక చెల్లా చెదరౌతున్న రావణ సైన్యం పలికిన మాటలివి. ఈ గేయాన్ని సూత్రధారుడే గాయకబృందంతో పాడవలసిన తీరులోనే ఉంది. తత్తరపాటుతో భయంతో వచ్చిన నత్తిమాటలు సన్నివేశంలోని ఔచిత్యాన్ని పోషించడమేకాక సైనికుల చిత్తవృత్తిని కూడా ప్రదర్శిస్తున్నాయి. రావణవధ జరిగింది. రావణుడిని చూసి విభీషణుడూ, రావణుడి అంతఃపుర స్త్రీలూ విలపించడం రామాయణంలో ఉన్నదే. ఆ దృశ్యం కూడా అన్నమయ గేయంలో రూపుగట్టుకొన్నది. పూర్వోక్త గేయంలాగే ఇది కూడా పెదతిరుమాలాచార్యుల రచనలో కలిసిందని గుర్తించడానికి అట్టే శ్రమపడవలసిన అవసరం లేదు. ఇటువంటి యక్షగాన పదాలు పెదతిరుమలాచార్యుల రచనలలో ఇవితప్ప వేరేలేకపోవడమే ఇందుకు ప్రబల ఆధారం.

'హరుని పూజలు నమ్మి హరితో మార్కొనఁగ
విరసమై కూలితివి వెట్టి రావణా !
వరుసతోడ బ్రహ్మవరము నమ్మి రాము
శరణనకుండఁగానె సమసెఁగాకులము

ఎదురా రఘుపతికి నీవిటు రావణా ! నేఁ
డిదేమి బుద్ధి దలఁచితిట్లాయె బ్రదుకు !

జపతపములు నమ్మి సర్వేశు విడువఁగా
విపరీత మాయెఁగా వెట్టి రావణా !
వృషమలన గడు తానున్న జలనిధి నమ్మి
కపులపాలైతివిగా కదనరంగమున

ఎదురా రఘుపతికి నీవిటు రావణా ! నేఁ
డిదేమి బుద్ధి దలఁచితిట్లాయె బ్రతుకు !

బంటతనము నమ్మి పైకొన్న రాఘవు
వింటఁ బొలిసితివిగా వెట్టి రావణా
యింటనే శ్రీవేంకటేశ్వరునిఁ గొలిచి
వెంటనే సుఖియాయె విభీషణుడు

ఎదురా రఘుపతికి నీవిటు రావణా ! నేఁ
డిదేమి బుద్ధి దలఁచితిట్లాయె బ్రతుకు !'[26]

ఈ గేయం విన్న తరువాత రావణుడిమీద జాలి కలగక తప్పదు. సర్వేశ్వరుడిని విడిచిన జపతపాల మీద పూజలు, కర్మకాండల మీద అన్నమయకు నమ్మకం లేదు. ఆయనే –

'అతిశయమగు శ్రీహరి సంకీర్తన
సతతంబును మా సంధ్య
మతి రామానుజమతమె మాకును
చతురత మెరసిన సంధ్య'[27]

అంటూ సంధ్యావందనంమీద నమ్మకం లేకపోవడాన్నీ -

నదులొల్లవు నాస్నానము
సదరము నాకీ స్నానము

పరమభాగవత పాదాంబుజముల
దరుశనమే నా స్నానము
తిరువేంకటగిరిదేవ నీ కథా
స్మరణమె నా స్నానము[28]

అంటూ తీర్థస్నానాల మీద నమ్మకం లేకపోవడాన్నీ స్పష్టంగానే ప్రకటించాడు. 'జపతపముల నమ్మి సర్వేశు విడువగా విపరీతమాయెగా వెట్టి రావణా !' అని అనడంలో అన్నమయ తాత్త్వికదృక్పథం వెల్లడి అవుతున్నది.

యుద్ధానంతరం రావణుడి అంత్యక్రియలు జరిగిన తరువాత శ్రీరాముని పనుపున ఆంజనేయుడు విభీషణుని అనుజ్ఞ తీసుకొని లంక ప్రవేశించి అశోక వనానికి వెళ్లి సీతాదేవికి జరిగిన విషయాన్ని చెప్పి సీతను రమ్మనమని రాముని కబురుగా చెబుతాడు. ఆసందర్భంలోని గేయమిది -

'దనుజాలు వారేరు తలఁకేరు లంకలో
వనజాప్తకులుఁడు వచ్చెనమ్మా
వినవచ్చెను కపివీరుల యార్పులు
వెనుకొని పవుఁజాలు విడిసెనమ్మా

అదే రాముఁడు సువేలాద్రిపై నిలిచె
యెదిరితివి సీత యిఁక నేమమ్మా !

కదనములో కుంభకర్ణాదివీరులు
మదమున బయిపడి మడిసిరమ్మా
చిదుమగ రావణు చేతులుఁ దలలు
నిదులవెల్లా నిన్ను నిండెనమ్మా

అదే రాముఁడు సువేలాద్రిపై నిలిచె
యెదిరితివి సీత యిఁక నేమమ్మా।

పతి విభీషణునిఁ బట్టము గట్టెనమ్మా
అతఁడు నిన్నుఁ బిలువ నంపీనమ్మా
కతగా శ్రీవేంకటగిరిమీఁదను
యితవుగఁ గూడరా యిపుడేనమ్మా।

అదే రాముఁడు సువేలాద్రిపై నిలిచె
యెదిరితివి సీత యిఁక నేమమ్మా।'[29]

'అతడు నిన్నుఁ బిలువనంపీనమ్మా' అని ఉండడంవల్ల ఈ వాక్యాలన్నీ ఆంజనేయుడు పలికినవిగా విదితమౌతున్నది. ఇటువంటి యక్షగానరూపకంలో చివరగా మంగళం వంటి పాట ఉండి ఉంటుంది. అలాగే ప్రారంభాన కైవారం ఉండి ఉంటుంది. ప్రాచీనమైన యక్షగానాలలో ద్విపద అక్కడక్కడ – అంటే కీర్తనల, దరువుల మధ్య – ఉంటుంది. అయితే అన్నిరకాల పాటల కన్నా ద్విపదే అధికశాతం ఆక్రమించుకొని ఉంటుంది.

శ్రీరాముడు సీతనూ లక్ష్మణుణ్ణీ విభీషణాదులనూ వెంటబెట్టుకొని అయోధ్యానగరానికి చేరుకొంటూండగా కౌసల్యాసుమిత్రలు చూసి ముందుగానే ఆంజనేయుడు వచ్చి చెప్పిన విషయాలను స్మరిస్తూ మాట్లాడుకోవడాన్ని ఈగేయం ప్రదర్శిస్తున్నది –

'హరుని విల్లు విరిచె అట్టె సీతఁ బెండ్లాడె
పరశురాముని బాహుబలము గొనె
సురలకు మునులకు సారిది నభయమిచ్చె
వరుస నయోధ్య యేలవచ్చె నటవమ్మా।

అరుదు రామునిచేఁత లదిగో పుష్పకము
సారిది మన బాలులే సోద్యము గదమ్మా।

వాలిఁ గొట్టి సుగ్రీవు వరరాజ్య మిచ్చెనట
చాలుగాఁ గొండలనె జలధి గట్టె
తీలుగా రావణుఁ జంపి తెగి లంక సాధించి
వాలిన సేనలఁ గూడి వచ్చెనటవమ్మా !

అరుదు రామునిచేఁత లదిగో పుష్పకము
సారిది మన బాలులే సోద్యము గదమ్మా !

కాంతయైన సీతఁగూడి కలుషములెల్లఁ బాపి
పంతముతో విభీషణుఁ బట్టముగట్టి
ఇంతటా శ్రీవేంకటాద్రి నిరవున వేఁటలాడి
వంతులకు రాజ్యమేల వచ్చెనటవమ్మా !

అరుదు రామునిచేఁత లదిగో పుష్పకము
సారిది మన బాలులే సోద్యము గదమ్మా ![30]

ఇప్పటిదాకా ఉదాహృతాలైన పదిగేయాలనూ చూసిన తరువాత అన్నమయ రచించిన యక్షగానరూపకాలలోని పదాలే రేకులలో చెల్లాచెదురై సంకీర్తనల రూపంలో కనిపిస్తున్నాయని తేలుతుంది. రామాయణంలోని యుద్ధ కాండను రూపకంగా రచించి ఉండవచ్చని తెలిసినంతలో లభ్యమైన గీతాలను బట్టి భావించవచ్చు. అన్నమయ ద్విపదలో రామాయణాన్ని రచించినట్లు చిన్నన్న ఇచ్చిన భోగట్టా. ద్విపద లేకుండా యక్షగానరూపకం నడవదు కాబట్టి అన్నమయ రచించిన రామయణంలో ద్విపదలను ఈ రూపకంలో వినియో గించి ఉండవచ్చు.

సాధరణంగా ద్విపద, అటవెలది, తేటగీతి, కందం, సీసపద్యం, దరువులు, ఏలలు, కొన్నిరకాల పదాలతో, మధ్య మధ్య సంధివచనాలతో యక్షగాన రూపకం తయారవుతుంది. అయితే రచయిత రాసినదానికన్నా ప్రదర్శనలలో రూపకం రెండింతలకు పైగా పెరుగుతుంది. ఇందుకు కారణం ఆశువుగా హాస్యపాత్రలూ, సూత్రధారుడూ, కొన్ని ప్రధాన పాత్రలూ సంభాషణ

లను చెప్పడమే. అసలు రచనే ఇందుకు అవకాశమిచ్చేటట్లుగా సాగుతుంది.

మనకు లభించినంతలో రామాయణగాథ యక్షగాన రూపకానికి చెందిన పదాలే ఒక క్రమంలో పెట్టదగినవిగా భిన్నభిన్న సన్నివేశాలకు చెందినవి లభిస్తున్నాయి. అహోబలనారసింహుడిమీద అన్నమయ రచించిన సంకీర్తనలు చాలానే ఉన్నాయి. వాటిలో సంవాదగీతాలు కూడా లభిస్తున్నాయి. కాని అవి రూపకంలోని వివిధ సన్నివేశాలను చిత్రించేవిగా లేవు. వాటిని గురించి తరువాత పరిశీలించడం జరుగుతుంది.

ఇక్కడ గమనించవలసిన విషయమొకటి – రామాయణంలో యుద్ధ కాండను రూపకంగా మలచడంలోని సౌలభ్యం. అన్నమయ రామాయణ ద్విపద మనకు లభించలేదు. కొన్ని గీతాలు లభించాయి. అవి యక్షగాన పదాలనడంలో సందేహం లేదు. ఈ ఆధారాలతో అన్నమయ యుద్ధకాండను రూపకంగా రాసి ఉండవచ్చునని భావించడానికి మరొక సాధనంగా విజయ రాఘవుని ఆస్థానకవయిత్రి చేసిన 'మన్నారుదాసవిలాస నాటకము'ను ఉదాహరణగా స్వీకరించవచ్చు. ఆమె మొదటగా మన్నారుదాసవిలాస ప్రబంధాన్ని రచించి, తరువాత అదే ప్రబంధంలోని కొన్ని భాగాలను యథా తథంగా వినియోగించుకొని ద్విపద, మంజరి, లయగ్రాహి, ధవళములు, శోభనములు సువ్వాలలు జోలలు మొదలైనవి చేర్చి నాటకాన్ని రూపొందించింది.[31] అన్నమయ కూడా ఈ విధంగా చేసి ఉండవచ్చని భావించడం హేతు బద్ధమే అవుతుంది. అందువల్ల మనకు తెలిసినంతలో అన్నమయ ప్రథమ యక్షగాన రూపకకర్తగా గుర్తించకతప్పదు.

కేవలం పురాణకథలను వస్తువుగా స్వీకరించి కూర్చిన యక్షగాన రూపకాలటుండగా, కేవలం రూపరహితమైన భావాలకు వ్యక్తిత్వాలను ఆపాదించి రూపకాలుగా సంతరించే పద్ధతి ఒకటి సంస్కృతం నుంచి అన్నమయకు సంక్రమించినట్లు కనిపిస్తున్నది. ఇటువంటి రూపకాన్నీ అన్నమయ రచించి ఉన్నట్లు భావించడానికి ఆధారాలు లభిస్తున్నా, ఆ రూపకం

లోని కథా సంవిధానాన్ని గుర్తించేందుకు ఆధారాలు లభించడం లేదు. ఈ విషయాన్ని పరిశీలించేముందు కొన్ని విశేషాలను గమనించవలసి ఉంది.

సంస్కృతంలో 'ప్రబోధచంద్రోదయమ'నే దృశ్యకావ్యం రచించి కృష్ణ మిశ్రుడు ఈ పద్ధతి నాటకాలకు శ్రీకారం చుట్టాడు. కృష్ణమిశ్రుడు క్రీ. శ. 1100 ప్రాంతంవాడైనట్లు శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి ఊహ.[32] ఈ రూపకం అద్వైతమతాన్ని వివరించేది. ఈ రూపకంతో ప్రభావితుడైన, శ్రీవిశిష్టాద్వైతంలో వడగళైశాఖకు గురుపీఠంలో ఉన్న, వేదాంతదేశికులు సంకల్ప సూర్యోదయమనే రూపకాన్ని రచించారు. సంకల్ప సూర్యోదయం విశిష్టాద్వైత మతాన్ని ప్రతిపాదిస్తున్నది.

ఈ రెండు రూపకాలలోనూ పాత్రల పేర్లలో కొద్ది తేడాలున్నా, ఇంచు మించుగా పాత్రలన్నీ సమానంగానే ఉన్నాయి. ఈ రూపకాలలోనూ కనిపించే పాత్రలలో విష్ణుభక్తి ఒకతె. ఈ విష్ణుభక్తికీ మాయకూ జరిగిన సంవాదాన్ని అన్నమయ గేయరూపంలో ప్రదర్శించాడు –

విష్ణుభక్తి : ఒరపులాడకపోవే వోసిమాయ । నాతోఁ
దొరలేవు నినుముట్ట దోసము ।

మాయ : వెరపించేవేమోసి విష్ణుభక్తినంటా ।
నెరఁగనటే నీయేతు లిన్నియును ?

విష్ణుభక్తి : వుదుటు చెల్లదు పోపో వోసిమాయ । నా –
యెదురు మాఁటలు నీకు నిఁకనేలే ?

మాయ : వదరేవు హరిభక్తి వనిత, తెలియరు నే –
నిదురపుచ్చినవారు, నీవు నాకెదురా ?

విష్ణుభక్తి : వొల్లవటే జీవమోసి మాయ । నీ –
కల్లలిన్నియును లోకమెఱుఁగును ।

మాయ : నల్లని విభుని మన్నన భక్తినంటా ఁ
జెల్లఁబో పాపపు చేఁదు మేయకువే

విష్ణుభక్తి : వూరకుండవుగా వోసిమాయ ! నిన్నుఁ
బేరఁబిలువము గుంపెనలాడేవు !

మాయ : నారాయణ భక్తినాతి ! నన్నును నిన్నుఁ
గోరి యిందరు నెఱుఁగుదురేలపోవే !

విష్ణుభక్తి : పోవవు ననుఁజూచి వోసిమాయ నా
తోవ వచ్చినను నొత్తువు నీవు !

మాయ : శ్రీవేంకటగిరిదేవుని భక్తి నా –
హోవళికే నిన్ను నలమిరిందరును !

విష్ణుభక్తి : పుట్టుమాలిన బరుబోఁకివి నన్నుఁ
దిట్టేవదే మోసి దిమ్మరి మాయ ![33]

ఈ గీతాన్ని ఉదాహరించి పరిష్కర్తలైన శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు తమ పీఠికలో –

> 'ఈ కీర్తనము మాయా, విష్ణుభక్తి సంవాదముగా నడిచినది. ఇది ప్రబోధచంద్రోదయ, సంకల్ప సూర్యోదయ నాటకముల పరిశీలన ఫలితముగా తోచుచున్నది'[34]

అన్నారు. అన్నమయ అహోబిలంలో ఆదివణ్ శఠకోపయతీంద్రుల సన్నిధిలో 'సకల వేదాంత పఠనంబు' చేసినప్పుడు ఈ నాటకాలతో పరిచయం కలిగి ఉండవచ్చు. కాని ఆ రెండు నాటకాలు ఆయనకు ఉత్తేజాన్నిచ్చి ఉండవచ్చునని భావించడానికి వీలు ఉందిగాని, ఆ రెండిటిలోనూ దేనికీ అనువాద ప్రాయమైనది కాదు ఈ రచన. ఆ రెండు నాటకాలలో విష్ణుభక్తికీ మాయకూ సంవాదమే ఎక్కడా తటస్థించలేదు కాబట్టి ఈ విధంగా భావించక తప్పదు.

అంటే అన్నమయ ఆ రెండు నాటకాల ప్రభావం వలన అటువంటి రూపకాన్ని యక్షగాన పద్ధతిలో రచించి ఉంటాడని భావించవలసి వస్తున్నది. ప్రబోధచంద్రోదయంలోనూ, సంకల్ప సూర్యోదయంలోనూ యుద్ధప్రస్తావన ఉన్నది. అన్నమయ రచనలోనూ యుద్ధప్రస్తావన కనిపిస్తున్నది. అయితే అన్నమయ వర్ణించిన ముట్టడి పై రెండు నాటకాలతోనూ విభేదిస్తున్నది -

'తక్కక శ్రీహరిభక్తి తాపలుసేసి యెక్కిరి
చక్కఁగా వైకుంఠము సనకాదులు
వొక్కట విష్ణుకథలు వోడసేసుకదాఁటిరి
పెక్కు సంసార జలధి భీష్మాదులు

నెరవాది సాహసులు నిత్యశూరులు
దురిత విదూరులు ధ్రువాదులు ।

కడు విరక్తియనేటి కత్తులనే నరకిరి
నడుమ భవపాశముల నారదాదులు
బడినే హరిదాసుల పొఁజులు గూడుకొనిరి
సుడివడ కిహమందే శుకాదులు

నెరవాది సాహసులు నిత్యశూరులు
దురిత విదూరులు ధ్రువాదులు ।

పరమ శాంతములనే పట్టపేనుగుల మీఁద
వరుసల నేఁగేరు వ్యాసాదులు
సిరుల శ్రీవేంకటేశుఁ జేరి సుఖముఁ బొందిరి
బెరసి దాస్యమున విభీషణాదులు

నెరవాది సాహసులు నిత్యశూరులు
దురిత విదూరులు ధ్రువాదులు ।

సంకల్ప సూర్యోదయంలో నిరూపపాత్రలు మాత్రమే కాక రెండు పురాణ

పాత్రలు, నారదుడూ, తుంబురుడూ కూడా ఉన్నారు. అందువల్ల అన్నమయ తన స్వతంత్ర రచనలో వ్యాసుడూ, విభీషణుడు మొదలైన పాత్రలను ప్రవేశ పెట్టి ఉండవచ్చు. అన్నమయది స్వతంత్ర రచన కనుకా, అందులోని గీతాలు సంకీర్తనల రూపంలో రాగరేకులలో చెల్లాచెదురై ఉండడం వల్లా అసలు కథా వస్తువు యొక్క రూపురేఖలను తెలుసుకొనే వీలులేనందువల్లా ఈ రూపకం లోని కథను తెలుసుకోవడం దుష్కరమౌతున్నది. అయితే శ్రీవేంకటేశ్వరుడిని భక్తిప్రపత్తులతో సేవించుకొన్నవారికీ, దైవాన్ని మరచి జపతపాలనే నమ్ముకొన్న వారికీ జరిగిన సంఘర్షణే యితివృత్తం అయి ఉంటుందని ఊహించడంలో విప్రతిపత్తి ఏమీ ఉండదు.

అన్నమయ రచనలలో గమనార్హమైన మరొక రచన శృంగారమంజరి. ఇది మంజరీద్విపదలో రాసిన స్వకపోలమైన కథ. పురాణ గాథ కాదు. చక్కగా గానయోగ్యంగా సాగిన రచన మిది. ఈ శృంగారమంజరిలో 477 పంక్తులలోని కథ[36] క్లుప్తంగా ఇదీ -

శ్రీకామినీవక్షుడూ, భువనపాలనదక్షుడూ సురసార్వభౌముడైన శ్రీ వేంకటేశ్వరుడి శృంగార విఖ్యాతిని సకల జనానందసంస్తుతి వల్ల ఒక బాల విని విని విరహావస్థలో పడుతుంది. ఆమె చెలికత్తెలు ఆమె విరహాన్ని గమనించి మరపించడానికై ఉద్యానవనానికి తీసుకు వెళతారు. అంతలో వసంతం ఎదురైంది. దానితో ఆమె విరహతాప మధికమైంది. వనపాలకాంతలు అఖిల లోకేశుడైన మోహనమూర్తిని ఉద్యాన సౌందర్యాన్ని చూడడానికి రమ్మని ప్రణయ పూర్వకముగా ప్రస్తుతి చేసి ఆహ్వానిస్తారు. అప్పుడా 'మగువల వయసు లామని కొల్లకాడు', 'భామల తలఁపు లోపలి గారడీఁడు' విరివైన ఉద్యానవీథులు ప్రవేశిస్తాడు. అప్పుడు ఆ బాలా, ఆమె చెలికత్తెలూ మన్మథ పూజ చేస్తారు. అప్పుడు ఉద్యానవిహారానికి వచ్చిన శ్రీ వేంకటేశ్వరుణ్ణి చూసి మరింత విరహావస్థలో పడుతుంది. చివర కొక చెలికత్తె ఆ బాల మనసిచ్చిన కందర్పగురుని దేక యుండిన నింతిఁదేర్పంగరాదని భావించి తానే దూతికయి

శేషాచల వాసుడి దగ్గరకు వెళ్లి సఖి విరహావస్థను గురించి చెప్పి ఆయనను తీసుకొని వస్తుంది. అప్పుడాస్వామి ఆ బాలను చేబట్టి శృంగార రసవార్ధి నోల లాడించడంతో కథ ముగుస్తుంది. కథలో యెక్కడా నాయికకు పేరొకటి ఉన్నట్లు తెలియరాదు.

ఇది కేవలం మంజరీద్విపదలో రచించిన కావ్యమే అయినా, ఆయా ఘట్టాలలో అన్నమయ శృంగార సంకీర్తనలను చేర్చుకొంటే చక్కని యక్షగాన మౌతుంది. యక్షగాన రూపకానికి అనువైన పద్ధతిలో శృంగారమంజరి రచిత మైంది. శ్రీవేంకటేశ్వరవిలాస రూపకానికి అన్నమయ రచించిన మంజరీ ద్విపదలనే రాగరేకుల మీద ఈ విధంగా గేయాలనూ, సంధివచనాలనూ విడిచి చెక్కారేమోనని భావించవలసి వస్తోంది.

ఈ ఆధారాలన్నిటివల్లా అన్నమయను తొలి తెలుగు యక్షగాన రూపక కర్తగా గుర్తించకతప్పదు. సంకీర్తనలకు లక్ష్యమూ లక్షణమూ సంతరించిన మహావ్యక్తి యక్షగానానికి కూడా లక్ష్యలక్షణాలను సమకూర్చి పెట్టడం కేవలం కాకతాళీయమని అనడానికి వీలులేదు. శృంగారమంజరి కథాచట్రాన్నే తరువాత తరువాత ఎన్నో యక్షగాన రూపకాలకు ఆర్వాచీనులు వాడుకోవడం జరిగింది.

అన్నమయ తరువాత రానురాను తెలుగు గేయరచన కొత్తసొగసులను కూర్చుకొంటూ సాగింది. అయితే అన్నమయను ఎక్కడా ప్రస్తావించని తెలుగు కవుల రచనలలో అన్నమయ ప్రభావం కనిపించని సరస్వతీనదిలాగా అంతర్వాహినిగా ఉంటూనే వచ్చింది.

మహత్తరమైన సృజనాత్మక ప్రతిభ కలిగిన మహోన్నత భావకుడి దృష్టి అన్ని రంగాలలోనూ ప్రసరించడంవల్ల తెలుగు మధురకవితా శాఖ కూడా పరిపుష్టమైంది. తరువాతి తరాల వారికి అన్నమయ పెట్టినదే వరవడి అయింది. యక్షగాన వాఙ్మయ ప్రక్రియకు శ్రీకారం చుట్టినవాడు అన్నమయ్య.

అధోజ్ఞాపికలు

1. భీమఖండం – శ్రీనాథుడు, ఆశ్వాసం 3, ప. 65
2. సంస్కృత భీమఖండం – అధ్యాయం 10, శ్లో. 19
3. శ్రీనాథుడు – ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి, పు. 377
4. శ్రీనాథుడు – ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి, పు. 166
5. మైనర్ వర్క్స్ ఆఫ్ తాళ్లపాకం పొయెట్స్, వాల్యూం 1, సంకీర్తన లక్షణం
6. సంకీర్తన లక్షణం, పు॥లు 57, 58, 59
7. శృంగార సంకీర్తనలు, సంపుటం 12, పునర్ముద్రణ, సంకీర్తన 326
8. శృంగార సంకీర్తనలు, సంపుటం 18, సంకీర్తన 278
9. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 11, 3వ భాగం, సంకీర్తన 17
10. శృంగార సంకీర్తనలు, సంపుటం 12, సంకీర్తన 380
11. తిరుమల – తిరుపతి దేవస్థానం ఎపిగ్రాఫికల్ సిరీస్, సంపుటం 2, సంఖ్య 10
12. శృంగార సంకీర్తనలు, సంపుటం 27, సంకీర్తన 180
13. శృంగార సంకీర్తనలు, సంపుటం 22, సంకీర్తన 290
14. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 11, 2వ భాగం, పుట 162, 13వ రేకులోని పాట
15. శృంగార సంకీర్తనలు, సంపుటం 26, సంకీర్తన 216
16. శృంగార సంకీర్తనలు, సంపుటం 20, సంకీర్తన 225. మూలంలో ఈ సంకీర్తన చివరి పాదాలలో 'కంగికూడె శ్రీవేంకటఘనుడు కడపలోన, నిగునెండలోన బెట్టి నీడకు దియ్యనేలే' అని ఉన్నది. అక్కడక్కడ ప్రాస తప్పడం ఉన్నది గనుక సవరణార్హమని నా ఊహ.
17. శృంగార సంకీర్తనలు, సంపుటం 12, పునర్ముద్రణ, సంకీర్తన 163
18. శృంగార సంకీర్తనలు, సంపుటం 19, సంకీర్తన 287
19. శృంగార సంకీర్తనలు, సంపుటం 26, సంకీర్తన 229
20. శృంగార సంకీర్తనలు, సంపుటం 25, సంకీర్తన 496
21. శృంగార సంకీర్తనలు, సంపుటం 4, సంకీర్తన 97
22. ఆధ్యాత్మ సంకీర్తనలు, మొదటి సంపుటం, పునర్ముద్రణ, సంకీర్తన 462
23. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 11, మొదటి భాగం, సంకీర్తన 222
24. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 11, మొదటి భాగం, సంకీర్తన 223
25. శృంగార సంకీర్తనలు, సంపుటం 21, పెదతిరుమలాచార్య కృతములు, సంకీర్తన 158
26. శృంగార సంకీర్తనలు, సంపుటం 21, సంకీర్తన 213
27. అధ్యాత్మ.సంకీర్తనలు, మొదటి సంపుటం, పునర్ముద్రణ, సంకీర్తన 10
28. అధ్యాత్మ సంకీర్తనలు, మొదటి సంపుటం, సంకీర్తన 51
29. శృంగార సంకీర్తనలు, సంపుటం 26, సంకీర్తన 178
30. శృంగార సంకీర్తనలు, సంపుటం 25, సంకీర్తన 495

31. ఆంధ్ర యక్షగానవాఙ్మయ చరిత్ర, పు॥లు 265-66
32. సంస్కృతవాఙ్మయచరిత్ర, లౌకికవాఙ్మయము, రెండవ సంపుటం, పు 416
33. అధ్యాత్మ సంకీర్తనలు, మొదటి సంపుటం, పునర్ముద్రణ, సంకీర్తన 107
34. అదే పీఠిక, పు. 36
35. అదే, సంకీర్తన 490
36. మైనర్ వర్క్స్ ఆఫ్ తాళ్లపాకం పాయెట్స్, వాల్యూం 1, పు॥లు 1-20.

10. యక్షగాన సంప్రదాయం - 3

అన్నమయ ప్రభావం

తెలుగు సాహితీ రంగంలో పదహారవ శతాబ్దం ఉదయించడంతో తెలుగులో యక్షగానవాఙ్మయం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లడం ప్రారంభమైంది. నేటికి లభిస్తూన్న యక్షగానరూపకాలే దాదాపు ఐదువందల దాకా ఉన్నాయి. ఇంకా కొన్ని వెలుగుచూడకుండా మారుమూల గ్రామాలలో, గ్రంథాలయాలలో పడి ఉన్నాయని భావించడం అసంగతం కాబోదు. తమ 'యక్షగాన వాఙ్మయ చరిత్ర'లో ఆచార్య యస్వీజోగారావు గారు పేర్కొన్న యక్షగానాలు నాలుగువందల అరవై ఉన్నాయి. ప్రజలలో ఇంతగా ఆదరణ సంపాదించుకొన్న మరొక సాహితీప్రక్రియ కానరాదు. తొలి తెలుగు యక్షగాన కర్త అన్నమాచార్యులని నిరూపించడం జరిగింది కనుక ఆయన ప్రభావం తరువాతి తరం యక్షగాన రచనల మీద ఏయే రూపాలలో ప్రసరించిందో పరిశీలించవలసి ఉంది.

లభ్యమౌతున్న కృతులలో కందుకూరి రుద్రకవి సుగ్రీవవిజయం ప్రాచీన మైన యక్షగానమని పలువురి అభిప్రాయం. కాని అంతకన్న కొంత ప్రాచీన మైన రచన ఓబయమంత్రి విరచితమైన గరుడాచల యక్షగానమని పరిశీలనలో తేలే విషయం. ఓబయమంత్రి కాలనిర్ణయం చెయ్యడానికి ఆధారాలేవీ లభించడం లేదు. తెలిసిన వివరాలు తల్లి చెన్నమాంబ అనీ ఈయన నందవరీకుడనీ మాత్రమే. '... రచనాప్రక్రియనుబట్టి చూచినచో యక్షగాన పరిణామ చరిత్రలో నిది మిక్కిలి ప్రాచీన స్థితిని సూచించుచున్నది' అని ఆచార్య జోగారావు గారి అభిప్రాయం.[1] కీర్తిశేషులు శ్రీనివాస చక్రవర్తిగారు '... ఈ గరుడాచలం, సుగ్రీవవిజయం కంటె ప్రాచీన మయినదని అనిపిస్తూంటుంది' అన్నారు.[2] నిజానికి గరుడాచల యక్షగానం దృశ్యకావ్యమే అయినా పురవర్ణనలు అవీ చూస్తే శ్రవ్యకావ్యధోరణి ప్రబలంగా కనిపిస్తున్నది.

Subhash Nunna

అందువల్ల వేరే ఆధారాలు లభించినదాకా ఇదే ప్రాచీనమై, లభ్యమౌతున్న యక్షగానమని భావించవలసి ఉంటుంది. కందుకూరి రుద్రయ 'క్రీ. శ. 1568 ప్రాంతములవాడేని, కొంత తర్వాతవాడేని కాగలడు' అని కీ. శే. ప్రభాకరశాస్త్రి గారి నిర్ణయం.[3] 'శ్రీ శాస్త్రులు వారి యభిప్రాయముతో నేనేకీభవించుచున్నాను' అని కీ. శే చాగంటి శేషయ్యగారు అన్నారు.[4] అంటే ఇరువురూ కందుకూరి రుద్రకవి 16వ శతాబ్దపుటుత్తరార్థంలో ఉన్నాడని నిర్ణయించినట్లయింది. ఓబయమంత్రి 16వ శతాబ్దపు ప్రథమపాదంలో ఉండివుండవచ్చు.

పదహారో శతాబ్దానికి తెలుగు సాహితీరంగంలో అభిరుచి మారడంతో పాటు రచనాధోరణులలో కూడా చాలా మార్పులు వచ్చాయి. ఆ శతాబ్దపు తొలి పాదంలో దేశంలో శాంతిభద్రతలు నెలకొని ఉండడమూ, రాజాస్థానాల లోనూ, మహామండలేశ్వరుల ఆస్థానాలలోనూ కవిత్వానికి పలుకుబడి పెరిగి కవుల మధ్య ఒకవిధమైన పోటీ ఏర్పడింది. అందువల్ల అతిస్వల్పకాలంలోనే ఎన్నో ధోరణులు ప్రబలడానికి కారణాలేర్పడ్డాయి. 15వ శతాబ్దంలో అన్నమయ తీర్చిన యక్షగాన ప్రక్రియ కూడా ఈ మార్పులకు లోనైంది. అదీకాక యక్ష గానం రూపకవిశేషం కనక ప్రదర్శనలో పొందే మార్పులు తరువాతి యక్షగానాల మీద ప్రభావం నెరపి ఉంటాయి. అయితే అన్నమయను మించిన పదకర్త లెవరూ అటు యక్షగానాలలో గాని ఇటు వాగ్గేయకారులలో గానీ కనిపించరు. అన్నమయ భావనాజగత్తూ, ఆయన జీవితమూ చాలా విశాలమైనవి. ఆ విశాలత్వం తరువాతి తరం యక్షగానకర్తలలో లేకపోవడంవల్ల ఆ ప్రక్రియ దాదాపు 18వ శతాబ్ది దాకా ఎదుగూ బొదుగూ లేకుండా నిలిచిపోయింది.

ప్రఖ్యాతవైణికులూ, సంగీతజ్ఞులూ అయిన కళాప్రపూర్ణ శ్రీ ఈమని శంకరశాస్త్రిగారు అన్నమయను గురించి రాస్తూ –

> 'ఈ సంకీర్తనాచార్యుడు, పదకవితామార్గదర్శి తమ తరువాతి సంగీత సాహిత్యపరులకు నాలుగు త్రోవలు దిద్దినట్లు విదితమవుతోంది. శృంగార సంకీర్తనల వరవడి క్షేత్రజ్ఞుల వంటి

పదకర్తలకు మార్గదర్శకమైనది. ఈయన అధ్యాత్మ సంకీర్తనల సరళి అధ్యాత్మ రామాయణ కీర్తనలకు, భద్రాచల రామదాసు కీర్తనలకు మాత్రమే కాక అనేక సంగీత రచయితలగు వాగ్గేయ కారులకు దారి తీసినది. ఈయన చూపిన మార్గముననే కందుకూరి రుద్రయ తరువాతి కవులు వీధినాటకము మాత్రముగా చూపబడుచున్న యక్షగానములకు సాహిత్య గౌరవము కలుగునట్లు రూపొందించ నారంభించిరి'[5]

అని అన్నారు. అందువల్ల యక్షగాన రూపక ప్రక్రియ అన్నమయ పెట్టిన వరవడి లోనే సాగిందనడంలో ప్రముఖ సంగీతవిద్వాంసులు కూడా ఏకీ భవిస్తున్నారు. అయితే అన్నమయ పెట్టిన వరవడి ఎలాంటిది అన్న ప్రశ్నకు ఖచ్చితమైన సమాధానమివ్వడం కుదరదు. అన్నమయ యక్షగానం యథాతథంగా మనకు లభించకపోవడమే ఇందుకు కారణం.

ఓబయమంత్రి రచనలో కథాప్రారంభసమయాన అహోబలాన్ని ప్రస్తుతించాడు –

జంపె

రథగజాశ్వపదాతి రమణీయ సంకులము
పృథుల పుణ్యస్థలము పెదయహోబలము
పాదుకొను సకల జన ప్రతతి కుశలోజ్జ్వలము
పేదలకు జయబలము పెదయహోబలము
మొరువడిగ నూట యెనిమిది తిరుపతుల మేటి
బిరుదు పావన ఫలము పెదయహోబలము[6]

ఈ ప్రస్తుతి అన్నమయ రచనను తలపింప చేస్తుంది. పల్లవిలోనూ చరణాలలోనూ పాదాంతాన విష్ణునామాన్నో కాకపోతే క్షేత్రనామాన్నో నిలుపుతూ రచన చెయ్యడం అన్నమయలో చూడవచ్చు. ఉదాహరణకు

అహోబల క్షేత్రనామాన్నే నిలుపుతూ చేసిన ఈ రచనను చూస్తే ఓబయమంత్రి రచనమీద అన్నమయ ప్రభావ ముందని భావించవలసి ఉంటుంది.

'అనాది జగమున కౌభళము
అనేద్భుతంబౌభళము

హరినివాసమీ యౌభళము
అరిది పరము పదమౌభళము
అరి దైత్యాంతకమౌభళము
హరముఖ సేవితమౌభళము'[7]

ఇలాగ పాదాంతాన క్షేత్రనామ ముంచి చేసిన రచనతోనే కాక పురవర్ణన లను కూడా అన్నమయ సంకీర్తనలలో చూడవచ్చు. ఉదాహరణకు --

'అదె చూడు తిరువేంకటాద్రి నాలుగు యుగము -
లందు వెలుగొందీ ప్రభ మీరఁగాను

తగనూటయిరువైయెనిమిది తిరుపతులఁ గల
స్థానికులును చక్రవర్తి పీఠకములును
అగణితంబైన దేశాంత్రుల మఠంబులును
నధికమ్మై చెలువొందఁగాను'[8]

అంటూ ఐదు చరణాలలో, సుదీర్ఘపాదాలలో తిరుపతిని అభివర్ణిం చాడు అన్నమయ. గేయరూపంలో పురవర్ణన అన్నమయతోనే ప్రారంభం అయింది. అన్నమయ రచించిన 'శృంగారమంజరి' నిజానికి యక్షగాన రూపకంలోని మంజరీద్విపద భాగాలేమో నన్న విషయం మునుపే ప్రస్తావిత మైంది. ఓబయమంత్రి రచన ఆ విషయాన్ని పరోక్షంగా ధృవపరుస్తున్నది. శ్రీనృసింహదేవుడు అహోబలంలోని భక్తజనుల కనుగప్పి విల్లంబులు ధరించి వేటకాని పైఖరితో అడవిలోకి వెళతాడు. ఆ సందర్భాన ఓబయమంత్రి చేసిన వనవర్ణనలో -

'అచట నీముందర యశ్వత్థ నింబ
వట బిల్వ తింత్రిణి వకుళ కదంబ
తాల కింశుక హరీతకి మాతులుంగ
మాలూర కాంచన మన్మథతిలక
క్రముఖ సాల రసాల ఖర్జూర కుటజ
శమీ చూత పున్నాగ జంబీర వకుళ
నారికేళార్జున నాగహింతాల
పారిజాతాది బహువృక్షతతులు
పొదలు గురువిందపొదలు సంపెంగ
పొదలు గేదగి మల్లెపొదలు నింపొదవ ....'[9]

అంటూ వృక్షనామాల పట్టిక నిచ్చాడు. అన్నమయ 'శృంగారమంజరి' లో –

'కోల తమాల తక్కోల కొకోల
తాల హింతాల కోత్తాల కుద్దాల
సాల బాల రసాల జాల నేపాల
తార జంబీర మందార ఖర్జూర
గంధఫలీ కుంద ఘనపిచుమంద
... ...'[10]

అంటూ వల్లించిన వృక్షనామాల జాబితాను ఓబయమంత్రి అనుసరించాడేమోనని సందేహం కలగకమానదు.

ఏలపాటలను గురించి అన్నమయ లక్షణాలను ఇలా నిర్వచించాడు–

'నాయకాహ్వాన పూర్వమై నయము గలిగి
మ్లేచ్ఛ పరిభాషఁ దగి రాగమిళితమైన
యేలపాట పదంబునా నిలఁ చెలంగు
మహిత నాయక సంబుద్ధి మధ్యమగుచు'

అన్నమయ రచించిన యేలలు ఈ లక్షణాలను చక్కగా ప్రదర్శించే లక్ష్యాలు.

ఉదాహరణకు కొన్ని -

'మేడలెక్కి నిన్నుఁ జూచి
కూడెననే యాసతోడ
వాడు దేరి పుస్సురందురా - వెంకటేశ !
యాడనుంటి విందాకానురా

పిక్కటిల్లు చన్నులపై
చొక్కపు నీవుంగరమ్ము
గక్కన నేనద్దుకొందురా - వెంకటేశ !
లక్కవలె ముద్రలంటెరా'[11]

అయితే ఓబయమంత్రి రచించిన ఏలలు 'నాయకాహ్వానపూర్వకంగా' లేవు. అదీగాక అన్నమయ రచనలూ 'మ్లేచ్ఛపరిభాష'లో లేవు. గరుడాచల నాటకంలో -

'వచనం:

... మరియు గేళికాగృహంబున సకల
సామగ్రు లొసంగి యాయిందిరాదేవి చెంచుకన్యా
సమేతంబుగా శౌరిని మంగళస్నానంబు సేయించు
సమయంబున గొందరు ముత్తయిదువలు యేలలు
బాడిరట యెటువలెను :

చెంచుభామను గూడుకొని
మించిన మోహముతోను
యెంచి లోకముల బ్రోవరా - యో నారసింహ !
మించగా యేలితివౌరా

ఎంతవాడవైన నీవు
యింత దుడుకులు సేయ
యంతరంగమున చెల్లునా – యో నారసింహ !
సంతరించి యేలితి వౌరా'[12]

మంగళస్నానాలు చేయించే సందర్భాన పాడినపాటలలాగా ఉన్నాయి. ఐతే ఓబయమంత్రి ఈ యేలపాటలను జానపద గేయాల ననుసరించి రాసి ఉండగూడదా అన్న ప్రశ్న ఎదురుకావచ్చు గాని ఆ ప్రశ్న దుస్సమాధేయం కాదు. జానపద ఏలపాట లిలా ఉంటాయి –

'చుక్కవోలె పాగజుట్టి
చూచినావు దేశమెల్ల
యెక్కినావు యెల్మతేజినో – ఓ పాటేల !
ఏలినావు గోలకొండనో

కుందేలంత గుర్రమెక్కి
బంగరు కుచ్చుల బల్లెమేసి
యెక్కినావు యెల్మతేజినో – ఓ పాటేల !
ఏలినావు దేశమెల్లనో'[13]

జానపద యేలలలో ప్రాస లేదు. ప్రాసను విధించినది అన్నమయ్యే. జానపద ఏలపాటలలో కనిపించని ప్రాసను ఓబయమంత్రి పాటించాడంటే, ఆయన అన్నమయనే ఆదర్శంగా తీసుకున్నాడని చెప్పాలి. యాగంటి వారి యేలపదాలలో ప్రాస ఉంది. అయితే అవి అన్నమయకు తరువాత రచితమైన వని భాషశైలిని బట్టి చెప్పవలసి ఉంటుంది.

నరసింహుడిని చెంచెత తనతో సమానంగా పనులు చెయ్యగలవా అంటూ సవాలు చేసే ఘట్టంలోని పదాన్ని చూస్తే ఓబయమంత్రి మీద అన్నమయ ప్రభావమెంతటిదో గమనించవచ్చు. ముందుగా అన్నమయ రచన

ను చూద్దాం. ఈపాట అన్నమయ గరుడాచల యక్షగానరూపకాన్ని రచించే ఉండాలని నిర్ధరిస్తున్నది.

'పారిటాకులు గట్టి పారనోపేవా ?
యేరులెల్లదాఁటి కొండలెక్కనోపేవా ?
యీరీతి వెదురుబియ్య మేరనోపేవా ?
పేరిన తేనెలు తెచ్చిపెట్టనోపేవా ?

కవయఁగవలెనంటె కాఁగలించేవా ? నీ
వువిదలఁ దలచక వుండనోపేవా ?

యెడమఁగుడిని వింట నేయనోపేవా ?
అడవిమెకాల వేఁట లాడనోపేవా ?
కడఁగి చెంచెత నాతోఁ గలశుండేవా ?
అడరి నాపొత్తుల నారగించేవా ?

కవయఁగవలెనంటె కాఁగలించేవా ? నీ
వువిదలఁ దలచక వుండనోపేవా ?

యిప్పటిమాఁటలు యీడేరించనోపేవా ?
చెప్పినట్టే కాఁపురము సేయనోపేవా ?
కప్పురంపు శయ్యపై వేకంటరాయఁడా
యెప్పుడుఁ బాయని చనవియ్యనోపేవా ?

కవయఁగవలెనంటె కాఁగలించేవా ? నీ
వువిదలఁ దలచక వుండనోపేవా ?

ఇంక ఓబయమంత్రి రచనను పరిశీలించాలి -

'ఇన్ని చిన్నెలు గలిగి దొరవైయున్న నీవు నాతో
నున్నతోన్నతి గలిసి మెలగుచు నుండగలవా ?

వెక్కసంబుగ చరులు ఘనగిరు లెక్కగలవా ?
గ్రక్కున నిక్కి మరియొక గిరికి జివ్వున నిగుడగలవా ?
మేటి పాదలకు దూరి దిబ్బలు దాటగలవా ? శరముల
సూటిదప్పక మృగములను బడమీటగలవా ?
ఇప్పపువ్వులు వెదురుబియ్యం బేరగలవా ? యాకలి
త్రిప్పటనకను దిరిగి ఫలముల దేవగలవా ?
వారకను బహు జుంటితేనెలు వడచగలవా ? చల్లని
పారుటాకుల పచ్చటముపై బరచగలవా ?
ఇన్ని పనులిటుసేయ నోపసహించితేనె నాతో
నన్ని దెలుపుము మరుగుబెట్టక వన్నెకాడ !'[15]

ఈ రెండు రచనలనూ పరిశీలిస్తే – పారుటాకులు కట్టడమ, కొండ లెక్కడమూ, వెదురుబియ్యం ఏరడమూ, తేనెను సేకరించడమూ, జంతువులను వేటాడటమూ, కలిసిమెలిసి మెలగాలనుకోవడమూ ఈ రెండు పాటల్లోనూ ఉన్నది. అన్నమయ ప్రభావం ఓబయమంత్రి గీతం మీద గాఢంగా ఉన్నదని చెప్పకతప్పదు. అన్నమయకన్నా ముందు ఇలాంటి సన్నివేశాన్ని ఏ కవీ చిత్రించినట్లు లేదు. ఓబయమంత్రి తన యక్షగాన రచనను ముగిస్తూ–

'అనియిట్లు సకల లోకాధీశుఁ బేర
వనజభవామరవంతుఁ బేరఁ
గరివరదునిఁ బేరఁ గమలాక్షుఁ బేరఁ
బరమాత్ముఁబేర విశ్వంభరుఁబేరఁ
నిగమగోచరుఁబేరఁ నిర్గుణుఁబేరఁ
నగధరుఁబేరఁ బన్నగతల్పుఁబేర
దురితారిఁబేరఁ జతుర్భుజుఁబేరఁ
గరుణాకటాక్షవీక్షణ ధన్యుఁబేర
విభవశీలుని బేర విమలాంగుఁబేర

శుభమూర్తిఁబేర భాసురకీర్తిఁబేర
... ...
సన్నుతిమీరంగ సరసులౌననగ
వన్నె కెక్కిన నందవరశాసనుండు
చిన్నమాంబా గర్భసింధుచంద్రుండు
... ...
ఘనుడు ఓబయమంత్రి కవివరేణ్యుండు
పరమభక్తిని సమర్పణముగా జేసి ...'

అని చెప్పుకొన్నాడు. 'శృంగారమంజరి' కృతి చివర అన్నమయ –

'... భక్తిఁ దిరువేంకటాద్రీశు పేరఁ
గారుణ్యలక్ష్మీప్రకాశుని పేర
రాజితాఖిలలోకరక్షణు పేర
పృథుల దానవసైన్యభీషణు పేర
భూరికౌస్తుభరత్న భూషణు పేర
గురుభరద్వాజైక గోత్రపావనుఁడు
నందాపురీవంశనాయకోత్తముఁడు
అనఘుడు తాళ్లపాకాన్నయార్యుండు
మధురంపు శృంగారమంజరి చెప్పె ....'[16]

అంటూ చెప్పుకొన్నాడు. విష్ణునామాలను స్మరిస్తూ ఆపేర గ్రంథాన్ని రచించాడని చెప్పుకోవడంలో అన్నమయను ఓబయమంత్రి అనుసరించాడని చెప్పకతప్పదు.

సందర్భం వచ్చింది గనుక అన్నమయ రచించిన మరి రెండు యక్షగాన పదాలను కూడా పరిశీలించడం సమంజసమౌతుంది. ఓబయమంత్రి రచనలో అహోబలేశ్వరుడు –

శైలాగ్రములు దాటి చరులపైకురికి
కేళి దిబ్బలకు లంఘించి దాటుచును
వచ్చు చెంచెత జూచి వాసుదేవుండు
యచ్చెరువంది రెప్పార్పక ... ...'[17]

చూసి సమ్మోహితుడై దగ్గరకు వెళ్లి 'ఎవరి పడుచవె కొమ్మ? వివరింపవే ముద్దుగుమ్మ !' అంటూ సరాసరి ప్రణయ భాషణలోకి వెళతాడు. అన్నమయ రచనలో నాయికానాయకుల సమావేశం అతి మనోహరంగా నాటకీయంగా ప్రారంభమౌతుంది. చెంచెత వేటలాడుతూండగా, నరసింహుడు కూడా అక్కడికి వేటలాడుతూ వచ్చి ఆమెతో తగువు పడతాడు. చెంచెత మాటలివి–

'పొదలో నేనేసిన పులి నేవేసితి నని
పెద పెద్ద యెలుగుఁల బెదరించేవు
కుదురుగుబ్బల నిన్నుఁ గుమ్మెదునో వుండేవో మేను
చిదియఁగా మేటి చెంచెత నన్నెఱఁగవా ?

వేటకాఁడనంటా నావెంటఁ బాయవు వోరి !
చీటకపు చెంచెత నాచేతి లాగెరఁగవా !

చేరువ నామోఁటునఁ జేరిన నామెకముల
నేరుపరినంటా నీవు నేసేవు
జీరలుగా కొమ్ముగోరఁ జింతునో వూరకుండేవో
పేరుకల చెంచెత నా బిరుదు లెరఁగవా ?

వేటకాఁడనంటా నావెంటఁ బాయవు వోరి !
చీటకపు చెంచెత నాచేతి లాగెరఁగవా !

చొల్లెపు చుట్లలతోడ చూపులకు నడ్డాలు
చెల్లునంటా వచ్చి చెట్టపట్టేవు
వొల్లననఁగా గూడేవు వుద్దండపు వేంకటేశ
జల్లివింటి చెంచెత నాచలము లెరఁగవా ?

వేటకాఁడనంటా నావెంటఁ బాయవు వోరి ।
చీటకపు చెంచెత నాచేతి లాగెరఁగవా ।'[18]

ఈ పాటనుబట్టి చూస్తే నరసింహుడు అమాయకంగా వెళ్లి గడుసరి చెంచెత ప్రణయంలో పడినట్టు కనిపిస్తున్నది. ఓబయమంత్రి రూపకంలో చెంచెత అమాయిక. మొదట కొద్దిగా బెట్టుచేసినా చివరకు సులభంగా లొంగి పోతుంది. అన్నమయ రచనలో నాయిక అందుకు పూర్తిగా విరుద్ధస్వభావం కలది. తగవు ముగిసిన తరువాత చెంచెత అమాయకత్వం ప్రకటించి ఈ ప్రణయానికి శ్రీవేంకటాద్రి నరసింహుడిదే పూర్తి బాధ్యత అన్నట్లు మాట్లాడు తుంది. ఈ పాట చూడండి –

'కాకి పైఁడి మాబొట్టు కప్పుపారిటాకు పట్టు
పైకొనఁ జూచేవు నీకు బాఁత్రైతినా
మేకుల మొల్లల కొప్పు మేనెల్లఁ గస్తూరి తుప్పు
కైకొని నిన్ను మెప్పించఁగలనటవయ్యా ।

చూచినవారికి నిది సోద్యములయ్యా
నీ చనవు గాదనేనా నీచిత్తమయ్యా ।

చెక్కుల జవ్వాది నూనె చెంచుజాతి తోడుతోనె
యిక్కువ నాతోఁ బెనఁగే వింతకోపేనా
పెక్కువ పూఁబొదయిల్లు, పిసకత్తి యేదుముల్లు
నిక్కినిక్కి చూచేవు నీకు నింతేలయ్యా

చూచినవారికి నిది సోద్యములయ్యా
నీ చనవు గాదనేనా నీచిత్తమయ్యా ।

పానుపు లేఁతచిగురు పట్టువలపు జిగురు
నానాఁటికిఁక నంత నవ్వకువయ్యా
యీనెపాన శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
అని నీనామై గురుతులంటెఁ బైపైనయ్యా ।

చూచినవారికి నిది సోద్యములయ్యా
నీ చనవు గాదనేనా నీచిత్తమయ్యా !'[19]

అన్నమయ రచనలోని నాయిక యెంతటి జాణో, ప్రియుడిని ఎంతగా ఆటలు పట్టించగలదో ఈ గీతం చూస్తే మనకు అవగతమౌతుంది –

'గొంది నీవు వోబుళపు కొండలో ఉండేవునికి
ఇందిరతో విన్నవించే నిదివో నేను ।
చెంది నీవు చేచేతఁ జేసినట్టి ఆగడాలు
అంది యాకెతోనేచెప్పేనప్పట నేను ।

కాని కాని మెచ్చుసేసేఁగానీ నేను
సోనల శ్రీనరసింహ చూడుమీ నేను ।

శిరసువంచి నీవు చిరునవ్వులు నవ్వేది
సిరితో విన్నవించే నంచెలనే నేను ।
అరుదై నీమేన నిండా నానిన పెంజెమటలు
ధర నాపె కెరిఁగించేఁ దప్పక నేను ।

కాని కాని మెచ్చుసేసేఁగానీ నేను
సోనల శ్రీనరసింహ చూడుమీ నేను ।

అమరు నీవాఁడిగోళ్ల అందపు విటతనాలు
కనులతో విన్నవించేఁ గందువ నేను ।
సమమై శ్రీవేంకటేశ సతిఁ గాఁగిటఁ గూడి నా –
కమర లంచమిచ్చితి వంతదాన నేను ।

కాని కాని మెచ్చుసేసేఁగానీ నేను
సోనల శ్రీనరసింహ చూడుమీ నేను !'[20]

ఈ గీతంలో చెంచులక్ష్మి నాయకుడితో జరిపిన ప్రణయకలాపమంతా

ఇందిరకు చెబుతానని భయపెడుతున్నది. భయపడిన నరసింహుడు ఆమెకు లంచమివ్వక తప్పలేదు. చివరకు 'అంతదాననేను' అని ప్రకటించుకొన్నది.

ఓబయమంత్రి గరుడాచల నాటకంలో కన్నా అన్నమయ రచనలోని చెంచులక్ష్మి పాత్ర అన్నివిధాలా ఆకర్షణీయమైన పాత్ర. అన్నమయ ఆమెను సప్తవర్ణాల ఇంద్రచాపంలా ధగద్ధగాయమానంగా తీర్చిదిద్దాడు. అన్నమయ రచన పూర్తిగా యక్షగానరూపకంగా మనకు లభించకపోవడం దురదృష్టమే.

ఓబయమంత్రి రచనలో చెంచెతను వివాహమాడి శ్రీనరసింహుడు వేదాచలానికి రాగా ఇందిరాదేవికి హితులైన సఖులు చూసి లక్ష్మీదేవికి ఈ కబురు చెబుతారు. అప్పుడామె ఆజ్ఞ ప్రకారం –

'హరి మహామహుడు నొయ్యారంపు నడల
బిరబిర జెంచు గుబ్బెతయు దారాగ
వలనొప్పుజూచి యా ద్వారపాలకులు
బలిమి కవాటముల్బంధించిరంత'[21]

అయితే ఇక్కడ తలుపుల దగ్గరి తగవు లేదు. ద్వారపాలకులతో మాట్లాడి, శ్రీ రమాదేవికి చెప్పుకోవలసినదంతా చెప్పుకొని చివరికి బతిమాలుకుని 'రమాదేవి పాదపద్మంబులకు దండంబు పెట్టి' ఆమె వల్ల దీవనలను పొందుతాడు ! కాని అన్నమయ రచనలో తలుపుదగ్గర తగవు ఉంది. చెంచెతతో తిరిగి వచ్చిన గరుడాద్రిపతిని చూసి శ్రీ రమామణియైన అలమేల్మంగ ఇలా అంటుంది –

'జొబ్బిలిన జవ్వాది జొటజొట వడియఁగ
నిబ్బరపుఁ దేనె కంపు నిగుడఁగాను
గుబ్బలపై పేరుల గురిగింజ లొత్తఁగాను
గబ్బి చెంచెతల నెట్టు కాఁగిలింతువయ్యా !

వేఁటలాడి వచ్చేనంటావేసాలు సేసేవు మాతో –
నేఁటికి నిదెట్టు నీకు ఇతవాయనయ్యా !

పుప్పొడి మైనిండరాలి పొదిగొని వుండఁగాను
కప్పురమే తిని మోవి గాజుగట్టఁగా
కొప్పున పొరిటాకులు కళబెళమనఁగాను
చప్పిడి చెంచెతలతో సంగతెట్లాయనయ్యా!

వేఁటలాడి వచ్చేనంటా వేసాలు సేసేవు మాతో -
నేఁటికి నిదెట్టు నీకు ఇతవాయనయ్యా!

తలపై మొల్ల విరుల కలులు మూఁగుకరాఁగా
చిలుకబాసలు సెలవుల రేఁగఁగా
అలమేల్మంగను నన్నుఁ నలమి శ్రీవేంకటేశ!
పిలుచుఁ జెంచెతలతోఁ బెనఁగుటెట్లయ్యా!

వేఁటలాడి వచ్చేనంటావేసాలు సేసేవు మాతో -
నేఁటికి నిదెట్టు నీకు ఇతవాయనయ్యా![22]

ఇది తలుపుల దగ్గరి సంవాదమన్న సంగతి విదితమే. తరువాత తరువాత ఈ సంవాదానికి ప్రాచుర్యం హెచ్చింది. ఇంక ఓబయమంత్రి రచనలో చెంచులక్ష్మి గాంధర్వ వివాహం తరువాత 'పుణ్యాంగనలు' శోభనాలు పాడతారు–

'కరిరాజవరదునకు గిరిరాజ ధీరునకు
గరుడాచలేంద్రునకు కాంతిచంద్రునకు శోభనమే!
నిరుపమాకారునకు నిర్మలాచారునకు
గరుడాచలేంద్రునకు కాంతిచంద్రునకు శోభనమే!
సరసిజనేత్రునకు సత్యచారిత్రునకు
గరుడాచలేంద్రునకు కాంతిచంద్రునకు శోభనమే![23]

అన్నమయ రచనలో -

'కొండలే పీఁటలగాఁ గూచున్నా రెదురుబడి -
నండఁనే నారసింహుడు నాదిలక్ష్మియు

వెండిఁ బైడి నిండుకొన్న వేదాద్రి గరుడాద్రుల
పెండిలాడే రిద్దరును ప్రియములఁజూడరే

పాడరే సోబనాలు పడఁతులాల
వేడుక లిద్దరికిని వెలసెఁ జూడరే !

భవనాశి జలములఁ బాయక తోడ నీళ్లాడి -
రివలా నవలాఁ దాము యేటి దరుల
జవళి మంచిపూవుల సరిసేసలు వెట్టుచు
తవిలి సుముహూర్తానఁ దప్పక చూచేరు

పాడరే సోబనాలు పడఁతులాల
వేడుక లిద్దరికిని వెలసెఁ జూడరే !

పొందుగఁ గనకావతి భోగావతి నదుల
సందడి వసంతముగాఁ జల్లులాడుచు
అందమై శ్రీవేంకటాద్రి నహోబలాన నొక -
చందమునఁ గూడి కూడి సరసములాడేరు

పాడరే సోబనాలు పడఁతులాల
వేడుక లిద్దరికిని వెలసెఁ జూడరే ![24]

అని హెచ్చరించుకొని పాడిన శోభనమిదీ -

అరుదుగ మును నరకాసురుఁడు
సిరులతోఁ జెరలు దెచ్చిన సతుల
పరువపు వయసుల పదారువేలను
సొరిదిఁ బెండ్లాడిన సుముఖునికి

శోభనమే శోభనమే
వైభవముల పావనమూర్తికి

చెందిన వేడుక శిశుపాలుఁడు
అంది పెండ్లాడఁగ నవఘళించి
విందువలెనే తావిచ్చేసి రుకుమిణి
సందడిఁ బెండ్లాడిన నరసునికి

శోభనమే శోభనమే
వైభవముల పావనమూర్తికి

దేవదానవులు ధీరతను
దావతిపడి వార్ధి దరువఁగను
శ్రీవనితామణిఁ జెలఁగి పెండ్లాడిన
శ్రీవేంకటగిరి శ్రీనిధికి

శోభనమే శోభనమే
వైభవముల పావనమూర్తికి

ఓబయమంత్రి రాసిన శోభనాలలో భగవంతుడి వివిధ గుణాలనూ పేర్కొంటూ ముక్తసరిగా శోభనం చెప్పడం జరిగింది. అన్నమయ పాటలో విపులంగా పురాణగాథలను స్మరించడం జరిగింది. ఓబయమంత్రి క్లుప్తంగా చెప్పినా నాయకుని గుణగణవర్ణన మన్నది అన్నమయ వరవడిలోనే సాగింది. అయితే ఓబయమంత్రి రచనమీద అన్నమయ ప్రభావం ఉందని చెప్పడానికి మరొక ఆధారంగా మాత్రమే ఈ శోభనపు పాటలు ఉదాహృతమ్యైనాయి. అన్నమయ రాసిన ఈ శోభనాలను చూస్తే యక్షగానరూపకం కోసమే రచితమ్మైన పదాలుగా తోచకతప్పదు.

ఇంక ప్రాచీనమ్మైన యక్షగానాలలో ఒకటైన కందుకూరి రుద్రయ రచన సుగ్రీవవిజయాన్ని పరిశీలించవలసి ఉంది. కందుకూరి రుద్రయ ప్రతిభావంతు డైన కవి. అందువల్ల ఎవరి ప్రభావాన్నైనా స్వయంప్రతిభతో తనదిగా చేసుకొన గలిగినవాడు. అందువల్ల అన్నమయ ప్రభావం ఆయన రచనలో పరోక్షంగానే

కనిపించడానికి అవకాశం ఉంది. అదీగాక అన్నమయ వాలి సుగ్రీవుల కథను అక్కడక్కడ తన సంకీర్తనలలో ప్రస్తావించాడే గాని, ప్రత్యేకంగా ఆ కథను గురించి రాసిన సంకీర్తనలు గానీ, యక్షగానరూపకంగా రాసి ఉంటే ఆ పదాలు గానీ లభించ లేదు. ఒకవేళ మనకు లభించని సంకీర్తనలలో ఆ ఘట్టాలున్నా యేమో నన్నది ఊహగానే మిగలక తప్పదు. అందువల్ల కూడా సుగ్రీవ విజయం మీద అన్నమయ ప్రభావాన్ని అంచనా కట్టడం సులభం కాకపోవచ్చుగాని అసంభవం మాత్రం కాదు. అసలు రుద్రయ రాసిన 'జనార్దనాష్టకం' గానయోగ్య మైన శృంగార రచన –

'సిరులు మించిన పసిమిబంగరు
జిలుగు దుప్పటి జాఱఁగాఁ
జరణపద్మముమీఁద దేహము
చంద్రకాంతులు దేరఁగా
మురువుచూపఁగ వచ్చినావో
మోహనాకృతి మీఱఁగా
గరుడవాహన ! దనుజ మర్దన !
కందుకూరి జనార్దనా !'[26]

ఈ రచన అన్నమయ శృంగార సంకీర్తనలను గుర్తుకు తెస్తుంది. శృంగార సంకీర్తనల ప్రభావం వలననే రుద్రయ ఈ అష్టకాలను రచించి ఉంటాడు. సుగ్రీవవిజయంలో శ్రీరాముడు సీతాదేవిని తలచుకొని శోకిస్తూ 'రమణితో నిన్నుఁ బాసినప్పుడె రాతిరే శివరాతిరాయెను'[27] అంటాడు. అన్నమయ రచనలలో శివుని ప్రస్తావనలు చాలా స్వల్పం. అవైనా శ్రీవేంకటేశ్వరుని పరివారదేవుడిగానే శివుణ్ణి ప్రదర్శిస్తాయి. శృంగారమంజరిలో నాయిక విరహావస్థను వర్ణిస్తూ 'రాత్రులింతికి శివరాత్రులైతోఁచె'[28] నన్నాడు అన్నమయ్య.

సుగ్రీవ విజయంలో ఏకతాళంగా పేర్కొన్న ఒక రచనను పరిశీలించవలసి ఉంది. అయితే ఇందులో భావంమీద అన్నమయ ప్రభావం కాక ఛందస్సు మీద అన్నమయ ప్రభావాన్ని చూపుతుంది. వాలిసుగ్రీవుల యుద్ధాన్ని వర్ణిస్తూ-

'ముక్కులు చెక్కులు మూఁపులు వీపుల్
ప్రక్కలు పిక్కలు బరులును దరులున్
స్వరములు శిరములు జానులు వీనుల్
కరములు నురములు కాళ్లను వ్రేళ్లన్ ....[29]

ఈ రచనను మధురగతి రగడగా గుర్తించారు ఆచార్య యస్వీ జోగారావు గారు. పాదానికి నాలుగు చతుర్మాత్రాగణాలుండటం ఈ ఛందస్సు లక్షణం. రగడకు రెండే పాదాలుంటాయి. లక్షణానుగుణంగానే ఉన్న కళాపూర్ణోదయం లోని మధురగతిరగడ ఈ విధంగా ఉంది -

'పదయార్వన్నియ బంగరు వలపును
మెదిలెడి తళుకుల మేఖల చెలువును'[30]

అంటే ఛందస్సు సరిపోయినా నడక మారిపోయింది. నడకను దృష్టిలో పెట్టుకుని చూస్తే -

'మూటల్ మాటల్ మూరల్ బారల్
బాటల్ సదివే బాపలు తా
వేటల్ వీపుల్ వేలుపు గుడుపుల్
తేటలు మరగిన దేవుని తా ...'[31]

అన్న అన్నమయ రచనలో రుద్రయ రచనకు పోలిక ఎక్కువగా ఉందని చెప్పక తప్పదు. అయితే అన్నమయ రచన మధురగతి రగడ కాదు. శరషట్పద ఆభాసం. ఇక్కడ రుద్రయ అన్నమయను అనుకరించలేదు. ఆ మార్గంలో మరొక ప్రయోగం చేశాడని చెప్పాలి.

సుగ్రీవ విజయంలో ద్విపద అధికశాతంలోనే కనబడుతుంది. గ్రంథాంతాన అన్నమయ శృంగారమంజరిలోలాగా, ఓబయమంత్రి గరుడాచల యక్షగానంలో లాగా –

'అని సమస్తాసురారాతికదంబ
వినమిత నిజభుజావిక్రముపేర
సురుచిర ప్రార్థనాసుభగంభవిష్ణు
వరాహావతార శ్రీనివాసునిపేర
నాతతార్చన లాలనాతిశయాళు
భీత రక్షణుపేర స్ప్రృహయాళుపేర
నిగమ గోచరుపేర నిఖిలలోకేశుఁ
డగు కందుకూరి జనార్దనుపేర'

'సుగ్రీవ విజయాభిధాన యక్షగానప్రబంధా'న్ని రచించినట్టు చెప్పుకొన్నాడు. 'రుద్రకవి కొక్కింత పూర్వుడై యుండిన నుండవచ్చును' అని నిర్ణయించిన చక్రపురి రాఘవాచార్యుడు తన విప్రనారాయణ చరిత్ర గ్రంథాంత ద్విపద కూడా' అని సర్వజీవదయాపరుపేర' అంటూ ముగించాడని ఆచార్య జోగారావు గారిచ్చిన సమాచారం. అంటే అన్నమయ వరవడిలో యక్షగాన రూపక రచన సాగుతూ వచ్చిందన్నమాట.

కందుకూరి రుద్రయ సుగ్రీవ విజయంలో సంతరించిన ఏలలు చాలా అందమైనవి. చెంచెతలు పాడిన యేలలివి –

'భాను వంశమునఁ బుట్టి
దానవకామినిఁ గొట్టి
పూని మఖము నిర్వహింపవా, ఓ రామచంద్ర
మౌనివరులు సన్నుతింపగాన్

రాతి నాతిఁజేసి పురా
రాతి చేతి విల్లు విఱిచి
భూతలేంద్రులెల్ల మెచ్చఁగా ఓ రామచంద్ర
సీతను వివాహమాడవా'[32]

ప్రాసతో ఘటితమైన ఈ ఏలపాటలు అన్నమయ లక్షణం ప్రకారం 'నాయకాహ్వాన పూర్వకం'గానే ఉన్నాయి గాని అన్నమయ యేలల లాగే 'మ్లేచ్ఛపరిభాష'లో లేవు. తరువాత తరువాత యక్షగాన రూపకాలలో చాలా మంది యేలపాటలు రాశారు గాని ఇంత అందంగా సాగినవి దాదాపు లేనే లేవు. కందుకూరి రుద్రయ అత్యంత ప్రతిభావంతుడైన కవి గనుక అన్నమయ చూపినదారిలో నడిచినా, అన్నమయను మరిపించగల ధోరణిలో తన రచనను సాగించాడు. అది అందరికీ సాధ్యమయ్యేపని కాదు.

అన్నమయ ప్రభావం కొంత ఓబయమంత్రి రచన మీద ఉన్నదని గుర్తించిన తరువాత చెప్పవలసిన విషయమొకటి ఉంది. తొలిగా రచన చేసిన వ్యక్తి ప్రభావం రెండో కవి మీద ఉన్నప్పుడు, రెండోకవి ప్రభావం మూడోకవి మీద పడినప్పుడు తొలికవి రచనా లక్షణాల ప్రభావం మూడోకవి మీద చాలా బలహీనమై కానవస్తుంది. ఇందుకొక ఉదాహరణను చూడవచ్చు. ఓబయ మంత్రి రచన ప్రభావం క్రాంజ వేంకటాద్రి రచనమైన వాసంతికాపరిణయ మన్న యక్షగానరూపకం మీద కనిపిస్తున్నది. శ్రీవేంకటేశ్వరుని కంకితంగా రాసిన వాసంతికా పరిణయం[33] లోని ఇతివృత్తం చెంచులక్ష్మి కథే. కాకపోతే పేరులేని చెంచెతకు వాసంతిక అని పేరు పెట్టాడు కవి. కవిగా మంచి ప్రతిభను కనబరచిన వాడే వేంకటాద్రి.

ఈ వాసంతికాపరిణయానికి పరిష్కర్తలైన శ్రీ గంటి జోగిసోమయాజి గారు తమ పీఠికలో '... ఈ గ్రంథము సుమారు 1700 సంవత్సరములకు వెనుక వ్రాయఁబడి ఉండవచ్చును' అన్నారు. కీర్తిశేషులు డాక్టర్ నేలటూరి వేంకటరమణయ్యగారి అభిప్రాయంతో ఏకీభవిస్తూ ఆచార్య యస్వీజోగారావు

గారు '... వెంకటాద్రి కృతి రచనము క్రీ. శ. 16వ శతాబ్ది యుత్తరార్థమున జరిగి యుండుననవచ్చును'[34] అన్నారు. రచనాశైలిని బట్టి కూడా ఇది సరైన నిర్ణయ మనిపించకతప్పదు. నాటక సంవిధానశైలిలో కొద్దిగా తేడాలున్నా, తంజావూరు యక్షగానరూపకాల మాదిరిగా వచన సంభాషణలు లేకపోవడం మొదలైనవి చూస్తే ఈ రచన సుగ్రీవవిజయం పద్ధతిలోనే ఉంది.

క్రాంజ వెంకటాద్రి మీద అన్నమయ ప్రభావం ఓబయమంత్రి రచన ద్వారా ప్రసరించింది. ఓబయమంత్రి చేసిన అహోబలపుర వర్ణనను పరిశీలించడం జరిగింది. ఇక వెంకటాద్రి రచనను చూడాలి. పురవర్ణనకు ముందుగా అహోబల క్షేత్రాన్ని ఈ విధంగా ప్రస్తుతించాడు –

'సిరులకును గాపురము జిత సదలకాపురము
పరమాత్ముపుర మహోబల నామపురము
స్థిరవైభవోత్కరము శ్రీనృసింహాకరము
పరభయంకర మహోబల నామపురము
కలధౌత గోపురము కాంతిజిత గోపురము
కలుష భయహర మహోబల నామపురము
విజయలక్ష్మీకరము వేదాంత గోచరము
ప్రబలకిహపర మహోబల నామపురము
ముని నికర భాసురము మోక్షలక్ష్మీకరము
ప్రణతార్తిహర మహోబలనామపురము'[35]

ఈ రచనలో ఓబయమంత్రి ప్రభావం స్పష్టంగానే గుర్తించవచ్చు. ఈ రచన తరువాత ద్విపదలో అహోబల పట్టణం విపులంగా వర్ణితమైంది. ఓబయ మంత్రి సుదీర్ఘమైన ద్విపద రచనలో కూడా పట్టణాన్ని విపులంగా వర్ణించడం, అలాగే వెంకటాద్రి వర్ణించడం చూస్తే, ఓబయమంత్రి ప్రభావానికి లోనయ్యాడని చెప్పక తప్పదు. చెంచు భామినులు తమ తమ నాథులను వెదుకుకొంటూ పాడిన యేలల్లో –

'రాతిరి పొద్దున మేము
రాణించు వెన్నెల బైట
గీతము పాడుచునుండగ – నోరి చెంచులవాబ
రాతిరి శివరాతిరాయెరా !'[36]

'రాత్రి శివరాత్రి కావడం' అన్నమయ రచనలోనూ, కందుకూరి రుద్రయ రచనలోనూ గమనించే ఉన్నాం కదా ! కందుకూరి రుద్రయ క్రీ. శ. 1568 ప్రాంతాలవాడన్న పరిశోధకుల అభిప్రాయాన్ని కూడా గమనించే ఉన్నాం. వెంకటాద్రి కృతిని ప్రారంభిస్తూ 'శ్రీ మించు కర్ణాట సింహాసనంబున బరఁగి యహోబల ప్రాంతముననను' అనడంవలన క్రీ. శ. 1568 విజయనగరం ధ్వంసమైనందున, ఈ రచన క్రీ. శ. 1568కి కొద్దిగా ముందుగా జరిగిందని భావించవచ్చు. అంటే రుద్రయకు దాదాపు సమకాలికుడన్నమాట క్రాంజ వేంకటాద్రి.

వెంకటాద్రి కూడా ప్రతిభా సంపన్నుడే. అందువల్ల ఎవరి ప్రభావమైనా అతనిమీద పైపైనే కనిపించగలదు. సూర్యాస్తమయాన్ని వర్ణించిన తీరు అద్భుతం –

'వరుణదిక్పతి కనకకలశము
శరధి రశ్మిని గట్టి చేదఁగ
బరువునను దెగిపడియె ననఁగాఁ
ధరణి గ్రుంకెన్'

'జరిగి చీకటి మరుగు చేరెడు
జారచోరులఁ బట్టి తెమ్మని
మరుఁడు పంపిన తలవ రన హిమ
కరుఁడు వొడమెన్'[37]

అయితే కథావిషయంలో చెప్పుకోదగిన విషయమేమీ 'వాసంతికా

పరిణయం'లో లేదు. సూటిగా చెప్పుకొని పోయాడు. కథ సాదాగా ఉంది!

మొత్తం మీద అన్నమయ రచనమైన గరుడాచల యక్షగానరూపకం కొంతలో కొంత తరువాతి యక్షగానరూపకాలపై ప్రభావం చూపిందని గుర్తించక తప్పదు. యాదవదాసు రచించిన 'గరుడాచల నాటకము' నేటికీ చాలా ప్రచారంలో ఉన్న యక్షగాన రూపకం. యాదవదాసు '19వ శతాబ్దపు ఉత్తరార్థమున నుండినట్లు నిశ్చయింపవచ్చును' అని ఆచార్య యస్వీ జోగారావు గారి నిర్ణయం.[38] అందులోని 'కీర్తన సంవాదము' ఇది –

చెంచెత : 'బాణమెయ్యగలవా ? మృగముల బట్టి ద్రుంచగలవా ?
నాణెముతోడుత జారెడు బండలమీది కెక్కగలవా ?

నరసింహుడు : మృగముల బట్టెదనే, నిక నగములు తిరిగెదనే
పగతులు వచ్చితె రణము జేసియు పడవేయగలనే

చెంచెత గట్లు యెక్కగలవా ? పెద్ద చెట్లు బ్రాకగలవా ?
చెట్లమీదనె జుంటితేనెలు తెచ్చి యివ్వగలవా ?'[39]

విశాఖజిల్లాలోని ఏజన్సీ ప్రాంతంలోని సుజనకోటలో ఈ రూపక ప్రదర్శనాన్ని ప్రకృత రచయిత చూడటం జరిగింది. ప్రదర్శనలో ఇదే సంవాద గీతం మరింత విపులంగా చక్కగా ఉన్నది. గుజిలీప్రతులలోని యక్షగాన రూపకాలు అచ్చుతప్పులతో పాదాలకు పాదాలే పోయిన 'కీర్తనల'తో కనిపిస్తున్నాయి. అసలు ప్రతి దుర్లభం కావడం వలన సక్రమమైన పరిశీలనకు అవకాశం లేకుండా పోయింది. ఉన్నంతలో పైగీతం అన్నమయ ప్రభావాన్ని పరోక్షంగా ప్రదర్శిస్తున్నదన్న సంగతి విదితమే. యక్షగానం ప్రదర్శనాత్మకమైనది కనుక, ఆప్రక్రియ, ఎప్పటికప్పుడు ప్రదర్శనలవల్ల ప్రభావితమౌతూ పరిణామం చెందుతూ వచ్చే ప్రక్రియ. అందువల్ల ఆ ప్రక్రియలో వచ్చిన ఒక రచనకూ, కొన్ని సంవత్సరాల తరువాత వచ్చే మరొక రచనకూ మధ్యగల సంబంధం ప్రత్యక్షంగా కనిపించదు. అదీగాక ఆశువుగా చెప్పవలసిన సంభాషణాదులను

కూడా తరువాత తరువాత రూపకర్తలే లిపిబద్ధం చెయ్యడానికి పూనుకొన్నారు. అయినా, ప్రాచీన రచనలలో మాదిరిగా ఆర్వాచీన రచనలలో రచయిత రాసింది ఇదీ అని ఖచ్చితంగా చెప్పలేము. ఇందుకు కారణం మనకు లభించిన ప్రతి ప్రదర్శనోద్దిష్టమైన రంగస్థల ప్రతి కావచ్చు. అంటే నటీనటులు తయారు చేసుకొన్న ప్రతి అన్నమాట ! అందువల్ల మూలప్రతి రూపురేఖలను గుర్తించే అవకాశం తక్కువ ఉంటుంది.

ఇంక సిద్ధేంద్రయోగి విరచితంగా వ్యవహృతమౌతున్న భామాకలాపాన్ని పరిశీలించాలి. నిజానికి సిద్ధేంద్రయోగి కృతిగా గుర్తించదగిన భామాకలాపం దేశంలో ఎక్కడా గ్రంథరూపాన కనిపించదు. గ్రంథస్థాధారాలు కాని శాసనా ధారాలు కాని లేకుండా ఏ విషయంలోనూ చివరిమాట చెప్పడం సాధ్యం కాదు. సిద్ధేంద్రయోగిని గురించి వినవచ్చేవి అన్నీ నిజానికి కట్టుకథలే. అదీ గాక స్త్రీవేషాలను పురుషులే ధరించాలని ఆయన ఆనాటి నటీనటుల పతనా వస్థను దృష్టిలో పెట్టుకుని నిర్ణయించాడని చెప్పే విషయం కూడా నిజానికి కట్టుకథే. నాట్యమేళ పద్ధతిని రూపొందించి ఉండవచ్చు. అంటే నటుల బృందాన్ని ఆయన ఏర్పాటు చేసి ఉండవచ్చునన్నమాట. ఈ బృందం సంచారం చేసి ప్రదర్శనలివ్వడానికని ఏర్పాటైనందువల్లా, ప్రకృతి సహజమైన ఇబ్బంది స్త్రీలకున్నందువల్ల సంచారం వారికి కుదరదని భావించి ఈ ఏర్పాటు చేసి ఉండాలి. ఏది ఏమయినా భామాకలాపానికి ఆయన కర్తగా సంప్రదాయం చెబుతున్నమాట వాస్తవం. ఆయన గోల్కొండ నవాబైన అబుల్‌హసన్ తానాషా వద్ద నుంచి కూచిపూడిని దానంగా గ్రహించినట్లున్న కథను[40] నమ్మితే ఆయన క్రీ. శ. 1650–1672 ప్రాంతాల జీవించి ఉండాలని భావించవలసి వస్తుంది. అంటే పదిహేడో శతాబ్ది ఉత్తరార్థాన ఉన్నవాడని భావించక తప్పదు.

గమనించవలసిన మరొక విషయం ఉంది. క్రీ. శ. 1787–1798 మధ్య తంజావూరిని పరిపాలించిన మహారాష్ట్ర ప్రభువు అమరసింహుడి కంకితంగా మాతృభూతకవి 'పారిజాతాపహరణం' అన్న పేరుతో 'ఐదంకముల

నాటకా'న్ని రచించాడు. సాధారణంగా కూచిపూడి భాగవతులు ప్రదర్శించే రూపక సంచయాన్ని కలిపి అతుకులబొంతగా ఈ నాటకాన్ని మాతృభూత కవి రాశాడు. ఈయన 18వ శతాబ్దపు చివరిభాగాన జీవించినట్లు స్పష్టమే. అప్పటికి కూచిపూడి వారి ప్రభావం తంజావూరి దాకా వ్యాపించిందన్నమాట. అంతకు ఒక శతాబ్దం ముందు సిద్ధేంద్రుడున్నాడని భావిస్తే మళ్లీ అబుల్ హసన్ తానాషాకాలానికే చేరుకుంటాం. ఇతరాధారాలు లభించినదాకా సిద్ధేంద్ర యోగి జీవితకాలం 17వ శతాబ్ది ఉత్తరార్ధమని భావించకతప్పదు.

సిద్ధేంద్రుడి రచనను మాతృభూతకవి అనుకరించి ఉండడం ఆశ్చర్య పడవలసిన విషయం కాదు గాని, ఈనాటి భామాకలాపంలో మాతృభూతకవి రచన కూడా కలగలసిపోవడం విచిత్రం. ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమీ కోసం శ్రీ మహాకాళి లక్ష్మీనరసింహంగారు పరిష్కరించగా కీర్తిశేషులు బందా కనకలింగేశ్వరరావు గారు ముద్రణ ప్రతిని తయారుచేయగా భామాకలాపం ప్రచురితమైంది. ఆ ముద్రణకు ఉపోద్ఘాతాన్ని రాస్తూ శ్రీ కనకలింగేశ్వరరావు గారు సుమారు నూరు ప్రతులను సంప్రదించి ఈ ప్రతిని తయారు చేసినట్లు చెప్పారు. అయితే అన్ని ప్రతులూ సిద్ధేంద్రయోగి రచనకు ప్రతి కృతులు కావని వారే చెప్పినమాట.[41] పరిష్కృత ప్రతిని తయారుచేయడంలో వారు శ్రమపడిన మాట నిజమేకాని అది శాస్త్రీయమైన పరిష్కరణ కాకపోవడం విచారకరం.

శ్రీ కనకలింగేశ్వరరావు గారే 'బందరు మరంగంటి శేషాచార్యుల వారి వద్ద మరియొక ప్రతి ఉన్నది. తరిగొండ వెంకమాంబ గారు ఇందు కొన్ని కీర్తనలు రచించారు. అందుకు నిదర్శనంగా వేంకటేశ్వర మకుటంతో కొన్ని దొరికాయి' అని కూడా తెలియజేశారు.[42] ముద్రిత ప్రతిలో అటువంటి కీర్తన లేవీ లేవు. వెంకమాంబ రచనలలో తరిగొండ నరహరి, శ్రీవేంకటేశ్వరులకు అభేదం పాటిస్తూ మకుట ముంచినమాట నిజమేకాని, కేవలం వేంకటేశ్వర నామాన్ని మకుటంలో వాడినట్లు ఆధారం లేదు. భామాకలాపంలో కలిసిన వేంకటేశ్వర మకుటంతో ఉన్న కీర్తనలు బహుశా అన్నమయ రచనలేమోనన్న

అనుమానం కలగవచ్చును గాని వివరాలు తెలియనందువల్ల ఏ తీర్మానానికీ రాలేము.

ముద్రిత భామాకలాపంలో 'చెఱకువిల్తుడు వెడలెనే యీవేళ నాపై'[43] అన్న దరువు స్వల్పమైన మార్పులతో మాతృభూతకవి రచనలో[44] కూడా ఉంది. అయితే మకుటాన్ని బట్టి అది మాతృభూతకవి రచనమే నని నిష్కర్షగా చెప్పాలి. ఈ ఇబ్బందులన్నింటివల్లా భామాకలాపంలో ఎవరి రచనలు ఏ రూపాన్ని ధరించి కలగలిసిపోయినయ్యో చెప్పడం కష్టం. ఉన్నంతలో అన్నమయ పదవడిని గుర్తించడం మాత్రమే చెయ్యగలం. ముందుగా అన్నమయ రచనను చూద్దాం –

'మందనున్న పసులాల, మంచి గోపబాలులాల ।
కందర్పగురుఁడు వచ్చెఁ గంటిరా మీరు
కెందమ్మి వనములాల, కృష్ణుఁడు యమునలోన
చిందుల నీఁదాడునట, చెప్పరో సుద్దులు ।

ఆడేనంటా వచ్చె నారగించలేదింకా
వాడవార । చేడెలాల । వనజాక్షుఁజూపరో ।

గొల్లవారి ఇండ్లాల । గొందిపాలు వెన్నలాల ।
కొల్లలాడే హరి వచ్చెఁ గొండించరో ।
చల్లలమ్మే సతులాల । సరసపు రచ్చలాల ।
ఇల్లీడ నేడనున్నాఁడో యెటిఁగించరో

ఆడేనంటా వచ్చె నారగించలేదింకా
వాడవార । చేడెలాల । వనజాక్షుఁజూపరో ।

గోవర్ధనము దండ గుంపులపూఁబొదలాల ।
కోవిదుఁడేమి సేసీ గుట్టుచూపరో
శ్రీవేంకటాద్రిమీఁదఁజేరి కంటి మింతలోనె ।
పూవువలె నెత్తుకొంటి । భోగించీ నికను ।

ఆడేనంటా వచ్చె నారగించలేదింకా
వాడవార ! చేడెలాల ! వనజాక్షుఁజూపరో ![45]

భామాకలాపంలో వనవిహార ఘట్టంలో -

'చూడరే సఖులార శోభనాకారుడీ
పొదలలోన నేమైన నొదిగినాడా
అడుగరే చెలులార అంబుజాక్షుని రాక
తరుచైన వృక్షజాతములనెల్ల ...

అల్లిన తీగెలార చెలువంద ఫలించిన నిమ్మలార శో
భిల్లెడు జాజులార వెస బేర్మిలి బూచిన మొల్లలార ...'[46]

ఇత్యాదిగా ఉన్న పద్యాలలో అన్నమయ రచన జ్ఞాపకం రాకతప్పదు. అయితే బమ్మెరపోతనామాత్యుడి పద్యాలు -

'నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు కృపారసంబు పైఁ
జల్లెడువాఁడు మౌళి పరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రా
జిల్లెడు మోమువాఁ డొకఁడు చెల్వల మానధనంబు దెచ్చెనో
మల్లియలార ! మీ పొదలమాటున లేఁడుగదమ్మ ! చెప్పరే

మాననీమన్మథు మాధవు గానరే
సలలితోదార వత్సకములార !
సలలితోదార వత్సకవైరిఁగానరే
సుందరోన్నత లతార్జునములార !
సుందరోన్నత లతార్జున భంజుఁగానరే
ఘనతర లసదశోకంబులార !
ఘనతర లసదశోకస్ఫూర్తిఁగానరే
నవ్య రుచిర కాంచనంబులార !
... ...'

మొదలైన వాటిని చూపి భామాకలాప కర్త ఆ పద్యాలను అనుసరించి ఉండవచ్చు గదా అని ప్రశ్నించవచ్చు. ఈ సందర్భంలో కీర్తిశేషులు శ్రీ చాగంటి శేషయ్యగారు పోతన కాలనిర్ణయం గురించి విపులంగా చర్చించి –

> 'ఎంత వెనుకకు నెట్టవలెనని చూచినను నాతని జనన కాలము 1450 సంవత్సరమునకు వెనుకకుఁ బోవదు. భాగవత రచనా కాలము నాటి కాతని వయసు 40 సంవత్సరములుండునని యనుకొనినచో క్రీ. శ. 1490 ప్రాంతమున భాగవతము పుట్టి యుండునని నిశ్చయింపవచ్చును. ఎవరెంత ప్రయత్నించినను బోతన జననము 1450కి వెనుకకు గెంటలేరని ఘంటా పథముగాఁ జెప్పవచ్చును'[47]

అని అన్నారు. కాని శ్రీ చాగంటి వారి నిర్ణయాన్ని అంగీకరించక ఆచార్య శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తిగారు '1450 వ సంవత్సరము నాటికి పోతన యువకుడు' అని ఉపపత్తులతో బలపరుస్తూ –

> '... పోతన కనీసము భాగవత రచనకు ఉపక్రమించిన కాలము ... 1476వ సంవత్సరము కంటె పూర్వము కాఁజాలదు. 1476 సంవత్సరము కావచ్చును. పూర్తి చేసిన కాలము 1480వ సంవత్సరము కావచ్చును. 1450 వ సంవత్సరము నాటికి యువకుడైన పోతన 1476 వ సంవత్సరము నాటికి ప్రౌఢ వయస్కుడు అగును. అది భాగవత రచనకు అనుకూలమైన వయస్సు. కనుక భాగవత రచనకు ఉపక్రమించిన కాలము స్థూలముగా 1476వ సంవత్సరము'[48]

అని తీర్మానించారు. అంటే 1476 నాటికి అన్నమయ వయసు 52 సంవత్సరాలు. 1480 నాటికి 56 సంవత్సరాలన్నమాట. అంటే భాగవత రచన పూర్తి అయినకాలానికి, 1480 నాటికి అన్నమయ మధ్య వయస్సును దాటి

ఉన్నాడు. నాటికి జీవితంలో చాలా ఉన్నత స్థితిలో ఉన్నాడు. 1503లో 70వ ఏట అన్నమయ భౌతికజీవనం చాలించేనాటికి భాగవత రచన పూర్తి అయి కేవలం 13 సంవత్సరాలైందన్నమాట. ఇదంతా ఉజ్జాయింపు లెక్క కావచ్చు గాని సత్యానికి మరీ దూరమైన విషయం కాబోదు. ఇందువల్ల తేలిన విషయం అన్నమయ యక్షగాన రచనాకాలం నాటికి పోతనామాత్యుడి ఆంధ్రమహా భాగవతం అవతరించలేదన్నమాట.

అందువల్ల అన్నమయ పోతనను అనుకరించి ఉండటానికి అవకాశం లేదు. యక్షగాన ప్రక్రియకు లక్షణం నిర్వచనం చేసి యక్షగాన రూపకాలను రచించిన ఆద్యుడు అన్నమయ కనుక అన్నమయ వరవడినే యక్షగాన కర్తలు అనుసరించారని చెప్పక తప్పదు. అయితే అన్నమయ సంస్కృత భాగవతం నుంచి భావాలను స్వీకరించి ఉండవచ్చు గదా అంటే సంస్కృత భాగవత వియద్గంగను తెలుగు భూమికి తెచ్చిన తొలి భగీరథుడిగా అన్నమయను సంభావించి నమస్కరించక తప్పదు. అందువల్ల భామాకలాప కర్త సిద్ధేంద్రుడికి వరవడి అన్నమయ చూపినదే అయి ఉండాలి. అదీకాక కేవలం భాగవతంతో పోలిన ఒకటి రెండు గీతాలను బట్టి కాక, అన్నమయ స్వకపోల కల్పనలైన రచనల ప్రభావాన్ని కూడా గమనిస్తే ఈ విషయం మరింత విశదమౌతుంది.

భామాకలాపంలోని ఒక దరువును పరిశీలించవలసి ఉంది. ప్రయోగం లో దీని రూపం మారుతుంది. కాని ప్రస్తుతానికి ముద్రిత ప్రతి పాఠాన్నుంచే ఉదాహరణను స్వీకరించి పరిశీలించవచ్చు.

'మదనమోహనాకారుడే ఓ అమ్మలారా
మదనా ! మదనా ! మదనా ! యనుచును
వదలలేక వాని వలలో జిక్కితి
నే తాళలేనే ఓ యమ్మలారా !
... ...'[49]

ఈ పదంలో 'నేతాళలేనే ఓ యమ్మలారా !' అన్న పాదం పదేపదే పునరావృతమై అదే అసలు పల్లవిలాగా వినిపించడం ప్రయోగంలో కలిగే అనుభవం. అసలు నాట్యానికై రచించిన ఏ పదంలోనైనా ప్రయోగ సమయంలో పల్లవులను వినికిడిమీద గుర్తించలేము. అందువల్ల అభినయంలో 'నే తాళలేనే ఓ యమ్మలారా ! ... నే తాళలేనే నేతాళలేనే' అన్న చరణంలోని వివిధ భావ చ్ఛాయలను పలువిధాలుగా ప్రదర్శించడం జరుగుతుంది. అన్నమయ రచనకు భామాకలాపంలోని కీర్తన ప్రతిబింబం కాదు గాని, భావప్రేరణ పొందిన రచనగా గుర్తించాలి. అన్నమయ రచన –

'కొమ్మలాల మరుకోట కొమ్మలాల వో –
యమ్మలాల తొలరె నా యక్కలాల
తమ్మిరేకుఁ గన్నుల యాతనిఁ బాసి నే –
నుమ్మల సొమ్మలచేత నుండలే నికను

తమ్ములాల అన్నలాల తల్లులాల నే
నెమ్మనపు హరిఁ బాసి నిలువ నేనిఁకను !

చెలులాల కలికి తొయ్యలులాల వో –
యెలజవ్వనముల మోహినులాల
చెలువంపు హరిఁ దలఁచిన నాకు నే
నులుకుఁ గన్నీరాఁపకుండలేనిఁకను

తమ్ములాల అన్నలాల తల్లులాల నే
నెమ్మనపు హరిఁ బాసి నిలువ నేనిఁకను !

బోఁటులాల జవ్వనపు మేఁటులాల వో
గాఁటపుఁ దురుముల చీఁకటులాల
వాఁటమైన వేకంటేశ్వరుఁబాసి నే
నాఁటదాననై జన్మమంద లేనిఁకను

తమ్ములాల అన్నలాల తల్లులాల నే
నెమ్మనపు హరిఁ బాసి నిలువ నేనిఁకను ।'[50]

పైన పేర్కొన్న భామాకలాపపు కీర్తనలో మదనమోహనకారుడన్న భావానికి 'తమ్మిరేకుఁగన్నుల యతడు' 'చెలువంపు హరి' మొదలైనవి సమానమైన వివరాలే. ఇంక 'ఆడదాననై జన్మమందలేనికను' అన్న చరణానికి వ్యాఖ్యానంగా భామాకలాపంలో –

'ఆడపుట్టుకవంటి యధమపు పుట్టుక
ఏడేడు జన్మముల కిది వలదె చెలియ ...'[51]

యిత్యాదిగా ఉన్న కీర్తన రచితమైంది. ఆ పోలిక లటుండగా పైన ఉదాహరించిన అన్నమయ పాట అభినయానుకూలం కలిగిన చక్కని కలాపరచనలోని కీర్తనగా దర్శనమిస్తున్నది. మరొక అన్నమయ రచనను ఈ సందర్భంగా చూడాలి –

'తూరుపునఁ బొడిచెఁ జందురుఁడు మిన్నుల మోవ
పారుతెంచె విరహుల బందికాఁడు
గోరపు వెన్నెల వెల్లిగొని మీఁదమీఁద నిప్పు
లేర్లై పారఁగఁజొచ్చె నెందు జొత్తమే

వలపుల దాడివచ్చె వనితలారా । మరు
డెలగోలెయఁగఁజొచ్చె నేలాగే ।

చందనంపుఁ గొండ వంక చల్లగాలి తుదముట్టి
ముందు ముందె కదిసె దుమ్ములు లేవఁగా
మందమై పన్నీటిసోన మందుచల్లె నమ్ములై
యెందు చూచినఁ దానే యేమి సేతమే

వలపు దాడివచ్చె వనితలారా । మరు
డెలగోలెయఁగఁజొచ్చె నేలాగే ।

క్రొచ్చిపారె గుబ్బచన్నుగొండల చెమ్మటనీరు
రొచ్చుగఁ గస్తూరి దరులు జారఁగా
పచ్చిగా వెంకటపతిగిరి యింతి గూడఁగాను
ఇచ్చకాలే గనమాయ నింకనేఁటిదే

వలపుల దాడివచ్చె వనితలారా ! మరు
డెలగోలెయఁగఁజొచ్చె నేలాగే ![52]

ఇంక భామాకలాపంలోని రచన –

'వచ్చెనదిగో మరుడు – వచ్చె నదిగో అమ్మలారా !
వచ్చెనదిగో చెచ్చెరంబున – పచ్చవిల్తుడు మచ్చరంబున
విచ్చుకత్తి తళుక్కుమనగా – నిచ్చటికి వేవేగ నిప్పుడు

వచ్చెనదిగో మరుడు – వచ్చెనదిగో అమ్మలారా !

బారు కోవెల మూక కూయగ, దాపల మం –
దారు చల్లగాలి వీవగా, వెలపల జామా –
దారుడు చంద్రుండు చల్లగా ముంగల సుబే
దారుడు వసంతుడు హెచ్చుగా

వచ్చెనదిగో మరుడు – వచ్చెనదిగో అమ్మలారా !

... ...

శారికలు కవాతు చెప్పగ అమ్మలారా
గండు తుమ్మెదలు చేరి సంగీతములు పాడగా
కేకినీచయములు చేర యాకీచులు కుయ్యగా
కొదమతేటులు సరదారులై యటునిటు నడువగా ...

వచ్చెనదిగో మరుడు – వచ్చెనదిగో అమ్మలారా !

వివరాలలో చాలా కొద్ది తేడాలున్నా, రెండిటా వలపుల దాడి – కాదా

మరుని దండయాత్ర – వర్ణితమైంది. వరవడి అన్నమయ పెట్టినదని తెలుస్తూనే ఉన్నది. అన్నమయ ఈ పద్ధతిలో రాసిన గీతాలు చాలానే ఉన్నాయి. ఉదాహరణకు అదే వలపుల దాడిని వర్ణించే మరో గీతంలోని కొన్ని చరణాలు–

'చిలుక పావురము చెరకు శింగిణి విల్లు
వలరాజా దాడి ముట్టె వసంతవేళ
బలిమిఁ గోవిలకూఁత పరివారముల మోఁత
యెలమి నదివో లోన నేమిసేసేవే ।

పాడవుమీను టెక్కెము పూవుల యమ్ములపాది
వెడలె మరుఁడు దండు విరహులపై
యెడయని వెన్నలలు యెగయుఁ బౌఁజాల ధూళి
యిడుమఁ జింతతో లోన నేమి సేసేవే ।'[54]

అందువల్ల అసలు వరవడి అన్నమయ పెట్టినదని గుర్తించక తప్పదు. అనియతంగా ఉన్న జానపదగేయాల నుంచి స్ఫూర్తిని పొంది అన్నమయ సలక్షణమైన గేయరూపాన్ని నిర్మించి వివిధ భావాలను ప్రకటించగల ప్రక్రియగా రూపొందించడం యక్షగాన రూపకాలభివృద్ధికి దోహదం చేసింది.

విష్ణుమాయావిలాస మన్న యక్షగానాన్ని రచించిన కంకంటి పాపరాజు 'క్రీ. శ. 16వ శతాబ్దపు టుత్తరార్థమున' జీవించి ఉన్నట్లు కీ. శే. నేలటూరి వేంకటరమణయ్య గారి అభిప్రాయం.[55] అందువల్ల మనకు అభించినంతలో ప్రాచీనమైన యక్షగానాలలో ఒకటి అని భావించవచ్చు. రచనాశైలి కూడా ఇందుకు బలమైన ఆధారంగా కనిపిస్తోంది. విష్ణుమాయావిలాసంలో రూపక సంవిధానం మీద మాత్రమే అన్నమయ ప్రభావం కనిపిస్తున్నది. కంకంటి పాపరాజు రచన ప్రౌఢంగానే ఉన్నా కవితా విషయంలో సుగ్రీవ విజయానికి, వాసంతికా పరిణయానికీ సాటిరాదగినదిగా మాత్రం లేదు. వర్ణనలు కూడా చాలావరకు పడికట్టు పద్ధతిలోనే సాగడం గమనించవచ్చు.

అన్నమయ అహోబలాన్ని 'హరినివాసమీ యౌభళము అరిది పరమ పద మౌభళము' అని వర్ణించినట్లుగా, ఓబయమంత్రి 'రథగజాశ్వపదాతి రమణీయ సంకులము, పృథుల పుణ్యస్థలము పెద యహోబలము' అనీ, క్రాంజ వేంకటాద్రి 'సిరులకును గాపురము జిత సదలకాపురము పరమాత్ము పుర మహోబల నామపురము' అనీ అనుకరించగా, కంకంటి పాపరాజా కైలాస నగాన్ని ఆ పద్ధతిలో, పురవర్ణననకు బదులు గిరివర్ణనలో అనుకరించినట్లు కనబడుతుంది –

'విలసితోద్యానగము వినుత జనసురనగము
కలిపవన పన్నగము కైలాస నగము
తటచారి సింధురము ధవళరుచిబంధురము
కటకజిత మందరము కైలాసధరము
అలకాపురాన్వితము హరభక్తసేవితము
లలితయౌవతము కైలాసపర్వతము'[56]

అన్నమయ రచనలో 'మందనున్న పసులాల, మంచి గోపబాలులాల! కందర్పగురుఁడు వచ్చెఁ గంటిరామీరు ?' అని గోపికలు అడిగినట్లుగానే పాపరాజ కృతిలో 'మోహినీవిలాస తత్పరుండై శంభుండు చరాచరంబులఁ జూచి' –

'కలికిఁగానరె మరువంపు మొలకలార యీడఁ
జిలుకలకొలికిఁ జూడరా చిలుకలార !
కులుకులాడి యెందుఁబోయెఁ గొలఁకులార ముద్దు
చిలుక యేదె జాజిపూవు ములుకులార !
ఎమ్మెలాడిఁ జూపరె కెందమ్ములార పసిఁడి
బొమ్మ యిందు రాదుగా కుందమ్ములార !
కొమ్మ మీరు గనరె పూవుఁ గొమ్మలార !
కలువ కంటిఁ గంటిరె చెంగలువలార ! అల్ల

చెలువఁజూపరె రాయంచ చెలువలార ।
వగలాఁడి గానరె కేళి నగములార । మీలో
మృగవిలోచనఁజూపరె మృగములార ।'[57]

అని బతిమాలుకోవడం చూడవచ్చు. వరవడి అన్నమయదిగా గుర్తించ వచ్చు. పోతనామాత్యుడి రచనలో గోపికలు శ్రీకృష్ణుని వెదుకుతూ వృక్షజాతుల సహాయాన్నే అర్థిస్తారు గాని అన్నమయ నాయిక 'మందనున్న పసుల' నుంచీ 'పాలు వెన్నల' దాకా అందర్నీ అడగడాన్ని గమనిస్తే, పాపరాజు రచనలోని శంభుడు మరువంపు మొలకలనుంచీ మృగాలదాకా అందర్నీ భువనమోహిని జాడ లడగడం చూస్తే అన్నమయ ప్రభావం ఎంతమేరకుందో గమనించడం సులభం. విష్ణుమాయావిలస రూపకాన్ని –

'అని దయాధిక గుణోదారునిపేర
దనుజేంద్ర సేనావిదారునిపేర
అతుల కౌస్తుభరత్నహారునిపేర
యతి మనః కమలవిహారునిపేర
... ...'[58]

అంటూ ముగించడం అన్నమయ శృంగారమంజరి ముగింపును గుర్తుకు తెస్తుంది.

తెలుగు యక్షగాన రచనకు స్వర్ణయుగం అన్నది నిజానికి దక్షిణాంధ్ర యుగంలో తంజావూరి పాలకుల కాలం. తంజావూరి పాలకుల వంశాలు రెండున్నాయి. ఒకటి నాయకరాజవంశం, రెండోది మహారాష్ట్రనాయక రాజుల వంశం. అన్నమయ ప్రభావాన్ని గురించి చెప్పుకొనేముందు తంజావూరి రాజుల గురించి కొంత ప్రస్తావించుకోవలసిన అవసరం ఉన్నది.

విజయనగర సామ్రాజ్యపు అవసానకాలంలో తంజావూరు రాజ్యం రూపు దిద్దుకొన్నది. సంగీత సాహిత్య విషయాలలో విజయనగర సంప్రదాయాన్నే

పుణికి పుచ్చుకొన్నది. శిల్పంలో కూడా విజయనగర శిల్పమే వరవడి. ఆంధ్ర నాయకరాజుల కాలానికి శ్రీ తిరుపతి వేంకటేశ్వరాలయం కూడా బాగా ప్రసిద్ధి లోకి వచ్చి ఉంది. తాళ్లపాక వారి పదకవిత్వంతో ప్రభావితులైన మధురకవులు తమ రచనలకు కొత్త సొగసులు సంతరిస్తున్న కాలమది. అయినా ఆంధ్ర నాయక రాజులకాలంలోని యక్షగాన కవుల మీద అన్నమయ ప్రభావం స్పష్టంగా కనిపించకపోవడం విచిత్రం. కారణాలు అనూహ్యాలు. పదకవిత్వం ధరించిన కొత్త ముస్తాబు అన్నమయ కృషివల్లనే సాధ్యమైందని చెప్పడానికి సందేహం ఉండదు గాని, అసలు తాళ్లపాక వారి రచనలనే ఆంధ్ర నాయకరాజులు గాని, వారి ఆస్థానకవులు గాని అధ్యయనం చేసినట్టు భావించడానికి దాఖలాలేమీ లేవు. ఆంధ్రనాయకరాజుల అనంతరం తంజావూరి సింహాసనమెక్కిన మహారాష్ట్ర నాయకరాజుల కాలంలో యక్షగాన రచనల మీద అన్నమయ ప్రభావం ప్రత్యక్షంగా కనబడుతున్నది. అయితే నాటికి యక్షగానప్రక్రియలో వచ్చిన మార్పుల వల్లా, ఆయా రచయితల అభిరుచుల కనుగుణంగా సాగిన రచనలలో అన్నమయ ప్రభావం గాఢంగానే అయినప్పటికీ అక్కడక్కడ కనబడుతున్నది. మహారాష్ట్ర నాయకరాజులలో సంగీతసాహిత్య పోషణలో అగ్రగణ్యుడుగా నిలిచిన శాహజీ రచనలను ముందుగా పరిశీలించడం సమంజసమౌతుంది. నిజానికి శాహజీ రచనలలోనే మనకు ఎక్కువగా అన్నమయ ప్రభావం కనబడుతుంది. ఆయన ఆస్థానకవులు రాజాగారి రచనలనే మేలుబంతిగా తీసుకొన్నట్లు కనిపిస్తున్నది.

అన్నమయ రచనలలో నేటికీ ప్రచారంలో ఉన్న సంకీర్తన మొకటి పరిశీలించవలసినది ఉంది.

> 'శరణు శరణు సురేంద్రసన్నుత – శరణు శ్రీసతివల్లభా
> శరణు రాక్షసగర్వసంహర – శరణు వేంకటనాయకా'[59]

ఈ సంకీర్తనను కన్నడ వాగ్గేయకారుడు శ్రీ పురందరదాసు అనుకరించి విఘ్నేశ్వరుడి మీద రచించిన సంకీర్తన మొకటి లభిస్తోంది.

'శరణు శరణు సురేంద్రవందిత – శరణు శ్రీపతి సేవిత
శరణు పార్వతి తనయ మారుతి – శరణు సిద్ధివినాయక'[60]

ఈ అనుకరణను తొలిసారిగా గుర్తించిన కీ. శే. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు 'అన్నమాచార్య చరిత్ర' పీఠికలో 'పురందరదాసులవారన్నమాచార్యుల సంకీర్తనముల ననుసరించి సంకీర్తనములు రచించిరి'[61] అని పేర్కొన్నారు.

అన్నమయ రచనమైన పై సంకీర్తన పురందర దాసులనే కాక శాహాజీని ఆయన ఆస్థానకవులనూ కూడా బాగా ప్రభావితం చేసింది. శాహాజీ ఈ సంకీర్తనను అనేక విధాల అనుకరించాడు. ఆయా రచనల పల్లవులను పరిశీలించే ముందు ఒక విషయాన్ని గుర్తించవలసి ఉంది. శాహాజీ అతని ఆస్థానకవులూ ఆనాటికి ఏర్పడి ఉన్న 'పాటమట్టులను' యథాతథంగా వాడు కొన్నారనడానికి ఆధారాలున్నాయి. యక్షగానాలలో శాహజీ తాను అనుసరించిన పాటను 'మాత్రుక'గా పేర్కొన్నాడు. అంటే అదేరాగతాళాలలో పాడాలని నిర్దేశించాడన్నమాట. ఉదాహరణకు 'విఘ్నేశ్వరకల్యాణం'లో –

'డంబుగ మీఱి గౌరిని వెంబడినివచ్చు నన్ను
లంబోదరుఁడు నిలిపె నమ్మ యోముద్దుగుమ్మ –
లంబోదరుఁడు నిలిపెనమ్మ'[62]

అన్నదరువుకు ముందుగా –

''ఆదితాళం : మాతృక : తియ్యమామిడిచెట్టుక్రింద'' అని కనిపిస్తున్నది. ఇలాగే మరికొన్ని గేయరచనలకు 'మాతృక: అయ్యసామి నీవాడ', 'మాతృక: ఇప్పటి యానాల్ సెంగై', 'మాతృక: సమర్తపెండ్లి కూతురను', 'మాతృక: కన్నెలు వెడలిరి కన్నెలు' అంటూ తెలుగు, తమిళ గీతాలను మాతృకలుగా పేర్కొన్నాడు.[63] అదేవిధంగా తన 'విఘ్నేశ్వరకల్యాణం' లోనే మాతృకగా 'శరణు శరణు సురేంద్రసన్నుత' అని పేర్కొని తన గేయాన్ని

రచించాడు –

'శరణు శ్రీ వసుదేవనందన – శరణు జగదానందనా
శరణు చరణానతసనందన – శరణు సురకృతవందనా'[64]

ఇదే గేయాన్ని మళ్లీ మళ్లీ 'ద్రౌపదీకల్యాణం'లోనూ 'రతీకల్యాణం' లోనూ 'శచీపురందరము'లోనూ, 'వల్లీకల్యాణం' లోనూ, 'సీతా కల్యాణం' లోనూ, 'శాంతా కల్యాణం'లోనూ, 'జలక్రీడలు' లోనూ యథాతథంగా వినియోగించాడు. కాకపోతే 'విఘ్నేశ్వర కల్యాణం'లో కేవలం ఆదితాళం అని పేర్కొనగా, 'శచీపురందరం'లో మాత్రం కేదారగౌళరాగాన్నీ త్రిపుట తాళాన్నీ పేర్కొనడం జరిగింది. దీనికి మాతృక అయిన అన్నమయ రచన మాళవి రాగంలో ఉంది. అయితే శాహజీ ఎనిమిది యక్షగానాలలో ఒకే గేయాన్ని వినియోగించినా, ఇదే మట్టుతో మరికొన్ని గేయాలను కూడా రచించాడు. వాటిని కూడా పరిశీలిస్తే అన్నమయ కృతి శాహజీని ఎంత సమ్మోహపరిచిందీ విదితమౌతుంది. ఈ వరుసలో నడిచిన రచనలు – 'సతీపతిదాన విలాసము', 'రామపట్టాభిషేకము' యక్షగానాల నుంచి –

'శరణు శరణు జగద్విధాయక – శరణు శ్రీహరిసాయకా
శరణు శరణు శుభప్రదాయక – శరణు గిరిజానాయకా'[65]

ఇంక 'గంగాపార్వతీ సంవాదము', 'పంచరత్న ప్రబంధము' 'భక్తవత్సల విలాసము' యక్షగానాలలో నుంచి –

'శరణు శరణు శుభప్రదాయక – శరణు శ్రీపతి నాయకా
శరణు శరణు శుభప్రదాయక – శరణు శహవరదాయకా'[66]

అన్న రచనలను చూడవచ్చు. అయితే ఈ పద్ధతి రచనలను నాటక ప్రారంభ ప్రార్థనాగేయాలుగానే కాక 'భక్తవత్సలవిలాస నాటకము'లో దరువుగా కూడా వాడుకొన్నాడు శాహజీ –

'శరణు శరణు త్యాగనాయక – శరణయ్య కేశవసాయకా
శరణు శరణు యెడబాయక – శరణయ్య నాప్రాణనాయకా'[67]

ఈ రచనలో నామసంకీర్తనంగా కాక తెలుగు గేయంగా ప్రత్యక్ష మౌతున్నది. 'విష్ణుపల్లకిసేవా ప్రబంధము'లో కూడా దేవతాస్తుతిలో –

'శరణు శరణు జయప్రదాయక – శరణు శ్రీసతినాయకా
శరణు సకల శుభప్రదాయక – శరణు శహవరదాయకా'[68]

అని అన్నమయ్య మట్టునే అనుకరించాడు శాహజీ. అతని ఆస్థాన కవులలో ఒక్క వాసుదేవకవి మాత్రమే తన 'పార్వతీపరిణయము'[69] లో వినియోగించినట్లు కనబడుతున్నది గాని కొన్ని అధికపాదాలతో శాహజీ విరచిత 'విఘ్నేశ్వర కల్యాణం'లోని గేయమే యథాతథంగా ఉన్నది. బహుశా శాహజీ రచననే వాసుదేవకవి వాడుకొని ఉండవచ్చు. ఇతరాస్థానకవులు శాహజీ రచనలనే యథాతథంగా వాడుకొన్నారు.

కేవలం ప్రార్థనారూపంలో ఉన్న ఈ గేయాలను అలా ఉంచితే అన్నమయ వరవడి శాహజీ యక్షగానగేయ రచనలలో మరికొన్నిటిని కూడా గుర్తించవచ్చు. దేవాలయాలలో ఆగమశాస్త్రానుసారం జరిగే అంగరంగభోగాలను ఒక విధమైన యక్షగానరూపకాలుగా సంతరించడం నాయకరాజుల కాలంలో ప్రారంభమైంది. అన్నమయ కూడా ఇటువంటి రచనను చేసి ఉండవచ్చునని భావించడానికి ఆధారంగా కొన్ని సంకీర్తనలు కనిపిస్తున్నాయి. ఈ అంగరంగ భోగాలను ఇతివృత్తంగా స్వీకరించిన శాహజీ రూపకాలలో 'శంకరపల్లకి సేవా ప్రబంధము' నుంచి ఒక ఉదాహరణ –

'కదలించక రోయి పల్లకి – కదలనీయకరోయి చాల
మృదువైన మా జంగమయ్య – మేను నొచ్చీని హాహా
హరువుగ మెల్లమెల్లనె – యడుగు లిడరోయి – మా
పురవైరికి బడలిక – పుట్టఁబోయీని హాహా'[70]

ఈ రచనకు మాతృక నిస్సందేహంగా అన్నమయ్య రచనమే –

'కులుకక నడవరో – కొమ్మలాలా
జలజలరాలీని – జాజులు మాయమ్మకు

ఒయ్యనె మేను గదలీ – నొప్పుగా నడవరో
గయ్యాళి శ్రీపాదతాఁకు – కాంతలాలా
పయ్యెద చెఱఁగుజారీ – భారపు గుబ్బలమీఁద
అయ్యో చెమరించె మా – యమ్మకు నెన్నుదురు'[71]

ఈ రెండింటిలోని పోలికలూ స్వయంవ్యక్తమే ! అదీగాక అన్నమయ్య రచించిన ఒక ఉగ్గుపాటలోని భావం కూడా శాహజీని ఆకట్టుకొన్నందువల్ల కాబోలు తన రచనలో ఆ భావాన్ని వాడుకొన్నట్టు కనిపిస్తుంది. అన్నమయ ఉగ్గుపాటలో –

'కడుపులోని లోకమ్ములు కదలీ
నొడలూచకురే వోయమ్మా
తొడికెడి సరుగున దొలఁగదియ్యరే
వుడికెటి పాలివి వోయమ్మా'[72]

అని అంటే శాహజీ తన పల్లకి పాటలో –

'తిన్నగ నడవనీయరోయి – తీవ్రమేలనోయి
కుక్షినున్న బ్రహ్మాండములెల్ల – నూగఁబోయీని హోహో'[73]

అని అంటాడు. శివుడి కుక్షిలో బ్రహ్మాండాలుండడం అపురూపమైన భావనే !

ఇంక నైవేద్య నివేదనం గురించి చూడవలసి ఉంది. శాహజీ 'పరమేశ్వరు ని యారగింపు చేసే వగచూడరె' అని చెప్పి ఈ దరువు రచించాడు –

'ఆకొంటావేటి జంగమయ్య
తిరువిసములు పొంగళ్లు తిమ్మనములు

గురుగులు నేతిబూరెలు
మెఱుఁగు దోసె నిడ్డెనలు
కల వంటకము పాయసము
కలమాన్నములు ఆనఁబాలు
పంచదారలు తేనెలు

ఊరగాయలు కూరలు
ఉలుకు పప్పులు
సారెఫలములు ఖండచక్కెరలు
నుక్కరలు
పాలుపైన దధ్యోదనము
పులియోగిర
మెలుకువ మీగడపెరుగు
మేలైన సొంఠిమజ్జిగ
కమనీయమైన పరిమళ
గంగజలములు
గమగమ యని వాసించు
కర్పూరంపు విడెములు'[74]

అంటూ తినుబండారాల పెద్ద పట్టికనే ఇచ్చాడు. శివాలయాలలో ఈ రకమైన నైవేద్యం సమర్పించారంటే శైవం మీద వైష్ణవ ప్రభావముందేమోనని అనుమానించవలసి వస్తూంది. నిజానికి దధ్యోదనమూ, పులియోగిరమూ వైష్ణవులకు అత్యంత ప్రియమైన నైవేద్యాలు. ఇంక అన్నమయ స్వామి ఆరగింపును వివరంగా వర్ణించాడు. చూడండి –

'పంకజాక్షులు సొలసి పలికి నగఁగా
నింకానారగించు మిట్లనే అయ్యా !

కలవంటకములు పులుగములు దుగ్ధాన్నములు
పలుదెఱఁగులైన అప్పము లగములు
నెలకొన్న నేతులు నిరంతపు చక్కెరలు
గిలుకొట్టుచును నారగించవయ్యా !'[75]

నైవేద్యం గురించి మరొక సంకీర్తనం –

'ఏపొద్దు చూచిన దేవు డిట్లానె యారగించు
రూపులతోఁ బదివేలు రుచులైనట్లుండెను

మేరు మందారాల వలె మెఱయు నిడ్డెనలు
సూరియ చంద్రుల వంటి చుట్టుఁ బళ్లేలు
ఆరని రాజాన్నాలు అందుపై వడ్డించఁగాను
బోరన చుక్కలు రాసివోసినట్లుండెను

పలు జలధుల వంటి పైఁడి వెండిగిన్నెలు
వెలిఁగొండలంతలేసి వెన్నముద్దలు
బలసిన చిలుపాలు పంచదార గుప్పఁగాను
అలరు వెన్నెల రస మందిచ్చినట్లుండెను

పండిన పంటలవంటి పచ్చళ్లుఁ గూరలును
వండి యలమేలు మంగ వడ్డించఁగా
అండనె శ్రీవేంకటేశుఁ డారగించి మిగులఁగ
దండిగా దాసులకెల్ల దాఁచినట్లుండెను'[76]

శాహజీ అన్నమయ్య రచనల వల్ల ప్రభావితుడైనా, అన్నమయ రచనల లోని కవిత్వ లక్షణాన్ని మాత్రం అందుకోలేకపోయాడు. ఉపమానాలు అవీ అలా ఉండగా, అన్నమయ రచనలలో కనిపించే చక్కని పలుకుబడులను, 'గిలకొట్టుచును నారగించవయ్యా' వంటి వాటిని అనుకరించలేకపోయాడు. ఇందుకు కారణం ఆయన మాతృభాష తెలుగు కాకపోవడమూ, పరిపాలించి

నదీ, జీవించినదీ ఆంధ్రేతరప్రాంతం కావడమూ.

సంకీర్తనల రూపాన అన్నమయ ప్రవేశపెట్టిన పదకవితలో హాస్యాన్నం దించే రచనలూ చాలానే ఉన్నాయి. ఇలాంటి రచనలు కూడా యక్షగాన పదాలకు స్ఫూర్తినిచ్చాయి. మాయా విప్రుడుగా అర్జునుడు యంత్రమత్స్య మును కొట్టడానికి రాగా, అక్కడి 'బ్రాహ్మణ సమూహం' తమ ఆనందాన్ని ప్రకటిస్తూ పాడిన పాట ఇది. శాహజీ రచన –

'పిల్లజుట్టు చుట్టి కట్టెరా – యెఱ్ఱింభట్లు
పిల్లకాయ యెంత దిట్టరా – మంచి
వెల్లపంచె మొలను జుట్టెరా – సాహసము
వీని కెటువలెను బుట్టెరా !

కుప్పాభట్లు తిప్పాభట్లు ఈ – పిన్నవాని
కోర్కు లీడేర జూడుఁడీ
యప్పనభట్లు వారినిఁగూడి తథాస్తనుచు
నాశీర్వాదములు సేయుఁడీ'[77]

బ్రాహ్మణుల పేర్లను హాస్యరసోత్పాదన కోసం శాహజీ చక్కగా వాడుకొన్నాడు. వ్యక్తుల పేర్లను పాటల్లో వాడడం అన్నమయ పెట్టిన వరవడే. చూడండి –

'ఎంత బాఁపనా సోద మింతగలదా
అంతయు నీ మహిమే హరిభట్లూ

సూరిభట్లొకవంక చొరనిచోట్లు చొచ్చి
వారబియ్య మెత్తి యెత్తి వడదాఁకి
నీరు వట్టుగొని భూమి నీళ్లెల్లా వారవట్టీ
కేరి కేరి నగవయ్య క్రిష్ణభట్లూ !

దేవరాజ్ఞ లోకవంక దిక్కులలోఁ బొలగూడు
దీవనతో నారగించి తీపు మరిగి
యీవలఁ బెట్టిన వారి కేమైనా నొసఁగీని
వేవేలు మాయల విష్ణుభట్లూ!

సోమయాజా లోకవంక సోరిది సురలకెల్లా
నామనితో విందువెట్టీ ననుదినము
హోమపు విప్రుల సొమ్ము లొడిసి తాఁబుచ్చుకొనీ
వేమరు శ్రీవేంకటాద్రి వెన్నుభట్లూ!'[78]

ఇందులో బ్రాహ్మణులపేర్లను దేవుడికి పెట్టి పదం పాడడం అన్నమయ్య లోని కొంటెదనాన్ని సూచిస్తోంది. ఇటువంటి రచనల ద్వారా తన తరువాతి తరం యక్షగాన కర్తలకు అన్నమయ్య పదరచనలో వైవిధ్య విధానాలను ప్రసాదించాడని చెప్పక తప్పదు.

శిష్టేతర జానపద వ్యావహారికభాష తంజావూరు యక్షగానాలలో సంభాషణల రూపంగానూ, పదాల రూపంగానూ కనిపిస్తోంది. ఇందుకు జానపద గేయాలు ఆయా రచయితల దృష్టి కందడం కారణంగా చెప్పుకో వచ్చు గాని, అటువంటి భాషను గ్రంథాల కెక్కించడానికి కొంత ధైర్యం అవసరం. అన్నమయ ఈ విషయంలో కూడా ఆద్యుడై తదనంతర కవులకు దారి చూపించాడని అంగీకరించకతప్పదు. ఉదాహరణకు శాహజీ రచన –

'మీరి మాకొలము పడుసు
మీకోడలి పడుసుగాద
మీరు మేము సుట్టాలు సుమ్మి
ఓ బూసులయ్య!
కోరి నన్ను గాసుకోవయ్య

మాయేసమూ యేసుకొని
మల్లాడి యజ్ఞాన వెన్ను
పోయి దుగ్గమ్మకు సూపావా
యో బూసులయ్య !
బోయడవౌదువయ్య'[79]

అన్నమయ రచనల నుంచి ఉదాహరణ –

'సిన్నవాడవని నమ్మసెల్లదు నిన్ను
సిన్నైన యాట దెల్ల సిక్కుసీరైపోయను

అవుర బాలకిసునరాయడనీవు సంటిపాలు
సవులంటా నెత్తురెల్ల సప్పరించగా
కవకవ నవ్వి నవ్వి కన్నులు దేలగిలగా
సవరని యాటదెల్ల సప్పుసారైపోయను'[80]

'ఆడది' అనడానికి 'ఆటది' అనడం అన్నమయకు అలవాటు. అన్నమయ రచనలలో ఇలాంటి భాషలో రచించిన పదాలు చాలానే ఉన్నాయి. జానపద సాహిత్యానికి అన్నమయ మర్యాదను కలిగించాడన్నమాట. ఈ మార్గాన్నే తరువాతికాలపు యక్షగానకర్తలు అనుసరించారు. తెలుగు యక్షగాన రూపకాల్లో పాత్రోచితభాషకు అన్నమయ శ్రీకారం చుట్టాడు.

ఇంతేకాకుండా దాదాపు సంస్కృతపదాలను పరిహరిస్తూ అచ్చ తెనుగు పదాలతో సంకీర్తనలను అన్నమయ రచించాడు. ఇవి కూడా శాహజీకి ఉత్తేజాన్ని కలిగించాయి. ఉదాహరణకు అన్నమయ రచన –

'ఏలరాడమ్మ యింతిరో వాఁ –
డేలరాడమ్మ నన్నేలినవాఁడు
పచ్చనిపులుగుల బండిమీఁద నుండు –
పచ్చవింటి పిన్నబాలుని తండ్రి

పచ్చని చాయలఁ బాయని బంగారు -
పచ్చడము గట్టిన బాగైనవాఁడు

తెల్లని పులుగుపైఁ దిరుగ మరిగినట్టి -
తెల్లని సతి పాలి దేవరతండ్రి
తెల్లని పరపుపై తేలి పొరలువెట్టు
తెల్లని కన్నుల తెలివైనవాఁడు

కొండవింటివాని గుత్తకొనినయట్టి -
కొండుక పాయపుఁ గూతురు తండ్రి
కొండలరాయఁడు కోనేటి తిమ్మయ్య
కొండ తలనెత్తి గుఱుతైనవాఁడు'[81]

'విష్ణుపల్లకి సేవాప్రబంధం'లో చెలులు పాడిన శాహజీరచిత ధవళం -

'పలుమాటలకును బోదు
కలకల పలుకఁగలేదు
ఇల నెందులకును రాదు
కలుముల చెలి మిగుల సాదు

చుక్కల దొర సైదోడు
చొక్కపు జలజము వీఁడు
చక్కని తల్లికి జోడు
ఎక్కడ గానము సూడు

చిగురువిల్తునిఁగన్న
చేడియ వయసునఁజిన్న
సొగసగు రూపున నెన్న
మగువల లోపల మిన్న'[82]

కూడా అలతి అలతి అచ్చతెనుగు పదాలతో, అన్నమయ్య వరవడిలోనే శాహజీ

సంతరించిన గేయం.

ఇంక చివరగా చూడవలసినది శాహజీ రచనల ముగింపు. అన్నమయ శృంగారమంజరిలో చూపిన దారిలో, అన్నమయను అనుసరించిన ఓబయమంత్రి, కందుకూరి రుద్రకవి, కంకంటి పాపరాజా ప్రభృతులు తమ రచనల ముగింపుల లాగే శాహజీ కూడా ద్విపదలలో తన ముగింపులను నిర్వహించాడు. ఉదాహరణకు – భక్తవత్సల విలాస నాటకం చివర –

'శ్రీశంకరునిపేర చిన్నయుపేర
కాశవర్ణునిపేర గౌరీశుపేర
భోగిభూషణుపేర పురహరుపేర
త్యాగరాయనిపేర ధరచాపుపేర
... ...'[83]

గంగాపార్వతీసంవాదం చివర –

'శ్రీగిరీశునిపేర సితతనుపేర
భాగె భూధణుపేరఁ బురహరుపేర
గైలాసపతిపేర గౌరీశుపేర
ఫాలలోచనుపేర భవహరుపేర
... ...'[84]

విష్ణుపల్లకీసేవా ప్రబంధము చివర –

'శ్రీలోలుపేర నాశ్రితపాలుపేర
నీలవర్ణునిపేర నిరుపముపేర
నారాయణునిపేర నగధరుపేర
వారిజోదరుపేర వైకుంఠుపేరఁ
బల్లకి సేవ ప్రబంధరత్నంబు

... .

భోసలకుల శాహభూపాలమౌళి
విరచించె సత్కృతుల్ విస్మయమంద
ధరణిలో నాచంద్రతారార్కముగను'[85]

ఇలాగ అన్నివిధాలా అన్నమయ రచనలతో ప్రభావితుడైన శాహజీ యక్షగాన పదరచనలో చిరస్మరణీయుడు. ఆయన రచనలలో ఉన్నంత వైవిధ్యం ఇతర యక్షగానకర్తల రచనలలో కానరాదు. అన్నమయ పదకవితామార్గసార్వ భౌముడు. నిజమే. కాని శాహజీ సామంతరాజా కాడు. అన్నమయ పదకవితా సామ్రాజ్యానికి తరువాతికాలంలోని వారసుడు !

శాహజీ రచనలలో ఇంతగా అన్నమయ ప్రభావం కనిపిస్తున్నప్పటికీ, అన్నమయ ప్రసక్తిగాని, తాళ్లపాక వారి ప్రసక్తిగాని యేరచనలోనూ కానరాక పోవడం విచిత్రమే. ఆనాటికి అందరికీ తెలిసినవిషయాన్ని చెప్పవలసిన అవసరం లేదనుకున్నారేమో ! అయితే శాహజీ ఆస్థానకవులైన వారి రచనలలో అన్నమయ ప్రభావం అంతగా గోచరించదు. అయితే వారి రచనా సంవిధానం శాహజీ రచనా సంవిధానాన్ని అనుసరించినదే.

బహుశా శాహజీ కాలానికే చెందిన కవి అష్టావధాని రచించిన చంద్రశేఖర విలాసము అన్న యక్షగానరూపకంలో 'మాదిగరాజు' తన పాటను వినిపించే ముందు 'తాళపాకవారి సంకీర్తన నూరు సరి, నాది యొకటి సరి' అంటూ ప్రగల్భాలు పలుకుతాడు.[86] ఇందువల్ల తాళ్లపాకవారి సంకీర్తనలు అధిక సంఖ్యలోనే తంజావూరి ప్రాంతాన ప్రచారంలో ఉన్నట్లు ఊహించవచ్చు. తాళ్లపాక వారి సంకీర్తనలను మించి రచించాలనే తపన కూడా నాటి వారికి ఉన్నట్లు పై సవాలు వలన వ్యక్తమౌతున్నది.

బలభద్రవాసి రచించిన 'కపోతవాక్యం' అన్న యక్షగానంపై అన్నమయ ప్రభావం కనబడుతోంది. ఈ రచన 1829కి పూర్వపుదని ఆచార్య యస్వీ

జోగారావు గారి నిర్ణయం.[87] అందులోనివ వర్ణం అనే పేరుతో ఉన్న గేయ విశేషాన్ని శ్రీ జోగారావు గారు తమ గ్రంథంలో ఉదాహరించారు –

'కుచ్చిన ముత్యము కుందెనలోపల
నచ్చుగ కుంకము లమరించీ
పచ్చలు తాపిన పసిడిరోకండ్లను
మెచ్చుగ దంచెద రోలాల'[88]

ఇది ఛందస్సులోనూ వస్తువులోనూ అన్నమయ రచన వల్ల ప్రభావితమైన రచన. అన్నమయ రచన ఇదీ –

'సువ్వి సువ్వి సువ్వని – సుదతులు దంచెదరోలాల

వనితలు మనసులు కుందెన చేసిటు
వలపులు తగ నించోలాల
కనుసన్న లనెడు రోఁకండ్లను
కన్నెలు దంచెదరోలాల'[89]

అన్నమయ రచనల నుంచి సరాసరి ప్రేరణ పొందినవారూ, పరోక్షంగా ప్రేరణ పొందినవారూ యెవరూ అన్నమయను స్మరించలేదు. అంతమాత్రాన ఆయనకు కలిగిన నష్టమూ లేదు. ఈ శతాబ్ది ప్రారంభంలో వెలుగు చూసిన సంకీర్తన సంచయం విజ్ఞుల పరిశీలనకు నోచుకొని గతకాలపు సాహిత్య చరిత్ర మీద కొత్తకాంతులను ప్రసరిస్తున్నది. పదకవితామార్గ సార్వభౌముడి ప్రభావం వలన తెలుగుపాట కొత్తసోయగాలను సంతరించుకొన్నది. అన్నమయ్య పేరును గానీ, ఆయన రచనలను గానీ వినని వారూ కననివారూ కూడా ఆయన మార్గాన్నే, తమకు తెలియకుండానే అనుసరించారు. యక్షగానాన్ని చక్కని ప్రక్రియగా రూపొందించి ఆయన మనకు ప్రసాదించాడు. అందువల్ల యక్షగాన సాహిత్య మార్గ సార్వభౌముడిగా కూడా ఆయనను మనం సంభావించాలి.

ఇంతవరకూ అన్నమయ గేయసాహిత్యం గురించి పరిశోధించిన విజ్ఞులెవరూ అన్నమయకూ తెలుగు యక్షగానసాహిత్యానికీ ఉన్న గాఢమైన అనుబంధాన్ని గురించి చర్చించక వదలి ప్రకృత రచయిత మీద ఆదరం చూపించారు. వేల సంఖ్యలో ఉన్న సంకీర్తనలు పరిశీలించడానికి పూనుకోవడం ఇసకపాతరను తవ్వడానికి సాహసించినట్లే. అంతేకాక వివిధ గ్రంథాలయాలలో ఇంకా అహోబిలంలో లభించిన అన్నమయ సంకీర్తనల రేకులూ, శ్రీరంగంలో లభించినట్లు తెలుస్తున్న సంకీర్తనల రేకులూ, తాళపత్రాల మీద, కాగితపు ప్రతుల మీద లభ్యమౌతున్న సంకీర్తనలూ ఇంకా వెలుగు చూడవలసి ఉంది. మరెన్ని పరిశోధనల వలన భవిష్యత్తులో లభించనున్నవో ! ఒక మహాసంస్థ పూనుకొన్నా కూడా కొన్ని పదులయేళ్లపాటు జరగవలసిన కృషి ఇది. అన్నమయ మహోన్నతవ్యక్తిత్వానికీ, అన్నమయ సాహిత్య మహాసాగరానికీ నమస్కరిస్తూ అర్పించిన చిన్న పూజాపుష్పమీ పరిశోధక గ్రంథం.

అధోజ్ఞాపికలు

1. ఆంధ్ర యక్షగానవాఙ్మయ చరిత్ర – ఆచార్య యస్వీ జోగారావు, పు. 60
2. నాట్యకళ – మాసపత్రిక, జానపదకళోత్సవ ప్రత్యేక సంచిక, ఫిబ్రవరి – మార్చి, 1970, పు. 20
3. సుగ్రీవ విజయము – శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారి పీఠిక, పు. 16
4. ఆంధ్రకవితరంగిణి – 10వ సంపుటం, పు. 160
5. అన్నమాచార్యుల వారి అధ్యాత్మ శృంగార సంకీర్తనలు – ద్వితీయ సంపుటము, స్వర రచన మంచాళ జగన్నాథరావు, సంగీతప్రశస్తి ఈమని శంకరశాస్త్రిగారు, పు.
6. నాట్యకళ – ఫిబ్రవరి – మార్చి, 1970, గరుడాచల యక్షగానం, పు. 21
7. అధ్యాత్మ సంకీర్తనలు – సంపుటం 10, సంకీర్తన 29
8. అధ్యాత్మ సంకీర్తనలు – సంపుటం 1, పునర్ముద్రణ, 1980, సంకీర్తన 227
9. నాట్యకళ, ఫిబ్రవరి – మార్చి, 1970, గరుడాచల యక్షగానం, పు. 23
10. మైనర్ వర్క్స్ ఆఫ్ తాళ్లపాకమ్ పొయెట్స్, వాల్యూం 1, 1935, శృంగారమంజరి, పు. 3
11. శృంగార సంకీర్తనలు – సంపుటం 13, సంకీర్తన 223
12. నాట్యకళ – ఫిబ్రవరి – మార్చి, 1970, పు. 32

13. త్రివేణి - ఆంధ్రదేశ జానపదగేయములు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణ, 1960, పు. 56
14. శృంగార సంకీర్తనలు, సంపుటం 12, పునర్ముద్రణ, 1976, సంకీర్తన 225
15. నాట్యకళ - ఫిబ్రవరి - మార్చి, 1970, పు. 26
16. శృంగార మంజరి, పు. 14
17. నాట్యకళ - ఫిబ్రవరి - మార్చి, 1970, పు. 24
18. శృంగార సంకీర్తనలు - సంపుటం 12, పునర్ముద్రణ, 1976, సంకీర్తన 217
19. శృంగార సంకీర్తనలు - సంపుటం 27, సంకీర్తన 479
20. అదే, సంకీర్తన 476
21. నాట్యకళ - ఫిబ్రవరి - మార్చి, 1970, పు. 20
22. శృంగార సంకీర్తనలు - సంపుటం 28, సంకీర్తన 210
23. నాట్యకళ - ఫిబ్రవరి - మార్చి, 1970, పు॥లు 32-33
24. శృంగార సంకీర్తనలు, సంపుటి 24, సంకీర్తన 436
25. శృంగార సంకీర్తనలు, సంపుటి 12, పునర్ముద్రణ, సంకీర్తన 18
26. తెలుగు కావ్యమాల - సంపాదకులు కాటూరి వేంకటేశ్వరరావు, పు. 147
27. సుగ్రీవ విజయము, పు. 11
28. శృంగార మంజరి, పు. 11
29. సుగ్రీవ విజయము, పు. 24 - ఈ గీతం గురించి శ్రీ యస్వీజోగారావు గారి వివరణ, ఆంధ్ర యక్షగాన వాఙ్మయచరిత్ర, పు. 230
30. కళాపూర్ణోదయము, 8-237
31. శృంగార సంకీర్తనలు, సంపుటి 12, పునర్ముద్రణ, సంకీర్తన 268
32. సుగ్రీవ విజయము, పు. 41
33. యక్షగానములు - తంజావూరు సంపుటం 4, ఆంధ్రవిశ్వకళాపరిషత్తుచే ప్రకటితము
34. ఆంధ్ర యక్షగానవాఙ్మయ చరిత్ర, పు. 22
35. యక్షగానములు - తంజావూరు, సంపుటం 4, పు. 7
36. అదే, పు. 19
37. అదే, పు. 26
38. ఆంధ్ర యక్షగాన వాఙ్మయచరిత్ర, పు. 161
39. గరుడాచల నాటకము - ఎస్. వి. గోపాల్ అండ్ కో., ప్రచురణ, పు. 45
40. ఆంధ్ర యక్షగానవాఙ్మయ చరిత్ర, పు. 31
41. సిద్ధేంద్రయోగికృత భామాకలాపము, ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమీ ప్రచురణ, పు. 3, ఉపోద్ఘాతము
42. అదే, పు. 3, ఉపోద్ఘాతము
43. అదే, పు. 71
44. యక్షగానములు - తంజావూరు, సంపుటం 5, పు. 174

45. శృంగార సంకీర్తనలు – సంపుటం 28, సంకీర్తన, 139
46. భామాకలాపం, పు॥లు 40–41
47. ఆంధ్రకవితరంగిణి, పు. 191, సంపుటి 6
48. ఆంధ్రభాగవతావతరణము – చారిత్రిక నైపథ్యము – ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి పోతన సాహిత్య గోష్ఠి ఆంధ్రవిశ్వకళాపరిషత్, వాల్తేరు
49. భామాకలాపం, పు. 30
50. శృంగార సంకీర్తనలు, సంపుటం 12, పునర్ముద్రణ, సంకీర్తన 99
51. భామాకలాపం, పు. 81
52. తాళ్లపాక వారి గేయరచనములు, 4వ సంపుటము, శృంగార సంకీర్తనలు, 1947, సంకీర్తన 16
53. భామాకలాపం, పు॥లు 65–66
54. శృంగార సంకీర్తనలు, సంపుటం 17, సంకీర్తన 349
55. విష్ణుమాయా విలాసము – కంకంటి పాపరాజా, వావిళ్ల ముద్రణ, 1970, డాక్టర్ నేలటూరి వేంకటరమణయ్య ఉపోద్ఘాతము, పు. 32
56. అదే, పు॥లు 6, 7
57. అదే, పు॥లు 50–51
58. అదే, పు॥లు 71–72
59. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము – శ్రీ వేటూరి వారి పీఠిక, పు. 67
60. అదే, పు. 68
61. శ్రీ అన్నమాచార్య జీవితచరిత్రము – ప్రభాకరశాస్త్రిగారి పీఠిక, పు. 67
62. యక్షగానములు – తంజావూరు, సంపుటం 9, పు. 10
63. ఈ ఉదాహరణలన్నిటినీ యక్షగానములు – తంజావూరు, 9వ సంపుటం నుంచి స్వీకరించడం జరిగింది, పు॥లు 10, 14, 15. ఇతర సంపుటాలలో కూడా శాహజీ, అతని ఆస్థానకవుల రచనలలో ఈ పద్ధతిని చూడవచ్చు.
64. యక్షగానములు – తంజావూరు, సంపుటం 9, విఘ్నేశ్వరకల్యాణం
65. యక్షగానములు – తంజావూరు, సంపుటం 10
66. అదే, సంపుటం 8
67. అదే, సంపుటం 8, పు. 31
68. అదే, సంపుటం 8
69. అదే, సంపుటం 7
70. అదే, సంపుటం 8, పు. 109
71. శృంగార సంకీర్తనలు, సంపుటం 12, పునర్ముద్రణ, సంకీర్తన 73
72. అదే, సంకీర్తన 97
73. యక్షగానములు – తంజావూరు, సంపుటం 8, పు. 110
74. యక్షగానములు – తంజావూరు, సంపుటం 8, పు. 115

75. అధ్యాత్మ సంకీర్తనలు, మొదటి సంపుటం, పునర్ముద్రణ, పాట 138
76. శ్రీ తాళ్లపాక అన్నమాచార్య జీవితచరిత్రము - శ్రీ వేటూరి వారి పీఠిక, పు॥లు 21, 22
77. యక్షగానములు - తంజావూరు, సంపుటం 3, పు. 26
78. అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 2, పునర్ముద్రణ, సంకీర్తన 70
79. యక్షగానములు - తంజావూరు, సంపుటం 8, పు॥లు 91, 92
80. శృంగార సంకీర్తనలు, సంపుటం 12, పునర్ముద్రణ, సంకీర్తన 15
81. అదే, సంకీర్తన 235
82. యక్షగానములు, తంజావూరు, సంపుటం 8, పు. 144
83. అదే, సంపుటం 8, పు. 34
84. అదే, పు. 66
85. అదే, పు. 148
86. అదే, సంపుటం 11, పు. 163
87. ఆంధ్ర యక్షగాన వాఙ్మయచరిత్ర, పు. 99
88. అదే, పు. 346
89. శృంగార సంకీర్తనలు, సంపుటం 12, పునర్ముద్రణ, సంకీర్తన 353.

మలిపలుకు

ఈ పరిశోధనా గ్రంథాన్ని 1985 ఫిబ్రవరిలో యూనివర్సిటీకి సమర్పించిన తరువాత ఆ సంవత్సరమే నేను హైదరాబాదులో శ్రీ వేటూరి ఆనందమూర్తిగారిని కలిసి నా పరిశోధనా గ్రంథాన్ని ఆయనకు చూపించాను. అంతకు ముందే 1983లో సాహిత్య అకాడమీ రజతోత్సవ సంచికగా ప్రచురించిన 'తెలుగులో పరిశోధనలో 'దేశి రూపకక్రియలు' అన్న వ్యాసంలో ఆనందమూర్తిగారు గుత్తెనదీవి రామాయణ కీర్తనల్లో ''దదదద దశరథతనయా – కదిసికావవేమమ్మ'' అన్న అన్నమాచార్య సంకీర్తన గురించి చేసిన ప్రస్తావనను గురించి అడిగాను. దాని మీద జరిగిన చర్చలో ఆయన 1984లో ఆచార్య విస్సా అప్పారావుగారి శతజయంతి సంచికలో 'గుత్తెన దీవి రామాయణ కీర్తనల్లో కొత్తగా దొరికిన అన్నమాచార్యుల కొత్త కీర్తన పాఠం' అన్న తన వ్యాసాన్ని నా దృష్టికి తెచ్చారు. అందులో 'గుత్తెన దీవి రామాయణం లో కానవచ్చిన మరి మూడు అన్నమయ రచనలను పేర్కొన్నారు. పాఠ భేదాలను అలా ఉంచితే నా గ్రంథంలో పేర్కొన్న రామాయణ సంబంధి గీతాలు పది దాకా ఉన్నాయి. అలా పేర్కొన్న గీతాలలోనివి మూడు కీర్తనలు గుత్తెన దీవి రామాయణంలో ఉండడం వలన, అన్నమయ్యకూ గుత్తెన దీవికీ ఉన్న సంబంధం అలా ఉంచితే అసలు గుత్తెన దీవి రామాయణం అన్నమయ రచనా? అన్న సందేహం కలుగుతోంది. అన్నమయ యక్షగాన రచన చేసి ఉంటాడని నేను అనుమానించి నిర్ధారించుకున్న విషయాన్ని వేటూరి ఆనందమూర్తిగారి వ్యాసం పరోక్షంగా సమర్థించినట్లయింది.

ఇంక పాటల చివరన ఉన్న ముద్రలు 'గుత్తెన దీవి అంజనీతనయ' గుత్తైన దీవి ఘననిలయపతి' పాటలను శ్రీ వేంకటేశ్వరాంకితంగా రేకుల మీదికి ఎక్కించినపుడు మార్పు చెంది ఉండవచ్చును. కొన్ని చరణాలు జారిపోయి ఉండవచ్చును కూడా. సర్వసమగ్రమైన పరిశోధన జరిగితే అన్నమయ

యక్షగాన రచనలోకానికి లభించే అవకాశం ఉందని నేను భావిస్తున్నాను.

* * * *

అన్నమయ విజయనగర సామ్రాజ్యానికి ఉత్తరోత్తరా సార్వభౌముడైన సాళువ నరసింహరాయలకు బాల్య సఖుడే గాక గురువుగా ప్రస్తుతి పొందిన ఘనుడు. అటువంటి పదకవితా మార్గ సార్వభౌముణ్ణి పొట్టిలాగు తొడుక్కొని చిందులు తొక్కే వ్యక్తిగా చిత్రించి ఆయనకు తీరని అపచారం చేస్తున్నారు.

అన్నమయ వేషం చిన్నన్న 'అన్నమాచార్య చరిత్రములో చక్కగా వర్ణితమైంది. విజయనగర చక్రవర్తుల కొలువు కూటంలో మాన్యత పొందిన కవులూ, కళాకారులూ రాజవేషాన్ని పోలి ఉండే దుస్తులను ధరించవలసి ఉండేది. కవిసార్వభౌముడైన శ్రీనాథుడు 'కుళ్లాయుంచితి, కోకసుట్టితి, మహాకూర్పాసమున్ తొడిగి' తినని చెప్పుకొన్న సంగతి విజ్ఞులకు విదితమే. రాజువెంచ్చిన కవులకూ కళాకారులకూ 'సప్తలాంఛనాల'ను బహూకరించేవారు. అన్నమయ పాటను విన్న సాళువ నరసింహరాయలు

''పచ్చల కడియాలు, బంగారు వ్రాఁత
పచ్చడంబులునుఁ గెంబట్టుకుళ్లాయి
యంగదంబులు, నుభయాత పత్రములు
రంగైన వింజామరల జోడు మంచి
యుదిరి చేసిన గిండియును గళాచికయు
మొదలైన వెల్ల సమ్ముఖమున నొసఁగి''

(అన్నమాచార్య చరిత్రం పుట. 35)

గౌరవించినట్టు చిన్నన్న ఇచ్చిన భోగట్టా, ఒక రోజున నరసింహరాయలు పిలిచినపుడు -

కనకాంబరుని గుణగణమణుల్ శ్రుతులు
గని చిక్కుగొనురీతి గను కపోలములు

నత్తటి మదిలోని హరికీర్తి మొలక
లొత్తిన గతినున్న యూర్ధ్వపుండ్రములు
లాలితాచ్యుత భక్తిలలన వరించు
మాలిక గతి తిరుమణి వడంబులును
తలనిడు విష్ణుపాదపుఁ దమ్మిపువ్వు
మెలుపైన కెంబట్టుమేలు కుళ్లాయి
నరవింద నయను కృపామృతధార
కరణిఁ జూపట్టెడు కంఠమాలికయు
నరహరికై కంకణముగట్టియున్న
సరణిఁ జూపట్టు పచ్చలకడియములు
ధవళనేత్రుని శారదా విలాసంబు
నివసించునట్టున్న నిలువు పేరణము
వాసుదేవుని యాజ్ఞవడి జుట్టుకొన్న
యా సత్యగుణమననలరు దుప్పటము'' (అదే. పుట 35)

ధరించి 'చతురంతయానంబు' నెక్కి చుట్టూ సంకీర్తన పరులు సేవింపగా, 'ఘనతర ధవళ శంఖాధ్వానమడర' రాజాస్థానానికి విచ్చేసినట్టు చిన్నన్న వర్ణన.

అంటే, 'తలనిడు విష్ణు పాదపు తమ్మి పూవు' (శఠగోపం) లాంటి కెంబట్టు మేలుకుళ్లాయి ధరించాడు. తెల్లని నిలువు పేరణము ధరించాడు. దానినే కవిసార్వభౌముడు 'మహాకూర్పాసము' అన్నాడు. దాని మీద దుప్పటము ధరించాడు. దీనిని నడుము చుట్టూ చుట్టుకొంటారు. అచ్యుత దేవరాయల కాలంలో పెనుగొండ మండలేశ్వరుడైన విరూపణ్ణ రూపచిత్రం లేపాక్షి దేవాలయంలో ఉంది. అందులోని వస్త్రధారణ రీతినే అన్నమయ ధరించినట్టు విదితం. మహాకూర్పాసము, నిలువు పేరణము అన్నది ఈనాటి చొక్కాలనుకున్న కాలర్‌తో కాలిమడమల దాకా ఉన్న పొడుగైన లాల్చీ వంటిది. ఇది విజయనగర రాజవేషం. ఈ గ్రంథం ముఖ చిత్రంలో ఈ వేషాన్నే చూపడం

జరిగింది. అన్నమయ్యను అభిమానించే వారందరూ దీనిని గమనించగలరని ఆకాంక్ష.

* * * *

అన్నమాచార్యులు ముప్పయిరెండు వేల సంకీర్తనలను రచించాడని ప్రచారం జరుగుతోంది. ఇందుకు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము పేరుతో చిన్నన్న రచన 'అన్నమాచార్య చరిత్రము' ద్విపద కృతికి రాసిని విపులమైన పీఠికలో చేసిన చర్చ కారణం. చిన్నన్న ఇచ్చిన అన్నమయ రచనల పట్టికలోని పాదం శాస్త్రిగారిని చర్చకు ప్రేరేపించింది. అందులో

యోగమార్గంబున నొక కొన్ని బుధులు
రాగిల్ల శృంగార రసరీతిఁ గొన్ని
వైరాగ్య రచనతో వాసింపఁ గొన్ని
సారసనేత్రుపై సంకీర్తనములు
సరసత్వమునఁ దాళ సముఖముల్గాఁగ
పరమ తంత్రములు ముప్పది రెండువేలు

(అ.చ. పుట 45)

ఇక్కడ 'వైరాగ్య రచనతో శాసింపఁగొన్ని' అన్న పాదం శ్రీ వేటూరి వారి పూరణమని గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు చెప్పినమాట. ప్రభాకరశాస్త్రి గారు ఆఖరి చరణానికి ముప్పది రెండువేల సంకీర్తనలని అర్థం చేసుకుని దాని మీద చర్చ సాగించారు. కాని సంకీర్తనలను 'పరమ తంత్రములు' అని అనవచ్చునా అన్న సందేహం వారికి కలగలేదు. పోనీ పరమమంత్రములని మార్చుకొన్నా అర్థం కుదరదు. శ్రీ వేటూరి వారే అన్నమాచార్యుల అధ్యాత్మిక సంకీర్తనను తమ పీఠిక 37 పుటలో పేర్కొన్నారు. ఈ పాట అన్నమయ చేత ధరించిన వాద్యపరికరం గానదండెతో శరీరాన్ని పోలుస్తూ రాసిన పాట,

దాని పల్లవి ఇదీ –

'పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక ముప్పది రెండు వేళల రాగాలను'

ఇందులో పేర్కొన్నముప్పది రెండువేళలు గమనార్హమైనవి. కళాప్రపూర్ణ గణపతిరాజా అచ్యుతరామరాజాగారు ఇందుకు సరైన వివరణను ఇచ్చారు చూడండి –

''హరిసేవకు వేళాపాళా ఉంటాయి. వేళన్నా పాళన్నా ఉచిత సమయం అని అర్థం. అట్టి ఉచిత సమయాలు రోజాకు ముప్పయి రెండు. రోజాకు ఎనిమిది జాములు లేక యామములు. జాము అనగా ఏడున్నర ఘటికలు లేక గడియలు. గడియకు ఇరవై నాలుగు నిమిషాలు. అనగా జాముకి మూడేసి గంటలు. దైవానికి నిశాంత, ప్రాతర్, పూర్వాహ్న, మధ్యాహ్న, అపరాహ్న, సాయం, ప్రదోష, నిశాలీలలు ఎనిమిది లీలాగతుల్లోనూ ప్రదోష, నిశాలీలలు విడిచి పెట్టి ముప్పయి రెండు వేళల్లోనే సంకీర్తనం చేయాలి. పరమాత్ముని పాడుకునేటప్పుడు వేడుకగా ముప్పది రెండు వేళల్లోనే పాడుకోవాలి. అవి ముప్పయి రెండువేల కీర్తనలు కావు. అవి ముప్పయి రెండు వేళల పాడుకునే కీర్తనలు''.

పైన ఉదాహరించిన సంకీర్తనకు ఇది సరైన వివరణ. ఈ వివరణను ఇచ్చిన శ్రీ అచ్యుత రామరాజాగారికి నా కృతజ్ఞతలు.

'పరమతంత్రములు ముప్పది రెండువేలు' అన్న ద్విపద చరణం సంస్కరణను అపేక్షిస్తోంది. ఈ చరణం ముందు కొన్ని ద్విపదలు రాతప్రతిలో జారిపోయాయేమోనని నా అనుమానం. అన్నమయ ముప్పయిరెండువేలకు ఎక్కువగానో తక్కువగానో రాసి ఉండవచ్చుగాని ముప్పయి రెండువేలు అన్న

సంఖ్య మాత్రం అన్నమయ సంకీర్తనలకు సంబంధించినది కాదని మనవి.

* * * *

అన్నమాచార్యులు జన్మించిన గ్రామం తాళ్లపాక అన్నమాటొకటి బహుళ ప్రచారంలో ఉంది. నారాయణసూరి వంశస్థులకు ఇంటి పేరిచ్చిన గ్రామం తాళ్లపాక అన్నది నిజమేగాని అదే అన్నమయ జన్మించిన గ్రామమని చెప్పడానికి వీలులేదు. 'అన్నమాచార్య చరిత్రము' (పుట 8)లో నారాయణ సూరి 'లక్కమాంబను పేరిభామినీ రత్నంబు' ను పరిణయ మాడినట్లు చిన్నన్న చెబుతున్నాడు -

''మాడుపూరను నూర మాధవ మూర్తి
తోడు నీడై యాపెతో మాటలాడు''

అని కూడా చిన్నన్న ఇచ్చిన సమాచారమే.

ఈ విషయమై శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు -

'అన్నమాచార్యుని తల్లి లక్కమాంబ మాడుపూరి మాధవస్వామి భక్తురాలట. అది యామె పుట్టినింటివారి యూరు గాఁబోలును'

అంటూ తమ పీఠికలో అన్నారు. ఇది సరైన ఊహ. ఇక్కడ గమనార్హమైన విషయం ఒకటుంది. లేకలేక పుట్టిన బిడ్డ అన్నమయ్య. తెలుగు దేశపు ఆచార సంప్రదాయాల ప్రకారం తొలికాన్పు పుట్టింటనే జరగాలి. అంటే అన్నమయ జన్మస్థానం మాడుపూరని తేలుతున్నది.

అయితే అన్నమయకు అన్న, వదినెలున్నట్టు 'అన్నమయ చరిత్రము'లో (పుట 11) పేర్కొన్నాడు చిన్నన్న. బహుశా ఈ అన్న అన్నమయకు పెదనాన్న కొడుకై ఉండాలి. నారాయణసూరి ఆర్థిక స్థితిగతులు బాగులేక అన్నమయను తన అన్న కొడుకు దగ్గర వదలి ఉండాలి. 'అన్నమాచార్య చరిత్రము'లో ఇల్లు వదిలి వెళ్లిన అన్నమయను తల్లి వెదుకుంటూ వచ్చినట్లు ఊహించడానికి

వీలుంది. ఇక్కడ 'చరితము'లో గ్రంథపాతముంది. లభించిన భాగంలో శ్రీ వేంకటేశ్వరుడు

> ''జనని వాక్యము ద్రోయఁజనదు కుమార
> పోయి రమ్మని'' (పుట 29)

కలలో కనబడి చెప్పినట్టున్నది. బహుశా ఆనాటికి అన్నమయ తండ్రి పరలోక వాసుడైనట్లు భావించవలసి ఉంటుందేమో ! ఏ ఆధారమూ లేని తల్లి కొడుకును వెదుకుకుంటూ రావడం సహజమే. ఒక్కగా నొక్క కొడుకు మాడుపూరులో జన్మించినట్టు భావించవలసి వస్తున్నది.

తోడుపడిన గ్రంథాలు

తెలుగు గ్రంథాలు :

ఆంధ్రకవితరంగిణి	శ్రీ చాగంటి శేషయ్య
ఆంధ్ర యక్షగానవాఙ్మయచరిత్ర	శ్రీ యస్వీజోగారావు
ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము	శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు
ఆంధ్రుల సాంఘిక చరిత్ర	శ్రీ సురవరం ప్రతాపరెడ్డి
క్రీడాభిరామము	శ్రీనాథుడు, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి పరిష్కరణం
ఛందః పదకోశము	శ్రీ కోవెల సంపత్కుమారాచార్య
తాళ్లపాక కవుల పదకవితలు – భాషా ప్రయోగవిశేషాలు	శ్రీ వేటూరి ఆనందమూర్తి
తాళ్లపాక కవులు – వివిధ సాహితీప్రక్రియలు	శ్రీ వేటూరి ఆనందమూర్తి
తెలుగు ఛందోవికాసము	శ్రీ కోవెల సంపత్కుమారాచార్య
తెలుగు జానపదగేయ సాహిత్యము	శ్రీ బి. రామరాజా
తెలుగు విజ్ఞానసర్వస్వము, 3వ సంపుటము	తెలుగు భాషాసమితి
తెలుగు వీరగాథాకవిత్వము	శ్రీ తంగిరాల వెంకటసుబ్బారావు
తొలి సంకీర్తన కవులు	శ్రీ వేటూరి ఆనందమూర్తి
త్రివేణి – జానపదగేయ సంకలనం	ఆం. ప్ర. సంగీతనాటక ఆకాడమీ
నాట్యకళ – జానపద కళోత్సవ ప్రత్యేక సంచిక	ఆం.ప్ర. సంగీతనాటక అకాడమీ

నాట్యశాస్త్రము	శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు
పరమయోగివిలాసము	చిన్నన్న
పోతన సాహిత్యగోష్ఠి	సంకలన కర్త – శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి
యక్షగానములు – తంజావూరు 11 సంపుటములు	ఆంధ్రవిశ్వకళాపరిషత్ ముద్రణ
శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము	చిన్నన్న – శ్రీ వేటూరి వారి పరిష్కరణ
శ్రీనాథుడు	శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి
శ్రీనివాసమంగాపురం మరియు మన ఆలయముల చరిత్ర	శ్రీ గోపీకృష్ణ
	శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారి పరిష్కరణ
శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు	
సమగ్ర ఆంధ్రసాహిత్యం	శ్రీ ఆరుద్ర
సంగీత సంప్రదాయప్రదర్శిని	సుబ్బరామదీక్షితులు
సింహగిరి వచనములు	కృష్ణమాచార్యులు, శ్రీ ఎమ్. కులశేఖర రావు పరిష్కరణ
సిద్ధేశ్వర చరిత్ర	కాసె సర్వప్ప, ఖండవల్లి లక్ష్మీరంజనం గారి పరిష్కరణ
స్త్రీల పౌరాణికపు పాటలు	కృష్ణశ్రీ
సుగ్రీవవిజయము	కందుకూరి రుద్రయ, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారి పరిష్కరణ

కన్నడ గ్రంథాలు :

కన్నడ ఛందోవికాస	శ్రీ డి. ఎస్. కర్కి
కన్నడ సాహిత్య సమీక్షె	శ్రీ జి. ఎస్. శివరుద్రప్ప
కర్ణాటక సంగీత పారిభాషిక శబ్దకోశ, 1వ సంపుటం	శ్రీ పి. ఎస్. సంపత్కుమారాచార్య
కీర్తన కారరు	శ్రీ ఎచ్. ఎస్. వెంకటేశమూర్తి
పురందరదాసర పదగళు	సంగ్రాహకరు – ఎస్. ఎస్. కారంత
శ్రీపాదరాజర కృతిగళు (పండిత ఆవృత్తి)	– సంపాదక జి. వరదరాజరావ్
షట్పది సాహిత్య	శ్రీ కె. మరుళసిద్దప్ప
సంగీతలక్షణసంగ్రహ, 2 సంపుటాలు	పద్మామూర్తి
వచనసాహిత్య	శ్రీ ఎం. చిదానందమూర్తి
హరిదాస సాహిత్యసమీక్షె	సంపాదక: జి. వరదరాజరావ్

సంస్కృత గ్రంథాలు :

చతుర్దండి ప్రకాశికా	వేంకటమఖి
సంకల్ప సూర్యోదయః	వేదాంతదేశికులు
సంగీతరత్నాకరమ్	శార్ఙ్గదేవుడు

ఆంగ్ల గ్రంథాలు :

A Forgotten Empire	Robert Sewell
Further Sources of Vijayanagara History (3 vols.)	K.V.N. Sastry, N. Venkataramanayya

History of Tirupati (3 Vols.)	T.K.T. Veera Raghavachari
The Saluva Dynasty of Vijayanagar	P. Srirama Sarma
Sources of Vijayanagar History	A. Rangaswami Saraswati
Suryavamsi Gajapatis of Orissa	R. Subrahmanyam
The History of South India	K.A.N. Sastri
Tirupati Sri Venkateswara	S. Subrahmanya Sastri

శాసన సంకలనాలూ, రిపోర్టులూ :

Historical Inscriptions of Southern India	Robert Sewell
South Indian Inscriptions (10 Volumes)	
Tirumala - Tirupati Epigraphical Series, I - V volumes	
A topographical list of inscriptions of Madras Presidency, 3 volumes	V. Rangachari

శ్రీ తాళ్లపాక వారి సంకీర్తనల సంపుటాలు 29 సంపుటాలూ కాక మరికొన్ని గ్రంథాలనూ ఆయా అధ్యాయాల అధోజ్ఞాపికలలో పేర్కొనడం జరిగింది.

ముఖ్య సవరణలు

పుట	వంక్తి	ఉండవలసినది
3	13	జీర్ణకర్ణాటలక్ష్మి రక్షింపలేవె
62	8	ఆశ్వాసము
80	6	లగ్నమున
125	8	సుప్పునా(య)కుణ్ను
185	12	వెదయలుకల
193	4	అనేకాద్భుతం బౌబళము
206	7	సంతసమందుచు
207	8	యువిదగన్నుంగువ
287	20	భావుకుడి
346	14	యా సత్వగుణమన
347	15	వాసింపగొన్ని

జననం 2 మార్చి 1936న విశాఖపట్నంలో. హైదరాబాదులో గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫైన్ఆర్ట్స్‌లో చిత్రకళాభ్యాసం, ప్రప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత. వివిధ ఉద్యోగాల తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటక శాఖలో అధ్యాపకుడిగా, శాఖాధ్యక్షుడిగా రెండు దశాబ్దాలకు పైగా పదవీ నిర్వహణ. వివిధ సదస్సులలో పరిశోధనా పత్రాల సమర్పణ. పరిశోధనా వ్యాసాల ప్రచురణ. ప్రయోగాత్మక నాటక రచన. రంగస్థల రూపకల్పన. దర్శకత్వం. పురాతత్వ పరిశోధన, మానవ శాస్త్ర విషయాలు, సాహిత్య సాంస్కృతిక రంగాలలో పరిశోధనలు అభిమాన విషయాలు.